# ముముక్షు ధర్మము


ॐ

గ్రంథకర్త :

పరమహంస శ్రీ సాధురామమూర్తి
యం. అగ్రహారం (కర్నూలు జిల్లా)

వెల: రూ. 50/-

# ముముక్షు ధర్మము



విషయము :

ముముక్షు ధర్మము అను ఆధ్యాత్మిక గ్రంథము
తిరుమల తిరుపతి దేవస్థానము వారి ఆర్థిక సహాయంతో
ముద్రింపబడినది.

సర్వస్వామ్యములు : ప్రకాశకులవి
ప్రతులు : 1000
ఈశ్వరనామ సం॥ చైత్రమాసం

ప్రతులకు :
టి. హనుమంతు
ఆం. ప్ర. జంతుసంక్షేమబోర్డు సభ్యులు
మద్దికేర అగ్రహారం - 518 385.
కర్నూలు జిల్లా.

SRI VENKATESWARA
CENTRAL LIBRARY &
RESEARCH CENTRE
Acc No 53758
Date.
TIRUPATI

ముద్రణ :
శ్రీ గాయత్రి ప్రింటర్స్, గుంతకల్లు - 515 801.



పరమహంస శ్రీ సాధురామమూర్తి

# జీవిత చరిత్ర

ధర్మసంస్థాపనమును తమ ప్రవృత్తులపై నిగ్రహమును స్థాపించుకొని జగన్నాథుని మంగళాభిప్రాయమును నెరవేర్చుటకు మహాత్ములు అవతరించుచుందురు. శ్రీ రామకృష్ణపరమహంస, స్వామి వివేకానంద, శ్రీ వీరబ్రహ్మం, శ్రీ శంకర భగవత్పాదులు వంటి ఎందరో మహాత్ములు లోకకల్యాణ కారకులైనారు. ఈ గ్రంథకర్త శ్రీ సాధురామమూర్తిగారు ఈ కోవకుచెందినవారు.

ఆదిశంకరాచార్యుల వారు పసితనమందే సన్యసించి అద్వైత మత ప్రచారమును ధారవోసిన త్యాగి అటువంటి అవతారపురుషుడు. శ్రీ సాధు రామమూర్తిగారు శ్రీమంతుల కుటుంబములో జన్మించియుండియు, 12 యేండ్ల పసితనమున లౌకిక ప్రాపంచిక సుఖాలను త్రోసి సర్వసంగ పరిత్యాగియై దేశ సంచారము చేయుచు కర్నూలు జిల్లాలోని యం. అగ్రహారము సమీపమున నున్న పాడుపడిన శివాలయమునందు ప్రవేశించి సమీపమునున్న బావినుండి మృణ్మయ పాత్రతో జలమునుగొని ప్రాతఃకాలమందు శివుని అభిషేకించుచు దేవాలయ ప్రాంతములోనున్న పిచ్చిమొక్కలు గడ్డి గాదము తొలగించుచు నిరంతరము కటిక చీకటిని లెక్కచేయక వెరువక ధ్యానస్థితులై రోజులను గడిపినారు. దేవాలయము చుట్టుప్రక్కలనున్న మాగాణి భూమిలో పైరు కోసిన తరువాత రాలిన గింజలను ఏరుకొని అన్నము చేసికొని కొంత పశు పక్ష్యాదులకు పెడుతూ కొద్దిగా తాము తినేవారు. బ్రహ్మముహూర్తమున స్నాన ధ్యానాదులనంతరము సూర్యోదయాత్పూర్వమే గ్రామములో భగవన్నామము జపించుచు వీధులలో సంచరించెడివారు.

కొన్ని నెలలు గడచిన తరువాత ఈ బాల పరివ్రాజకుని గాంచిన వారిలో నాగమ్మ, నారాయణమ్మ తల్లికూతుర్లు ఆయన దర్శనార్థమై కొన్ని తినుబండారములతో దేవాలయమునకు వెళ్లెడివారు. వచ్చినవారికి భగద్భక్తుల కథలు వినిపించుచు భగద్గీతాసారము నందించుచు భాగవత కథలను వినిపించుచుండెడివారు. ఆయన వాక్పటిమ ఎటువంటిదో ఆ తపస్సంపన్నుని శక్తి ఎటువంటిదోగాని శ్రవణము జరుగుచున్నంతసేపు చీమ చిటుక్కుమన్నా పెద్దశబ్దముగా వినిపించినట్లుండెడిది.

శ్రీ స్వామివారు చక్కని ధృఢశరీరి, చూపరులకతనియెడ పూజ్యభావము, అవ్యాజానురాగమును స్ఫురించు వ్యక్తిత్వమును, కనుల కరుణాసుధారసభావము తొణికిసలాడు చుండెడిది. ఆయన ముఖమున రాజకళలుట్టిపడుచుండెడివి. ఆయనను చూచినవారు శుకమహర్షియే ఈ అవతారము దాల్చెనా అనిపించకమానదు. సోమరులకు, నాస్తికులకు, పశుప్రాయులకు స్వామి సింహస్వప్నము. అటువంటి వారిని మెల్లగా మందలించెడివారు.

ఆయనొక అహింసామూర్తి సర్వప్రాణులయందు దయగలిగిన ప్రేమమూర్తి. అప్పటిపరిస్థితుల్లో అక్కడ జంతుబలులు జరుపుచుండెడివారు. బలులవల్ల భగవంతుని తృప్తి పరచడం అవివేకం. సర్వభూతజాలమును తనలో సమముగా చూడనివారు చేయు యజ్ఞాలు, దానాలు, తపస్సులు వ్యర్థము. భూతదయ అతని తపః ఫలము అని బోధించుచు అటువంటి దురాచారమును పూర్తిగా మాన్పించెను.

ప్రతి సంవత్సరము శ్రావణమాసమందు భాగవత సప్తాహము జరుపుచుండెడివారు. నేటికిని అదిసాంప్రదాయసిద్ధముగా జరుగుచునేయున్నది భాగవతములోని ప్రహ్లాదచరిత్రము చదువుచున్నప్పుడు గజేంద్రమోక్షములోని "సిరికింజెప్పడు" అనే పద్యానికి పూర్తి అర్థము చెప్పిన తరువాత అహా! భగవద్భక్తులయెడ భగవంతుని తొందరపాటును గూర్చి చెబుతూ కంటికి రెప్పకు అంతరముండవచ్చుగాని భక్తులయెడ భగవంతుడు అంతకంటే సామీప్యమున నుండగలడని కన్నులుమూసికొని ధ్యానించుటకుముందు బొటబొట కన్నీటి ధారలు దుమికెడివి అలా కొంతసమయము బాహ్యస్మృతి లేకయుండెడిది. శ్రోతలకు ఆ సమయంలో టిక్కు టిక్కు మను చిన్నగడియారము శబ్దము మాత్రము వినిపించుచుండెడిది. కొంతసేపయిన పిదప శ్రీ స్వామికి బాహ్యస్మృతి కలగడానికి భక్తులు రామనామ సంకీర్తన గావించెడివారు.

ఒక్కొ సమయంలో ఆయన విశ్రాంతి తీసుకొనునప్పుడు చదువరులను పిలిచి భాగవతము చదివించెడివారు. ఆయన యెదుట పండితులు చదవడానికి జంకు చూపెడివారు. ఆసమయంలో ఉద్దండపండితులు సైతము తబ్బిబ్బు కావలసినదే. ఏ అక్షరమైనా తప్పుగా పలికిన యెడల అన్ని పొరపాట్లుగూడ శ్రీవారి మనోఫలకముపై ముద్రితమయి యుండెడివి. శ్రవణానంతరము పిలిచి, చూడు నాయనా ఫలనా వాక్యము ఇలా పలకాలి అలా చెప్పాలి, అని అన్నిటికిని సమాధానములు చెప్పుచుండెడివారు. అంతటి గ్రాహ్య సంపన్నులు ఆ మహానుభావుడు.

శ్రవణం ముగిసిన వెంటనే అందరిని ఇళ్లకు వెళ్ళి మీపనులు సక్రమంగా చేసికొనుడు సోమరులుగా నుండకూడదు. తీరిక సమయాల్లో భగవంతుని గూర్చి చింతింపుడు. కాలము చాలా విలువైనది. నూరు సంవత్సరములు ఒక లెక్కకు రానివి. ఆ మాటలు చెబుతూ కర్మయోగి రహస్యాన్ని వివరంగా చెప్పెడివారు.

దేవాలయ ప్రాంగణములోనున్న పెద్దపెద్ద బండరాళ్లను కొట్టించి చుట్టూ ప్రాకారమును కట్టించెను. ఆ పనిలో పనివారితోపాటు మట్టిని రాళ్లను అందించి వారికి సహాయ పడెడివారు తూర్పున సింహద్వారమును ఉత్తరమున ఒక ద్వారమును నిర్మించెను. ఆలయ ప్రాంగణములో తనే స్వయముగా బిల్వ వృక్షములు నాటి నీరుపోసి పెంచెను. అవి భక్తులకు చల్లని నీడతోపాటు శివార్చనకు బిల్వదళముల కొరత లేకుండా చేసెను.

వాయువ్య మూలనొక చిన్నగదిని నిర్మించుకొని నిర్మానుష్య సమయమందును. రాత్రి సమయమునను ఎల్లవేళల బాహ్యస్మృతిలేక ధ్యాన నిమగ్నులై యుండెడివారు. అట్టి సమయమునందు అనేక దివ్యానుభూతులు పొంది వాటిని అక్షరరూపమున వ్రాయుచుండెడివారు. వాటిలో ముముక్షుధర్మము జీవితము, మానవ జీవితరహస్యము, గీతాసారము, ఇంకను అనేకము గ్రంథ రూపమున వెలువడినవి. రోజు సాయం సమయమున అక్కడికిచేరినముముక్షువులతో భగవద్గీత శ్లోకములను పలికించెడివారు. అదేమి విచిత్రమోగాని ఒక్కసారి ఆయన నోటినుండి వెలువడిన శ్లోకము శ్రోతల మనోఫలకముపై ముద్రింపబడెడిది. అన్ని యోగములందును ఆరితేరిన యోగీశ్వరులు. శారీరక మానసిక రోగములు బాపెడి అపర ధన్వంతరి. ఆయన చరిత్రయే ఒక మహా గ్రంథము కాగలదు. గ్రంథ విస్తరణ భీతిచే వ్రాయవలనుపడదు.

ఎంతకాలము ఆ మహానుభావుడటనుండెనో అక్కడికి చేరిన వారి హృదయక్షేత్రమున భక్తిబీజములు నాటబడినవి. ఆ చుట్టుప్రక్కల ప్రాంతములయందు పాడి పంటలకు కొదవలేక సర్వజనులు ఆనందమున నోలలాడుచుండిరి. శ్రీ స్వాములవారికి అందరు అత్యంత ప్రీతిపాత్రులే.

తాను రచించిన గ్రంథములను ఆయన తన ముఖ్య శిష్యులచేతికందించెను. పవిత్ర భారతమున అవతరించిన మహాత్ములందరు ఏదో ఒక సమయమున అసూయాపరుల దృష్టిలో పడినవారే. భగవంతుడే ఒకప్పుడు పరీక్షార్థమై అలా కావించుచుండెనేమో యనిపించును.

శ్రీ స్వాములవారిపట్ల గూడ కాలాంతరమున అటువంటి పరిస్థితి కలిగినది. శ్రీవారి ధ్యానమందిరమున అపరిశుద్ధులు కొందరు చేరినందున అది మొదలు ఆయన ధ్యానమందిరమున అడుగిడలేదు.

మహా తేజస్వి, తపస్వి అయిన శుద్ధ చైతన్యులవారొకప్పుడా ఆశ్రమమునకు వేంచేసి అచ్చట పవిత్రతను, వాతావరణమును దివ్యవృక్షసముదాయమును చూచి హర్షించి ఇచ్చట మారేడు చెట్టుమొదలున కూర్చుండి రామనామమును జపించిన పవిత్రులౌదురని చెప్పిరి.

అంతటి పవిత్రస్థలము కలుషితమాయెనని శ్రీ స్వాములవారి మనస్సు కలత నొందెను. ఇక అచ్చట ఒక్క క్షణమైనను నిలువకూడదని శ్రీస్వాములవారు నిశ్చయించుకొనిరేమో! ఎవరికి తెలుసు ఈవిషయము తెలిసికొనిన ముఖ్య శిష్యులయిన వారు పాలెం నాగమ్మ, నారాయణమ్మ యం. సుబ్బన్న అనువారలు ఆందోళన చెందిరి. శ్రీవారికి గుంతకల్లులో ప్రీతి పాత్రులయిన వారిలో ముఖ్యులు చిత్రం వేంకటపతి దంపతులు తమ గ్రామమునకు విచ్చేయవలసిందని వేడుకొనిరి. సర్వసంగపరిత్యాగులైన తపోధనులెచ్చోట నుండగలరు?

గుంతకల్లు సమీపమునయున్న దాసులునికి అను గ్రామమునకు అప్పుడప్పుడు పోయివచ్చుచుండిరి. స్వామీ తమరీమధ్య దాసులుదికి పోవుచున్నారేం యని ఒకశిష్యుడడిగిన ప్రశ్నకు స్వాములవారి సమాధానమిట్లు చెప్పిరి అదే 'దాసులుదికి' భగవద్దాసులకునికి పట్టయిన స్థలము గనుక అది దాసులునికి అని చెప్పిరి.

దాసులునికి దాసులుదికిగా మారి నవీన సంప్రదాయ సిద్ధంగా 'దోసలుదికి'గా మారి అర్థం లేని పేరు రూపొందింది.

గురుదేవులు తమ ఆశ్రమం గురించి విచారించలేదు. అవసానకాలం ఆసన్నమైనదని తెలిసికొన్న స్వామి అగ్రహారం వదలి దోసలుదికి చేరిరి. ఆగ్రామములో శ్రీవారికి ముఖ్యశిష్యులయిన డి. బసిరెడ్డి అంనమ్మ దంపతులు శ్రీ స్వామివారికి సేవలు చేయుచుండిరి. స్వామివారి దేహత్యాగానికి ఎనిమిది రోజులు ముందునుండి సరిగా ఎవరితోను మాట్లాడుట మానివేసిరి. అన్నపానాదులనుమానివేసి నిరంతరము ఓంకారోపాసనతో సమాధిస్థితి నొందుచుండిరి. స్వామివారి మౌనవ్రతము శిష్యులకు ఆందోళన కలిగించుచుండెను. అట్టి వారిని ప్రశ్నించు ధైర్యము ఎవరికి లేకపోయెను.

1984 సంవత్సరము డిసెంబరు నెల 4వ తేది ప్రాతఃకాల సమయమున స్నానధ్యానాదులు ముగించి శ్రీ కాశిరెడ్డిగారు నిర్మించిన మఠమునందు ఏదోమిషతో శిష్యులను బయటికి పంపి గడియ బిగించుకొని దర్భాసనముపై ధ్యాన నిమగ్నులై ఓంకారమును జపించుచు శాశ్వత సమాధిస్థితులైరి. ఎంతసేపటికి స్వామి తలుపు తీయనందున ఆందోళన చెందిన శిష్యులు తలుపు తీసికొని వెళ్ళిచూచిరి. స్వామి నిశ్చలసమాధిస్థితి యందుండుట చూచి తాకుటకు సాహసింపరైరి. కొంతసేపటికి తలవాల్చిన గురుదేవులను చూచి అత్యంత దుఃఖతరితులైరి. స్వామి లౌకిక ప్రపంచమును వీడి శివైక్యము నొందిరి. ఊరికి ఉత్తర దిశను ఒకశిష్యుడు కొంతస్థలమును ఇవ్వగా అక్కడనే స్వామిని సమాధిస్థుని గావించిరి. ఎక్కడనో జన్మించి ఎక్కడనో చరించి తమ పాద స్పర్శతో అగ్రహారం. దామురాపికి గ్రామాలను పునీతం గావించిన మహనీయులు అవతార పురుషుడు స్వామి రామదాసు.

ప్రతి సంవత్సరం డిశంబరు నెలలో దామురుడికి గ్రామములో శ్రీ స్వాముల వారిఆరాధన భక్తిశ్రద్ధలతో జరుపుచున్నారు.

ఓం శాంతిః

విద్వాన్ టి. రామన్న
తెలుగు పండితులు
యం. అగ్రహారం, కర్నూలు జిల్లా

# ధ్యాన యోగ దండకం

శ్రీమన్మహాకాశ మధ్యంబునన్. భ్రాజమాన ప్రిభాశోభవంబై, లవల్లక్ష్య విఖ్యాత వర్ణోజనా యామమయి పూర్ణమైనట్టి. భాస్వన్మహా. మండలాంతః ప్రదేశంబునన్. లోకభాతాధ్యుశేశున్. సువర్ణాభమూర్తిన్, హిరణ్యాభ భాస్వన్నుతం శ్మశ్రుకేశున్. మహాదేవదేవు శిరోభూష వక్త్రున్. శివున్నీలకంఠున్. మహాలోహితుండౌ. సదా గోపదాల పసిద్ధున్. మహాసిద్ధుడం. భర్గదేహున్ విభున్. సోఽహమంచెప్పుడున్. సంధ్యలన్ ధ్యానముంజేయగానొప్పు. సద్వైదికంబై, విశుద్ధంబునౌ. సగ్నిహోత్రాది. మధ్యంబునందాత్మమూర్తిన్. జగత్కోటి కాభారమౌనావి. నానంద బోధానుభూతిన్, విరూపాక్షు గంగాధరున్. విశ్వరూపున్. వృషాధీశకేతున్. చతుర్వ్యూహ చంద్రార్ధ మౌళిం. కపర్దిన్సదా శుభ్రరుద్రాక్షమాలాలసత్కంఠు. గోక్షీరఫేన ప్రకాశున్. మహీధ్రాత్మజాధీశు గుహ్యాతి గుహ్యున్. వివిధ్వంస దుర్నాశున్. అత్యద్భుతున్. శంకరుండమ్మగా ధ్యానముంజేయుచొప్పారు. కాకున్న సర్వజ్ఞుడై, కానసహస్రాక్షు. శీర్షాంఘ్రియై. విశ్వమై యక్షంధుడై. మహావిష్ణువైనట్టి. నారాయణుండేవ యంచున్. హృదంభోజ మధ్యంబునందే. దృఢధ్యానియౌచొప్పు. కాకున్న ద్వాదశ సంరోధవృత్తిన్. స్ఫుటంబై శివావాసమై. విద్యయుంగేవరంబున్. మహైశ్వర్య సత్రంబులున్. జ్ఞాననాశంబు సత్కాంతముంగల్గి. యోంకార సద్వేద్యమౌ. స్వాంతకంజాత మధ్యంబునందుండ. విశ్వార్చియై వహ్నియై. విశ్వతో వక్త్రియై. లోకయోనిత్వముంజెంది వైశ్వానరుండై. విభాతవ్యయై. యాతుడై. స్వాంగమాపాదశీర్షంబు. తాపంబునొందిచి. విర్యాత దీపంబు చందంబునన్. నీలమేఘస్థ విద్యుల్లతాభారూపి. నీవారశూకాభ. రూపంబునుం. పీతవర్ణంబునౌ. నమ్మహావహ్నిధ్యానించి. తద్దివ్యతేజశ్శిఖా మధ్యదేశంబునందా. పరానంద రూపాత్మతేజంబు దానపరాకాశమై. సత్యమై బ్రహ్మమౌ. నమ్మహాపూరుషున్. కృష్ణపీతాకృతున్. పాంబు సంసారరోగచ్ఛిదున్. విశ్వరూపున్. మహేశున్. విరూపాక్షుడౌ. నూర్ధ్వరేతస్కునిన్. నీలకంఠుండనుండా వీక్షించు. దావప్పు. బ్రహ్మచ్యుతేశాన. సంపూజ్య దేహాతిరిక్తున్. శివున్ సోఽహమంచెంతయున్ యోగిరాడ్ధ్యేయు. ధ్యానంబు నేయుంగ. నీమార్గమే ముఖ్యమయాగమూంతై కనంసిద్ధమైయొప్పు. కాకున్న లోకేశుడౌ బ్రహ్మనేనంచు. చింతింపగానొప్పు.

కాకున్న స్వహృదాంతమధ్యంబునందున్. శివున్ పాశిసంసారవైద్యున్, జగత్కా
రణున్, పాంబు సేవన్న బుద్ధిన్, విముక్త్యర్థిమై ధ్యానముంజేసి. యోగాసన
వ్యక్తు. నానాంతమూర్తిన్, లసత్స్ఫూర్తియౌ. నాదిమధ్యాంత శూన్యున్, సదా
ధారుణాకారు. శూన్యాకృతిన్, సూక్ష్మవిన్. శబ్దమున్, స్పర్శమున్, రూపమిం
పౌరసంబునన్. లసద్గంధముంగాక సామ్యంబు లేకుంటయున్. దానమై. విశ్వ
రూపుండునై, మూర్తిమై, మూర్తిగాకుండి. తాదృక్స్వరూపుయ్యున్న దృశ్యత్వ
ముంజెందు. యంతర్బహిర్వ్యాప్తుడై, సర్వతోవక్త్రుడై, సర్వతః పాణిపాదుం
డునై. సర్వసంవేదియౌ. శ్రీమన్మహాదేవదేవుండు. ధ్యానంబు గావించు నీ
మార్గమే ఘోరసంసార మాయావినాశ ప్రకాశంబు గాకున్న దానచ్చిదానందమై.
ధ్యానగమ్యంబు గాకుండు తద్బ్రహ్మమేనంచు. చింతింప ముక్తుండగున్. దీని
నొకప్పుడైనన్ మదివిల్చి ధ్యానించగా బ్రహ్మసాయుజ్యముం గాంచునంచున్
బ్రిరుడావల్కు నత్యంతమున్. ధ్యానముంజేయ సాశక్తున్దవను. లోకంబు
లో దీనితో సాటిలేదెందు పాపాత్ములౌవారి కేవాత్రలస్సైన మహాసహ్యమౌ.
పుణ్యులౌవారికిన్. ధ్యానముంజ్ఞాన మింకొకరీతిన్. మహావిష్ణు నవ్యక్తు
నారాధ్య సర్వప్రపదున్ శంఖచక్రాబ్జహస్తున్, సునేత్రున్, కిరీటాంగదశ్రోత్ర
హారాదిరామున్, లసత్పీత వాస్త్రిన్, హరిన్. పూర్ణచంద్రాననున్. దేవశ్రీ
వత్సవక్షున్ పరోజాత నేత్రుండ్రి వస్న్యన్ మందస్మితున్. స్ఫాటికాచ్ఛ
చ్ఛవింజక్రి నేనంచు చింతింపగా. ముఖ్యమీధ్యానమౌనంచు యోగీంద్రులత్యంత
ముంజెప్పగానొప్పు ఇంకొక్కరీతిన్ సుమధ్యాది వాడున్, విపరించిన్ వరాభీతి
హస్తున్. లసత్కుండికాహస్తు వయ్యక్షమాలా ధరుం గుండమండ్రాకారు
వాణీసమానక్తు నద్దేవు నేనంచు చింతింప [illegible]. వేదోక్త మా
ర్గంబుచే దస్సుగా చింతసేయందగున్ వీవ్యమీరీతి ధ్యాన యుక్తుండ యోగి
కిందాగ్రమంటొప్పగా వేదవేదాంత విజ్ఞానమున్గల్గ సందేహమున్లేదు. జ్ఞానం
బుచేగాక యజ్ఞానముంబోవ. దజ్ఞాన విచ్ఛిత్తియే ముక్తియౌ. నీకు వేదాంత
సారంబు సర్వమ్మునుంజెప్పితిన్ మత్ప్రసాదంబునన్. సందియంబొందకానం
దివై చెందుమా చెందమంది. పరానంద బోధంబు వాచస్పతియంచు బల్కెన్,
మహాదేవదానందిమై.

ఓం తత్ సత్

శ్రీ లలితాంబికా

# ముముక్షుధర్మము – పీఠిక

శ్లో॥ ఆబ్రహ్మభువనాల్లోకాః పునరావర్తినోఽర్జున।
మాముపేత్య తు కౌన్తేయ పునర్జన్మ న విద్యతే॥

అర్జునా! బ్రహ్మలోకాది సమస్తలోకములను పొందినవారు పునర్జన్మ నొందుదురు. నన్ను పొందినవారు పునరావృత్తి నొందరని స్మృతి వాక్యము.

గానుగకు కట్టబడిన పశువు మోయలేని భారము మోయుచు, దానిచుట్టూ తిరుగుచూ, కళ్ళకు గంతలు కట్టబడి యుండుట చేత తెలియక తానెంతో దూరం పయనించినట్లు భావించును. అట్లే అజ్ఞానాంధకారములో అలమటించే మానవుడు జననమరణరూప సంసార చక్రమున బడి భవబంధములనుండి విడుదలనొందలేక తానేదో సాధించితిననుకొనుచున్నాడు.

ఫలాపేక్షతో చేసిన పుణ్యపాపకర్మలకు ఫలితములైన సుఖదుఃఖాది అనుభవములకు జీవుడు దేహధారియగుచున్నాడు. పాపకర్మ ఫలితమైన దుఃఖానుభవమును ఎవ్వరును కోరరు. ఇక పుణ్యకర్మ సంచితసుఖము తదనుభవముతో తరిగి పోవును. కావున శాశ్వతముకాదు. "క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి" స్వర్గలోక సౌఖ్యములు పుణ్యము క్షీణించినంతనే తరిగిపోయి జీవుడు మర్త్యలోకమునకు విసరివేయబడును. "చెప్పకుమిట్టి తుచ్ఛ సుఖముల్మసాంపై తేనియల్" అన్నట్లు స్వర్గలోకాది సౌఖ్యములు అనంత కాలగమనములో క్షణికములే.

దేహము కారాగేహము
మోహము నిగళంబు రాగముఖరములరిపు
వ్యూహములు భక్తితోని
స్నూహింపని యాతరదవునే కమలాక్షా!

రాగాదులను శత్రువులచేత వ్యామోహమను గొలుసులతో దేహమను కారాగారములో బంధింపబడినాడు జీవుడు. కారాగారములో బంధింపబడినవాడు తానెప్పుడు విడుదల పొందుదునోయని సంతతము తపించుచుండును. కాని జైలు గోడల అందమును వర్ణించుచు "నాకిదియే బాగున్నది. దీనిని వదిలివెళ్ళను గాక" యని యనుకొనడు. అట్లే దేహధారి వ్యామోహమను సంకెళ్ళను ఛేదించుకొని రాగాది శత్రువులను అంతమొందించి స్వస్వరూపమును పొందినపుడే జన్మజరామృత్యుపాపాది మాలిన్యములంటక భవసాగరమును తరించును. చక్కెర శుద్ధజలములో కరిగిపోయి జలమే ఐనట్లు జీవాత్మ పరమాత్మయై పునరావృత్తి నొందదు.

సముద్రమధ్యమున పయనించుచున్న ఓడపైనున్న పక్షి విహారార్థము వేరొకచోటికి ఎగిరిపోయినను, అలసిన రెక్కలుగల ఆ పక్షి సముద్రజలమున విడువ వీలులేకుండుటచే తిరిగి ఓడను ఆశ్రయించక తప్పదు. అట్లే జీవుడు దేహాభిమానియై ఫలాపేక్షతో చేసిన కర్మఫలానుభవమునకు ఎన్ని దేహములు ధరించినను తుదకు పరమాత్మయను ఓడను ఆశ్రయించక తప్పదు.

అజ్ఞానముతో జీవుడు చావుపుట్టుకలను కోటలో ప్రవేశించి భగవంతుడను గోడను పట్టుకొని ముందుకు పోవుచున్నాడు. ఇప్పుడు మోక్షద్వారమును సమీపించినాడు. మానవశరీరమే మోక్షద్వారము. పరమ పురుషార్థ సాధనము మానవశరీరమే. సంపూర్ణముగా భోగములనుండి మనస్సును మరల్చి ప్రజ్ఞానరూపమైన బుద్ధితో భవబంధములనుండి విముక్తుడు కావచ్చును. ఐతే ఈ మహోన్నతమైన మోక్షద్వారమును సమీపించిన సమయములోనే దేహి విషయలంపటుడై పరమాత్మయను గోడను వదలి మానవజన్మను వ్యర్థం చేసుకొనుచున్నాడు

ఆత్మ సచ్చిదానంద స్వరూపము దానికి దుఃఖములేదు. శరీరపరిగ్రహముతో అది దుఃఖమునొందుచున్నది. కర్మచేత శరీరము పొందుచున్నది. రాగాదులచేత కర్మ. వ్యామోహముచేత రాగాదులు. అజ్ఞానముచేత వ్యామోహము. ఇట్లు కార్యకారణ సంబంధముచేత ఆత్మ దుఃఖితయగుచున్నది. దీనికంతటికీ మూలము అజ్ఞానమేయని తెలియుచున్నది. ఇది యెట్లు కలిగినదియని విచారించుట చేత ప్రయోజనములేదు. అజ్ఞాన అపరాధాన్ని తొలగించుటకు ప్రయత్నించవలెను. జ్ఞానాగ్ని దగ్ధకర్ముడై మోక్షగామి కావలెను

ఇంద్రియ సుఖములను దూరమునందే విడిచి భ్రూమధ్యమున దృష్టిని నిలిపి, ప్రాణాపానములను సమముగా ప్రసరించునట్లు చేసి ఇంద్రియములను బుద్ధిని, మనస్సును స్వాధీనమొనర్చుకొని, మోక్షాపేక్ష తప్ప అన్యాసక్తి ఏమియులేక సర్వకాల సర్వావస్థలయందును యోగయుక్తుడు కావలెనని శ్రీకృష్ణ పరమాత్మ అర్జునునకు గీతోపదేశము చేసినాడు.

మలనిర్మోచనమునకు సబ్బు అవసరమే. జలములేనిదే సబ్బుతో ప్రయోజనములేదు. అట్లే భక్తియను శుద్ధజలముతో జ్ఞానమను సబ్బుతో జన్మ. జరాశిత్ పిపాస శోకమోహములను షడూర్ములను తొలగించుకొనవలెనని గ్రంథకర్త పూజ్యపాద శ్రీశ్రీశ్రీ సాధురామమూర్తి యోగీంద్ర శ్రీచరణులు పరమ కారుణ్య భావముతో సంకల్పించి ఈ యాధ్యాత్మిక గ్రంథమును ముముక్షువులకు అందించినారు.

శ్రీ లలితాంబికా ప్రేరణతో జీవసేవకుడు.

| | |
|---|---|
| పెండేకల్లు R.S. | తుమ్మూటి రామన్న |
| ఈశ్వరనామ సం॥ | యం. అగ్రహారం — 518385. |
| వసంత పౌర్ణమి | కర్నూలు జిల్లా. |

ఓమ్-తత్-సత్

# ముముక్షు ధర్మము

సర్వమానవులును ప్రతినిత్యము, ప్రతిక్షణముగూడ విచారించి తెలియదగిన యంశము సర్వవిలక్షణమైన ముఖ్యాతిముఖ్యమైన స్వయం జ్యోతి స్వరూప, స్వస్వరూప, పరబ్రహ్మమైయున్నది. ఆ పరబ్రహ్మము ఏకము, నిత్యము, అద్వితీయము, సచ్చిదానందము, స్వప్రకాశము ఇత్యాది విశేషణ లక్షణములచే విశేషించి యున్నదని, వేదాంతములు వచించుచున్నవి. అట్టి స్వస్వరూప పరబ్రహ్మను దెలిసి సకలానర్థముల నివర్తించి నిత్యానందప్రాప్తిని పొందుటయే ముక్తియనియు, నందులకై యీ మానవజన్మము వచ్చినదనియు సకల శాస్త్రములు పేర్కొనుచున్నవి. కావున పరిపూర్ణ తత్త్వముకొఱకు అన్వేషించుటయే ముముక్షుజనుల ముఖ్యకర్తవ్యమై యున్నది. కరుణామయుడగు భగవంతుడు జగత్సృష్టితోపాటు జనుల విజ్ఞానమునకై వేదముల నొసంగి యున్నాడు. ఆవేదములయొక్క సారములే వేదాంతములనబడుచున్నవి. ఆ యుపనిషత్తులయందు ప్రతి వాక్యాంశము ముఖ్యముగా జ్ఞానమైయున్నది. జ్ఞానమునందియే లేకుండిన లోకమంతయు నంధప్రాయమై, ఇతి కర్తవ్యతా జ్ఞానవిమూఢమగును. కావుననే భగవత్స్వరూపులైన సాధుమూర్తులు (తత్త్వజ్ఞులు) జ్ఞానమునుబోధించుటకై పుట్టుచున్నారు. శ్రీసర్వేశ్వరుని కరుణామయదృష్టియొక్క ఫలము నెవరుచూడనోపు నిమిత్త భగవంతునిదయచే నందరును భక్తులగను, విషయ విరక్తులగను, జ్ఞానులగను, యోగులునగుచున్నారు. ఆత్మానాత్మవివేకవిచారణాజన్యజ్ఞానముచేతనే కైవల్యప్రాప్తిని బడసి, నిత్యానందస్వరూపులగుచున్నారు. ఆత్మజ్ఞానమువలననే నిత్యానంద పదవియగు కైవల్యప్రాప్తి యగుచున్నదని శ్రుతి స్మృతి పురాణములు, సకల వేదాంత శాస్త్రములు దెలుపుచున్నవి. చూడుడు:-

జ్ఞానాదేవహి కైవల్యం తమేవం విద్వానమృత ఇహభవతి (నృసింహ పూర్వ తాపి న్యుపనిషత్తు) నాన్యః పంథాః విద్యతేఽయనాయ (శ్వేతాశ్వతరోపనిషత్తు) నచేదిహావేదీన్మహతీ వినష్టిః (కేనోపనిషత్తు) నిచాయ్యతన్మృత్యుముఖాత్ప్రముచ్యతే (కఠోపనిషత్తు) జ్ఞానమువల్లనే కైవల్యముసిద్ధించుచున్నది. స్వాత్మరూప పరబ్రహ్మమును దెలిసి విద్వాంసుడు ఇచ్చోటనే అమృత స్వరూపుడగుచున్నాడు ఇట్లు ఉపనిషత్తులన్నియు ఆత్మజ్ఞాన విషయమునుద్ఘోషించుచున్నవి. జనులు అజ్ఞానముతరించుటకై, కన్నతల్లివలె

వేనోళ్ల హితముగ వేదాంతములు ఘోషించుచున్నవి. ఇక సిద్ధార్థమేమనగా, కేవలం జ్ఞానమే మోక్షసాధనమని వచింప సాధ్యముగాదు. ఏలయనగా, ఇతరములగు సాధనములును నావశ్యకములై యున్నవి. ఇచ్చోట కొంత విజ్ఞాన దృష్టితో సూక్ష్మబుద్ధిచే విచారింపదగియున్నది. కొందఱు కేవలాత్మజ్ఞానమే పరమసాధనమని తలచి, సర్వ ప్రకృతి దోషములను త్యజించి దేహాభిమాన దూరులై, ముక్తులై యున్నారు. మరికొందఱు కేవలమనన్యభక్తిచేతనే అనగా ఈశ్వరునికన్యముగా పరమాణువైనను లేదని ఎఱింగి మోక్షమును పొంది యున్నారు. మరికొందఱు కేవలం జీవబ్రహ్మైక్య యోగముచేతనే అనగా జ్ఞానముచే కూడియున్నంతవరకు జీవుడనియు తదజ్ఞానమును జ్ఞానముచే తొలగిన పిమ్మట జ్ఞానరూపమగు బ్రహ్మమనియు తలంచి కైవల్యప్రాప్తిని బడసి యున్నారు. మఱియు వితరులు నిష్కామ కర్మయోగముచేతనే భగవదాకార హృదయులై ముక్తిని పొందియున్నారు. ఇందులకు శ్రీ వసిష్ఠాది మహామునులు ఆత్మజ్ఞానసంపన్నులై కేవలం బ్రహ్మజ్ఞానము చేతను శ్రీ నారదాది మహర్షులనన్యభక్తిభరితులై కేవలం పరమభక్తి చేతను, శ్రీకపిల పతంజలాది యోగీశ్వరులు యోగసిద్ధిగలవారై జీవాత్మైక్యరూపయోగముచేతను, శ్రీ జనక చక్రవర్తి, అశ్వపతి, ఇక్ష్వాకాది రాజఋషులు నిష్కామకర్మానుష్ఠానపరులై భగవదర్పిత నిరపేక్ష కర్మాచరణతత్పరత్వముచేతను దురవగాహమగు, దుర్లంఘనీయమగు భవసాగరమునుదాటి ముక్తులై శాశ్వతానందమును బడసిరి. ఇట్లీ నాలుగు యోగములును ముక్తికి సాధనములని వేదశాస్త్రములు వచించుచున్నవి. అష్టాదశయోగములను దెలుపు శ్రీభగవద్గీతాశాస్త్రముగూడ భక్తి, జ్ఞాన, యోగ, నిష్కామకర్మలను చతుర్విధ సాధనములనే ముఖ్యముగా ప్రతిపాదించుచున్నది. శ్రీభగవద్గీత శాస్త్రమందు నిష్కామ కర్మయోగము, జ్ఞానయోగము, భక్తియోగము, ఆత్మ సంయమ యోగము అని నాలుగును గలవు. తదితర సాధనములన్నియు నీచతుర్విధయోగములలో నంతర్భూతములగుచున్నవి.

శ్రీ భగవద్గీతయందు

శ్లో॥ భక్త్యామామభిజానాతి_యావాన్యశ్చాస్మితత్త్వతః
తతోమాంతత్త్వతోజ్ఞాత్వా_విశతేతదనంతరమ్॥

అని అనన్యభక్తిని గూర్చియు చెప్పియున్నది.

శ్లో॥ తపస్విభ్యోఽధికోయోగి జ్ఞానిభ్యోఽపిమతోఽధికః
కర్మిభ్యశ్చాధికోయోగ తస్మాద్యోగీభవార్జున॥

అని యోగమును గూర్చియుచెప్పుచున్నది.

శ్లో॥ నహిజ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్యతే
తత్స్వయం యోగసంసిద్ధ కాలేనాత్మని విందతి॥

అని జ్ఞానమును గూర్చియు కొనియాడుచున్నది.

శ్లో॥ కర్మణైవహిసంసిద్ధి మాస్థితాజనకాదయః
లోకసంగ్రహమేవాపి సంపశ్యన్కర్తుమర్హసి॥

అని నిష్కామ కర్మయోగమును గూర్చియు సమానముగా చెప్పియున్నారు.

శ్లో॥ ధ్యానేనాత్మనిపశ్యంతి కేచిదాత్మానమాత్మన
అన్యేసాంఖ్యేనయోగేన కర్మయోగేనచాపరే॥
అన్యేత్వేవమజానంతః శ్రుత్వాఽన్యేభ్యఉపాసతే
తేఽపిచాతి తరన్త్యేవ మృత్యుంశ్రుతిపరాయణః॥

ఈ విధముగా భగవద్గీతలోనే నాలుగు యోగమార్గములను ముఖ్యములని తెలుపుచు ఈ నాల్గింటిని ననుష్ఠింప శక్తిలేనివారు, బ్రహ్మస్వరూపమెఱింగిన మహాత్ముల వలన నొకఅక్షరమును చెప్పించుకొని, తత్ప్రకారమునాచరించి మృత్యురూప సంసారమును తరింపవచ్చు ననియు, కడుసులభమైన ఐదవ దైన, ఉపాయమునుగూడ శ్రీ కృష్ణభగవానులు తెలిపియున్నారు. విచారించి చూచిన నాలుగు సాధనలును ముఖ్యములై యుండగా కేవలజ్ఞానముచేతనే మోక్షము సిద్ధించుచున్నదనుట సాహసముగానున్నది. అనన్యభక్తి, నిష్కామ కర్మ, యోగాదులచేతను మృత్యువునుతరించి అమృతత్వమును పొందినవారు చెప్పియున్న శాస్త్రములును అసత్యములగునా? కనుక నిచ్చట నీలాగున యథార్థమును దెలియవలయును. జ్ఞానముచేతనే మోక్షమని చెప్పుచున్నారో వారలు జ్ఞానమును మాత్రము ముఖ్యముగాను, తదితరములను గౌణములను తీసికొనిరని గ్రహించవలయును. ఇటులనే అనన్యభక్తి ముఖ్యమైనప్పుడు మిగిలిన యోగములు గౌణములని తెలియవలయును. లేనిచో మహాత్ముల దూషణము ప్రసక్తమగును. శ్రీవసిష్ఠాది మునీశ్వరులు జ్ఞానముచేతనే ముక్తిని పొందిరను

నప్పుడు వారికి భక్తి యోగములు లేనిచో వచింపసాధ్యముగాదు. అట్లే శ్రీనారదాది మహామునులు కేవలానన్యభక్తిచేతనే భగవత్స్వరూపతత్త్వమును గనుగొనిరనిన నామహాత్ములకు జ్ఞానములేదని వచించుటకుసాధ్యమగునా? శ్రీకపిల పతంజలాది మహాయోగీశ్వరులు. కేవలయోగసిద్ధిచేతనే విముక్తులయిరనిన నామహనీయులకు భక్తిజ్ఞానములు లేవనుటకుసాధ్యమగునా? ఆతీరున శ్రీజనక చక్రవర్తులగు రాజర్షులు నిష్కామకర్మయోగముచే బంధముక్తిని బడసిరనిన నావిదేహముక్తులకు జ్ఞానము. భక్తి యోగములు. శూన్యములని వచింప వీలగునా? కావున పైన నిరూపింపబడిన రీతిగా నేదేని ఒకసాధనము ముఖ్యముగా తీసికొనినప్పుడు తదితరసాధనములును సహాయముగానుండున్నవి.

ఈతత్త్వమును గనుగొనియే. శ్రీభగవద్గీతయు సకలయోగములకును ప్రాధాన్యమునొసగుచు "నిష్కృత్యై తదాశేషేణ యదేచ్ఛసి రతామయ" అనువాక్యముచే నిష్ఠను వచ్చినదానిని గైకొనుడని ప్రతిపాదించుచున్నది. యథార్థముగా విచారించిన నీనాలుగు జ్ఞానము. భక్తి. యోగము. నిష్కామకర్మములును పరస్పర సంబంధములయియే యున్నవి. జ్ఞానమనగా స్వస్వరూపమును దెలియుటయేయగును. పరబ్రహ్మమిట్టిదని దెలియుట యను జ్ఞానము ఆత్మయందు అధికప్రీతియును. భక్తియు. చిత్తైకాగ్రతయు. నిష్కామ కర్మానుష్ఠానము చేయగలుగను.

ఈవిధముననే పరమాత్మయందలి అనన్యభక్తియు పరమాత్మ స్వరూపమును దెలియగలుగను. ఆతీరున యోగనిష్కామములు లేకను పరబ్రహ్మమందు చిత్తములయింపజేయుటయును. పరమయోగము పరమాత్మయిట్టిదని తెలియకను. విశుద్ధమగు ప్రీతిలేకను. తదర్థమై నిష్కామయోగానుష్ఠానము లేకను సిద్ధించదు. నిష్కామ కర్మయోగానుష్ఠానము సకల కర్మలను భగవదర్పితమను బుద్ధితో గావించుటయు. భక్తి జ్ఞానము యోగములు లేక సంభవింపదు. కనుక విశాలదృష్టితో మమత్వమును వదలి జూచిన నీ నాలుగు యోగములును ముఖ్యముగానే యున్నవి. వానిలో నభిమతమగుదానియందు ముఖ్యముగాను తదితరములయిన వానియందు గౌణబుద్ధి గలిగి ప్రవర్తింపవచ్చును.

పైననిరూపింపబడిన నాలుగుసాధనములకు ముఖ్యాభిప్రాయము దేహము నేనను అధ్యాసము నిరోధము చేసికొని స్వస్వరూపమగు ఆత్మస్వరూపము తానని యెఱింగి తదేకనిష్ఠయందుండుటే ముక్తియని మహాత్ములు చెప్పుచు

న్నారు. కావున మానవుడు ముక్తిని పొందుటకు తనకనువరమైన నిష్కామకర్మయోగముగాని, అనన్యభక్తియోగముగాని, జ్ఞానయోగముగాని, అంతఃకరణనిరోధమును, అనగా ఆత్మసంయమయోగమునుగాని, అవలంబించి శ్రద్ధచే అసత్పదార్థములగు అనాత్మదేహేంద్రియాదులయందు వస్తుత్వబుద్ధిచే యిది నాది. ఇదినేను. అను వివిధమయిన యభిప్రాయమేదిగలదో అదియే అధ్యాసము.

అసత్పదార్థములయెడ ఆత్మబుద్ధి, ఆత్మత్వబుద్ధి రెండును అధ్యస్తములగుటచే దేహేంద్రియాదులనేనను అవి నావను అజ్ఞానజన్యారోపము. ఇట్టి అహంకారమమకారస్థితియే భ్రాంతియను అధ్యాసము. కాన ఆత్మజ్ఞానిచే తన యాత్మను సంధానమను నిష్ఠారూపమున నాయధ్యాస నిరసింపదగినది. స్వాత్మనిష్ఠచేతనే స్వస్వరూపమును దెలిసి భ్రాంతిరహితుడు గావలయును.

బుద్ధికి తద్వ్యాపారములకును ప్రత్యగాత్మసాక్షిగా నున్నది. బుద్ధియందున్న సకలవిషయములను కనుగొనుచు కూటస్థాత్మనిర్వికారమై సాక్షియై యున్నది. ఆ చైతన్యరూప అంతరాత్మయే తనస్వరూపము. అట్లెరిపి ఆ పరబ్రహ్మము నేనను నిశ్చయముతో. బ్రహ్మాకారవృత్తితో నుండవలయు. అప్పుడు తనకన్న వేరు పదార్థము తోచుట లేదు. అట్టి ధ్యేయాకారవృత్తితో అనాత్మపదార్థములయందు ఆత్మబుద్ధిని విడనాడవలయు. నేను, నాదియను అహంకార మమకారములను త్యజించవలయు. అప్పుడే ఆకర్తృత్వ. అభోక్తృత్వ రూపపరమాత్మ స్వరూపస్థితి తనకు గలుగును. ఇదియే స్వస్వరూప ప్రకాశకవృత్తి జ్ఞానము. ఇదియేయోగము. ॥వృత్తిహీనం మనః కృత్వా క్షేత్రజ్ఞం పరమాత్మని ఏకీకృత్య విముచ్యేత యోగోఽయం ముఖ్యఉచ్యతే॥ అనగా మనస్సును, వృత్తిరహితముగానుండుటయే జీవబ్రహ్మైక్య యోగము. కావున అనాత్మ పదార్థములు సత్యములు గావు-దుఃఖదాయకములు, ప్రతిబంధకములు, మనశ్శాంతి ప్రతిబంధకములు. వీటిని తానువిడనాడిన విశ్వాసంతుష్టిరూపమును వదలి చరించుట యగును. అనగా తాను రాజై భిక్షుకునివలెనుండి భిక్షమెత్తుట యగును. ॥యాదృశీ భావనా యత్ర సిద్ధిర్భవతి తాదృశీ యామతిస్సాగతిర్భవేత్॥ అనగా ఎట్టిభావమో అట్టిస్థితియేగలుగును. ఎట్టిబుద్ధియో అట్టి గతియేగలుగును. గాన తాను పరబ్రహ్మమని యెఱింగి అనాత్మను దూరముచేసి, సోఽహం భావనతోనుండవలయును. దేహాదులయందలి అహంకారము అజ్ఞానమగును. బంధమునిచ్చును. పరమాత్మయందున్న అహంకారము జ్ఞానము బంధరహితము.

తనకు గలిగిన అనాత్మబుద్ధియను అధ్యాసము ధ్యానం విచారముచేతనే దూరీకరింపదగియున్నది. శాస్త్రములుగూడ సహాయములు చేయగలవు. కావున శ్రద్ధచే స్వప్రయత్నధురంధరుడై స్వస్వరూపజ్ఞానమును బడయవలయు. అట్లుగాక ఇది మా దేశాచారము ఇది మా కులాచారము కావున విటులనే చేయు వారము అను లోకాచారమును విడిచిపెట్టి ఇటులచేసితేని వారేమా మెప్పరు ఇట్టైన నా దేహమునకుపదదు. అను దేహానువర్తనము బరిత్యజించి, ఇంక ఇది మా శాస్త్ర సమ్మతము అనువీరీతి విధినిషేధరూపమగు శాస్త్రవర్తనమును గట్టిపెట్టి దేహాదులయందున్న ఆత్మబుద్ధిరూప అధ్యాస పాలద్రోలుటకు చేయవలయు. సాధారణముగా లోకమేరీతి పోవుచున్నదో దానిని ప్రమాణీకరించి జనులు ప్రవర్తింతురు. ఆవిషయమున విచారణకూడయుండదు.

కొన్ని దేశములలో కొన్ని విరుద్ధాచారములుగలవు. అవిశాస్త్రవిరుద్ధములై నీతిబాహ్యములై యుంటున్నవి. పరంపరగా వచ్చినందున వాటిని విడనాడ లోకములో ఈ సంసారమనువది సహజసిద్ధమై యున్నది.

పుట్టుకతోనే అవిద్య కామ్యకర్మ వాసనల కూడికతో జీవాత్మయుండుచున్నందున నీవు నావాడు, వాడు వానివాడు ఇత్యాదివ్యవహారములు సిద్ధమగుచున్నవి. అందువలన విచారణగూడ ప్రయోజనకారిగాదు. ఇది అనాది సంస్కారముగానున్నది. దానిననుసరించియే కొంత వివేకము. విచారణ బుద్ధిగలవారుగూడ సంసారము నిజమనియే నమ్మి దానికి లోబడుచున్నారు. లోకానువర్తనమిటుల యున్నది.

ఒక గొఱ్ఱె పడిలోబడిన మిగిలినగొఱ్ఱెలన్నియు. అటులనేచేయుచున్నవి విచారణలేశముగూడ వాటికి లేదు. దీనిని "గడ్డలికా ప్రవాహపతిత" న్యాయమనెదరు. లోకానువర్తనముచే నెక్కుడు సంపీడనమున్నందుచేత అనేకదురాచారములు పెచ్చుపెరుగుచున్నవి. కాన లోకానువర్తనము సత్యముగాదు. జనులందరు సామాన్యముగా ఈసంసారమే నిజమనియు సుఖప్రదమనియు విశ్వసించి దేహేంద్రియాదులను నేను. నాది అనుచున్నారు. జగత్తు సత్యమనియే వారి తలంపు. కాన వారిమార్గము బుద్ధిమంతుడనుసరింపక సత్యమును కనుగొనవలయు. మఱియు లోకమార్గము నెట్టిదనగా

శ్లో॥ గతానుగతికో లోకః నలోకః పారమార్థికః
వాలుకాలింగ మాత్రేణ గతం మే తామ్రభాజనమ్॥

రా॥ అనగా ఒక మహాత్ముడు గంగాస్నానమునకు పోయినప్పుడు తన సంధ్యావందనానుష్ఠాన సమయమున తన రాగిపాత్రను ఎవరైనను తీసికొనిపోదురని తలంపుతో ఇసుకలో ఆపాత్రను పూడ్చివేసి, ఎత్తుగా మట్టికొంత యిసుక గుర్తునకు పోసియుండెను. అది లింగాకారముగా కనబడెను. తరువాత స్నానమునకు వచ్చినవారందరు అదిచూచి యిటులచేసిన పుణ్యమేమోయని యిసుకతో అనేక లింగాకారముల నేర్పరచిరి. స్నానానుష్ఠానానంతరము ఆమహాత్ముడు తన రాగి పాత్రను కనుగొనలేక పోయెను. కనుక లోకము ఒకరుపోయిన దారినే పోవును. విచారించినచో లోకస్థితి యిట్టిది. లోకులవలె అజ్ఞాన జన్యాధ్యాసమునకు లోనుగాకూడదని ముఖ్యార్థము. కావున లోకానువర్తనము సత్యముగాదు. దానిని విడనాడవలయు. అటులనే దేహానువర్తనము నిజముగాదు. దేహసౌఖ్యమునేగోరి దానికి తగిన పనులను చేయుచుందురు. ఈ దేహమును అనుసరించి తనధర్మకర్తవ్యమును మరచిపోవలసియుండును. ఈదేహమే నేననెడి భ్రాంతి అనేక దుఃఖములను గలుగచేయుచున్నది. అసత్యమగు దేహమునననుసరించిన అనర్థమైన అభిమానరూపమగు అధ్యాసదొలగదు. దేహానువర్తనమనగా దేహమే నేననెడి బుద్ధితో దేహసౌఖ్యమునేగోరి దానినే పోషించుచు తదను గుణ కార్యములందే ప్రవర్తించుచు, దేహము చిక్కిన నేను చిక్కినాను బలము దేహముబలిసియున్న నేనుబలిసినాను బలవంతుడనైనానని సంతోషము నొందుచు కేవలంభ్రాంతితో గూడికొని యుండుట కనుక దేహము ననుసరించిన అజ్ఞానము వృద్ధియగునేగాని నశించదు. కావున శరీరానువర్తనమున అభిమానము విడువవలయు. ఇకశాస్త్రానువర్తనము తొలగద్రోయవలయు. శాస్త్రము విధి నిషేధముల బోధించుచుండును ఈకార్యములచేయవలయు, ఇవిచేయదగనివని బోధించును. లోకదేహానువర్తనములకన్న ఇదియెంతయో శ్రేష్ఠము. అయినను శాస్త్రధ్యయనము. అజ్ఞానమును, అధ్యాసను దూరీకరింపజాలదు. స్వర్గాది ప్రాప్తి గలుగజేయును. వేదాంత శాస్త్రములు శ్రవణము చేయుదగినవి. ఇవి వస్తుతత్త్వము నిర్ణయించును. అంతమాత్రమే పరోక్ష జ్ఞానమును మాత్రం గలుగజేయును. అంతమాత్రముచే అధ్యాసపోజాలదు. శాస్త్రాధ్యయనమందు కాలము గడపిన జ్ఞానము గలుగదు. పరబ్రహ్మ ప్రాప్తిని గలుగజేయజాలవు. నిరంతరము పండితులు వాటినే పఠింపవచ్చు. దీపమని యుచ్చరించిన చీకటి పోదు గదా! అన్నవస్త్రమనే ఆకలితీరునా? శాస్త్రప్రయోజనమిట్టిదేయగును. వ్యవహా

రమునకు వస్తుతత్త్వమునకు శాస్త్రమువెంతయో యవసరము. భూగోళశాస్త్రము వంటి రైల్వేగైడువలె మార్గమును దెలుపును. కావున అనాత్మబుద్ధి నిరంతర ధ్యానుష్ఠానముచేతను, తనలోనే ఇమిడిన ఆత్మవిచారణచేతను నిరసింపబడును. కావున శాస్త్రోక్తమూనము శాస్త్రవర్తనము వదలవలయు ననగా తన బ్రహ్మ విద్యకు, తన శాశ్వతసుఖమునకు, ఆనందానుభవమునకు విరుద్ధమగు దానినంత యును మానవలయు. స్వయముగా విచారించి సత్యమగు దానినే గ్రహించి అనుష్ఠానపరుడుగావలయు. అప్పుడే తన అధ్యాసతొలగును. లోకశాస్త్రదేహము లనుమూడింటియందుండు అధ్యాస దొలగించుకొనవలయును. నిరంతరము బ్రహ్మమే నేనను దృఢభావనము వదలకుండ యుండవలయు.

శ్లో॥ నగచ్ఛతి వినాపానం వ్యాధిరౌషధ శబ్దతః
వినాఽపరోక్షానుభవం బ్రహ్మశబ్దైర్నముచ్యతే॥

తా॥ ఔషధమును సేవింపకయే ఔషధము ఔషధము అని యుచ్చరించిన మాత్రాన వ్యాధిపోనటుల ముక్తియు అపరోక్షానుభవములేకపోయిన శాస్త్రములో చెప్పబడిన నేను బ్రహ్మము నేను బ్రహ్మమను శబ్దముల పఠించినంత మాత్ర మునగలుగదు. అజ్ఞానము దొలగదు. కావున శాస్త్రవాసనయుగూడ పరిత్యజించ వలయు. ఆత్మనిష్ఠచేతనే అనాత్మబుద్ధిని తొలగగొట్టవలయు.

వేదాంతశాస్త్రమున వాసనారాహిత్యమే మోక్షమని చెప్పబడి యున్నది. కాన లోకవాసన, శాస్త్రవాసన, దేహవాసనలచేత నెన్నటికిని అపరోక్షజ్ఞానము గలుగజాలదు. ఇహలోకవాసనయనగా ఈలోకమున తనకు సంబంధించిన వస్తువులయెడ ప్రీతి. వాటిని విడిచిపోవ బుద్ధిపుట్టదు. ధన, వనితాది విషయముల యందు రాగము, స్వగుణప్రకటనయందు ప్రీతి, పరగుణవిషయమున ద్వేషం, మను నీమొదలగునవి లోకవాసన యనబడును. దేహవాసనయనగా దేహాపేక్ష రాగ పూర్వక పోషణాసక్తి. ఇక శాస్త్రమునందలి ప్రీతిచే శాస్త్రములోనే వాద ప్రతివాదములతో కాలము గడుపుట శాస్త్రవాసన యగును. ఈవాసనాత్రయము అపరోక్షజ్ఞానమునకు అధ్యాసనివృత్తికి, ప్రతిబంధకములు. కనుకవానిని విడువ వలయు.

శ్లో॥ వాసనామేవ సంసార ఇతి సర్వా విముంచత
తత్త్యాగో వాసనా త్యాగాత్ స్థితిరద్యయథాతథా॥

తా॥ అనగా వాసనలేసంసారము. వానినన్నిటిని వదలవలయు. అదియే సంసార త్యాగము. అలాగుననే వాసనాత్యాగము వల్లనే ఇట్టి పరమశాంతియు గలుగును.

కాన వాసనాత్రయమును త్యజించిన అధ్యాస బోధను.

శ్లో॥ అంతస్తిమిరనాశాయ శాస్త్రబోధోనిరర్థకః
ననశ్యతి తమోవార్తా కృతయాదీపవార్తయా॥

తా॥ అనగా లోపలయున్న అజ్ఞాన నాశమునకు శాస్త్రబోధ శబ్దజ్ఞానము వ్యర్థము. దీపవార్తచేత చీకటి నశించునా? అటులనే అనుభవమునకై శాస్త్రజ్ఞానము వ్యర్థము. మరియు హృదయకూటమున అనాదిగా దేహేంద్రియాదులకు సంబంధించిన నేను నావి అను అనాత్మసంస్కారములు (అనగా అనుభవమయ పరమాత్మజ్ఞానము) గలవు. ఇట్టి సంస్కారములున్నందుచేతనే కొందరు అజ్ఞానులుగను. మరికొందరు జ్ఞానులుగను కన్పడుచున్నారు. ఇందులకు కారణము విచారింపగా అనాత్మసంస్కారములు అవిద్యాజన్యములు. ఆత్మసంస్కారము విద్యాజన్యము. ఈ అనాత్మవాసనలు దేహమునాది. వస్తుసంచయమునాది. దేహేంద్రియాదులు నేను. అను మలినసంస్కారములు. అనాత్మవాసనలు జన్మజన్మాంతరముల నుండి ప్రబలియున్నందున అట్టి జన్మాంతరములందున మహాత్ముల సాంగత్యము భగవద్భక్తి ఆత్మవిచారము ఆత్మచింతన మొదలగు పవిత్ర సాధనలు చేయనందున. ఆత్మబుద్ధి స్థిరపడనందున. ఆత్మవాసన జన్మజన్మాంతరముల నుండి స్వల్పముగానేర్పడినందువలన మరుగు పడియున్నవి. అందుచే జనులు అజ్ఞాని. ఇంక ప్రయత్నపరుడై ఆత్మవివేక రహస్యమును తెలిసి దృఢతరములై బలవత్తరములైనను ఆ అనాత్మ వాసనలన్నింటిని నిరంతరము ఆత్మానుసంధానముచేత. తనలో తనను చూచుకొనుటచేత. ఆత్మవిచారముచేత ఆత్మను పరమాత్మలో నైక్యపరచుటచేత. నిశ్చలధ్యాన సమాధులచేత నశింప చేయుచున్నారు. అప్పుడు బ్రహ్మాకారవృత్తిరూపశుద్ధవాసన వికాశిల్లుచున్నది అందుచేతనే ఆత్మరూపము నిరావరణమై స్వయముగా ప్రకాశించుచున్నది. అనగా స్వయంజ్యోతి బయలుపడుచున్నది. ఇదియే విద్యచే అవిద్యనశించుననునది కావున ఆత్మభావనచే అనాత్మభావనల దరిచేరనీయక నిరంతరము దూరము చేయుచుండిన మొదట మలిన సంస్కార రహితమగు హృదయమున యాత్మ వస్తువు స్వయముగా ప్రకటనమగును. ఇదియే విజ్ఞానావస్థ తురీయము పరమాత్మప్రాప్తి. కావున ఎంతవరకు మలిన వాసనలను, వృత్తులను. సంకల్పములను. గుణములను త్రోసిపుచ్చి ఆత్మవిచారణ ధ్యానాదులను ముముక్షువు బలపరచుచున్నాడో అంతకు దైవమును చేరుచున్నాడని తెలియవలయు. మరియు

మేఘాచ్ఛాదనము మెల్ల మెల్లగా తొలగుచుండిన సూర్యకిరణములు బయలుపడుచుండును. అలాగున మలినవాసనాజాలమేఘావరణము హృదయాకాశమందు దూరమగుచుండగా పరమాత్మయను సూర్యుని జ్ఞానకిరణములు ప్రకటములగుచుండును. పూర్తిగా మేఘావరణము తొలగిపోయిన పిమ్మట పరిపూర్ణభానుడు సకల కిరణములతో వెలుగొందుచున్నాడు. అటులనే అవిద్యాచ్ఛాదనము నశించగా పరిపూర్ణ పరమాత్మజ్యోతిభాసిల్లును. రాహువుచేగ్రహింపబడిన చంద్రుని మాదిరి యీ ఆత్మ అవిద్యచే మ్రింగబడియున్నది. రాహుగ్రహము తొలగుచుండగా చంద్రుడు మెల్ల మెల్లగా బయట పడుచుండును, ఆమాదిరి శుద్ధవాసనలు వశించుచుండగా ఆత్మప్రసన్నమై ప్రకాశోన్ముఖమగు చుండును. తరువాత రాహువిర్ముక్త శీతభానుని పగిది పరాంతరాత్మయు. అజ్ఞానవిర్ముక్తమై పరితము తేజరిల్లును. అదియే ఆత్మకాంతి. నేత్రమునకు పటలమున్నప్పుడు చూపు మసకగా మందముగా నుండును. అంజనముచేత పటలమునశించగా నయనము శుద్ధమై సమస్త వస్తువులను జూడగలుగును. అటొప్పున జ్ఞాననేత్రము అజ్ఞాన పటలముచే గ్రమ్మికొనగా అంధమై ఆత్మవిషయగ్రహణమున కుంఠితమై యున్నది. నిరంతరాత్మవిషయ జ్ఞానవిచారణయను కాటుకచే ఆయవిద్యాపటలము తొలగిపోగా జ్ఞాననేత్రము స్ఫుటముగా తెరువబడుచున్నది.

శ్లో॥ అనాదిమాయయాసుప్తో యదాజీవః ప్రబుధ్యతే।
అనిద్రమజమస్వప్నమద్వైతం బుధ్యతే తదా॥

తా॥ అనగా అనాదిమాయయను నిద్రయందు శయనించు జీవుడు, ఎప్పుడు ప్రబుద్ధుడు అగునో జనన. నిద్ర. స్వప్నములు లేని అద్వితీయ పరమాత్మ తత్త్వమెఱుంగబడుచున్నది. కనుక అశుద్ధవాసనాజన్యప్రతిబంధముల నశింపచేయవలయు. అదియే విముక్తి. అప్పుడే స్వస్వరూప దర్శనము. మఱియు మనస్సును పరమాత్మయందైక్యపరచుటయే విషయవాసనల నశింపజేయుట కుపాయము. అనగా వాసనల సముదాయమేమనస్సు. జలములో ఉప్పువలె పరమాత్మయందు, చిత్తము పరమాత్మమయమై స్వరూపము లేనిదగుచున్నది. ఎంతెంతకు మనస్సు పరమాత్మయందు దృఢముగా నిలుచునో అంతకంతకు ప్రపంచవాసనలు విషయ సంస్కారములు నాశనమగుచునే యుండును. అనగా సూర్యుడుదయించుకొలది చీకటిదూరమగుచున్నది. అలాగున పరమాత్మ సన్నిధికి అంతఃకరణము సమీపించుకొలంది అజ్ఞానమను చీకటి రహితమగుచున్నది.

పరిపూర్ణముగా పరమాత్మయందైక్యతను మనస్సుపొందిన అజ్ఞానవాసనలే హరించిపోవును. ఎప్పుడు పరమాత్మాకారముచే విశేషముగా వాసనలు తొలగుచున్నవో అప్పుడే పరమాత్మానుభవము ప్రతిబంధరహితమగుచున్నది. అనగా వాసనా జాలములు పరమాత్మ ఐక్యత అను ఖడ్గముచే తుత్తునియలుగాగా పరమాత్మ నిరావరణమై సాక్షాదనుభవగోచరమగుచున్నది. ఇదియే అపరోక్ష జ్ఞానము. అవిద్యాజనితమగు హృదయక్షేత్రమున జీవుడను చిలుక జన్మజన్మాంతరకృతవాసనాజాలపంజరములో నివసించుచున్నది. జీవస్థానమగు ఆపంజరమునకు వాసనాయుత సంకల్పములు పుల్లలుగా నున్నవి. సంకల్ప వికల్పములు అను కలాకల్పములను (పుల్లలు) విజ్ఞానఖడ్గముచే తెగగొట్టిన పిమ్మట వాసనాపంజరము నశించిపోవుచున్నది. ఇకవాని జీవుడు బంధవిముక్తుడై స్వేచ్ఛగా విహరించును. అనగా స్వానుభవ ఆత్మసాక్షాత్కారముచే అవిద్యా గ్రంథి తొలగిపోవుచున్నది. అప్పుడు జీవుడు ఉపనిషత్తులసారమగు పరమాత్మయందు విహరించును. నేముషిపటిమచే అద్వితీయ ఆనందమయుడై యుండును. కనుక వాసనావిముక్తి లేనిదే ఆత్మానుభవము గలుగజాలదు. "వాసనావర్జితా యేన వక్తవ్యంచ నిరామయమ్" అనగా వాసనలు వదలిన మహానుభావుడే నిరామయుడు. ఇక పరమాత్మ నిరావరణము. ఇక చిలుక పంజరము చిన్న చిన్న పుల్లలచే సమర్పబడియుండును. ఆపుల్లలన్నియు నూడబెరికిన పంజరమే లేపోవుచున్నది.

అలాగున మనస్సున వాసనాజాలము సంస్కారములు వేరు. మనస్సు వేరుగాదు. సూక్ష్మసూక్ష్మతర సంస్కారములు చేరి సూక్ష్మ సంస్కారరూప మనస్సు తయారగుచున్నది. ఇట్టియంతఃకరణము స్థూలావస్థకు వచ్చినప్పుడే బాహ్యపదార్థములతోచేరి జీవుని కనుభవగోచరమై ఆమనస్సు సుఖదుఃఖముల నొసంగుచున్నది. కావున వాసనలు నశించుట యనగా మనోనాశమని యర్థము. ఇదియే అమనస్కము. ఇట్టిలింగి ముముక్షువగువారు నిరంతరము స్వలక్ష్యమగు స్వస్వరూపమందే మనస్సును దృఢముగా నెలకొల్పిన మనస్సు నశించుచున్నది. ఆత్మ ధ్యానయోగి, కార్యమేమనగా మనస్సును స్వరూపము లేకుండా జేయుటయే. మనస్సే సకలార్థములకు హేతువు. తన నిత్యసుఖరూపమోక్షమునకు మనస్సే ప్రతిబంధకము. ఇట్లని సకలోపనిషత్తులు చెప్పుచున్నవి. మహాత్ములు చెప్పుచూయున్నారు. కావున మనోనాశనము గావింపవలయు. విజ్ఞాన

యోగి నిరంతరము మనస్సుయొక్క రహస్యమెఱింగి యేయాత్మపదార్థమును చొరనీయక తనరూపమును తానుభావించుచు కనుగొనుచుండును. తన ఆత్మను పరమాత్మలో నైక్యపరచుచుండును. ఇదియే ఆత్మానుసంధానము. మనోరాహిత్యమునకు పరమోపాయము. స్వరూపమును గుర్తెఱుంగుటయే మోక్షసాధనరహస్యమగుచున్నది. "శ్రీభగవద్గీతయు యస్త్వాత్మరతిరేవస్యాదాత్మతృప్తశ్చమానవః" జ్ఞాని ఆత్మయందే రమించును. లేక తృప్తుడగును. సంతుష్టుడగును అని చెప్పుచున్నది. గనుక సదా మనస్సు పరమాత్మయందే నిలుపవలయును. లేనిచో అజ్ఞానము అనగా తనను తాను తెలియకపోవుట యను ప్రమాదము సంభవించును. ఈ హేతువుచే అవిచ్ఛిన్నముగా స్వరూపస్థితి దృఢమగునటుల చేయవలయును. అందుచే మనస్సు స్థూలాకారమును వదలి సూక్ష్మమై బ్రహ్మాకారమునొందుచున్నది. ఇదియే విజ్ఞానస్వానుభవావస్థ. గ్రీష్మకాలమున భాస్కరుని వేడిమికి వెన్నముద్ద కరిగి నిజస్వరూపమే లేకపోవుచున్నది. ఆవెన్న సూర్యుని కిరణములలో నైక్యమగుచున్నదిగదా! అటులనే స్వస్వరూప జ్యోతి వెలుగొందుచుండిన మనస్సు వెన్నవలెకరిగి స్వరూపసక్తచేసినదై పరమాత్మ స్వరూపము నొందుచున్నది. నవనీతము మాదిరియున్నది శుద్ధమనస్సు. అశుద్ధమనస్సు రాగివలె నుండునది. రాగి బాగుగా ప్రజ్వలించుచున్న యగ్నిలో కరగించవలయును. అప్పుడు ఘనీభూతమగు రాగికూడ ద్రవముగా మారును. ఈ ప్రకారము అశుద్ధమనస్సుకూడ శమదమాది ధ్యానాదులచే దీర్ఘతరధ్యానాగ్నిలో ద్రవీభూతముగా చేసిన అతిశుద్ధమై సూక్ష్మాతిసూక్ష్మమై పరమాత్మలో కలియుచున్నది. ఇట్టిమనస్సు రజోగుణభూయిష్ఠము ఉక్కువలె ఉక్కువలె నుండునది అత్యశుద్ధ మనస్సు.

ఉక్కుగూడ ప్రజ్వల్యమాన వహ్నిలోవైచి కొట్టికొట్టి కరగించి కరగించి నీరుచేయుచున్నారు. అలాగున తమోగుణముతో గూడిన మనస్సును శ్రద్ధగలిగి తీవ్రతర వ్రతములనాచరించి జప తపాదులు సల్పి కాయశోషణములగావించి సూక్ష్మావస్థను పొందింపవలయును. ఈ త్రివిధరూప మనస్సుల పరిశుద్ధికై కర్మయోగము, ఉపాసనాయోగము, జ్ఞానయోగములత్యావశ్యకములు.

శ్లో॥ కర్మాణిచిత్తశుద్ధ్యర్థం ఐకాగ్ర్యార్థముపాసనమ్
మోక్షార్థం బ్రహ్మజిజ్ఞాసా ఇతివేదాంతడిండిమః

అనగా కర్మయోగము చిత్తశుద్ధికిని, భక్తియోగము చిత్తైకాగ్రతకును.

జ్ఞానయోగము మోక్షమునకొఱకు ఆచరింపవలయు. ఈప్రకారము మనోనాశమును చేయవలయు. స్వస్వరూపస్థితిచే "ఏకాక్రియాద్వ్యర్థి కరీబభూవ" అనగా ఒకక్రియ రెండర్థములు చేయును అనుప్రకారము మనోనాశమున్ను, వాసనా క్షయమున్ను గలుగుచున్నది. చీకటి తొలగగా కనబడకుండుట యనునది వెంబడేపోవుచున్నది. ఆప్రకారము మనోనాశము కాగా వాసనలన్నియునశించును. అప్పుడు సర్వవస్తు ప్రకటనకారణమగు ప్రకాశమువలె జ్ఞానజ్యోతి వెలుగును. అట్టి జ్ఞానముచే దేహాదులయందలి ఆత్మభ్రాంతి దూరమగును. ఆత్మను పరమాత్మగా దెలిసి సర్వదా ఆత్మానుసంధానము చేయుచుండిన దేహాదులయందు నేనను భ్రాంతి. వస్తువుకాని అనాత్మపదార్థములయందు నిజమను బుద్ధితొలగును. సకల వాసనలు నిర్మూలించి యేలాటి కోరికలు లేకయుండవలయును. అధ్యాస నశింపవలయునన్న స్వస్వరూపసాక్షాత్కారస్థితిలో నెల్లప్పుడు మునుంగవలయు. అప్పుడు తనంతటతానే అనాత్మబుద్ధియు. అజ్ఞానము. దేహాధ్యాసయను భ్రాంతి నశించును. కావున నిరంతరము విరామములేకుండ మననము చేయవలయు. అందుచే సమస్తము చేకూరును. ఇక అధ్యాసయనగా మహదాది శరీర పర్యంతముగల యనాత్మపదార్థములయెడ ఆత్మభ్రాంతియేయగును. అట్టి అనాత్మవస్తువులనుండి మనస్సును మరల్చి పరమాత్మయందు లయముచేయవలయు మనోలయమనగా

శ్లో॥ లయోలయ ఇతిప్రాహుః కీదృశం లయలక్షణం
అపునర్వ్యాసనోత్థానాల్లయో విషయ విస్మృతిః

తా॥ చిత్తలయమనగా ఏవిధమైన వాసనలులేక శబ్దాదివిషయములను అనగా సకలేంద్రియార్థములను మరచుటయేయగును.

శ్లో॥ జ్ఞేయవస్తు పరిత్యాగాద్విలయం యాతిమానసం
మనసోవిలయేజాతే కైవల్యమవశిష్యతే

తా॥ జ్ఞేయములగు సకల అనాత్మ పదార్థముల వదలుటచే నేదేది మనస్సునకు గోచరించునో అద్దానినంతయు తలంపకుండుటచే మనస్సు స్వయముగా నుపశమించును. తరువాత మిగులునది పరమాత్మయను కైవల్యమే గనుక ఎంతవరకు చిత్తము చిద్రూపమందు లీనముగాలేదో అంతవరకు వాసనాక్షయముగాదు. వాసనలు ఎంతవరకు శమించలేదో అంతవరకు చిత్తముపశమించదు. ఎంతవరకు పరమాత్మ విషయక జ్ఞానము కలుగలేదో అంతవరకు చిత్తశాంతి

గలుగదు, చిత్తశాంతి ఎంతవరకు జనించలేదో అంతవరకు ఆత్మతత్త్వమును తెలిసికొనుట లేదు. అనగా మనస్సు ఎంతవరకు విషయాలనుండి మరలి ఆత్మ ధ్యానమందు నిలువలేదో అంతవరకు పరమాత్మ ప్రాప్తి గలుగదు.

మఱియు దేహాధ్యాస తొలగుటకు త్రిగుణములను తొలగించవలయు. అనగా తమోగుణము నిద్రాలస్యాది స్వభావములతో గూడినది. ఇది రజోగుణ సత్త్వగుణ ప్రయుక్తములగు అమందత్వ ప్రసన్నత్వాదిగుణములచే నశించును. దంభమాత్సర్యాది స్వభావవిశిష్ట రజోగుణము ఆధ్యాత్మికత్వ యథార్థప్రవచనాది స్వభావోపేతమగుసత్త్వగుణముచే నశించును. అట్టిసత్త్వగుణముగూడ స్వాత్మానుభవరూపవిశుద్ధసత్త్వముచే నాశనమొందును. ఈ ప్రకారము త్రిగుణములు నశించి శుద్ధసత్త్వమే మిగులుటవలన అట్టిశుద్ధసత్త్వమునే ఆశ్రయించి అనాత్మ బుద్ధిరూపభ్రాంతిని బుద్ధిమంతుడు త్యజింపవలయు. ఎప్పుడు తన ఆత్మానుభవముతోగూడి ప్రశాంతమై యుండుటయే విశుద్ధసత్త్వము. ఇట్టి స్థితియందిన ఎప్పుడును మాయాభ్రాంతి గలుగనేరదు. ఇచ్చట సత్త్వగుణము త్రిగుణముల రంజకమై గుణాతీతావస్థయగు పరమాత్మవిజ్ఞానమునకు నెంతగనో ఆధారమై మిగుల దగ్గఱగా నున్నది. ఇది అత్యంత సూక్ష్మమైనది. ఇది శరీరోపాధి యున్నంతవరకుండును. అది లేకపోయిన వ్యవహారము జరుగదు. ఇట్టి విశుద్ధసత్త్వముచేతనే మహాత్ములు వ్యవహరింతురు. త్రిగుణాతీతావస్థలో ఉన్నవారును ఇట్టివిశుద్ధ సత్త్వమనదగు సూక్ష్మాతిసూక్ష్మబుద్ధిచేతనే ప్రకృతినంటక ప్రజ్వలమగు ఆత్మతత్త్వమందు అనన్యులై యుందురు. ఈవిశుద్ధసత్త్వము బిసతంతువువలె అతిసూక్ష్మముగా నుండును. దీనినాధారము చేసికొనియే విశుద్ధజీవుడు మహాప్రజ్ఞావంతుడై శరీరకూటమగు హృదయమందు వ్యవహరించుచున్నాడు. రాజహంస తెల్లతామర పుష్పమందు విహరించుచు అందులోని మకరందము త్రావి అత్యంతానందభరితమగుచున్నది. అలాగున విశుద్ధజీవుడు నిర్మలాంతఃకరణమున క్రీడించుచు విజ్ఞానామృతమును గ్రోలుచున్నాడు. ఇదియే జ్ఞానావస్థ. ఇట్టి మహాత్ములే స్వానుభవతృప్తులగు ధీరాత్ములు.

ఇక ఈ పాంచభౌతికమయమగు శరీరము జడము. ఇందులో నేననెడి యహంకారము చేరికొని సకలము నాదియని సమస్తమును కల్పించుకొని అజ్ఞానభారము మోయుచున్నది. ఇదియే భ్రాంతిమూలము. కావున దురహంకారమును కొంచెముగూడ మిగులనీయక నిర్మూలించు కొనవలయు. దేహమునేను

అహంకారమమకారాది స్థిరచిత్తుడై అత్యంత జాగరూకతతో మాయాభ్రాంతికి లోనుకాక నిరంతర వాసనాజన్య అధ్యాసను విడనాడి ఆత్మస్వరూపముతో నుండవలయు. ఆత్మయుక్తుడై అనగా శనైః శనైరుపరమేద్బుద్ధ్యా ధృతిగృహీతయా ఆత్మసంస్థం మనః కృత్వా నకించిదపి చింతయేత్ అను గీతావాక్యమురీతిగా ధైర్యసహిత బుద్ధితో నాయా యింద్రియములను నాయా యర్థములనుండి మరలించి మనస్సును పరమాత్మలో నైక్యముచేసి అచ్ఛిన్నమయిన దానిని యేకొంచెముగూడ చింతింపవలదు. ఇదియే సులభసాధనము. మనస్సును. నిరంతర ఆత్మచింతననే అంతర్ముఖమగును. అప్పుడు అహంకార అధ్యాసముల తొలగును. స్వానుభవము ప్రకాశించును. తనయాత్మ యెట్టిమహిమగలదో తెలియగలుగును.

మరియు జీవజగత్తు లోకప్రతీత స్వప్నమువలె నెందాక భాసిల్లునో అంతవరకు తెంపులేక అధ్యాసను అనగా అనాత్మపదార్థములతోటి. తాదాత్మ్య పదార్థములతోటి తాదాత్మ్యబుద్ధిని ప్రయత్నముతో విడువవలయు. స్వప్నమే లాగున నస్పుటముగా. తోచుచున్నదో అలాగున మహాజ్ఞానులకు ప్రపంచమంతయు స్ఫుటప్రతీతముగాదు. కనుక దివ్యజ్ఞానులగువారు. లోకవ్యవహారముల నరకు గొనక తురీయమునందు సత్యత్వబుద్ధిచే విహరింతురు. జాగ్రద్దశలో స్వప్నముమిథ్యగానే యగుచున్నది. విజ్ఞానావస్థయందే జాగ్రత్ప్రపంచమున్ను. జీవుడున్ను మిథ్యగావేతోచును. యథార్థముగా విచారించిన జీవప్రపంచములుసత్యములుగావు. మాయాకల్పితములు. ఆమాయయు ఆభాసమాత్రమే. సత్యమగునది పరబ్రహ్మమే."ఏకమేవాద్వితీయంబ్రహ్మ" అను శృతి వాక్యము రీతి యున్నది. పరబ్రహ్మమే అదియే తానుగానున్నాడు. అప్పుడు జీవజగదాదులులేవు. భాసింపనే భాసింపవు. ఇదియే విజ్ఞానము. ఇంతవరకు దేహాధ్యాస గలుగుచునేయుండును. కావున మిగులశ్రద్ధతో దానిని త్యజింపవలయు. పరమాత్మధ్యానమునకనేకవిఘ్నములు గలవు. ముముక్షువు తన ధ్యానాదులకు ప్రతిబంధములయిన వాటినన్నిటిని తీవ్రవైరాగ్యముతో విడువవలయు. కొన్ని విఘ్నములు శాస్త్రములో చెప్పబడియుండవు. అయినను తన ఆత్మధ్యానమున కడ్డు తగులుచునేయుండును. వాటిని దూరము చేసికొనవలయును. ఆవిఘ్నములో మొదటిది నిద్ర. అనగా సుషుప్తి. దాని సమయములోరాక తదితర సమయములందును గ్రమ్ముకొనును. పవిత్ర కార్యములందును. గీతాది పవిత్ర సద్గ్రంథ

ఇతర సమయములందును ఆవరించుచున్నది. నిస్సంకల్పబుద్ధితో, నిశ్చలత్వముతో బ్రహ్మజ్ఞానము చేయుచున్నను నిద్రయను పెనుభూతము తెలియకనే వచ్చి, శరీరమును పడద్రోయుచున్నది. ఆనందము కలుగజేయుచున్నది. ఇదంతయు తమోగుణ స్వభావము. ఆహార దోషముచేతను నిదురించవలసినంత యమున నిద్రలేకపోవుటచేతను ధ్యానకాలమున నిద్రవచ్చును. ఇట్టి నిద్రకు చోటు ఇవ్వక కరణజాగ్రత్తతో, సూక్ష్మమతితో, తనలో పరబ్రహ్మమునే యెప్పుడు చింతించుచుండవలయును. ప్రారంభదశలో విషయములను విడిచి లోకవార్తలకై, మనస్సు పరుగిడుచుండును. శబ్దస్పర్శాది విషయములయందు చిత్తము విహరించుచుండును. ఇదంతయు రజోగుణ స్వభావము.

ధ్యానసమయమున తానుచింతింపవలసిన పరమాత్మ విషయమును మరచి ఇతరసంకల్పముల వెంబడే అంతఃకరణము పరుగిడును. ఇదియు తమోగుణమే కావున నిద్రకు లోకవార్తలకు శబ్దస్పర్శరూపాదివిషయములకు మనోవిక్షేప ఆవరణదోషములచే గలిగెడు మనస్సునకు నొకప్పుడును ఒకించుకయు అవసరము నొసగక పరమాత్మనిష్ఠలో నుండవలయు. ఈ బ్రహ్మనిష్ఠ వజ్రాయుధము వంటిది. ఇట్టినిష్ఠచే సమస్త విఘ్నములను పర్వతములు భగ్నములై తీరును.

శ్లో॥ దద్యాన్నావసరం కించిత్కామాదీనాం మనాగపి
ఆసుప్తేరామృతేః కాలం నయేద్వేదాంతచింతయా॥

తా॥ అనగా జననమొందినదిమొదలు మరణించుదనుకను వేదాంత చింతనతో కాలము గడుపవలయు. కామాదులకు లోకవార్తలకు ఇసుమంతయుగూడ అవకాశము నీయగూడదు. ధ్యానసిద్ధులగు మహాత్ములవాక్యమిది. పరమాత్మ ధ్యాన సమాధికాలమున లయము, విక్షేపము, కషాయము, రసాస్వాదములను నాలుగు విఘ్నములు జనించుచున్నవి. ఇవి ప్రధానములు, ధ్యానవిఘ్నములు.

శ్లో॥ సమాధౌక్రియమాణేతు విఘ్నాయాన్తి వై బలాత్।
అనుసంధానరాహిత్యం ఆలస్యం భోగలాలసం
లయస్తమశ్చవిక్షేపో రసాస్వాదశ్చ శూన్యతా॥
ఏవం విఘ్నబాహుళ్యం, త్యాజ్యం తద్బ్రహ్మ విజ్ఞానైః॥

ఆత్మజ్ఞానసమాధి యభ్యసించుచుండగా అనేక విఘ్నములు, తనంతటనే బలాత్కారముగా వచ్చి హృదయమున చేరుచున్నవి. అవియేవనగా అజ్ఞాన

సంధానము లేకుండుట. అంత్యము విషయ సుఖములపై వాంఛకలుగుట. చిత్త అవివేకము, చంచలము. రసాస్వాదము అనగా నేను బ్రహ్మమును పొందితినను అభిమానము ఏమి చేసిన చేయనిపోయిన అంతయు నిర్గుణమేకదాయను ఉదాసీనాహంకారము నాస్తిక్యబుద్ధి ఇంకను కొన్ని విఘ్నములు సంభవించును. కావున బ్రహ్మత్వమునుగోరువారు దుర్గుణాసక్తులై కనిపెట్టి ప్రతిబంధములు తొలగింపవలయు ఈప్రకారము సర్వదా బ్రహ్మచింతన చేయవలయు. అన్ని విఘ్నములకన్న దేహము మరుపు అనగా ఆత్మను జ్ఞప్తిలేకపోవుట ముఖ్యములు కనుక ఈశరీరము మాతాపితరుల శుక్లశోణితములచే యుత్పన్నమగుచున్నది. అందులోనే వృద్ధి. అందులోనే పెరుగుచున్నది. అనగా మలమూత్ర భాండమైయున్నది. ఈశరీరమంతయు మలమాంసరక్తముల మయమైయున్నది. ఇట్టి శరీరమంతయు అశుచిమై. చీము. క్రొవ్వు. కఫము. వాతము. పైత్యములతోగూడి రోగములకాధారమై మలమూత్రములకొంపయై యున్నది. కావున అశుద్ధ అస్థిరమగు దేహమునందలి అభిమానము వదలి పరిశుద్ధము, స్థిరమునగు పరబ్రహ్మ బుద్ధితో కృతార్థుడై యుండవలయు "బ్రహ్మభూయ కల్పతే" అని వచించుటచే మానవ జన్మమెత్తినందులకు ప్రధాన ప్రయోజనమేమనగా పరబ్రహ్మమై తన్నుతాను తెలిసికొని జనన, మరణ, దుఃఖము తరించి కృతార్థుడగుటయే. ఇట్టివాడే కడుధన్యుడు. గురువుయొక్క వాక్యపరిపాలకుడు. విజ్ఞానియగును. ఘటములోయున్న ఆకాశము, మహాకాశము యొకటియే వేరుగాదు. ఘటము పగిలిన తరువాత నాయాకాశము మహాకాశములో చేరుచున్నది. గాన ఉపాధిభేదమాత్రమే. అలాగున జీవాత్మ పరమాత్మకన్న వేరుగాదు. కనుక జీవాత్మ పరమాత్మలో కలియుచున్నాడు. ఈశరీరపారి యుండియున్నను అస్థిరముగనుక లేనిదేయని తలంప వలయును. ఈ ప్రకారము జీవాత్మ పరమాత్మయే యని తెలిసి ఐక్యపరచి సర్వదా బ్రహ్మనిష్ఠుడై పరిపూర్ణభావముతో మోసయుక్తుడై యుండవలయు అనగా యున్నది పరిపూర్ణవస్తువగు బ్రహ్మమే గనుక తదితరము భాసించదని లేకపోను తాను అసంగాత్ముడై యుండవలయు అనగా తానుమాత్రము అద్వితీయుడై పరబ్రహ్మమై యుండువాడు ధన్యుడు ఇదియే మోనము.

సర్వదా పరబ్రహ్మస్వరూపముతో సకలదృశ్యజాలమునయు యాథారమై, స్వయంప్రకాశమై అనగా సకల జగదధిష్ఠానమగు, స్వయంజ్యోతియై

స్వస్వరూపముతో తెలిసికొని సకలమునకాధారముగా తానేయయ్యు. సకలదృశ్య ప్రపంచమును శరీరమునుగూడ మలభాండమువలె విడచి అధిష్ఠానజ్ఞానము గలుగగానే దృశ్యము స్వయముగానశించును. అప్పుడు బ్రహ్మాండ, పిండాండ ముల స్ఫురణ వార్తయేలేదు. "మలభాండవత్" అని చెప్పుటచే ఇంద్రియ సంఘాతరూపమగు శరీరము, ప్రపంచము అంతమలినపదార్థములు అసహ్యకర ములు, అయినను వీటిపైనున్న అభిమానిమును వదులుట దుస్సాధ్యముగా వున్నది. స్వస్వరూపమునకెంతో భంగకరము. కావున మలభాండమునందున్న బుద్ధివలే శరీరేంద్రియ విషయ ప్రపంచములయందు హేయత్వ నీచత్వ అస హ్యత్వ బుద్ధితో నుండవలయు. బ్రహ్మను గై కొనవలయు. శాశ్వతశాంతి నొందవలయు.

ఇక అహంకారము రెండువిధములు: 1 జ్ఞానసాధనమైనది, సాత్వికా హంకారము 2 అజ్ఞానహేతువైనది. రాజస తామసాహంకారము. దేహము నేనను బుద్ధి రాజసతామసాహంకారమైనది. ఇది అజ్ఞానమును పోనివ్వక వృద్ధి చేయును. బంధమునకు దుఃఖమునకు హేతువు. సోఽహం శబ్దవిచారమగు అపరబ్రహ్మమే నేనను బుద్ధి శుద్ధసాత్వికాహంకారము. ఇది ముఖ్యహేతువు. జ్ఞానరూపము కావున దేహాదులపైనున్న అహంకారమును విడనాడి అయహం బుద్ధిని తన స్వరూప పరబ్రహ్మమందే యుంచవలయును. ఈ శరీరమందు అనేక జన్మములనుండి వెనువెంటబడగిలి వచ్చుచున్న అనాత్మ పదార్థములపై తాదాత్మ్య సంబంధముతో నున్న అహంబుద్ధి స్థిరముగా పాటుకొనియున్నది. ఈ అహంకారమే కర్తృత్వ, భోక్తృత్వ, రూపమై యనేకజన్మ పరంపరాగత శరీర సముదాయ ధారణకు ప్రధానహేతువై కూడ వుంటున్నది. ఇట్టి అనేకా నర్థ. హేతుభూత సుస్థిరాహంబుద్ధియగు. మహా అజ్ఞానారణ్యమును సోఽహం కారమనెడి ప్రజ్వలబడబాగ్నిచే దహింపవలయు. కావున సర్వదా సద్రూప చిద్రూపమైనట్టి పరమానంద రూపమయిన పరబ్రహ్మయందు అహంబుద్ధినిడి, లింగశరీరమును సూక్ష్మశరీరముయొక్క భంగముగావింపవలయు. అంతఃకర ణమే సూక్ష్మశరీరము. ఇది సోఽహంభావనచే సకల వృత్త్యుపశమాత్మకమై పరిమాత్మకారమును దాల్చుచున్నది. ఇదియే లింగశరీరభంగ రహస్యము.

ఈలింగశరీరమునుగూడదాటి ఎప్పుడును అద్వితీయ పరబ్రహ్మముగా నుండవలయును. అప్పుడు అజ్ఞానావరణరూప కారణ శరీరభంగము గలుగును.

ముందు పరమాత్మాకారముగా యుండెను. ఇప్పుడు తాను యీ పరబ్రహ్మమే యాయెను. ఈ ప్రకారము సోఽహం భావంచే స్థూల, సూక్ష్మశరీరముల యతి క్రమించుటయు. "కేవలోఽహం సర్వదా" అని చెప్పుటచే తాను పరబ్రహ్మమే. అయియున్నందుల కారణ శరీరాతీతస్థితియు(దెలియవలయు. కాబట్టి శరీరత్ర యాతీతమగు పరబ్రహ్మమునే చింతించుచు పరబ్రహ్మమునయే యుండవలయు ఇదియే జీవన్ముక్తి స్థితి. జనుడు తనశరీరపోషణకు దారాపుత్రాదుల సంరక్షణకు అనేకములగు యిడుములకు లోనగుచున్నాడు. నిద్రాహారములు లేకయు తిరుగు చున్నాడు. అనేకులనాశయించుచున్నాడు. దీనికంతయు కారణము అనాత్మ పదార్థములను తాను తనివి అనుకొనునట్టి యహంకార మమకారభావమే అందు చేతనే సంసారమును కాపాడుచు అభివృద్ధిచేయుదునని జనన మరణ రూపము నకు లోనగుచున్నాడు. ఇదియంతయు ప్రత్యక్షసిద్ధము. అనిత్యమగు దేహాదు లకే కష్టములననుభవించుచుండిన శాశ్వతానందరూపమగు పరమాత్మ ప్రాప్తికి ఎంతశ్రమపడవలయునోగదా! అదంతయు సత్పురుషుల సాంగత్యము చేతను భగవంతుని అనుగ్రహముచేతను, జన్మజన్మాంతర పుణ్యముచేతను లభించును మటియు ఒకఅద్దమునందు అంతఃపురము కనబడుచున్నది. ఆప్రతిఫలించిన యంతఃపురము మహత్తైనను దానిని సూక్ష్మమగు ఆదర్శము తనలో నిమిడ్చి కొని యున్నది. అలాగేన పరబ్రహ్మమందు జగత్తుదృశ్యమానమగుచున్నది.

"విశ్వం దర్పణ దృశ్యమాననగరీతుల్యం" అని ఆది శంకరాచార్యులు చెప్పియున్నచందమున ఈ దర్పణ సాదృశ్యముచే పరబ్రహ్మము సూక్ష్మమని తెలియవలయు. బ్రహ్మాండమంతయు బృహత్తుగాను గాంచవలయు. మహా సూక్ష్మమయిన బ్రహ్మము మహత్తైన యఖిలాండమును తనలోనిమిడ్చికొని యున్నది. "నివార శూకవత్తన్వీ పీతాభాస్వత్యణూపమా. తస్యాశ్శి ఖాయాః మధ్యే పరమాత్మా వ్యవస్థితః" నీవార ధాన్యకణాగ్రమువలె అనుపైబుద్ధి జ్యోతిరూపమై సూక్ష్మాతి సూక్ష్మమై యున్నది. దానికొనమధ్యలో పరమాత్మ యున్నాడు. అని శృతి చెప్పుచున్నది. కావుననే అతిసూక్ష్మాతిశయ బుద్ధిచేతనే మహాసూక్ష్మమగు పరబ్రహ్మము గ్రహించవలయునని చెప్పెడి రహస్యము. "దృశ్యతేత్వగ్ర్యయాబుద్ధ్యా సూక్ష్మయా, సూక్ష్మదర్శిభిః" అను శృతిచెప్పియున్నది. ఇట్టి మహిమ పరబ్రహ్మమందు గలదు. కనుకనే యది అందరికి అంచిత్యము వస్తుతః విచారించిన అద్దమునందు నగరము లేనటుల, పరబ్రహ్మమందు జగ

త్తు లేదు. అజ్ఞానముచే జగత్తున్నటులతోచును. అట్టిసకలాధిష్ఠాన పరబ్రహ్మము నేనయితివని తెలియవలయు. నీయు పరోక్షజ్ఞానముచే కృతార్థుడుగావలయు. అప్పుడు చేయతగినది చేయబడినది గాన చేయవలసినదిలేదు. మానుష్యజన్మ ఇట్టి బ్రహ్మజ్ఞానార్జన కొఱకై వచ్చినది. అది ఫలించినది కనుక మహాత్ముల సేవవలననే ఇట్టి సిద్ధావస్థ గలుగును. కావున అద్దమున్నందుననే అంతఃపుర ప్రతిబింబము గనబడినది. ఆ దర్పణము యీ ప్రతిఫలమున కాధారముగా యున్నది. ఆ ప్రకారము పరబ్రహ్మమను వస్తువున్నందువలననే జగత్ప్రతీతి గలుగుచున్నది. ఆ జగత్తునకు పరబ్రహ్మము ఆధారము కావున పరబ్రహ్మమను వస్తువు సకలాధిష్ఠానమై యున్నది. ఈసర్వాధిష్ఠాన పరబ్రహ్మమే నేనను అఖండ జ్ఞానము గలిగిన దృశ్యము పటాపంచలై పోవును.

శ్లో॥ అహంబ్రహ్మేతినియతం॥ మోక్షహేతుర్మహాత్మనామ్॥

అని యున్నందున నేను బ్రహ్మమును యను జ్ఞానము గలుగుటయే మోక్ష కారణము

అదియుంగాక పరబ్రహ్మము సత్యమైనది.

సహజసిద్ధస్వరూపమైనది. (తానేయున్నదనుట) పురాణమైనది. జ్ఞాన ప్రకాశ అద్వితీయానందమైనది. రూపములేనిది. క్రియారహితమైనది. అట్టిసచ్చిదానంద విజాద్వయారూప క్రియారహిత పరబ్రహ్మమును పొందవలయు ఈ మిథ్యాశరీరము వేషమువలెయున్నది. నటకుడు సమయానుకూలముగా స్త్రీ పురుషాది వేషములధరించి విడచి వేయుచున్నాడు. ఏమాత్రము ఆ పాత్రలను నావనిగాని, నేనవిగాని తెలియడు. విలక్షణుడై తన రూపమును మరువకనే యున్నాడు. అలాగున ఈశరీరము కర్మానుగుణ్యముగా వచ్చినది. దానికాలము నకు ఆడిపోయియేతీరును. ఆశరీరమున్నను లేకున్నను దానితోపనిలేదు. దానిపై యభిమానము వీడి తనదికాదని తెలిసి ఆ పరబ్రహ్మమే తన రూపమనుకొని దృఢనిశ్చయుడై యుండవలయు. తానుమాత్రము శరీరముకన్న వేరనియే తెలియవలయు. ఈప్రకారము తనువుమధ్యలో వచ్చినది అదిస్థిరముగాదని తెలిసికొన వలయును.

శ్లో॥ శైలూషో వేష, సద్భావాభావ, యోశ్చయథాపుమాన్।
తథైవ బ్రహ్మవిచ్ఛ్రేష్ఠ సదాబ్రహ్మైవనాపరః॥

తా॥ నటకుడు తాను స్త్రీ వేషము దాల్చినపుడును దాల్చనపుడును ఎటుల

పురుషుడుగానే యున్నాడో. అటులనే శ్రేష్ఠబ్రహ్మవేత్త తానుపాధితో కూడి యుండినను లేకపోయినను పరబ్రహ్మమే అయియున్నాడుగాని వేరుగాదు. కావున దేహాత్మ బుద్ధిని విడనాడి సదాబ్రహ్మస్వరూపముతో నుండవలయు ఇదియే జీవన్ముక్తి.

ఈ దృశ్యప్రపంచమంతయు యెటుజూచినను ఎటువిచారించినను అన్ని విధములను మిధ్యయేయగుచున్నది. ఈ దృశ్యమునుగాంచి నేను నాదియను అహంకారపదార్థము క్షణకాలముండుటవలన లేనిదే యగుచున్నది. ఒకవేళ ఈ శరీరోపాధి యున్నంతవరకు నేనను యహంకారము కొట్టుకొనుచుండును. గాఢమైననిద్ర లేక సుషుప్తిలో నేనను అహంకారభూతము యెచ్చోట మాయ మగునోగదా! ఈ అహంబుద్ధి దృశ్యము నాధారము జేసికొనియే విజృంభించు చున్నది. ఆ దృశ్యరూపమే తథ్యముగాకున్న యిదినిజమగునా. అహంకార మమకారములు బుద్ధి మొదలుగునవి క్షణకాలములో యుండునవి పరిచ్ఛిన్న ములుగావున త్రికాలములయందున్న నేను సర్వజ్ఞుడను యనువిజ్ఞానమును అహమాదుల బడయజాలవు. అట్టి జ్ఞానము వీటికెన్నటికిని సిద్ధించదు.

కేవల ఈశ్వరునకే యట్టి జ్ఞానము సిద్ధించును.

"తత్రనిరతిశయం సార్వజ్ఞబీజం" అనగా ఈశ్వరునికి విలక్షణాదీజము సర్వజ్ఞత్వము యుండునని ప్రమాణము. కాబట్టి సర్వజ్ఞుడగు పరమాత్మను స్వస్వరూపముగా చింతింపవలయు ఈ అహమాదులుతొలంగును. అహంకారనిర్వి కార స్వానుభవజ్ఞానము జనించును.

అహమనగా అహంకారము. అజ్ఞానకారము. దీనికి విలక్షణమైన మఱి యొక అహంకార పదార్థము గలదు. అది పరమాత్మ యావిషయమే సోఽహం కారము అనగా సోఽహం పదార్థము పరమాత్మయని తెలియవలయు ఆ సోఽహం పదార్థమగు పరమాత్మ అహంకార మమకారబుద్ధ్యాదులకెల్ల సాక్షిగా యున్నది. అదియేనిత్యము అనగా ప్రతిదినము నిద్రావస్థయందు పలభ్యమన మగుచునేయున్నది. కాబట్టి ఆపరమాత్మ అజము నిత్యమని శృతిస్పష్టముగా చెప్పుచున్నది. మఱియు నాయంతరాత్మ సత్తునకును. అసత్తునకును విలక్షణ మైనది.

ఈ విచారముచే పరమాత్మ ప్రపంచాతీతమని సిద్ధమగుచున్నది ప్రపంచము. 1 సత్తు 2 అసత్తని రెండువిధములుగానున్నది. సత్పదార్థ

ములు జీవేశ్వరులు అనత్ప్రతిపాదకము జడజగత్తు వీటికన్నిటికి విలక్షణమై నది పరబ్రహ్మముగావున అది సత్తుగాదు. అసత్తుగాదు. సదసత్తుగాదు అది సదసత్తుగా నున్నదవిన ప్రపంచమేయగును. సత్తైన జీవేశులు ఆత్మయనియు అసత్తైన జడము అనాత్మయనియు చెప్పవలయును. ప్రపంచధర్మములగు పంచవిధభేదములు ఆత్మకుచెప్పవలసి యుండును. ఈశ్వరుడొక్కడే జీవుల పలువిధములుగానున్నవి. వాటి భేదములు 1 జీవేశ్వరభేదము. 2 జీవజీవ పరస్పరభేదము. 3 జీవజడములభేదము. 4 జడజడములభేదము. 5 ఈశజడములభేదము. ఈ పంచవిధభేదములు పరమాత్మయందుకలవు. ఆత్మ భేదరూపము అను ఈలాంటి దోషములు సంభవించును. భేదాభేదములకతీతమగు కేవల బ్రహ్మత్వమునకు విరుద్ధమగును. కావున పరమాత్మ సదసద్విలక్షణము. ఇందుచేతనే ఆత్మ సదసత్తులకును. చేతనాచేతనములకును. ధర్మాధర్మములకును, సత్యాసత్యములకును, కార్యకారణములకును. చిదచిత్తులకును. లోకాలోకములకును, యోగక్షేమములకును, అతీతమైనది సకలద్వంద్వవ్యవహార రహితమైనది ధర్మాధర్మములు. సత్యాసత్యములు మొదలగునవి సర్వద్వంద్వములు బుద్ధికిలోబడినవి (ఆత్మబుద్ధ్యతీతమైనది పరమాత్మ అఖండపరిపూర్ణ ద్వయానంద సమరసమైనది. సర్వదాఅచంచలము సకలాతీతము నిస్త్రైగుణ్యోభవార్జున త్రిగుణములు వేదములు బుద్ధికి గోచరించునవి. తదతీతములుగావు. కావున త్రిగుణాతీతుడవుకమ్ము "నిర్యోగక్షేమ ఆత్మవాన్ నిర్ద్వంద్వః నసత్తన్నాసదుచ్యతే" అనిభగవద్గీత "ప్రకృతిః చేతనశ్చేతనానాం" తా॥ చేతనులగు బ్రహ్మాదులకును చేతనుడను "ఈ ప్రకారము వేదోపనిషత్తులు స్మృతులు ఆత్మయొక్క సకలాతీతస్థితినే ధృఢము జేయుచున్నవి. ఇదియే పరబ్రహ్మము అనిర్వచ్యము మనోవాచామగోచరవను సిద్ధాంతము" సదసత్త్వరమ్ "సత్తైజీవునకు అసత్తగు దేహమునకు విలక్షణుడు పరమాత్మయని గీతచెప్పుచున్నది."

ఆ అంతరాత్మ తనలోనున్న యాత్మవస్తువు మనోబుద్ధ్యాదీంద్రియములు దేహము ప్రకృతివశముచే క్షణక్షణము వికృతిని జెందినవిగాగావాటివి వావివికారములను తానుదెలియుచున్నదై నిర్వికారమై సాక్షియైయున్నది. క్షణక్షణము మార్పుజెందునవేవియో అవినవికారములు, తదితరము అవికారి కాబట్టి హృదయాంతర్గతమగు పరమాత్మయే నిత్యుడు అవికారియని జెప్పవర్చును. ఇది పరమాత్మస్వరూపము అనాత్మపదార్థములగు జగత్తు అనగా దృశ్యము అహంకా

నొందును. కావున బాహ్యవృత్తులు దృశ్యము దూరీకరింపబడిన అంతఃకరణ వృత్తులును దూరీకరింపబడును. కాబట్టి ముముక్షువు కార్యభూత దృశ్యనిషేధమ వశ్యముగావింపవలయును. ఇంకను కార్యము వృద్ధియగుచుండిన కారణవృద్ధియు గనుగొనవచ్చును. యెటులన ఒకచోట ధూమము (పొగ) ప్రబలముగా బయలుదేరుచుండిన దానికి కారణమగు నగ్నియు మహత్తుగా నున్నదనియే యూహింపనగును. ఒకవృక్షము పుష్పములు, ఫలములు, కాయలతో శాఖోపశాఖలతో పెరుగుచుండిన దానికి మూలమగు తల్లివేరున్ను దృఢమై పెద్దదియై యుండును. మేఘము మందమందముగా భారముగలదియై ఆకాశమందు సంచరించుచుండిన జలముతో భరితమై యుండుననియే తలంపవలయును. ఈ ప్రకారము కార్యసిద్ధిచే కారణాభివృద్ధియు గనుగొనవలయును. కాబట్టి హృదయ క్షేత్రమున శబ్దస్పర్శ రసరూపవనితాది విషయవృక్షము సంకల్ప, వికల్ప శాఖోపశాఖలతో విస్తృతమై వృద్ధిగాంచుచుండినచో తత్కారణమగు అజ్ఞాన బీజము ప్రబలమైయున్నదనియే నెంచవలయు. ఎంతవరకు వృత్తులు దయించుచుండునో అంతవరకు అవిద్యసంపూర్ణముగా నశించలేదనియే స్పష్టమగును. ఇందుచేతనే కార్యకారణములతోసహ అజ్ఞానమును తత్కార్యదృశ్యమును ముముక్షువు నశింపజేయవలయును. అప్పుడే నిర్వాసనాస్థితి గలుగును.

ఇక హృదయాంతఃకరణమున కారణభూతమలిన సంస్కారములు హత్తుకొనియుండిన కార్యభూతదుష్టసంకల్పములు మలినవృత్తులు అవివేకము మొదలయినవి పుంఖాను పుంఖములుగా నావిర్భవించుచునేయుండును. సముద్రములో వాయువున్నంతవరకు తరంగములుపశమింపవు. అలాగున హృదయములో అజ్ఞానబీజమున్నంతవరకు వృత్తులుపశమింపవు. దుర్వృత్తులు ప్రవర్ధమానమగుచుండిన వాటికి కారణభూతమలిన సంస్కారములును ప్రబలమగుచునే యుండును. కావున కారణవృద్ధిచే కార్యవృద్ధియు కార్యవృద్ధిచే కారణాభివృద్ధియు గలుగుచునేయుండును. అటులనే కారణనాశముచే కార్యనాశము కార్యనాశముచే కారణనాశనము గలుగునని తెలియవలయు. జన్మపరంపరలకు సంసారసహితమగు వృత్తులే కారణములు. ఆవాసనలచేతనే తిరుగా జన్మమరణములు గలుగుచున్నవి. జన్మవచ్చినందుచేతనే నానావిధవృత్తులు వాటికనుకూలమగు సంస్కారములు యేర్పడుచున్నవి. ఈలాగున సంసారము నివర్తించుటలేదు. ప్రవాహరూపముగా సంస్కారబలిమిచే జన్మలు వచ్చుచునేయున్నవి. కాబట్టి

ముముక్షువు శ్రద్ధగలిగి సంస్కారములు నశింపజేసికొనవలయును. కార్యకారణములు నశింపజేసినవారు సంసారబంధముక్తుడగుచున్నాడు.

పవిత్రమగు శుద్ధకర్మలు శుద్ధసంకల్పములచే మలిన సంకల్పములను పుణ్యపురుషుల స్నేహము పుణ్యకర్మానుష్ఠానముచే పాపబుద్ధిని దూరీకరించిన స్వానుభవ జ్ఞానముచే పిమ్మట శుద్ధసంకల్పములను వీడి పుణ్యాతీతుడునై ఇప్పుటనే ఈశరీరమున్నప్పుడే ముక్తుడగుచున్నాడు.

అజ్ఞానముయొక్క బలిమిచే జన్మజన్మాంతరములనుండియున్న మలిన సంస్కారము (అనాత్మభావన) ఆత్మేతరవిషయములను సంకల్పించుటచేతను తదనుగుణ కార్యములాచరించుటచేతను అనంతముగా వృద్ధిపొందినదై సంసారమును జీవునకు కలుగజేయుచున్నవి. అనగా ఉత్తరోత్తర జన్మలకు గూడ సంస్కారణమేకారణమై జీవుని జననమరణరూప సంసారవారిధిలో పడవేయుచున్నదని తెలియవలయును. తనయొక్క అనాత్మభావనయే అజ్ఞానమునకు తజ్జన్యకార్యములకు హేతువని తెలియవలయు. కావున జన్మపరంపరాగత సుస్థిరసంస్కారము అనాత్మభావనలు తత్కార్యములు. ఈ మూడింటిని నాశమొనరించు యుపాయమును పరాకులేక సర్వకాల సర్వావస్థలయందును చేయవలెను.

ఈశరీరమున్నంతవరకు జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్థలు తప్పవు. అవి యున్నంతవరకును సంస్కారములు గలుగుటకవకాశమేర్పడుచునే యుండును కాబట్టి యెప్పుడును పైజెప్పిన మూడింటిని నాశమొనరించు యుపాయమును ఆచరించవలయును.

శ్లో॥ సంసారేఽస్మిన్ మహావృక్షే బీజభూతాహి వాసనాః
అనాత్మభావనాస్సర్వా స్పందరూపేణ సంస్థితాః॥

॥తా॥ అనగా సంసారమను మహావృక్షమునకు మలిన వాసనలు బీజములగా యున్నవి. అందున అనాత్మభావనలన్నియు వృక్షమునకు మొదలుగాయున్నవి వాని కార్యములగు సర్వవిషయాదులు సర్వశాఖోపశాఖలుగా నుంటున్నవి. సంసారమను అజ్ఞానవృక్షము హృదయక్షేత్రమున సంస్కారబీజములచే నాటబడి అనాత్మసంకల్పస్కంధములతో వృద్ధిజెంది విషయసుఖాది శాఖోపశాఖలతో విస్తరిల్లియున్నది అట్టానిని శమదమగుణములుగల జితేంద్రియుడగు ధీరుడైన బుద్ధిమంతుడు అనగా ముముక్షువు, యెల్లప్పుడు జాగరూకతతో విజ్ఞాన

మహాఖడ్గముచే అవశ్యము ఛేదింపబడియు అప్పుడే పరమశాంతిచేకూరును. కనుక సకల దృశ్యవ్యాపకములు సంకల్పములు. వాటిచే గావింపబడు సకలకార్యములు అజ్ఞానముచే గలుగుచున్నవి. అజ్ఞానమనగా తననుతాను దెలియకపోవుట చేతనే జీవత్వమును సంసారగతియును వాటిల్లుచున్నది. కావున తాను ఆ పరమాత్మయే ఆత్మయనగా బ్రహ్మయేయని తెలిసికొని సోఽహం భావనారూఢుడై బ్రహ్మస్వరూపుడగు విజ్ఞాని అజ్ఞానమును నశింపజేసినవాడగుచున్నాడు.

అన్నిచోట్లను అన్నికాలములయందును అంతటను అపరబ్రహ్మమే పూర్ణమైయున్నది.

శ్లో॥ దృష్టింబ్రహ్మమయీంకృత్వా. సంపశ్యేత్

అనురీతిగా దృష్టిని బ్రహ్మమయముగా జేసి చూడవలయును ॥శ్రుతి॥ కావున. ఇదియంతయు బ్రహ్మమే అను బ్రహ్మదృష్టిచే॥ సోఽహం శివోఽహం అహంబ్రహ్మస్మి॥ మొదలగు మహావాక్యములచే బోధితమగు పరబ్రహ్మభావము. క్రమముగా దృఢపడుచున్నది. ఇట్టి బ్రహ్మభావనా దార్ఢ్యముచే అనాత్మభావనలు వాటికారణమగు సంస్కారములు వాటిచేనావహిల్లెడు సంసార సంతతి ఈమూడును లయమొందుచున్నవి. ఇందుచే తాను పరబ్రహ్మమగుచున్నాడు. మరియు.

సంస్కారములనగా నజ్ఞానమును విడిచివేరుగాలేవు. అజ్ఞానమే సంస్కారములు. అజ్ఞానము బీజరూపముగానుండుటయే సంస్కారమని పెద్దలు వచించెదరు.

ఇట్టి బీజరూప సంస్కారసంజాతమే అనేకజన్మములనుండి జీవుని వెనువెంట వచ్చుచున్నది. దీనినే అవిద్యాగ్రంథియనియు. మూలప్రకృతియనియు. అవిద్యాబీజమనియు. మోహమనియు. అరిషడ్వర్గములనియు. మాయయనియు పరిభాషా పదములతో వేదాంతులు వ్యవహరింతురు. ఇంతకు దీనికార్యమేమనగా ప్రజ్ఞారూప స్వస్వరూపమును మరుగుపరచి విస్మరింప (అనగామరిపించి తెలివియక) జేయుటయేయగును. కావున సకల బీజరూప వాసనలయొక్క విశ్లేష నాశమే మోక్షము. ఇదియే అవిద్యాగ్రంథి విచ్ఛిత్తియగును. ఈ యజ్ఞానమను ముడి తొలగిన ప్రతిబింబరహితమై ఆనందవిస్ఫూర్తి జనించును. ఇదియే జీవన్ముక్తి. కావున సకల సంస్కారనాశము ముముక్షువుచే జేయదగియున్నది. వాసన యనగా మలినావస్థలతో గూడిన అజ్ఞాన బీజము. తద్వ్యాప్తి యంతః

కరణమున అల్లుకొని యుండుటయేవృత్తి అవృత్తివలన బీజమునుండి జలసేచనముచే మొలకలు బయటికి వచ్చునటుల కర్మపరిపాకముచే సంకల్పములు గలుగుచున్నవి. ఆసంకల్పములచే ననేకవిధ కార్యములు జేయుచున్నారు. బీజాంకురమే ప్రవృద్ధమై కొమ్మలతో నొప్పారునటుల నీసంకల్పాంకురములే ప్రవర్ధమానములై కార్యకరణరూపకొమ్మలు గలవియగుచున్నవి. అనగా మొదట బీజము తరువాత నంకురము తరువాత కొమ్మలు ఈ ప్రకారము వృక్షమేర్పడునటుల సంస్కారములు సంకల్పములు కార్యములు ఈవిధముగా పరిణమించి సంసారవృక్షమేర్పడుచున్నది. వృక్షము సమూలముగా నాశము జేయ దలసినచో కొమ్మలను ఛేదించి తరువాత మొదటి భాగమును నరికి వేరులను గూడ ఛేదించుచున్నారు. అందుచే వృక్షనాశముగలుగును. అలాగున హృదయమున అనేక చింతలు కలుగుచున్నవి ఆ సంకల్పానుసారముగా జీవుడు కార్యములు జేసినచో నాసంకల్పములు పెరుగుచునేయుండును.

అట్లుగాక సంసారబలిమిచే చింతలుదయించినను తత్సంబంధకార్యములు జేయకుండిన కట్టెలులేనిచో అగ్నిస్వయముగా నశించినటుల నీచింతాగ్నియు స్వయముగనే శాంతిల్లును. తరువాత నగ్నియు భస్మమగునటుల చింతయు పూర్తిగా నశించిపోవును. అందుచే సంస్కారములు గూడ లేకపోవును. ఏ యొక్క సంస్కారములు వృత్తులు, గుణములు లేకపోవుటయే సంపూర్ణవాసనా రాహిత్యమగును ఇదియే మోక్షము దీనినే జీవన్ముక్తియని చెప్పుచున్నారు. మఱియు నెంతటి మహావృక్షమైనను పైజెప్పిన క్రమముగాక త్రవ్వికుంకుటి వ్రేళ్ళను ముందుగా నుపాయముతో ఛేదించిన నామహావృక్షము సమూలముగా కూలిపోవును. అలాగున మహాధీరులైన ప్రజ్ఞావంతులు అనేకజన్మములనుండి అనాదిగానాటుకొని ప్రవర్ధమానమైయున్న ఈ సంసారవృక్షమును జితేంద్రియులై, నిష్కాములై, నిరంతరస్వరూప ధ్యానసిద్ధులై, విశాలహృదయులై, అహంబ్రహ్మాస్మి॥ నేను బ్రహ్మమును అను విజ్ఞానఖడ్గముచే సకలసంస్కారమను వ్రేళ్ళను ఛేదించి అజ్ఞానధ్వంసకులై పరమానంద జ్ఞానస్వరూపులై తృప్తినెందుచున్నారు.

ఇక అంధకారమెంతగొప్పదిగానున్నను అనాదిసిద్ధమైయున్నను సూర్యకిరణ ప్రసారముగలుగగానే లెస్సగాకనబడకనేపోవును. అటిరువ నహంకార మమకారాది వాసనలు మిగులపడియున్నను తద్వారా అజ్ఞానామిశ్రమము

అనాదిసిద్ధమై విజృంభించుచుండినను అదియంతయు నేను పరబ్రహ్మను వేఱు గాదు సచ్చిదానందస్వరూపుడను అనుద్భూత ప్రజ్ఞాజ్యోతిస్వరూప ప్రజ్వాల్యమై తత్సంస్కారము అంతఃకరణమున స్థిరముగా నాటుకొనెనేని అట్టిదృఢతర పరబ్రహ్మవాసనా భాస్కర భాస్వరప్రభ సమర్థమగు చున్నదని తెలియవలయు. మఱియు నంధకారము గుహయంతయు వ్యాపించియున్నను అటులనే గృహములలోను పూర్తిగా వ్యాపించినను అలాగున ప్రపంచమంతయు నీతిమిరము కాటుకవృష్టివలె ప్రసరించి యున్నది. ఈ అంధకారకార్యమేమనగా నున్న వస్తువుదెలియనీయకస్థాణువును పురుషునివలెను లేక పిశాచమువలెను తోపింపజేయుచు యదార్థము దెలియజేయకుండుటగును.

ఆకాలముననందఱు ప్రజ్ఞనువదలి సకలవ్యవహారములనుడిగి నిద్రింతురు. అటులనే నీయజ్ఞానమహాతిమిరము సర్వభూతహృదయ కుహరములలో వ్యాపించినదై రజ్జుసర్ప న్యాయమున లేక శుక్తిరజితన్యాయమున మధ్యాభూతమగు నీప్రపంచమునంతయు సత్యముగా దోపింపజేయుచు దీర్ఘతర మహాసంసార సుషుప్తియందు జీవులను ప్రజ్ఞావిరహితులనుగా జేయుచు సర్వాత్మబుద్ధిని కప్పిపుచ్చి జ్ఞానవిరహితదశలో బరుండునటుల జేయుచున్నది. ఐనను గుహలలోకాని గృహములలోకాని మహానిబిడమై వ్యాపించియున్న చీకటిని పారద్రోలుటకు అంధకారమంత దీపమావశ్యకములేదు. ఒక చిన్నదీపము వెలిగించినను తక్షణమే యా చీకటియంతయు బరుగిడుచున్నది. దీపమున్నంత వరకు యేమూలనుండియు చీకటిదీపముదరికిరాదు. అలాగున శ్రద్ధచే వివేకము ఆత్మానాత్మ విచక్షణత్వము గలిగి నిరంతర స్వస్వరూప ధ్యానపరుడగు ముముక్షువునకు యేమరుపాటులేని 'అహం బ్రహ్మాస్మి' అను జ్ఞానము కొద్దిగా గల్గినను బహుకాలమునుండి హృదయములోనే స్థిరముగానున్న యజ్ఞానంధకారము తొలగిపోవును. ఈ స్వానుభవజ్ఞానము స్థిరముగా నారూఢమైనచో సహస్రకిరణుడు సహస్రముఖ ముఖములుగా వ్యాపించి కిరణప్రసారము చేతనే చీకటినంతయు వెళ్ళగొట్టునటుల నీమహారూఢవిజ్ఞానముకూడ ప్రపంచమంతయు పరబ్రహ్మమయముగా జేయుచు సర్వవ్యాప్తమగును. ఇదేవిషయమును సద్వాసనా స్ఫూర్తి విజృంభణే, అనువాక్యముచే విదితమైనది. అనగా హృదయమున సద్వాసనలు మలినవాసనలు రెండును యుంటున్నవి. సద్వాసనలనగా శుద్ధసంస్కారములు, ముక్తిహేతువులు. మలినవాసనలనగా అశుద్ధసంస్కారములు

జన్మమరణ సంస్కారమునకు కారణములు స్నానశౌచములు దానధర్మములు
జపతపములు బ్రహ్మవిచారముచే బ్రహ్మము తాను దృఢభావనలు ఇత్యాదు
లన్ని సద్వాసనలకు జెందినవి. పరబ్రహ్మమునకు గమనముగా యున్నవి. అజ్ఞా
జన్మములైన దేహ నాదియను అహంకార మమకార వాసనలు మలినములు
మోక్షప్రతిబంధకములై సంసారానుబంధములై యున్నవి. అందులో సత్త్వ
మైనవారు అసద్వాసనలను మలినవృత్తులను దరిజేరనీయక సద్వాసనల నా(
యించినవారలై పరబ్రహ్మ భావనారూఢులై మోక్షధామము నధిష్ఠించియు
దురు. ఇకమధ్యములుగానున్నవారు కొన్ని సంస్కారముల నావహించినను అ
ప్రకృతిసిద్ధములని గుర్తెఱింగి విచారజ్ఞానముచే బ్రహ్మవిషయక సంస్కా
రములనే బలపరచుచు మలినవాసనల తిరస్కరించుచు నిత్యనియమనిష్ఠా పర
యణులై యుందురు. వీరును ప్రకృతికి చోటియ్యకుండనడిన కొంతకాలమునక
సాధనద్వారా యుత్తములగుదురు మధ్యములలోనే మఱియొకతెగ గలవార
గలరు. వీరు శుద్ధాశుద్ధ వాసనల సమానముగా గలవారు కొంచెము పట్టుదల
యుండి ప్రయత్నించిన ఉత్తములగుదురు. ఇక కనిష్ఠులలో పూర్వజన్మ
సుకృత విశేషలేశముచే శుద్ధసంస్కారములగు వైరాగ్య భక్త్యాదులు కొద్దికొ
గా పొడసూపుచుండినను మలిన వాసనలు ప్రబలముగాయున్నందున తిరుగ
సంసారప్రవృత్తులైన అహమాదికారములందే ప్రవర్తింతురు. వీరలు కర్మో
పాసనలు నిరంతరము చేయుచుండవలయును. ఇకను ఉత్తమోత్తములన్నార
ఈ ప్రజ్ఞానిధులు ముందుగనే ప్రకృతిరహస్యమును గుర్తెఱింగిన వారగుటచేతను
యా ప్రకృతిని నిరసించిన వారగుటచేతను నిరావరణ బ్రహ్మతత్త్వము నొందిన
వారగుటచేతను సద్వాసనా అసద్వాసనలకతీతమగు పరబ్రహ్మమయ్యే యుందురు
వీరే అఖండ పరిపూర్ణజ్ఞానులు. రాత్రియనగా చీకటి బాహ్యప్రపంచమును
మాత్రము కప్పివేయును. బాహ్యవస్తువులనే తెలియనీయజాలదు. అంతమాత్ర
మే ఈ బాహ్యాంధకారము దీపములచేతను లేక విద్యుద్దీపములచేతను పోవు
చున్నది. సూర్యప్రకాశముచే పూర్తిగా లేకపోవును. ఇకను అజ్ఞానాంధకారమ
నునది మఱియొకచీకటిగలదు. ఇది అందరియొక్క హృదయములలోను అనా
దిగానుండుచు గుహలో సూర్యునికిగూడ సాధ్యపడని పెనుజీకటివలె హృదయ
గుహలో స్థిరముగాయున్నది. ఈ చీకటి సూర్యప్రకాశముచే నశించునదిగాదు.
దీని విషయము శ్రద్ధతో విచారింపవలయు ఈయజ్ఞానతిమిరముగూడ పైచెప్ప

బడిన చీకటివలె అందరియందు వ్యాపించియుండి యున్నవస్తువును ఉన్నటుల తెలియజేయకయున్నది. చీకటి యెట్లు తనశరీరము కనబడునటుల చేయువిధమున ఈ అజ్ఞానాంధకారము తనయాత్మ స్వరూపమును కప్పివుచ్చుచున్నది. విజ్ఞానమను నేత్రమును లేకుండాచేయుచున్నది. అందువలననే ఈ యజ్ఞానము నకును అంధస్సని పేరువచ్చెను. మఱియు నిది అంతఃకరణమందు లోపల వ్యాపించి అంతరాత్మను తెలియజేయకుండుటయేగాక బయటఁగూడ వ్యాపించి విజృంభించినదై, బ్రహ్మస్వరూపమగు ప్రపంచమంతయు బ్రహ్మరూపముగా తెలియజేయనీయక భ్రాంతినే గలుగజేయుచున్నది. విచారించిన ఈ అజ్ఞానతమస్సు బాహ్యాభ్యంతరములయందును గ్రమ్ముకొనినదై బహిరంతరములయందును పరిపూర్ణమైయున్న స్వస్వరూపపరమాత్మను తెలియజేయుటలేదు ఇట్టి అనంత దురంత హేతువగు అజ్ఞానంధాకారనాశమునకై ముముక్షువులగు సాధకులు మంత్ర జపధ్యాన సమాధినిష్ఠలను చిన్నచిన్నదీపములను వెలిగించుకొనుచున్నారు. మఱికొందఱు ప్రజ్ఞావంతులు దీర్ఘతర తపోనిష్ఠనియమములను పెద్దపెద్ద దీపములను వృద్ధి జేసుకొనుచున్నారు. ఇంకను కొందఱు మహాత్ములు స్వస్వరూప ధ్యాననిష్ఠులై జలమునుండి ఆవిరిని తీసి దినిచే విద్యుద్దీపములు తంతులద్వారా ప్రకాశింపజేయునటుల తనయొక్క అంతఃకరణమను జలరాశిని మనోయంత్రముచే ధ్యానమను మధనముచేసి ఆత్మప్రకాశశక్తియను విద్యుచ్ఛక్తి బడసినవారై దేహములోపములనుండు నరములద్వారా ప్రకాశింపజేయుచు ఆత్మనుపరమాత్మను తెలియుచున్నారు. ఇకను అఖండ పరిపూర్ణ జ్ఞానులైనవారలు పరమాత్మయొక్క అనంతమగు కరుణచే అఖండపరిపూర్ణ విజ్ఞానమను భాస్కరోదయము గలుగగా పరిపూర్ణముగా అజ్ఞానాంధకారము నశించి మహాస్వామభవ జ్ఞానమనబడు పగటియందున్నవారై స్వాత్మవిస్మృతి యను చిద్రనుండి మేల్కాంచినవారై స్వస్వరూపస్థియందు జాగ్రత్తగలవారలై పరబ్రహ్మమందు విహరించుచున్నారు. వీరు అఖండాత్మ శక్తిగలవారు ముందు జెప్పబడినదీపములు గాని విద్యుద్దీపముల వంటి జ్ఞానములు, స్థిరములుగావు. అఖండాత్మశక్తితోగూడిన విజ్ఞానమను సూర్యుడో యెప్పుడును నశించువాడు కాడు స్థిరడాయుండువాడు.

ఇక విచారించిన సూర్యుడుఎల్లప్పుడును ప్రకాశించుచునే యున్నాడు. అయనకు ఉదయాస్తమయములులేవు. భూమి యొక్క గతిచేతనే రాత్రింబ

వత్ను తోర్పుచుచున్నవి. అలాగున బ్రహ్మానాత్మస్వరూప జ్ఞానమున్నవారును విశ్వాతీతోరూపులై యున్నారు. అపరమాత్మతత్వకాల సూర్యానస్తమయుడును స్వయంప్రకాశమానుడు. అంతఃకరణ భేదమునే ఆత్మయొక్క ప్రకాశములేర్పడు చుండును. అంతమాత్రమే వేరుకాదు. అంతయు నక బ్రహ్మమే. నిరావరణమై సర్వపరిపూర్ణమై అనంత తేజోవిజ్ఞానరూపమై యున్నది. దానియందు అజ్ఞాన మనునదిలేదు. శివమై అద్వయమై పరిపూర్ణ బ్రహ్మమే తత్పదార్థము పరమా నందస్వరూపము. "మనదుఃఖగంధః" అను వాక్యముచే దుఃఖలవలేశములేనిదై యున్నది. అనగా అఖండాత్మరసానుభవము గలిగిన కొంచెము దుఃఖముగూడ యుండదు. అంతయు ఆనందమయముగనే యుండును. అజ్ఞానముండిన కదా, దుఃఖముగలుగును. అదియే లేనప్పుడు శోకమెక్కడిది "కోమోహః కశ్శోకః ఏకత్వమను పశ్యతః" జీవబ్రహ్మైక్యజ్ఞాను అభేదమును చూచువానికి శోక మోహములుండవు. అని శ్రుతియు పైచెప్పినదానినే తెలుపుచున్నది. ఆ బ్రహ్మానుభవము అమృతమయము. అదెటులనగా ప్రచండ సూర్యుడు తేజో మయుడై ప్రజ్వరిల్లుచుండగా అచ్చోటనే కొద్దిచీకటియైన యుండదుగదా. అటులనే పూర్ణమనాడు పరిపూర్ణ చంద్రుడు పండువెన్నెలతో ప్రకాశించుచుం డగా తాపముండదు. అంతయు చల్లదనమేయుండును. చీకటియుండదు. అటు గనే జ్ఞానసూర్యుడు దేదీప్యమానముగ వెలిగిన అజ్ఞానమయమైన చీకటి యెక్కడుండ గలదు. అటులనే జ్ఞానజ్యోతిర్మయమే అద్భుత ప్రకాశములేదు. మరియు పరమశాంతియను పరిపూర్ణత్వము సర్వత్రవ్యాప్తమై యుండగా సంసారదుఃఖ తాపములుండునా? శోకతిమిరముండగలుగునా? ఉండదు. ఒకవేళ అంధకార ముండిన సూర్యోదయము చంద్రోదయము కానట్లు తెలియవలయును. కావున స్వస్వరూప దివ్యానుభవము నిశ్చయముగా గలిగియుండిన దుఃఖమనునది యుండదు. వారి వ్యవహారమంతయు ప్రశాంతమై ప్రసన్నమై యుండును. వారు ఆత్మప్రబోధ చంద్రోదయముచే పరిపూర్ణ సుశాంతి రూపచంద్ర కిరణ ములలో విహరించుచుందురు. ఏరిపెలుంగుదలుదుగా యుందురు.

మరియు ఒకవేళ మలిన కర్మవాసనాదులు పూర్తిగా నశించక మిగిలి యుండిన యెడలను ఇంకను కొన్ని సంస్కారములు విశేషముగా నశించక యుండిన యెడలను హృదయమందు విక్షేపములు గలుగవచ్చును. దృశ్యము గూడ స్ఫురించి విజృంభించవచ్చును. అట్టి యెడ పరల విక్షేపనాశనమునకై

బాహ్యేంద్రియ అంతరేంద్రియముల నిగ్రహించినవాడై బహిరంతరముల యందు పరిపూర్ణమై యుండు పరబ్రహ్మమందు చక్కగానుంచబడిన మనస్సు గలవాడై ముముక్షువు దృశ్యమునకేమాత్రము అవకాశమునొసంగక దృశ్యమును కొంచముగూడ స్ఫురింపనీయక అద్దానిని, వివేకముచే నశింపజేయుచు, స్వరూపుడై ఆనందఘనుడై, ధైర్యము విడువక పరబ్రహ్మమై యుండవలయు అప్పుడు ప్రకృతి పటాపంచలగును. ఈ రీతిగా పరమానందముతో ప్రజ్ఞానఘనముతో పరమాత్మయందు విహరించుచు పరిపూర్ణబ్రహ్మమై కాలము గడుపవలయు. ఒకప్పుడు దృశ్యము తోచుచుండిన దృక్కగు ఆత్మయందు చిత్తమునకు స్థిరత్వముగలిగెనేని దృశ్యమునశించి దృక్కైన ఆత్మయై యుండగలుగును. సాధకుడు తన నియమితకార్యమగు బ్రహ్మనిష్ఠను చేయకయు స్వస్వరూపమును మఱచియుండుటయు మాటలుమాత్రము గొప్పగా చెప్పుకొనుటయే గొప్పప్రమాదము దీనికన్న మరణము ముముక్షువులకు మరియొకటిలేదు. తనను తాను మరచియుండుటయే మహాప్రమాదము. అది మృత్యువుయని భారతమందు సనత్సుజాతీయమందునను సనత్సుజాతుడు ధృతరాష్ట్ర మహారాజునకు చెప్పెను. కావున శరీరమును విడచుట బ్రహ్మజ్ఞానులకు మరణము కాజాలదు. తమయున్నతస్థితి నుండి జారిపోవుటయే గొప్ప ప్రమాదము. మరణము తన స్వరూపమునుమరచి అజ్ఞానములో పడియుండుటయే జీవునియొక్క అనంతత్వమును అనంతసుఖమును అడుగుపరచినందుచే జీవహింసయనియును ఆత్మహింసయనియు ముఖ్యముగా వేదాంతశాస్త్రములలో చెప్పియున్నారు. అద్దానినే బ్రహ్మమానసపుత్రుడు అనగా సనత్సుజాతుడు వచించెను. ప్రమాదమనగా దృశ్యమును ఆత్మలో స్ఫురించునటుల చేయుటయేయగును. కావున దృశ్యమును ఆత్మలో చొరనీయక దృశ్యమగు అనాత్మభావమును వీడి హృదయమున సర్వదా ఆత్మభావనను వీడకయుండుటయే ప్రమాదరాహిత్యమగును. అప్పుడు తాను సర్వావరణ రహితుడై స్వయంజ్యోతి స్వరూపుడగుచున్నాడు. ఈ ప్రమాదవిషయమై భగవద్గీతా వాక్యమును చూడుడు.

శ్లో॥ ధ్యాయతో విషయాన్పుంస, స్సంగస్తేషూపజాయతే,
సంగాత్సంజాయతేకామః, కామాత్క్రోధోఽభిజాయతే

శ్లో॥ క్రోధాద్భవతిసమ్మోహః సమ్మోహాత్స్మృతి విభ్రమః
స్మృతిభ్రంశాద్బుద్ధినాశో బుద్ధినాశాత్ప్రణశ్యతి॥

॥తా॥ అనగా ధ్యానమును మరచి ఇతర విషయధ్యానరూప ప్రమాదము వలన దృశ్యవిషయ సంబంధము గలుగుచున్నది. విషయసంగముచే కామము. కామత్వముచే క్రోధము. దానిచే మోహము. దానిచే స్మరణము లేకుండుట ఇటుల వరుసగా గలుగుచున్నవి. స్మృతి నాశముచే బుద్ధినశించుచున్నది. బుద్ధియే లేకుండిన పురుషుడు పతితుడగుచున్నాడు. గనుక ప్రమాదమునకు కొంచెము సందిచ్చినచో ఆమరపుచేయు అనర్థములు అనంతములు. ఇందుచేతనే పురుషుడు బ్రతికియుండగనే మరుపు మృత్యువని పెద్దలు తలంచిరి. కావున ప్రకృతి ప్రమాదములోబడక జాగరూకులై ముముక్షువులు నిరంతర బ్రహ్మనిష్ఠాపరులయి స్వానుభూతిని పొంది శాశ్వతసుఖము బడయవలయు.

ఇక జ్ఞాననిష్ఠగలవానికి స్వస్వరూప ప్రచ్యుతియను ప్రమాదము కన్న మించినచేటు వేరొక్కటిలేదు ఆమరపను ప్రమాదము వలన మోహమును. ఆమోహము వలన కర్తృత్వ భోక్తృత్వరూప అహంకారము. ఆ యహంకారము వలన సంసారబంధమును. ఆ బంధము వలన జననమరణాది దుఃఖము ఇవి యన్నియు వరుసగా గలుగుచున్నవి. కావున ఆత్మను మరచి యుండుటను ప్రమాదమెప్పటికి గానీయరాదు. కాబట్టి సంతత తైలధారవలె అవిచ్ఛిన్నముగ అంతర్లక్ష్యము ప్రత్యగభిన్న పరమాత్మయందే నిలిపి ఆ లక్ష్యమును మరవకుండ వలెనని తెలియవలయును. "ఇందుకు" ప్రమాణశ్లోకము

శ్లో॥ న ప్రమాదోఽత్ర కర్తవ్యో విదుషా మోక్షమిచ్ఛతా
ప్రమాదే విజృంభతే మాయా సూర్యాపాయేఽంధతమా ఇవ॥

॥తా॥ అనగా మోక్షమునుగోరు ఆత్మధ్యానయోగి సోమరితనమును ఆశ్రయించగూడదు. అలస్య అశ్రద్ధలను మరపును మహా ప్రమాదమగును. సూర్యుడు లేకపోగా రాత్రియందు చీకటివలె మాయ విజృంభించును. గనుక ముముక్షువులు సర్వదా ప్రమాద రహితులై బ్రహ్మనిష్ఠయందుండవలయును. ఇదే విషయమును పాతంజలయోగసూత్రమున చెప్పియున్నారు. "సూత్రము" అభ్యాసవైరాగ్యాభ్యాం తన్నిరోధః॥ అనగా అభ్యాసవైరాగ్యములచే యంతఃకరణ వృత్తులను నిరోధించుచుండవలయును. తత్రస్థితౌయత్నోఽభ్యాసః॥ బ్రహ్మనిష్ఠయందు నిరంతరముండుటకు ప్రయత్నించుటయే అభ్యాసము. "సతు దీర్ఘకాలనైరంతర్య సత్కారసేవితో దృఢభూమిః" అనగా ఆ యభ్యాసము చాలాకాలము,నిరంతరము అత్యంత ఆదరము ప్రీతితో కూడుకొనిన సుస్థిరత్వ

మొందును. ముముక్షువు మొట్టమొదట దీర్ఘతర వైరాగ్యముతో ప్రపంచమం తయు మిథ్యయనియు దుఃఖకరమనియు బ్రహ్మమే సత్యమనియు ఆనందకర మనియు తలంచి బ్రహ్మధ్యానమునకు ప్రారంభించవలయు సద్గురుకరుణయు దైవానుగ్రహమున సత్కర్మాచరణయు మహాత్ముల సాంగత్యము పరిపూర్ణ ముగా లేనందుచే (ప్రమాదమనునది) ఈవేళ ఇంతమట్టుకు ధ్యానము చాలును. రేపు మంచిదినము ధ్యానము ఇంకకొంతయెక్కువ కాలము చేయుదుము. కొం చెము కొంచెముగా ధ్యానముచేయుట మంచిది. దీర్ఘముగా ధ్యానము చేసిన వ్యాధులు వచ్చును. అని తలంచుటయు ఆకలిలేనివాని భోజన ప్రవృత్తివలె మెల్లమెల్లగా కొంచెము కొంచెముగా బ్రహ్మధ్యానమునందు ప్రవర్తించుట పుణ్యసంస్కారము లేనందుచే మధ్యమధ్య బ్రహ్మధ్యానము వదలుట స్వరూపస్థితిని మరచియుండుట అంతయు తెలిసినటుల నటించుట ఇవన్నియు చెట్టునకు వేరుపురుగువలె తెలియకనే మెల్లగాచేరుకొని బ్రహ్మనిష్ఠుని అధః పతితుని జేయుచున్నది. బ్రహ్మనిష్ఠనుండి జారిపోకుండుటకు పెద్దలసేవయు వారికరుణయు పూర్తిగా నుండవలయు స్థిరతర బ్రహ్మధ్యానము బ్రహ్మ ప్రాప్తి యొకేజన్మమునందు లభించుటలేదని తెలియవలయు.

శ్లో॥ నైవజన్మని సర్వస్మిన్ విద్యాఽసౌలఽభాపితు
శిష్యలక్షణ సంపూర్ణ జన్మన్యేవ హిలక్ష్యతే॥

॥తా॥ అన్ని జన్మముల యందును ఈ బ్రహ్మవిద్యా సులభముకాదు. శిష్య లక్షణములన్నియు యేజన్మమునందు పరిపూర్ణములగునో అట్టి జన్మమునందే బ్రహ్మవిద్యాప్రాప్తిగావనగును.

శ్లో॥ ప్రమాద పంకపతితం మలినం పురుషం విదుః
తస్మాత్వం కమపాకర్తుం బ్రహ్మతీర్థం సుసేవ్యతామ్॥

॥తా॥ ప్రమాదమను బురదలో పడినవానినే మలినాత్మునిగా పెద్దలు తెలిపిరి. కాబట్టి అట్టిప్రమాద పంకనాశమునకై బ్రహ్మనిష్ఠయను తీర్థము బాగుగా ముముక్షువు సేవింపవలయును. మఱియు ఆత్మానాత్మ వివేకము గలిగియు తన స్వరూపమును మరచి నిరంతరము శ్రద్ధతో బ్రహ్మము సంధానము చేయ కుండుటయనునది.(ఆత్మవిస్మృతి)వేదవేదాంగాది తత్త్వవేత్తయగు పండితుని గూడ పతితునిగా జేయుచున్నది. తనకర్తవ్యమగు ఆత్మధ్యానమును విడనాడి స్వస్వరూపమును స్మరింపకుండిన అజ్ఞానమావరించుచున్నది. అందుచే పండి

తుడుగూడ లోకవార్తలయందును విషయాదుల యందు ప్రవర్తించుచున్నాడు అప్పుడాతడు ధావనా పరం పరలను చేయుచు మోహజన్యములై దుఃఖప్రాయములైన అస్థిరసుఖములను తలపోయుచున్నాడు. అప్పుడా పండితుని బుద్ధికూడ-మాయామల విక్షేపదోషములతో నావరింపబడుచున్నది. కనుక నాతడుజ్ఞానహీనుడై విక్షేపశక్తులననుభవించుచున్నాడు. ఈ యాత్మవిస్మృతి పండితుడైనను విషయాభిముఖుడైనచో వానిని అనేక చిత్త మాలిన్యముల గలుగజేసి సంసారపతితునిగా జేయుచున్నది. సర్వదా బుద్ధికి మాలిన్యమునే గలుగజేయును. చిత్తము స్థిరముగా నుండదు. ఇది దుఃఖమునే యిచ్చును. శాస్త్రజ్ఞానమును దాని అర్థమును హరింపజేసి విజ్ఞానమునుగూడ గోల్పోవునటుల జేయును అందుచే నాతడు దారిలేక హీనాతిహీనుడై సంసారబంధ శృంఖలితుడై అనంత దుఃఖమునకు పాత్రుడగుచున్నాడు. ఈలాగున ప్రమాదముచే గలుగు నష్ట సంజాతమును తెలిసికొనవలయు. కాబట్టి యున్నతస్థితినిగోరు ముముక్షువు ప్రమాదరహితుడుగావలయు. ఇంకను ఆత్మమరచిపోవుటను ప్రమాదమును గూర్చి చక్కగా విచారించవలయును.

చిన్నపిల్లవాండుర్రి మేడపైన రబ్బరుబంతిచే ఆటలాడుచుండగా చేతినుండి జారి ఆటలాడుబంతి పడిపోయిన వెంటనేవది మేడమెట్లనుంచి జారిజారి క్రిందికి పడిపోయెను. అనగా భూమిమీదపడెను. అలాగున మనస్సుగూడ తన లక్ష్యమగు పరబ్రహ్మమునుండి కొంచెము జారి తప్పినచో బహిర్ముఖమగుచున్నది. పిమ్మట ప్రపంచోన్ముఖమై విషయాదులయందు ప్రవర్తించుచున్నది మొదట చేతినుండి చెండువలె పరబ్రహ్మమునుండి చిత్తముచ్యుతమాయెను. చెండు మెట్లుమీద పడునటుల మనస్సు సంకల్పములమీద పడెను. అందుచే ఆ మనస్సు మెట్లయందు పతితమైన కందుకమువలె ఒకచోట నిలువక భూమిమీదపడునటుల శబ్దాదివిషయములవలన పతితమైన మనస్సు సంసారములో దగుల్కొని అధోగతిని పొందుచున్నది. ముముక్షువగు సాధకుడు నానావిధములుగా పరుగిడు మనస్సును తనయొక్క సూక్ష్మబుద్ధిచే అనేకవిధ ప్రయత్నములతో బ్రహ్మమందు నిలుపుచున్నాడు. అనగా ధారణ జేయుచున్నాడు. స్వస్వరూపమునందుండుచున్నాడు ఇట్లుండగా దుష్టసంస్కార బలిమిచే చిత్తము స్వస్వరూపాత్మనుండిజారిన దానిని అతిజాగ్రతతో బహిర్ముఖముగాపోయక ప్రపంచవిషయములలో పడనీయక జాగ్రత్తగా సంరక్షించు కొనుచుండ

వలయును. యిధేవిషయమును ఉద్ధరేదాత్మనాఽఽత్మానం తనను తనచేత సంరక్షించుకొనవలెనని భగవద్గీతయు చెప్పుచున్నది. "బ్రహ్మతలక్ష్యముచ్యతే. అప్రమత్తేన. వేద్ధవ్యమ్" బ్రహ్మము లక్ష్యము దానిని ప్రమాదములేక భేదించవలయును. (చేర్పవలయును) అని ముండకశ్రుతి. పైవిషయమునే చెప్పుచున్నది. అటుగాక మనస్సు స్వస్వరూపభ్రష్టమాయనా బంతియొక్క గతినే పొందును. బంతిభూమిమీద పడిన తరువాత గూడ కొంతదూరము పోయి నిలుచును. అతీరున అంతఃకరణముగూడ భ్రష్టమై కర్మపరిపాకమునమసరించి సంసారగర్తమున నిలుచుచున్నది. బ్రహ్మలక్ష్యము మహోన్నత ప్రదేశము వంటిది. మనస్సుచేయెక్కునప్పుడును క్షణజాగ్రతతో ఉండవలయును. తుదకు బ్రహ్మలక్ష్యాగ్రము నధిరోహించు సమయమున చిత్తము కొంచెముజారెనేని పర్వతాగ్రము నుండి పడనవానివలె హీనగతిని జెందుచున్నది. తిరుగా లేచుట దుష్కరమే. దీనిని ముముక్షువులు సదా జాగ్రతతో ఆలోచించుచుండ వలయును బంతిని గాలినింపి తయారుచేయుదురు. అందుచే ఆ బంతి చలనశక్తి గలదగుచున్నది. ఒకసారి హస్తముచే తాడితమైనచో ఆ కందుకము అనేకసార్లు దొర్లుచున్నది. ఆ ప్రకారము చిత్తముగూడ చలనాత్మక వాయువుచేతనే నిర్మితమైనది. ఒకసారి దుర్వాసనాయను హస్తతాడితమైనచో అనేకసార్లు దుర్విషయములలో పరుగిడుచున్నది. బాలురుబంతియాట ఆడుదురు. దానిచే వినోదింతురు. అలాగున బాలురనగా అజ్ఞానులు యీపదము వేదాంత శాస్త్రమున అనేకసార్లు ప్రయోగింపబడుచున్నది. ఇట్టివారు చెండుతో సమానమైన చపలాత్మక మనస్సుతో విహరింతురు. అట్టిచంచల మనస్సుతోనే రమింతురు. మహాజ్ఞానులట్లుగాక మనస్సున కతీతమగు పరబ్రహ్మమున క్రీడింతురు.

అదియుంగాక ముముక్షువు తనబ్రహ్మనిష్టను నియమముచే నాచరింపక పోవుట యను ప్రమాదమువలన స్వరూపస్థితి నుండి జారుచున్నాడు. ఎప్పుడు స్వయంప్రకాశమాన స్వస్వరూపమును మందబుద్ధియై మరచునో అప్పుడు దీపములేనప్పుడు చీకటి గ్రమ్ముకొనునటుల అజ్ఞానాధంకారము గ్రమ్ముకొని యాత్మను ఆవరించుచున్నది. అప్పుడీముముక్షువు తన ప్రమాదముచే స్మృతి దప్పిన వానివలె మోహితునివలెను పిచ్చివానివలెను దిఙ్మోహభ్రాంతునివలెను యథార్థమును తెలియఁజాలడు. పరలోకమును దానిపుణ్యానుష్టానమును పుణ్య నియమములను మరచుచున్నాడు. తనదేహసౌఖ్యకరములగు వ్యవహారము

లందే ప్రవర్తించుచున్నారు. అందుచేనాతడు విషయాదులయందు దగిలిన మనముగలవాడై అధోగతిపాలై సంసారమునబడి అనంతదుఃఖమును బొందు చున్నాడు. విషయసుఖములనే తియ్యటి పదార్థములని తలంచి అమృతమయ ముగా నవిశోచుటచే వానినివిడనాడక భ్రాంతిగర్తమునబడి కొట్టుకొనుచున్నాడు తిరిగి నాదుర్భర సంసారగతినుండి తప్పించుకొనలేక మలినవాసనలు పెంపొం దుటచే పేడపురుగువలె మలినాజ్ఞాన కూపమున పడిపోవుచున్నారు. ఎత్తైన ప్రదేశమునుండి పడినవారు సకల అవయవములు తుత్తునియగుటచే తిరుగ బ్రతుక ఆశయేలేకున్న ఇకపడిపోయి లేచుటెట్లు? అలాగున తాను బ్రహ్మలక్ష్య మనెడు యున్నతశిఖరమునుండి పడిపోయెను. ఇకబ్రతుకజాలడు. ఇట్లుండగా తిరుగనాతడు ఆత్మప్రబోధ దశకురాగలునా? యెంతమాత్రము రాజాలడు. ఒక గొప్ప ఏనుగు ప్రమాదవశమున పెద్దబురదగుంటలో కాలిడెను. వెంటనే దాని కాలు దిగబడెను. ఆకాలిని బయటకు దీయుటకై మరియొకకాలిని దానిని బుర దలో ప్రవేశపెట్టెను. ఆరెండవకాలున్ను తెలియకనే ఆమహాపంకములో క్రిందికి పోయెను. ఇటులనే మిగత పాదములయొక్క గతియునాయెను. క్రమముగా నాయేనుగు అందులోనేబడి మృతిజెందెను. అటీరున అంతఃకరణమనెడు గజము అహంకారాది మదముచే ఉన్నత్తమై యత్కించి త్సుఖమునుగోరి సం సారపంకమున ప్రవేశించుచున్నది. అదిసంసారమనెడు బురదయందు మనస్స నెడు పాదము పెట్టుచున్నది. తిరుగనచ్చోట సుఖముగానక బుద్ధియనుపాద మును తదుద్ధరణకై ప్రవేశపెట్టుచున్నది. అటులనే మిగత చిత్తాహంకారము లను చరణములను అందుంచి క్రమముగా అంతఃహకరణ గజము మృత్యు రూప దుఃఖముననుభవించుచున్నది. అనగా కొంచెము సంసార విషయములో ప్రవేశించిన తెలియకనే నది జీవునిబంధింపజేయునని తెలియవలెను. జడభర తాదులు మహాతపస్సంపన్నులయ్యు. కొద్దిసంకల్పములుండినంతమాత్రమున స్వస్వరూపమునుండి జారిరి. తిరుగమృగజన్మము ధరించిరి. ఇదియు ప్రమాద ముయొక్క దుర్విలసితమని తెలిపిరి. ఇట్లుండిన సంసారముననే అనేకులు న్నారు. వారందఱుగూడ స్వస్వరూపచ్యుతులై యున్నారు. వారికకి గతి లేదా యనినచో స్వస్వరూపమందుండుస్థితి యేంతయో పుణ్యముచే లభ్యమగునుగదా దానినుండి జారినను వానిగతి దుర్గతియేగదా: యని చెప్పితిరి వరేకాని "స్వల్ప మప్యస్య ధర్మస్య త్రాయతే మహతొభయాత్" (అని భగవద్గీత) కొంచెమై

వను స్వధర్మమున్న సంసారభయము తొలగునని చెప్పెనని ప్రశ్నలుదయించు చున్నవి. నిజముగా స్వరూపాత్మ స్థితిగలవానికి భ్రాంశమేలేదు. స్వరూపభావనయందుండు వానివిషయమై గీతచెప్పినది. వారున్ను జాగ్రత్త లేకుండిన అట్టిస్థితిని పొందకయుండిన పతితులగుదురు. తిరిగి జాగ్రత్త సంపాదించి స్వరూపస్థితులై నచో యున్నతమగు బ్రహ్మలక్షమునుపొందగలరు. కొందఱు స్వరూపోన్నస్థితివి గురించి గొప్పగా చెప్పుకొనుచు అట్టిస్థితిపొందలేక సంసార విషయ సుఖములందే కొట్టుకొనుచున్నారు. ఇంతగా ఒత్తి చెప్పుటయేమనగా? కొంచముగూడా ముముక్షువైనవారు ప్రకృతికి మలినవృత్తులకు అవకాశమొ పగక స్వస్వరూపధ్యానపరుడై యుండవలయు. మఱియు అధ్యానకాలమున బ్రహ్మనిష్ఠాపరునకు స్వరూపమునుండి జారుట సంభవించును. ఒకేపర్యాయము అనంతబ్రహ్మములోనికి ప్రవేశింపజాలడు. తనకు స్వరూపస్థితి సంభవించున ప్పుడు మనస్సును ఇతరవిషయములందు పోనీయక తిరుగ బ్రహ్మలక్ష్యమును చేరుటకై ప్రయత్నముచేయలెను. దీనికేయోగీశ్వరులు ప్రత్యాహారమునుష్ఠింతురు. విషయములయందు ప్రవర్తించు మనస్సును బలత్కారముగా నిగ్రహించుటయను ప్రత్యాహారముచే సమాధిలాభముగలుగును. కనుక సర్వదా ప్రమాదమునకు అవకాశమునివ్వకుండ జాగ్రత్తగా స్వరూపచింతన చేయుచుండవలయును. ఇదియే ముముక్షువునకు పరమధర్మము మఱియు వివేకవంతుడైన బ్రహ్మవేత్త తనఆత్మకు అడ్డువచ్చు దానినంతయు తొలగించి తనఆత్మ జ్ఞాన విషయములో నిరంతరము జాగరూకుడై యుండుచు అసత్తును వదలి సత్తును గ్రహించుట జ్ఞానవంతుని స్వభావమైయున్నది. "ప్రక్షాళనాద్ధిపంకస్య దూరాదస్పర్శనం వరం" బురదత్రొక్కి కాలు కడుగుటకంటె ఆ పంకిలమును స్పృశించక దూరముగనే యుండును. అలాగున ప్రజ్ఞాశాలురగు ముముక్షువులు ప్రమాదమును చెందకయే యుందురు. అమృతమయమగు స్వస్వరూపస్థితిని అభ్యసించు బ్రహ్మధ్యాన పరాయణునకు హాలహాల విషముతో సమానమై ప్రమాదమున్నది. కొంచెము విషముకలిపినను అమృతముపయోగపడక మరణహేతువగు వటుల విషయదోషాది మిశ్రబ్రహ్మ చింతనము సంసార హేతుకమగును ఈ ప్రమాదమునునది తమోగుణజన్యము మూలజ్ఞానమునుండియే ఇది కలుగుచున్నది. దీనికి స్వరూప ప్రజ్ఞయే దేదీప్యమానాంతర్భాస్కరుడు దీనియందు విరక్తులగు ముముక్షువులు కడుజాగరూకులై యుందురు.

అనేక సంవత్సరములనుండి ధ్యానవిష్ఠుడై బరగుచున్న ఆత్మయోగిసత్తముడు. ఒకసారి విషయ వాంఛలలో తగులుకొని అప్రమాదముచే వానితపస్సంతయు. క్షయించుచున్నది. పాయసమెంతయొన్నను ఒకచుక్క విషము గలిపిన ఆ పరామాన్నముచే ప్రయోజనమేనటుల తపోనిధికి ప్రమాదము జనించిన ఆ తపస్సు నిర్వీర్యముగుచున్నది. కావున బ్రహ్మవిదునకు దుష్టమైనప్రమాదము కంటె వేరేమృత్యువులేదు. పరమాత్మయందు బుద్ధి యుంచినవానికి స్వస్వ రూప భావనాభ్యాసికి ఈ శరిరము పోయినను వ్యాధులచే పీడింపబడుచున్నను ఆ యత్మప్రజ్ఞ అనగా నేను బ్రహ్మమను జ్ఞప్తి నశించునదిగాదు. కావున శరీరము పోయినను మరణముకాదు. ఆత్మవిస్మృతియే మృత్యువని పెద్దలువిరూపించిరి. ఇట్టి ప్రమాదమును దూరీకరించి సమాధియందు అనగా స్వస్వరూప ధ్యానమునందు నిశ్చలచిత్తుడైన బ్రహ్మజ్ఞాని పరబ్రహ్మ సాక్షాత్కార సిద్ధిని పొందుచున్నారు. కావున ముముక్షువు పరబ్రహ్మమందు లెస్సగా యుంచబడిన మనస్సుగలవాడై అజాగ్రతలేనివాడై అనాత్మభావన రవకాశమొసంగక ప్రకృతికి లోనుగాక స్వస్వరూపస్థితియందు ధృడముగా యుండవలయును. ఇందుకు భగవద్గీత "వ్యవసాత్మికాబుద్ధి స్సమాధౌనవిధీయతే అనగా సమాధి యందు ఇతరవ్యాపారముగలబుద్ధి ఉపయోగపడదు. సమాధావచలాబుద్ధి స్తదాయోగ మవాప్స్యసి" అనగా సమాధియందు అచంచల బుద్ధియుండిన యోగసిద్ధిని పొందగలదు. అనిచెప్పుచున్నది. ప్రమాణము.

శ్లో॥ ప్రమాదంజహి. తత్త్వజ్ఞ తాత్వికీం స్థితిమాప్నుహి

ప్రమాదస్సర్వకాలుష్యం వితనోతి క్షణేక్షణే ॥ అనాగా

ప్రతిక్షణము ప్రమాదము (ఆత్మను మరచుట) సమస్తదోషములను కలిగించుచున్నది. కావున ప్రమాదమునను ఓతత్త్వజ్ఞా! వదలి యుండుమా యదార్థమగు స్వరూపస్థితిని పొందియుండుమా॥

ఇకను అజ్ఞానముయొక్క మూలపరివారమైన యహంకార మమకార కర్తృత్వభోక్తృత్వ దుఃఖిత్వ సుఖిత్వాది సకలానర్థములకు బీజభూతములగు సంకల్పములను విడువవలయును. సంకల్పరాహిత్యమే మోక్షమని యందురు. కేవలం భావపరంపరలను మాత్రము విలమొనర్చుకొనినచాలదు. ఆనంద విస్ఫూర్తి విజృంభనానుభవముగూడ అవస్యకమే. అందుచేముక్తియన సకల బంధములనుండి విడివడుటయేకాదు. తాను సదానంద పరబ్రహ్మ స్వరూపుడు.

గావలయును. అదియే కైవల్యము. పరిపూర్ణ చంద్రుని యొక్క మనోహర ణమ్ము, తొలంగుట వలననే జీవులు సుఖించుటలేదు. ఆ చంద్రుని చంద్రికల చల్లదనము చేతను. అమృతకిరణముల ప్రసారము చేతను. శ్రమను వదలి అధికానందమును బొందుచున్నారు. అట్లనే దేహము నేనను సంకల్ప గ్రంథి రూప అజ్ఞానావరణము తొలంగి ఆత్మవికాసామృతధీధితులు ప్రసరించుటచేతనే సంసారదుఃఖము తొలగి శాశ్వత సుఖమును ముముక్షువులు బొందుచున్నారు. సంకల్పములకు మూలము దేహము నేనను సంకల్పమే కారణము. తంతువులు పటమగునట్లు సంకల్పములే అంతఃకరణమగుచున్నవి. దేహము నేనను సంకల్పరూప మనస్సు యొక మహాపర్వతమువంటిది. నదీ ప్రవాహవేగముచే గొట్టుకొనివచ్చుచున్న ధూరేణువులన్నియుఁ జేరి. క్రమముగా పర్వతాకారమగుచున్నవి. లేక ఆ రేణువులు పరిణామవశముచే కఠినతరశిలలుగాను నేర్పడి యభేద్యములగుచున్నవి ఆ తీరున జ్ఞానపరంపర నదీప్రవాహముచే సంకల్పాణువులన్నియు. సంఘీభూతములై దేహముతో గూడిన మనస్సనెడు మహాపర్వతముగా మారుచున్నది. అందులోని యహంకార మమకారాదులే కఠినతర శిలలు. దీని భేదమునకై వజ్రాయుధమువంటి మహాయంత్రములనెడు అనేక కఠినతర యోగాదులుచేసి మహాఋషులు మనఃపర్వతరాశిని కరగించి బ్రహ్మనందులైనారు. ఓహో సంకల్పమహిమను దాని దుర్గతినైపుణ్యము చూడుడు. కనుక మొదటనే ధూరేణువులు చేరకున్న శైలమేర్పడజాలదుగదా. అదేతీరున దేహాభిమానముతో గూడిన సంకల్పములే లేకున్న మనస్సనునది మతియొకటి యుండగలుగునా? మరియు సంకల్ప బీజములను జ్ఞానాగ్నియందు దగ్ధముచేసిన లేక సోఽహంకారముగా అనగా పరబ్రహ్మమే నేనను విశుద్ధమగు సత్యసంకల్పముజేసిన దేహాభిమాన యుక్తమగు మనోంకురములను కలిగింపజాలదు. కనుక సర్వసంకల్పనాశం జేయుటకు పరమాత్మయే నేనను సంకల్పమే చేయవలయు మంచి సుందరమగు ముఖారవిందమునకు అచ్చటచ్చట మచ్చలేర్పడిన ముఖలావణ్యము యెంతయో చెడిపోవును. అలాగున నిస్సంకల్ప నిర్మల ఆత్మాకార హృదయ కమలమున సంకల్ప కంటకములుత్పన్నమైన ఆత్మాకార కోమల హృదయమును బాధించును. సంకల్పములనెడు మచ్చలు చెరచును.

కావున సంకల్పముల విశేషముగా రహితమొనర్చి ఆత్మయే తాను సంకల్పముతోనుండవలయును. ఇట్టివానికే జీవన్ముక్తి లభించును. లోకము

శరీరమున్నప్పుడే ఐరయుపేలయును. జీవించి యుండగనే తాను సర్వదా ముక్తస్వరూపముతో నుండుటయే జీవన్ముక్తి. ఇచ్చోటనున్న యాత్మయే పరలోకమునను్నది. అదియెచ్చోటనున్నను పరిపూర్ణమై యొకరూపమున నున్నది ఆత్మ గమనాగమనములు లేవిది కనుక దేహములోనున్నను దేహము విడిపోయిన తరువాతను ఇచ్చోట ముక్తమైనఆత్మ అచ్చోటను విముక్తాత్మయే అప్పుడుకూడ అతడు కేవలస్వరూపుడే. ఈ విషయమునే శ్రుతిప్రతిపాదించు చున్నది.

శ్లో॥ యదేవేహ తదముత్ర యదముత్ర తదన్విహ।
మృత్యోః సమృత్యుమాప్నోతి యఇహనానేవ పశ్యతి॥

తా॥ ఈలోకమునవమున్న ఆత్మయే పరలోకమందు గలదు. అచ్చోటనున్న ఆత్మ ఇచ్చోటను గలదు. ఇచ్చటనున్నస్థితియే పరలోకమునుగూడ గలదు. ఇటుగాక పరమాత్మ విషయమున భేదభావమునుజూచి తాను అనాత్ముడనని వినశ్వరుడనని తలంచి భేదభావమును జెందువారు మృత్యుదేవతా యొక్క వాతపడుచున్నారు. మరియు.

శ్లో॥ ఇహచేద శకద్బోద్ధుం ప్రాక్శరీరస్య విస్రసః।
తతః సర్గేషు లోకేషు శరీరత్వాయకల్పతే॥

తా॥ ఈ శరీరమునందే జీవించియుండగనే తన ఆత్మను తెలిసికొనకపోయిన యితర లోకములయందును అజ్ఞానియై బద్ధులగుచున్నారు. మరల శరీరములనే ధరించుచున్నారు. యికను తనకన్నను దృశ్యమగు జగత్తు మఱియొకటి కలదనియు "జీవుడు వేరు, పరమాత్మ వేరు, అను భావముచే తానుజీవుడనని సుఖ దుఃఖయని తలంచి సర్వత్ర ఘటపటాదులవలె భేదభావమును జూచు వారు అధిష్ఠానాత్మ జ్ఞానములేనివారు తప్పక సంసార దుఃఖభయమునే పొందు చున్నారు. ఇటుల వేదశ్రుతులు చెప్పుచున్నవి. ద్వితీయాద్వై భయంభవతి" అనగా బ్రహ్మమునకు తానువేరని తలంచుటయే భయము. అదియే అజ్ఞానము సంసారము ద్వైతము "భయం తస్యాపి భాషితం" భేదభావముగల వాని యొక్క మాటకూడ భయమే. ఈ లాగున అనేక ప్రమాణములచే తత్త్వ వేత్తలు భేదమును నిరాకరించి తాను అఖండ స్వరూపుడనని తలంచి అద్వైత తమునే బోధించి సదా భయరహిత్యమునే తెలిపిరి. కావున దేహేంద్రియా ద్యభిమాన సంకల్ప వర్జితుడై దేహపాతమునకు మునుపే స్వస్వరూప స్థితి

యందు విలకడ కలవాడై, ఆత్మారాముడై, జీవన్ముక్తుడై, యుండవలయు విదేహ కైవల్యమువిదియే దేహమున్నను దేహగత దోషములవంటక ద్వైత్య రహితుడగుటచే సదానంద బ్రహ్మమైయుండుటయే విదేహకైవల్యము భయ రహితమార్గము ఆనందస్వరూపము. అఖండైకరస సస్వామభూతి పరిపూర్ణము శివము. శాంతము. అద్వైతము.

ఈ జగమంతయు బ్రహ్మమయము "సర్వమాత్మమయం జగత్" తానే జగద్రూపుడై వెలయుచున్నాడు. ఈ ప్రకారము శ్రుతులు, స్మృతి పురాణాదులు జెప్పుచున్నవి. సర్వంఖల్విదం బ్రహ్మ, ఇది యంతయు బ్రహ్మ మయమే "పూర్ణమదః పూర్ణమిదం" అంతయు పరిపూర్ణమే. అని మహా వాక్యములుగూడ సకలము బ్రహ్మమని తెలుపుచుండగా జ్ఞానరూప ప్రమాద ము వలన నీసమస్త జగత్తును బ్రహ్మకన్న వేరుగాదని తలంపక తాను సకల జగదధిష్ఠాన భూతుడయ్యు, నామరూపభేదములచే ఘటత్వపటత్వాది. నానాత్వ ములు జెందిన జగత్తును భేదభావముతో గాంచువాడై నెవండు పండితుడైనను యెప్పుడైనను సరినొకవేళ నేమరియుండిగాని దేశకాలాది పరిచ్ఛిత్తిలేని నపా రమైన నాశములేని పూర్ణమైన పరబ్రహ్మమందు నీషద్భేదదృష్టిని నుంచు చున్నాడో పరబ్రహ్మముచేత నాత్మకము తానుగూడ చైతన్యమే, అయినను బ్రహ్మమందు బృహచ్చైతన్యమున్నది. నాయందు చైతన్యాంశమున్నది. ఇట్టి భేదమునైనను స్వీకరించుచున్నాడో యీశ్వరుడు చైతన్యాత్మకుడే జీవు డనగు నేను చైతన్యాత్మకుండనే. అయితే నేనా సర్వేశ్వరునికి లోబడినవాడను నణుమాత్రభేదమునైన దలంచుచున్నాడో ఆ బ్రహ్మమువేరు నేను వేరుయని భేదప్రతీతిని బొందుచున్నాడో అప్పుడే వెంబడే భిన్నభావము గలుగు నను యమునవే ద్వైతజన్య భయమునకు లోనగుచున్నాడు. ఇట్టివాని సర్వస్వరూ పము ననాత్మభావములే. విభిడితములై సంసారమోహమాలిన్యమలిప్తమై వెగడు చున్నది. భేదభావమును బొందియున్నవారు పశువని శ్రీ జగద్గురు ఆది శంకరాచార్యులు చెప్పిరి చూడుడు.

శ్లో॥ అన్యోఽసావాహ మన్యోఽస్మీత్యు పాస్తే యోఽన్య దేవతాం
నసవేదనరో బ్రహ్మ నసదేవోఽన్యథా పశుః ॥

అనగా ఏ మూఢజనుండు సర్వదా స్వయం ప్రకాశమాన సచ్చిదానందాత్మక నిష్కళంక నిర్వికార పరబ్రహ్మ స్వరూపమయ్యు తన నిరవధికానందరూప

విశృంఖలత్వ సర్వాత్మభావత్వమును తెలిసికొనజాలక దేహాత్మబుద్ధితో బాహ్యదృష్టినే బహూకరించుచు పెనుబాములగు యింద్రియాదులు దుస్స్పృహ దుర్విషయ విషము గ్రక్కుచుండగా అల్పసుఖకాంక్షియై అమృతప్రాశము లొల్కుచున్నవని దలంచి మాయామోహితుండై నేను జీవుండను బ్రహ్మమెట్లగుదునని దీనత్వ భావము దలపోయుచు బ్రహ్మోపాసనను విడనాడి ఇతర దేవతోపాసనను జేయుచున్నాడో నాతడు బ్రహ్మను నెఱుంగజాలడు. అతడుదేవుండుగాడు. మరేమనిన ద్విపాద పశువేయనబడును. పశువునకును నతనికిని నేవ్యవహారములలోగూడా నీషత్తైనను భేదములేదని చెప్పియున్నారు. కావున పరబ్రహ్మమునేనుపాసింపవలయును. "తదేవబ్రహ్మత్వం విద్ధి, నేదంయదిదముపాసతే" అనగా నీవా బ్రహ్మమునే దెలిసికొనుము. నితరమగు దేవతనుపాసింపకుము. అన్యముపాసించువాడు బ్రహ్మముగాడు. అని ఉపనిషత్తు చెప్పుచున్నది. బ్రహ్మముకన్న వేరని తలంచువాడు పశువని శృతి వాక్యమున్నది. ముముక్షువులారా శ్రుతిభగవతి మాతృదేవియై హితమును దెలుపుచుండగా సంశయము పనియేలేదు, కడుంగడు ఆస్తిక్యబుద్ధితో తాము బ్రహ్మమేగావున "ఏకమేవాద్వితీయం బ్రహ్మ, నేహ నానాస్తి కించన" ఈ బ్రహ్మమే ఏకమైయున్నది. నానాత్వమునొకించుకయులేదు. ఇదియే సత్యము. కాబట్టి ముముక్షువులారా బ్రహ్మస్వరూపులుగండు. ఇటులెరింగి తలంచనివారు భయమునే బొందుదురు. "ఏతస్మిన్నుదరమంతరం కురుతే అథతస్యభయం భవతి" ద్వితీయాద్వైభయం భవతి" అనగా ఈ పరబ్రహ్మమందు కొంచెము భేదభావమునైన జూచిన ద్వైతమే భయము గనుక భయమునేబొందును. యని శృతియుగూడ పరబ్రహ్మమునే నుపాసింపవలయునని భేదభావముగూడదనియు దయతో తెలుపుచున్నది. పండితునిగూడ భేదమతి సంసారగర్తమున పడవేయునని నితరుల విషయమై ఇకజెప్పవలసిన పనిలేదని తెలియవలయు. గనుక ప్రమాదమును జెందక స్వస్వరూపధ్యానమును విడనాడక పరబ్రహ్మోపాసనచే ప్రజ్ఞారూపుడై సదాయుండవలయు.

ఇక ఈ ప్రపంచమంతయు బాహ్యదృశ్యము అహంకార మమకారాదులు అంతఃకరణములో అనాదిగాయుంటున్న సంస్కారములు వృత్తులు ఇవి యన్నియు అంతరదృశ్యము దృశ్యమవగా దృక్కగు ఆత్మకు యేదేది గోచరమగుచున్నదో అది యంతయు దృశ్యము. ఆత్మకన్న వేరైనది అనగా

అనాత్మపదార్థములు దృశ్యము. ఆత్మపదార్థము ద్రష్ట[illegible]దృశ్యము దీనినంత యున్గాంచుట ఇదియే త్రిపుటి. దీనిని [illegible] తాను సర్వదా అధిష్ఠాన బ్రహ్మమయి ఉండవలయును. ఆత్మయందు అనాత్మత్వబుద్ధి దేహేంద్రియా దులందు ఆత్మత్వబుద్ధి ఇట్టివి. పర్యాసముచే కల్పింపబడిన ప్రపంచమున్ను తత్ద్వ్యవహారములున్ను దృశ్యమే "యదృశ్యం తన్నశ్యం" అనగా యేది దృశ్యమో అదినశించునదియే. యీలాటి కల్పితదృశ్యము వేదములచేతను మన్వాదిస్మృతులచేతను ఘటపటాది న్యాయములచేతను ఘటము మృత్తుకన్న వేరుగాదు. ఘటము కల్పితము. మృత్తికయే సత్యము. అలాగున పటము సత్యముగాదు. నూలు సత్యముకాబట్టి పరమాత్మయే సద్వస్తువు జగత్తుమిధ్య పూర్తిగా నిషేధింపబడినది. అదెట్లనగా "నేహనానాస్తి కించన" ఇచ్చట నానాత్వము భేదబుద్ధి కొంచెముగూడలేదు. వాచారంభణం వికారోనామధే యం మృత్తికేత్యేవసత్యం॥ ఇవిమొదలగు వేదప్రమాణములు "అయం ప్రపం చోమిధ్యైవ సతతం బ్రహ్మాఽహమద్వయం" ॥తా॥ ఈ ప్రపంచము మిధ్య సతతము అద్వయ బ్రహ్మమేయున్నది. ఇత్యాదిస్మృతి ప్రమాణములు. "అయం ప్రపంచోమిధ్యైవ జీవోబ్రహ్మైవనా పరః" అనగా ఈ ప్రపంచము మిధ్యాభూతము. జీవుడు బ్రహ్మమే వేరుగాదు. కార్యోపాధిరయం జీవః కార ణోపాధిరీశ్వరః కార్యకారణ తాంహిత్వ పూర్ణబోధోవశిష్యతే" శ్రీ సద్గురు శంకరాచార్యులవారి వాక్యమురీతిగా ఇకను వేదాంత శాస్త్రమునందలి రజ్జుసర్ప శుక్తి రజతాది న్యాయములు ఘటపటాది యుక్తులు గగననీలిమాది దృష్టాంతము మహర్షుల స్వానుభూతి వాక్యములు మహావాక్యములు.

పైన నిరూపించబడిన దృశ్యమునంతయు విశేషముగా సతరాం నిషే ధించుచున్నవి. వేదశ్రుతి భగవన్మాత యుద్ఘోషించుచుండ మహాత్ములు సహ స్రముఖములుగా అనేక శాస్త్రప్రమాణముల చేతను బహువిధ యుక్తులచేతను దృష్టాంతములచేతను హితమును బోధించుచుండ దీనినంతయు వినియు కొంచె మునూడ లక్ష్యము జేయక మాయాశక్తిచే భ్రమపడి మోహితుడై పైనిరూపిం పబడిన యనేక ప్రమాణములచే నిషిద్ధమైన దృశ్యమును సత్యమని నమ్మి అసత్యమగు దేహాదులయందు ఆత్మత్వబుద్ధిని జేయువాడు కర్తృత్వ భోక్తృ త్వాద్యభిమాన పరంపరలకు గుఱియగువాడు జనన మరణాద్యనేకానర్థములనను భవించుచున్నాడు. ఆత్మజ్ఞానమును స్వీకరింపనివానికి దుర్గతి తప్పదుసుమా.

అనేక విధములుగా విశేషింపబడిన దేహాది ప్రపంచమును దాని వైభవములును అందుండుసుఖములను గ్రహించువాడు అనేకదుఃఖములకు లక్ష్యభూతుడై శాస్త్రములచేతను సత్పురుషులందఱిచేతను దూరీకరింపబడి తెలియకనే పరవస్తుగ్రహణరూప చోరత్వమునుజేయు దొంగవలె అనుభవింపదగని కష్టములకు పాలగుచున్నాడు. పాపకార్యపరుడు పాపాత్ముడగు విధమున నిషిద్ధపరిగ్రాహియు మహాపాతకమగు ఆత్మహింసనొనరించిన వాడగుచున్నాడు. తస్కరుడు తనవిగాని వస్తువులను గ్రహింపనిచ్ఛగించినప్పుడే భయమను పెనుబాము లేక పిశాచము తనకుతెలియకనే తన్ను వెంబడించుచున్నది. పరవస్తువులను గ్రహించి తీసికొని ఎవరికితెలియకుండ భద్రమైనచోట భద్రపరచుచున్నాడు. ఆ వస్తువులను మాటిమాటికి చూచుచున్నాడు. తనవని భావించుచున్నాడు. వానిని సంరక్షించుకొనుచున్నాడు. ఈకార్యమునంతయు భయముతోనేచేయుచున్నాడు. ఆ వస్తువులచే గలుగు సుఖమును తలపోయుచున్నాడు. అయినను చిత్తశాంతిలేక తృప్తియులేక ఇతరులవలని భయమునూహించుచు కాలము గడుపుచున్నాడు. ఇట్లుండగా రక్షకభటులువచ్చి యీ విషయమునంతయు కనుగొని యాచోరుని దగ్గరనున్న వస్తువులనులాగికొని స్వంతవారికి వశముచేయుచున్నారు. ఈ దొంగవానిని బాగుగాకొట్టి తీసికొనిపోయి కారాగృహములో వేసి దండించుచున్నారు. ఆ తీరున అవిద్యాజన్యములును దృశ్యమునకు సంబంధించినదియు సకలానర్థములకు మూలమైనవియు తనవికానివియు అయిన అహంకారాది దేహాదులను తనవిగా స్వీకరించుకొని ఆత్మత్వబుద్ధినిజేయు అవివేకియగు చోరుడు పరకీయములగు నాదృశ్య పదార్థముల వాంఛించినప్పుడే అజ్ఞాన భయపిశాచము వానిని గ్రమ్మి వెంబడిబడుచున్నది. వానికి భయము తప్పదు. దేహాదులను తనవిగా సుస్థిరముగా భావించి వశములో నున్నవని తలంచినందుచేతను దేహనాశకములగు శీతోష్ణాది ద్వంద్వములనుండియు సంరక్షించుచున్నాడు. అదే దేహేంద్రియాదులన్నిటికిని తానే సంరక్షకుడనని తలపోయుచున్నాడు. దొంగవాడు వస్తువులను పరికించువటుల ఈ అజ్ఞానియు దేహాదులను చూచుకొనుచుండును. చోరుడు తానపహరించిన వస్తువులను పెట్టెలో భద్రపరచినటుల తన గృహములో దేహాది వస్తువులను దాచుకొనుచున్నాడు అయినను ఇవి మృత్యువునకు సంబంధించినవే. వానివాతబడునవి తెలిసికొనినను దొంగవలె తనవని తలంచి భయపడుచున్నాడు. దేహాదుల

యందు భ్రాంతిని వీడదు.

సౌఖ్యములను వస్తువుద్వారా గోరు విషయలోలునివలె దేహాదులచే సుఖమునే గోరును. ఇవియెటులైనను సంరక్షించిన దీర్ఘకాలము తనకానందము గలుగజేయునని స్మరించుచున్నాడు. దొంగవానికి చిలుముపట్టిన నాణెములు దొరికియుండిన వాటిని వాటియందున్న ప్రీతిచే చిలుముపట్టనీయక శుద్ధముగా తోమియుంచును. అలాగున అజ్ఞానియు రోగముచే దేహాదులు కలుషితములై చిక్కిపోవుచుండిన అతి ప్రీతితో ఔషదమును సేవించి రోగమను చిలుమును పోగొట్టుచున్నాడు. దీనినంతయు మృత్యుభయముతోనే జేయుచున్నాడు. ఈ దేహాదులు తనవిగావు. అవి ఎవరిసొత్తో వారికిజేరును. మృత్యువని గమక వానికే జేరును. తాను చొక్కాయివలెకాని దేహమును ధరించినాడా? ప్రకృతి ప్రవాహముచే ఈశ్వరసంకల్ప మహిమచే జీవులుత్పన్నమగుచు దేహమను గృహమును ప్రవేశించుచున్నవి. కర్మమను అద్దె లేక గుత్త మాత్రముకలదు అది తీరగానే దేహమునుండి జీవుడు వెడలవలయును. గృహాధిపతి గృహమును స్వాధీనము జేసికొనులాగున మృత్యుదేవత శరీరమును స్వాధీనము జేసుకొనుచున్నాడు. కనుక అజ్ఞాని జీవితమంతయు భయగ్రస్తమేయగును. దొంగవానిదగ్గరనుండిన పరవస్తువులను లాగికొని వారివస్తువులను వారి వారికి రక్షకభటులిచ్చులాగున మృత్యుదేవతయు శరీరాదులు బలాత్కారముగా లాగికొని భూమిపాలు చేయుచున్నాడు. మరియు తనయొక్క అపరాధశిక్షణకై చోరుని చెరసాలలోనుంచులాగున అవివేకియైన జీవునిగూడ ఇతరములగు దేహాదులను అపహరించినట్టి దోషమునకు తరుగ సంసారమను కారాగృహమున (సూక్ష్మదేహమున) నుంచుచున్నాడు. అచ్చటను అనేక దుఃఖములననుభవించు చున్నాడు.

చోరుడు అవధికాలము తీరగానే జెయిల్‌కానా నుండి విడువడువిధమున జీవుడును కర్మావధిపోగానే సూక్ష్మదేహ కారాగృహమునుండి విడువడి స్థూల దేహమును ప్రవేశించుచున్నాడు. చోరుడు పూర్వదుష్టబుద్ధి పోనందుచేతను తానమభవించిన కారాగృహశిక్షను సరకుగొనక మంచినవారివలె ప్రవర్తించుచు మరలను దొంగతనము జేయుచున్నాడు. అడ్డము వచ్చిన వారిని సంహరించు చున్నాడు. అదేతీరున అవివేకియు పూర్వమనుభవించిన కష్టజాతమును మరచి తన సుఖస్వార్థములకు అడ్డమువచ్చిన వారిని హింసించుచున్నా తిరుగతప్పదు

వాను కారాగృహప్రాప్తివలె తనకును సంసారబంధప్రాప్తి సంభవించుచున్నది ఈలాగున దొంగవలె అజ్ఞానియు అనేక దుఃఖములకు పాత్రుడగుచున్నాడు. కనుక నిషిద్ధమగు అనాత్మవస్తు పరిగ్రహమేరికిని పాడిగాదు. జ్ఞానియగువాడు చోరుడుగాని సత్పువర్తనగలిగినవానివలె ధైర్యముతో మెలగుచు తనదియగు స్వస్వరూపమును విసర్జింపబడు అత్యధికానందమునొందును. ఎచ్చోటను వానికి భయములేదు. "ఇందులకు" నభిభేతికశ్చన" ఆత్మజ్ఞాని యెవడును యెచ్చోటను యెవనినుండియు భయపడడు. అను శృతివాక్యమున్నది. "దుఃఖోపరిదుఃఖ జాతం" అనగా తన స్వరూపమును మరచియుండుట యే దుఃఖము. అజ్ఞానము ఇక విషయాదులలో ప్రవర్తించుట. పరవస్తుగ్రహణముచే దొంగకు సంభవించు శిక్షవలె వనితాదులచే బద్ధుడై శిక్షితుడగుచున్నాడు. ఆ తాపత్రయాదులు చెప్పసాధ్యముగాదు ఇకను సంసారబంధమను కారాగృహప్రాప్తియు తప్పదు అందుచే జనన మరణ రూపములగు దుఃఖములు అనంతముతుగా సంభవించును కాబట్టి యిట్టిదురంతములలో చిక్కుకుండుటకై వివేకి దృశ్యనిషేధమునకై సర్వదా స్వస్వరూపస్థితుడుగావలయును. ఆనందాత్మమై యుండవలయు లేనిచో అతిదుఃఖితుడగును.

శ్లో॥ సుప్తేరుత్థాయ. సుప్త్యంతం బ్రహ్మైకం ప్రవిచింత్యతాం।
నాతిదురేచ్చతాంమృత్యు. రితివేదాంతడిండిమః॥

తా॥ మానవులకు మృత్యువు దగ్గరగానేయున్నది. కనుక నిద్రనుండి లేచినది మొదలు మరల నిద్రపోవువరకు లేక జన్మ మొదలు మరణమువరకు బ్రహ్మమునే చింతింపవలయును. అది శంకరులు చెప్పిరి. మఱియు సత్యమగు పరబ్రహ్మమును అనుసంధానముచేయు బంధరహిత పురుషుడు తనదియగు స్వస్వరూపమునే పొందియుండుట వలన తనవస్తువునే గ్రహించువివేకివలె సంసార దుఃఖభయ మిసుమంతయు లేనివాడై నిరావరణ పరబ్రహ్మతత్త్వము నిరంతరము పొందుచున్నాడు. అత్యధికానందమున విహరించుచున్నాడు. అటుగాక అసత్యమగుదృశ్యప్రపంచమందు సత్యత్వబుద్ధిచే అనిత్యదేహాదుల యందుందు తానను అభిప్రాయముతో అనాత్మను సంధానపరుడై వాటినే భావించుచు బద్ధుడగువాడు యితరుల వస్తువులపహరించుచోరునివలె దుఃఖభాజనుడై, ఇతరము బగు దేహేంద్రియాది దృశ్యమునభిమానించుచు అజ్ఞానాంధకారములోబడి వసించుచున్నాడు. తుదకు దుఃఖమునే యనుభవించుచున్నాడు. పరమాత్మను

పించుచున్నాడో అట్టి మహనీయుడు దృశ్యజాతము నశించి పరబ్రహ్మమును
పొందుచున్నాడు. కనుక నీవును పట్టుదలతో బ్రహ్మనిష్ఠాభ్యాసము చేయుము.

ఈ విధముగా నిరంతరము స్వస్వరూపానుసంధానమునే మరక చేయు
చుండవలయును. జితేంద్రియుడగు ధీరుడు తనకు విరుద్ధమగుదానిని పరిహ
రించుటలో నెల్లప్పుడును జాగరూకుడై యుండును. ఆత్మ ప్రతిబంధకమగు
దృశ్యమును నిశ్శేషముగా విడనాడును. "ఋణశేషం శత్రుశేషం నకారయేత్"
అనగా అప్పును గాని శత్రువునుగాని మిగిలించి యుండకూడదు. అనునటుల
దృశ్యశేషమును వుంచనీయడు శత్రువు నశించునపుడే సుఖముగా నిద్రించున
టుల దృశ్యమునశించువరకును మేలుకొనియేయుండును. అదినశించిన తర్వాతనే
నిస్సంగుడై నిస్సంకల్ప స్థితినొందియుండును. కాబట్టి అనవచ్ఛిన్న పరమాత్మ
నుసంధానమును చేయవలయు. అనగా స్వస్వరూప స్థితిలేక ఆత్మకన్న బాహ్య
మయిన దృశ్యమగు అహంకారాది శరీరసంఘాతముతో సంగమము వానిభావ
నరూప సంకల్పములు ఒకదానికన్ననొకటి యధికములై అరటిచెట్టు యొక్క
పిల్లలువలెను. మఱ్ఱిచెట్టుయొక్క యూడలువలెను. చెద పుట్టవలెను. కప్పల
గుంపులవలెను. అసంఖ్యాకములుగా వర్ధమానములై అజ్ఞాన మూలమైన దుష్ట
సంస్కార విషఫలములను అనంతముగా వృద్ధిపరచుచున్నవి. ఇంతకు ప్రపం
చానువంధానఫలమేమనగా? అనాది సంసారబంధమేయగుచున్నది. అందుచే
తెంపులేని భావనలు వాని నిర్వాహనమునకై ప్రయత్నించుట దానిచే అనంత
దుఃఖములు అశాంతి తీరుగా వానినేతలపోయుచుండుట. ఈ ప్రకారము అజ్ఞాన
వర్ధక దుష్టమలిన వాసన హృదయమున సంసార వృక్షమునకు మూలమైన,
తల్లి వేరై వృద్ధినొందుచున్నది.

ఈ సంసార మహీరుహము రాగద్వేషాదిఫలములను గలిగించి వాని
లోని సంకల్పములను బీజములచే వృద్ధినొందుచునేయున్నది. కాబట్టి దుర్వా
సన సంసారబంధమును దృఢపరచుచున్నదని తెలియవలెను. అగ్నియనునది
వాయుతత్వమునుండియే గలిగినది వాయుసహాయము లేకుండిన అగ్నివృద్ధి
కానేరదు. అనుకూలమైన గాలిలేనిచో దీపమారునుగదా? అలాగున హృదయ
మున దుర్వాసనాగ్నియున్నది. దానిని వాయువలె బాహ్యవస్తువులనుసంధా
నము వృద్ధిపరచుచునేయుండును. మఱియు మహోన్నతమైన స్వరూపస్థితి
నుండి జారినపుడు తాను మనోఽతీతమగును. ఆత్మస్థినుండి మనస్సు లోని

సంధానపరుడు బంధవిముక్తుడే నాతడు దేహాతీతమగు యున్నతగతిని పొందుచున్నారు. సకలలోకములయందును పూజ్యుడగును. అనాత్మ పదార్థములంగోరు మిథ్యాజ్ఞాని సర్వదా బద్ధుడై వానిస్వభావము దుఃఖమయ అనాత్మ సంసారసాగరమున మునుగుటయే వాడు అధోగతినిపొందుచున్నాడు. సకలభువనములలోను (ఈ లోకమందుగూడ) నరకమునే అనుభవించుచున్నాడు. వానికిసుమంతయు సుఖములేదు. ఇకఆత్మబుద్ధిగలవాడు యదార్థస్వరూపి భయరహితుడు పుణ్యాత్ముడై యుండును. సర్వేశ్వరానుగ్రహ పాత్రుడై యుండును. లోకము వానిని గౌరవించును. వానిజన్మము ధన్యము. పరమపావనము. జ్ఞానమయము. అమృతము. జ్ఞానికిని అజ్ఞానికిని భేదమిట్టుల నెఱుంగవలయును. అరణ్యములో దిఙ్మోహ భ్రాంతుడై అజ్ఞాని దారితెలియక కొట్టుకొనుచు దుఃఖితుడై యుండును. భ్రాంతిలేని సుజ్ఞాని జ్ఞానమార్గమున విహరించును. నిత్యానందస్వరూపుడగును. కాబట్టి యెల్లప్పుడు స్వస్వరూపమందుండవలయు అదియే తన స్వాంతహత్య.

నిరంతరము సంయమన శీలముగల బ్రహ్మజ్ఞాని మిథ్యాభూతములైన ప్రపంచవిషయములతోటి సంబంధము సంకల్పములును జీవుని సంసార పాశబద్ధుని జేయుచున్నవి. అవియన్నియు అజ్ఞానకారణములుగాన వానిని వివేకముచే వదలి స్వయంప్రకాశమానుడై నిరావరణ బ్రహ్మమైయున్న తాను సద్రూప చిద్రూప ఆనందరూప బ్రహ్మమునే నయితినని సర్వాత్మ దృష్టితో సర్వవ్యాపక పరిపూర్ణ పరబ్రహ్మమందు దృష్టినిస్థిరీకరించి పరబ్రహ్మరూపియై అమృతమయుడై, ఆనందఘనుడై సర్వదాయుండవలయు అట్టి స్వస్వరూపబ్రహ్మమందు నిలుకడగలిగియుండుట. పరబ్రహ్మసాక్షాత్కార జ్ఞానానుభవముచే మాయశక్తిచే ప్రతీయమానములగు సకలావిద్యాకార్యములగు దుఃఖసమూహమును తత్కారణమగు మూలాజ్ఞానమునున్ను విశేషముగా నశింపజేసి ప్రతిబంధ రహిత మోక్షస్థానమైన నిరవధిక నిర్విశేష నిర్వికార నిశ్చల నిరుపమాన పరమానందమును గలుగ జేయుచున్నది. అప్పుడు జీవుడే పరమాత్మ యగుచున్నాడు. ఇదియే జీవబ్రహ్మైక్యము ఇందులకు ప్రమాణము

శ్లో॥ బ్రహ్మనిష్ఠాదృఢాయేన, సమభ్యస్తా సదాఽనఘ విలీ
యసకలం దృశ్యం పరబ్రహ్మణి గచ్ఛతి॥ అనగా

పాపరహితుడగు ముముక్షూత్తమా! ఏ జితేంద్రియుడు బ్రహ్మనిష్ఠను అత్య

ప్రవేశించిన వారగుచున్నారు. వానికి తద్దృశ్యముతోడి సంబంధము తప్పిపోదు
అప్పుడు స్వర్గలోక దేవేంద్రపదవినుండి జారి నరలోకమున బడినట్టిస్థితిని పొం
దిన వారగుచున్నారు. అందుచే దృశ్యప్రతీతిని సర్వదా విడనాడవలయును.
అదెటులనగా మహాధీమంతుడు యుక్తాయుక్తములను నిత్యానిత్యములను
త్యాజ్యాత్యాజ్యములను, సత్యాసత్యములను, జడాజడములను, దుఃఖాదుఃఖములను
తేజోంధకారములను, సారాసారములను, దృశ్యాదృశ్యములను, విద్యావిద్యలను
బంధమోక్షములను విషామృతములను ద్వైతాద్వైతములను బాగుగా వేరుపచి
తెలియజేయు వివేకబుద్ధిచే (హంసజాలమునుండి పాలను వేరుచేయునటుల
అనాత్మపదార్థములనుండి ఆత్మను పృథక్కుగానెఱుగుపరచునది) సద్గురూప
దిష్ట మార్గముచే స్వయం ప్రజ్ఞచే బ్రహ్మ విచారముచే ఆత్మకన్న బాహ్యమైన
దృశ్యజాతమునంతయు నిశ్శేషముగా పరిహరించి తిరుగ సంభవింపనటుల
సోన్మూలం నాశనముజేసి అత్యధికానంద ప్రదమగు స్వస్వరూప చింతనము
అనవరతమనన్యము విధిగా జేయుచు బ్రహ్మస్వరూపుడై యుండవలయును.
నిరంతరము స్వస్వరూపాభ్యాసికి ఆత్మకన్న వేరుగా తోచుదృశ్యస్ఫురణము
అత్యంత సుకుమార హృదయ పుండరీకమున సూదులరాశి గ్రుచ్చిన ఎంత
బాధాకరమో అంత అనిర్వచనీయ దుఃఖమును గలుగజేయుచున్నది. అదియుం
తయు శ్రీ సద్గురుకరుణ దైవకరుణ మహర్షుల దయపరిపూర్తిగా యున్నప్పు
టికిని తన శ్రద్ధ భక్తి ధ్యానాదులను మందగించుటచేతను గలుగుచున్నది. కనుక
తీవ్రబుద్ధిచే నుపాసన చేయవలయు హృదయమున చిన్నముల్లు నాటుకొనినను
స్థిమితముగా నుండజాలనట్లు ఏకొద్ది దృశ్యసంకల్పముండినను నిశ్చలముగా
సాధకుడుండజాలడు. కనుక దృశ్యప్రతీతి స్వరూపస్థితికి మహాప్రతిబంధకర
ము. కావుననే సూక్ష్మతత్త్వజ్ఞాని బ్రహ్మముకన్న వేరులేదు. అంతయు ఆత్మ
స్వరూపమే. అదియు నీవై యున్నావు. సర్వమును బ్రహ్మముగా భావించి
దుఃఖకారణమగు దృశ్యమును దూరముగ చేయుమని తెలిపెడి రహస్యము.
నిజము విచారించిన దృశ్యపదార్థమేలేదు.

జగత్తు మిథ్యావస్తువే అయినను అజ్ఞానమహిమచే తాత్కాలికముగా
సూర్యుడు లేకుండుటచే నంధకారముండునటుల దృశ్యముస్ఫురించుచున్నది.
దానినంతయు బ్రహ్మవిస్ఫురణమనియు పరమాత్మకన్న వేరుకాదనియు
తెలిసి పరబ్రహ్మమునే భావించుచు తానుసకలాధిష్ఠానమైన భావాతీత పరబ్రహ్మ

మునుపొంది అచ్చట దృఢస్థితుడు కావలెను. ఇదియే పరమవిజ్ఞానము స్వాను భవము పరిపూర్ణము అఖండము.

శ్లో॥ అధిష్ఠానస్య విజ్ఞానాదధ్యాసో వినివర్తతే ।
రజ్జుజ్ఞానేనభుజగసంకల్పాద్వివివర్తతే ॥

తా॥ అధిష్ఠానమైనవస్తుజ్ఞానము వలన త్రాటినెఱుంగుటచే సర్పము పొలయనమ గునట్లు దృశ్యభ్రాంతి తొలంగును. శివతత్త్వమును పొందును. సముద్రములో అలలు శమించినప్పుడు సాగరమంతయు నిశ్చలమై నిర్వికారమై యుండును. ఈ విషయమును సముద్రమధ్యభాగమ నచే కన గొనవలయును. అందు విష్ణు దేవుడు శేషశాయియై యున్నాడు. అనిపురాణవేత్తలు పలికెదరు. అట్లు తనగభీర హృదయమధ్యమున సంకల్పములనెడి తరంగములు లేకుండిన అంతఃకరణము సముద్రమధ్య ప్రదేశమువలె ప్రశాంతమైయుండును. అందున పరమాత్మ దేవుడు ఆనందమను శేషపాన్పుపై పరుండును. అనగా సంకల్పరహితుడైన పుణ్యపురుషుడు ఆనందరూపముతో తృప్తుడైయుండును. ఇదియే దృష్య రహితస్థితి.

అదియునుంగాక మనస్సున యేయే బాహ్యవస్తువులు ప్రతీయమాన ములగుచున్నవో వానినన్నింటిని తత్సంబంధ సంకల్పరాశిని ఆసక్తినికూడ విశేషముగా త్యజింపవలెను. ఒకానొకప్పుడును నవి తిరుగి స్ఫురింపకుండున టుల చేయవలయు అందుచే మనస్సునిర్మలతను గాంచుచున్నది. బాహ్యదృశ్య విషయములలోనుండి విడువడుచున్నది. అనగా విముక్తిని బడయుటకు యోగ్య తకలదగుచున్నది. మరియు మనశ్శుద్ధిగలవాడై వేదాంతమార్గమున నడుగిడిన వ్వాడు. చిత్తశుద్ధికలవాడే శ్రవణమననాదులకు యొగ్యుడు. అతడేమల విక్షేప దోషములు నశించినవాడగుచున్నాడు. యింద్రియములు విషయముల నుండి మరలింపబడి వాని వృత్తులు యింద్రియములందే లీనములై తిరిగి విషయ సంబంధమైనపుడు విజృంభించుచున్నవి. యింద్రియములు విషయములందు ప్రవర్తించుచున్నవి. సుషుప్తిలో వృత్తులు అణగియుండి జాగ్రద్దశయందు చెలరేగుచున్నవి. కావున విషయములనుండి మరలించిన యింద్రియములేమి యు చేయజాలవు. వృత్తులనులయించును వానికాధారమున్నపుడు యింద్రియ ములు ప్రవర్తించి ఇతర సమయములందు మిన్నకుండును. దీనికి సుషుప్త్య వస్థయే దృష్టాంతము. విషయసంబంధముతోడి ఇంద్రియప్రవర్తనకు జాగ్ర

వస్త్ర దృష్టాంతము అట్లు మనస్సునకు బాహ్యదృశ్యమంతయు విషయమగు చున్నది. స్వప్నమున జాగ్రద్దశయందు బయటగాంచబడినదంతయు గనబడు చున్నది. మనస్సునకు విషయము కానట్టి దృశ్యమేలేదు. (ఈ మనస్సును కూడ విషయముచే ఆత్మ ఒకటున్నది. అప్పుడే మనస్సు గూడ దృశ్యమే యగును ఆయాత్మ రూపమును గాంచినపుడే సకలదృశ్యనాశనము గలుగును. కావున బాహ్యదృశ్యమంతయు విరోధింపబడగా మనస్సుగూడ నేమియు చేయ జాలదు. మనోవృత్తియు తనగోళమున సూక్ష్మరూపముగా లయమైయుండును దీనిని గాఢసుషుప్తి యందురు. మరల వస్తుసంబంధము కలిగినపుడు వృత్తితో గూడ చిత్తము విజృంభించుచున్నది. ఇదియే జాగ్రద్దశ. అందుచే బాహ్య ప్రపంచము నిరుద్ధముకాగా చిత్తమణగియుండును. వృత్తులును మిన్నకుండును కావున వృత్తులను గూడ నశింపజేయవలయును. మనస్సులోని సంకల్పములు సంస్కారములు, వృత్తులు పరమాత్మ ధ్యానముచే నశించును. ఆత్మజ్ఞానాగ్నిచే వృత్తులను సమిధలను దహింపజేయవలయును. అంతః కరణమను అగ్ని గుండము ప్రజ్వరిలించును. మాలిన్యములన్నియు నశించిపోవును. అప్పుడే మనః ప్రసన్నత కలుగును. మనస్సను కూపమున మోహమనుపాచును (ఆవరణము) పాపమనెడు పంకిలమును (మలము) దూరీకరించిన నిర్మలత్వ మనెడు స్వచ్ఛజలము యేర్పడును. విక్షేప శక్తియను చలనరహిత మానః ప్రసన్నతయనెడుకదలని స్వచ్ఛజలమేర్పడును. అట్టిజలమందు ప్రతిబింబము గోచరమగునట్లు మలఆవరణ విక్షేపములను త్రివిధ దోషములు లేని మనః ప్రసన్నతయందు ఆత్మదర్శనమును చేయవచ్చును. అంతఃకరణమను అద్దము లోని మాయామోహమాలిన్యమును ఆత్మధ్యానమను శుద్ధ వస్త్రముచే తుడిచి ఆత్మను దర్శింపవచ్చును. మనస్సు పరమాత్మాభిముఖమైనపుడే పరమాత్మను గాంచవచ్చును. మఱియు మనఃప్రసన్నతగల వారిముఖము ప్రసన్నమై గంభీర వాక్యములతో ప్రసన్నములై అనుగ్రహరూపములై సుఖకరములై యుండును భగవద్గీత.

శ్లో॥ ప్రసాదే సర్వదుఃఖానాం, హానిరస్యోపజాయతే।
ప్రసన్నచేతసోహ్యాశు బుద్ధిః పర్యవతిష్ఠతే॥

అనగా మనస్సునిర్మలమైనచో సర్వదుఃఖములు నశించుచున్నవి. నిర్మలాంతః కరణము కలవానికే ప్రజ్ఞాస్థిరముగా నిలసిల్లును మనస్సు యేకాగ్రతను చెంది

నిర్మలమైనపుడు పరమాత్మ దర్శనము గలుగును. పరబ్రహ్మ సాక్షాత్కారము సంసారబంధ నాశకము జీవన్ముక్తి రసోఽప్యస్య పరం దృష్ట్వా నివర్తతే – అనగా విషయములందలి ఆశ పరబ్రహ్మ సాక్షాత్కారముచే తనే నశించును. అని భగవద్గీత పలుకుచున్నది. సూర్యోదయమైనపుడేగదా చీకటి నశించును. ఆత్మజ్ఞాన భాస్కరుడుదయించగా అజ్ఞానాంధకారము నశించి భక్తుల హృదయ సరస్సులలో మనః కమలంబు వికసించి పరమానందమోద (పరిమళ) పూరితములగుచున్నవి. కాబట్టి బాహ్యప్రపంచము దూరీకరించుటయే జీవన్ముక్తియను విముక్తి పదవికిమార్గము కావున మొట్టమొదట బాహ్యజగత్తును దానిసంకల్పములను త్యాగముచేసి అంతఃకరణ వృత్తులను నశింపజేయవలెను. అందుచే మనోనిర్మలతగలుగును. దీని వలన పరబ్రహ్మసాక్షాత్కారమై సర్వదుఃఖనాశకమగు ఆనందప్రాప్తి రూపమోక్షము గలుగును.

సకలవస్తువిరాసక్తియే బాహ్యవస్తు నిరోధము. ఇదియే వైరాగ్యము. ఇదియే శమము ఇది కలముముక్షువునకు ముక్తి కరతలామలకము.

ముముక్షువు గురుమార్గమును శాస్త్రపద్ధతిని, విచారణజ్ఞానమును, తత్వ నిశ్చయమును పొందినవాడైనచో ప్రమాదమునకు లోబడక అసక్తిగ ప్రపంచ సుఖములను కాంక్షింపడు. అనగా వేదాంత శాస్త్రములను అర్థముతోసహా పూర్తిగ మహాత్ముల సన్నిధిని అధ్యయనము చేసినవాడును ఆత్మానాత్మవివేకియును వేదోపనిషత్తులైన బ్రహ్మసత్యం జగన్మిథ్య.

ఏకమేవాద్వితీయం బ్రహ్మ తత్వమసి. ఇత్యాది మహావాక్యార్థములను పరమ ప్రమాణముగ గైకొన్నవాడును పరమాత్మనుభవమును కోరువాడును మాయాతత్వమునెఱింగినవాడను సద్గురు సన్నిధిలో శ్రవణముచేసి తద్వస్తుగా మననముచేసి యథార్థమును గుర్తెఱింగినవాడును అగుముముక్షువు అన్ని విషయములను గురు, శాస్త్ర, యుక్త్యనుభవములతో లెస్సగా తెలిసినవాడగుటచే ప్రమాద పతితుడుకాడు. విజితాత్ముడు బ్రహ్మతత్త్వమను మహాపర్వతశిఖరమును అనాయాసముగ నధిష్ఠించును. అటుగాక అజ్ఞాని ఇంద్రియలోలుడై బాలునివలె దేహాభిమాన బంధమునపడును. మిడుతలు అగ్నిని మ్రింగబోయి దానిలోబడి నశించుచున్నవి. మిగిలిన మిడుతలు గూడా చూచియు తెలిసికొనజాలక భ్రాంతిచే మరణించుచున్నవి. అట్లు అజ్ఞాని సంసారము సుఖకరమని తలచి అందులోనే మునిగితేలుచు బహుదుఃఖములకు లోనగుచున్నాడు. వానిని

చూచియు మఱియొకఁడువిచారించక భ్రాంతుడై సంసారసాగరమునబడి గుటకలు మ్రింగుచున్నాడు దీనినే గడ్డాలికా ప్రవాహ పతితన్యాయమందురు. అనగా ఒక గొఱ్ఱె కాలుజారి నదిలోపడి కొట్టుకొని పోవుచుండగా ఆ విషయమునెఱుంగక ఇతరములగు గొఱ్ఱెలుకూడా నదిలోబడి కొట్టుకొనిపోవుచున్నవి. దేహాత్మబుద్ధిగల అజ్ఞానుల దశయునిట్టిదే ఇది యెంతఆశ్చర్యము మాయాభ్రాంతియొక్క శక్తియే దీనికికారణమనవలెను. అశాశ్వతములగు దేహాదులయందు అభిమానముగల వానికి ముక్తి లభింపదు అభిమానరహితుడు ముక్తినిపొందుచున్నాడు. దేహాద్యభిమానిబద్ధుఁడు నిరభిమాని ముక్తుఁడు. బద్ధుడు సంసారమున వ్యవహరించుచు సుఖదుఃఖములననుభవించుచుండగా ముక్తుడు సకల వ్యవహారములను త్యజించి సుఖదుఃఖాతీతమగు కైవల్యధామము నధిష్ఠించి బ్రహ్మనందుడై యున్నాడు. బద్ధుడు నిద్రించిన వానితోసమానము ముక్తుడు జాగరూకుడై యున్నాడు. నిద్రించు వానిస్వభావము యేమియు తెలియకుండుట. మేలుకొన్నవాని స్వభావము సమస్తమునెఱుంగుట. నిద్రితుడు మేలుకొన్నవాడు వీరిద్దరు పరస్పర విరుద్ధములైన ధర్మము జాగ్రదవస్థ యనగా ఇంద్రియ వ్యవహారము. స్వప్నము మనోవ్యవహారము గాఢనిద్రలో అదియులేదు. నిద్రితుడు మేలుకొనినచో జాగ్రదవస్థ కలవాడగుచున్నాడు. అప్పుడిద్దరును సమానులే. అట్లు అజ్ఞాని విజ్ఞానదశకు వచ్చిన జ్ఞానివలె ముక్తుడగుచున్నాడు. మేలుకొనినవాడు నిద్రించినయెడల యేమియుతెలియని నిద్రావస్థయేపొందును జ్ఞానియు అజ్ఞానివలె సంసారాసక్తుడైన బద్ధుడేఅగును. యదార్థజ్ఞాని దేహేంద్రియాది విషయములయందు ఎప్పుడును ఆసక్తి చూపడు. బాహ్యవిషయములందు యేకొంచెమాసక్తి చూపినను పూర్తిగా మేలుకొనలేదనియే. అనగా యదార్థ విజ్ఞానవంతుడు కాలేదనియే దలంపవలయును. నిద్రించువాడు మేలుకొని సమస్తమును గాంచునట్లు అజ్ఞాని యెప్పుడును అజ్ఞేయుండునని తలంపవలదు. అతడును దేహాద్యభిమానరహితుడై జ్ఞానియగుచున్నాడు. నిద్రితుడు శత్రువునకు లొంగును. మేలుకొనియుండిన ఏమియు చేయజాలడు. మాయామోహితమగు సంసారమునబడి నిద్రించువానిని అజ్ఞానమను శత్రువు ఎప్పుడో ఏవేళనో సంహారము చేయుచున్నాడు. విషయాపేక్షగల సంసారి మృత్యువునకు భయపడుచున్నాడు జ్ఞాని మేలుకొన్నవాడు కనుక వానిని అజ్ఞానవిరోధి ఏమియు చేయజాలడు. అనగా జ్ఞానిమృత్యువునకు భయపడడు. జననమరణ రహితాత్మ స్థితిలో

సదాయుండును. ఒకడు నిద్రించువాడు ఒకడు మేలుకొన్నవాడు ఒకడు విషయభోగి. ఒకడు నిర్విషయయోగి. ఒకడు ప్రవృత్తి మార్గమున బద్ధుడు. ఒకడు నివృత్తి మార్గమున ముక్తుడు. ఒకడు సర్వవిషయాసక్తుడగుటచే రాగి. ఒకడనాసక్తుడగుటచే విరాగి. ఒకడింద్రియ చపలుడగు అసమాహిత చిత్తుడు వేరొకడు శమము కలవాడగు సమాహితచిత్తుడు. ఒకడు సంసారమునందుండుటచే చంచలుడు, పరిచ్ఛిన్నుడు. ఇంకొకడు పరబ్రహ్మమందుండుటచే అచలుడు పరిపూర్ణుడు. ఒకడు ప్రకృతి ద్వారమున ప్రవేశించును. వేఱొకడు మోక్షద్వారమున ప్రవేశించువాడు ఒకడంధకారమునకున్న వాడు మఱియొకడు ప్రకాశమునన్నవాడు ఒకడు సర్వదా దుఃఖి మఱియొకడు సర్వదా సుఖి. ఒకడు హీనమైన సంసారియమైన అజ్ఞానమనెడు దక్షిణ దిక్కునకు అభిముఖుడై పోయి యముని చేరుచున్నాడు. వేరొకడు ఉత్తమమైన పుణ్యప్రదమైన జ్ఞానమనెడు ఉత్తరదిక్కునకు అభిముఖుడై సంచరించి ఈశ్వర ప్రాప్తిని బడయుచున్నాడు. ఈ విధముగా జ్ఞానులకు, అజ్ఞానులకు పరస్పర భేదమున్నది. ఫలితముగూడ వేరుగనే యున్నది. ఇందులకు భగవద్గీత—

శ్లో॥ యానిశాసర్వ భూతానాం। తస్యాం జాగర్తి సంయమీ।
యస్యాం జాగ్రతి భూతాని సానిశాపశ్యతోమునేః॥

అనగా: సమస్త ప్రాణులు బ్రహ్మవిద్యను తెలియక, అజ్ఞానములో నిద్రించుచున్నారు. అందున ఆత్మావలోకనము జేయుబ్రహ్మజ్ఞాని వారివలెగాక, విజ్ఞానియై, జాగరూకుడై యున్నాడు. లేక అందఱు ప్రపంచ విషయములో మేలుకొనియున్నారు. అందున విజ్ఞాని నిద్రించుచున్నాడు. అనగా: ప్రవర్తించుట లేదు. ఆత్మకన్న ఇతరములగు ప్రపంచ వస్తువులను అనుభవించుట యందు సర్వదా సంలగ్న మనస్సును గలిగి ఆయా ఇంద్రియ ప్రవృత్తులతో ప్రపంచ విషయములందు ప్రవర్తించు దేహమే తానను దృఢబుద్ధిగలవాడు అనాత్మరూపమైన దృశ్య పదార్థములను అపేక్షింపకనుండ జాలడు. సర్వదా అట్టి సంస్కారము కలవాడగుటచే. స్థూలదృష్టిగలవారు సూక్ష్మపదార్థముల గైకొనవటుల దేహవాసన సుస్థిరముగా నున్నవాడు సూక్ష్మభూతమైన ఆత్మపదార్థమును నెఱుంగజాలడు. దేహాత్మభావముతో నున్నవాడు ఆత్మయన నెట్టిదో తెలియని వాడై. నిత్య సుఖకరమగు ఆత్మసుఖమును మరచినవాడై, దేహేంద్రియాదులకు సుఖకరములైన వస్తువులనే కోరుచున్నవాడై ఆయాకార్యములు

చేయుచు పరిమితుడై కైవల్యప్రాప్తియని తలంచి సంసారసుఖమునే అభిలషించువాడు సూక్ష్మమగు అవ్యక్తమును స్థూలమగు బ్రహ్మాండము వరకు వ్యాపించిన దృశ్యముపై పరుగులిడు సకలవిషయములను క్షణములో సంచరించు మనస్సును జడప్రాయమునైన దుఃఖరూపములగు ఇంద్రియాది సుఖములను గ్రహింపక యెటులయుండగలుగును? సర్వదా దృశ్యమునే వ్యవహరించుచు దృశ్యముచేతనే సంతోషించుచున్నాడు. సర్వదా బురదలో సంచరించు కీటకములు పేడలోనే యుత్పన్నములగు పురుగులు అందులోనే మడయుచు తిరుగా జన్మించుచు వాటినే కోరుచున్నవి. మంచిపదార్థములను అవి కోరుటలేదు. అటులనే సంసారమాలిన్యోపేతులు దానినే బహూకరించుచు దాని యందే పొరలుచు జనన మరణములకు గురియగుచున్నారు. దేహబుద్ధిని విడువక పరమాత్మ చింతన చేయజాలకున్నారు. చీకటిలో సంచరించు గుడ్లగూబ మొదలైనవి. సూర్యుని జూడ జాలనటుల మాయామోహముచే వ్యవహరించువారు హృదయాకాశమున వెలుగుచున్న జ్ఞాన భాస్కరుని తెలిసి పొందజాలరు. అనగా అజ్ఞానులకును విజ్ఞానులకును పరస్పర మింతభేదముగలదు.

అజ్ఞాని స్వభావము సంసారమునే శ్రేయస్సని తలంచుట. విజ్ఞాని స్వభావము పరమాత్మప్రాప్తియే దుఃఖశాంతియు ఆనందరూపమని తలంచుట. వారి వారి స్వభావమును శ్రేయస్కరమని సుఖకరమని భావించుట ఏకస్వభావమై యున్నది. దీనిని విజ్ఞులు గుర్తెరుంగవలయును. ఇందులకు ప్రమాణము

శ్లో॥ క్రమేలకం నిందతి కోమలేచ్ఛుః క్రమేలకః కంటకలంపటస్తం ।
ప్రీణాతియోరిష్టభుజోః సమానం మధ్యస్థతా నైకతరోపపన్నః ॥

తా॥ అనగా మృదువులగు తృణాదులను భక్షించు అశ్వాదులు కంటకములను సునాయసముగ తిను ఒంటెను పరిహసించుచున్నవి. ఉష్ట్రము (ఒంటె) మృదువగు తృణములను మేయు అశ్వాదులను నిందించుచున్నది. అయినను ఉష్ట్రము కంటకములచే ఆనందించుచున్నది. అశ్వాదులు తృణాదులచే తృప్తినొందుచున్నవి. ఈ జంతువుల రెంటికిని తృప్తి సమానముగానే యున్నది. కాబట్టి ఒకదానికొకటి పరిహసించుకొనుట స్వభావసిద్ధము. అలాగున అజ్ఞానియు దుఃఖభూయిష్టమగు సంసారమునే సుఖమనినమ్మి దానినే ఆశించుచున్నాడు. సుజ్ఞానియే సంసారము సుఖకరముగాదని తలచి పరమాత్మ విషయములో ప్రవర్తించుచున్నాడు. అజ్ఞాని యీపరమాత్మప్రవృత్తిని తనకు విముఖముగా తలంచుచున్నాడు. కనుక విజ్ఞానులు స్వభావమనగా వాసనా

జన్మము దాపిని గూడ నతిక్రమించి ఆత్మ నిష్ఠుచే తన స్వభావమనియు తదితరము స్వభావమనియు తెలిసి ఆత్మయందు రమించుచున్నాడు. ఇంతవిచారము వలన సిద్ధించినదేమనగా పరస్పర విరుద్ధ ధర్మములు నొకచోటనుండజాలవు. గనుక దేహాత్మబుద్ధిగలవానికి దృశ్యనాశమెంతమాత్రము గలుగదు. అట్టివాడు దృశ్యవిషయములలో ప్రవర్తింపక యుండజాలడు. స్వాత్మత్వ బుద్ధి వాని యందుండజాలదు. ఇందువలన దేహధర్మములగు వర్ణాశ్రమాదులు జనన మరణాదుల శీతోష్ణాదులు ఇంద్రియధర్మములగు వృత్తులు శబ్ద స్పర్శ వని తాది విషయగ్రహణములు అంతఃకరణ ధర్మములు సంకల్ప వికల్పములు సుఖదుఃఖాదులు కర్మలగు సకలేంద్రియ వ్యాపరములు తత్ప్రయుక్త కార్యములు వీటినన్నింటిని వదలినవారై అనగా నిత్యము బ్రహ్మవిచారముచే బ్రహ్మవలోకన నిష్ఠయందు తత్పరులై సర్వదా ఆత్మానందమున ప్రీతిహత ముగా గోరువారుగనుకనే బ్రహ్మతత్త్వమను యథార్థముగా నెఱింగినవారు బ్రహ్మతత్త్వమే సత్యము. దృశ్యము, చలము అస్థిరమని నమ్మినవారు. యెప్పుడును దృశ్యమును నిశ్శేషముగా నిరాకరింపవలయు. ముముక్షువులు తత్ప్రయత్నమందే దృఢచిత్తులుగావలయును. పరిపూర్ణానందమను గోరువా రందరును దృశ్యమును త్యజించియేతీరవలయును. లేనిచో నిరావరణ స్వప్రకా నంద జ్ఞానము గలుగదు."సర్వస్తాఖిలధర్మకర్మవిషయో"అనగా మొదటనమస్త దేహేంద్రియాదుల ధర్మములను కర్మలను విషయములను వదలవలయునని పైవాక్యము తెలుపుచున్నది. లేక సమస్తమును త్యాగము చేయవలయునని యున్నది. ఇది బాహ్యమనియు మానసికమనియు ఆత్మవిషయకమనియు మూడు విధములుగాయున్నది. అందున బాహ్యసన్యాసమనగా బాహ్యపదార్థ దృశ్యమంతయు వదులుటయగును మానసికమనగా మనస్సునకు సంబంధించిన వృత్తులు గుణములను సంస్కారములను విడుచుట యగును. ఆత్మవిషయ మనగా మనస్సును గూడ వదలి అనాత్మభావనము పూర్తిగా నశింపజేసి మనో తీతమగు పరబ్రహ్మమే తానై యుండుటయగును. తరువాత అట్టిపరబ్రహ్మ స్థితినుండి తప్పిపోకుండా బ్రహ్మవలోకన నిష్ఠయందు నిరంతరముండుచు తత్త్వమును గనుగొనుచు దృశ్యము తిరుగా స్ఫురింపనీయక ఆత్మస్థితిని మరుగు పడనీయక సర్వదా ఆనందరూపుడై యుండవలయు. ఇదియే దృఢ ప్రయత్నము. వీరలేమహాత్ములని తెలియవలయును.

ఏముముక్షువు పరమార్థజ్ఞానానుభవుడైన శ్రీసద్గురుదేవుని దగ్గర చక్కని శ్రద్ధతో వేదాంతశ్రవణమును లేక బ్రహ్మతత్త్వవిచారము చేసియున్నాడో అట్టిబ్రహ్మవిచారోత్కుడు సర్వము పరబ్రహ్మమే మఱియొకటిలేదు. అంతయు తానేయను పరమాత్మభావానుభవ విజ్ఞానమువలన సర్వదాస్వస్వరూపమందు నిలుకడ గలిగి యుండుటయును ఆ విషయమును "శాంతోదాంతః అను శ్రుతి ప్రమాణము ముముక్షువునకు విధియని చెప్పుచున్నది. శ్రుతి॥ శాంతోదాంత ఉపరతస్తితిక్షుః సమాహితో భూత్వాఆత్మన్యేవాత్మనం పశ్యేత్॥ తా॥ అంతరేంద్రియములను గహించినవాడై బహిరింద్రియములను వశపరచుకొన్నవాడై, మనస్సును విషయములనుండి మరలించుట సకలేంద్రియ వ్యాపారముల పశమించుట. యనుఉపరతిగలవాడై సర్వదుఃఖసహనమను తితీక్షగలవాడై శ్రద్ధా సమాధానములతో గూడినవాడై నిశ్చలుడై అనగా శమాది షట్కసమ్పత్తి గలిగి ముముక్షువు తనలోనే తనను అనగా జీవాత్మను పరమాత్మనుగా చూడవలయును. ఈ శ్రుతి వేదాంతశ్రవణము మననము నిధిధ్యాసము బ్రహ్మసాక్షాత్కారము అను నాలుగున్ను యుండవలెనని చెప్పుచున్నది. పరమాత్మను గోరువానికి ఈ పదముచే బ్రహ్మవిచార రూపమననమున్ను సాధనమున్ను నిరంతరము బ్రహ్మమందు మనస్సును నిలుపుటయను నిధి ధ్యాసరూపసాధనమును తెలుపబడినవి. సర్వాత్మసిద్ధియే పైనచెప్పబడిన విధముగా శ్రవణాదులకు ఫలితమేమన అంతయుతానే బ్రహ్మమే యనునట్టి సర్వాత్మ భావరూప బ్రహ్మసాక్షాత్కారము గలుగవలయునని యెఱుంగవలయు ఈ విషయమునే "శాంతో దాంతః" అనుశ్రుతి స్పష్టముగా తెలుపుచున్నది. కాబట్టి పరమార్థ విజ్ఞాని సర్వదా మనస్సును నిశ్చలముగను ఏకాగ్రముగను "సమ్యక్ ఆధీయతే మనఇతిసమాధిః" తా॥ అనగా మనస్సు బాగుగా బ్రహ్మమందుంచబడుచున్నదను అర్థముచే సిద్ధమయిన బ్రహ్మలక్ష్యమందు లెస్సగా చిత్తమునను సంధించుటయను సమాధిని ముముక్షువు సత్పక శీలించవలయును. మఱియు "శ్రుతశ్రవణ కర్మణః" అను పదార్థమేమనగా శ్రద్ధయు శాంతో దాంత ఇతి అనుపదముచే శమదమములు తితీక్షయు సర్వాత్మసిద్ధియే దీనివలన ఉపరతి "సమాధిం" దీనిచే సమాధానము ఈలాగున శమాదిషట్క సంపత్తి గలిగి యుండవలయు. వాటిఫలితము బ్రహ్మసాక్షాత్కారమనియు తెలియవలయు. శమదమాది ఆఱింటియొక్క స్వరూపము ప్రమాణ–

శ్లో॥ సదైవ వాసనాత్యాగః శమోయ మితిశబ్దితః,
విగ్రహో బాహ్య వృత్తీనాం దమఇత్యభిధీయతే॥

తా॥ అనగా ఎప్పుడునమస్తవాసనలను రహితమైనట్టుట శమమనియు బాహ్య వృత్తులను విగ్రహించుట దమమనియు చెప్పుచున్నట్లు ఇవి అత్యంత ముఖ్యములు.

శ్లో॥ విషయేభ్యః పరావృత్తః పరమోపరతిహిసా
సహనం సర్వదుఃఖానాం తితిక్షాసాశుభామతా॥

తా॥ అనగా చిత్తమును సకల విషయములనుండి మరలించుట. ఉపరతియగును సర్వదుఃఖములను సహించుట తితిక్షయగును.

శ్లో॥ నిగమాచార్య వాక్యేషు భక్తిః శ్రద్ధేతి విశ్రుతా
చిత్తైకాగ్ర్యస్తుసల్లక్ష్యే సమాధానమితిస్మృతమ్॥

తా॥ అనగా వేదాంతశాస్త్రములందును ఆచార్యులయందును భక్తిశ్రద్ధయని చెప్పబడును. బ్రహ్మవస్తువందు మనస్సును ఏకాగ్రపరచుట సమాధానమగును. ఇంతచెప్పవలసినదేలయనగా అహంకారమనునది అనేకజన్మములనుండి ఆరూఢమైయున్నది. దీనియొక్క అంతము గనపడుటలేదు. మహారణ్యములో దగులుకొనినవాడు తిరుగరాలేనియటుల ఈ దురహంకారమహాటవిలో చొచ్చిన కంటకభూయిష్ఠ ప్రదేశసంచారమువలె సంసారారణ్యమందు పర్యటన తప్పదు. దరిగానరాదు తుదకు వాడుమహాఘోరారణ్యములో వ్యాఘ్రమునకు గ్రాసమగు నటుల ఈ సంసారారణ్యములో చిక్కినవాడు మృత్యువునకు కబళమగుచున్నాడు. "అవ్యక్తాన్మహతః మహతోఽహంకారః" అనుశృతిచొప్పన మహాసూక్ష్మరూపమునమున్న అవ్యక్తమను మాయఅభివ్యక్తమాయెను. స్థూలరూపమున్నుదాల్చెను. అట్టిస్థూలమగు మహత్తుపై అభిమానరూప అహంకారముదయించెను. తరువాత తన్మాత్రలు పంచమహాభూతములుదయమాయెను. కాబట్టి ఈ మూలాహంకారమునేమ అను అధ్యాసరూపముగామున్నది. ఇదియే మొదటి కల్పన తర్వాతనే తదితర అధ్యాసములు ఈ మూలాధ్యాసమగు మూలాహంకారమే తూలావిద్య. మూలప్రకృతి అజ్ఞానము స్వరూపాచ్ఛాదక ధర్మము. ఖ్రాంతి ఈయధ్యాసమ అనేకసంస్కార సంపుటమగు ప్రబలాహంకారమును స్వరూప విజ్ఞానముచే ముముక్షువు వశపజేయవలయును. మొదట నేనునుదానికి విషయము కాకూడదు అధిష్ఠానమయ్యే యుండవలయును. శత్రువు శిరమును

భగ్నముచేదుచివేయు నటుల మాయా శక్తిని శిరస్సను దురహంకారమును అధిష్ఠానాత్మసాక్షాత్కార జ్ఞానఖడ్గముచే ఛేదింపవలయును. లేక ఈ అహంకారమను అజ్ఞాన దృష్టికి స్వరూపాత్మజ్ఞానమను వాయువస్త్రమును ప్రయోగించవలయును. లేక అతిమాన మేఘాచ్ఛన్నదివసమువలె నిరంతర బ్రహ్మధ్యాన ప్రయుక్త బ్రహ్మనిష్ఠయను ప్రబలసూర్యోదయము కావలయును. భానుడుదయించగానే దిక్కులన్నియు జడత్వముమాని నిర్మలమగువిధమున అహంకారము దొలగి పరిజ్ఞానంబ్రహ్మయను ప్రబోధోదయముగాగానే జడత్వము నశించి చైతన్యాత్మ నిర్మలమై ప్రకాశించును. ఇట్టిదురవగాహ నిరూఢమగు మూలాహంకారము యొక్క శక్తి మహాప్రబలమై యున్నది. మాయాశక్తికి అహంకారమనునది ప్రధానపుత్రుడై యున్నాడు. ఈ మూలాహంకార మహారాజు అంతఃకరణ చతుష్టయములో చేరిన కర్తృత్వ భోక్తృత్వాది రూప అహంకారమను మహావీర ఖడ్గమును చేబూని మనోబుద్ధిచిత్తములగు మువ్వురు మంత్రులతో ప్రవృత్తిరూప మంత్రాలోచన చేయుచు కామ క్రోధ లోభాది, దుర్గుణ పరివారముగలిగి శమ దమ దయ శాంతి వివేక భక్తి గుణములు తనకు శత్రువులని తెగవేయుచు ప్రపంచరాజ్యమును అప్రతిహతముగా నేలుచున్నాడు అనగా అహంకారమున్నయెడల ముముక్షువునకు శమ దమ వివేక విచార విజ్ఞానాది సుగుణములుండవని తెలియవలెను. ఈశమ దమాది గుణములతో ఆత్మరూపభగవంతుని శరణుజొచ్చిన అయహంకారరాజు పలాయనమగుచున్నాడు. అనగా యమనియమాదుల లభ్యసించుచు ఆత్మను విచారముచే కనుగొన్న వారికి అమూలావిద్యయుండదు. ఇదియే శివము. మఱియు ఈయహంకారము నానావిధములైన జన్మలనుండి రూఢమైయున్నది. దీనిని విశేషముగా వాశనము గావించ సకలాగమములను ఉపనిషత్తులను పురాణములను ధర్మశాస్త్రములను బాగుగా అధ్యయనముచేసి తదర్థమును దెలిసి ప్రచారము చేయునంతటి పండితులయినను సమర్థులుగారు. వారు పెంచెదే అహంకారమును నాశనము చేయజాలరు. వారు అయహంకారముయొక్క పుట్టువును తెలిసికొనజాలరు. పుట్టలోనున్న పామును పై బడిబంతకొట్టినను చచ్చునా? బాహ్యమగుశబ్దబ్రహ్మ బోధలచేనాది అహంకారముపోవదు. అనగా చీకటి లోపలనిండి నిబిడీకృతమై యుండగ బయట యెంత పెద్దదీపము వెలిగించినను లోపలచీకటి తొలగి పలుచచ్చునా? అలాగున అహంకారము అంధకారము దట్టముగా లోపలనుండగా

బహిర్వ్యాప్తములగు శాస్త్రపరిచారములచే ఫలితమెంతమాత్రముగానుపించదు. ఆశాస్త్ర విజ్ఞానమంతయు లోపలికి తీసుకొనిపోయి మస్తకమునకు పట్టించి దీర్ఘానుష్ఠానరూపమగు మహాజ్ఞాన దీపమును వెలిగించవలయును. అప్పుడాత్మ దేవుడుగనుపించును. అదియే శాస్త్రశ్రవణ మననములకు ఫలితార్థమగును. అనగా దీర్ఘతర బ్రహ్మనిష్ఠజేసిన వారికే మూలాహంకారము నశించును. నేను అనగానే దేహేంద్రియాది దృశ్యముగాదు. తదధిష్ఠాన పరబ్రహ్మము నిర్వికల్పము అవిరూఢముజేసికొనిన అహంకారోదయమేకాదు. అది లేకనేపోవును ప్రబల శత్రువుదగ్గఱ సామాన్యుడినిల్చునా అహంకారమునకు ప్రబలశత్రువగు సోఽహంకారం శ్శుద్ధపరమాత్మనేదుట అదురహంకారము నిలువజాలదు. కాబట్టి ప్రబలాహంకారమును బాహ్యదృష్టిగల మహా పండితులున్ను వెంబడే నశింపజేయజాలరు. అంతర దృష్టినవలంబించిన ఆయహంకారము నశించును. మఱియు అహంకారమనగా సకలసంస్కారములయొక్క సంపుటమైయున్నది. ఈ సంస్కారముల సంపుటములు అనంతములుగానున్నవి. ఒక్కొక్క సంస్కార సంపుటమేర్పడినప్పుడు జన్మము వచ్చుచున్నది. అప్పుడు సంస్కారమను ప్రదేశములో సంస్కారసంపుట మహావృక్షము మహావర్ధమానమై సుఖ దుఃఖాత్మక ఫలములనొసంగుచున్నది. ఆ మహావృక్షము నశించినను సుఖ దుఃఖాత్మక ఫలములనుండి అనేక సంస్కారబీజములేర్పడుచునే యుండును. ఒక్కొక్క సంస్కారము సంపుటముగలిగి అది విజృంభించి అది నశించునప్పుడు మరికొన్ని సంస్కారములగలిగించియే ఆసంపుటము ముగియుచున్నది సముద్రములోని అలలకంతులేనటుల మహాప్రకృతిలో సంస్కారములకంతు లేదు. తరంగములన్నియు మహాసాగరములోనే లయమగునటుల మూల ప్రకృతి రూపఅహంకారములోనే సంస్కారములన్నియూ లయమగుచున్నవి. తిరిగి కల్లోలములవలె సంస్కారములన్నియు విజృంభించుచున్నవి. ఇదియంతయు ప్రకృతి సహసిద్ధ ప్రవృత్తి కావున సంస్కారములు (వాసనలు) అంతములేక పుట్టుచు అనంత జన్మలకు కారణమగుచు అనంత దుఃఖములనొసగుచు కాలచక్రముతోటి తిరుగుచు ఆచక్రమునకు ఆకులవలెనున్నవి. ప్రకృతి రూప కాలమహాచక్రమునకు అనంత సంస్కారములను (ఆకులు) అరలు గలవు. దానికి మనస్సే ఇరుసుగానున్నది. స్వస్వరూప విస్మృతియే (ఆత్మ మమరచి యుండుట) పట్టాగా (కమ్మి) మున్నది. ఇందువలన ఇట్టి సంస్కా

రములనాశము సామాన్యముగాదు. నిరంతరధ్యానముచేయగా నిర్వికల్పసమాధి చేతనే తన్నాశము సిద్ధించును. కాబట్టియే నిర్వికల్ప సమాధి నిష్ఠగలవారికి సంస్కారములు పూర్తిగా నశించినందుచేతనే సంస్కారరాశిభూత మూలాహంకారమేర్పడదు. అట్టి ఆరూఢజ్ఞానమును తప్ప ఈసంస్కారములు పండితులను గూడ సంసారసముద్రమున ముంచివేయుచున్నవి. కనుక చిత్తము యొక్క సత్త్వముచేత వాసనారూప సంస్కారములు గలుగుచున్నవి. అవియే స్వర్గనరకములకు కారణములై యున్నవి. ఉత్తమలోక ప్రాప్తినిగలుగజేయునవిగా నున్నవి. సకల కర్మలయొక్క అంకురములే సంస్కారములై యున్నవి. ఇట్టి సంస్కారముచే స్మృతిగలుగును. అందుచే అనుభవము జనించును. తిరుగా అనుభవముచే సంస్కారస్మృత్యాదులు ప్రాదుర్భవించును. అప్పుడు అనంతములుగా గలుగునట్టి సంస్కారస్మృత్యనుభవములకు యేది ముందు యేది వెనుక యను కార్యకారణ భావము కూడ సిద్ధింపదు. ఇందులకు యోగశాస్త్ర ప్రమాణము సూత్రము "తాసామనాదిత్వం చాశిషోనిత్యత్వాత్"

తా॥ అనగా మోహరూపమైన సుఖసాధనమైన సంకల్ప విశేషము అనంతమై నిత్యమగుటవలన ఆ సంస్కారములన్నియు అది లేనివిగా నున్నవి. ఇవి యన్నియు ఒక మాటయై మనస్సను పేరుతోనున్నవి. ఇట్టి మనస్సు జన్మాంతర సంస్కారానుగామియై యున్నది. "ఇందుకు ఆర్యోక్తి. మనోహి. జన్మాంతరసంగతిజ్ఞం" అనగా జన్మాంతర విషయములను చిత్తము దెలియుచున్నది. అని పెద్దలు చెప్పియున్నారు. కావున ప్రపంచములో ప్రాణిసమూహమంతయై యున్నను మనోహరములగు వస్తువులను జూచి మధురములగు శబ్దములను విని ముగ్ధులగుచున్నారు. తానిదివరకు తెలియకపోయినను బోధితుడుగాకపోయినను సహజముగానే సమస్తమును మనస్సుచే తలంచుచున్నారు. శోకమోహములకు సుఖదుఃఖములకు లోనగుచున్నారు. ఇందులకు కారణము అనేక జన్మలనుంచి యేర్పడిన భావములు స్థిరములై మనస్సున పాదుకొనియున్నవి అందుచేతనే పురుషుడు శబ్దాదులయందు బలాత్కారముగాను ప్రవర్తిల్లుచున్నాడు "మనోరథః నామతట ప్రవాహః" అనగా సంకల్పములు వర్షాసమయమున నదులయొక్క గట్టులు జలప్రవాహముచే కొట్టబడినట్లై నేను ముందు నేను ముందు అనుకటుల పడుచున్నవో అటువలె సంకల్పములును యొకదాని వెంబడే మరియొకటి గలుగుచునే యుండును. ఒకటి పుట్టును అది నశించగానే

మతియొకటి గలుగును. ఈ విధముగా సంస్కారములనంతములుగా గలుగుచున్నవి. వీటినన్నిటిని ముముక్షువు తీవ్రధ్యానముచే నిర్వికల్ప సమాధినిష్ఠతో నిరోధింపశక్తుడగును. నిర్వికల్ప సమాధివలన సకలవృత్తులు పశమించి చిత్తమునిరుద్ధమై యుండును. దీనినే అసంప్రజ్ఞాత సమాధియందురు. ధ్యాతృ ధ్యానధ్యేయములను త్రిపుటినశించి కేవల నిర్వికల్ప బ్రహ్మమై యుండుట. ఆనందమైనెగుడుట యగును. బ్రహ్మాండమంతయు వ్యాపించి మహా స్థూలమైన మనస్సు అభ్యాసబలముచే మహాసూక్ష్మమై నీవారశూకవత్తన్వీ పీతా భాస్వత్యణూపమా. తస్యాశ్శిఖాయః మధ్యే. పరమాత్మా వ్యవస్థితః అను ప్రమాణమురీతిని అనగా నివ్వెర ధ్యానపుగింజయొక్క కడుతీక్ష్ణమైన అగ్రభాగమువలె అణువై ఒకానొక జ్యోతి ప్రకాశించుచున్నది. దీనినే యోగశాస్త్రము" మూర్ధజ్యోతిస్సని నుడివి దానియొక్క చివరియందు పరమాత్మ యున్నారు. అనగా పరబ్రహ్మము మహాతిసూక్ష్మమై స్వయం జ్యోతిరూపమై యున్నది. అట్టి పరమాత్మయందు లయమగుచున్నది. ఇదియే నిర్వికల్ప సమాధి. లేకకేవలము విజ్ఞానమయమై చిత్తముండును. ఇట్టి పరబ్రహ్మనిష్ఠ జేయువారికి ఆత్మను పరమాత్మను తెలిసి స్వానుభవజ్ఞానులకు సంకల్పములు సంస్కారములు లేకుండుటవలన మూలాహంకారవార్తయు లేదు. దీనినే పశ్చిమ దృష్టి యనియు, బ్రహ్మదృష్టి యనియు, నిర్వికల్ప యోగసమాధి దృష్టియనియు, అప్రాకృతదృష్టియని, ఆనందామృత పరిపూర్ణ దృష్టియనియు యందురు. గనుక చక్కగా ధ్యేయమందు చిత్తమును లయముచేయుట సమాధి యని చెప్పబడును. ఇదియే త్రిపుటి రహితము, నిర్వికల్పసమాధి "ఇందుకు స్మృతి"

> శ్లో॥ ధ్యాతృధ్యానే పరిత్యజ్య। క్రమాద్ధ్యేయైకగోచరమ్।
> నివాతదీపవచ్చిత్తం॥ సమాధిరభిధీయతే॥

తా॥ నేను ధ్యానముచేయువాడను. అనుభవము ధ్యానము ఈ రెండునుపోయి క్రమముగా మనస్సంతయు ధ్యేయాకారమై గాలిలేని దీపమువలె నిశ్చలమై యుండుట సమాధియనబడును. ఇందులకు భగవద్గీతావాక్యము

> శ్లో॥ యథాదీపోనివాతస్థో. నేఙ్గతే సోపమాస్మృతా।
> యోగినోయతచిత్తస్య. యుఞ్జతో యోగమాత్మనహ॥

తా॥ చక్కగా విచారించిన సమాధులు జీవబ్రహ్మైక్యములు పరమాత్మ

భావనలు నిర్వికల్ప దృష్టులు యోగవియోగములు ఇవియన్నియు చిత్తము యొక్క ధర్మములే వీటికన్నిటికతీతమగు బ్రహ్మమే పరిపూర్ణమైయున్నది. ఇదియే అనిర్వాచ్య పదార్థబోధ అఖండ పరిపూర్ణము ప్రమాణము.

శ్లో॥ అరూఢశక్తి మహమం. వినాశ్యచసుధీరవః
సయేవబ్రహ్మనిర్వాణం. బ్రహ్మభూతోఽధిగచ్ఛతి॥

తా॥ బాగుగా హృదయములో నాటుకొనిన అహంకారమును నశింపజేసి సుధి యగును. అట్టివాడే బ్రహ్మమై బ్రహ్మనిర్వాణమును పొందుచున్నాడు.

ఇక ఆవరణ శక్తియనగా తమోగుణ రూపమైనది. ఇది సమస్తమును ఆవరించియున్నది. తనయొక్క ఆత్మస్వరూపమును పూర్తిగా కప్పియున్నది ఇదియున్నంతవరకు ఆత్మ ప్రకాశింపదు. తనస్వరూపమును తెలియనీయదు. ఇట్టితమోగుణశక్తి చలనాత్మకమైన విక్షేపశక్తిని కలిగించును. విక్షేపశక్తి యనగా రజోగుణరూపము దీనిచే కామక్రోధలోభాదులు గలుగును. ఈశక్తియే జీవత్వహేతువు ఈ రజోగుణశక్తి అహంకారము సహాయముగాగొని సమస్తమును ఆచరించుచున్నది. అహంకారమనగా నేను నాది యనుట. మోహమం దిరమునకు స్వరూపాచ్ఛాదకమగు ఆవరణశక్తి ఆవరణమను ప్రాకారమై యున్నది. అహంకారము పతాకమైయున్నది. ఈ అహంకారమను టెక్కము (జెండా గుడ్డ) విక్షేపశక్తి అనెడివాయువుచే సర్వదా చలించుచున్నది. రజో గుణము జెండా కఱ్ఱగానున్నది. తమోగుణ రజోగుణములు రెండు. ఆవరణ విక్షేపశక్తులగును. ఇక సత్వగుణముకూడ ఆవరణమైయున్నది. ఈ సత్వ గుణా పాదకావరణశక్తి రజోగుణ తమోగుణములవలె ఆత్మస్వరూపమును ఆచ్ఛాదించియుండలేదు. ఈసత్వగుణమనునది దీపమునకు గ్లాసువలె ఆత్మకు ఆవరణరూపమై యున్నది. అటులున్నను ఆత్మప్రకాశమును తెలుపును. నిర్మల జలమునందు ప్రతిబింబమువలె నిర్మలమై ఆత్మసత్వగుణాంతఃకరణ మందు స్పష్టముగా కనబడుచున్నది. అయినను ఆత్మనిరావరణముగా ప్రకా శించుటలేదు. అందుచే సత్వగుణము బంధమేఅగుచున్నది. రజోగుణమనగా కదులుచున్న నీటియందు ప్రతిబింబమువలె అట్టి అంతఃకరణమందు ఆత్మ స్పష్టపడుటలేదు. ఇక తమోగుణమన్ననో బురదనీటియందు ప్రతిబింబము కనబడనిరీతి ఆత్మ కానుపింపదు. సత్వగుణము ఆత్మనెటులనావరించియున్న దనగా మహారత్నము సూక్ష్మమగు శుద్ధవస్త్రముచే ఆవరింపబడినటులను లేక

నాట్యవ్యవహారము సూక్ష్మమైనతెరచే అంతర్హితమైనట్లును భాస్కరుడు అత్యంతస్వల్పమైన శరత్కాలమేఘముచే కప్పబడినటులను ఆత్మ సత్వగుణముచే పరిస్ఫుటముగాకయున్నది. ఇందుచే సత్వగుణమున్ను ఆవరణశక్తిలోచేరినదనియే ముముక్షువు గ్రహించవలయును. ఇట్టి మూలాకారణభూత ఆవరణశక్తియే విక్షేపాహంకారములకు తజ్జనార్థములకు ప్రధానహేతువైయున్నది. అట్టి అజ్ఞానఆవరణయను మూలప్రకృతిని స్వస్వరూపానుసంధానపటిమచే ముముక్షువు నశింపజేసిన ఆవరణవిక్షేప అహంకారములనుత్రియము నశించుచున్నది. ఇదివిరావరణ జ్ఞానము.

మఱియు తనయాత్మ స్వరూప పరమాత్మను అచ్ఛాదించినదై ఆవరణశక్తి వ్యాపించియున్నది. తనరూపము తెలియక జేయుచున్నది. ఆశక్తిచే పరమాత్మలో క్షోభము గలిగెను. ఇదియే విక్షేపశక్తియని చెప్పబడును. ఇందుచేతనే పంచీకరణ శాస్త్రజ్ఞులిటులచెప్పుచున్నారు. కేవల పరిశుద్ధబ్రహ్మముండెను. అందులోమాయాశక్తిచే క్షోభగలిగెను. తరువాత సృష్టిక్రమమేర్పడెను పరబ్రహ్మమునావరించియున్నందున మాయ ఆవరణశక్తియనియు తత్కార్యమగు క్షోభమే విక్షేపశక్తియనియు చెప్పబడుచున్నది. యథార్థమేమనగా తాను నిర్వికారుడు. పరిశుద్ధుడైయేయున్నాడు. ఈవిషయముమరచినచో అన్నిశక్తులుపుట్టి పిశాచములవలె విజృంభించుచున్నవి. అందుచేతనే సంకల్ప వికల్పములు గలుగుచున్నవి. అదెటులనగా? తన చేతిలోనిబాణము లక్ష్యమునందలి దృష్టి కదులుచుండిన లక్ష్యభేదము సిద్ధించని విధమున రజోగుణముచే చిత్తము క్షోభముగలదై స్వరూపదృష్టియుచలించుచుండిన పరబ్రహ్మలక్ష్యము జేరజాలదు. ఇట్టివానికాత్మానుభూతి విజ్ఞానము గలుగదు. కనుక ఇట్టి రజోగుణాత్మక క్షోభరూప విక్షేపశక్తి నాశమునకై మొదట తమోగుణరూప సకలాజ్ఞానకారణమైన ఆవరణశక్తిని విశ్లేష విలయమునొందింపవలయును. "కారణనాశే కారనాశః" అనురీతిగా కారణము నశించిన కార్యనాశము సిద్ధించినదెయగును అనగా ఆవరణశక్తి కారణమునశించగా కార్యభూత విక్షేపశక్తి విలయమొందుచున్నది. బీజములోని అంకురములుండిన తత్కార్యవృక్షమువృద్ధిచెందియున్నటులేకదా? రాజును జయించిన రాజ్యముస్వాధీనమైనటుల ఆవరణశక్తిని జయించిన పరివారరూప విక్షేపశక్తియు జయింపబడి ఆత్మరాజ్యము తనకు లభించినటులాయెను. కేవల పరిజనమును స్వాధీనము జేసికాని రాజు కూడ

తనకు వశుడై యున్నాడనుకొనుటయు భ్రాంతియేసుమా! యేలోకొంతధ్యానాదులచే కొంతవిచారణలచే విక్షేపశక్తి అణగియుండిన మాత్రమున ఆవరణ భంగము గలిగినది. విజ్ఞానము సిద్ధమైనదనుకొనుటయు ప్రమాదమే కావున ముముక్షువు తీవ్రయత్నముచే ఆవరణశక్తిని నిశ్శేషముగా సమూలముతో నశింపజేయవలయు అప్పుడే నిశ్శేషవిక్షేపశక్తి నాశముగలుగును. వేరుయుపాయములేదు. భవరోగమనునది మహాతీవ్రవ్యాధి జన్మజన్మాంతరములనుండి వచ్చినది. వ్యాధి పూర్తిగా నశించు వరకు ఔషధము సేవింపనటుల భవరూప ఆవరణ శక్తియను వ్యాధి శమించువరకును స్వస్వరూపధ్యానమగు దివ్యౌషదమును నిరంతరమును సేవించుచుండవలయు అనగా ప్రబలమైన ఆవరణశక్తి దీర్ఘతర స్వస్వరూప స్థిరత్వముచే తానే పూర్తిగా తొలంగును. ఆవరణశక్తి నాశనమునకై దృక్‌దృశ్య వివేకము జేయవలయును. దృక్కనగా ఆత్మ కంటే (తనకంటె) వ్యతిరిక్తమైన అనాత్మరూప ప్రపంచము అనగా మహత్తు మొదలుకొని దేహాంతము భువనాంతముగల మహాపురుషుడు అనాత్మ పదార్థములనుండి వేరుచేసి తెలియుచున్నాడు. ఇదియే విజ్ఞానముగల వాసిలక్షణము ఇటుల ఆత్మానాత్మవివేకములేని అజ్ఞాని అనాత్మపదార్థములతో ఆత్మవస్తువును గూడనేకముజేసి కర్తృత్వ భోక్తృత్వాది ధర్మములననుభవించుచున్నాడు. ఇదియే అజ్ఞాని లక్షణము. కనుక పుణ్యపురుషుడు ఆత్మస్వరూపమునే వాంచించుచు జ్ఞానములోనే విహరించును. అజ్ఞానియగు దేహబుద్ధిగలవాడు అనాత్మ యింద్రియ సుఖములకు దాసుడై పరితాపముతో జీవించును.

శ్లో॥ దృగ్దృశ్యౌద్వౌపదార్థేస్తః పరస్పర విలక్షణే।
దృగ్ బ్రహ్మదృష్యం మాయేతి సర్వవేదాంతవిర్ణయః॥

తా॥ పరస్పర విరుద్ధధర్మములుగల దృగ్దృశ్యములను రెండుపదార్థములుగలవు దృక్ బ్రహ్మనాశము లేనిది దృశ్యము మాయనాశమొందునది ఇటుల సకల వేదాంత నిశ్చయము.

శ్లో॥ దృశ్యం సర్వసమానాత్మ స్యాత్. దృగేవాత్మాఽవికారిణే।
ఆత్మానాత్మవివేకోఽయం. కథితో గ్రథకోటిభిః॥

తా॥ అంతయు దృశ్యము ఆత్మదృక్కు వికారమును జెందనిది ఇదియే ఆత్మానాత్మవివేకము సకలశాస్త్రసారము తెలియవలెను. భూమిలో బంగారము మట్టితో కలిసి యున్నది. వివేకి తద్విధానమును తెలిసికొని మట్టిని దూరముజేసి

స్వర్గమునుగై కొని సుఖమునొందుచున్నారు. అలాగున ఆత్మవివేకి సరీరములో ఆత్మానాత్మ పదార్థములు కలిసి యున్నవి. అనాత్మమంది ఆత్మపదార్థమును మహాత్ములగు గురువు శాస్త్రములద్వారా తద్విధివి కనుగొని వేరుజేసి తెలియుచున్నారు. అందుచేత తాన ఖండానంద స్వరూపుడనవి కనుగొనుచున్నారు. మఱియును

శ్లో॥ హంసశ్శుక్లో బకశ్శుక్లః కోభేదో బకహంసయోః ।
నీరక్షీర విభాగేతు హంసో హంసో బకోబకః ॥

తా॥ కొంగయు హంసయు రెండును తెల్లగానేయుంటున్నవి అయినను పాలు నీరు వేరుచేయు సామర్థ్యం హంసకేయున్నది. అలాగున ఆత్మను దృశ్యము నుండ వేరుచేసి తెలియుసామర్థ్యము (జ్ఞానము) వివేకవంతునకే యున్నది. అందుచే నాతడు ఆనందము నొందుచున్నాడు. ఇదియే వాచా వేదాంతులకును అమానిత్వాదిత్వాది గుణములు గలిగి నిరంతరము విరామములేక అనుష్ఠాన పరులగు యదార్థ జ్ఞానులకును భేదము. ఈ ప్రకారము దృశ్యము నుండి దృక్కగు ఆత్మను వేరుజేసి ఆయాత్మయే పరమాత్మ అదియే తానని దృఢా పరోక్షజ్ఞానముచే దెలిసిన ఆవరణశక్తి (మరుపు) ఆత్మలోనే స్వయముగానే నశించుచున్నది. ఆమరుపనునది ఎచ్చోటనుండి విజృంభిచెనో ఆట్టి పరమాత్మ యందే లయమొందుచున్నది అజ్ఞానబలముచేతనలోనే మరపుగలిగెను. నిజము తెలిసిన తరువాత తనలోనే ఆవిస్మృతి నాశమాయెను. అనగా ఇంతకుముందు స్వస్వరూపజ్ఞానము లేకుండెను. ఇప్పుడుతానెవ్వడో అపరబ్రహ్మమేయని తాను దెలిసికొనెను. ఇదియే ఆవరణశక్తినాశము స్వస్వరూప సాక్షాత్కారము స్ఫుటశబ్ద ప్రయోగముచే బాగుగా అనుభవ పూర్వకముగా వివేకము కలిగిన ప్పుడే ఆవరణము తొలగునని తెలియవలయును. "తదాఽఽవరణ మాత్మనిచ స్వభావత్" తా॥ వివేక జ్ఞానముకలిగి స్థిరముగా నుండినప్పుడు ఆవరణశక్తి ఆత్మలోనే నాశమొందుచున్నది. అనగా రజ్జువను తెలియనప్పుడు సర్పభ్రాంతి కలుగుచున్నది. ఆత్రాడును తెలియగానే సర్పభ్రమ అచ్చోటనే లయమొందుచున్నది.

విచారించిన రజ్జు విషయమున సర్పభ్రాంతి అజ్ఞానముచే చిత్తమున గలిగెను. జ్ఞానోదయముకాగానే అసర్పభ్రమ మనస్సునందే అణగిపోయెను. అజ్ఞానముచే అంతఃకరణము ఆవరింపబడుచున్నది. ఇదియే మనస్సు యొక్క

సంకోచావస్థ ఇదియే హృదయ కమలము ముకులితమైయున్నదనుట జ్ఞానము దయించినప్పుడు అంతఃకరణమున అవిద్యావరణము తొలంగుచున్నది. ఇదియే మనస్సు యొక్క వికసనావస్థ ఇదియే హృదయపుండరీకము. వికసించినద నుట ప్రాతఃకాలమున సూర్యప్రకాశముచే కమలము వికసితమగుచున్నది. అప్పుడందులోనే మధ్యప్రదేశము స్పష్టమగువిధమున జ్ఞానముచేఅంతఃకరణము తెరువబడుచున్నది. అప్పుడుపరమాత్మ దర్శనము అనగా ఆత్మజ్ఞాన దశలో తెలిసికొనకపోయినప్పుడు అవిద్యావృత మయినదివలె నున్నదనియు జ్ఞానదశలో యథార్థము తెలియనప్పుడు అవిద్యావరణముచే రహితమయినదనియు తెలియ వలయు ఆత్మయెప్పుడును స్వయంప్రకాశమానమే అంతఃకరణముయొక్క సంకోచవికాసములచే శుద్ధాశుద్ధములచే జ్ఞానాజ్ఞానములచే ఆత్మయొక్క ప్రకాశా ప్రకాశవ్యవహారము దెలియవలయు దీనినే ఉపచారధర్మమందురు. ఒకదాని యొక్క ధర్మము మఱియొకదాని యందు కల్పించి వ్యవహరించుట. ఆత్మ సర్వదా నిరావరణమైయుండగా అజ్ఞానజ్ఞానములచే గలిగిన అంతఃకరణము యొక్క ఆవృత అనావృత ధర్మముల ఆత్మయందు కల్పించి వ్యవహరించుట ఇదియే ఉపచారము. ఇట్టివాక్యములు శాస్త్రములందనేకములుగలవు. సూర్యుడు కేతుస్తంభమై ప్రకాశించుటలేదు. మేఘావరణముచే సూర్యుడు కాంతిరహితుడగు చున్నాడు. ఇవియనియు ఉపచారవాక్యములే సూర్యనారాయణుడెప్పుడును ప్రకా శించుచునేయున్నాడు. సూర్యగ్రహణం ఛాయ్ఛాయయె వేరుగాదు. మేఘావరణ ముచే భాస్కరునికి ప్రకాశరహిత్యముగాలేదు. పైలోకములోనున్న వారికి భాస్కరుడు సర్వదా ప్రకాశించునటుల ఆత్మవస్తువున్ను యెప్పుడుస్వయం ప్రకాశమానమై ప్రతిబంధరహితమై యున్నది. ఈ విషయము జ్ఞానులకు మాత్రమే గోచరము సూర్యుడు మేఘావరణముచే ప్రకాశమానుడుకాడు. ఆ విధమున అజ్ఞానదృష్టిచే ఆత్మకు ప్రకాశాప్రకాశములు గలుగుచున్నవి. యథార్థముగా ఆయాత్మ త్రికాలములయందును నిత్యమై విశుద్ధమై నిర్వికారమై వ్యాపకమై నిస్సంగమై స్వయంజ్యోతియై నిరావరణమై ప్రకాశించుచున్నది.

మఱియు ఆత్మానాత్మ వివేకము అనుభవమునకు రాగానే తాను అపర మాత్మయేయని తెలియుటచేత మిథ్యాభూతములైన దేహేంద్రియాదులయం దును దృశ్యప్రపంచమందును గడునాసక్తితో చిత్తములగ్నమై ప్రవర్తించుట సర్వశక్తులతో విజృంభించుటయను విక్షేపముపూర్తిగా నశించిపోవుచున్నది.

తరంగరహితమైన సముద్రమువలె మనస్సుప్రశాంతమై యుంటున్నది. ఈ విక్షేపావరణశక్తులు లేకపోవుట వలన సర్వసంచయములు నశించి జీవుడు పరబ్రహ్మమేయను నిశ్చయజ్ఞానముతోగూడిన ప్రతిబంధ రహిత మోక్షం సిద్ధించు చున్నది. ఇదియే అఖండరూప విజ్ఞానము సాక్షాత్కారమగుచున్నది. ఈ ఆత్మానాత్మవివేక విషయమును చక్కగావిచారించవలయు దృక్కగుపరమాత్మను దృశ్యమునుండి విభజించుట. అనగా వేరుచేయుట ఇదియే వివేకము యేలాటి సంశయములు లేకయున్నచో దీనిని సమగ్వివేకమందురు. మొదట దేహేంద్రియాది ప్రపంచవస్తుజాలములనుండి ఉపనిషచ్ఛాస్త్రములద్వారానో గురూక్తి ప్రకారముగానో ఆత్మను వేరుజేసి నిస్సంశయముగదెలిసికొనవలయును. ఇంతటితో పూర్తిగాక యేలాంటి సంశయములులేక ఆత్మ తాననెడి పరిపూర్ణ విశ్వాసమే సమ్యగ్వివేకము దీనిచేత స్పష్టముగా జీవుడుగా పరమాత్మయే వేరుగాదు ఆ పరబ్రహ్మమే తాను అంతయు సద్వస్తువే అనాత్మవస్తు పొకించుకయు లేదు. పరిపూర్ణ బరబ్రహ్మ మేయున్నది. తానే అంతయు తానేఅయినట్టి స్వయం ప్రబోధజ్ఞానము కలుగుచున్నది. అనగా ఆత్మదృశ్యముకన్న వేరని తెలిసికొని నంతమాత్రమే చాలదు. దానిని అనుభవములోనికి దీసికొనిరావలయును. సంశయ విపరీత అసంభావనలను దోషములు నశించవలయును. సాక్షాత్మానుభవమొంది బ్రహ్మతత్త్వమందు విహరించునప్పుడే శాశ్వతసుఖమును పొందు చున్నాడు. ఇట్టిస్వానుభవవివేకము మాయచేయగలిగిన సకల మోహబంధము లను ఛేదించుచున్నది. కనుక శ్రీ సద్గురుకరుణచే వేదాంతశాస్త్రపరిశుద్ధ విచారణచే మహర్షుల అపారదయచే శ్రీ సర్వేశ్వరుని యొక్క పరిపూర్ణానుగ్రహముచే నిష్కల్మషముగల చిత్తముతో నిరంతర దీర్ఘకాల ఆత్మానుసంధానముచే దృఢతర స్వస్వరూపస్థితిగలిగిన అఖండస్వానుభవము జన్మజన్మాంతరముల నుండి నాటుకొనిన మోహములను యీ జన్మములోనే గలిగిన సంస్కారములను యికను మిగిలిన సంకల్పములను వాటినన్నిటిని సంపూర్ణముగా నశింపజేయుచున్నది. అట్టి వానికి జననమరణ రూప సంసారములేదు. మాయామాలిన్య తరంగ తాడనములులేవు. అట్టిధీరుడే జీవన్ముక్తుడగుచున్నాడు.

నదియనుసంగాక బ్రహ్మము శ్రేష్ఠమైనది తద్భిన్నమైన వాడు జీవుడు యిట్టి భావము అవివేకమే యగును. ఉన్నది బ్రహ్మమే. సకలదృశ్యము కంటె శ్రేష్ఠము. జీవుడును బ్రహ్మముగానే యున్నాడు. లేక జీవత్వము

బంధమోక్షములు జ్ఞానాజ్ఞానములు ప్రకాశప్రకాశములు సుఖదుఃఖములు పర బ్రహ్మమొకటియే సత్యము. సర్వాతీతమున్నదదియే ఇట్టిది విశుద్ధజ్ఞానమగును ఈ ప్యానుభవ వసిద్ధజీవ బ్రహ్మైక్య వివేకాగ్ని అవిద్యారణ్యమునంతయు విశేషముగా దహించుచున్నది. తిరుగా దానిస్వరూపముగాన్పించదు. కాబట్టి ప్రమాణ శ్లోకము జూడుము.

శ్లో॥ ఆత్మానమరణింకృత్వా. ప్రణవంచోత్తరారణిమ్॥
జ్ఞాననిర్మథనాభ్యాసా. త్పాశం దహతిపండితః॥

తా॥ మనస్సును క్రిందికొయ్యగాను ఓంకారమును పైకొయ్యగను చేసి నిరంతర మాత్మను సంధానమునెడి మథనముచే జీవబ్రహ్మైక్యజ్ఞానము గలుగుచున్నది. అను శ్రుతిరీతిగ ప్రణవమును మనస్సు రెంటియొక్క పరస్పరము అనుసంధానమును సంఘర్షణముచే అద్వైత జ్ఞానాగ్ని మెల్ల మెల్లగా గలిగి ప్రజ్వలించినదై యవిద్యారణ్యమును దొలంగి శాశ్వతానందరూప బ్రహ్మము తానగుచున్నాడు. ఇట్టి అద్వైత భావమును బొందినవాడు ఆత్మవస్తువనునది యొకచోటికి పోవునదియు వచ్చునదియుగాదు. అన్నిలోకములయందును యొకేవిధముగా యుంటున్నది. కనుక తనకున్న జనన మరణములులేవు. కాబట్టి ఇట్టివిజ్ఞానికి యవిద్యాబీజము లేనేలేదు. సమస్తజ్ఞాననాశమునకు జీవబ్రహ్మైక్యజ్ఞానమే కారణం అట్టివానికేలాటి బంధములున్ను లేవు. తానే సకలాత్మస్వరూపుడై యుంటున్నారు. బంధమను భావమే లేనివాడై యుండును.

మఱియు "రసవర్జం రసోప్యస్య పరందృష్ట్వానివర్తతే" అనగా పరబ్రహ్మమును తన్నుగాగాంచిన దృష్యమందలి అధ్యాసనివర్తించుచున్నదని భగవద్గీత చెప్పుచున్నది.

శ్లో॥ భిద్యతే హృదయగ్రంధి. చిద్యంతే సర్వసంశయాః।
క్షీయన్తే చాస్య కర్మాణి తస్మిన్ దృష్టేపరావరే॥

తా॥ సర్వాధిష్ఠాన భూతపరబ్రహ్మమును వీక్షించగనే అనగా తననుగాతెలియగనే సర్వసంశయములు దొలగి సర్వకర్మలు ఫలములుడిగి అజ్ఞానావరణము పూర్తిగానశించుచున్నది. అను శ్రుతి ఈ విధ ‥గా శృతిస్మృతుల ప్రమాణములచే బాగుగా సంశయ భావనా విపరీతభావనా అసంభావనలు లేక బ్రహ్మతత్త్వ విచారముచే బహ్మతత్త్ [illegible] పరబ్రహ్మమును వీక్షించిన అనగా స్వస్వరూపమును గనుగొ [illegible] యజ్ఞానావరణము

తొలగిపోవుచున్నది. బీజమే లేకుండిన యంకురముండునటుల అధ్యాసయు అనిత్యములైన దేహాదులయందు మమత్వముచే తానను బుద్ధియు నిత్యమగు ఆత్మయందు యనిత్యత్వబుద్ధిచే సచ్చిదానంద పరమాత్మ తానుగావని తలంచుటయు దొలంగుచున్నది. ఆ ప్రకారము సకలవస్తువులయందలి భ్రాంతిరూప యధ్యాసముచే గలిగిన విక్షేపము (రజస్తమోగుణముచే ధ్యానమందు మనస్సు నిలువక చెల్లించుట దైవమువందు నమ్మకములేక విషయాదులయందు ప్రవర్తించుట) తద్దుఃఖము అనగా జననమరణ రూప సంసారబంధము అంకురమే లేకుండిన వృక్షమేర్పడనటుల యధ్యాసము నశించినందుచే ఇవియన్నియు నశించుచున్నవి. అన్నిటికికారణము ఆత్మనుమఱచుటయను ఆవరణము దాని కార్యము అధ్యాస దానియొక్క కార్యము విక్షేపము బహువిధ దుఃఖములున్ను అగుచున్నది. ఆవరణము అధ్యాస విక్షేపమగునట్టి మూడంతస్థులతో గూడిన సౌధముగా అజ్ఞానమున్నది మొదటిదగు యావరణయను యంతస్థును నాశనముజేసిన మిగిలిన రెండును స్వయముగా కూలినశించుచున్నవి. అనగా వివేకమతి స్వస్వరూపానుసంధానముచే పైమూడు దోషములను సులభముగా నశింపజేయుచున్నాడు. ఆవరణము తమోగుణము విక్షేపము రజోగుణము దేహేంద్రియాది యధ్యాస దానిలోజేరినదే యగును. స్వస్వరూపమును అవిస్పష్టముగా తెలియజేయునట్టి సత్త్వగుణావరణము ఇవి యన్నియు బ్రహ్మదర్శనముచే నశించుచున్నవి. ఇటులనే కారణశరీరమావరణము సూక్ష్మశరీరమధ్యాస విక్షేప దుఃఖాదులు స్థూలాశరీరము మూడు వాకిల్లతో గూడిన దేవాలయములో దేవుని గాంచవలెనన్న మూడు దరవాజాలను దాటవలయును. ఆలా గున ఆత్మను గాంచవలయునన్న ఆవరణాధ్యాస విక్షేపములను రజసత్త్వ తమోగుణములమూడున్ను త్రివిధావస్థలను త్రివిధశరీరములను దాటవలయును. అప్పుడే శాశ్వతానందము లభించును. ఇదియే కైవల్యప్రాప్తి అఖండజ్ఞానము శివము.

ఇక చీకటిలో త్రాడు రూపము కనబడకపోయెను. అందుచే వెంటనే సర్పభ్రాంతి కలిగెను. తరువాత నానావిధ అనర్థములు జనించెను. ఆలాగుననే స్వరూపజ్ఞానము అజ్ఞానావరణమను చీకటిచే మరుగుపడుచున్నది. అందుచే అనిత్యములగు దృశ్యపదార్థములయెడ ఆత్మత్వబుద్ధి నిత్యానంద స్వరూపమగు ఆత్మయందు అనగా తనస్వరూపమందు అనాత్మత్వబుద్ధి యిట్టి

అధ్యాస గలుగుచున్నది. అధ్యాసయనగా మిథ్యాజ్ఞానము దేహేంద్రియాది సౌఖ్యములను నిత్యములనుకొని భ్రమించుటచే మనస్సువానియందే ప్రవర్తించుచున్నది. చిత్తమునానావిధములగుచున్నది. ఇదియే విక్షేపరూప దోషము. దీని కార్యము జీవాత్మను దురంత సంసారగర్తమున పడవేయుటయే అధిష్ఠాన వస్తువుతెలియక పోవుటచేతనే అన్ని అనర్థములు కలుగుచున్నవి. చీకటి యందు త్రాడునుజూసి సర్పమనియు దండమనియు భూరేఖయనియు జలధార యనియుపలువురు తలంచుచున్నారు. అలాగున ఆత్మను యింద్రియములుగాను ప్రాణముగాను, జగత్తుగాను, మనస్సుగాను, ఇతను అనేక విధములుగా దలంచి భ్రమించుచున్నారు. అయినను సాధారణముగా రజ్జువునుగాంచి పాము నిమే తలంచి భయపడుచున్నారు. అటులనె తాను మృత్యురహిత అమృత స్వరూపుడైనను మృత్యువు వాతబడు దేహముగా దలంచి పలువిధముల దుఃఖములకు లోనై నానా విధ యోనులందు పుట్టి పరితపించుచున్నాడు. ప్రపంచ మంతయు భాస్కరుని కాంతిచే ప్రకాశవంతమైనను తనకన్నును తాను మూసి కొనిన ప్రపంచమంతయు తమో వ్యాప్తమైనటుల తన స్వరూపమును తాను తెలిసికొనవిపోయిన అంతయు అజ్ఞానమే. త్రాడును త్రాడుగా గాంచువిధమున పరబ్రహ్మ స్వరూపమగు తనను పరబ్రహ్మముగా జూసిన పరబ్రహ్మమే యగుచున్నాడు. రజ్జువునుగవిన అజ్ఞానదాృంతి భయకంపాదులు తొలగునటుల పరబ్రహ్మమును దర్శించిన ఆవరణమిథ్యాజ్ఞాన విక్షేపదుఃఖాదులు తొలగుచున్నవి. కాబట్టి అజ్ఞానమయ సంసారబంధవిముక్తికొఱకు యథార్థమగు బ్రహ్మ వస్తువును తెలిసికొనవలయును. అట్టివాడు అత్యధికకానందమును పొందుచున్నాడు అదియునుంగాక జడమగుబుద్ధియే పరిశుద్ధాత్మ చైతన్యమునాశ్రయించి ఆవరణ మిథ్యాజ్ఞాన విక్షేపములను గలుగజేయుచున్నదనియు ఆ మూడున్ను అసత్యములనియు అనువిషయమును చక్కగాతెలియును. అనగా ఇనుము స్వభావముగా దహింపశక్తి లేనిది శ్యామవర్ణముగా నుండును. అట్టి అయఃఖండము అగ్నియొక్క సంబంధముచే బాగుగా కాచబడినచో దహనశక్తిగలదై దావివర్ణమైపోయి ప్రజ్వలించుచున్నది. అలాగున స్వతసిద్ధముగా జడమగు బుద్ధి ప్రకాశరహితమై యున్నది. తమోగుణ మాయమై యున్నది. దీనినే మూలాహంకారమనియెదరు. యత్నించి తత్కార్యమును జేయజాలకున్నది. అయినను చైతన్యమైన ఆత్మతో చేరియుండుట వలన జడాత్మకబుద్ధియు

చైతన్యవంతమై విజృంభించి ప్రకాశించుచున్నది. ఆబుద్ధియొక్క విలసితమే శబ్దస్పర్శ రూపాదులుగానున్నది. అనగా సమస్తము మూలాహంకారమనబడు బుద్ధికార్యమైయున్నది. ఈ ఆవరణవిక్షేప మిథ్యాజ్ఞానరూప దోషములున్ను బుద్ధియొక్క కార్యమే వేరుగాదు. కనుక బుద్ధియే చైతన్య బ్రహ్మమునాశ్రయించి ప్రకాశవంతమైన సమస్తమును కల్పించుచున్నదని తెలియవలెను. కనుకనే మాయా జడమయినది దీపము నాశ్రయించి నీడయున్నటుల పరబ్రహ్మము నాశ్రయించి మాయయున్నది. అందుచే తనే నామాయ అఘటన ఘటనా సామర్ధ్యము గలదగుచున్నదని వేదాంతులు చెప్పెడు తరిభాషయైయున్నది. ఇట్టి చైతన్యాశ్రితమాయనే ఈశ్వరుడందురు. మఱియు పాలలో నీరు కలిసియున్నటుల అనాత్మ పదార్థమగుబుద్ధి ఆత్మలో గలిసియున్నది. కాబట్టి జలము పాలవలె గానుపించునటుల బుద్ధియుచైతన్యము గలదివలె గనబడుచున్నది. ఇంతకు అనాత్మ భూతములైన జడములగు దేహేంద్రియాదులన్నియు ఆత్మశక్తిచేతచే ప్రకాశవంతములగుచున్నవి. తత్తచ్చేష్టలలో ప్రవర్తించుచున్నవి. ఆత్మయు నిస్సంగియై సర్వవిలక్షణమై యున్నది, ఇకను రాగి బంగారముతోచేరి అలంకారములుగామారి అలంకరింప యోగమగనటుల బుద్ధియు ఆత్మతోచేరి చైతన్యయోగమైనదివలె భాసిల్లు చున్నది. విజ్ఞానులు బంగారమునుండి రాగినివేరుచేసి తెలియునటుల ఆత్మజ్ఞానులను ఆత్మనుండి బుద్ధిని వేరుజేసి ఆత్మనే గ్రహించుచు తెలియుచునారు. ఆత్మతరిశుద్ధమైనది. ఈ బుద్ధితో చేరియుండుటవలన జీవాత్మయని చెప్పబడు చున్నది. అందుచేతనే ఆత్మతో చేరిన బుద్ధికే (జీవాత్మకే) సుఖదుఃఖాదులు కర్తృత్వ భోక్తృత్వాదులు మొదలయిన అజ్ఞాన కార్యములన్నియు కలుగు చున్నవి. ఈవిషయమును కనుగొని ఆత్మనిత్యశుద్ధ స్వయంప్రకాశమని వేరు జేసి తెలియవలయు అట్టి ఆత్మయొక్క ప్రభాప్రసర లేశముచేతనే జడభూత బుద్ధి శబ్దస్పర్శ రూపరసగంధములగు పంచేంద్రియ విషయములను గ్రహించుచున్నది. ఇకను ఆబుద్ధి పంచతన్మాత్రలనబడు సూక్ష్మభూతములయిన ఆకాశాదులును స్థూలభూతములగు శరీరేంద్రియంబులగును. ఇకను అనాత్మపదార్థ జాలసర్వస్వమును మారుచున్నది. లేక విజృంభించుచున్నది. మఱియు కొలిమలో ఇనుపఖండమును బెట్టి గాలితిత్తులతో యూదినచో అగ్నిసంబంధముచే ఇనుపముక్కయు బాగుగా ప్రజ్వలించుచున్నది. అలాగున అంతఃకరణమను

కొలిమిలో ఆత్మయను అగ్నియొక్క సంయోగమువలన బుద్ధియను (జడ భూతవస్తువు) ఇనుపముక్క ప్రాణాపానములను ఊపిరితిత్తులచే ప్రజ్వలించు చున్నది. చైతన్యవంతమున్ను అగుచున్నది. విచారించిన అగ్నిసర్వవిలక్షణ మైయున్నటుల బుద్ధ్యాదులన్నిటికంటెను ఆత్మస్వయంప్రకాశమై సర్వవిలక్షణ మైయున్నది. ఎవం బుద్ధేః పరం బుద్ధ్వా॥ అనుభగవద్గీతాస్మృతి వాక్యము॥ యోబుద్ధేః పరతస్తుసః॥ అను శ్రుతివాక్యమున్ను బుద్ధికంటె ఆత్మవిలక్షణ మైనదని తెలుపుచున్నవి. అట్టి ఆత్మనాశ్రయించియే బుద్ధి(మూలాహంకారము) సకలమునుతేయుచు సకలమును గ్రహించుచు కార్య కారణమైయున్నదని తెలి యవలయు ఇట్టిబుద్ధియే కల్పితము కావున విచారించగా కారణ భూతబుద్ధియు తత్కార్యభూత శబ్దస్పర్శాదులున్ను మిథ్యాభూతములే. మఱియు అట్టిబుద్ధిచే నేర్పడిన విక్షేపావరణాదులున్ను అసత్యములే అనగా అజ్ఞానబుద్ధి ఆత్మను మరుగుపరచుచున్నది. దీని కార్యము స్వస్వరూపాత్మను స్మృతికి (జ్ఞప్తికి) రానీయకుండుట ఇదిఆవరణరూపదోషము అందుచే రజోగుణము గలిగి మన స్సు చలించును. విషయాదులయందు ప్రవర్తించును ఇది విక్షేపరూపదోషము ఇకను అట్టిబుద్ధి దేహాదులయందు ఆత్మత్వభావమును గలింగించుచున్నది. ఇది మిథ్యాజ్ఞానరూపదోషము ఈ మూడున్ను భ్రాంతిసమయమను స్వప్నములోను సంకల్పకాలములోను యుంటున్నవి. భ్రాంతిపోయినప్పుడును స్వప్నములేన ప్పుడును, సంకల్పములు అణగినప్పుడును ఆ మూడు కనబడుటలేదు. కావున ఆయావరణాదులు మూడును మిథ్యాభూతంములే జీవునకు బుద్ధ్యుపాధి చేతనే ఈ మూడున్ను గలుగుచున్నవి. త్రాడును జూచి సర్పమనుకొనుటయు శుక్తిని జూచి రజితమనుకొనుటయు, స్థాణువును జూచి పురుషుడని, పిశాచమని, భేతా లుడని తలంచుటయు ఆకాశమందు నైల్యము దారువునందు గజత్వబుద్ధి మొద లగునవి భ్రాంతిజ్ఞానములు ఇవన్నియు యథార్థమును తెలియకపోవుట చేతనే బుద్ధియందు అజ్ఞానమాలిన్యముండుట చేతనే గలుగుచున్నవి. ఇట్టి విషయము లందే ఆవరణవిక్షేప మిథ్యాజ్ఞాన దోషములున్నవి. స్వప్నము మనఃకల్పితము ఈ దోషత్రయము మనస్సుచే నేర్పడును. కేవలసంకల్పములు అనంతములై యున్నవి. ఇవియన్నియు సత్యములుగావు కాబట్టి భ్రమస్వప్నమనోరథముల యందు పైచెప్పిన మూడు దోషములున్నవి. మఱియు భ్రాంతి స్వప్నమనో రథములవలె మిథ్యాభూతములై యున్నవి. భ్రాంతియన అజ్ఞానము ఇదియే

ఆవరణము తమోగుణము కారణశరీరము స్వప్నమనగా చలనము ఇదియే విక్షేపము రజోగుణము సూక్ష్మశరీరము. మనోరథమనగా జాగ్రద్వ్యవహారము ఇదియే మిథ్యాజ్ఞానము దేహాదులయందు ఆత్మత్వభ్రాంతి స్థూలశరీరము సత్త్వగుణము ఇవియన్నియు ప్రతిబంధములు బుద్ధియందు అజ్ఞానము దొలంగిన సర్పోపాదులు తొలంగి ఆత్మ స్వయంప్రకాశమానమై విరాజిల్లును. ఈ విషయమును చక్కగాదెలిసి యథార్థమగు పరబ్రహ్మమునుగాంచిన సకల ప్రతిబంధములు నశించును. అందుచే నిరావరణ స్వయంప్రకాశ నిత్యశుద్ధ బుద్ధ పరబ్రహ్మము తానగుచున్నాడు.

కాబట్టి అంతఃకరణమున గలుగు అహంకార మమకారములు రాగద్వేషాదులు కామక్రోధ లోభములు ఈవికారములన్నియు అజ్ఞానముచేతనే గలుగుచున్నవి. అంతఃకరణమున్ను అవిద్యాకల్పితమే. కావున అనేక వికారములతో గూడి క్షణక్షణము పరిణామము జెందుచున్న మిథ్యాభూత ప్రకృతిచే (మాయచే) కలిగిన అంతఃకరణము ప్రియమోదరూప కర్తృత్వం భోక్తృత్వరూప సుఖదుఃఖాత్మక వికారములన్నియును క్షణక్షణము మారిపోవునవి స్థిరములుకావు. ఒకే తీరుననుండవు. చలనాత్మక ప్రకృతిచే చంచలమగు మనస్సు జనించెను. అందుగలుగు సంకల్ప వికల్పములును స్థిరముగా నుండవుగదా! సర్వకారణమగు మూల ప్రకృతియే అసత్యము వికారియగునప్పుడు తత్కార్యమంతయు తథ్యముగాదు. అటులనేవనితాది విషయములు శబ్దాది విషయములును దేహముతోనే నశించుచున్నవి. స్రక్చందన వనితాది భోగములు పంచేంద్రియ విషయములగు శబ్దాదులు దేహము పోవునప్పుడు దేహమునకు సంబంధించినవగుటచే నశించుచున్నవి. దేహమేలాగున వికారియో, నత్యముగానిదో క్షణక్షణము మారుచుండునో ఆలాగున విషయాదులును ఎప్పుడును మారుచునే యుండును. ఈలాగున ప్రకృతియు ప్రకృతి వర్గమును సర్వథా పరిణామశీలములగుటచే వికారి పదార్థములు మిథ్యాభూతములగుటచే నీ బుద్ధి యిటులయుండును. మనస్స్థిరదని నిర్ధారణచేయ శక్యముగాదు. కాబట్టి జ్ఞానులుచక్కగా యీ విషయమును గుర్తెఱుంగుదురు. అందుచేవారు అచలమగు పరమాత్మను పొందుదురు. ప్రకృతికి తజ్జన్యములగు వికారములకు సకల విషయములకు విలక్షణమై ఆత్మయున్నది. సమస్తమును తెలియుచున్నది. ఆత్మమాత్రము సర్వదా యొకేవిధముగా నున్నది. వస్తు, అవికారి అందుచే ఆత్మసత్పదార్థము

తద్భిన్నమయినదంతయు అసత్తు కాబట్టి ఆత్మను అవికారిగను సత్తుగను తెలియవలయు తెలిసి నిరంతరమనుసంధానమందుండవలయు.

మఱియు ఆత్మ పరమాత్మస్వరూపమై యున్నది. అనాత్మ పదార్థములన్నిటికి పరమైయున్నది. నిత్యము సర్వకాలసర్వావస్థలయందును వికారమును జెందనిదై యున్నది. అద్వయము రెండవది లేనిదై యున్నది. ఏకరూపమై యున్నది. తనకుతానే యున్నది. పరిపూర్ణము దేశకాలాదిభేదములచే పరిచ్ఛిన్నముగానిది కేవలము జ్ఞానమే చైతన్యమే స్వరూపముగాగలది అన్నిటిని ప్రకాశింపజేయుచు, స్వయంప్రకాశమైనది బుద్ధ్యాది అంతరేంద్రియములకును వేరై వాటి వ్యాపారములను కనుగొనుచు కర్తృత్వభోక్తృత్వాది ధర్మములం జెందక సుఖదుఃఖములకు పుణ్యపాపములకు బంధమోక్షములకు విషయముగాక సర్వద్వంద్వములకును అతీతమై తానుమాత్రమసంగియై యున్నది. సకలదృశ్యములకును దృక్కై నిత్యమై యున్నది. అంతరేంద్రియముల యొక్కయు బాహ్యములగు కర్మేంద్రియ జ్ఞానేంద్రియములయొక్కయు వాటికిసంబంధించిన అవస్థాత్రయము యొక్కయు శరీరత్రయము యొక్కయు సకలదృశ్యము యొక్కయు సమస్త విషయములను కనుగొనుచు తానుమాత్రము సచ్చిదానంద రూపమైయున్నది. ఇట్టిదియే ఆత్మ సత్తుకును అసత్తుకును విలక్షణమైయున్నది కార్యమగు జగత్తునకును కారణమగు అవ్యక్తమునకును వేరుగానున్నది. సకల వ్యవహారము ద్వంద్వముతోకూడియే యున్నది. సత్తనిన అసత్తనియే వెంబడే వ్యవహరించవలెను. సుఖమనిన దుఃఖము పుణ్యమనిన పాపము. ప్రకాశమనిన చీకటియు వెంబడే యుంటున్నవి. వేదములును సత్పదార్థమును బోధించుచున్నవి. ఆపరమాత్మను శః షత్తు తెలియజేయుచున్నవి. విచారించిన ఆ పరమాత్మచేతనే యివన్నియు సత్తావంతములై యున్నవి. జీవులయొక్క అజ్ఞాన నివృత్తికై వేదాదులు ప్రవర్తించినవి. ఘటోపాధిని తొలగించుటకు దండము ఉపయోగపడునటుల వేదవాక్యములను కట్టకడకు అహం బ్రహ్మాస్మి జ్ఞానరూప వృత్తియు ఆవరణభంగము మాత్రము గలుగజేయుచున్నది. దండము దీపమును ప్రకాశింపజేయునటులయు వృత్తిజ్ఞానము పరమాత్మను ప్రకాశింపజేయజాలదు. ఆవిలక్షణమై యున్న ఆత్మయే అహంబ్రహ్మాస్మియను వృత్తిని తెలియుచున్నది. కావున "అశబ్దమస్పర్శమవ్యవహార్యం" అను శ్రుతివాక్య రీతిగా వేదాది శబ్దములుకూడా యింద్రియములకు గోచరములగుటచే

పరమాత్మను వచింపజాలవు. శబ్దతీతమై ఆత్మయున్నది. వాగతీతమనియూ వేదశ్రుతులు ప్రతిపాదించుచున్నది. పదపద్విలక్షణమనగా అవ్యవహారమ నియు అర్థము బుద్ధ్యాది సాక్షియనగా మనస్సునకు గోచరము కానిదని అర్థము అన్నిటిని అపరమాత్మ తెలియుచున్నది. ఇదియే అవాఙ్మానసగోచరము ఆత్మ యని చెప్పెదు వాక్యమునకు అర్థము. అపరమాత్మ ప్రణవశబ్దమునకు గూడ గోచరముగానిది ప్రణవార్థ రూపమై యున్నది. అని శ్రుతుల తెలుపుచున్నవి కావున ఆత్మశబ్దాతీతము పదపద్విలక్షణము వ్యవహారాతీతము మఱియు నీ ఆత్మవస్తువు "అహం" అనుపదముచే బోధితమగుచున్నది. "అహమ్మనగా" నేను అని అర్థము తాను ఆ పరమాత్మ స్వరూపుడైయుండగా అనాత్మపదార్థ ములందలి భ్రమచే నేననుచున్నారు. ఇదియే అజ్ఞానము విచారించిన నేను అనగా ఆత్మయని అర్థము. "అహం పదము" తనను దేహాదులనుండి వేరుజేసి చైతన్య పరమాత్మనుగా తెలియజేయుచున్నది. అహంపదము (నేను) స్త్రీల యందును పురుషులయందును నపుంసకులయందును యొకటిగానే యున్నది. సర్వజాతులయందును సర్వాశ్రమములయందును. బాల్యాది సకలావస్థల యం దును మార్పును జెందకయున్నది. త్వం ఇదం (నీవు ఇది) అను పదములును సర్వనామ వాచకములగుటచే అన్నిటియందును యొకేరీతిగానుంటున్నవి. అయి నను అహం అనునది అపరోక్ష జ్ఞానరూపమైయున్నది. త్వం ఇదం పరోక్ష ములై యున్నవి. అందుచేతనే అహం పదము మాత్రము ఆత్మబోధకముగా నున్నది. నేనను వ్యవహారము లేకయే వ్యవహారమున్ను జరుగుటలేదు. ఇది అందరికి అనుభవసిద్ధముగదా: కాబట్టి ఆత్మలేక యేదియు జరుగుటలేదు. ఆ ఆత్మయే అన్నిటిలోను యున్నది. అందుచేతనే సకలవ్యవహారములు జరుగు చున్నవి. ఆత్మమాత్రము అసంగమై నిర్లిప్తమై యున్నది. "తత్త్వమసి" అను వాక్యమున త్వం అను పదమునకు వాచ్యార్థ లక్ష్యార్థములవలె అహం అను పదమునకును వాచ్యార్థలక్ష్యార్థములుగలవు. అహం అనగా సకలేంద్రియాదులతో గూడిన అంతరాత్మ వాచ్యార్థము లక్ష్యార్థము ఇంద్రియాదులను విడనాడి కేవల చైతన్యరూప అంతరాత్మ కూటస్థాత్మయేయని తెలియవలయును. అనగా ఆ ఆత్మ అహం పదముచే బోధితమై ఆఅహం పదమునకు లక్ష్యార్థమై యున్నది చక్కగా విశదీకరించిన అహం పదముగూడ కల్పితమే. నిర్విషయమగు పర బ్రహ్మము అహం పదమునకు విషయముగాదు. అన్నిటిని విషయము చేయు

చున్నదై ఆయాత్మయుంటున్నది. ఇదియే సత్యము అహం పదార్థముబోధకై అజ్ఞాన నివృత్తికై ఉపనిషత్తులచే వ్యవహరింపబడినది. మఱియు ఆయాత్మ అన్నిటిలోను అంతరాత్మయై యున్నది. సర్వదా ఆనందరూపమై యున్నది. ఆనందమే పరమాత్మ అదియేతాను. నిరావరణ స్వయంప్రకాశానందఘనము.

మఱియు పై చెప్పిన ప్రకారము ఆత్మ యొక్కటియే సత్యమైనది. ఆనందరూపమైనది. తదితర అనాత్మ పదార్థములు దుఃఖజనకములు అనిత్యములు. తాను సచ్చిదానంద ఘనమైన పరమాత్మయై యున్నాడను అధిష్ఠాన జ్ఞానరీతిగా సత్యమయిన ముముక్షువు సత్పదార్థమును అసత్పదార్థమును విభాగ పూర్వకముగా తెలియుచున్నాడు. సత్తైనది ఆత్మయే సారవంతమైనది ఆయ్యదియే ఈ సంసారములో అన్వేషించి తెలిదగినది సనాతనమైనది. ఆపరమాత్మ యొక్కటియే అనాత్మ పదార్థజాతమంతయు వినశ్వర స్వభావముగలదియే భ్రాంతిజనకమే ఈ ప్రకారము బ్రహ్మవిచారముచే సదసత్తులగు ఆత్మానాత్మల విభజించి దెలియుటయే ఆత్మానాత్మ వివేకమగును. ఇదియే సదసద్వివేకమగును ఇట్టిసారగ్రాహి అనగా యథార్థవిచారణ జ్ఞానమే అన్నిటికి ప్రధానమూలమై యున్నది. ఈ జ్ఞానముచే స్వయం ప్రబోధజనించును. దానిచే ఆత్మతత్త్వ నిశ్చయముగలుగునదియు అస్వాత్మ నిర్ణయముచే అఖండపరిపూర్ణ జ్ఞానస్వరూపము తానని తెలియుచున్నాడనియు ఈప్రకారము కనుగొన్నందుచే సమస్త దేహాద్యహంకారములనుండి అనగా ప్రాకృతసంబంధముల నుండి విముక్తుడై పరమశాంతిని ముముక్షువు పొందగలుగుచున్నాడు. అనగా విపశ్చిత్తు ॥

తా॥ దోషజ్ఞుడు అనగా గుణములను దోషములను గుర్తెఱుంగువాడు. పశ్చమ దృష్టియనదగు జ్ఞానయోగదృష్టిగలవాడు అట్టినిత్యానిత్యవస్తువివేకి అసత్తగు అనాత్మ ప్రపంచమును త్రోసి సత్తగుపరమాత్మను గ్రహించుచున్నాడు. మధుపము (తుమ్మెద) తామరపుష్పమునుజేరి పుష్పరసమును మాత్రము గ్రహించుచున్నది. దగ్గఱయున్న కింజల్కములనుగాని పత్రనములుగాని దేనిని స్వీకరింపదు. అలాగున దేహమను హృదయమనే అంతఃకరణమను పుండరీకమున్నది. ఆ హృదయపుండరీకములోనున్న కింజల్కాదులవంటి వృత్తులను విడనాడి వివేకి హృదయ కమలమునే పరిశోధించి పుష్పరసమువంటి పరమాత్మతత్త్వమునే అనగా స్వరూపమునే కనుగొనుచున్నాడు. ఇట్టి విచారణచే అన్నిటికన్న విలక్షణమైనఆత్మయేతాను అదిపరబ్రహ్మమని నిశ్చయజ్ఞానము

గలవాడగుచున్నాడు. ఈ నిశ్చయమును శాస్త్రములయందును గురుదేవుని ద్వారాను గ్రహించుచున్నాడు. అంతమాత్రముచేతనే ప్రయోజనముగలుగదు. అజ్ఞానము నశించి జ్ఞానికాదు. మరేమనిన ఆ పరమాత్మనిశ్చయము స్వానుభవ పూర్వకముగా బడయవలయును. శ్రవణముజేసి ఆపరమాత్మతానని మననము జేసి దానియందే పరబ్రహ్మమందేధారణజేసి ఆ పరమాత్మ తాను గావలయు ఇదియే నిజబోధయగును. స్వయంప్రబోధ ఇట్టిస్వానుభవ బోధదృష్టిచే ఆత్మ నిశ్చయము గలుగుచున్నది. అందుచే తాను అఖండ పరిపూర్ణ జ్ఞానముగలవాడ గుచున్నాడు. అప్పుడు సకలానాత్మ బంధములనుండి విడివడి ప్రకృతినాశముచే తాను సర్వశాంతిని బొంది సర్వోపరతుడై పరబ్రహ్మమగుచున్నాడు.

"అవి కల్పేన" సమాధినా" వికల్పరహిత సమాధిచే నిర్వికల్పసమాధి అనగా హృదయములో యేవికల్పములు యేవృత్తులు మలిన వాసనలులేకుండ యుండవలయును. శరత్కాల నిష్కలంక పరిపూర్ణ చంద్రునివలె అంతఃకర ణము శుద్ధముగా వుండవలయును. ఏయొక అనాత్మ భావములుగాని దృశ్య ముగాని లేకుండజేయవలయు కేవలము బ్రహ్మాకారవృత్తితో మనస్సంతయు పరిపూర్ణమై బ్రహ్మమయమై యుండవలయును. అప్పుడు మనస్సే లేకుండు టచే దృశ్యము పూర్తిగా నశించును. తాను పరబ్రహ్మమేయగు చున్నాడు. ఇదియే స్వస్వరూపస్థితియగును. హృదయమున శరత్కాలకళంకరహిత పరి పూర్ణచంద్రునివలె శుద్ధమై, ప్రశాంతమైవున్నందుచే చంద్రునినుండి సర్వతో వ్యాపమగు పరిశుద్ధమగు జ్యోత్స్న బయలుదేరువటుల అట్టిపరిశుద్ధ హృదయ మునుండి ప్రశాంతమైన అఖండపరిపూర్ణానందము ద్భవించుచున్నది. తాను ఆనందరూపుడగుచున్నాడు. ఈ నిర్వికల్పసమాధియె అసంప్రజ్ఞాత సమాధి యగును. త్రిపుటి భేదములేక అంతయు పరబ్రహ్మమయమై యుండుట. అను స్వరూపస్థితి ఈ ప్రకారముండుటయె అసంప్రజ్ఞాత సమాధి యని చెప్ప బడును. ఈ సమాధుల గురించి యోగశాస్త్రము చక్కగాఁదెలుపుచున్నది. సమాధులు యోగసమాధులనియు రెండువిధములుగావున్నవి. యోగసమాధు లనియు అంతఃకరణనిరోధ రూపములై యుండును. వీనికియమనియమాదులు యోగాంగములై యున్నవి. మఱియునివిజ్ఞాన సమాధ్యభావమునకు ఆవశ్యక ములేయగుచున్నవి. ఈ యమనియమాదులను జ్ఞానసమాధికి తగినట్టుగాను జ్ఞానాంగ యమనియమాదులు ఉపనిషత్తులయందు చెప్పబడి యున్నవి.

యోగసమాధికి ముఖ్యములుగా యమనియమాదులెటులున్నవో అటుల జ్ఞాన సమాధులకు శుభేచ్ఛతను మానసి అసంసక్తి పదార్థభావనాది మొదలగు సప్త జ్ఞానభూమికలు ముఖ్యావసరములై యున్నవి. జ్ఞానసమాధులన్నియు అంతఃకరణమునకు అతీతమయిన పరబ్రహ్మస్థితి రూపములై యుండును. విచారించిన జ్ఞానులు యోగులు దెలిపెడు నిర్వికల్పసమాధి యొక్క అర్థమును ప్రతిపాదించునదై యున్నది. అయినను ముముక్షువుల యోగ్యతానుసారము సాధింపవలయును. అందున జ్ఞానులును సకలాంతఃకరణ వృత్తులను నశింపజేసి తాను పరబ్రహ్మమై యుండవలయును. తాను అనగా జీవుడుకాదు. పరబ్రహ్మమేను అని జీవబ్రహ్మైక్యయోగమును చెప్పుచున్నారు యోగులును అన్నివృత్తులు నశింపజేసిన అంతఃకరణమే లేకపోవుచున్నది. అప్పుడుమనస్సు బ్రహ్మరంధ్రమనబడు పరబ్రహ్మమందు లయమగుచున్నదని తెలుపుచున్నారు. కావున యోగమతమునను నిర్వికల్పసమాధి యనగా పరబ్రహ్మస్థితినుండుటయే వేరుగాదు. ఇంతకు సిద్ధావస్థ యేమన బాహ్యాభ్యంతరముల యందును యెచ్చోటను సకలేంద్రియములు తత్తద్వ్యాపారములతోగూడి కొనియుండుట యను జాగ్రదవస్థయందును కేవల మానసిక వృత్తిరూప స్వప్నావస్థ యందును సకల వృత్త్యుపశమ రూపబుద్ధి విలయరూప సుషుప్త్యవస్థయందును సర్వకాల సర్వదేశ సర్వావస్థల యందును యే ప్రజ్ఞారూప అఖండజ్యోతి స్వయంప్రకాశమానమై దేదీప్యమానమై దేశకాలాది పరిచ్ఛిత్తిలేక వెలుగొందుచున్నదో అట్టి పరబ్రహ్మమేతాను సచ్చిదానందరూపుడను తానేయను అఖండపరిపూర్ణ స్వానుభవ విజ్ఞానము నిరంతరముండుటయే నిర్వికల్పసమాధి యగును. ఇదియే వేదోపనిషదాదులచేతను మహాత్ములగు బ్రహ్మనిష్ఠామతవముగల వారిచేతను గురువాక్యముచేతను ముముక్షువులకు ప్రసాధించిన సిద్ధమై నిర్ణీతమై యున్న పరమ ధర్మము ఇట్టి నిర్వికల్పసమాధిచే హృదయములోని సకల మాయా మాలిన్య సంస్కారములు జన్మాంతరములు పూర్తిగా నశించుచున్నవి. సకలవాసనా సముదాయమగు అజ్ఞాన గ్రంధితుత్తునియలగుచున్నది. అప్పుడు హృదయ పుండరీకము వికసించుటచే అజ్ఞానమను ముకుళితావస్థ(ముడుచుకొని హృదయ కమలముండుటయను స్థితి) లేకపోవుచున్నది. అనగా హృత్పుండరీకము విరజమై (రజోగుణ రహితమై) విశుద్ధమై (తమోగుణ రహితమై) నిరావరణమై (సత్వగుణమును కూడి అతిక్రమించినదై కేవల పరబ్రహ్మమై యుండును.

అప్పుడు చిత్తము చిత్తముగాదు. మకారరహిత చిత్తగును. ఇదియే విజ్ఞానావస్థ హృదయములోని వాసనాసంపుటము నశించుటవలన అజ్ఞానము (అవిద్య) తొలంగుటచే అంతఃకరణమును వది (సంకల్ప వికల్పాత్మక మనస్సు) లేనిదగును. ఇదియే అమనస్కస్థితి తాను పరబ్రహ్మమని నిస్సంశయముగా తెలియుటయే యగును. ఇట్టి సకలవృత్త్య పరమరూప స్వయంప్రబోధచే అద్వితీయ పరమాత్మ దర్శనము సిద్ధించుచున్నది. అనగాతాను ఆ పరబ్రహ్మమే యను నిశ్చయ తత్త్వముచే తానుతానై (పరబ్రహ్మమై) యుండుటయను స్వస్వరూపస్థితివలన పరబ్రహ్మమే తానై యున్నాడు. మఱియొకటిలేదు. అద్వితీయ బ్రహ్మమే పైజెప్పిన విషయమునే భగవద్గీత జెప్పుచున్నది.

శ్లో॥ యదాతే మోహకలిలం, బుద్ధిర్వ్యతి తరిష్యతి।
తదాగంతాసి నిర్వేదం, శ్రోతవ్యస్య శ్రుతస్యచ॥

తా॥ ఓ అర్జునా! నీయొక్క బుద్ధి అజ్ఞాన కాలుష్యరహితమెప్పుడగునో లేక ప్రజ్ఞారూపమగునో (నీవు పరబ్రహ్మమగుదువో) అప్పుడు సకల శాస్త్రముల యొక్కయు సకలోపనిషత్తుల శ్రవణముయొక్కయు ఫలితమైన పరబ్రహ్మస్థితిని పొందినవాడగుదువు. "పరందృష్ట్వానివర్తతే" అనగా పరబ్రహ్మమును గాంచిన పూర్తిగా జ్ఞానావరణము తొలగును "భిద్యతే హృదయగ్రంధి" మొదలగు వాక్యములచే పైవిషయమునేముందక కఠోపనిషత్తులున్ను నిరూపించుచున్నవి. కనుక నిర్వికల్ప నిరంజన నిర్వికార నిత్యశుద్ధముక్త పరమానంద రూపమైన స్వస్వరూప పరబ్రహ్మమును మరువకయుండుట. అంతయుతానై యుండుటయను నిర్వికల్పసమాధిని నిరంతరమభ్యసించుటచే గ్రంధిరూప సకలాజ్ఞానావరణములు తొలంగి పరిపూర్ణ బ్రహ్మమగుచున్నాడు. అదియేయున్నది. ఇంకయును సమాధియనగా శ్లో॥ ప్రశాంతవృత్తించిత్తం. పరమానందదాయకం।
అసంప్రజ్ఞాతనామసౌ. సమాధిర్యోగినాంప్రియః ॥

తా॥ అనగా చిత్తము సర్వవృత్తులచేతను రహితమై ప్రశాంతమై ప్రసన్నమై తేజోరూపమై ప్రజ్ఞామయమై బాహ్యాభ్యంతరములయందును కేవలపరబ్రహ్మమై యుండుటయే అసంప్రజ్ఞాతసమాధియగును. సర్వయోగులకిదియే ప్రియమైనది. ఇట్టి చిత్తముగలవాడే చిత్స్వరూపియగుచున్నాడు. సకల వ్యాపారములు ఉపశమించుటచే (నశించుటచే) శాశ్వతోపరతిని పొందుచున్నాడు. అంతయు తానై యుండగా బుద్ధియొక్క దోషము వలననే నీవు నేను ఇది అను భేద

కల్పనముదయించుచున్నది. బుద్ధియనగా జీవునకుపాధియగును. ఇదియే జీవత్వమునకు హేతువగుచున్నది. ఈ బుద్ధి పరమాత్మయగు తనను ఆచ్ఛాదించుచున్నది. కాబట్టి బుద్ధియనగా అవిద్యయగును. ఈ కారణమునననరించియే అవిద్యోపాధికుడు జీవుడని శాస్త్రములు వచించుచున్నవి. బుద్ధియను అవిద్యోపాధి తొలగిన జీవుడు పరమాత్మయే అగుచున్నాడు. ఇట్టి బుద్ధియొక్క నైజదోషమేమనగా ఆత్మను మరుగుపరచి స్వరూపస్థితిలేకుండ చేయుటయే కానె వదోయని తెలియకుండ చేయుటయే ఇదియే అజ్ఞానము. ఎప్పుడు అవిద్యారూప బుద్ధ్యుపాధి దోషము చేతను మరచుచున్నాడో అప్పుడు సకల దృశ్యము స్ఫురించుచున్నది. బుద్ధియే దేహాదులన్నిటిని కల్పించుచున్నది. మరియు ఆబుద్ధియే దేహేంద్రియాదులందు ఆత్మత్వబుద్ధిని (అనాత్మభావనను) గలుగఁజేయుచున్నది. ఇదియే మిథ్యాత్వరూప అధ్యాసము భ్రాంతి బుద్ధిదోషము దీనిచేతనే నీవు. నేను. ఇది. అను భేదప్రపంచము ప్రతీయమానమగు చున్నది. త్వం నీవు, అహం నేను, ఇదం ఇది ఈ మూడు శబ్దములను సర్వనామ వాచకములే విచారించిన సర్వశబ్దములకు అధిష్ఠానమైనది. పరమాత్మ చైతన్యమే అయినను త్వం అనగానీవు చైతన్యము ఇదం ఇదిచేతనారూప ప్రపంచము అనుపదములకు అర్థమగుచున్నది. ఈ పదములచే బోధితములగు వాచ్యార్థ లక్ష్యార్థములలో ఉపాధిరూప దేహేంద్రియాదులగు వాచ్యార్థమును వదలిన అవశిష్టమైనది. చైతన్యము ఇది లక్ష్యార్థము ఇదియే సత్యము. ఈ యర్థమునే శ్రీ భగవద్గీతలో ప్రతిపాదింపబడినది.

శ్లో॥ నత్వేవాహం జాతునాసం, నత్వంనేమే జనాధిపాః
నచైవన భవిష్యామ సర్వేవయమతః పరమ్॥

తా॥ నేను నీవు ఈ జనులున్ను సర్వదావుండువారలమే అని శ్రీకృష్ణపరమాత్మని వాక్యము ఆత్మయొక్కటికిని వర్తించదని భావము. అయినను త్వం. ఇదం, నీవు ఇది ఈ శబ్దముల పరోక్షపదార్థములనే బోధించుచున్నవి. కావున పారోక్ష్యజ్ఞానమునే కలుగజేయును. ఇదం అనగా ఎటువంటిదృశ్య ప్రపంచ ప్రతీతియగునో అటులనే త్వం అను శబ్దము చేతను పరోక్షమైన ప్రపంచ ప్రతీతియే అగుచున్నది. తత్త్వమసి అనువాక్యమున త్వం అనగా అహం బ్రహ్మాస్మి. వాక్యములోని అహం పదార్థకూటస్థ బ్రహ్మమేయని విచారింపబడినది. ఒకే త్వం పద ఇదం పదములు చైతన్యమునే బోధించునవైనను. వానిచే

బ్రహ్మజ్ఞానము పరోక్షముగానే కలుగుచున్నది. కాబట్టి గురువు శిష్యునకు నీవు బ్రహ్మము అని బోధించునప్పుడు త్వం పదార్థమగు పరోక్షార్థము నగ్రై కావక అహం పదార్థమునే తెలియుచున్నారు. అహం భిన్నపదార్థములగు యుష్మత్ ఇదమాది పదార్థములు పరోక్షార్థ రూపములు అహం పదార్థము అపరోక్షమరూప మని శ్రీ జగద్గురు శంకరాచార్యులు చెప్పియున్నారు. కనుక అహం నేను దీని యొక్క అర్థము ఇతరపదార్థములవలెగాక ముఖ్యముగా ముముక్షువు చక్కగా విచారించదగినది. దీని చేతనే అపరోక్షానుభూతి కలుగును. ఈ అర్థమునే నిరంతరము నేనుబ్రహ్మమని జీవుడు హృదయమున జపించుచున్నాడు. ఇకను విచారించిన నేను అను వ్యవహారము కూడ బుద్ధి కల్పితమే ఇదియే మూలాధ్యాస సర్వాజ్ఞానబీజము దీనినుండియే సమస్త ప్రపంచోత్పత్తి యగుచున్నది పరమాత్మ అనంతరము బుద్ధి అనగానే ద్వైతము సిద్ధించును. తరువాత నానాత్వము సిద్ధమయ్యేయున్నది కనుక ఉపాధిని వీడనాడిన పరమాత్మయే తానగుచున్నారు. విచారణ లేక పోవుటచేతనే తన్నుతాను మరచిపోవుట చేతనే భేద భావములు గలుగుచున్నవి. లోకమున నీవు నేను వాడు అను భేద వ్యవహారముయెంతయో దుఃఖకరముగను ఏకత్వభంజకముగను యున్నది. అలాగున నీవు జీవుడు ఈదీ ప్రపంచము అది బ్రహ్మము అను ప్రతీతి అజ్ఞానజనకమై శోకమోహాత్మకమై యున్నది. మనమందరమొకటే ఒకే వంశమున జన్మించితిమి. మనకు భేదములేదు. అను అభేదవ్యవహారము యెంతసుఖకరమై ఆనందదాయకమై ఐక్యమత్యప్రదాయకమై యున్నదో అటులనే మనమందరము దైవాంశ సంభూతులమేగాక కేవల పరబ్రహ్మస్వరూపులము జీవుడనదేవుడగు బ్రహ్మమే నేను అని తెలసిన అమందానందసందోహ విజ్ఞానాఖండ పరిపూర్ణ బ్రహ్మమందు సతతము రమించుచున్నారము. కావున భేదవ్యవహారమంతయు బుద్ధి కల్పితమగును. ఇద్దే అవిద్యోపాధి జీవత్వాపాదక బుద్ధిదోషము తదావరణము తాను పరబ్రహ్మమే వేరుగాదు. అను దృఢప్రజ్ఞారూప సంకల్ప శూన్యాత్మక జ్ఞానసమాధియందు అద్వయమైన సామాన్య విశేషభావశూన్యమై పరమాత్మ సాక్షాత్కరింపబడగా నశించుచున్నవి. సమాధియందు విచారణ జ్ఞాతృత్వమతన సాక్షాత్కారమందు పరమాత్మ విరాజతనమై తేజరిల్లుచున్నది. ఆ పరమాత్మ అద్వయము తనకు తానే యున్నది. అఖండ బుద్ధ్యాదులంతర్భూ, తనకు తానే సాక్షాత్కరించుచు ఆనందఘనమైయున్నది. సామాన్య విశేషశూన్య

రహితము పరమాత్మ సామాన్యమనగా ఈసమస్త ప్రపంచము విశేషమనగా ప్రపంచబాధకము సామాన్యమగు దృశ్య ప్రతీతి విశేషరూప పరమాత్మ జ్ఞానముచే నశించుచున్నది. ఇట్టిది సామాన్యవిశేషభావము విచారించిన పరమాత్మ బాధ్యబాధక భావము లేనిదగుటచేతను దృగ్దృశ్య భావములేనిదగుట చేతను అద్వితీయమగుటచేతను తనకుతానే వెలుగొందుటచేతను నిర్విశేషమై యున్నది శేషమనగా ప్రపంచము శేషియనగా పరమాత్మ ఇట్టి శేషశేషి భావము లేనిది పరమాత్మ అద్వితీయము ఇట్టి అఖండపరిపూర్ణజ్ఞానము ధ్యానసమాధి యందున చిత్తలయముచే ప్రజ్ఞాస్వరూప స్థితిగలుగగా సకలబుద్ధి దోషములు నశించుచున్నవి. అందుచే సర్వవికల్పములు విశేషముగా విలయమొందుచున్నవి. అప్పుడు వస్తుతత్వము లేక బ్రహ్మస్వరూపము సునిశ్చయముగా దృఢమగుచున్నది. ఇదియే స్వానుభవ వస్తుతత్త్వ బ్రహ్మవిజ్ఞానము నిరావరణమైన అఖండస్వస్వరూపము ఆనందము. కాబట్టి ఇట్టిపరతత్త్వమును పొందుటకు సకలేంద్రియ నిగ్రహరూపశమము బాహ్యేంద్రియ నిగ్రహరూపదమము గలవాడును అంతరేంద్రియములగు మనోబుద్ధిచిత్తాహంకారములను బాహ్యములగు వాగాది కర్మేంద్రియములను త్వక్చక్షురాది జ్ఞానేంద్రియములను జయించినవాడును అనగా సకలేంద్రియములను తనవశములో నుంచుకొన్నవాడును.

శ్లో॥ మాత్రాస్పర్శాస్తు కౌంతేయ, శీతోష్ణసుఖదుఃఖదాః ।
ఆగమాపాయినోఽనిత్యా, స్తాంతితిక్షస్వ భారత ॥

తా॥ అనిత్యములైన వచ్చిపోవుచున్న శీతోష్ణసుఖదుఃఖముల గలుగజేయుచున్న యింద్రియవిషయములవన్నిటిని సహించుకొనుమర్జునాయను భగవద్గీతావాక్యమువనుసరించి శీతోష్ణసుఖదుఃఖాది సకలద్వంద్వముల సహించుటయను క్షమతో గూడినవాడును

శ్లో॥ శక్నోతీహైవ యస్సోఢుం, ప్రాక్శరీర విమోక్షణాత్ ।
కామక్రోధోద్భవం వేగం, సయుక్తస్ససుఖీనరః ॥

తా॥ ఈ భౌతికశరీరమును వదలకముందుగనే కామక్రోధాది వికారములనెవడు సహింపశక్తుడై జితేంద్రియుడగుచున్నాడో వాడే యోగయుక్తుడై సుఖవంతుడగుచున్నాడు. అని భగవద్గీతలో వచించినరీతిగా సకలేంద్రియ వ్యాపారములు లేనివాడై సకలవృత్తులుపశమించినవాడై మనోద్వేగమును అణంచినవాడును తీ మొకసంకల్పములు పుట్టనీయక యుండువాడును ప్రత్యాహారము (స్వభావ

ముగా విషయములయందు యింద్రియములు సంచరించుచుండగా వాటిని మర్ద లించుట) గలవాడును నిత్యానుసంధానపరుడగు ముముక్షువు జీవాత్మనే పరమా త్మనుగా తెలియుట లేక బ్రహ్మమందు మనస్సునులయింపజేయుట అనగా స్వస్వరూపస్థితిలో నుండుట. తన్నుతానై యుండుట యను సమాధిని (సర్వ ద్వారాణిసంయమ్య మనోహృదినిరుధ్యచ అనగా సమస్తేంద్రియ వృత్తులు ణయించి మనస్సు పరబ్రహ్మమందే నిలుపుట) అభ్యసించుచున్నవాడై అం తయు బ్రహ్మమేను తనకన్న వేఱొకటిలేదు. అందఱి హృదయములలోను వెలుగొందుచున్న చైతన్యము తానే పరిపూర్ణ బ్రహ్మమొకటియే స్వయం ప్రకాశమానమై జ్ఞానరూతమై ఆనందఘనమై యున్నదను సర్వాత్మభావమును పొందుచున్నాడు. అట్టి స్వస్వరూప సర్వాత్మ భావముచే బ్రహ్మమే తానై యుండుటచే సకల అవిద్యాంధకారప్రయుక్త వికల్పదోషములు నశించుచున్నవి చీకటిఎలన స్థాణువును పురుషుడని తలంచుట త్రాడును పాముని. భ్రమించుట మొదలగు భ్రాంతులు గలుగుచున్నవి. అలాగున అజ్ఞానాంధకారము సకలభయ ములకు కారణముగానున్నది. సమస్తజనులు వస్తుతత్త్వమును తెలియక నిద్రించుచున్నారు. అలాగున అజ్ఞానాంధకారముచే యీ శరీరేంద్రియాదులనే తనవని తలంచి దేహాత్మబుద్ధితో మెలంగుచు సంసారసాగరమున మునుంగుచు పరమాత్మను తెలియక తమ్ముతామే మరచి తమోగుణ భూయిష్ట భ్రాంతి మోహాత్మకనిద్రనుపొందుచున్నారు. తాము ఆపరమాత్మయను దృఢప్రబోధ జ్యోతిచే అజ్ఞానాంధకారము మటుమాయమైపోవుచున్నది. ఇట్టి సర్వాత్మభావ ముచే సకల సందేహములు పూర్తిగా నశించుచున్నవి. సకల సంకల్ప వికల్ప ములు విలయమొందుచున్నవి. సకల వికల్ప దోషరహితుడు స్వస్వరూపస్థితి యందుండువాడు అజ్ఞానమును నిశ్శేషముగా దహింపజేసినవాడు కనుకనే క్రియా రహితుడై ఆత్మఅచలముగనుక అచలపరబ్రహ్మమై నిర్వికారుడై నిశ్చలుడై సకలసందేహ నిర్ముక్తుడై బ్రహ్మాకార వృత్తితో

శ్లో॥ యోఽన్తస్సుఖోఽన్తరారామ, స్తథాన్తర్జ్యోతిరేవయః ।
సయోగీ బ్రహ్మనిర్వాణం, బ్రహ్మభూతోఽధిగచ్ఛతి ॥

తా॥ సుఖస్వరూపమగు పరబ్రహ్మమందు రమించువాడైన అంతర్జ్యోతిరూపు డైన యోగిబ్రహ్మమై నిర్వాణముపొందుచున్నాడు. అను భగవద్గీత రీతిగా అఖండ పరిపూర్ణ బ్రహ్మమై నిరవధికానందముతో సర్వదాయుండును. బయట

నున్న దృశ్యప్రపంచమును ఇంద్రియార్థములగు శబ్దాది విషయములను చెవి మొదలగు జ్ఞానేంద్రియ కర్మేంద్రియములను అంతరికదృశ్యమనదగు మనస్సును నాదినేను అనునట్టి అహంకార మమకారములను ఈ సమస్తమును జ్ఞాన స్వరూప పరబ్రహ్మమందు పూర్తిగా లయంపుజేసి పంచీకరణ శాస్త్రజ్ఞులు పరబ్రహ్మమునుండియే సమస్తమున్ను ఉద్భవించుచున్నది. "యస్మాద్భూతం తత్తత్రైవపీయతే" అనగా ఎక్కడనుండి పుట్టినదో అది అక్కడనే లయించుచున్నది. అను న్యాయముగా ఈసమస్తము బ్రహ్మమునుండియే పుట్టి బ్రహ్మమందే లయించుచున్నదని చెప్పుచున్నారు. అట్టిలయచింతనా ప్రకారము తెలిసి అంతయు బ్రహ్మమందు లయించగా బ్రహ్మమే మిగులుచున్నది. కాన సమస్తము బ్రహ్మమని చక్కగా నెఱింగియే క్షాద్దిదృశ్యమును గూడా స్ఫురింపనీయక అఖండ విజ్ఞానరూప పరమాత్మయందు లేక స్వస్వరూపమందు నిలకడగలవారు భావముంచి తద్రూపులైనవారు అజ్ఞానపాశబంధముల నుండి అనగా హృదయ గ్రంధులనుండి విడువడి సమస్త వాసనలు పూర్తిగా నశించినవారై ముక్తాత్ములగుచున్నారు. ఇదివరకు తమ స్వరూపమును తెలియక అజ్ఞానబంధబంధితులైరి. ఇప్పుడు తన స్వరూపమును బంధరహితమని నిత్యశుద్ధబుక్తమని యెరింగినవారగుటచే ముక్తులైరి. ఇట్టివారే శాశ్వతసుఖమును బడయుచున్నారు ఆటుగాక ఆత్మకు దూరమైన దృశ్యమునకు సంబంధించిన అశాశ్వతమగు అనాత్మ కథలను లేక శాస్త్రజన్య పరోక్షజ్ఞానమునే అభివర్ణించుచు తాము వచించిన ఆత్మయొక్క రూపమునందు నిలకడలేనివారు. కాలమును వృధాగడుపువారు ముక్తులుకాజాలరు. స్వానుభవ అపరోక్షజ్ఞానములేక పరోక్షజ్ఞానముచే ముక్తి గలుగదు. ఎన్నాళ్లు మహావాక్యార్థములను అభివర్ణించుచుండినను స్వానుభవము గలుగనేరదు. అటులనే స్వానుభవజ్ఞానము పొందక తృప్తుడుకాజాలడు. కాబట్టి తన చిత్తమును చిద్రూప పరబ్రహ్మమందు లయింపజేసి పరబ్రహ్మమందున్నవారు నిర్వికల్ప సమాధి యోగనిష్ఠులనియు స్వానుభవజ్ఞానులనియు తెలియవలయును.

శ్లో॥ దృగాత్మనిదృశ్యంక్షిప్త్వా. త్యక్త్వాఽసౌబాహ్యవంబరం।
విందత్యేవన సందేహః. పరమాత్మాన మవ్యయమ్॥

తా॥ దృక్కగు ఆత్మయందు దృష్టియుంచిన జ్ఞానయోగి ఆత్మకు బాహ్యమగు దృశ్యమునంతను వదలి పరమాత్మను తెలియుచున్నాడు. సందేహములేదు.

అదియునుంగాక పరమాత్మ అద్వితీయుడే కేవల చైతన్యము అయినను స్థూల సూక్ష్మకారణ శరీరోపాధులచే నానాత్వమును జెందుచున్నారు. కానొకడై చేతనా స్వరూపుడయ్యు తత్తదుపాధులచే అనేకవిధములుగా భాసిల్లుచున్నాడు. ఇందు లకు శ్రుతిప్రమాణము

శ్లో॥ గవామనేక వర్ణానాం. క్షీరస్యాప్యేక వర్ణతా।
క్షీరవత్పశ్యతేజ్ఞానం. లింగనస్తు గవాయథా ॥

తా॥ నీలశ్వేతాది వర్ణములచే గోవులనేకభేదములతోనున్నను పాలు ఒకటియే అదేతీరున ఆత్మయు ఒకటే శరీరములు వేరు అనగా ఒకే పరబ్రహ్మ చైత న్యము అవిద్యోపాధిచే జీవరూపముధరించుచున్నది. ఆ అవిద్యామయ జీవుడు శరీరములో ప్రవేశించి సమస్తవ్యవహారము చేయుచు భేదబుద్ధిచే అనాత్మపదా ర్థములు నేననియు నావనియు తలంచి భ్రమించుచున్నాడు. విచారించిన వాటి కన్నిటికి విలక్షణుడై సాక్షియై సమస్తమునెఱుంగు సనాతనుడు.

శ్రు॥ ఘటసంవృతమాకాశం, నీయమానేఘటేయథా॥
ఘటోనీయే తనాకాశ, స్తద్వజ్జీవోనభోపమః॥

తా॥ ఘటము పోయినను ఘటగత ఆకాశముపోదు. నశింపదు. అతీరున శరీ రము పోయినను ఆత్మనిత్యము త్రివిధాత్మక శరీరముకన్న వేరై వ్యష్టి సాక్షి త్వము పొందుచున్నాడు.

ఇకను విచారించిన సాక్ష్యతీతమగు పరబ్రహ్మస్వరూప కేవల చైత న్యమే తానుగాయున్నాడు. అటులనే ఒకే పరబ్రహ్మ చైతన్యము మాయోపా ధిచే ఈశ్వరరూపమును ధరించుచున్నది. ఆ ఈశ్వరుడు ప్రపంచోపాధిలో ప్రవేశించి చరములగు దేవతిర్యక్ మనుష్యాదులగను అచరములగు పర్వతా దులగను తోచుచున్నాడు, ఈప్రకారముగా నానావిధ చరాచరాత్మకమై ఈశ్వ రుడున్నాడు. దానికంతయు నియంతయై, సమస్తమును కనుగొనుచున్నాడు. విచారించిన ఈశ్వరుడు సమస్తమునకు సాక్షియై యున్నందుచే సమష్టి సాక్షి త్వము నొందుచున్నాడు. ఇకను పైన విచారించిన సమష్టి సాక్ష్యతీతమగు పర బ్రహ్మ చైతన్యమే కేవలమై యున్నది. ఈలాగున పరబ్రహ్మమే ఆయా ఉపాధులచే నానాగా తోచుచున్నది ఉపాధి కల్పితము గనుక కల్పితోపాధిని దూరీకరించగా తాను శరీరముకన్న వేరగుటచే వ్యష్టికిసాక్షియై అన్నిటిలోను తానున్నాడు. కనుక సమష్టిసాక్షియైన ఈశ్వరచైతన్యమే తదుపరి స్వస్వరూప

మందు ఉపాధిభూత సకలదృశ్యమును మఱచినందుచే సాక్షిభూత పరమాత్మలై కేవలులగుచున్నారు. అధిష్ఠానజ్ఞానముచే విశిష్టతగలుగుచున్నది. కావున ఆత్మవేత్తయగువారు నిరంతరము పరమాత్మయగు తనను గాంచుటయను నిర్వికల్పసమాధిచే సకలోపాధులను నశింపజేసి అద్వితీయ పరబ్రహ్మము కానగలరును. అనగా దృశ్యమును నశింపగా పరబ్రహ్మమేయున్నది. గనుక ముముక్షు సకల బంధములనుండి విడివడుటచ్చుచే అనాత్మపదార్థముల దూరీకరించి ఆత్మపదార్థమగు పరమాత్మయందు ఆసక్తిగలవారై ఆపరబ్రహ్మమునే వాంఛించి నిత్య బ్రహ్మానందమును బడయగోరిన ఆత్మజ్ఞాని ఇతరచింతలను విడనాడి దృశ్యమును స్ఫురింపనీయక నిరంతర స్వాత్మస్వరూపచింతయగు పరబ్రహ్మధ్యాననిష్టచే బ్రహ్మత్వమును పొందుచున్నారు. జీవాత్మను వదలి శివత్వమును బడయుచున్నారు. అదెట్లనగా తుమ్మెదచే తీసికొనిరాబడిన కీటము ఆ భ్రమరమునే చూచుచు దానికి భయపడి దానినే ధ్యానించి. ధ్యానించి కట్టకడకు భ్రమరమే అగుచున్నది. అప్పుడాపురుగు భయమును వీడి మరియొక కీటకమును భ్రమరముగా చేయుచున్నది. అలాగున జననమరణరూప సంసారమునకు భయపడిన జీవుడు సద్గురు శరణ్యమును పొంది గురువాక్యముచే పరబ్రహ్మమునే ధ్యానించుచు నేను దేహాతీతబ్రహ్మమును వేరుగాదు. అనువాక్యమును భ్రమర ఝుంకారమువలె అనుసంధానము చేయుచు తాను పరబ్రహ్మమగుచున్నారు. తరువాత నిర్భయుడై తానున్న బద్ధజీవులను ముక్తులనుగా చేయుటకై లేక జీవులను శివత్వమొందుటకై ప్రయత్నపడుచున్నాడు. కావున నిరంతరము అహం బ్రహ్మాస్మి అను మహావాక్యానుసంధానముచే తాను దేవుడగుచున్నాడు. మఱియు బ్రహ్మమందలి ఆసక్తియే పరబ్రహ్మధ్యానమునకు ప్రధానకారణము. అట్టి స్వాత్మైక చింతనారూప నిష్ఠయగు నిర్వికల్ప సమాధియే బ్రహ్మత్వ హేతువగుచున్నది. ఇట్లు ఒకదానికొకటి కారణముగాయున్నది. కావున మొట్టమొదట బ్రహ్మమందాసక్తి గలుగ వలయును. దీనిచే బ్రహ్మాత్మజ్ఞానముండును. ఇది అనేక జన్మకృత పుణ్యకర్మలచే సిద్ధముగుచున్నది. ఈ స్వాత్మతత్త్వ సాక్షాత్కారముగలిగినవెంటనే సమాధినిష్ఠ బ్రహ్మతత్త్వ ప్రాప్తియున్నదగుచున్నది. కావున యోగి నిత్యానిత్య వస్తువివేకముచే ఆత్మయందభిరుచి గలిగి సమాధినభ్యసించిన పూర్ణత్వమును బడయును. 'ఆత్మవస్తువుయందభిరుచి గలవాడకే ఆత్మ అద్వితీయము నిత్యము [illegible] తెలియుట [illegible]

టిగా యున్నను జలముయొక్క చలనముచేతను నానాత్వముగా కన్పట్టు చిత్రము ఒకేఆత్మ అంతఃకరణముయొక్క చలనముచేతను కర్తృత్వాది ధర్మములచేతను చలనముగలదిగను నానాగాను కర్తగను భోక్తగను గానుపించుచున్నది. విచారించిన ఒకేవస్తువే బింబరూపమైయున్నది. అదియే సత్యము మనస్సుయొక్క ధర్మములను ఆత్మయందధ్యస్తముచేయక ఆత్మధర్మములగు ఏకత్వాదిధర్మములను దెలియవలెను ఆత్మసనాతనమనియు ఏకమనియు ఉపాధిభేదముచే నానాగాభాసిల్లుననియు శ్రుతిచెప్పుచున్నది. ప్రమాణము

శ్రు॥ ఏకఏవహిభూతాత్మా-భూతేభూతే వ్యవస్థితః
ఏకధాబహుధాచైవ దృశ్యతేజలచంద్రవత్॥

తా॥ ఒకేచంద్రుడుజలమునందున చలనముచే నానాగాను విశృంలత్వముచే ఒక్కడుగాను భానపించును. అటులనే అందరిహృదయములోని ఆత్మ అంతఃకరణ చలాచలములచే కనపడును. మఱియు పైజెప్పబడిన భ్రమరకీటకసాదృశ్యము ననుసరించి తిరుగా॥ ధ్యానం నిర్విషయం మనః॥ అనురీతిగా ఇతర చింతలు లేకుండుటయు ధ్యానము ధ్యేయాకారమైయుండుటయు అట్టిధ్యానముచేతనే పరబ్రహ్మత్వమును ముముక్షువుపొందగలుగును. గాన పురుగుఇతర చింతలుమాని సర్వవ్యాపారములుడిగినదై తనను దచ్చినదానిగానెంచి భ్రమరమందే లక్ష్యముంచి దానిస్వరూపమునేజూచుచు తలంచుచు భ్రమరమగుచున్నది. అలాగున జిజ్ఞాసువు నిరంతరమాత్మానుసంధానముచేయుచు శరీరముమరణించినదనియే భావించి తననుపరమాత్మనుగాదెలిసి జీవబ్రహ్మైక్య భావముతోనే ఇతరవ్యాపారములు అన్యచింతలులేక సమస్తేంద్రియములను జయించినవాడై పరబ్రహ్మమందేలక్ష్యముంచి అచ్చోటనే మనస్సు లయింపజేసి సర్వదృశ్యరహితుడై పరబ్రహ్మవస్తుతత్వచింతనారూప స్వరూపనిష్ఠచే పరబ్రహ్మమేకాగుచున్నాడు సంశయములేదు కీటకభ్రమరదృష్టాంతముచేనొకచక్కని విశేషముతెలియవలెంయును అనగాగద్దిపురుగు ఝుంకారములేక రెక్కలున్నలేక సామాన్యముగా యుండును. అట్టిజ్ఞానరహితమైన చిన్న పురుగు భ్రమరమునేభావించి భావించి భ్రమరరూపమైరెక్కలుగలదై ఝుంకారముతోఆకాశమున తిరుగుచున్నది కీటకమే భావనామహిమచే పురుగుధర్మమువీడి భ్రమరధర్మముతోగూడి భ్రమరమగుచున్నదిగదా! అటులే జీవుడుచేతనాస్వరూపుడు బ్రహ్మముచైతన్యమయ్యే యున్నది. జీవబ్రహ్మములురెండును సనాతనములేగనుక కానుకరీత భ్రాంతిని

వదలి తనస్వరూపమును తానెరింగిన గురువాక్యరీతిగా నిరంతరము బ్రహ్మైక్య వాక్యార్థమును అనుసంధానము చేసినంతమాత్రమున ఐక్యము తప్పకనొందుచు న్నాడు. నేనుపరబ్రహ్మమని, దృఢవిశ్వాసముగలిగి ధ్యానతత్పూర్వకముగా భ్రమరధ్యానకారులవలె ప్రబోధించుచు చిదాకాశమున ఐక్యుడై విహరించుచు న్నాడు. ఇందులో సందేహములేదు. కీటకాకారమువలె శిష్యుడగు తాను శివత్వము నొందుట నిశ్చితతత్వమైయున్నది. గురువుయొక్క ధర్మము భ్రమరము కీట మును తెచ్చి భ్రమరముగాజేయువిధమున జీవులను శివత్వమొందునటుల ప్రయ త్నించుటయేయగును జ్ఞానరహితులగు కీటకములే ధ్యానామహిమచే వేరు రూపమును దాల్చి వేరుధర్మములుగలవగుచుండగా జ్ఞానహీనుడు చేతనాస్వరూ పుడును అగుజీవుడు తనస్వరూపమగు పరబ్రహ్మమును అత్యంత శ్రద్ధతో నిరం తరానుసంధానముచే బ్రహ్మమును బొందునటులలో సందేహములేదు. ఆత్మతత్త్వ మును తెలియక తాను అజ్ఞానియనియు దుఃఖియనియు ఇత్యాదిఅనాత్మ భావనలు దలంచి జీవత్వములోనుండువారు కీటకములకన్న నిమ్నదశలోనుండువారనియే తలంపవలెను. కనుక వేదాంతశాస్త్రమున భ్రమరకీటక సాదృశ్యము అనేకచోటు లందు అనేకసార్లు మహాపురుషులు ప్రతిపాదించుచున్నారు. గురుశిష్య సంప్ర దాయమంతయు భ్రమరకీటకన్యాయమువలె యుండవలయుననియే శాస్త్రములో బోధించుచున్నది. కావున నిరంతర భావనా సామర్థ్యముచేతనే బ్రహ్మత్వము నొందవలెను.

శ్లో॥ యథాసంకల్పయేద్యోగీ. యోగయుక్తో జితేంద్రియః
తథాతత్తదవాప్నోతి భావనాశక్తికారణం॥

తా॥ నిరంతరాత్మధ్యానయోగి ఆత్మయోగము గలవాడై జితేంద్రియుడై జీవ బ్రహ్మైక్యతను భావించిన తాను బ్రహ్మమునే పొందుచున్నాడు. భావనే కారణము.

శ్లో॥ మంత్రేతీర్థేద్విజేదైవే. దైవజ్ఞే భేషజేగురౌ।
యాదృశీభావనాయస్య. సిద్ధిర్భవతి తాదృశీ॥

తా॥ మంత్రము, తీర్థము దైవము గురువు, జ్యోతిష్కులయందును యెట్టి భావమో అట్టిసిద్ధియే కలుగును. గనుక పరబ్రహ్మవస్తువు ఇంద్రియాతీత జ్ఞానము గలవారికే లక్ష్యమని తెలియవలెను. అపరమాత్మతత్త్వము యదార్థ స్వరూపము. నిర్గుణమునైనది అవిరుద్ధ బ్రహ్మవస్తువే సత్యవిలక్షణమై

సమస్తమునెఱుంగుచున్నది. కావుననే సకలేంద్రియముల కగోచరమైయున్నది ఏలాటి ప్రపంచవృత్తులులేక దృశ్యరహితమైయున్నది. ప్రజ్ఞామాత్రస్వరూపము కాబట్టి సకలవృత్తుల నశించి సూక్ష్మాతిసూక్ష్మమై శుద్ధబుద్ధిగల మహానుభావులే పరబ్రహ్మ లక్షణములగు నిత్యత్వ .శుద్ధత్వ బుద్ధత్వ. పూర్ణత్వ. వ్యాపకత్వ స్వయంప్రకాశత్వ. ఆనందఘనత్వాదులను పొందినవారై ప్రకృతికి పరమగు సచ్చిదానందస్వరూపులై పరిపూర్ణానంద ఘనబ్రహ్మవస్తువును లేక కేవల బ్రహ్మాకారమునుజెందిన సర్వదృశ్య రహితమై ప్రజ్ఞారూపమైన బ్రహ్మైక్య రూప నిర్వికల్ప సమాధిచేతనే సర్వేంద్రియాతీతమై అత్యంత సూక్ష్మమైన బ్రహ్మమయ దృష్టిచేతనే తెలియుచున్నారు. అనగా బ్రహ్మలక్షణముల నెఱింగి బ్రహ్మత్వమునే పొందుచున్నారు. అట్టివారే ప్రకృతిగుణముల నశించిన వారు. కావున అతిసూక్ష్మ దృష్టిచే పొందదగిన బ్రహ్మత్వము స్థూలదృష్టిచే పొందశక్యముగాదు. స్థూలదృష్టియనగా అనేక మలినవాసనలతోగూడి పంచ భూతాత్మకమైన సర్వదృశ్యాకారమైన వృత్తియగును. అట్టి ప్రపంచదృష్టిచే పరమాత్మ పొందబడదు. బ్రహ్మమయదృష్టిచేతనే పరమాత్మతత్త్వమును నిరంతర ధ్యానసమాధిచే తెలియవలెను. అందుచే సమాధినిష్ఠ నాశ్రయింప వలయును. ప్రమాణము.

శ్లో॥ సమాధినానయేత్కాలం, వృథాచింతాం వివర్జయేత్।
ధ్యానేన విలయంయాన్తి, సంస్కారాబహుజన్మనామ్॥

తా॥ ధ్యానముచేత సకలజన్మలమంచి రూఢములయిన సమస్తసంస్కారములు నశించుచున్నవి. కాబట్టి సర్వప్రకృతి చింతలను వదలి పరమాత్మ విషయిక నిర్వికల్ప సమాధిచేతనే బ్రహ్మాత్మభావముతో కాలమంతయు గడుపవలయును "నస్థూలదృష్ట్యా ప్రతిపత్తుమర్హతి" ఇందులకు ప్రమాణము. ॥శ్రు॥ యతోవా చోని వర్తంతే అప్రాప్యమనసాసహ॥ అనగా వాక్కు మనస్సు బ్రహ్మము దగ్గఱకు పోజాలవు. "నచక్షుర్గచ్ఛతి నవాగ్గచ్ఛతినో నమః" అనగా నేత్రము వాక్కు మనస్సు బ్రహ్మము దగ్గఱకు పోవు. "నచక్షుషాపశ్యతి కశ్చిదేనం" ఎవడును చర్మనేత్రముచే పరమాత్మను చూడజాలడు. ఈలాగున శ్రుతులు స్మృతులు చెప్పుచున్నవి. కావున ఇంద్రియాతీతమైన ప్రజ్ఞారూపమైన బ్రహ్మ దృష్టిచేతనే పరమాత్మతత్త్వరూపమును తెలుసుకొనవలయును. మఱియు "జ్ఞాత వ్యమాత్మేతి శుద్ధబుద్ధిః" అని చెప్పుటచే ప్రకృతిగుణములు నశించి పరిశుద్ధ

జ్ఞానముగలవారే అర్హులు సందియము. అట్టివారే బ్రహ్మతత్త్వమును పొందెదరు. అనగా స్వయం ప్రజ్ఞచేతనే బ్రహ్మజ్ఞానముబ్రహ్మవస్తువు ప్రాప్యమగును మరియు వేదోపనిషత్తులయందు జీవుడు బ్రహ్మరూపు వివానము చెప్పబడియున్నది. నిరంతర స్వస్వరూప ధ్యానమగు దీర్ఘచింతనారూప ధ్యేయాకారము చేతనే మనస్సు అజ్ఞానవిముక్తమై పరబ్రహ్మమయమగుచున్నది. జీవుడు జీవత్వమువదలి శివత్వమునొందుచున్నాడనుటకు సందేహములేదు. ఎటులనగా శుద్ధమగుబంగారు (అపరంజి) రాగి లేశ టంకము మొదలగు పదార్థముల సంయోగముచే మాలిన్యమును బడసి ఇతర లోహములతో పాటు గనిపించుచున్నది. అనువర్ణము పుటములోపెట్టి బాగుగా పరిశోధించినచో దానిలోనున్న మాలిన్యమంతయు పోయి తిరుగా అపరంజి బంగారమేయగుచున్నది. అప్పుడా శుద్ధమైన సువర్ణము మేలిమియగు పసిమితో గూడినదియై కన్నులకు మిరుమిట్లు గలిగించుచున్నదిగదా! అలాగున మనస్సనగా ఆత్మచైతన్యమే ఆత్మయే సంకల్ప సంఘముచే అంతఃకరణమని వ్యవహారము నొందెను. శుద్ధబ్రహ్మమగు మనస్సు (జీవుడు) అనాత్మపదార్థములగు సత్త్వరజస్తమో గుణములతో చేరి అజ్ఞానాలంష్యమును నొంది అవిద్యావరణము గలది యగుచున్నది. శుద్ధజీవుడు శుద్ధత్వమును వదలి అశుద్ధుడగుచున్నాడు. తన శుద్ధత్వమును తాను తెలియజాలకున్నాడు. అందుచే అట్టి మనస్సు నిరంతర స్వస్వరూపధ్యానముచే సకలాజ్ఞానావరణ మాలిన్యాది దోషములు నశించి బ్రహ్మమయమగుచున్నది. ఇచ్చట మనస్సనగా జీవుడని గ్రహింపవలెను. కేవలము మనస్సని చెప్పిన జడపదార్థము యేమియు చేయలేదుగదా! ఇచ్చోట ముఖ్యవిషయమేమనగా సత్త్వరజస్తమోగుణములే అగుచున్నవి. వాటిచే జీవుడు బద్ధుడగుచున్నాడు. ఈ విషయమును భగవద్గీతలో గుణత్రయవిభాగ యోగమునందు చక్కగా చెప్పబడియున్నది. ఈ త్రిగుణావరణమున్నంతవరకు అంతఃకరణము మాలిన్యయుతమగుచున్నది. ధ్యేయాకారధ్యానముచే నెటువంటి మలినాంతఃకరణము గూడ శుద్ధమగుచున్నది. అప్పుడది బ్రహ్మచైతన్యమగుచున్నది. అట్టి సకలదోష విముక్త గుణత్రయాతీత చిత్తము చిత్తనియే వ్యవహరింపబడుచున్నది ఇంతవు మాలిన్యమే మనస్సు అవిద్యయాని అది తొలంగగనే అంతఃకరణోపచైతన్యమగు జీవుడు అంతఃకరణోపాధిరహిత పరమాత్మయగు చున్నాడు. బంగారమెటుల శుద్ధమైనప్పుడు తన పసిమివర్ణగుణమును వదలకయున్నదో

జీవుడును పరిశుద్ధమగునప్పుడు సాత్మానంద గుణమును వదలకయుండును. అనగా "ఆనందో(బహ్మ" అన్నిటుల బ్రహ్మానందరూపుడై జీవత్మయుండ గలుగును. ఆనందత్వమే బ్రహ్మత్వ విదర్శనము అటుగాకుండిన జీవత్వము తొలగలేదని తెలియవలయు. ఇకను బ్రహ్మధ్యానమను పుటముచే మాలిన్యము విడిచి పరిశుద్ధ పరబ్రహ్మకావలయును. ఆనందఘనముతో నొప్పవలయును.

శ్లో॥ అంతర్జ్యోతిర్బహిర్జ్యోతిః, ప్రత్యగ్జ్యోతి పరాత్పరః।
జ్యోతిర్జ్యోతి స్స్వయం జ్యోతి, రాత్మజ్యోతిశ్శివో౽స్మ్యహమ్॥

తా॥ లోపలను బయటను అంతయు జ్యోతియే, అదియే పరమాత్మ అట్టి అఖండ జ్యోతియగు శివుడనేనేను ఈ(శ్రుతివాక్యరీతిగా అట్టిభావనారూప ధ్యాన మనెడు పుటముచే అనంత విపులగుండమందు తేజోరూపాగ్నిలో అనాత్మ భావనారూప మనస్సును బాగుగా పరిశోధించవలయును. అనగా ఆత్మధ్యానా గ్నియందు కాల్చవలయును. ధానపరిపక్వవస్థయగు ధ్యేయాకారమందు సకల మాలిన్యము నశించి మనస్సు ప్రజ్వాల్యమై. తేజోవంతమై, సకలవాసనావిర్ము క్తమై, ప్రకాంతమై, బ్రహ్మమయమగుచున్నది. అప్పుడెట్టి దృశ్యమున్ను లేదు, ప్రాకృతరూపమనస్సనెడు ప్రతిబింబము లేకపోవుటచే అవశిష్టమైనది బ్రహ్మమే. అయ్యనిరావరణమై, స్వయంప్రకాశమానమై తేజరిల్లును.

ఇందులకు ప్రమాణము

శ్లో॥ హృదయం నిర్మలం కృత్వా. చిన్తయిత్వాహ్యనామయం।
అహమేకమదం సర్వ. పశ్యేదాహం సుఖీ ॥

తా॥ మనస్సును సకలవృత్తి రతహితముగాజేసి ఆ పరమాత్మను చింతించి అంతయు పరబ్రహ్మమే నేనొకడనే అద్వితీయుడనై యున్నాను. అనితలంచి తాను శాశ్వతసుఖియగుచున్నాడు. బంగారు రాగి చేరుటచే మాలిన్యవంతమగు చున్నది. టంకముండుట చేతనే ఆరెండును అతుకుపడియున్నవి. అలాగున పరి శుద్ధ జీవబ్రహ్మము అవిద్య చేరుటచే మాలిన్యయుక్తమాయెను. యత్కించి త్కర్మశేషముండుటచేతనే శరీరధారణయను అతుకును జెందియున్నది. ధ్యాన పుటముచే కర్మశేషమను టంకము తీసి అవిద్యయను రాగిని దూరము జేసిన బంగారు అపరంజియై దేనితోను అతుకనటుల జీవబ్రహ్మము అనంగమై జన్మ పరంపరలనొందదు. ఇకను స్వర్ణశుద్ధి ప్రకారమువలె ఆత్మశుద్ధి విధిని తెలియ వలయు.

శ్లో॥ యథాచతుర్భిః కనకం పరీక్ష్యతే,
విఘర్షణచ్ఛేదన. తాపతాడనైః ॥

తా॥ సువర్ణమును ఒరిపిడిచే పరీక్షించినటుల అహంబ్రహ్మాస్మి అనువిచారణచే జీవాత్మ పరమాత్మగాదా యని తెలియవలయు. అందువే ఆత్మవిషయము తెలియకపోయిన బంగారమును ఛేదించునటుల ఆత్మను దృశ్యమునుండి వేరుచేసి చూడవలయును. అప్పుడు శుద్ధాత్మ తేలకుండిన కనకమును అగ్నిలోవేసి కాచునటుల జ్ఞానాగ్నిలో జీవాత్మను శుద్ధముచేయవలయు. అదియు కుదరకుండిన కాల్చినతరువాత స్వర్ణమును కొట్టునటుల యమనియమ ప్రాణాయామాది కఠినసాధనలచే మలినజీవాత్మను శుద్ధపరచవలయును. మనస్సు సత్వాది త్రిగుణరహితమై బ్రహ్మమయమగునప్పుడు జీవుడు నిరావరణుడై పరబ్రహ్మమగుచున్నాడు. ఇందుకు ప్రమాణము

శ్లో॥ యద్వైకంచ సువర్ణాది. మిశ్రితం రజతాదినా,
అల్పమూల్యం ప్రజాయేత. తథాజీవోఽప్యహంయుతః।
యద్వైవహి సువర్ణాది క్షారాదేశ్శోధితం శుభం,
పూర్వవన్మూల్యతాం యాతి తథాజీవోఽపి సంస్కృతః॥

తా॥ సువర్ణమేలాగున వెండి, రాగి, ఇత్తడి మొదలైన లోహములతోగూడి స్వల్పమగు వెలగలదగుచున్నదో. అలాగున శుద్ధజ్ఞాన స్వరూపుడును అవిద్యతోగూడి తనయొక్క పరిశుద్ధ బ్రహ్మత్వమును వదలి జీవత్వమునొందుచున్నాడు.

కులిన బంగారమును స్ఫుటముచే శోధించి శుద్ధపరచినప్పుడు శుద్ధమగు కనకమై గొప్ప మూల్యమునొందులాగున జీవుడు తపస్స్వాధ్యాయ ధ్యానాది సంస్కారములచే సకలమాలిన్య నిర్ముక్తుడై శివస్వరూపుడగు చున్నాడు.

శ్లో॥ తండులస్యయథాచర్మ. యథాతామ్రస్యకాలిమా।
నశ్యతిక్రియయాపుత్ర. పురుషస్యతథామలః॥
జీవస్యతండులస్యేవ. మలం సహజమప్యలం।
నశ్యత్యేవన సందేహో. స్తస్మాదుద్యమవాన్భవః॥

తా॥ బియ్యమునకు పుట్టుకతోనే సహజముగా పొట్టయున్నది. తామ్రమునకును స్వభావముగా చిలుము యున్నది. అలాగుననే జీవునకు నైసర్గికముగా అవిద్యావరణమున్నది. అయినను దంచుటచే పొట్టుపోయి బియ్యమేర్పడును. మాలిన్యా

ప్రయోగమ్ముటముచే రాగియు చిలుములేనిదై సువర్ణమగుచున్నది. ఆ తీరున జీవుడును అనవచ్చిన్న ధ్యానధారణాదులచే స్వస్వరూపమునుబొంది బ్రహ్మమగుచున్నాడు కాబట్టి సర్వదా ముముక్షువు బ్రహ్మానుసంధానమందు ప్రయత్నపరుడు కావలయు నిందుచే యేయితర చింతలులేక జీవుని పరబ్రహ్మనుగా తెలిసి నిరంతరము ధ్యానించిన సకల మాలిన్యములుతొలగి నిరావరణ స్వయం బ్రహ్మము యగుచున్నాడు.

మఱియు మనస్సు నానావిధ సంకల్ప వికల్పములతో గూడి స్థూలమై స్థూల విషయమునే గ్రహించుచుండును. అట్టి మనస్సు యెప్పుడును తెంపులేక వదలక దీర్ఘతమ పరమాత్మానుసంధానరూప స్వస్వరూపాభ్యాసము చేయుచుండిన పుటపాకశోధిత స్వర్ణము మాద్కి శుద్ధమై సూక్ష్మమై సకలవాసనా రహితమై పరబ్రహ్మైక్యరూప పరిపక్వము పొందినదై బ్రహ్మమందులయమొందుచున్నది. ఎప్పుడు చిత్తము చిద్రూప పరమాత్మయందు కలియునో ఉత్తరక్షణమునసే ఆ మనస్సు పరబ్రహ్మమే యగుచున్నది. కనుక చిత్తమనునది అంతఃకరణమనునది మఱియొకటిలేదు. అందుచే మనోఽతీతమగునట్టి సవికల్ప సమాధినిగూడ దాటిన కేవలాఖండాద్వయానంద రసమయమైన నిర్వికల్ప సమాధి స్వయముగా స్వానుభవ సిద్ధమగుచున్నది. ఇదియే స్వస్వరూప సాక్షాత్కారస్థితి. అనగా మనస్సు పరబ్రహ్మమందు చేరినప్పుడే నిర్వికల్ప సమాధి లాభము కలుగునని భావము. ఇతర భావములు లేక తైలధారవలె నిరవచ్ఛిన్నముగా తదేకాగ్రముతో మనస్సు ధ్యేయబ్రహ్మమును చింతించడమే బ్రహ్మస్ఫూర్తి కలిగియుండుటయే సవికల్ప సమాధియగును. ఇదియే సంప్రజ్ఞాత సమాధియనబడును ప్రత్యయాంతర రహిత బ్రహ్మప్రత్యైక గోచర తదేకాగ్ర చిత్తస్థితియే సవికల్ప సమాధియగును. కేవలబ్రహ్మమే తానగుట నిర్వికల్ప సమాధియని తెలియవలయును నిరంతర స్వస్వరూప చింతనాభ్యాస స్థితియే సవికల్పము. ఇది నిర్వికల్ప సాధకమైయున్నది ఇట్టి అభ్యాసబలిమిచే చిత్తము బ్రహ్మములో కలియునప్పుడు విషయాంతరము లేనందుచే పరబ్రహ్మస్థితి కలుగుచున్నది ఇదియే శివము "పక్వం మనోబ్రహ్మణి లీయతే" మనస్సు పరిపక్వమై బ్రహ్మములో గలియుచున్నదనుటకు ప్రమాణము.

శ్లో॥ కర్పూర మనలే యద్వత్ సైన్ధవం సలిలే యథా ।
తథా సంధీయ మానంచ మనస్తత్వే విలీయతే ॥

తా॥ ఏలాగు కర్పూరము అగ్నిలో గలిసి జ్యోతిరూపమగుచున్నదో, ఉప్పు నీటిలో గలిసి జలమయమగుచున్నదో అప్పుడు వాటికి తనరూపములెటుల లేక పోవునో ఆలాగున మనస్సున్ను పరమాత్మానుసంధానముచే తన చంచల జడ అనృతరూపములను వదలి సచ్చిదానంద పరమాత్మయగుచున్నది. ఇదియే నిర్వికల్పసమాధియని యోగశాస్త్ర సిద్ధాంతము "సమాధిసవికల్ప వర్జితః" నిర్వికల్పసమాధి దానికి ప్రమాణము

శ్లో॥ వికల్పరహితస్థిత్యా, సమాధిస్సోఽభిధీయతే ।
సయేవ పరమానందః, సాకాష్ఠా సాపరాగతిః ॥

తా॥ వికల్పరహితస్థితిచే ప్రాప్తమైన అద్వయానంద రసానుభవమే నిర్వికల్ప సమాధి. అదియే అంతిమదశ, అదియే సకలోత్కృష్టస్థితియు అగునని తెలియవలయు గనుక నిరంతరమభ్యాసరూప పరమాత్మనుసంధాన విచారణాదులంచే గలిగిన కేవలాద్వైతానంద రసానుభవము నిర్వికల్పసమాధియగును దీనిచేత మహాగ్నిచే సకల కాష్ఠములు దహింపబడునటులను ప్రచండ భాస్కరునిచే తమః పటలమంతయు నాశమొందు విధమునను మహాప్రళయ బడబాగ్నిచే క్షారసముద్రజలమున్ను విశ్శేషముగా పానముచేయబడు ప్రకారమునను సకల వాసనలు(హృదయమున నానాజన్మలనుంచి సంసారరూపమునను‌న్న వృత్తుల యొక్క గ్రింధులు) సకల కర్మలు దగ్ధమునగుచున్నవి. సమాధిచే గలిగిన స్వయంప్రబోధమను భాస్కరునిచే మూలాజ్ఞానతమస్సు నాశమగుచున్నది. ఈ మహావిజ్ఞానమనెడు మహాబడబాగ్ని వృత్తిగ్రింధిరూప ఉప్పుజలమును (అజ్ఞానవశముచే జలముతెంపులేక ఊరునటుల వృద్ధిగాంచుచున్న వృత్తులను) కొంచెముగూడ మిగులనీయక పానముచేయును. ఈ ప్రకారము పరమాత్మను తనను తెలియుట అను విజ్ఞానసమాధిచే సకల సంస్కారములు లేకపోవు చున్నవి. అందుచే సకల కర్మల వ్యాపారములు "కారణనాశే కార్యనాశః సిద్ధః" అనున్యాయమున పూర్తిగా నశించుచున్నవి. ప్రారబ్ధాది కర్మవిముక్తుడై వందుచే జీవుడు పరమాత్మయగుచున్నాడు. జీవబ్రహ్మైక్య విశేషవిజ్ఞానముచే ప్రయత్నమును లేకనే నేను బ్రహ్మమను ఆత్మానుసంధానము లేకనే సమాధ్యభ్యాసము లేకనే సర్వదా పరబ్రహ్మము అన్నిచోట్లను బయటను లోపలను స్వానుభవ సిద్ధమై సాక్షాత్కరించును. ఇదియే సహజావస్థయగును. ఇంతకు సమాధి చేతనే సకలావరణములు తొలగగా తాను పరబ్రహ్మమగుచున్నాడు. అనగా

బ్రహ్మము బ్రహ్మముగానే యున్నది.

ఇట్టి మహదానందముగల బ్రహ్మమును పొందుటకు యమనియమాదులు శమదమములు బహిరంగసాధనములని తెలియవలెను. వేదాంత వాక్య శ్రవణము కంటెను వేదాంత శాస్త్రముల పఠనము కంటెను మనన మనునది మరింతయు మేలగును. ఆ మననము కంటెను నిదిధ్యానము లక్షరెట్లు ఫలము గలదగును. ఆ నిదిధ్యానము కన్నను నిర్వికల్పసమాధి పరమాత్మానుభవము పరిమితములేని ఫలముగలది యని తెలియవలెను.

శ్లో॥ ప్రథమం శ్రవణం కృత్వా, ద్వితీయే మననం తథా।
నిదిధ్యానకం పశ్చాత్, సాక్షాత్కార స్తదా భవేత్ ॥

మొదట గురుముఖముద్వారా వేదాంత వాక్యములను శ్రవణము చేయవలెను. ఉపనిషత్తులనే పఠింపవలయును. తరువాత గురువు సన్నిధి శ్రవణముచేసిన దంతయు అధ్యయనముజేసిన సర్వస్వమును ఏకాంతమందుండి ఇతర చింతలు మాని తదేకాగ్రముతో తనలోనే తాను మననము చేయవలయు. తదుపరి మననముజేసిన పరబ్రహ్మమందు లక్ష్యముంచి చలించక యుండుటయను నిదిధ్యానము గావింపవలయు. అప్పుడు పరబ్రహ్మ సాక్షాత్కారముగలుగును. ఇదియే నిర్వికల్పసమాధి అనంత ఫలదము మఱియు నిష్కామకర్మయోగానుష్ఠానమును చక్కగా నాచరించినవారును గురునందు పరమేశ్వరునియందు భక్తితో పరిపూర్ణుడై ఉపాసనను పూర్తిజేసినవారును యమనియమాసనాదులభ్యసించువారును సప్తజ్ఞాన భూమికలలో మొదటిదియగు శుభేచ్ఛయందారితేరినవారును అయిన ముముక్షువు శ్రోత్రియబ్రహ్మనిష్ఠుడైన సద్గురుదేవునిసన్నిధియందున వేదాంతములనదగు ఉపనిషత్తుల బాగుగా పఠించవలయును. తత్త్వమసియను మహావాక్యమును గురుముఖముద్వారా శ్రవణముగావింపవలయును. మలవిక్షేపములను రెండుదోషములను నశించినవాడే మహావాక్య శ్రవణమునకు అధికారి యగుచున్నారు. కేవలము స్వరూపజ్ఞానము లేక ఆత్మకావరణ దోషమొక్కటి గలవాడే మహావాక్య విచారణను గావింపవలయును. శ్రవణము జేసిన మహావాక్యార్థలక్ష్యమునే సర్వదా మననము చేయవలయును. ఆ పరబ్రహ్మమే తానని దృఢముగా నిశ్చయము జేసికొని దానియందే యుండవలయును. ఇదియే నిదిధ్యానము ఈ మూడున్ను చక్కగా అలవడిన ప్రయత్నము లేకనే స్వయముగానే స్వరూపసాక్షాత్కార నిర్వికల్పసమాధి సిద్ధించు

చున్నది. తాజేయవలసిన అనుష్ఠానముల చక్కగా జేయుచుండిన ముక్తికై ప్రాకులాడనవసరములేదు. అది స్వయముగా లభించును. ఇంతకు సాధనలచే అజ్ఞానము నశించగా తను తానై యున్నాడు. మఱియొకటిలేదు. ఇదియే అద్వితీయ బ్రహ్మము అనన్తమగు నిర్వికల్పసమాధి జపము వాచికము ఉపాంశవు మానసికము అని మూడువిధములునై యున్నది. వాచికము కన్నను ఉపాంశు జపము అనగా కొంచనాలుకతో జపించుట నూఱింతలధికము. దానికన్న లక్షింతలు మానసిక జపమధికమగును. ఈ జపముచే మనస్సు అంతర్ముఖమై నిర్వికారమగుచున్నది. ఇదేప్రకారము శ్రవణ మనన నిదిధ్యాసములు మూడున్ను తెలియవలెను. వీటికన్నిటి కంటెను విలక్షణమైనది నిర్వికల్పసమాధి స్వస్వరూప సాక్షాత్కారమగును. ఈ విషయమై ఉపనిషత్తులందు ఇటులచెప్పబడి యున్నది. ఆత్మవిషయమును శ్రవణము చేయువారును మననము చేయువారును చక్కని అనుభవముతో చెప్పువారును పొందువారును, తెలియువారును ఒకరికన్న ఒకరు దుర్లభులు. ప్రమాణము

శ్లో॥ శ్రవణాయాపి, బహుభిర్యోనలభ్యః,
శృణ్వన్తోఽపి, బహవోయం నవిద్యుః।
ఆశ్చర్యోవక్తా, కుశలోఽస్యలబ్ధా,
ఆశ్చర్యోజ్ఞాతా, కుశలానుశిష్టః॥

తా॥ ఆత్మశ్రవణము గావించువాడు అనేకులలో ఒకానొకడు గానుపించును. అటుల వినువాడుండినను మననము లేనందుచే పరమాత్మను తెలియజాలకున్నాడు. మననము చేయువాడు శ్రవణము చేయువారనేకులలో దుర్లభుడు అటుల మననము చేయువారుండినను ఆత్మ వక్త అయినవాడు కడుంగడు కష్టలభ్యుడు అట్టి ఆత్మను చెప్పువారుండినను బ్రహ్మమందు లక్ష్యముంచు వారరుదు. అట్టి నిదిధ్యాసనా నిపుణులుండినను సద్గురువులచే చక్కగా శిక్షింపబడి పరమాత్మానుభవముగలవాడును అనగా బాగుగా తెలిసినవాడు అనేక కోట్లజనములలో ఒకానొకడుండును. ఇదే విషయమును భగవద్గీతయు నుడువుచున్నది.

శ్లో॥ ఆశ్చర్యవత్పశ్యతి కశ్చిదేన, మాశ్చర్యవద్వదతి తథైవచాన్యః।
ఆశ్చర్యవచ్చైనమ న్యశ్శృణోతి, శ్రుత్వాప్యేనం వేదనచైవకశ్చిత్॥

తా॥ ఈ ఆత్మవిషయమును ఆశ్చర్యముగా గాంచువాడొకడు ఆశ్చర్యముగా చెప్పువాడొకడు ఆత్మవిషయము నాశ్చర్యముగా వినువాడొకడు ఇదంతయు

ఆశ్చర్యమే. ఇటుల శ్రీవణముజేసియు తెలియకుండుట కదుంగదు ఆశ్చర్యము మనన విధిధ్యానములు లేనందుచే వినియును చెప్పుచును ఆత్మస్వరూపమును తెలియకున్నారు.

శ్లో॥ మనుష్యాణాం సహస్రేషు, కశ్చిద్యతతి సిద్ధయే ।
యతతామపి సిద్ధానాం, కశ్చిన్మాం వేత్తి తత్త్వతః ॥

తా॥ అనేకులలో నొకడు సిద్ధికై ప్రయత్నించుచున్నాడు. అట్టిప్రయత్నించు వారలలో ఒకానొకడు పరమాత్మను తెలియుచున్నాడు. "అనేక జన్మసంసిద్ధ స్తతోయాతి పరాంగతి" అనేకజన్మములనుండి శ్రవణ, మనన విధిధ్యానముల జేయుచు ఒకప్పుడు పరమాత్మతత్త్వ సాక్షాత్కారమును పొందుచున్నాడు. కావున స్వస్వరూప సాక్షాత్కార నిర్వికల్పసమాధి అనేకజన్మప్రయత్నలభ్యము అనంతము అద్వితీయము అఖండము. వ్యాపకము స్వస్వరూప పరబ్రహ్మము యొక్క యధార్థస్వరూపము నిరంతరము యెడతెంపులేక నేను బ్రహ్మమును అను ఆత్మానుసంధానముచేతనే పరబ్రహ్మమునందు లక్ష్యముంచుట వలన స్వానుభవ పూర్వకముగా తెలియబడుచున్నది. ఇది నిశ్చయము. బహుకాల మునుంచి అభ్యాసమును చేయుచువచ్చిననే నిర్వికల్పసమాధి స్వయముగా సిద్ధించును. అప్పుడు బ్రహ్మతత్త్వము కరతలామలకమువలె స్పష్టమగు చున్నది ఇట్టినిర్వికార స్వయంప్రబోధ సమాధి లేకుండిన మనోగమనము నానాముఖములుగా పోవుచున్నదై చపలస్వభావమగుటచే లౌకిక ప్రవృత్తులందు పరుగిడును. సమాధియనగా మహావేగతంపమైన చిత్తగతిని నిరోధించడమే యగును. చిత్తమే ప్రపంచము. జీవుడు అనాత్మపదార్థ జాతమగుచున్నది. అదావిని రహితమొనర్చి తాను పరబ్రహ్మ స్వరూపమగుటయే బ్రహ్మసాక్షాత్కార జ్ఞానమగును. అనగా చేతిలోనున్న బాణము చలించుచుండిన లక్ష్యము భేదింపలేనటుల మనస్సు చలించుచుండిన బ్రహ్మతత్త్వమును గనుగొనజాలదు జలోపాధి నిశ్చలమై నిర్మలమై నున్నప్పుడే బ్రతిబింబము కనుపించు మాద్కి మనోపాధియు నకలవాసనలు నశించినదై నిశ్చలమైయుండిన ఆత్మస్వరూపము ప్రతిఫలించును. "నైనం పశ్యన్త్య చేతసః ఈ ఆత్మనుచిత్త స్వాధీనము లేని వారూ కనుగొనజాలరు. అని భగవద్గీత చెప్పుచున్నది కాబట్టి నితంతర ధ్యానముచే చిత్తమును నిరుద్ధము గావించి నిర్వికల్పసమాధి వలన ముముక్షువు బ్రహ్మైక్యమును పొందవలయును. ఎందువలననగా చిత్తము మిగుల చలన

స్వభావముతోనుండునది అందుచే అనాత్మవృత్తుల పుంఖానుపుంఖములుగా సుద్గతములగుచునేయుండును. అలలున్నంతవరకు జలమునకు నిశ్చలత్వము లేనటుల సంకల్పములు పొడముచున్నంతవరకు మనస్సు ప్రశమింపజాలదు కావున ముముక్షువు అమితశ్రద్ధచే సకలేంద్రియములను నిగ్రహించి మనస్సును వృత్తి రహితముగాచుజేసి అట్టి నిర్మలనిశ్చలమగు సూక్ష్మ మనస్సును పరమాత్మయందు స్థిరముగా నిలుపవలయును. సర్వదా అంతర్దృష్టితో యుండవలయును స్వస్వరూప జ్ఞప్తినుండి చలింపకుండా నుండవలె ఇటులుండుటచే బ్రహ్మాత్మైకత్వ జ్ఞానము కలుగుచున్నది. నిరంతరము బ్రహ్మమే తానని చింతించి తదేకాగ్ర దృష్టితో సందర్శించుటచేత చాలాకాలమునుండి నాటుకొనియున్న దేహబుద్ధిగల అజ్ఞానమను చీకటిని నశింపజేయవలయును. చీకటియున్నప్పుడు కన్నులుండియు వస్తువుల కనబడుటలేదు అలాగున ఎంత శాస్త్రజ్ఞానమున్నను ఆవరణ భంజకమగు అహం బ్రహ్మాస్మియను అపరోక్షజ్ఞానము లేకుండిన తాను అజ్ఞానియే అగుచున్నాడు కాబట్టి మనస్సును బ్రహ్మము నందుంచి అందుచే గలిగిన స్వానుభవముచే బ్రహ్మానందమందు తన్మయుడు గావలయును.

శ్లో॥ నా విరతో దుశ్చరితా. న్నా శాంతోనా సమాహితః ।
నాశాంత మానసోవాపి ప్రజ్ఞా నేనైవ మాప్నుయాత్ ॥

తా॥ ఇంద్రియ ప్రవృత్తి రూప దుశ్చరిత్రమండి విరమించినవాడును శాంతుడును చిత్త సమాధానము గలవాడును ఉపశమించిన మనస్సుగలవాడును అగు యోగి ప్రజ్ఞచే పరమాత్మను పొందుచున్నాడు కనుక ముముక్షువు నిర్వికల్ప సమాధి శీలించిన మాత్రమునన అఖండ విజ్ఞానముగలుగును. అప్పుడు స్వస్వరూప సాక్షాత్కారము సహజమగును అట్టివాడే ముక్తుడు శాంతుడు తృప్తుడగును జీవ బ్రహ్మైక్యత్వ సిద్ధికి ఆధ్యాత్మికమగు సకలసాధనములలోను వైరాగ్యమే అత్యంత ప్రధానమని ముముక్షువు తెలిసికొనవలెను సకల శాస్త్రములు చక్కగా చెప్పుచున్నవి. ఆత్మవిచారణకు శ్రవణ మననాదుల వలనను ఆత్మస్వరూప మిట్టిదని దృఢముగా తెలిసికొనుటయును బోధయు అవశ్యమని తెలియవలయును. వైరాగ్య ఆత్మబోధములచే మోక్షసౌధమునెక్కి నిర్విషయమనోద మతో విహరింపవచ్చునని తెలియవలెను. అనగా పక్షి తనరెండు రెక్కలచే అత్యున్నతమైన ఆకాశమున స్వేచ్ఛగా విహరించుచున్నది ఆ పక్షియొక్క

విహారమునకు కొండలుగాని పెద్దవృక్షములుగాని అడ్డులు కాజాలవు. అలాగుననే అన్నిటికన్నను విలక్షణమై మహత్తరమైన చిదాకాశమనబడు పరబ్రహ్మమందు ముముక్షువగు పురుషుడు వైరాగ్యబోధలనెడు రెండురెక్కలచే స్వేచ్ఛగా విహరించుచున్నాడు. అవిద్యయను పెద్ద పెద్ద శైలశిఖరములు ప్రతిబంధములు కాజాలవు. ఇటుండ కామక్రోధాది దుర్వృత్తులను మహావృక్షములు గూడ ఏమి చేయజాలవు. పుణ్యపాప సుఖదుఃఖ శీతోష్ణాది ద్వంద్వములుగూడ వైరాగ్యబోధలుగల వివేకిని బాధింపజాలవు. బ్రహ్మాదిస్తంబ పర్యంతముగల దృశ్యమందును తనదేహేంద్రియాదులందును యేయే అనాత్మపదార్థములు గలవో వాటియన్నిటియందును జుగుప్స (ఇచ్ఛలేకుండుట) అను వైరాగ్యము పరబ్రహ్మ స్వరూపాత్మను తెలియవలయునను అత్యుత్కటాసక్తిచే ఆత్మస్వరూపమును నిశ్చయముగా తెలిసికొనుటయనుబోధ ఇవి రెండును గలవాడు కామక్రోధాది సకల వృత్తులను సుఖదుఃఖాది ద్వంద్వములను సహింపజేసినవాడై అజ్ఞానమునతిక్రమించి స్వస్వరూప చిదాకాశ పరబ్రహ్మమందత్యానందముతో విహరించుచున్నాడు. ఇట్టి అప్రాకృత అత్యుత్తమస్థితి వైరాగ్యబోధలు లేనిదే గలుగదు. విహంగము ఒక పక్షముండిన గగనమునకెగురజాలనటుల కేవల మొక్కవైరాగ్యముగాని కేవలమొక్క ఆత్మబోధగాని ఒక్కటియుండినచో ముముక్షువు బ్రహ్మోన్నత స్థితిని పొందజాలడు. ముక్తియనెడు మేడ కొనయందున్న తీగెను పురుషుడును పక్షి ఎక్కజాలడు. పై రెండింటిలో ఒకదానిగలవాడు ముక్తుడుగాడు. శాస్త్రములలో జీవుని పక్షినిగా నీరహస్యము చేతంగియే ఋషులు వర్ణించియున్నారు. జీవుడును పక్షివైరాగ్య బోధలను రెండురెక్కలచే బ్రహ్మరంధ్రమను సౌధాగ్రమును అధిరోహించి ముక్తియను తీగెను (సుషుమ్నాస్థానమును) పొంది ప్రపంచాతీతానందములోనున్నది విహంగము మేడలయొక్క కొనయందలి ప్రాకియున్న తీగెనెక్కుచున్నది. అందులోని ఫలములు భక్షించి అత్యధికానందముతో నున్నది. అటులనే జీవుడును బ్రహ్మైక్యమను సౌధమునెక్కుచున్నాడు. ముక్తియను జ్ఞానఫలము ననుభవించుచు జనన మరణ రహితపదవితో అఖండానందంతోనున్నాడు. అనగా జీవుడే బ్రహ్మత్వమునొందు చున్నాడు. ఓ పవిత్రుడగు వివేకశీలుడగు ముముక్షువా మహాజ్ఞానులకు యథార్థమును తెలియున్వభావమున్నది. గనుక నీవున్ను వైరాగ్యబోధల వెంటచేతనే ముక్తిలభించునను విషయముదెలిసి వాటిని బాగుగా

సత్యసింధువి పరబ్రహ్మమందు విహరించును. మరియు రెండుపాదములు రెండు చేతులు, రెండు నేత్రములు, రెండు చెవులు ఇవిగాగున రెండు చేరితే శరీరము పరిపూర్ణమగుచున్నది. అలాగున వైరాగ్యబోధలు రెండును కలిసితే ఆత్మానుభవము పూర్తియగుచున్నది. పైజెప్పిన అంగములలో యేదిలోపించి నను శరీరము అంగవికలమగు విధమున బోధవైరాగ్యములలో యేదిలోపించి నను సాధన వికలమగుచున్నది. బాహ్యేంద్రియములు అంతరేంద్రియములు చేరియే ఒకకార్యమును చేయుచున్నవి. జ్ఞానవైరాగ్యములుండియే ముక్తికార్యమును సిద్ధింపజేయుచున్నవి. కాళ్లుండియు అంధుడు గమనము చేయజాలడు. కాళ్లులేకుండినను నేత్రములు గలవాడు మరియొకచోటికి పోజాలడు. అలాగున ఆత్మబోధలేనివాడు ఆత్మస్వరూపమును తెలియనివాడగుటచే గమ్యస్థానమును పొందజాలడు. బోధయున్నను వైరాగ్యమను కాళ్లులేనివాడు మోక్షమార్గమున నడువజాలడు. కావున నేత్రపాదములవలె వైరాగ్యబోధలు రెండును అత్యవశ్యకములే.

శ్లో॥ ఉభాభ్యామేవపక్షాభ్యాం, మాకాశేపక్షిణాం యథా ।
తథాగతిర్ముముక్షూణాం, శమబోధద్వయేనహి ॥

తా॥ పక్షులకు ఆకాశవిహారము రెండురెక్కలచే సిద్ధించునటుల ముముక్షువులకు ముక్తివిహారము వైరాగ్యబోధలచే సిద్ధించును. ఏలాగున ఒంటి [illegible] లేక ఒక అగ్నిచేత అన్నము వడ్డింపబడదో అగ్నిజలములు రెండును వంట చేయుటకు అవసరములై యుండునో అలాగున భక్తిచేతగాని లేక ఒక్కబోధ చేతగాని ముక్తిలభింపదుగాన మోక్షమొందుటకు వైరాగ్యబోధలు రెండును కావలసినవే మరియు అగ్నిజలములు రెండును చేరితే యంత్రములు నడుచు చున్నవి. ఒక్కదానివలన యంత్రము పనిచేయదు. అటువలనే విరక్తిబోధలు కలిసియున్నవారలచేతనే శీఘ్రముగా ముక్తిమార్గమును పొందుచున్నారు. మరియు పూర్ణమైన పక్షి రెండురెక్కలు గలిగి పూర్తిగా ఆకాశమున మిగులవేగముతో విహరించుచున్నది. కావున వైరాగ్యబోధలను రెండురెక్కలను ఇంద్రియ నిగ్రహముచేతను [illegible] అగము [illegible] ముముక్షువున్ను విహరించు చున్నారు. [illegible] రెక్కలు [illegible] [illegible] రెక్కలు [illegible]

చలింపనీయక భయములేనిదై హాయిగా రెక్కలనుసాచి కదలింపనీయక విహరించుచున్నది అలాగున అభ్యాసాంముగ వైరాగ్యబోధోపరతులు క్రమక్రమముగా వృద్ధిపొందుట అనువాని సహాయముచే బ్రహ్మస్థాముగ విహరించుచున్నారు. ఈమూడున్ను స్థిరములగునప్పుడు వీటిని పేక్షింపక చిదాకాశ బ్రహ్మమున ఆనందముతో విహరించుచున్నారు॥

మొట్టమొదట దేనియందును ఆశలేకుండుటయును పరవైరాగ్యమగుట వలయు "విరాశాహి పరంసుఖం" అనునటుల విరాశయే పరమసుఖము కైవల్యదాయి అగుచున్నది. అట్టినిష్కల్మషవైరాగ్యోపేతునకు బ్రహ్మమందు స్థిరముగా మనస్సుకలుగుట వృత్తులన్నియు నాశమయి యుండుటయను సమాధి గలుగును. అట్టినిశ్చల బ్రహ్మనిష్ఠగల వానికి నిర్వికార నిరంజన నిత్యశుద్ధ బుద్ధ పరబ్రహ్మమునేనే నాకన్న వేరులేదు. "ఏకమేవాద్వితీయం బ్రహ్మ, సర్వం ఖల్విదం పరంబ్రహ్మ" అను స్వయం ప్రబోధకలుగును. అప్పుడు హృదయ పుండరీకము వికసించినది అగును. అనగా బ్రహ్మాకారమగును. అంతయు జ్యోతిర్మయమే లేక విజ్ఞానరూపమే. అదృశ్యమవ్యవహార్యస్థితియు నదియె. ఇట్టి ప్రబుద్ధ యథార్థానుభవము గలవానికి అజ్ఞానావరణము తొలగి బంధవిచ్ఛేదము గలిగి ముక్తావస్థయనదగు పరబ్రహ్మాకారస్థితి జనించును. అట్టి జీవన్ముక్త పురుషునకు జీవత్వము పోయి బ్రహ్మత్వము జెందినవానికి సర్వదా పరబ్రహ్మసుఖానుభవము విచ్ఛిత్తి లేక గలుగును. ఇదియె కైవల్య పదవి అఖండ విజ్ఞాన బ్రహ్మానందము శివము అద్వైతము గనుక పరవైరాగ్యముచే ధ్యానసమాధిలాభము దానిచే దృఢప్రబోధము అందుచే బంధవిముక్తి అద్దానిచే జీవన్ముక్తస్థితియు నిత్యానందానుభవము క్రమముగా కలుగుచున్నది. కాబట్టి వైరాగ్య చిత్తస్థైర్య సమాధుల బోధోపరతులు పరమసాధనములని ముముక్షువు గ్రహించవలయును. వైరాగ్య భాగ్యమబ్బిన అన్నియు సుఖములే. ఈ వైరాగ్యము బహుజన్మ సుకృత సద్గురు శుశ్రూషచేతనే గలుగుచున్నదని తెలియవలయును.

మరియు వైరాగ్యమే పరమసుఖదమనియు కైవల్యప్రాప్తికి ముఖ్యహేతువనియు మరియొకటి సుఖదాయకము కాదనియు పవిత్రమగు వైరాగ్యము చేకూరిన ముక్తికాంతదర్శనము అడ్డులేక గలుగుననియు ముక్తిద్వారమును తెలుపుచుండుటయును స్వస్వరూప బోధముతో గూడిన వైరాగ్యము గలిగియుండుటయే

వీక్షింపదగిన పరబ్రహ్మమందు స్థిరముగా స్థాపించవలయును ఇతర విషయము లందు పోనీక వైరాగ్య బోధోపరతులచే విశ్రాంతముగాచేయవలయును చిత్తము పరబ్రహ్మ సన్నికర్షముచే దానిలో లయించుచున్నది లేక పరబ్రహ్మ రూప మును బొల్చుచున్నది. అప్పుడు దృశ్యమంతయు నాశముజెందును అందుచే జీవుడే పరమాత్మయను జ్ఞానముచేతను అవిద్యా నిర్ముక్తుడై బ్రహ్మైక్యమును పొందుచున్నాడు లేక తా బ్రహ్మమగుచున్నాడు. అట్టి పరబ్రహ్మత్వముచే తదితర పదార్థములు స్ఫురింపనందుచే తన్మయీ కరణముచే పరిపూర్ణ బ్రహ్మ కారముతో నిరంతరము తాను బ్రహ్మానందామృతము గ్రోలుచున్నారు. శాశ్వత ముక్తి ధామమున విహరించుచున్నారు. కావున ముముక్షువు సకలేంద్రియము లవి గ్రహించి లక్ష్యము పరబ్రహ్మమందుంచి సకలమును మరచినవాడై జీవ బ్రహ్మైక్యభావముతో తన్మయత్వముతో అఖండ బ్రహ్మకారముతో ఆత్మయందు నిరతము బ్రహ్మానందామృతమును పానము జేయవలయు అట్టి ముముక్షువు అగు వాడు బ్రహ్మమే యగుచున్నాడు. తదితరములయిన ఆనంద జనకములగాని బ్రహ్మైక్యమునకు విరుద్ధమయిన సిద్ధులపేక్షించి జేయు యోగసాధనలచేతను ప్రయోజనములేదు. ఆ యోగసాధనలతో సిద్ధులపేక్షించి కాలము నడుపుచుండిన మృత్యు ప్రాప్తియే లభించును. జ్ఞానమెన్నటికి గలుగదు నిరతిశయానందము ప్రాప్తించదని సద్గురూపదేశ సిద్ధాంతము కావున సకల అనాత్మ భావనలను ఆత్మేతరసాధనలను పరిత్యజించి పైరీతిగా ధ్యానపద్ధతి ననుసరించిన ధ్యేయా కారముతో ధ్యేయ బ్రహ్మమై సర్వదా బ్రహ్మానందామృత పాన తన్మయుడై సకలమును మరచి జీవన్ముక్తుడగుచున్నాడు. కాబట్టి అనాత్మచింతన వాటి పైనున్న భావనలు అనంతములు మోహమునే కలుగజేయును. కావున అపవిత్రమైన జనన మరణ సంసారదుఃఖ కారణమైన అనాత్మ భావనను వదలియుండ వలెను. ముక్తి కారణమైన పరమశాంతి రూపమైన స్వస్వరూప పరబ్రహ్మ ధ్యానమునే జేయవలెను. ఇదియే సద్గురూపదేశ సారాంశము ఎప్పుడును ఆత్మ జ్ఞానయోగి దృశ్యభావనను లోపల మొదలుకానీయక ఆత్మలో పరమాత్మ భావనను మరువక యుండవలయును. ఇట్లుండిన యథార్థమగు బ్రహ్మము తానగుచు శాంతిని పొందును.

శ్లో॥ విషేధనం ప్రపంచస్య రేచకాఖ్యః సమీరణః ।
తతస్తద్వృత్తివైశ్చల్యం కుంభకం ప్రాణ సంయమః ॥

తా॥ ప్రపంచభావమును, దూరీకరించుటయే రేచకము నేను బ్రహ్మమను భావము పూర్వకము బ్రహ్మాకారవృత్తి పరముగా యుండుటయే కుంభకము ఇది యదార్థమగు ప్రాణసంయమము అనియు పనిషత్తు చెప్పుచున్నది. కావున అస్థిర దేహాద్యనాత్మ భావనను వదలి ఆనందరూప పరమాత్మను ధ్యానింప వలయును. ఇదియే ముక్తి హేతువగును. మఱియు ఈ ఆత్మస్వయం ప్రకాశ జ్యోతి అన్నిటికిని సాక్షియై సమస్తమును తెలియుచున్నది. ఇంద్రియాతీత జ్ఞానమునకు విధియై సర్వదా ప్రకాశించుచున్నది. అనిత్య జడములైన దేహా దులకంటె విలక్షణమైనది కావున సద్రూప పరమాత్మయందు లక్ష్యముంచి "అహం బ్రహ్మాస్మి" యను బ్రహ్మాకారవృత్తితో సర్వదా స్వస్వరూప ధ్యానము చేయవలెను. ఇట్టిభావనయే స్వస్వరూప సమాధియగును.

శ్లో॥ నిర్వికార తయావృత్త్యా, బ్రహ్మాకార తయాపునః ।
వృత్తివిస్మరణం సమ్యక్, సమాధిర్జ్ఞాన సంజ్ఞకః ॥

తా॥ ఏలాంటి చిత్తాది వికారములు లేక బ్రహ్మాకారముతో నుండి చిత్తవృత్తు లన్నిటిని బాగుగా మరచిపోయి యుండుటయే సమాధియగును. దీనినే జ్ఞాన మని పెద్దలు వచింతురు.

పరబ్రహ్మ స్వరూపమును వివిధ విశేషణములచేత తెలిసినందుకు అట్టి బ్రహ్మమే తానై యున్నందుచేతను తనకన్న వేఱుపదార్థము ఇక లేనం దుచేతను దీనినే తెలిసిన సమస్తము తెలిసిన వారగునని వేదాంత శాస్త్రములు వక్కాణించుచున్నవో అద్దానిని తెలిసినందుచేతను ఇక తెలియదగినది మఱి యొకటి లేదని మహాత్ముల అభిప్రాయము గనుక అపరబ్రహ్మము ఆకాశము వలే నిర్మలముగాయున్నది. అవివేకులు ఆకాశము నీలమనియు పీతమనియు ఈలాటి ధర్మములను శుద్ధమగు గగనమందు రూపము లేకున్నను రూపము కల్పించుచున్నారు. విచారించిచూచిన శుద్ధమయిన ఆకాశము సర్వత్ర వ్యాపించి యున్నది. అత్యంత శుద్ధమైనది. అలాగుననే నిత్య శుద్ధ బుద్ధ పరమాత్మయందు అజ్ఞానులు భ్రాంతిచే మాయా మాలిన్యరూప ధర్మములయిన సుఖదుఃఖాదులను కల్పించుచున్నారు. వస్తుతః ఆత్మపరిశుద్ధము నిర్ధర్మియగును మఱియు ధూమ్యాదులవలె గగనము గోచరము కానందుచే ఆకాశమే లేదని సందేహించు వారును గలరు. విచారించిన ఆకాశము సూక్ష్మమై "శబ్దగుణకం ఆకాశం" అను రీతి శబ్దగుణముగల ఆకాశం శబ్దగుణముచే తెలియబడుచున్నది. శబ్దధర్మముచే

అమూర్త రూపమగు సూక్ష్మ గగనతత్త్వము పరిస్ఫుటమగుచున్నది. అటులనె అనాత్మపదార్థములను దేహాదులవలె ఆత్మయు గోచరింపమిచే ఆత్మయేలేదని శంకించువారును యున్నారు. విచారించిన ఆకాశమువలె అతిసూక్ష్మమై సచ్చిదానందాది లక్షణ ధర్మములచే ఆత్మవస్తువు బాగాతెలియబడుచున్నది. కావున ఆకాశమువలె యేలాటి సందేహ గోచరముగానిదై యున్నది. ఇకను ఆత్మ వ్యోమమువలె నిస్సీమమయినది. మేరలేనిది అవధిలేనిది గగనమునకు అవధి లేదు. అన్నిటికిని నవకాశమునిచ్చుచు సకల భూతముల కాధారమగుచు సర్వత్రివ్యాపించి ఆకాశమున్నది. అదేవిధముగా ఆత్మ వస్తువునకు మేరలేదు. పరిమితరహితమైనది. ఆత్మ సకలభూతములకును సమస్తప్రపంచమున కాధారమై, సర్వత్రివ్యాప్తమై పరమాత్మవస్తువు ప్రకాశించుచున్నది. మఱియు వాయ్వాదులవలె చలనములు లేక ఏలాటి వికారములు లేక యుండు గగనమువలె ఆత్మపదార్థము ఇంద్రియాదులు చలించునటుల చలింపక సర్వదా అచలమై నిర్వ్యాపారమై క్రియారహితమై వికారములులేనిదై తేజరిల్లుచున్నది. ఈ ప్రకారము గగనమువలె నిర్మలత్వ. నిర్వికల్పత్వ. నిస్సీమత్వ. నిష్పందత్వ. నిర్గుణత్వ ధర్మములతో ఆత్మవస్తువున్నదని తెలియవలెను. అనేక వేదాంత శాస్త్రములలో పరమాత్మకు గగన సాదృశ్యమును విశేషముగా మహాఋషులు వర్ణించియున్నారు. విచారించిన ఆకాశమువలె జడముగాక పరమాత్మచైతన్యవంతమై సదాయుంటున్నది. కావున ఆత్మచైతన్యపదార్థము పరిశుద్ధము వికల్పరహితము అపరిమేయము అపరిచ్ఛిన్నము అచలము సనాతనము నిర్వికారమని తెలియవలయును. ఇకను ఆయాత్మ లోపలను బయటను శూన్యముగాయున్నది ఆత్మపదార్థము "అంతఃపూర్ణ బహిఃపూర్ణః పూర్ణకుంభ ఇవాంబరే" అనునటుల లోపలను బయటను పూర్ణకుంభమువలె పరిపూర్ణమై యుండగా ఆత్మ అంతర్బహి శూన్యమని ఎట్లుచెప్పనగునని సందేహింపవలదు. ఆత్మకు బయట వెదకినను లోపల వెదకినను యేలాటి మాయా మాలిన్యములేదు. దేనితోను సంబంధమున్నులేదు. అసంగము ఆత్మయని అర్థము. లేదా బయటను లోపలను యేచోట జూసినను ఆత్మకు ఆకారములేదు. అందుచే ఆత్మ ఆకారముచే శూన్యమనితెలియవలెను. కావున ఆత్మనిరాకారమని తెలియవలెను. దీని ననుసరించియే అంతఃపూర్ణమను శ్లోకము యొక్క ఉత్తరార్ధమునందు నీలాగున చెప్పబడియున్నది. "అంతః శూన్యః బహిశ్శూన్యః శ్శూన్యః కుంభ ఇవాంబరే"

జలములేని ఘటము అన్నిచోటల శూన్యమగునటుల ఆత్మవస్తువు ఎచ్చోటను మాలిన్యముచే రహితమని తెలియవలెను. మఱియు బయటయున్నది లోపల లేదు లోపలయున్నది బయటలేదు. ఈలాటి భావములులేక అంతటయున్నది బ్రహ్మము ఇకను ఆ ఆత్మవస్తువు అనంతము. దేశకాల వస్తువులచే పరిచ్ఛిన్నముగానిది అపరిచ్ఛిన్నము సర్వవ్యాపి అయాత్మఅద్వయము రెండవ వస్తువులేనిది ఉన్నదంతయు ఏకరూపమయ్యేయుండగా దితీయవస్తు వ్యవహారమేలేదు. ఆ ఆత్మయే పరబ్రహ్మ స్వస్వరూపమైయున్నది. కావున అంతర్బహిర్మాయా శూన్యమైనదియు అనన్తమయినదియు అద్వితీయమైనదియునై పరబ్రహ్మము స్వయంప్రకాశమానమైయున్నది. అట్టి పరబ్రహ్మమే తానుగా యున్నాడు. తాను ఆకాశమువలె నిర్మల నిర్వికల్పాది విశ్లేషణములతోగూడు కొని సర్వత్ర పరిపూర్ణుడై మాయా మాలిన్యదోషరహితుడై అపరిచ్ఛిన్నుడై అఖండాద్వితీయ పరబ్రహ్మమైయుండగా ఇక తనకు తెలియదగినది మఱి యొకటిలేదు. శాస్త్రములచే నిర్ణయింపబడిన గురూపదేశ లక్ష్యమయిన అనుభవమునకు గోచరము గావలసియున్న పరమాత్మ వస్తువు సిద్ధమయినది. ఇక తానుశాస్త్రములు చదివినందులకు ఫలితమును పొందినవాడాయెను. దేనిని తెలిసికొనిన శ్రవణముజేసిన సకలమును తెలిసినవాడును వినినవాడును అగునో అట్టిపరబ్రహ్మమును దెలిసి ఈ సర్వజ్ఞుడాయెను. తనకన్న అన్యవస్తువులేవందుచే తెలియదగినదిగూడలేదు. కావున ముముక్షువు అట్టి పరబ్రహ్మము తాను గానే యున్నానవియు తనకు చెప్పదగినదియు తనచే తెలియదగినదియు లేదనియు ఇదియే గురుపదేశమనియు గ్రహించవలెయును. ఇంతకు నిర్మలాది ధర్మవిశిష్ట పరిపూర్ణ అనన్త అఖండాద్వితీయ పరబ్రహ్మము తెలిసి ఆనద్వస్తువుతానైనవాడు సకలము నేఱింగినవాడగును.

శ్లో॥ శుద్ధం విశుద్ధ, మవిచార మనన్తరూపం,
నిర్లేపలేప మవిచార మనన్తరూపం
నిష్ఖండఖండ మవిచార మనన్తరూపం.
జ్ఞానామృతం సమరసంగగ నోపమోఽహమ్॥ అని అవధూత

గీత గగనసాదృశ్యమును పరమాత్మ కనేకవిధములుగా చెప్పుచున్నది. ఎట్లనగా తా॥ నేను శుద్ధుడను అశుద్ధుడను విచారము లేనివాడగుటచే అనంతరూప బ్రహ్మమగుచున్నాడను. నిర్లిప్తుడను, లిప్తుడను, సంగుడను, అసంగుడను

అను విచారమునకు దూరమైనవారై నందుచే అనంతరూప పరమాత్మగుచున్నాను నేను ఖండుడను అఖండుడను అనగా అపరిచ్ఛిన్నుడను అను విచారరహితుడవగుటచే అనంతరూప పరబ్రహ్మమగుచున్నాను. నేను జ్ఞానామృతస్వరూపుడను, సమరసుడను, గగనసదృశుడను, సర్వత్ర వ్యాపించినవాడను॥

అదియునుంగావక ఈ జీవుడు పరబ్రహ్మమే వేరుగాదు. సమస్త జగత్తు పరబ్రహ్మమేయగును. యున్నది పరబ్రహ్మమొకటియే. ఈలాగున శ్రుతి భగవతి వచించుచున్నదని దెలిసి నిశ్చయజ్ఞానము గలవారై సకల బాహ్యవస్తువులను పరిత్యజించి బ్రహ్మవేత్తలు పరబ్రహ్మ స్వరూపులై స్వయంప్రకాశమాన విజ్ఞానాత్మక బ్రహ్మానంద స్వస్వరూపముతో నిరంతరముంటున్నారు. ఇదినిశ్చయమని ముముక్షువు తెలియవలెను. ఈ బ్రహ్మజ్ఞాన విషయమున విశేషముగా ప్రతిపాదించదగినదెద్దియులేదు. అనగా ఏమి ప్రతిపాదింపబడినను సారము లేనిదేయగును సకలోపనిషత్తులు సకల శాస్త్రములు బ్రహ్మానుభవము గల మహాత్ములు విస్తారముగా వచోయుక్తులతో శాస్త్ర ప్రమాణములతో ననుభవములతో అనేక విధ వర్ణనంతో బ్రహ్మజ్ఞాన విషయమును చెప్పియున్నారు. వాని సారమంతయు జీవుడు పరబ్రహ్మము కన్న వేఱుగాదు స్వత సిద్ధముగా జీవుడు పరబ్రహ్మమే అని వచించుటయగును ఈ జీవ బ్రహ్మైక్య విజ్ఞానము వేదాంతశిఖరము వదిష్టించియున్నది. ఇట్టి జీవ బ్రహ్మభేదమును జెప్పుశాస్త్రములే వేదాంతులకు పరమ ప్రమాణములై యున్నవి. గనుక స్థూలసూక్ష్మ శరీరములకన్న విలక్షణుడై జీవాత్మ యున్నాడు. ఆజీవాత్మ ఈశ్వరుడు ( సాక్షాత్పర బ్రహ్మము ) సర్వాన్తర్యామి సర్వరూపుడు సర్వాతీతుడై యున్నాడు. కావున అవ్యయమగు బ్రహ్మమే నేనై యున్నాను.

శ్లో॥ అయం ప్రపంచో మిథ్యైవ జీవో బ్రహ్మైవ నాపరః ।
అనేన శాస్త్రం వేత్తవ్యం ఇతివేదాంత డిండిమః ॥

శ్లో॥ కార్యోపాధి రయం జీవః కారణోపాధి రీశ్వరః ।
కార్యకారణ తాం హిత్వా పూర్ణబోధో వశిష్యతే ॥

తా॥ ఇటుల శ్రుతి మొదలగునవియు జీవ బ్రహ్మైక్యమునే ప్రతిపాదించుచున్నవి. అట్టి అఖండార్థమును బోధించునవి గనుకనే " అహం బ్రహ్మాస్మి " మొదలగు మహావాక్యార్థములు వేదాంత సారములై సార్థక సంజ్ఞగలవాయెను

గనుక సత్యమైన పరబ్రహ్మమునుండి పుట్టినదివలె భాసించుచున్నది గాన ఈ పరిదృశ్యమానమగు విశ్వమంతయు పరబ్రహ్మ స్వరూపమేను వేరుగాదు. అజ్ఞానుల దృష్టిభావనంతే ప్రపంచము బ్రహ్మముకన్న పృథక్కుగా గానుపించుచున్నది విచారించిన అదియు బ్రహ్మమేను సత్యము అవివేకముచే మిథ్యాభూతమై భాసించుచున్న జగము వివేకముచే లేని జగము లేనిదైయున్నది. ఇక పరబ్రహ్మమే సదాయుండునదని తెలియవలెను

శ్లో॥ ఉపాదానం ప్రపంచస్య బ్రహ్మణోఽన్యన్న విద్యతే ।
తస్మాత్సర్వ ప్రపంచోఽయం బ్రహ్మైవాస్తి నేతరత్ ॥

తా॥ ప్రపంచమునకు ఉపాదానకారణము పరబ్రహ్మము కన్న మఱియొకటిలేదు మట్టికుండ యగులాగున దూదివస్త్రమగులాగున పరబ్రహ్మమే జగత్తుగా గోచరించుచున్నది కావున సర్వ జగత్తున్ను పరబ్రహ్మ స్వరూపమైయున్నది. ఈ విషయమునే "బ్రహ్మైవేదం సర్వం ॥ సర్వం ఖల్విదం బ్రహ్మ" అంతయు పరబ్రహ్మమే అను మొదలగు శ్రుతి స్మృతి వాక్యములు దెలుపుచున్నవి. మఱియు ఏకమేవా ద్వితీయం బ్రహ్మ నేహనానాస్తి కించన అనగా ఇచ్చోట నానాత్వములేదు యున్నది అద్వితీయ పరబ్రహ్మ మొక్కటియే అను వేద వాక్యాను సారముగా ఆ అద్వితీయ బ్రహ్మమొకటియే సర్వదా స్వయంప్రకాశమై విరాజిల్లుచున్నది పైన కనుపరుపబడిన శ్రుతివాక్యముల రీతిగా జీవుడు పరబ్రహ్మమే జగత్తు పరబ్రహ్మస్వరూపమే అద్వితీయ పరబ్రహ్మమొకటియే యున్నది అను విషయము సిద్ధించెను కావున ఈలాగున శ్రుతి తత్త్వము నెఱింగిన మహానుభావులు అవిద్యయను మహానిద్రనుండి మేలుకొని జ్ఞాన స్వరూపమైన మతిగల వారగుచున్నారు. ఈలాగున విజ్ఞానాత్మ బుద్ధిగల వారు గనుకనే సమస్త అనాత్మ పదార్థములగు దేహాది దృశ్యజాతము నంతయు బంధమనియు వినాశకరమనియు అస్థిరమనియు తలంచి పూర్తిగా వదలినవారై శ్రుతి వాక్య ప్రత్యయముతో గూడినవారై నేను అఖండ సచ్చిదానంద స్వరూప ప్రజ్ఞాన ఘన పరబ్రహ్మమేనని నిశ్చయ జ్ఞానము గలవారై "బ్రహ్మవిత్ బ్రహ్మైవభవతి" అనగా బ్రహ్మమెఱిగినవాడు బ్రహ్మమే యగుచున్నాడు అను శ్రుతివాక్యాను సారముగా "బ్రహ్మవిది బ్రహ్మణిస్థితః" అను గీతావాక్యానుసారముగా పరబ్రహ్మస్వరూపులై నిరంతరము చిదానందస్వస్వరూపముతో స్వస్వరూప పరబ్రహ్మమందే విహరించుచున్నారు. ఇదినిశ్చయము కాబట్టి

జీవబ్రహ్మైక్యవిజ్ఞానము సత్యాత్మభావమును అఖండాద్వైతము పరబ్రహ్మై కత్వస్వానుభవమును గల మహాత్ములు నిరంతరము కృతార్థులై అఖండ పరబ్రహ్మానంద స్వస్వరూపస్థితిలో యుందురు. ఈవిషయము శాస్త్రములచేతను మహాత్ముల అనుభవముచేతను ముముక్షువులకు పరమ ధర్మమని నిశ్చయింప బడినది. ఇట్టిస్థితిని శ్రవణాదుల చేసి అఖండాత్మైక్యస్వానుభవ జ్ఞానముగల వారు కృతార్థులుగను ప్రాప్తప్రాప్తవ్యులుగను యగుచున్నారు.

మరియు అజ్ఞాని యనుడు మలమయమై కొలుత్రియైన ఈ శరీరము నందు అభిమానముంచుచున్నారు. లోకమున పందులుగాదె మొదలయిన భార్యాపుత్రాదులతో గూడియుండునని ఈశరీరమో అసహ్యమగు చీము నెత్తురుతో గూడినది. త్వగస్థి మాంసరుధిర చర్మమజ్జా స్నాయువులను సప్తధాతువులతో గూడి అస్థిర అసహ్య దుఃఖభాజనమై పిండీభూతమై జడమైన ఈ స్థూలశరీర మునే మూఢులు నేనని తలంచుచున్నారు. ఈ శరీరములోనున్న జీవుడు బయట రాగానే ఈ శరీరము నాశము జెందిన దానిని మోహించుచున్నా మని తలంచుచున్నారు. అజ్ఞానుల స్వభావము కడుచింత్యమైనది. మిగుల నీచ ములయిన పరాహోదులు మలమునే భక్షించుచు దానిలోనే పొరలుచున్నవి. ఆనందించుచున్నవి. పేడలోని పురుగులు అందులోనే వసించుచు అందులోనే మడియుచున్నవి. అలాగున అజ్ఞానజీవులు మలమయమైన శరీరమునభిమా నించుచు నందులోనే యుండుచు మలప్రచుర శరీరము నందితే జీవించుచు అలాగుప్పాకరమునైన దేహమందే సత్యత్వభావముంచి దానినే తిరుగా కోరు చున్నారు. కొన్ని కీటకములు గూటిని తయారుచేసికొని అందులోనే మడియు నటుల ఈ అజ్ఞానజీవులు ఈ శరీరాభిమానము కొరకనే మరణించుచున్నారు. ప్రత్యక్షముగా శరీరము యనేకవిధములయిన కుళ్లిపదార్థముల కొలయమై దుర్గం ధముతో గనబడుచున్నది. ఇటువంటిదియున్న దీనిని పోషింప పెతలుండు చున్నారు. పుట్టలోని సర్పము బయటి గరుత్మంతుని పేర చూచి భయపడు చున్నది. మరియు నాపన్నగము పుట్టనంతయు విషమయము చేయుచున్నది. అలాగున అజ్ఞాని జీవులు శరీరమను పుట్టలో వసించుచు మృత్యువునకు భయ పడి శరీరమునందని తెలిసియు శరీరములోనే యుండదలంచుచున్నారు. కామ క్రోధాది విషయగుణములతో శరీరమునంతయు "ఉన్నవాడు నిలువెల్ల విషము యనుట సుమ్ము" అనునట్టి విషమయముగా చేయుచున్నారు. కావున పరమార్థి

నీచజంతువువలెను కీటకమువలెను యీమలభూయిష్టపు తోలుబొమ్మయందలి యభిమాన మానక యీదేహము బంధకరమని తలంచి వైరాగ్యమవలంబించవలయును. శుద్ధజీవుల స్వభావము శుద్ధమునే గ్రహించుటయగును. ముందుగా స్థూలమైన ఈ శరీరమందు నేనను అహంకారముచే పరికల్పితమైన అభిమాన వాంఛను వీడవలయును ఈ స్థూలదేహాభిమానమును త్యజించుటచే దేహమునకు సంబంధించిన బ్రాహ్మణత్వాది బ్రహ్మచర్యాది సౌందర్య సౌష్టవాదులచే గలుగు యభిమానములన్నియు స్వయముగా " ఆశ్రయనాశే ఆశ్రయినాశః " ఆశ్రమము నశించిన ఆశ్రయించిన పదార్థముగూడ నశించును. వృక్షము దగ్ధముకాగ దాని తొఱ్ఱలోనుండు పక్షులు లేక సర్పములు నశించుచున్నవను న్యాయమున విడిపోవుచున్నవి. ఈ స్థూలదేహాభిమానమును విడిన తరువాత స్థూలశరీరమును (అన్నమయకోశమును) నడుపు సూక్ష్మశరీరమొకటియున్నది ఇది లింగశరీరమగును. స్థూలదేహముపైన అభిమానము పోయినను ప్రాణమునే గోరుచున్నారు కొందరు రోగగ్రస్తులు శరీరముజెడినను ప్రాణమందాశను వదలక యున్నారు. ఈ సూక్ష్మశరీరము ప్రాణవాయురూపముగానున్నది స్థూలశరీరమును వదలి ప్రాణవాయురూప సూక్ష్మశరీరవిహారులై కొందరు జీవులున్నారు. కావున ప్రాణవాయువు అచేతనము స్థిరమైనదిగాదు. అదిచలించుచున్నంతవరకు మనస్సు శాంతినొందదు. ఈలింగశరీమందును యహంకారముచే జనించిన నాప్రాణమునందును అభిమానమును వదలవలయును. ఇటులనే అంతఃకరణ చతుష్టయముగూడ సూక్ష్మశరీరమునకు జేరినది. అందుచే నామనసు నాబుద్ధి నాచిత్తము నాయహంకారము అను అభిమానమును పరిత్యజించవలయును స్వస్వరూపానుసంధానముచే అజ్ఞానమను కారణశరీరము దగ్ధమగును. దీనినిగూడ వివర్జించవలయును. ఈ విధముగా క్రమముగా మూడు శరీరములందలి అభిమానము వదలి అవస్థాత్రయ గుణత్రయ శరీరత్రయములకు విలక్షణమయిన ఆత్మను జ్ఞానముచే గాంచవలయును. ఈ ఆత్మయే పరబ్రహ్మమైయున్నది. పరబ్రహ్మము ఉపనిషత్తులందు చక్కగా ప్రతిపాదింపబడినది. నిత్యమయినది ఆనందమయమయినది అట్టి శాశ్వతానంద పరబ్రహ్మము తానై యున్నారు. అది బాగుగా విచారించి శ్రవణ మనన నిదిధ్యాసములచే స్వస్వరూపమును సాక్షాత్కరించుకొని సర్వదా స్వస్వరూప పరబ్రహ్మమందు నిలకడ గలిగి యుండవలయును. గనుక ముముక్షువు దేహత్రయము

నదంభిమానమువిడిచి ఉపనిషత్ప్రతిపాద్యమయిన నిత్యపరబ్రహ్మము తానని
తెలిసి నిరంతరము బ్రహ్మనిష్ఠయందు యుండుటయే ముముక్షువగు విద్వాం
మని ముఖ్యధర్మమైయున్నది.

శ్లో॥ అమేధ్యపూర్ణే క్రిమిజాలసంకులే, స్వభావగంధేఽప్యశుచే(నవద్ధ్రివే।
కళేబరేమూత్ర పురీషభాజనే, రమన్తి మూఢాః విరమన్తి పండితాః॥

తా॥ అమేధ్యముతో నిండినదియు అనేకకీటకముల కాలయమైనదియు స్వభావముగానే దుర్గంధయుతమయినదియు అశుచియు మాలిన్యమును సర్వదా స్రవించుచున్నదియు మలమూత్రముల కొంపైనదియునగు కళేబరమందు మహాజ్ఞానవంతులు బుద్ధినిడరు. అజ్ఞానులే రమించుచుందురు. ఈదేహాభిమానము నివర్జించుటకు ఉపాయమేమనగా

శ్లో॥ తత్త్వమస్యాది వాక్యేన, స్వాత్మాహి ప్రతిపాదితః।
నేతినేతి శ్రుతిరూయా, దనృతం పాంచభౌతికమ్॥

తా॥ నేతినేతి అను మహావాక్యము పంచభూతములకు సంబంధించిన శరీరమసత్యమని నిషేధించుచున్నది. తత్త్వమస్యాది మహావాక్యములు జీవుడు పరబ్రహ్మమని అనగా తానే పరబ్రహ్మమని ప్రతిపాదించుచున్నవి. కావున ముముక్షువు దేహాభిమానము విడిచి ఆత్మస్వరూపుడు కావలయును. నేను దేహమని తలంచుచు మూఢుడు జీవించును. ఘటమును జూచువాడు కుండకు వేరుగాయున్నటుల నాదేహమిది యనునప్పుడు తానువేరను విషయమునున్న తెలియకయున్నాడు. ఇది మూఢుని స్వభావము.

శ్లో॥ బ్రహ్మైవాహం సమశ్శాంత, సచ్చిదానంద లక్షణః।
నాహందేహో హ్యసద్రూపో, జ్ఞానమిత్యుచ్యతే బుధైః॥

తా॥ సమమై సచ్చిదానంద లక్షణములుగల పరబ్రహ్మమేనేను అసత్తగు దేహమునుగాను ఇది జ్ఞానియొక్క స్వభావము॥

కావున దేహాత్మబుద్ధిని దూరముచేసికొని అహంబ్రహ్మాస్మి బుద్ధిగల విజ్ఞాని సర్వబంధవిముక్తుడగు చున్నాడు. ఎందుకనగ ఈ శరీరము శవము వంటిదగును. జీవాత్మచే దేహము విడువబడునప్పుడు దేహము పీనుగ యగుచున్నది. విచారించిన జీవచైతన్యమున్నప్పుడును శరీరముశవమనియే తెలియవలయును. శవము అశుచియైయున్నది. దానినెవరును ముట్టరు. స్పృశించినచో స్నానముచేయుదురు. శవమున్న గృహములకు మరణసూతక దోషముగూడ

ప్రాప్తించును అలాగున సర్వదా మలమయమైయున్న ఈ దేహము అశుచియై యున్నది "నవద్వార మలస్రావం సదాకాలే స్వభావజమ్ స్పృష్ట్వా స్నానం విధీయతే" అనగా తొమ్మిది ద్వారములనుండి సర్వదా మురికి కారుచునేయున్నది దేహ మలినము ప్రత్యక్షమయ్యేయున్నది. దీనిని తాకిన స్నానం విధింపబడినది అను శాస్త్రరీతిగా శరీరములోని అశుద్ధ స్థలముల ముట్టిన స్నానము విధింపబడియున్నది. అందుచేతనే మల మూత్రములు విడిచిన తరువాత శుద్ధాచారవంతులు స్నానము చేయుదురు లేక మఱి కొందరాచారవంతులు మృజ్జలముచే శరీరమునకు సదా స్నానముచేయుదురు. ఇది శవమువలె జడమైనది ఆత్మయున్నప్పుడు శరీరేంద్రియాదులు స్వతంత్రములవలె విజృంభించుచున్నవి. ఇట్టిశరీరములో నున్నందుచేతనే జీవునకు అజ్ఞాన సూతక దోష మావహిల్లినది ఈ శరీరమును విచారించిన యమ పట్టణమున వైతరిణీనది యున్నటుల ఈ శరీరమున మూత్రమను వైతరిణీ నదియు ప్రవహించుచు యిసుక దిబ్బలవలె మల సమూహములు తేలియుండును. సర్వదా దుర్గంధయుతము యముని యస్థానమున ప్రాణహరణమునకై కాచుకొనియుండు యమ భటులవలే ఈ శరీరమను యమ పట్టణమున దుష్ట చిత్తమే యముడు రాగద్వేషాదులే యమకింకరులు ఈ రాగద్వేషాదులే జీవుని జనన మరణ సంసార దుఃఖహేతువులై యున్నవి. మరియు యొకానొక ప్రభువు సుందరమగు మందిరము నిర్మించుకొని పరమ శాంతితో నివసించుచున్నాడు. అటులనే మఱియొకడు అశుచి జీవి ఒక చిన్నగుడిసెను నిర్మించుకొని అశుచి పదార్థములను పలలాదులను దుర్వాసన యుతమగు మత్తు ద్రవ పదార్థములను అందులోయుంచి జీవించుచున్నాడు ఆయశుచి జీవికదియే పరమానందము ఆ ప్రకారము ఈ కాయము జీర్ణించిన అశుచియైన తొమ్మిది సందులుగల యొక గుడిసెవంటిది సుందరమగు మందిరముకాదు ఈ శరీరమునకు వాగాది నవద్వారములు గలవు. అవి మలమునే స్రవించును అశుద్ధజీవియే ఇందులో నివసించుచున్నాడు ఈ శరీరముగూడ రక్త మాంసములతో గూడుకొని వాతపిత్త కఫములను మత్తు ద్రవ పదార్థములతో తులతూగుచున్నది. వాత పిత్త కఫదోషము లధికరించిన మద్యపానమున తెలివితప్పి మాటలాడునటుల ఉన్మత్త ప్రలాపములు చేయుచున్నాడు. గుడిసె ఎండ గాలి వానలచే ఎండి కొట్టుకొని తడియునటుల ఇంద్రియ సుఖతాపముచే ఎండి కర్మపరిపాకముచే హతమై కూలిపోవుచున్నది. అశుద్ధ జీవుని గతి ఇట్టిదని తెలియవలయును.

అనేకవిధ దుర్గంధయుతమగు కుడిసెయొక్క పైకప్పుపోయిన యెంతఅసహ్యకరమో కాకులను గ్రద్దలను వారింపసాధ్యముగాదో అటులనే ఈదేహమునకు చర్మమను కప్పులేకుండిన మఱి ప్రాణముండుకాకులను గ్రద్దలనెవడు వారింపగలడు. ప్రాణము పోయిన తరువాత దేహమను శవమును గ్రద్దలు మొదలైనవి భక్షించుట ప్రత్యక్షమేగదా. అటులనే శరీర మలమును గోరు క్రిములను బోయివులని పరిగణింపబడుచున్నారు. దివ్యభవనమున నున్నవారు ఎండగాలి వానలబాధ లేక సుఖులై విహరించుచున్నారు. గుడిసెలోయున్న అశుద్ధజీవి నానావిధ దుఃఖములననుభవించుచున్నాడు. అతిరు క్షణక్షణము శీర్ణించుచున్న అశుద్ధమైన అశాశ్వత శరీరమున యభిమానముతో నున్నజీవి నానావిధ దుఃఖముల పొలగుచున్నాడు. పరబ్రహ్మస్థానమగు మిగుల విశాలమైన దివ్యమందిరమున విహరించు శుద్ధజీవి ప్రభువువలె స్వతంత్రముగా విహరించుచు భయరహితుడై ఇంద్రియ సుఖాతపముచే ఎండక గాలి వానలవంటి కర్మపరిపాక బాధలులేనివాడై యమందానందముతో పరమశాంతితోనున్నాడు. కావున వింద్యమైన పెద్దమాంసపుగుట్టవలెనున్న జడమయిన దేహమందు ఆత్మబుద్ధినుంచువాడు యశుచియగుచున్నాడు. అశుచి అస్థిరమగు దేహేంద్రియమున యందు ఆత్మబుద్ధిగల మూఢమానవుడు పరిశుద్ధమయిన పరమాత్మను గాంచజాలడు. మలినబుద్ధియజ్ఞాని యగువాడు తన దేహపోషణకై యనేకులకు క్లేశములను గలుగజేయుచున్నాడు. ఇకను యనేకవిధ రోగబాధలననుభవించుచున్నాడు. శరీరము కర్మపరిపాకముచే నేర్పడినది. గనుక కర్మఫలమగు సుఖదుఃఖాదులను వ్యాధులను పొందుచున్నాడు. గృహము శిథిలమగునప్పుడెల్ల ధనము వ్యయముజేసి బేలుదారుల ద్వారా చక్కజేయునటుల రోగముంచే నాశ్రాంతమగునప్పుడు వైద్యులకుడబ్బునొసగి ఔషధమును సేవించి శరీరమును సంరక్షించుకొనుచున్నాడు. జనన మరణ దుఃఖములకును లోనగుచున్నాడు. అస్తి. జాయతే. మ్రియతే. వర్ధతే మొదలగు షడ్భావములు శరీరధర్మముల తనయందధ్యస్తముల జేసుకొనుచున్నారు. ఈ విషయమునంతయు చక్కగా తెలిసి ఆత్మవిచారముచే "శౌచాత్స్వాంగ జుగుప్సాపరైరసంసర్గః" శుచిగా నుండుటచే తన శరీరమున అసహ్యబుద్ధిగలిగి పరుల సంఘమును మానుము యోగసూత్రానుసారముగా దేహాత్మ బుద్ధిని వదిలి శివమైన. శుద్ధమైన. అచలమైన. సనాతనమైన. సచ్చిదానందస్వరూప పరబ్రహ్మనెప్పుడు "శివోఽహం అహం

బ్రహ్మాస్మి" అను విజ్ఞానముచే గాంచుచున్నాడో అప్పుడు తత్త్వజ్ఞానానుభవము గలిగినప్పుడు సమస్త కర్మల నుండి బహుక్లేశముల నుండి బంధముల నుండి విముక్తుడై పరమకైవల్యమును పొందుచున్నాడు. లేక బ్రహ్మజ్ఞాన సంపన్నుడగుచున్నాడు. అప్పుడే దేహాత్మభావనయే బంధకరమనియు పరమాత్మ భావనయే ముక్తిహేతువని తెలియుచున్నాడు. "బ్రహ్మప్రాప్తో విరజోవిమృత్యుః" అనగా పరబ్రహ్మమును పొంది విరజుడుగను అగుచున్నాడు. "పరామృతః పరిముచ్యంతిసర్వే" అనగా అమృతస్వరూపులై సర్వబంధముల నుండి విడివడుచున్నారు. "అయం బుద్ధ్వాముచ్యతే జంతుః, జన్మసంసార బంధనాత్" అనగా ఆ యాత్మస్వరూపమును తెలిసినవాడు జన్మసంసార బంధము నుండి దూరమగుచున్నాడు. ఈలాంటి శ్రుతివాక్యములున్ను దేహాత్మబుద్ధిని వదిలి పరభావనచే పరతత్త్వము తెలియుచున్నారను విషయమునే ప్రతిపాదించుచున్నవి. ఇదే విషయమును,

శ్లో॥ యదాతే మోహకలిలం, బుద్ధిర్వ్యతితరిష్యతి ।
ప్రజహాతి యదాకామాన్, కాలేనాత్మని విన్దతి॥

మొదలగు భగవద్గీతావాక్యములున్ను కాలనియమమును తెలుపక బ్రహ్మజ్ఞానముగలిగి శివస్వరూపుడగునప్పుడు ముక్తులగుచున్నారని తెలియపరచుచున్నవి. కావున శవసదృశాశుచి జనన మరణవ్యాధినిలయ శిథిలశరీరముపై యభిమానముంచక తాదాత్మ్యభావనను వదలి దేహాత్మబుద్ధిని దూరీకరించి సర్వసంగ సర్వమాలిన్యరహిత నిత్యశుద్ధ సనాతనాచల శివస్వరూప పరబ్రహ్మము తానేయని భావించి అనుభవజ్ఞానముగలవాడు సర్వదా ముక్తుడే అమృతస్వరూపుడే శివస్వరూపుడే ప్రజ్ఞానఘనుడే యగుచున్నాడు. ఇకను శవాకారం అశుచిః జనన మరణ వ్యాధినిలయః ఈ విశేషణ పదములచే దేహము అమంగళమనియు. అశుచియనియు. చలమనియు తెలుసుకొనవలెను. వీనికి విరుద్ధముగా శివాకారం, శుద్ధం, అచలం ఈ విధమగు పదములచే ఆత్మశివమనియు అచలమనియు తెలియవలెను. ఈ ప్రకారము దేహముయొక్క అమంగళ అశుచిచల రూపధర్మముల నాశముకొరకును దేహాత్మబుద్ధి నివారణ కొరకును ఆత్మయొక్క శివ. శుచి. అచల రూపధర్మముల అనుసంధానముచేసి ఆత్మస్వరూపుడగుట కొరకని తెలియవలెను.

ఇక అజ్ఞానబలిమిచే తనయథార్థ స్వరూపము తెలియనందుచే ఆత్మతోపాటు

అనాత్మపదార్థముల గ్రహించుటయను దేహాది తాదాత్మ్యాధ్యాసవలన నిర్వికార నిష్కళంక నిత్యబుద్ధ సర్వరూపమగు తనయందు దేహేంద్రియాద్య సద్వస్తువుల కల్పించుకొనుచున్నాడు. ఈ దేహమే నేను ఇదినాది అను అహంకార మమకార ప్రయుక్త భ్రాంతికి లోనగుచున్నాడు. విచారణ వివేకబలిమిచే స్వస్వరూప నిష్ఠచే పరబ్రహ్మ భావనామహిమచే యీకల్పిత మిథ్యాభూత వస్తువుల దొలగద్రోసిన ఆ యాత్మస్వరూపము గుర్తెఱింగిన క్రియారహిత నిర్వ్యాపార అచలపరిపూర్ణ సనాతనాద్వితీయ పరబ్రహ్మముతానే అగుచున్నాడు కేవలము పరబ్రహ్మమే తానై స్వయంప్రకాశమానుడగుచున్నాడు. అధ్యాస వినాశచే స్వయంప్రబోధ జ్ఞానముకలిగి స్వస్వరూప సాక్షాత్కారమును పొందుచున్నాడు రాత్రియున్నంతవరకు సూర్యోదయము కానంతవరకు చీకటి యుండనే యున్నది. అలాగున అజ్ఞాన నిశాకాలమున్నంతవరకు అధ్యాసతమము స్థిరముగాయున్నది. స్వస్వరూప ప్రబోధజ్ఞాన భాస్కరుడుదయింపగనే అజ్ఞానాంధకారము నశించిపోవుచున్నది. మఱియు చిత్తములోనున్న సకలవృత్తులు నశించగా చిత్తముగూడ నిర్వికల్ప పరబ్రహ్మమందు బాగుగా యుంచబడినది కాగా చిత్తము బ్రహ్మములోనే లయించుచున్నది. ఇక చిత్తమేలేనప్పుడు చిత్తము నాశ్రయించియున్న వృత్తులిక యుండవు.

శ్లో॥ యథాజలం జలేన్యస్తం, సులీనం భేదవర్జితం।
ప్రకృతేః పురుషం, తద్వదభిన్నం ప్రతిభాసమే॥

తా॥ జలము జలములో గలియునటుల చిత్తము వృత్తిరహితమై బ్రహ్మాకారము జెందినప్పుడు బ్రహ్మములోనైక్యముజెందుచున్నది. అందుచే ప్రకృతి పురుషుల భేదము జీవపరమాత్మల భేదమున్నులేదు. అంతయు పరబ్రహ్మమే యగుచున్నది. కావున సకల వృత్తులకు సంస్కారముల కాశ్రయమైన చిత్తమే లేనప్పుడు వృత్తులును నశించినవే యగుచున్నవి. చిత్తముతోగూడియే సకలవృత్తులు లయించుచున్నవి. సకలవృత్తులు నశించి చిత్తము పరబ్రహ్మములో లయించడమే నిర్వికల్పసమాధియందురు. చిత్తమే సకలమైయున్నది. చిత్తమే ద్రష్టగను, జ్ఞాతగను, ధర్మిగను, ఆశ్రయముగను కారణముగను మొదలగు విధమున నున్నది. దృశ్యజ్ఞేయాది విశ్వమంతయు చిత్తవికారమే మఱియొకటిగాదు. జాగ్రత్స్వప్నసుషుప్త్య వస్తువులుగూడ చిత్తమయే యున్నది. స్థూలసూక్ష్మ కారణశరీరములును మనోరూపములై యున్నవి.

ఇట్టి చిత్తము లయింపజేసిన అవస్థాత్రయ శరీరత్రయ రూపనామ దృశ్యములు లయమై నిర్వికల్ప పరబ్రహ్మ ప్రాప్తి గలుగుచున్నది. ప్రమాణము

శ్లో॥ మనోతీతం మనస్సర్వం. మనోపై విశ్వతోముఖం ।
మనోపై గగనాకారం. నమనః పరమార్థతః ॥

తా॥ అన్నిపదార్థములకన్న మనస్సే యధికముగా యున్నది. అంతయు మనస్సే అమనస్సే వ్యాపించియున్నది. ఆకాశ సదృశ్యము చిత్తమే అయినను విచారించిన నిజముగా మనస్సనునదిలేదు. గాని అట్టి మనస్సు పరబ్రహ్మమయినచో గలుగు అఖండ జ్ఞానము యేర్పడును.

శ్లో॥ నఘటోన ఘటాకాశో. నదేహోనచ జీవకః ।
కేవలం బ్రహ్మసంవిద్ధి. వేద్యవేదక వర్జితం ॥

తా॥ ఘటములేదు ఘటాకారములేదు. దేహములేదు జీవుడులేడు. తెలియదగినదిలేదు. తెలిసినదియులేదు. కేవలం బ్రహ్మమేయున్నదని ( శ్రుతివాక్యము) కావున చిత్తము నిశ్చలమై బ్రహ్మమందు లయించగా నేను జీవుడను భ్రాంతిదొలగి జీవబ్రహ్మైక్య విజ్ఞానము గలుగుచున్నది. సర్వసంశయములు డుగుచున్నవి. దృశ్యప్రతీతియు నశించుచున్నది. సర్వదా అద్వితీయ బ్రహ్మము తానగుచున్నాడు. తర్వాత సందేహములు వికల్పములు దృశ్యస్ఫూర్తియు ఇవి మొదలగునవి వ్యవహారమాత్రములై యున్నవి ఇదివరకు దృశ్య ప్రతీతి యుండినటుల శబ్దవ్యవహార మాత్రమున్నది. ఈ శరీరమునంతవరకు వికల్పాదులు దృశ్యప్రతీతియు శబ్దముచే మాత్రము వ్యవహరింపబడుచుండును. వాస్తవముగా యుండునవిగావు. "శశవిషాణము" అనగా కుందేటికొమ్మనబెనవి ఎంబుంగవలయును. ఈ వ్యవహారము లోకమున వాచారూపముగా యున్నటుల దృష్యమున్ను యధార్థముగాలేదు. అఖండబ్రహ్మ విజ్ఞానావస్థలో శబ్దముచే వ్యవహరిరిపబడుచున్నది. కుందేటికొమ్మను జూచినవారు లేనటుల అదెటుల అత్యంతాభావమైయున్నదో జగత్తున్ను యత్యంతాభావమై యున్నది. కావున జగత్ప్రతీతిని వికల్పమనుచున్నారు. వికల్పమనగా వస్తువుమాత్రముండదు. శబ్దవ్యవహారమును "యోగసూత్రము" శబ్దజ్ఞానానుపాతీ వస్తుశూన్యోవికల్పః అనగా వస్తువులేకనే వస్తువు శబ్దముచే వ్యవహరింపబడుట వికల్పమనబడును.

శ్లో॥ చిత్తవృత్తి విరోధేన, జాయతే పదమద్వయం,
నోపకుర్వంతి శాస్త్రాణి, నయుక్త్యాది కమేవచ॥

కాని చిత్తవృత్తులు నిరోధింపబడగా నిరామయ నిరాక్రియ నిరాకార బ్రహ్మతత్త్వము ప్రాప్తమగుచున్నది. ఆ విషయమున శాస్త్రములుగాని యుక్తులు మొదలయినవిగాని యుపకరింపవు కావున చిత్త నిరోధ చిత్తలయ బ్రహ్మాకారవృత్తి మొదలగుపదములచే పేర్కొనబడుచున్న నిర్బీజ (అవిద్యాసంస్కారము లేని) నిర్వికల్ప (సందేహరహితమైన అసంప్రజ్ఞాత త్రిపుటిరహితమై దృశ్యశూన్యమైన) సమాధియందు స్వస్వరూప ప్రతిష్ఠయుందుండువాడు సకలసంశయ రహిత బ్రహ్మ విజ్ఞానముచే అఖండానంద ఘనుడగుచున్నాడు. అదియునుంగాక కేవల మాత్మదృష్టితో విచారించిన అఖండమై, అనంతమై, యొండుసధి, ఆ యద్వితీయ పరబ్రహ్మమే అది సర్వదా భాసిల్లుచున్నది. అజ్ఞాన మహిమచే ప్రతీయమానమగు దృశ్యప్రపంచము ఆ పరబ్రహ్మమందు సుతారంలేదు. కావున ఈ ప్రపంచవికల్పము పరబ్రహ్మమందు ప్రపంచమున్నదను మిథ్యాజ్ఞానము మిథ్యగనుకనే అసత్తుగనే యున్నది. ఆ పరబ్రహ్మము నిర్వికారము నిరాకారము లోకములో ఆకారములున్న పదార్థములకుగాని వికారములుగల పదార్థములకుగాని పరస్పరభేదము చెప్పవచ్చును. అద్దానిని కనుగొనవచ్చును. ద్వితీయ పదార్థమేలేనప్పుడు ఇక దేనికి వికారత్వము ఆకారత్వమును జెప్పవలయును భేదమును వర్ణింపవలయును. కాబట్టి అద్వితీయ పరబ్రహ్మమందు అనాత్మపదార్థభేదమును వచింపసాధ్యముగాదు. మఱియు యాబ్రహ్మవస్తువు నిర్విశేషము సామాన్యవిశేషభావములు లేనిది ప్రపంచమున వ్యాపకములయిన పదార్థములను సామాన్యములనియు వ్యాపకములుగాని పదార్థములను విశేషములనియు సామాన్యమునకు బాధకమైనది. విశేషమనియు విజ్ఞులందురు. ఇట్టిసామాన్య విశేషభావరహితమైనది పరబ్రహ్మముగాయున్నది. విచారించిన పరబ్రహ్మమందు జగత్ప్రతీతియేలేదు. ఆ బ్రహ్మవస్తువు నిర్వికార నిరాకారము సామాన్యవిశేషభావ రహితమైనది. భేదవర్జితము అనగా భేదాభేదభావములు లేనిదని ఎఱుంగవలయును. కేవల బ్రహ్మమందు దృశ్యప్రతీతి అసత్యమని తెలియవలెను.

సర్వదా ఏకస్వరూపముతో నాపరబ్రహ్మ మద్వితీయమై భాసించుచున్నది. అదియే యదార్థస్వరూపమగు పరతత్త్వము శ్రేష్ఠమగు శ్రేయస్సు కేవలసుఖస్వరూపము ఇట్టిపరబ్రహ్మమందు నానాత్వప్రయోజక సుఖదుఃఖాది మిశ్రణగదా భాసమగుభేదమెన్నటికిని సంభవించదు. ప్రతీయమానముగాదు.

వేదాంత సిద్ధాంతమేమనగా జీవుడే పరబ్రహ్మము వేరుగాదని అనుష్ఠానసిద్ధులగు వేదాంతులు చెప్పుచున్నారు. అదియు వ్యవహారకల్పితమే. అనగా జీవుడనునదియు జగత్తనునదియు చిత్తకల్పితమే. కావున యున్నదియొకపరబ్రహ్మమేయని నిశ్చయమాయెను. ఇటుండ ద్వితీయ వస్తువు గలదనియు దానికిని పరబ్రహ్మమునకును భేదా భేదవాదముల వచింపవలయుననియు ఇత్యాది వ్యవహారములే యెన్నటికిని సంభావ్యములుగావు. జాగ్రత్స్వప్నావస్థల రెంటియందున, జనులందరు నానావ్యవహారములచే గూడినవారగుటచే యహంకారమమకారములచే అనంఖ్యాక సుఖదుఃఖాదులననుభవించుచున్నారు. పండితులనియు పామరులనియు ప్రభువులనియు, భృత్యులనియు ఈలాంటి వ్యవహారములును యనేకములుగా ప్రవర్తించు చున్నవి. నిద్రావస్థరాగానే అందరును సుఖస్వరూపులే యగుచున్నారు. అప్పుడు జగత్తనునది ప్రతీయ మానముగాకనే యున్నది. అగాధమగు సుషుప్త్యవస్థ యందు రాజభృత్యాది పండితపామరాది భేదములు లేవు. కేవల మాపరవస్తు పరబ్రహ్మము తన్నుతాను మరచి యానంద రూపమై యందఱియందొకే విధముగా యున్నది. ఇదియే సర్వేశ్వరుని సమత్వము. దీనినే పలు విధముల ప్రశ్నించువారు విచారించవలయును. తదితరములగు జాగ్రత్స్వప్నావస్థలయందు పుణ్యపాప జనిత సంస్కార సంపుట చిత్తముయొక్క విక్షేప స్ఫూర్తులు విజృంభించుచున్నవి. అట్టి చిత్తముయొక్క మహిమచే నానావిధ వ్యవహారములు భేదములు గలుగుచున్నవి. సుషుప్తియందు చిత్తసంచార ముడుగుటచే జగత్ప్రతీతి లేనందుచే కేవలము పరమాత్మ వస్తువానంద రూపమై యున్నందుచే వికల్పములుగాని సంశయములుగాని విక్షేపములుగాని యుండవు. అంతయు పరమానందరూపమే. సుషుప్త్యవస్థయందు అజ్ఞానరూపదోషము స్వస్వరూపముయొక్క మరుపున్నందుచే నది ప్రబోధదశగాదు. తురీయస్థితియే యఖండ విజ్ఞాన తేజోరూపమైయున్నది. కావున కేవల సుఖస్వరూపమయిన సుషుప్తియందేలాటి భేద ప్రతీతి సంభవించనటుల పరతత్త్వమందు నేలాటి బేదవ్యవహారము లేదు. అఖండ బ్రహ్మానందమే యనుభూతమగుచున్నది. ఏకాత్మ తత్త్వమందు స్థూల సూక్ష్మ శరీరములతు సంబంధించిన నేను జ్ఞానిని, అజ్ఞానిని, బ్రాహ్మణుడను, క్షత్రియుడను ఇత్యాది స్థూలాభిమాన ప్రపంచముగాని నా మనస్సు నా యహంకారము మొదలగు సూక్ష్మాభిమాన ప్రపంచముగాని లేనందుచే ద్వితీయవస్తు స్ఫూర్తి రూప భేద

భ్రాంతియేలేదు ఈ ప్రకారము విచారించి విచారించి పరబ్రహ్మము తత్త్వము నెఱింగినవారు భేదా భేదా తీతస్థితిలో యున్నవారై సకలమును సమత్వముతో గాంతురు భిన్నా భిన్నా భావములేయుండవు ఇందులకు భగవద్గీత ప్రమాణము

శ్లో॥ విద్యా వినయసంపన్నే బ్రాహ్మణే గవిహస్తిని ।
శుని చై వస్వపాకేన పండితాస్స మదర్శనః ॥

తా॥ విద్యావినయ సంపత్తులుగల శ్రోత్రియ బ్రాహ్మణుని యందును గోవు యందును, ఏనుగుయందును, కుక్కయందును, దానిని భక్షించువానియందును మహాజ్ఞానులు సములై యుందురు ఇట్టి మహాత్ములు ప్రపంచా తీతులగుటచే సమస్తము బ్రహ్మమయముగానే వారికి గనిపించును శుచి అశుచులు గౌరవా గౌరవములు మానావమానములు భేదా భేదములు ఇవన్నియు మనస్సునకును శరీరమునకును సంబంధించినవి. తద తీతస్థితిలోయుండువారు సుషుప్తిలోనున్న వారందఱికిని సుఖమునందు తాత్పర్యములేనటుల బ్రహ్మజ్ఞానులందఱికిని ముక్తి విషయమున భేదములేదు వారందఱుగూడ సుఖస్వరూప పరబ్రహ్మమును పొందినవారే నిద్రలోనున్నవారు ప్రపంచవ్యవహారమును తెలియనటుల మహా జ్ఞానులుగూడ ప్రపంచ సంబంధము లేకనేయున్నారు. నిద్రించువారు నిద్రనే గోరునటుల జ్ఞానయోగియు జ్ఞానయోగి నిద్రయగు ప్రపంచరాహిత్యమునే గోరుచున్నారు. ఈ విషయమును భగవద్గీత యందున్నది.

శ్లో॥ యానిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ ।
యస్యాం జాగ్రతి భూతాని సానిశాపశ్యతో మునేః ॥

తా॥ అనగా పరబ్రహ్మజ్ఞానులు బ్రహ్మవిత్తు బ్రహ్మవద్వరుడు బ్రహ్మవిద్వరీయుడు బ్రహ్మ విద్వరిష్ఠుడు అని నాలుగుభేదములతోయున్నారు. ఎటులనగా నిద్రాప్రారంభదశయందు ప్రపంచస్థితిని కొద్ది కొద్దిగా ప్రపంచమును మఱచువాడు నలాగు ప్రపంచ ప్రతీతివిస్మరింప ప్రారంభదశలో యున్నవాడు బ్రహ్మవిత్తు (బ్రహ్మమును తెలిసికొన్నవాడు) నిద్ర బాగావచ్చినది అప్పుడు సుఖముగా నిద్రించుచున్నాడు అలాగున బ్రహ్మవిద్వరుడు సర్వసమాధి స్థితిలో యున్నవాడగుటచే ప్రపంచ ప్రతీతిలేనివాడగుచున్నాడు. నిద్రపూర్తియయిన తరువాత తిరుగా మేలుకొనుచున్నారు అలాగున బ్రహ్మవిద్వరుడు బ్రహ్మజ్ఞానియయినను యోగసమాధి చాలించినతరువాత ప్రపంచమును స్వప్న ప్రపంచమునువలె గాంచుచున్నాడు మఱియొకడు కుంభకర్ణునివలె నిద్రించువాడు

కొన్ని మాసములకుగాని నిద్రనుండి మేలుకొనడు అలాగున బ్రహ్మవిద్వరీయుడు సర్వదా సమాధిస్థితినుండి లేవడు అనగా ప్రపంచమును మరచియే యున్నవాడు యెన్నియోదినములకు సమాధినుండి లేచువాడు ఇట్టి స్థితిగలవాడు చాలా అరుదు మరియొకడు గాఢనిద్రనుపొందువాడు పూర్తిగా మరణించినవాడు అనగా ప్రకృతి అనువులేమాత్రము లేనివాడు బ్రహ్మవిద్వరిష్ఠుడు ప్రకృతి పూర్తిగా మరణించినది. బ్రహ్మములోనే కలిసిపోయినవాడు అవస్థా భేదములే గాని యీనలుగురును మహాత్ములే ముక్తులే కావున ముముక్షువు ఇట్టి స్థితికి రావలయును. మరియు ఆ పరబ్రహ్మము సత్స్వరూపమై సదాయున్నది శబ్ద వ్యవహారమందు మాత్రము ప్రసిద్ధమైనవస్తువు రహితమై యుండుటను వికల్పముచే రహితమయినది. అనగా సకలోప నిషత్ప్రతి పాద్యమై పరివస్తురూపమై పరబ్రహ్మ మొప్పుచున్నదని తెలియవలయు అట్టి పరబ్రహ్మమందెప్పుడును ద్వితీయ వస్తువగు ప్రపంచముయొక్క ప్రతీతి యథార్థమగు స్వస్వరూపము తెలిసికొనిన అట్టి పరబ్రహ్మమే నేను అను పరతత్త్వ జ్ఞానము గలిగినచో యుండనేయుండదు. పరమాత్మ జ్ఞానము లేనప్పుడు అవిద్యా కలితుడగుటచే తనకు బాధకమైన జగత్తు సర్వదా యున్నటుల తోచుచున్నది అనేక విధ భ్రమల పుట్టించి జనన మరణ రూపసంసారమున పురుషుని పడవేయుచున్నది కావున ఆత్మప్రబోధము గలుగగా నానా విధరూపములతోను నామములతోను అభివృద్ధిగాంచి విజృంభించుచున్న జగత్ప్రతీతి తత్క్షణమే పటాపంచలై పోవుచున్నది. ఈ అనాద్యజ్ఞానము బంధురాంధకారము జ్ఞాన సూర్యోదయముకాగానే నశించు చున్నది, అలాగున వెన్నెల యుండునంతవరకును వ్యాపించినంత వరకున చీకటి తొలగి యేయున్నది. అయినను జ్యోత్స్నా ప్రకాశము వెలుగొందుచుండినను రాత్రియను వ్యవహారము పోలేదు. పగటిపూట నున్నంత సకల పదార్థ జ్ఞాన స్పష్టతాయు నేర్పడుటలేదు. అలాగున జ్ఞానము పరోక్షమనియు అపరోక్షమనియు రెండు విధములుగా యున్నది. జ్యోత్స్నా సదృశమైనది పరోక్షజ్ఞానము సూర్యకాంతి సమమైనది. అపరోక్షజ్ఞానమగును పరోక్షజ్ఞాన మనగా శాస్త్రియుక్తులతోను గురూప దేశము ద్వారాను ఆత్మ ఇట్టిదని నిర్ణయించుకొనుట యగును. దీనిచేతను సంశయములు విపరీతభావనలు తొలగుచున్నవి. అయినను స్వానుభవ సిద్ధముగానందుచే పరోక్షజ్ఞానము ధృఢముగాకున్నది. శాస్త్రములతోను గురూప దేశముద్వారాను యుక్తులతోను నిర్ణయించు కొనినది.

తదనుభవ సిద్ధమయినచో ధృఢత్వముకొందిన అదియే అఖండాపరోక్ష జ్ఞానమగును. అనగా పరోక్షజ్ఞానమే. అచంచలమై ధృఢత్వమై స్వానుభవ సిద్ధమయినచో అపరోక్ష జ్ఞానమని చెప్పబడుచున్నది. అపుడు సకలసంశయ రహిత నిరావరణ జ్ఞానముగలుగుచున్నది. అపరోక్షజ్ఞానము యొక్క దృఢత్వమునకై పరోక్షజ్ఞానము బాగుగా నభ్యసించవలయును. అభ్యాస దశలోనున్న దంతయు పరోక్షజ్ఞాన మగును అభ్యాసము ధృఢమై అనుభవగోచరమగు పరవస్తు సిద్ధమాయెనేని అదియె అపరోక్ష మగును. కావున పరోక్షము వృద్ధియగు కొలది అపరోక్షము ధృఢమగుచున్నదని దెలియవలెను. ఈ అభ్యాసరూప పరోక్ష జ్ఞానము శుక్లపక్ష చంద్రునివలె అష్టాంగ యోగములచే క్రమ క్రమముగా వృద్ధిని గాంచును. చంద్రుడు ప్రతిదిన మొక్కొక్క కళహెచ్చుచు అష్టమినాటికి అర్ధభాగము వృద్ధిలోనికి వచ్చుచున్నాడు. రాత్రియందు కొంత వరకుంటున్నాడు. చీకటిని దూరీకరించు చున్నాడు అలాగున అభ్యాసరూప పరోక్ష జ్ఞానముగూడు యమనియమ ఆసనాది ఎనిమిదంగములచే అర్ధభాగము సిద్ధమయినదగుచున్నది. ఆ జ్ఞానమును అజ్ఞానమునుదూరీకరించి కొంతవరకు తెలియనటులగు చున్నది. అష్టాంగ యోగముల తరువాత ఆ సాధనారూప పరోక్ష జ్ఞానము జ్ఞానభూమికలగు శుభేచ్ఛా విచారణాది సప్తభూమికలచే అష్టమీ చంద్రుడు నవమ్యాది తిథులయందలి చేరికచే తిరుగా వళివృద్ధియగునటుల వృద్ధినిగాంచుచున్నది. పూర్ణిమనాడు చంద్రుడు పదునారు కళలతోగూడి పరిపూర్ణుడగునటుల నిరంతరాభ్యాసముతో గూడిన పరోక్షజ్ఞానముగూడ ముముక్షువునకు స్వానుభవమునకు వచ్చునప్పుడు ఋతంభరా ప్రజ్ఞయను జ్ఞప్తితోగూడి పరిపూర్ణమై ధృఢత్వము నొందుచున్నది. పరిపూర్ణ చంద్రుడెటుల సకల సంతాపహరమగు శుద్ధమైన వెన్నెలను లోకమంతయు విస్తరింపజేయుచున్నాడో అటువలె ఈజ్ఞానము గూడ పరిపూర్ణమై సకల సంసారతాపములబాపి పరమశాంతిని వ్యాపింపజేయుచున్నది. ఇట్టి అంతరంగమందు నిర్గుణ బ్రహ్మాకారముతోనుండు మహాత్ముని దర్శించినవారుగూడ సంసారతాపమునుండి దూరులగుచున్నారు. అట్టి పరిపూర్ణ చంద్రుడు గగనమున వెలిగియుండగానే అరుణోదయమై సూర్యోదయము గలుగుచున్నది. అలాగున ఈ అభ్యాసరూప పరోక్షజ్ఞానము పరిపూర్ణము గాగానే సకల సంకల్పక్షయరూప అరుణోదయము స్వానుభవ జ్ఞానరూప భానూదయము గలుగుచున్నది. పున్నమునాడును పగలుయందును రాత్రియందును రెండువేళల

చీకటి గానబడమిచే రాత్రి లేనిదయ్యె యగుచున్నది. అవిధమున యితంతరా పరిజ్ఞానదశయందును స్వానుభవ సాక్షాత్కార జ్ఞానమందును మాయాంధకారము లేనేలేదు. సూర్యుడు క్రమముగా మధ్యాహ్న సమయమునకు కడు తీక్షణుడై తన సహస్ర కిరణములతో మాటిగా వెలుగుచున్నాడు. చీకటియను జ్ఞాపకము గూడయుండదు. అలాగున స్వానుభవ అపరోక్ష జ్ఞానము పరిపూర్ణమై సహస్ర ముఖములుగా వ్యాప్తమగునప్పుడు జగత్ భ్రాంతియేలేదు. ద్వితీయవస్తు స్మరణయు జనింపదు ఇదియే యథార్థమగు దృఢతరాపరోక్షజ్ఞాన సిద్ధియగును. ఇప్పటి పరతత్త్వ జ్ఞానముచే విశ్వప్రతీతి మూడు కాలములలోను లేదని సిద్ధించగా ఆ పదార్థ నిర్వికల్ప పరబ్రహ్మమే త్రికాలముల యందును యున్నదగును. అవిషయమునే రజ్జు సర్పదృష్టాంతముచే విచారించవలయును. అనగా త్రాడను విషయము బాగాతెలియబడిన తరువాత ఇది వరకు నచ్చోట సర్పము లేదు. వర్తమాన కాలమునను లేదు. భవిష్యత్తులోను త్రాడు పాముగాజాలదను విషయము స్పష్టమగుచున్నది. అలాగున తాను అపరబ్రహ్మమేయని తెలివి గలిగిన తరువాత తానిదివరకెన్ని జన్మము లెత్తియున్నను శరీరమునకే యీ ధర్మములున్నవిగాని నేనెప్పుడును జన్మరహితుడను. జగత్తు యనునది ఇది వరకు లేదు. యిప్పుడునులేదు. ఇకను యుండబోదను విషయము నిశ్చయమగుచున్నది. గాన ఇక అద్వితీయ వస్తు ప్రతీతియేలేదు. రజ్జు విషయమున బాగా విచారము చేయవలసినవసరము కలదు. యెటులనగా మదాంధకారమందు త్రాడు పాముగా కనబడుచున్నది. రజస్సత్త్వ తమోగుణముల ననుసరించి తెల్లత్రాడు, యెఱ్ఱత్రాడు, నల్లనిత్రాడుయని మూడు విధములుగా యున్నది. నల్లని త్రాటిని హఠాత్తుగా చూచిన చీకటి రాశమునపే నల్లని త్రాచుయని భ్రాంతి గలుగుచున్నది. అలాగున తమోగుణము గలవారు స్వభావముగానే జగత్ భ్రాంతి జ్ఞానము గలవారై మోహితులగుచున్నారు. వారి కవివేకము ప్రబలముగా యుండును. ఇక నల్లని చీకటిలో ఎఱ్ఱత్రాడు విలక్షణముగా గానబడినను. భయస్వభావముచే విచారింపకున్నందున పామని లేక రక్త పింజరని భ్రమ గలిగించులాగున రజోగుణము గలవారుగూడ చిత్తవిక్షేపముచే తన ఆత్మ స్వరూపమును తెలియక జగత్తని భ్రమజెందుచున్నారు. ఇక తెల్లని త్రాడుజూచి వెంటనే పణియని భయమును గలిగించదు. పాము యొక్క ఆకారము త్రాటియందుండుటను తలంచుటచే సర్పభ్రాంతి గలుగుచున్నది.

ఆ తీరున సత్త్వగుణము గలవారు జగత్తునుగూర్చి భ్రమపడరు. అయినను అనాద్య వివేకముచే వివావరణ జ్ఞానము లేనందుచే స్వస్వరూపమును మరచు చున్నారు విచారించిన త్రాటియందేలాటి వికార సర్ప ధర్మములులేవు. అంతయు చిత్త భ్రాంతియే జగత్ప్రతీతియు మనః కల్పితమే పరబ్రహ్మము సదా నిర్వి కారము దీప ప్రకాశముచే త్రాటిని త్రాటివిగా తెలిసినప్పుడు త్రికాలముల యందును సర్పము లేదని నిశ్చయము గలుగువటుల ఆత్మ జ్ఞానోదయముచే స్వస్వరూపమును స్వస్వరూపముమగానే దెలిసికొని జగత్ భ్రాంతి యెప్పుడు లేదనియే నిశ్చయించుకొనుచున్నారు. అప్పుడు సత్త్వాది గుణా తీతస్థితిని పొందుచున్నారు అట్టి జ్ఞానికి ప్రారబ్ధ సంచితాగామి కర్మలు గూడ యెప్పుడును లేవనియే తెలియుచున్నారు. సర్వదా స్వయం ప్రకాశమాన స్వయంజ్యోతియే దేదీప్య మానమగుచున్నది. మఱియు విచారణ లేనందుచేతను భయస్వభావము బలపడి యున్నందుచేతను చీకటియందు త్రాడు పాముగాభాసిల్లుచున్నది త్రాటి రూపము మరుగుపడుట తమోగుణమగును. అప్పుడు మనస్సును అజ్ఞానమావ రించినది త్రాడు పామునుగా తెలియుట విపరీత జ్ఞానమగును ఇది చిత్త విక్షే పముచే గలుగుచున్నది. ఆ సమయమున అంతఃకరణము విపరీత జ్ఞానరూపా విద్యచే యావృతమగుచున్నది త్రాటిని తమ తెలివితేటలచే (పామని వ్యవ హరించుట సత్త్వ గుణమగును) యథార్థమును తెలియుట బ్రహ్మమును బ్రహ్మముమగానే తెలియుట త్రిగుణాతీత జ్ఞానమగును. దీని ననుసరించియే అజ్ఞానముచే గలుగు నిద్రావస్థ కారణ శరీరము తమోగుణమనియు స్వప్నావస్థ సూక్ష్మ శరీరము రజోగుణమనియు జాగ్రదవస్థ స్థూల శరీరము సత్త్వగుణ మనియు శాస్త్రములు తెలుపుచున్నవి. మూడవస్థలకు మూడు శరీరములకు మూడు గుణములకు అవతలయుండునది తురీయా వస్థయగును. కేవల జ్ఞాన రూపము ఈ స్థితియందు జగత్ప్రతీతిలేదు అనగా సంసార భ్రాంతిలేదు ఆ దుఃఖ ములులేవు సంసారమనునదియే యొక పెద్దపాముగా తెలియవలెను. సర్పము యొక్క ధర్మములన్నియు సంసార మందుంటున్నవి. సర్పమునకు తలయం దున్నదంతములయందు విషమున్నది ఈసంసారమను మహా కాళోదరమునకు మలినాంతఃకరణమే తలగాయున్నది. అందులో అనేక దుష్ట సంస్కారములగు దన్తములున్నవి రాగద్వేషాది రూపవిషములుంటున్నవి సర్పమునకు ద్విజి హ్వత్వమునలె అనగా రెండు నాలుకలు నీవు నేనను భేదమే సంసారమను

ఫణికిది జిహ్వగాయున్నది. పాము కొట్టబడినప్పుడు పడిగను విప్పి మహా
కోపముతో కాటువేయులాగున సంసారముగూడ కర్మఫలితానుభవమునకు వచ్చి
నప్పుడు విషమస్థితిని పొందినదై ప్రాణులకు దుఃఖమునకు కారణమై పాము
కాటు మరణ హేతువగునటుల ప్రాణుల బలాత్కార మరణమునకు హేతు
వగుచున్నది. మఱియు పాము యొకప్పుడు ఆనందముతో పడిగెత్తుకొనియాడును
ఆసమయమున పాములవాడు వచ్చి ఒక్కవ్రేటున చంపునటుల అజ్ఞానియు
సంసారమున సుఖముగా నాడుచుండును. తుదకు యమునిచే మరణించును
కావున దేవుని శరణుపొందిన గరుడుని గాలిచే పాములు దరికిరానటుల సంసార
విష దుఃఖములు సమీపింపవు చక్కగా విచారించిన సంసారమను ఫణియే లేదు
ఈలాగున రజ్జు సర్పన్యాయముగా పరతత్త్వ జ్ఞానమందు జగద్భ్రాంతియే లేదు.
ఇకను ఈజగత్తువందీషత్తు గూడ సుఖము లేదని తెలియవలెను. మఱియు జల
ములేని మరుప్రదేశము అనగా యెడారియందు సూర్యకిరణ ప్రసారముచే ఎండ
మావులు గానబడు చున్నవి. మృగములు సలిల పిపాసచే దప్పిగొని చాలా
పీడింపబడినవై ఎండమావులను చూచి జలమని భ్రాంతిచే పరిగిడుచున్నవి అలా
గున పరుగులెత్తి, పరుగులెత్తి, జలమును పొందక యిసుకమయములగు మరు
ప్రదేశములయందు పడిమరణించు చున్నవి. ఆలాగున విషయ సుఖేచ్ఛగల
మూఢమానవులు సంసారమందు లేక దృశ్య ప్రపంచమందు శబ్దాది విషయము
లయందు అభిమాన రూపమయిన ఆభాసమానమగు సుఖరూపముతో నుండు
దుఃఖము సుఖమని భ్రమించి సుఖానుభవమునకై సంసార మరుప్రదేశము
లందు పరుగెత్తు చున్నారు లేక పరిభ్రమించు చున్నారు. కట్టకడకు సుఖమును
పొందక సంసార విషయమను విషయములలోబడి మడియు చున్నారు. సుఖమా
వంతయు లేకున్నది. వివేకములేని మృగములటుల విషయ వాంఛగల అజ్ఞా
నులు సంసార సుఖమును గోరుదురు. జ్ఞానులు ఎండమావులను నీళ్లగాదని
తెలియు మానవులవలె సంసార సుఖములను దుఃఖ రూపములుగా దెలియు
చున్నారు. సంసారమందు సుఖలేశముగూడ లేదని తలంచి పరమాత్మానంద
ముతో విహరించు చున్నారు. మృగములుదప్పిచే పీడితములైన విధమున
మూఢ మానవులను తాపత్రియముచే తపించుచున్నారు. కావున ఈ జగత్త
తయు అవిచార రమణీయము. సుఖ లేశముగూడ ఈజగమందు గానుపింపదు.
ఇంకకొందరు విషయ సుఖమును గూడ బ్రహ్మానంద లేశమనియు విషయ

సుఖము స్థిరముగా యుండును బ్రహ్మానంద సుఖము స్థిరముగా యుండదనియు చెప్పుదురు. అదియంతయు ప్రలోభక వాక్యములుగాని యథార్థములుగావు. అటుల వారు నుడువుట పూర్తిగా విషయాశను వదలజాల అధ్యాత్మిక నియమములకు కట్టుబడి ఆదరించలేక చెప్పు మాటలని తెలియవలెను. విషయములందు సుఖలేశము గూడ లేదనియు అందున్నది విషమే యనియు ॥ సహ్యాంబు బిందుః మృగతృష్ణికాయాం॥ అను యథార్థ ప్రమాణ వాక్యమును కంటే శ్రేష్ఠమయినది లేదు కావున ఆనందము స్వాత్మరూప బ్రహ్మమునందే యున్నది గాని సంసారమందు లేదు. జగద్భ్రాంతి రజ్జు సర్ప దృష్టాంతముచే అత్యంత భయంకరమనియు మరు మరీచికల దృష్టాంతముచే దుఃఖ కరమనియు ఆశా జనకమనియు ఎంత అనుభవమునకు వచ్చినను తీరనిదనియు తాపత్రయ పిపాసతో గూడినదనియు తెలిసికొనవలయును.

మఱియు సకల భేదప్రతీతికి హేతువు మాయయగును ఇట్టిమాయ తోగూడిన అజ్ఞానము చేతనే నామరూపాత్మక భేద ప్రపంచము ప్రతీయమానమగుచున్నది. కావున ద్వైతమనునది మాయా కల్పిత మగుచున్నది. మాయ యనగా మూలప్రకృతి లేక అజ్ఞానము. అధ్యాసము మొదలను నానాభేదములతో నొప్పునది. ఆమాయను విచారించిన బ్రహ్మ జ్ఞానులకది లేనిదే యగుచున్నది. ఇక మాయయే సత్యముగాకున్న దానిచే నేర్పడు ద్వైతభావమున్ను జీవబ్రహ్మ భేదభావమున్ను దృశ్యప్రతీతియు సత్యముగాని దగుచున్నది. ఈ విషయమంతయు బ్రహ్మ వేత్తలకు పరమ గోచరమై యున్నది. అందుచేతనే తనకన్న భిన్న పదార్థము లేనందుచేతను అంతయు తానని యథార్థ జ్ఞానము గలవారగుటచేతను మహాత్ములు పరమానందము బడయుచున్నారు. పరమార్థమున అద్వైతమే జీవుడు బ్రహ్మమే వేరుగాదు నేనే బ్రహ్మమను అపరోక్షానుభవమే యథార్థము. తక్కినవి కల్పితములు, మిథ్యా భూతములు అజ్ఞానుల పరిభాషలు సంసార విముక్తుల ప్రలాపములు హేయములు ఇకను పాదేయము బ్రహ్మ విజ్ఞానానంద సత్యస్వరూప స్వస్వరూప స్థితియే యగుచున్నది. లోకులనేకులు అసత్యమునే నిలుపబెట్ట ప్రయత్నింతురు అట్టి యసత్యమును స్థాపించుటకై ఇక ననేక యసత్య యుక్తులను పలుకుదురు. మఱికొందఱట్టి అసత్యమును దూరీకరించుటకును మిగుల ప్రయత్నించుదురు సత్యమనునది యుండనే యున్నది. దానికొఱకై యెక్కుడ ప్రయత్న మవసరములేదు. అలాగున

మాయా ప్రపంచమే అసత్యమై యుండగా ఇకదానిచే కల్పితములగు యనిత్య సుఖములను దేహాదులను జేయ కొందఱజ్ఞానులు ప్రయత్నింతురు కొందఱు దానిని నిరాకరింతురు. అయినను సత్యభూత బ్రహ్మ పదార్థము సదాయుంటు న్నది. దానికై వేరుగా ప్రయత్నింప నవసరములేదు. ఆరోప అపవాదములచే అధ్యాసను దూరీకరించిన చాలను మాయచే ద్వైత ప్రపంచము కల్పితము. అద్వైతము అకల్పితమనియు మాయాతీతమనియు అదియే యథార్థమనియు అనేక శ్రుతులు చెప్పుచున్నవి. కల్పిత పదార్థ గుణమెప్పుడును కల్పితమెయ గుచున్నది. అకల్పితము సత్యమే యగుచున్నది. అట్టియథార్థవస్తువు జన్యము గాదు. జనకమునుగాదు. ఈ ప్రకారము శ్రుతిసాక్షిత్తుగా చెప్పుచున్నది. శ్రుతి యనగా అడ్డులేనిది యదార్థమునే తెలుపును. పరమఋషులకు పరమప్రమాణ మైనది. ఇటుల ద్వైత మిథ్యాత్వ అద్వైత పరమార్థత్వ ప్రతిపాదనయందు శ్రుతిప్రమాణమును ఆశ్రయించుగాక.

విద్వత్ సంపన్నుల అనుభవమును విచారించవలెను. అనగా సుషుప్తి యందు సకలేంద్రియములు పశమించుచున్నవి. మనస్సుగూడ లయించు చున్నది. అప్పుడు ప్రాజ్ఞుడనబడు ఆత్మవస్తువు పరబ్రహ్మము సర్వతేజోమ యమై ప్రజ్ఞానఘనమై పరమానందమయమై యుంటున్నది. పరబ్రహ్మమొక టియే యున్నది. అందుచే ఆనందమే అనుభవింపబడుచున్నది. ఇది సకల జనులకు సమానము శ్రుతియును సుషుప్త్యనుభవమును దృష్టాంతీకరించుకొని ద్వైతము నిరాకరించి పరమాద్వైతమునే సుస్థిరమని నిరూపించుచున్నది. కావున ముముక్షువు సతతము పరబ్రహ్మైక్యస్థితిలో యుండవలయును.

మఱియు సచ్చిదానంద పరబ్రహ్మమందు జగత్ప్రతీతియును దేహాద్య నాత్మభావనలును చిత్తకల్పితములే. చిత్తమార్పులు చిత్తవిక్షేపములేయగు చున్నవి. మూలాధిష్ఠాన పరబ్రహ్మము యొకేరీతిగాయున్నది. ఆపరబ్రహ్మ ము నిర్వికల్పము అట్టినిర్వికల్పాంతరాత్మయందు సదాచిత్తమునుజేర్చి సమాధి నిష్ఠుడుకావలయును. "యథాయథా చిత్తం, తథాతథా విశ్వం ప్రవర్తతే" అనగా చిత్తమెటుల పరివర్తించునో అటులనే ప్రపంచముగూడ మారుచున్నదనురీతిగా సర్వవికల్ప భ్రాంతులకు మూలకారణము మనస్సేయగుచున్నది. దేహాదుల యందు భ్రాంతి సంస్కారములచే చిత్తము బలవత్తరమై యున్నచో దేహాద్య నాత్మభావము స్థిరమైయుండును. దేహాద్యనాత్మపదార్థముల యందలిసత్యమను

భ్రాంతిరహిత సంస్కార శుద్ధబీజములు మనస్సునలేకున్న సోఽహంకారభావన స్థిరమై చిత్తము నిరుద్ధమై వృత్తి రహితమై యుంటున్నది. చిత్తముండిన సకల వికల్పములు గలుగుచున్నవి. ఉన్మత్తుని చిత్తము ఉన్మాద భూయిష్టమగుటచే సమస్తము వానికి పిచ్చిగానేగానుపించు విధమున చిత్తము మాయావృతమై నచో సమస్త జగము మాయామయమైనదిగా గన్పట్టును. అట్టి చిత్తమేలేకున్న యేలాటి వికల్పములు గలుగవు. అవిద్య సంసారము జీవుడు బంధము. మోక్షము. మొదలగు వ్యవహారములన్నియు చిత్తమేయని యుపనిషత్తులన్నియు ప్రతిపాదించుచున్నవి. కావున చిత్తనిరోధమే ముఖ్యము.

శ్రు॥ మన ఏవమనుష్యాణాం, కారణం బంధమోక్షయోః।
బంధాయవిషయాసక్తం, ముక్త్యైనిర్విషయం స్మృతమ్ ॥

ఆత్మైవ్యవహాత్మనోబంధు రాత్మైవరి పురాత్మనాం అను భగవద్గీత స్మృతి లా॥ పై విషయమునే తెలుపుచున్నవి. యుద్ధరంగమున సేనాధిపతి లేకుండిన సైనికులు ఏమిచేయజాలరు. యుద్ధమనునది యుండదు. అలాగున చిత్తమే లేకుండిన యింద్రియాది ప్రపంచ స్ఫూర్తియేయుండదు. యింద్రియములేమి చేయజాలవు. కావున వృత్తిరహితస్థితి పొందవలయుననిచో చిత్తమును నిర్మూలించవలయును. చిత్తనాశముచే నిర్వికల్పస్థితి గలుగును. చిత్తమే వికల్పరహితమునకు కారణము. గనుక నిర్వికల్ప పరిత్యగాత్మయగు పరమాత్మ యందు చిత్తము జేర్పవలెను. అప్పుడు పుటము వేయబడిన బంగారమువలె మనస్సు సకలాజ్ఞానరహితమై పరబ్రహ్మ తేజోమయమగు చున్నది. పర బ్రహ్మమందు మనస్సుజేర్చి సదాధ్యాన నిష్ఠయంనుండుటచే చిత్తము విలయ మగుచున్నది. జీవుడు శుద్ధుడై అందుచే అద్వితీయ పరబ్రహమగు స్థితినిపొంది ముక్తుడగుచున్నాడు.

అదియునుంగాక ముముక్షువగు ధీరుడు చిత్తము సర్వకారణమగుటచే యట్టి చిత్తమును పరబ్రహ్మమందుంచి లయింపజేసి నిర్వికల్ప సమాధిని సాధించవలయును అట్టి సమాధి ధ్యానవిధిని బ్రహ్మజ్ఞానంచే సతత మాచరిం పబడినది. కనుక నిరంతరము తనలో యాపరిపూర్ణ బ్రహ్మమును ధ్యానించి ధ్యానించి సాక్షాత్కరించుకొన్నవారే పండితులనబడుదురని తెలియవలె. స్వస్వ రూపయోగమును శీలించినవారును పరబ్రహ్మమును గనుగొనినవారే పండితులు నిర్వికల్ప నిర్వికార నిరీహపరబ్రహ్మమును దర్శించుటయందు కృతకృత్యులై

సమర్థుడైయుండుటయే పాండిత్యమగును. పరమతఖండన స్వమత స్థాపనయే పాండిత్య చిహ్నమగులాగున స్వవిజ్ఞానాసిచే ఆత్మవిరుద్ధములగు అనాత్మపదార్థములను తత్సంస్కారములను ఖండించి ఆత్మవస్తువుయందు స్థిరప్రతిష్ఠితుడై యుండుటయే యథార్థపాండిత్య లక్షణమగును. విద్వాంసుడు పండితుడు మొదలగుపదములకు జ్ఞానియని మహాఋషులమతము ఉపనిషత్తులుగూడ పండిత శబ్ద నిర్వచనమును ఆత్మ జ్ఞానియనియే తెలుపుచున్నవి. "జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణం తమాహుః పండితం బుధాః" అనగా బుధులు జ్ఞానాగ్నిచే సకలకర్మలు దహించినవాడు తేజోరూపియగు వానినే పండితునిగా జెప్పుచున్నారు. అని భగవద్గీత పై విషయమునే తెలుపుచున్నది. కాబట్టి యథార్థమగు సమాధియనగా తాను సర్వదా పరిపూర్ణ పరబ్రహ్మమై యుండుటయను విషయము సిద్ధించుచున్నది ఇకను బ్రహ్మజ్ఞానియగు విద్వాంసుడు ధ్యానించు పరబ్రహ్మము యొక్క స్వరూపమును విచారించుటవసరము. అనగా విద్వాన్ ఆత్మానాత్మ వివేకముచే ఆత్మను చక్కగా నెఱింగి వివేకజ్ఞాన సంపన్నుడు సకలదృశ్యములను దూరముచేసి చిత్తమును ఆత్మలో లయింపజేసి అనగా తదాకారమగునటులజేసి నిరంతర మాత్మానుసంధానరూప సమాధియందు లేక హృదయమందు అనగా తనలోనే ఒకానొకటి సర్వప్రకృతి విలక్షణమైనది. మనోవాక్కులకుగూడ యందనిదగుటచే ఇంద్రియములచే యిట్టిదని నిర్ణయింపసాధ్యముగానందుచే అనిర్వాచ్యమయినది. వాచ్యార్థముచే తెలియబడక లక్షణావృత్తి జన్యలక్ష్యార్థముచే లక్షింపదగినది. సదాస్వయంప్రబోధ స్వరూపమైనది. అప్రకాశము సంకోశము అవిద్య మొదలగునవి లేక అఖండైకవేద్యమై ప్రజ్ఞానఘనమయినది. సామ్యములేనిది సామాన్యముగా "తద్భిన్నత్వే సతితద్గత భూయోధర్మవత్వం" రెండు వస్తువులు వేరుగాయుండి వేరైన యొకేధర్మముగలిగి యుండుట అను న్యాయశాస్త్ర రీతిగా రెండు వస్తువులకే సామ్యము సిద్ధించును. గాన యున్నది పవస్తువొకటియే రెండవ వస్తువులేనందుచే సాదృశ్యాతీతమైనది లేదా తనకు తానే సాటిగాని పరవస్తువును పరవస్తువుతో పోల్చవలయునేగాని వేరుగాదు. అనగా అంతయు తానగుటచే అద్వితీయమయినదియు కేవలానంద రూపమయినదియు అందులో ఆనందము తప్ప అమృతత్వము తప్ప మఱియొక దుఃఖలేశముగాని విషయ విషలవముగాని లేనిదియు అఖండానంద నిరతిశయ జ్ఞానరూపమయినదియు ఇది మొదలుచేసికొని ఇంతవరకుండునను మర్యాదలేనిదియు

ఇది ఇంతమాత్రమేయను హద్దులేనిదియు ఆద్యంతరహితమయినదియు సర్వదా సంసారబంధములుగాని ప్రకృతి సంసర్గమను బంధముగాని లేనిదియు సర్వముక్త స్వరూపమయినదియు ఏలాటి సంకల్పములు లేనిదియు అనగా సంకల్పరహితులకే లేక సంస్కారములు నశించినవారలకే పొందశక్యమైనదియు (కనుకనే నిరీహులగు యోగులే యాపరవస్తువును గనుగొనుచున్నారు.) అవధిలేనిదియు అనన్తము. అపరిచ్ఛిన్నము ప్రమాణాతీతము అప్రమేయమయినదియు గగనముతో సమానమయినదియు ఆకాశమెటుల సర్వత్రవ్యాపించి నిర్వికారమై నిర్వికల్పమై, సూక్ష్మమై, విశాలమై యున్నదో అటులయున్నదియు మఱియు నిరంశమయినదియు విభాగములేక అవిభక్తమై అఖండమై యున్నదియు సందేహరహితమయినదియు, వికల్పములు, భావములు, సంస్కారములు, భ్రాంతులు లేనిదియు అట్టి సర్వప్రకృతి విలక్షణ మాయాతీతావాఙ్మానస గోచరానిర్వాచ్య లక్ష్యార్థభూత నిరస్తస్వయంప్రబోధ కేవలానందస్వరూప నిరుపమ. నిర్గుణ, నిర్వికార, నిరంజన, నిష్కళంక, నిత్యముక్త అఖండాపరిచ్ఛిన్న అద్వితీయ పరిపూర్ణ పరబ్రహ్మమును ధ్యానించి సాక్షాత్కరించుకొని ముక్తుడగుచున్నాడు. తనయందే తనస్వరూపమును అనగా తన్నుతాను దర్శించుచున్నాడు అట్టివాడు నిర్వికల్ప ద్వితీయ పరబ్రహ్మమగుచున్నాడు ఇట్టివారే ఆత్మజ్ఞానులని, పండితులని చెప్పబడుచున్నారు. వీరలే జీవన్ముక్తులు. లేక బంధరహితులు సదానందస్వరూపులు పరమ నిర్వాణమూర్తులు. ఇట్టి మహనీయులకు జనన మరణ సంసార భయమెన్నటికిలేదు. నిర్భయులై సర్వదా ముక్తులై, దేహమున్నను లేనివారై విహరించుచుందురు.

- ఓమ్ -

ఓమ్-తత్-సత్

# జీవన్ముక్తి

జీవన్ముక్తుడు తాను సదా స్వస్వరూప పరబ్రహ్మమందు మనస్సును లయింపజేయుచున్నవాడగుటచే నిర్వికల్ప సమాధిని శీలించువాడగుటచే సకల వృత్తుల నాశములై బ్రహ్మాకారస్థితి దృఢమగుటచేతను పరబ్రహ్మము యే వికారములులేనిది పరిణామ రహితమైనది. క్రియారహితమైనది. సనాతనము అచలము అట్టిపరబ్రహ్మ స్వరూపుడగుటచేతను నిర్వికారుడుగను మనస్సులో యేవికారములు లేనివాడుగను సర్వవ్యాపార శూన్యుడుగను అచలుడుగను ప్రాపంచక భోగములచే చలించనివాడుగను చిదానంద ఘనుడుగను అగుచున్నాడు. అట్టిమహనీయాత్ముడే సర్వదాఆనందమునే యనుభవించుచున్నాడు అట్టి ఆతివరేణ్యుడునగు పరిపూర్ణ అఖండజ్ఞాని స్థిరమైన ప్రజ్ఞగలవాడనియు మహాఅవిద్యను విద్యగా మార్చివేసినట్టి మహావిద్వాంసుడనియు జీవన్ముక్తుడనియు మహాత్ములచే పేర్కొనబడుచున్నాడు. మఱియు జీవన్ముక్తి స్వరూపమును భగవద్గీత ద్వితీయాధ్యాయములో "స్థితప్రజ్ఞస్యకాభాషా" అను శ్లోకము మొదలుకొని "ఏషాబ్రాహ్మీ" అను శ్లోకమువరకును బాగుగా నిరూపింపబడియున్నది. ఇటులనే పండ్రెండవ అధ్యాయమున "అద్వేష్టా సర్వభూతానాం" అను శ్లోకము మొదలుకొని కడవరకును స్థితప్రజ్ఞుడగు జీవన్ముక్తుని స్వరూపమును స్పష్టీకరించియున్నారు. ఇటులనే ఇతరాధ్యాయములయందును అచ్చటచ్చట నిరూపించియున్నారు. కావున నిర్వికల్పసమాధిచే నిష్క్రియ పరబ్రహ్మ స్వరూపుడై స్వాత్మానందము ననుభవించు స్థితప్రజ్ఞుడు జీవన్ముక్తుడు.

మఱియు "ప్రజ్ఞానంబ్రహ్మ" అను మహావాక్యముచే బోధితమగునది యే బ్రహ్మమని తెలియవలెను. లేక ప్రజ్ఞయనిచెప్పబడును. ఈ మహావాక్యము మొదటిది బ్రహ్మలక్షణమును తెలుపునది కావున బ్రహ్మ మెట్టిదోయని మొదట తెలియవలెను. తరువాత మిగతావాక్యముల విచారణచేయవలెను. చతుర్విధ మహావాక్యములకు సారభూతమైన ఒకేలక్ష్యార్థమయిన "సర్వం ఖల్విదం బ్రహ్మ" అనుమహావాక్యముచే ప్రతిపాదింపబడిన సర్వవ్యాపక పరబ్రహ్మమే తానను స్వానుభవ సాక్షాత్కారరూప ప్రజ్ఞను తెలిసికొని ఏదిసంసారకాననమునకు

దావాగ్నివంటిదో సంసార సముద్రమునకు బడబాగ్నియైనదో, భవశోకమునకు తీక్ష్ణఖడ్గమో, లేక త్రిపుండాగ్నియో అజ్ఞానతమమును సంహరించు దివ్య జ్యోతి స్వరూపమైనదో అదియే స్వయంప్రకాశ జ్ఞానరూప ప్రజ్ఞయని దెలియవలయును. ఈ మహత్తర మహామంగళ ప్రజ్ఞామహాత్మ్యంబు బాణములచే విచ్ఛిన్నమగు మేఘాకారమైన కప్పునకు వాయువస్త్రమువలె సంస్కారములచే నేర్పడు అజ్ఞానావరణమునకు విచ్ఛేదకమైయున్నది. సంసారతాపత్రయమను యాగ్నేయాస్త్రమునకు ఈ స్థితప్రజ్ఞయనునది వారుణాస్త్రమువలెనున్నది. నానావిధక్లేశ రూపవాసనలచే యనన్త దుఃఖముల ననుభవించువారు ఈ స్థితప్రజ్ఞను బొందిన తరువాత పరమశాంతిని బొందియున్నారు, బొందుచున్నారు, బొందబోవుచున్నారు. ఈశ్వరుడు సర్వదా తపస్సంపన్నుడగుటచే తాపశాంతికొఱకు చంద్రకళను శిరస్సున ధరించుచున్నారు. ప్రజ్ఞయను మూడవ నేత్రముకలిగి దానికి ఫలము పరమశాంతి అమృతత్వము అని తెలుపుటకై తృతీయ నయనమునకు పైన చంద్రరేఖను పెట్టుకొనియున్నారు. కావున ప్రజ్ఞయను మూడవకన్నును గలిగిన మహానుభావులు అనేకులు పరమశాంతిని శాశ్వతానందామృత పదవిని పొందుచున్నారు. "ఋతంభరా, తత్ర ప్రజ్ఞా" అని యోగసూత్రము వచించుచున్నది. ప్రజ్ఞయనగా సకల విలక్షణ జ్ఞానమని నెఱుంగవలయును. ఇట్టి ప్రజ్ఞ అందరికి యుంటుందని తలపసాధ్యముగాదు. ఈశ్వరానుగ్రహము బొందిన వారికే ప్రజ్ఞాసిద్ధి గలుగును. ఈ లోకములోని విషయమునేగాక అన్నిలోకముల విషయములను గనుగొనుటయు తనశరీర తత్త్వమునే విషయీకరించునదిగాక సకలప్రాణుల దేహతత్త్వమును నెఱుంగునదియు దేశకాల వస్తు భేదములు లేకను వ్యవధానా వ్యవధానములును దూరసమీపములును లేకను సమస్తము గ్రహించునదియు శాస్త్రములలో నిరూపింపబడిన రహస్య జాతమువంతయు యటులనే స్పష్టముగా నెఱుంగునదియునగు మహత్తరమైన ప్రజ్ఞయొకటిగలదు ఇదియు లౌకికమే. మఱియొకటి యలౌకిక ప్రజ్ఞయగును. ఈ ప్రజ్ఞ సర్వలోకాతిక్రాంత దేశవస్తు భేదాతీతమై సమస్తమున్నాకేశాది గ్రహాంతరమేగాకుండ సర్వాతిశయ పరమాత్మను సులభముగా దెలియునట్టిది ఇదియే శివమ్ముక్తి విద్యాంశములకువ్యవస్థాపనసిద్ధమై యుంటున్నది. ఈ లౌకిక అలౌకిక ప్రజ్ఞాలు రెండు ధ్యానయోగసిద్ధి చేతనే గురుదేవుని ఈశ్వరుని కరుణచేతనే లభించును. కావున అలౌకికమైన ప్రకృతిదూరమయిన సర్వవాసనా రహితమయిన సర్వసంకల్ప

విచ్ఛేదకమైన ముక్తిప్రదమైన శాశ్వతానందకరమయిన ప్రజ్ఞను ఇచ్చట విచారించి తెలియవలెను. అనగా తత్త్వం పదముల యర్థమును శాస్త్రములద్వారను గురుముఖత్వమునను స్వానుభవ పూర్వకముగాను చాలాకాలము పరిశోధించి నందుచే "జీవుడు బ్రహ్మమేను, జీవో బ్రహ్మైవనాపరః" అను జీవబ్రహ్మైక్య జ్ఞానము గలుగుచున్నది. ఆ జీవబ్రహ్మాభేదనిశ్చయ జ్ఞానముతో నొప్పుచున్నదియు సంకల్ప వికల్పములుగాని సందేహములుగాని లేనిదియు సర్వవికారరహిత నిశ్చల నిర్మల నిర్వ్యాప్తికమైనదియు స్వయంప్రకాశమైన కేవల బ్రహ్మామృతమయమయిన విజ్ఞాన రూపవృత్తియే శాశ్వతానందమయ చిద్విలసిత పరిణామమే ప్రజ్ఞయని వేదాంతులు చెప్పుచున్నారు. ఈ ప్రజ్ఞయే జ్ఞానులకు ప్రధానచిహ్నమై సహజాలంకారమై యున్నది. ఇదియే సర్వజనులకంటె వేరుగా జ్ఞానులను చూపుచున్నది. సర్వమహావాక్య ఫలభూత సంపిండితార్థమువగు ప్రజ్ఞావిశేషము లేకుండిన జ్ఞానులు కాజాలరు. కావున జీవబ్రహ్మైక్యావగాహమునకును ప్రజ్ఞావిశేషము జ్ఞానులకు సర్వదా యుండున్నది. ఇది అప్రాకృతము స్వస్వరూప నిష్ఠానుష్ఠానలక్ష్యము.

శ్లో॥ సర్వధ్యానేన పశ్యన్తి, జ్ఞానినాం మనఉచ్యతే ।
సోఽహం మనో విలీయన్తే, జీవన్ముక్తస్స ఉచ్యతే ॥

తా॥ అన్తర్ధ్యానముచే జ్ఞానులు మనస్సును ఆత్మయందైక్యపరచి లేకలయింపజేసి అద్వితీయమయిన పరమాత్మనేనని భావనాశక్తిచే పరబ్రహ్మస్వరూపులయినవారు జీవన్ముక్తులనబడుచున్నారు.

శ్లో॥ ఆత్మానమితరం చైవ, దృశానిత్యావిభిన్నయా ।
సర్వం చిన్మాత్ర రేవేతి, యః పశ్యతి సపశ్యతి ॥

తా॥ తన్నును ఇతరుని భేదరహితముగా చూచుచును సర్వము చిన్మాత్రరూపముగా గమనించుచున్న మహాత్ముడెవడో ఆ మహానుభావుడే జీవన్ముక్తుడును బ్రహ్మజ్ఞానియును సర్వసంగ వర్జితుడును. మానవ శరీరాకారముతోనుండు నిరాకారపరబ్రహ్మస్వరూపుడని సిద్ధాత్ములనిశ్చయము.

ఇంతవరకు నిరూపింపబడిన నిరతిశయ తృప్తిమయుడయిన బ్రహ్మాత్మైక్యత్వావగాహకమైన చిద్రూప ప్రజ్ఞను జనన్ శారీరక మానసికములందు గలుగు క్లిష్టపరిస్థితులయందు లేక సంపూర్ణ జీవితసమస్యలందు ధృతను గల్గినవారు అవిచ్ఛిన్నసమస్యలందు. వేరుగానుండు ప్రజ్ఞను బుద్ధినవిధేయుడు స్థిత

ప్రజ్ఞుడని చెప్పబడును. అట్టిదృఢప్రజ్ఞ సర్వదాయుండిన వానిని ప్రజ్ఞాసంతులు జీవన్ముక్తుడనుచున్నారు.

స్థితప్రజ్ఞుడనినను జీవన్ముక్తుడనినను యొకటియే వేరుగాదు. ఆ పరబ్రహ్మమే నేను. సచ్చిదానంద స్వరూపుడను. సకలమును, ప్రకాశింపజేయువాడను, తెలియువాడను నేనే అసంగుడను ప్రకృతిదూరుడను కేవలముక్తుడను సర్వాతీతుడను అను సుస్థిర దృఢప్రజ్ఞగల మహానుభావుడు. నిరంతరము యే విఘ్నములులేక అప్రతిహతముగా ఆ బ్రహ్మామృతమును పానంజేయుచు నిత్యానందమునొందుచున్నారు. మఱియు యట్టి స్వానుభవసిద్ధ జ్ఞానసిద్ధిని బడసిన ధీరుడు అనాత్మపదార్థరూప సర్వదృశ్య పదార్థములను మరచినవాడై షడ్భావ షడూర్మివర్జితుడై నందుచే సర్వాతీత పరబ్రహ్మ స్వరూపుడగుచున్నాడు. అట్టి మహాత్ముని జీవన్ముక్తునిగా వేదాంతములు పలుకుచున్నవి. తత్త్వజ్ఞులున్ను చెప్పుచున్నారు. ఇట్టి దృఢాత్మ ప్రజ్ఞయే సాక్షాద పరోక్షజ్ఞానమని తెలియవలయును.

శ్లో॥ కర్మేంద్రియ పరిత్యాగీ, ధ్యానవర్జిత చేతసః।
ఆత్మజ్ఞానీ తథైవైకో, జీవన్ముక్తస్స ఉచ్యతే॥

తా॥ సర్వేంద్రియములను జయించి మనస్సును ధ్యేయమందలి లయపరచి ఆత్మప్రజ్ఞచే నొప్పుచు నాత్మజ్ఞానియైనవాడు జీవన్ముక్తుడనబడును.

మఱియు సతతము బ్రహ్మమందు రమించువాడగుటచే జాగ్రదవస్థ యందును గూడ సకల వ్యవహారములను వదలుకొని బుద్ధిని బ్రహ్మమందే లయింపజేసినవాడును పరబ్రహ్మమయధీయుతుడగుటచే పరబ్రహ్మజ్ఞానము గలవాడును అనగా త్రివిధావస్థలను త్రివిధశరీరములను త్రివిధగుణములను త్రివిధములయిన మనోవాక్కాయములను అతిక్రమించిన తురీయస్థితిలో యున్న వాడును సకలసంస్కారములు, వృత్తులు, గుణములు, సంకల్పములు నశించి అఖండ స్వయంప్రబోధ స్వయం ప్రకాశమూని విజ్ఞానముగలవాడును అయిన మహనీయుడు సర్వలోకాతీతపురుషుడు సిద్ధుడయి సాధకులుగానుండు వారు తద్బ్రహ్మాకారముతో గూఢముగా లోకులతోపాటు నిస్సంగులై చరించు వారు జీవన్ముక్తులని తెలియవలెను. జీవన్ముక్తియనగా సకలాతీత దృశ్యరహిత స్థితియగును. శ్లో॥ బాహ్యార్థ వాసనోద్భూత, తృష్ణాబద్ధేతి దాహక।
సర్వార్థవాసనోన్ముక్తా, తృష్ణాముక్తేతి కథ్యతే॥

తా॥ ఓ రాఘవ! ఇంద్రియవిషయ లోలత్వమగు వాసనయే బంధము సమస్త విషయ వాసనారహిత ప్రజ్ఞానసంస్కారమే ముక్తియని చెప్పబడుచున్నదని వసిష్ఠమహాముని శ్రీరామునకు బోధించియున్నారు.

కావున సమస్త సంసారవిషయక సంకల్పములు వదలించినవారు గనుకనే సకల వేదవేదాంగముల పారంగతుడై నను అవిద్యలన్నియు ప్రకృతికి బుద్ధికి సంబంధించినవగుటచే వానినన్నిటిని విసర్జించి విద్యారహితుడువలె తెలియని వానివలె, సామాన్యమానవునివలె మానవులలో విహరించుచున్నవాడును మఱియు చిత్తమున సకల చింతలను వదలినవాడును అనగా చిత్తాతీతచిన్మయ స్థితిలోనున్నవాడునయగు సిద్ధాత్మపురుషుడు ఆనందప్రజ్ఞాజ్ఞాని జీవించి యుండియు శరీరగత ధర్మములు లెక్కగొనక ప్రజ్ఞతో ముక్తావస్థలోయున్న జీవన్ముక్తుడని వేదాంతుల యభిమతమై యున్నది. అట్టివానిని జీవన్ముక్తుడనుచున్నారు.

శ్లో॥ జీవన్ముక్త మహావిద్వాన్, యేషాంకేషా మగోచరః।
తస్యస్థితిం ప్రశంసన్తి, వేదశాస్త్రాణి సర్వదా ॥

తా॥ ప్రజ్ఞాయుతుడగు జీవన్ముక్తుని విషయమును ఎవరుగూడ తెలియజాలరు. వానిస్థితి సకల వేదాంతశాస్త్రములు కొనియాడుచున్నవి. మూర్ఖమానవులలో విహరించుచు మనుష్యమాత్రులై యుండు జీవన్ముక్తులు వారిఅఖండ ప్రజ్ఞను వెలిపుచ్చక గూఢాత్ములై యుందురు. ఒకవేళవెలిబుచ్చ వలసివప్పుడు లోకహితమునకొ సత్కార్యములందును లేక ముముక్షువుకొఱకును తన ప్రజ్ఞను వెలబుత్తురు.

శ్లో॥ క్వచిన్మూఢో విద్వాన్, క్వచిదపి మహారాజ విభవః।
క్వచిద్భ్రాంత స్సౌమ్యః, క్వచిదజగరాచార కలితః ॥
క్వచిత్పాత్రీభూతః, క్వచిదవమతః క్వాప్యవిదిత।
శ్చరత్యేవం ప్రాజ్ఞ, స్సతత పరమానందసుఖితః ॥

తా॥ కేవల పరబ్రహ్మ ప్రజ్ఞగల జీవన్ముక్తుడగు వాడొకచోట మూఢునిరీతిగాను వేరొకచోట మహాపండితునిగాను మఱియొకచోట రాజువైభవముతోడను ఇంకొకచోట శాంతునిమాదిరియు నొకచోట నవీనపండితునివలెను, ఒకచోట ఊరకకొండచిలువను పాముపలె పడుండువాడును, వెరొకచోట ధనికునివలె మంచువాడును లేక యోగ్యునివలెను, మఱియొకచోట నవమానితుండునై

యెల్లప్పుడు బ్రహ్మధ్యానములో నుండును. ఒకచోట తనసంగతి తెలియకయు విహరించుచుండును. ఇట్టివాడే ప్రజ్ఞావంతుడగు జీవన్ముక్తుడని మహనీయులు చెప్పుచున్నారు.

మఱియు జీవాత్మ ప్రాకృత బుద్ధినుండి విముక్తిని బడసినచే పరబ్రహ్మమగుచున్నది. అట్టిజీవ బ్రహ్మైక్యతను పొందిన విద్వాంసుడు పరబ్రహ్మము తానై నందుచే దేహేంద్రియాదులకు విలక్షణుడగుచున్నాడు. కావున జీవన్ముక్తుడు తాసర్వదా ముక్తావస్థలో యున్నందున శరీర గతధర్మములచే కొట్టబడడు. శరీరప్రతీతి భాసించుచున్నను దానియందౌదాసీన్యమును వహించుచున్నాడు. తాను పరబ్రహ్మమనియే నిశ్చలతను పొందియున్నాడు. మనుజుని నీడ యనుసరించునటుల కర్మశేషమున్నంతవరకు శరీరము తననాశ్రయించి యుండును. నీడేలాగున పురుషునికడ్డముగాని దృష్టిప్రతిరోధమునుగాని గలుగజేయదో ఆలాగున ఆత్మజ్ఞాన ప్రజ్ఞగలవానికి శరీరము జ్ఞానమునకుగాని సమాధినిష్ఠకుగాని ప్రతిబంధముగాదు. ఇకను పరమాత్మానుకూల్యతనే గలుగజేయుచున్నది. తనయొక్క శరీరచ్ఛాయ కత్తిచే వేటువేయబడినను త్రొక్కబడినను ఇటులెన్ని పరాభవములను పొందినను తాను మాత్రమొకింతయు తనకుపరాభవము గలిగినదని తలంచదు. నీడ అచేతన పదార్థము తనకన్న వేరనియే తెలియుచున్నాడు. ఆలాగున బ్రహ్మజ్ఞానియు శరీరము అయాధర్మములచే పీడింపబడినను ఇతరులచే కొట్టబడినను అవమానింపబడినను దూషింపబడినను భూషింపబడినను యే మాత్రమును తన ప్రజ్ఞనుండి చలింపడు. తానునిత్యానంద స్వరూపియనియే తలంచును. దత్తాత్రేయులు మొదలయిన బ్రహ్మవేత్తలట్టివారని తెలియవలయు దేహాతీతమయిన దేహియగు యాత్మస్వరూపమును పొందినమహానుభావుడు నీడయందువలె శరీరమందును అహంకార మమకారములు లేనివాడగుచున్నాడు. శరీరము శిథిలమయినదగుటచేతను అనేకదుఃఖాలయమగుటచేతను శరీరము తాననిగాని తనదనిగాని తలంచక యా బ్రహ్మమే తాననియు అనిత్యానందమే తన స్వరూపమనియు తలంచుచున్నాడు. ఈప్రకారము సకల దేహేంద్రియాతీతుడై సర్వవిలక్షణుడై దేనినంటక దేనియందును యభిమానమును పూర్తిగా వదలినవాడై యున్నవాడే జీవన్ముక్తుడని తెలియవలెను నిరభిమానత్వము ప్రజ్ఞావంతుని లక్షణము.

శ్లో॥ హర్షామర్ష భయక్రోధ కామకార్పణ్య దృష్టిభిః।
వపరామృష్ట యోఽన్త స్స జీవన్ముక్త ఉచ్యతే ॥

తా॥ హర్షశోకములచేతను భయము, క్రోధము, కామము దైన్యముల చేతను కొట్టబడని అంతఃకరణముగలవాడు జితేంద్రియుడు జీవన్ముక్తుడని చెప్పబడును అని శ్రుతివాక్యము మఱియు అట్టి జీవన్ముక్తులగు ప్రజ్ఞాశీలురు ప్రపంచములో యున్నవారైనను విశ్రాంతగా యుందురు. అనగా నిరంతరము పరబ్రహ్మమందు రమించువారలు త్రికాలములయందు నేవ్యవహారము నంటక బ్రహ్మేతర విచారము లేనివారలై యుంటున్నారు. ఇదివరకు జరిగిన విషయము గురించియు చింతించరు. గతజలసేతు బంధనమువలె భూతకాలవిషయ విచారణము నిష్ప్రయోజనమని గడచినదానిని గూర్చి తలంచరు. అలాగుననే రాబోవు విషయము మంచియో చెడ్డయో దానిని గురించియు విచారపడరు. రాబోవునది సుఖము హర్షమునొందరు. దుఃఖమని శోకమునొందరు. వర్తమానమున ప్రాప్తమయిన దానిని గురించియు యోచించకయుందురు. ఈ మూడు కాలములుగూడ ప్రపంచమునకు సంబంధించినవై సుఖ దుఃఖాత్మకములగుటచే నిర్విచార, నిశ్చల నిష్క్రియ, నిరాలంబ పరబ్రహ్మమందు సతతముండుచు బ్రహ్మానంద ప్రజతో బ్రహ్మానుభవులై యుంటున్నారు. మఱియు సామాన్యజ్ఞానులనుద్దేశించి నీతి శాస్త్ర మిటుల వచించుచున్నది.

శ్లో॥ ప్రాప్తవ్యమర్థం లభతే మనుష్యః. దేవోఽపితం లంఘయితుం నశక్తః॥
తస్మాన్నశోచామి నవిస్మయోమే. యదస్మదీయం నహితత్పరేషామ్ ॥

తా॥ తాను పొందదగినదానిని తప్పక మనుష్యుడు పొందుచున్నాడు. దైవము గూడ నద్దానిని నిరాకరింపజాలడు. నాకుప్రాప్తముగావలసినది. వచ్చుచున్నది గాన దానిని గూర్చి ఆశ్చర్యపడను. సంతోషమునొందను నాకు రానిదిరానేరాదు రానిదానినిగూర్చి దుఃఖపడను యేది నాకు సంబంధించినదో అది ఇతరులకుపోదు ఈలాగున విచారణజేసి వివేకియగువాడు తాజేయవలసిన దానిని విధిగాజేయుచు యందుచే గల్గు లాభనష్టములకు హర్షశోకముల నొందడు. కాబట్టి ఆత్మజ్ఞాన ప్రజ్ఞగల జీవన్ముక్త విద్వాంసులు త్రికాలములయందు పైజెప్పిన విధముగా యాథాశీనులై నిరపేక్షులై ఆయాకాలములలో ప్రాప్తమయిన కార్యములు విధి పూర్వకముగా నాచరింతురు. మఱియు అసంగులై నిర్లిప్తులై యుందురు. ఈ విషయమును భగవద్గీతయు తెలుపుచున్నది.

శ్లో॥ అనపేక్ష శ్శుచిర్దక్ష, ఉదాసీనో గతవ్యథః ।
సర్వారంభ పరిత్యాగీ, యోమద్భక్త స్సమేప్రియః ॥

ఇదియే జీవన్ముక్తుని లక్షణము ఇకను జీవన్ముక్తుడు సమదర్శియైయుండును. అనగా ఈ చరా చరాత్మక లేక చేతనాచేత స్వరూపక విశ్వమందు సమత్వముతో ఆత్మప్రజ్ఞగల యోగివరుడు చరించుచున్నాడను విషయమందనేకు లనేక విధములుగా చెప్పుచున్నారు. సమత్వమనునది వ్యవహార సాధ్యముగాదనియు సర్వసమత్వమనునది లోకాతీతాస్సులైన బాలోన్మత్తులవలె సంచరించు మహాసుఖావులకే సహజమైయున్నదనియు వచింతురు. ఆ విచారమంతయు బహుళముగా యున్నను యేయొక ప్రాణిగూడ దుఃఖమునొందక సుఖమునే పొందవలయుననియు చరాచరా లోకమంతయుగూడ బంధవిముక్తమై యుండవలయుననియు మహాత్ముల విశాలభావమైయున్నది.

శ్లో॥ నత్వహం కామయే రాజ్యం. నస్వర్గం నాపునర్భవం।
కామయే దుఃఖతప్తానాం. ప్రాణినామార్తి నాశనమ్ ॥

తా॥ నేను భూలోకరాజ్య స్వర్గరాజ్య సుఖములను అపునరావృత్తినిగూడ వాంఛించను సంసారదుఃఖ తప్తులగుచు దరిగానక దైవోపహతులైన ప్రాణికోటియొక్క సమస్త దుఃఖనాశమునే కోరుచున్నానని భక్త ప్రహ్లాదుని ప్రార్థనపై విషయమునే తెలిపెను ఇట్టికరుణామయ పీయూషపరిచుర చరాచర సుఖాభిలాషాత్మక హితకర మహావిశాల దృష్టితోనున్నవారై చేతనా చేతన పదార్థములయందును పరిపూర్ణముగా సమముగాయున్న యఖండజ్ఞానమయ పరబ్రహ్మమునే సతతము ప్రజ్ఞయందు వీక్షించుచుండు వారే జీవన్ముక్తులు ఇదియే సమదర్శిత్వము.

మఱియు ఈ ప్రపంచము స్వభావముగానే స్వరూపముతోనే అన్నివిధములుగా వేరైయున్నది. ఈ లోకమంతయు గుణదోషములతోను సత్యాసత్యములతోను, రాగద్వేషములతోను, పుణ్యపాపములతోను, శత్రుమిత్రులతోను ప్రియాప్రియములతోను. శోకమోహములతోను, సుఖదుఃఖములతోను లాభనష్టములతోను, ధర్మాధర్మములతోను ఈలాగున ద్వంద్వములతో గూడియున్నది. ఇట్టి ప్రపంచమునకు భిన్నమైన స్వస్వరూప పరమాత్మస్వరూపము పై చెప్పిన ద్వంద్వములచే నిర్ముక్తమైనది స్వాత్మరూపము, నిర్గుణము, త్రిగుణాతీతము సకలదోష వర్జితమునై యున్నది. ప్రపంచస్వరూపము

అనృతము, జడము దుఃఖములు అస్థిరము. ఆత్మస్వరూపము నిత్యము సనాతనము సచ్చిదానందములు నామరూపములు జగలక్షణములు నామరూపరహితము పరబ్రహ్మలక్షణమై యున్నది. ప్రపంచస్వభావము నానాత్వము మిథ్యాత్వము మొదలైనది. పరమాత్మస్వభావము ఏకత్వము సత్యత్వము మొదలైనవి ఈలాగున విచారించిన యీదృశమంతయు దృక్కగు ఆత్మకంటె సర్వదా విలక్షణమైయున్నది. ఇట్టి నానావిధ ప్రపంచమందు సర్వత్రను ఆయాయు పాధులను నిరాకరించి అవశిష్టమగు నిత్యశుద్ధ స్వయంప్రకాశమాన సర్వసమాన సర్వపరిపూర్ణ పరబ్రహ్మమునే జీవన్ముక్త విద్వాంసులు తమ ప్రజ్ఞయందు నిలిపి గాంచుచున్నారు. మిథ్యాభూత జగత్తు విడనాడి బ్రహ్మదృష్టితో నాపరిపూర్ణ బ్రహ్మమేతామని నిస్సంశయముగా దెలియుచున్నారు. అటుల బ్రహ్మదృష్టతో గాంచుటయే సమదర్శిత్వమనబడుచున్నది. ఇట్టి సమత్వ దృష్టియే జీవన్ముక్తుని లక్షణమని తెలియవలయును. సమత్వదృష్టిగల జీవన్ముక్తులు సర్వాతీతులై ద్వన్ద్వవర్జితులై పరిపూర్ణపరబ్రహ్మ స్వరూపులై అవ్యవహార్య అనిర్వాచ్య నిస్సంగ నిర్లిప్త నిర్గుణ నిర్దుష్ట పరమ పదవిలో యుంటున్నారు. వీరే స్థితప్రజ్ఞులు.

మఱియు స్వరూపాత్మ ప్రజ్ఞయందు సుస్థిరుడైన జీవన్ముక్తుడు అన్నిటియందును చలించనివాడై నిర్వికారుడై యుండును. అనగా తనకు ప్రీతికరములగు వస్తువులు ప్రాప్తించినను అప్రీతికరములగు వస్తువులు లభించినను ప్రియపదార్థములయెడ అభిమానముచే రాగమును సంతోషమును పొందుటలేదు అప్రియములగు పదార్థములయెడల అయిష్టము అభిమానములేకుండుటచే ద్వేషించుటయులేదు. దుఃఖించుటయులేదు. ఈలాగున రాగద్వేషములు ప్రియాప్రియములు సుఖదుఃఖములు లేనివాడై

శ్లో॥ రాగద్వేష వియుక్తైస్తు, విషయానింద్రియైశ్చరన్ ।
ఆత్మవశ్యైర్విధేయాత్మ, ప్రసాద మధిగచ్ఛతి ॥

అను భగవద్గీతచే బోధింపబడిన ప్రసన్నావస్థలోయుంటున్నవాడై ప్రియాప్రియముల నొకేవిధముగా సమదృష్టితో జూచువాడగుటచే జీవన్ముక్తుడు దృశ్య విషయములందే వికారములను పొందుటలేదు. అచంచలుడై యున్నాడు. తనకు హితాహిత ప్రియాప్రియ వస్తువులే లేనందుచే "సమతా సర్వభావేషు యోఽసౌసత్య పరాస్థితిః" సమత్వమే సత్యము శ్రేష్ఠము అనువిధముగా సమమగు

పరిపూర్ణమగు పరబ్రహ్మమందు పరిపూర్ణ ప్రజ్ఞాదృష్టితో విహరించుచున్నాడు మఱియు తనదియను యభేదజ్ఞానముచే రాగము తనదికాదను భేదజ్ఞానముచే ద్వేషముగలుగుచున్నవి. బ్రహ్మజ్ఞాని ఇట్టి భేదాభేదజ్ఞానములు లేనివాడగుటచే రాగద్వేషరహితుడగుచున్నాడు.

శ్లో॥ ఇన్ద్రియస్యేన్ద్రియస్యార్థే, రాగద్వేషౌ వ్యవస్థితౌ ।
తయోర్నవశమాగచ్ఛే, త్తౌహ్యస్య పరిపన్థినౌ ॥

తా॥ ప్రతియొక్కొక్క ఇంద్రియవిషయములో రాగద్వేషములుంటున్నవి. కావున వాటికి వశముగాగూడదు. ఎందుకనగ ఆవిజ్ఞానమునకు శతృవులు. అని భగవద్గీతావాక్యానుసారము రాగద్వేశములకవశాశము నొసంగనివారే జ్ఞాన సంపన్నులగుచున్నారు. కావున భేదాభేదములు రాగద్వేశములు లేనివారై జీవన్ముక్తులు సమత్వదృష్టితో విహరించువారగుటచే నిర్వికారచిత్తులుగను నిర్విషయ స్థితిగలవారుగను యగుచున్నారు. ప్రియాప్రియ వస్తువులయెడ సమదృష్టిత్వము నిర్వికార చిత్తమున్ను జీవన్ముక్తి లక్షణములై యున్నవి.

శ్లో॥ యదృచ్ఛా లాభసంతుష్టో, ద్వంద్వాతీతో విమత్సరః ।
సమసిద్ధా వసిద్ధౌచ॥ యోనహృష్యతి నద్వేష్టినశోచతి
నకాంక్షతి॥ శుభాఽశుభ పరిత్యాగీ భక్తిమాన్ మేప్రియోనరః ॥

అను మొదలగు వాక్యములచే పైవిషయమునే భగవద్గీత తెలుపుచున్నది.

మఱియు ఇది అమృతమయము అనునప్పుడు బయటను లోపలను అమృతము తప్ప మరియొక ఇతరపదార్థముండదు. ఇది జ్యోతిర్మయము అని వచించునప్పుడు సర్వత్రజ్యోతి ప్రకాశించును. ఇది తియ్యనిపదార్థమనునప్పుడు ఆ పదార్థమునకెటుజూచినను మాధుర్యమేయుండును. అలాగున ఆత్మప్రజ్ఞగల జీవన్ముక్తుడు పరిపూర్ణ బ్రహ్మానంద రసమయుడై యున్నాడు. అని వ్యవహరించునప్పుడు అతని చిత్తమొకటియే బ్రహ్మానందరసమును గోలుచున్నది. యనిగాదు. సర్వేంద్రియములును అమృతమయములై ఆనంద ప్రచురములై జ్యోతిస్వరూపములై, ప్రసన్నములై, విజ్ఞానరూపములై యున్నవి. ఆ మహాత్ముడే సర్వత్రవ్యాపించిన ఆనందామృతరసమయ పరిపూర్ణ బ్రహ్మమే తానుగా తనప్రజ్ఞయందున్నాడు. పైనుదాహరించిన అమృతమయ మధురమయాది వ్యవహారములు మఱియొక విభిన్నపదార్థములు మిశ్రమములై యుండినచో సంభవించవు. అలాగున పరిపూర్ణ పరబ్రహ్మ రసాస్వాదమయ

ములో ప్రపంచవ్యవహారముండిన పరిపూర్ణ బ్రహ్మమయత్వమును వచింప సాధ్యముకాదు. కావున తాను పరిపూర్ణ బ్రహ్మానందామృత రసాస్వాదమును చేయుచున్నాడనుట. అతనియందెచ్చోటను బాహ్యమునను అభ్యంతరమునను దృశ్యము వాసనలు పూర్తిగాలేవనియే యర్థము.

ఈలాగున సర్వదా బ్రహ్మానందామృత రసానుభవమును పొందుచు ప్రపంచజ్ఞానమును, బాహ్యాభ్యంతరములయందును, లేనివాడై బ్రహ్మమైయుం డుటయే జీవన్ముక్తుని లక్షణము. కావున సర్వప్రపంచస్థితి రహితావస్థలో యుండి బ్రహ్మమయి యున్నవాడే జీవన్ముక్తుడని తెలియవలయును.

శ్లో॥ చిన్తాశూన్యమదైన్య, భైక్షమశనం పానం సరిద్వారిషు ।
స్వాతన్త్ర్యేణ నిరంకుశాస్థితి, రభీర్నిద్రాస్మశానేవనే ॥
వంచారో నిగమాంత వీధీషు, విదాఙ్క్రీడా పరేబ్రహ్మణి ।
వస్త్రంక్షాళన శోషణాదిరహితం, దిగ్వాఽస్తు శయ్యామహీ ॥

తా॥ బ్రహ్మతత్త్వమెఱింగి ప్రజ్ఞయందు సుస్థిరులై యుండు జీవన్ముక్తులు చింతాదైన్యములు లేనివారై నిర్విచారభిక్షాన్నమే ఆహారము. పరిశుద్ధజలము పానమును స్వాతన్త్ర్యముగా యడ్డులేక భయములేక యుండునట్టి స్థితిస్మశానము నందు నిద్రించుకుట ఎండవేయుట మొదలైనవి లేని కట్టుబట్టదిక్కే పుడమియే పాన్పు వేదాంత వీధులయందు సంచారము పరబ్రహ్మయందు క్రీడించుటయు ఇవి సహజసిద్ధ లక్షణములు.

అదియుంగాక దేహేంద్రియాదులు ప్రకృతి సహజములు సంసార చక్రము కర్మానుసారముగా జరుగుచుండును. సుఖదుఃఖాదులున్ను కర్మానుసా రములై వచ్చుచు పోవుచుండును జగత్స్వభావము నానాత్వము నామరూపములు అవి ఈ విధముగా ప్రజ్ఞాత్ముడు తలంచినవాడై ప్రకృతివంటక ఉదాసీనుడై యున్నవాడు జీవన్ముక్త లక్షణోపేతుడని తెలియవలెను. స్థూలసూక్ష్మకారణ శరీరములందును, జ్ఞానేంద్రియ కర్మేంద్రియ అంతరింద్రియముల యందును, అటులనే అన్నమయ ప్రాణమయ మనోమయ, విజ్ఞానమయ, పంచకోశము లయందును, నాది నేను అను, మమత్వాహంకారములు లేనివాడై అసంగుడై ప్రకృతికి సంబంధించిన వాటియందు ఉదాసీనతను వహించినవాడై, తానుచేయ దగిన దానియందును, కర్తవ్యతాబుద్ధిని వదిలినవాడై తూష్ణీం భావముతోనున్న వాడు జీవన్ముక్తుడనబడుచున్నాడు. కర్తవ్యమునుగూడ వదలి ప్రపంచాతీత

స్థితిలో యుండువాడనియు. పరబ్రహ్మమును పొందినవాడగుటచే తనకికకర్తవ్యముసు గూడలేదనియు తెలిసికొని సర్వసంగ పరిత్యాగ పూర్వక ఉదాసీనత్వము విరాగా నిరపేక్షత్వము స్వస్వరూపాత్మ ప్రజ్ఞయందే సుస్థిరత్వము అఖండత్వము అనంతత్వముతో సదాయుండుటే జీవన్ముక్తస్థితియగును.

మఱియు తనయొక్క స్వరూపమును తెలియకపోవుటచే గలిగిన జ్ఞానమే సంసారబంధము తనను పరమాత్మగా తెలియుటయను జ్ఞానమే సంసారబంధము నుండి విడువడుట సంసారబంధము తెగిపోవుటయగును. లేక సంసారము దగ్ధమగుట అను మొదలగు వాక్కులతో వ్యవహరింపబడు శాశ్వతమైన ముక్తియని యట్టిస్థితిని పొందినవాడే జీవన్ముక్తుడని మహర్షులమతమై యున్నది.

అనగా మొదట వేదాన్తశాస్త్రముల పఠించుచున్నారు. పిమ్మట బ్రహ్మజిజ్ఞాస తీవ్రమగుటచే సద్గురువుద్వారా జీవబ్రహ్మైక్య బోధకములగు చతుర్విధ మహావాక్యములను శ్రవణముజేసి తదర్థమును నిస్సంశయముగా దెలిసి విచారించి విచారించి మననముజేసి తదైక్యతను నిశ్చయించుకొనుచున్నారు. ఈ ప్రకారము వేదాంతవాక్య శ్రవణముచేతను మనన నిధిధ్యాసముల చేతను తన యొక్క బ్రహ్మత్వమును తెలియుచున్నారు. అనగా జీవాత్మ పరబ్రహ్మమేను యున్నది, యాయాత్మ యొకటియే అట్టి శాశ్వతానంద సకల బంధనిర్ముక్త పరబ్రహ్మమే తానను స్వానుభవ జ్ఞానమును పొందుచున్నారు. తాను పరబ్ర మేయని నిశ్చయముగా దెలియుటయే విజ్ఞానమగును. అందుచే సకలానాది సిద్ధమూలాజ్ఞాన బంధమునుండి విముక్తుడై బ్రహ్మ స్వరూపుడగుచున్నారు. అట్టి మహనీయాత్మ స్వరూపోపలబ్ధిగలవాడు జీవన్ముక్తుడని వచింపబడుచున్నాడు. సకలబంధనిర్ముక్త జీవబ్రహ్మైక్య విజ్ఞానమే జీవన్ముక్త విద్యాంశమని శ్రుతులయందు నిరూపింపబడెను. జీవబ్రహ్మైక్య స్వానుభవమె సకలబంధచ్ఛేదకమై జీవన్ముక్త స్వరూప నిర్ణాయకమై యున్నది. దీనికి ఉదాహరణ ప్రమాణము

శ్లో॥ దేహోపలమపాకృత్య, బుద్ధికుద్దాలమాత్మనః ।
ఖాత్వా మనోభువం భూయః, గృహ్ణీయాత్మం నిధిం పుమాన్ ॥

తా॥ దేహమను రాళ్లను ప్రక్కకుత్రోసి బుద్ధియను చెట్టను తీసివేసి సూక్ష్మబుద్ధి యను గడ్డపారతో మనస్సుయను భూమిని త్రవ్వి పరమనిధియగు పరమాత్మ యను తన్ను తెలివిచే గ్రహింపవలయును.

శ్లో॥ యస్తుసర్వాణి భూతాని, ఆత్మన్యేవాను పశ్యతి ।
సర్వభూతేషు చాత్మానం, తతోనవి జుగుప్సతే ॥

తా॥ ఏమహనీయుడు సమస్తభూతముల తనయందును యా భూతములలో తనను యభేదదృష్టితోగాంచునో అతడెన్నడును ద్వేగమునొందడు. అవిశ్రుతి వాక్యము ఇటుల జీవబ్రహ్మభేదమును తెలుపు శ్రుతి స్మృతులు అనేకములు గలవు. జీవబ్రహ్మైక్యము నుపదేశించు వాక్యములు భగవద్గీతలో ననేకములున్నవి.

2 అ॥ శ్లో॥ నత్వేవాహం జాతునాసం । నత్వంనేమే జానాధిపాః ॥
6 అ॥ " సర్వభూతస్థ మాత్మానం, సర్వభూతాని చాత్మని ।
ఈక్షతే యోగయుక్తాత్మా, సర్వత్ర సమదర్శనః ॥
" " యోమాం పశ్యతి సర్వత్ర, సర్వంచ మయిపశ్యతి ।
తస్యాహం నప్రణశ్యామి, సచమేన ప్రణశ్యతి ॥
" " సర్వభూతస్థితం యోమాం, భజత్యేకత్వమాస్థితః ।
సర్వదా వర్తమానోఽపి, సయోగీమయి వర్తతే ॥
" " ఆత్మౌపమ్యేన సర్వత్ర, సమం పశ్యతియోఽర్జున ।
సుఖం వాయ దివాదుఃఖం, సయోగీ పరమోమతః ॥
7 అ॥ " తేషాంజ్ఞానీ నిత్యయుక్త, ఏకభక్తిర్విశిష్యతే ।
ప్రియోహిజ్ఞానినోఽత్యర్థ, మహం సచమ మప్రియః ॥
" ఉదారస్సర్వ ఏవైతే । జ్ఞాన్యాత్మైవ మేమతమ్ ॥
8 అ॥ " అధియజ్ఞోఽహమేవాత్ర । దేహేదేహ భృతాంవర ॥
9 అ॥ " యేభజన్తితుం మాంభక్త్యా । మయితేషు చాప్యహం ॥
10 అ॥ " అహమాత్మాగుడాకేశ, సర్వభూతాశయ స్థితః ।
అహమాదిశ్చ మధ్యంచ, భూతానామన్త ఏవచ ॥
11 అ॥ " నిర్వైరస్సర్వ భూతేషు । యస్సమామేతి పాండవ ॥
12 అ॥ " నివశిష్యసిమయ్యేవ । అతఊర్ధ్వం నసంశయః ॥
13 అ॥ " క్షేత్రజ్ఞం చాపిమాంవిద్ధి । సర్వక్షేత్రేషు భారత ॥
" అనాదిత్వాన్నిర్గుణత్వా, త్పరమాత్మాయ మవ్యయః ।
శరీరస్థోఽపికౌన్తేయ, నకరోతి నలిప్యతే॥

15 అ॥ శ్లో॥ అహం వైశ్వానరోభూత్వా. ప్రాణినాం దేహమాశ్రితః।
సర్వస్యచాహం, హృదిసన్నివిష్టః ॥
16 అ॥ " మామాత్మ పరదేహేషు ।
18 అ॥ " సర్వభూతేషు యేనైక. భావమవ్యయ మీక్షతే।
ఈశ్వరస్సర్వభూతానాం, హృద్దేశేఽర్జున తిష్ఠతి ॥

ఇట్టి శ్రుతిస్మృతి వాక్యార్థములగు జీవబ్రహ్మైక్యమును గ్రహించి ప్రజ్ఞయందు స్థిరముగానుండువాడు జీవన్ముక్తుడు మఱియు దేహేంద్రియములను నేను నావని స్వాత్మానుభవ ప్రజ్ఞయందున్న యోగివరుడు తలంపనే తలంపడు. అటులనే శరీరాతిరిక్తములగు బాహ్యదృశ్య ప్రపంచమనబడు గ్రహారామక్షేత్రాదులయందును దారాపుత్రాది పశ్వాదుల యందును మమత్వబుద్ధివిడడు. ఈ ప్రకారము దేహేంద్రియములందును దృశ్యప్రపంచమందును అనాత్మ యనబడు సకల పదార్థముల యందును నేనను అహంకారబుద్ధియు నావను మమకారబుద్ధియున్ను యెకప్పుడుగూడ ప్రమాదవశమునగావి ఎవనికి గలుగనే గలుగదో, సర్వకాలం సర్వావస్థలయందును, సర్వాతిరిక్త దృశ్యరహిత విజ్ఞానమయామృతస్వరూప, పరబ్రహ్మస్వరూపత్వమును ప్రతిబంధరహితమై ప్రజ్ఞయందుభాసిల్లునో అట్టి నిరామయ నిర్వికార చిద్బ్రహ్మమైయున్న విద్వాంసవరిష్ఠుడు జీవన్ముక్తుడని చెప్పబడుచున్నాడు. తనకు శరీరేంద్రియాద్యుపాధియు తత్సంబంధ వస్తు పరికరమున్నున్నను, నిరభిమానియై, యసంగుడై, జితేంద్రియుడై, వీతరాగుడై, ఆయా యుపాధి ధర్మములచే కొట్టబడక సర్వదా ఆనందరూపుడై, జీవన్ముక్తుడు విహరించును ప్రమాణము.

శ్లో॥ దేహాభిమానం విధ్వంస్య, ధ్యానాదాత్మానమవ్యయం।
పశ్యన్మర్త్యోఽమృతోభూత్వా. హ్యత్ర బ్రహ్మ సమశ్నుతే ॥

తా॥ దేహాభిమానము విధ్వంసముజేసి బ్రహ్మధ్యానశక్తిచే పరమాత్మను గాంచు యోగిపుంగవుడు మరణస్వభావమును వదలి జన్మమరణ రహితయమృతత్వము ననుభవించుచు యిచ్చోటనే బ్రహ్మమగు చున్నాడు.

శ్రు॥ మునిః కౌపీన వాసస్స్యాత్, నగ్నోవా ధ్యానతత్పరః।
ఆత్మాత్మరతిరాసీనో, విరాపేక్షో పిరాశిషః॥

తా॥ మౌనియై ధ్యానవిష్టయందుండు మహాత్ముడు ఆత్మరాముడై సర్వాపేక్షశూన్యుడై, అశలేనివాడై, ఏకాంత స్థలమందాశీనుడై, కౌపీనధారియై గావి

దిగంబరుడై గాని యుండు మహానుభావుడు బ్రహ్మానందములో నోలలాడుచు జీవన్ముక్తస్థితిలో యుండును. బ్రహ్మానందమే ముక్తలక్షణము. * ప్రజ్ఞ * మరియు అఖండ అప్రాకృత విరస్త బ్రహ్మైక్యావధారణాత్మక స్వయం ప్రజ్ఞయే జీవన్ముక్తులగు మహనీయులకు సహజసిద్ధ ప్రధానస్వరూప విజ్ఞాయక ధర్మమని తెలియవలయును. తన స్వరూపాత్మప్రజ్ఞ సకలజ్ఞాన విధ్వంసకమై సర్వతేజోమయమై ప్రజ్ఞానఘన ఆనందఘనమై అజ్ఞానత్రిపురములకు పాలాక్షుని తృతీయ నయనమైయున్నది. అజ్ఞానసంకల్పతతి సాన్ద్రనీహార బిందురాశికి సహస్రకిరణ సహస్రముఖ మయూఖమాలయైయున్నది. అజ్ఞాన రాక్షసవర్గమునకు సోన్మూలక విష్ణుచక్రమై యున్నది. స్వరూపాత్మప్రజ్ఞ అజ్ఞానతూలరాశికి ప్రచండ ప్రజ్వాలాగ్నియై విలసిల్లుచున్నది. ఇట్టి ఆత్మప్రజ్ఞలేనివారు బంధింపబడిన పశువులవంటి వారుగాని జీవన్ముక్తులుగారు. వివేకులునుగారు ఆత్మప్రజ్ఞాజీవనమే జీవన్ముక్త వృత్తియగును. ఈ ప్రజ్ఞాతిశయము చతుర్వేదసారములగు మహావాక్యముల లక్ష్యార్థమై పరమగురు కృపారూపమై స్వయం నిరన్తర సాదర కృతాభ్యాసానుపమ ఫలమై జీవేశ్వరోపాధుల నాశకమై స్వస్వరూప స్వయంప్రకాశమానమై భాసిల్లుచున్నది. ఈ ప్రజ్ఞను గురించి యోగసూత్రమిటుల దెలుపుచున్నది.

సూ॥ ఋతంభరా తత్రప్రజ్ఞా॥ అనగా సత్యవస్తుబోధకమై సత్స్వరూపమయినది. అలౌకికప్రజ్ఞయగును.

సూ॥ ప్రవృత్త్యా లోకన్యాసాత్సూక్ష్మ వ్యవహిత విప్ర కృష్టజ్ఞానమ్॥ అనగా ఆత్మ ప్రజ్ఞామహిమచే సూక్ష్మపరమాణువులను అడ్డుగలసిన సకలపదార్థములను దూరములో మేరుపర్వతాన్తరాళములోయున్న సకల వస్తువులను సాక్షాత్కరించుచున్నారు. అట్టిదియే ప్రజ్ఞయనబడును. మరియు సూక్ష్మప్రజ్ఞగల జితేంద్రియులు శాస్త్రసిద్ధ శబ్దానుమాన ప్రమాణములచే సకలలోక విషయములు తెలియవచ్చును. అటుగాక ప్రజ్ఞయనునది సర్వలోకాతీత సర్వప్రమాణాతీత వస్తువగు పరమాత్మను గోచరింపజేయుచున్నది. అట్టి ప్రజ్ఞావంతుడు దేవతలచే కొనియాడదగినవాడగును. ఇట్టి స్వయంప్రబోధరూప ప్రజ్ఞాప్రాబల్యముచే యెప్పుడును ఒకానొకప్పుడుగూడ జీవబ్రహ్మల భేదమును ప్రపంచ పరబ్రహ్మలభేదమును జీవన్ముక్తుడు తెలియనే తెలియకున్నాడు. తాను ఆ పరబ్రహ్మమయ్యేయున్నందుచే తనకన్న వేరువస్తువు బాసింపనందుచేతను అధ్యారోప అధ్యాసముల

విషయమునే తెలియకున్నాడు. అటులనే అపవాద విషయ ప్రయత్నమును. జేయకుంటున్నాడు, విచారించిన బ్రహ్మము సకలాధిష్ఠాన మగుటచే బ్రహ్మము కన్న వేరు వస్తువులేదు. అందుచే బ్రహ్మముకన్న జీవుడు వేరుగాదు. ఉన్నది అపద్వస్తువొకటియే ఇట్టి యద్వితీయాఖండ విజ్ఞానమే ప్రజ్ఞయనబడుచున్నది. ఇట్టి యద్వితీయాఖండ విజ్ఞానమే ప్రజ్ఞయనబడుచున్నది. ఇట్టి వారేజీవన్ముక్తి విద్వాంసులు కైవల్య పదవిహారులు.

శ్లో॥ ప్రజ్ఞాయాం కల్పితాం ప్రజ్ఞాం, ప్రజ్ఞయైవవిహాయయః॥
ప్రజ్ఞామాత్రేణ సన్తిష్ఠే, త్ప్రజ్ఞావానితి కథ్యతే ॥

తా॥ కల్పితమగు బాహ్యప్రపంచ విషయక ప్రజ్ఞను స్వాత్మప్రజ్ఞపాటవముచే వదలి ప్రజ్ఞారూప పరమాత్మ స్వరూపముతోనున్నవాడు ప్రజ్ఞావంతుడని మహా ఋషులచే చెప్పబడుచున్నాడు.

"బహిఃప్రజ్ఞాం సదోత్సృజ్యా. ప్యన్తః ప్రజ్ఞాం చయోబుధః ।
కయాపి ప్రజ్ఞయోపేతః, ప్రజ్ఞావానితి కథ్యతే॥

తా॥ ప్రాపంచికపు తెలివిని సర్వదా వదలి నిరన్తరము ఆత్మవిషయక అన్తః ప్రజ్ఞగలవాడు అనిర్వచ్య ప్రజ్ఞతోగూడిన వాడగుటచే ప్రజ్ఞావంతుడని వచింప బడుచున్నాడు.

ప్రజ్ఞైన చక్షుర్నేత్రంస్యాత్. ప్రజ్ఞైవశ్రోత్ర మింద్రియం,
అన్యచ్చ సర్వం ప్రజ్ఞైవ. సప్రాజ్ఞః పురుషోత్తమః

తా॥ ఏమహానుభావునకు ప్రజ్ఞయే చక్షుస్సు ప్రజ్ఞయే శ్రవణేంద్రియమో అంతయును ప్రజ్ఞయో ఆ విజ్ఞానియే సర్వోత్తమ పురుషుడగు ప్రాజ్ఞుడని తెలి యవలయును.

శ్లో॥ "ప్రజ్ఞయా జాయతే సర్వం, ప్రజ్ఞయా పాల్యతేఽఖిలం
ప్రజ్ఞాయా క్షీయతే సర్వం, తస్మాత్ప్రజ్ఞాం సమాశ్రయ"

తా॥ ప్రజ్ఞారూప భగవంతునిచే సమస్తముత్పన్నమగుచున్నది. ప్రజ్ఞచేతనే సంరక్షింపబడుచున్నది. సర్వము ప్రజ్ఞాయందేలయించు చున్నది. కావున అట్టి స్వాత్మప్రజ్ఞా పరమాత్మను, ఆశ్రయింప వలయును. కనుక అట్టి ప్రజ్ఞ జీవ న్ముక్తుల కున్నది. కాబట్టి దేవతులును కొనియాడుదురు. ఆ చిద్రూప దృతిస్వ రూపము తెలిసికొని దానిని వృద్ధిపరచుచున్న బ్రహ్మ విష్ణుల మహాసత్పురు షుల మూడులోకముల యందును, ప్రజ్ఞాచక్షువుచే విహరించువారే జీవన్ముక్తులు

ఏషాం వృత్తిస్సమా వృద్ధా, పరిపక్వాచ సాపువః।
తేవై సద్బ్రహ్మతాం ప్రాప్తా, నేతరే శబ్దవాదివః॥

తా॥ ఏబ్రహ్మజ్ఞానులు బ్రహ్మాకారవృత్తిని వృద్ధిపరచుచు పరిపక్వావస్థ నొందించుచున్నారో, ఆ బ్రహ్మవేత్తలే సద్బ్రహ్మస్వరూపులు తదితరులు కేవల వేదాంతులు మాత్రమే.

విమేషార్థం వతిష్ఠంతి, వృత్తిం బ్రహ్మమయీం వినా।
యథాతిష్ఠంతి బ్రహ్మాద్యా, స్సనకాద్యా శ్శుకాదయః॥

తా॥ నిరన్తర బ్రహ్మాకారవృత్తిని యొక అర్ధనిమేషముగూడ వదలక బ్రహ్మాదులు, సనకాదులు, శుకాదులు యుటున్నారు. ఆ చిద్రూపవృత్తి లేకుండిన శూన్యము మిగిలి యుండును. కావున పరిపూర్ణ బ్రహ్మాకారవృత్తితో బ్రహ్మమందు విహరించువారే జీవన్ముక్త విద్వాంసులగుచున్నారు.

మఱియు మహాపురుషుని సేవించి తరింపవలెయునని ఇచ్ఛతోగూడి భక్తి శ్రద్ధలతో నొప్పుచున్న సత్పురుషులు తనను దేవునికన్నమిక్కుటమెక్కువగా పరిపూర్ణభక్తి విశ్వాసముతో సుగంధ మాల్యాంబరములచే పూజించి సేవించినను అసూయాపరులై మూఢజనములు తనను దూషించినను, కొట్టినను, అనేక విధములుగా బాధించినను పుణ్యపురుషుల పూజాదులను మూర్ఖులదూషణాదులను సమముగా తలంచు మహానుభావుడు, జీవన్ముక్తుడని తెలియవగును. అనగా ఒకచోట జీవబ్రహ్మైక్యవిష్టులగు మహాత్ములను బహువిధ సత్కారములతో గౌరవింతురు, పూజింతురు. మఱియొకచోట ముక్తపురుషులను నిందింతురు. సత్పురుషులు దీనిని కర్మ రహస్యముగా దెలిసి దేహసంబంధమే గాని ఆత్మకు సంబంధించిన దేదియు లేదని భావించి స్తుతినిందలకు మానావమానములకు లోనుగాక స్వస్వరూప మందచంచలులై యుందురు. కావున సుఖదుఃఖములయందు హృదయమునందు చలించక, ధీరత్వముతో నుండుటయే జీవన్ముక్తుని సహజలక్షణమగును.

శుద్ధచైతన్య రూపాత్మా, సర్వసంగ వివర్జితః।
నిత్యానంద ప్రసన్నాత్మా, సజీవన్ముక్త ఉచ్యతే॥

తా॥ సర్వసంగవర్జితుడు, శుద్ధచైతన్యస్వరూపుడు, నిత్యానందుడను, ప్రసన్న స్వరూపుడను అని ప్రజ్ఞాధురీణుడే జీవన్ముక్తుడని చెప్పబడుచున్నాడు. ఈలాగున ఉపనిషత్తులు గూడ పైజెప్పినవిధముగా, అఖండప్రపంచాతీత చిన్మయ

చిద్ఘన. ఆనందఘన స్థితిసంపన్నుడే జీవన్ముక్తుడని నిర్ణయించుచున్నది. వారికి ప్రజ్ఞయే అజ్ఞాన నాశమునకై, బ్రహ్మరూపమై విరాజిల్లుచున్నది.

మఱియు జీవన్ముక్తుని యచంచల అవికార బ్రహ్మస్థితిని ఎట్టిదనగా సముద్రమందు నానావిధ పరిపూర్ణ జలప్రవాహములు ప్రవేశించుచున్నవి. ఆసముద్రములోనే నామరూపములు లేనివై తనకున్న స్వభావధర్మములను గూడ వదలినవై లయించుచున్నవి. అనగా సముద్రరూపమునే పొందుచున్నవి అపారమగు సముద్రము మాత్రము నదులు తనలో ప్రవేశించున్నప్పుడు హెచ్చుటగాని ప్రవాహముల ప్రవేశములు లేనప్పుడు తగ్గుటగాని లేక యీలాగున వృద్ధిక్షయములు లేనిదై అచంచలమై పరిపూర్ణమై యుంటున్నది. ఆలాగున పరిపూర్ణ బ్రహ్మజ్ఞానియనబడు జీవన్ముక్త విద్వాంసుని ఇన్ద్రియ ప్రేరితములగు శబ్దాది పంచవిషయములుగాని ఇతరులచే నివ్వబడు భోగ్యవస్తువులుగాని ఈలాగున సమస్త దృశ్యమును గూడ జీవన్ముక్తుని దరిజేరినను యేమి చేయజాలవు. ఆజీవన్ముక్త విద్వాంసుని బ్రహ్మమయ తేజోమయ పరిశుద్ధాంతఃకరణమును ప్రవేశించి బ్రహ్మాకారమందే లయించుచున్నవి. విషయములన్నియు యచ్చోట విశ్రాంతినొందుచున్నవి. భోగ్యవస్తువులుగాని రాగద్వేషమయ దృశ్యప్రపంచముగాని ప్రవేశించునప్పుడు ప్రవేశించనప్పుడును సముద్రమువలె తానచంచలుడై అవికారియై యుంటున్నాడు. అనగా ప్రకృతి సిద్ధములగు యెన్నివ్యవహారములు గలుగుచుండినను వానికి లోనుగాక వానికన్నింటి కతీతుడై స్వస్వరూపాత్మ ప్రజ్ఞానఘనస్థితిలో యుంటున్నాడు. ఈ ప్రకారము వికారహేతువులగు శబ్దాది విషయములున్నను లేకపోయినను తాను సద్రూపుడగుటచే సమస్త దృశ్యము బ్రహ్మమగుటచే బ్రహ్మముకన్న వేరులేనందుచేతను నిర్వికారస్థితిలోనే జీవన్ముక్తుడుంటున్నాడు. వికారము జెందుటయు జెందకుండుటయు అంతఃకరణ ధర్మముగనుక ఆ యంతఃకరణమునకు విలక్షణమై ఆత్మయున్నది. ఆయాత్మకు దృశ్యసంబంధమేలేదు. కావున తానున్న యట్టి పరబ్రహ్మమయస్థితిలోనే యుంటున్నాడు. అనగా సముద్రములో ప్రవేశించి లయించిన నదులు తిరుగా యుత్పన్నములుగావు. ఆలాగుల శబ్దాది విషయములుగాని భోగసంకల్పములుగాని వృత్తులు గుణములుగాని జీవన్ముక్తుని ప్రజ్ఞయందు ప్రవేశించి తిరుగాయుత్పన్నములుగావు. జీవన్ముక్తుడన సకలవృత్తి గుణరహితుడు కేవల నిర్విషయుడని తెలియవలెను.

శ్రు॥ సన్మాత్రితయా వృత్త్యా, ముత్పాదయత్యేష యతిర్విముక్తః॥

అని చెప్పియుండుటచే యొకవేళ తాను శబ్దాది దృశ్యప్రపంచమందు వ్యవహరింపవలసి వచ్చినను పూర్వమువలె సన్మాత్రస్వరూప ప్రజ్ఞతోడనే యుండుచున్నాడు. ఈవిషయమునే భగవద్గీతయు చెప్పుచున్నది.

శ్లో॥ ఆపూర్యమాణ మచలప్రతిష్ఠం, సముద్రమాపః ప్రవిశన్తి యద్వత్।
తద్వత్కామాయం ప్రవిశన్తి సర్వే, సశాన్తిమాప్నోతి నకామకామీ ॥

పై జెప్పిన భావమే యీ శ్లోకము చెప్పును.

శ్లో॥ ఉదాసీన వదాసీనో, గుణైర్యో నవిచాల్యతే ।
గుణావర్తన్త ఇత్యేవ, యోఽవతిష్ఠతి నేంగతే ॥

తా॥ తాను అచంచలుడై గుణములు గుణములందుంటున్నవని తలంచి గుణాతీతస్థితిలో యుంటున్నాడు. ఈ విషయమునే శాస్త్రములు చెప్పుచున్నవి.

ప్రమాణము శ్లో॥ ఉత్పద్యన్తే విలీయన్తే, కల్లోలా ఇవసాగరే ।
తద్వైవ పునారాయాన్తి . యాన్తి కామాజితేంద్రియే॥

తా॥ సముద్రమందు అలలు పుట్టుచున్నవి. లయించుచున్నవి. ఆలాగున శరీరధర్మమున ననుసరించి సకల భోగములు వచ్చుచున్నవి. పోవుచున్నవి. తాను మాత్రము సాగరమువలె గంభీరమై యేపరిణామములేనివాడై యున్నాడు. జితేన్ద్రియుడగుటచే సర్వదాహెచ్చుతగ్గులు లేక శోకమోహములు సుఖదుఃఖములు పుణ్యపాపములు. ప్రవృత్తినివృత్తులు లేక ద్వంద్వాతీతుడై యుండగలుగుచున్నాడు. ఈలాగున జీవన్ముక్తులవిషయమును తెలియవలయును వారొకప్పుడు సకలమునుత్యజించి ఏమితెలియనివారివలె విహరింతురు. మరొకప్పుడు పరమకారుణికులై . ప్రాణులకొఱకు దుఃఖింతురు. మఱియొకప్పుడు మహాప్రజ్ఞావంతులై సత్కార్యములందు ప్రవర్తింతురు. ఇంకొకసమయమందు విశుద్ధులై గొప్పధనికునివలెను. అధికారివలెను. మూర్ఖునివలెను చరింతురు. ఇందుచే లోకము యథార్థము తెలియక వారి వారి బుద్ధిననుసరించి తలంచుచుందురు. ఆ జీవన్ముక్తులలో వ్యవహారదశయందును వ్యవహారరహిత దశయందును నిర్వికారులై నిరామయులై యుంటున్నారు. ఈ విషయమునే భగవద్గీత తెలుపుచున్నది.

శ్లో॥ త్రిభిర్గుణ మయైర్భావై, రేభిస్సర్వ మిదం జగత్ ।
మోహితం నాభిజానాతి, మామేభ్యః పరమవ్యయమ్ ॥

తా॥ రజస్సత్త్వతమోగుణముల మూడింటిచే మోహితమైన జగత్తు త్రిగుణాతీతుడగు పరమాత్మను తెలియజాలనటుల మూడుగుణములను మూడవస్థలను మూడుశరీరములను, మూడుకాలములను, మూడువాసనలను, మూడుయీషణలను దాటిన జీవన్ముక్తుడగు నిర్వికారప్రజ్ఞావంతుని తెలియజాలదు. కాబట్టి యెందుండినను యెటులుండినను యవికారియై. యచంచలుడై జీవన్ముక్తుడు యుండును. అనిర్వికారత్వమే వానిస్వరూపమైయున్నది ఇందుకు ప్రమాణము

శ్లో॥ రాగాదయస్సన్తుకామం, నతద్భావోఽపరాధ్యతి।
ఉత్ఖాత దంష్ట్రోరగ, వదవిద్యాకింకరిష్యతి ॥

తా॥ తత్త్వజ్ఞానికి, రాగాదులుండునటుల కన్పడినను అవి నిజములుకావు. ఆ భాసమాత్రములు కోరలు పెరకబడిన సర్పమువలె అవిద్య ఆ మహాత్ముని యేమి చేయలేదు. స్థితప్రజ్ఞ ఇట్టిది.

అనుభవపూర్వకముగా బ్రహ్మతత్త్వమును నిస్సంశయముగా నిశ్చయముగా దెలిసికొన్న జీవన్ముక్తుడు తిరుగా అజ్ఞానదశయందు సంసారమున వ్యవహరించు మాదిరి యుండదు సకలబంధముల ఛేదించిన వాడగుటచే దేనియందును తగులుకొనక అసంగుడై యుంటున్నాడు. అటుగాక సంసారాసక్తిచే వ్యవహరించుచున్నవాడైనచో అతడు బ్రహ్మస్వరూపమును గుర్తెరింగిన వాడు కాజాలడు. బహిర్ముఖ దృష్టిగలవాడే యగుచున్నాడు. దృశ్యప్రపంచమందాసక్తితో మెలంగుచు వృత్తిరహితుడుకానివాడై, స్వానుభవములేనివాడై వాచావేదాంతి యనియు బాహ్యవివేకి యనియు చెప్పబడుచున్నాడు కావున సంసారబంధరాహిత్యమే నిస్సంగ, నిర్వికల్ప, నిర్వికార నిరామయ. నిర్గుణ నిత్యబుద్ధముక్తస్థితియే జీవన్ముక్తుని లక్షణము అటుగానివాడు యథార్థజ్ఞాని కాదని తెలియవలయును.

శ్రు॥ కుశలో బ్రహ్మ వార్తాయాం, వృత్తిహీనః సురాగ్యపి।
నసజ్ఞానీనాపియోగీ, కేవలో దుఃఖభాగసౌ ॥

అనగా బ్రహ్మమని వచించుట యందును, బోధించుట యందును "పరోపదేశ వేళాయాం సర్వేవ్యాస సమానినః అన్నట్లు వ్యాసభగవానునివలె సమర్థుడై, వృత్తులు నశించనివాడై, విషయరాగియై యున్నవాడు జ్ఞానికాడు. యోగియుగాడు కేవల దుఃఖమునే యనుభవించుచున్నాడు. ఈ ప్రకారము వాచావేదాంతి యథార్థమైన అఖండమైన స్వస్వరూపానందావస్త సుఖమును పొందజాలడు.

సుక్షేత్రమున బీజములు చల్లక ఫలమునుగోరుచు సఫలత్వమును పొందినటుల చెప్పుకొనుచున్న క్రియారహితుడు జీవితము వదుపగలడా. ఫలమును పొంద గలుగునా? అలాగున హృదయక్షేత్రమును శుద్ధముజేసి అహంబ్రహ్మాస్మియను జనన మరణ రహిత బీజమువేయక బ్రహ్మత్వ సిద్ధిని యెన్నటికిని పొంద జాలడు. అట్టివానికి సంసారపాతము తప్పదు. బ్రహ్మాకార వృత్తి లేనివారై రాగాది వృత్తులుగలవారై బ్రహ్మ వార్తయందు కుశలులు అజ్ఞానులే. వారు తిరుగా పుట్టుచున్నారు. పోవుచున్నారు. ఇది నిజముకావట్టి స్వానుభవ పూర్వకముగా బ్రహ్మతత్త్వము నెఱింగినవారే జీవన్ముక్తులు"

## • ప్రా ర బ్ధ ము •

మఱియు అనాదిగాను. పరంపరగాను సంబంధించి వచ్చుచున్నవగుట చేతను పురాతనములగుటచే ధృఢములై నవగుటచేతను ప్రారబ్ధకర్మ అలంఘ్య మగుటచేతను దేహోపాధి యున్నంతవరకు తప్పనివియగుటచేతను ఈలాటి అజ్ఞాన సంస్కారములయొక్క బలిమిచే బ్రహ్మజ్ఞానియు సంసారగతినిపొందు చున్నాడు. సంసారమందాసక్తు డగుచు చున్నాడు. అని తలంపవలదు. అటులా యెనేని పరిపూర్ణజ్ఞానముయొక్క ఫలములేకపోవును. కావున అతడు రాగద్వే షాది సంస్కారములున్నవాడు బ్రహ్మజ్ఞానికాడు. కేవలము బ్రహ్మమొకటి సద్వస్తువని వచించినంతమాత్రమున పూర్వజన్మ పరంపరాగత అజ్ఞానసంస్కా రములు క్షీణింపజాలవు. పరోక్షమగుశాస్త్రజ్ఞానముచే సకలవాసనలునాశముగావు వానికి జీవన్ముక్తావస్థనాలుగదు. కేవల మానసప్రూప పరమాత్మ భావను యను భవ జ్ఞానముచేతనే సకల వృత్తులు పశమించుచున్నవి. కావట్టి ప్రాపంచిక వస్తుపరిత్యాగము ఆవశ్యము కర్తవ్యమని ముముక్షువు తెలియవలెను. జిజ్ఞాసువు లేక జీవన్ముక్త విద్వాంసుడు సకల వాసనావిర్ముక్తుడై బ్రహ్మాత్మైక్య జ్ఞాన ముచే సంసారబంధరహితుడై యున్నవాడు. జీవన్ముక్తుడు.

జీవన్ముక్తునకు విషయాదుల ప్రవృత్తి గలుగదనియు సంసారమందు తిరుగా మనస్సునిడక కేవల బ్రహ్మానందమందుండుననియే తెలియవలెను. పరిపూర్ణమగు ఆనందమయ, అమృతమయ, స్వాత్మరూప పరబ్రహ్మము యొక్క విజ్ఞానముగలవానికి వృత్తులన్నియు (విషయ సంకల్పములు భోగ్య వస్తువాంఛలు గుణములు) నశించిపోవుచున్నవి. ప్రపంచమున యతి కాముడు డైనను సర్వదా విషయేచ్ఛచే యున్మత్తుడై యుక్తాయుక్తముల నెఱుంగక

విషయాదులందు క్రీడించు వారైనను తన కన్నతల్లి విషయమున వారి విషయ వ్యాపారములు సంకల్పములన్నియు కుంఠితములగుచున్నవి. మహాపవిత్ర మగు మాతృభావన యెట్టి నీచునిగూడ విషయకాంక్షనుండి మరలించుచున్నది. వాని విషయవృత్తి, మాతృదేవతయొద్ద యణుగంటి పోవుచున్నది. ఆ రీతున పరిపూర్ణ పరబ్రహ్మజ్ఞానము స్వానుభవసిద్ధముగా తాను తన యొక్క అఖండ స్థితిగాంచగా వృత్తులన్నియు కుంఠితములగుచున్నవి. జగమనునన్న దృశ్య జాతమంతయు నొకేరూపముగాను పరమాత్మ స్వరూపముగాను జూచుచున్నారు ఘటపటాది వస్తువులన్నువలె అత్యంత లావణ్యయుక్త వనితాదులను గూడ గాంచుచున్నారు. ఉద్వేగకర వస్తువులన్నిటిని నిర్వికారవస్తువులనుగా భావించు చున్నారు. అలాగన తెలిసుచున్నారు. శిశువు యువతినిగాంచి తనకా విషయము గోచరముగానందుచేతను ఆ పరిగల్పురగుటచేతను ఆ తరుణితో క్రీడించినను నిర్వికారస్థితిలో యుండులాగున పరిపూర్ణ ఖండ స్వానుభవజ్ఞానియు అత్యంత మనోజ్ఞములగు దృశ్యములతో విహరించు వారైనప్పటికి బాలునివలె యపరిగ ల్భులై, నిర్విషస్థిలో యుంటున్నారు పరబ్రహ్మ భావన సకల దుర్వృత్తులను నశింజేసి, స్వాత్మతత్వమును పొందించు చున్నది. అట్టి బ్రహ్మభావన గల వారు పవిత్రులై సకల సంకల్ప దూరులగుచున్నారు. అయినను యీ పరమ పునీతమగు స్వాత్మభావన యందరికిని సాధ్యమగునది కాదు. ఆత్మానాత్మ వివేకులు మాత్రి మిట్టి భావన సాధించగలరు. మాతృభావనయో అందరికిని సాధ్యము. దుష్ట సంకల్ప వృత్తులు గలవారును మాతృభావన సులభముగా జేయవచ్చును. అందుచే అత్యంత కాముకులు గూడ దుర్వృత్తుల నుండి దూరమగుచున్నారు. కావున విషయాభిలాష నాశము జేయుటలో పరబ్రహ్మ భావనకన్నను మాతృభావన అందరికిని మహాసులభమై, సమర్థమై యున్నది అందుచేతనే "మాతృవత్పర దారాంశ్చ" అని మాతృభావన. శ్రేష్టత్వము ఉపనిషత్తుగూడ తెలియ పరచుచున్నది. మరియు మాతృభావన లేక విషయ కాంక్షతో పశ్వాదులు ప్రవర్తించుచున్నవి. అందుచేతనే యవి నికృష్టజీవు లగును. పూర్వకృత దుష్కర్మ ఫలము ననుభవించుచున్నవిగను తలంప బడుచున్నది. అలాగున మహాపవిత్రమగు, జ్ఞానయోగ్య మానుష జన్మము ప్రాప్తించియు తన స్వస్వరూపమందు అనుసంధానము చేయకయు పరమాత్మ జ్ఞానము పొందకయు దృష్య విషయములందు విహరించువారు పశువులే యని

వేదాంత శాస్త్రములు తెలియపరచు చున్నవి. అట్టి జ్ఞానహీనులు స్వకర్మ ఫలము ననుభవించు చున్నారనియు చెప్పబడుచున్నారు. వీరలు యుక్తాయుక్త వివేకము లేనివారని తెలియవలయును. కావున మాతృభావనా స్వరూపమందు సకల శ్రింగార చేష్టలుడుగు విధమున పరిపూర్ణ పరబ్రహ్మ దర్శనమందు సకల వృత్తులు నశించు చున్నవి. ఇట్టి నిర్వ్యాప్తి స్థితిలో జీవన్ముక్తుడుండుచు, కేవల పరిపూర్ణ పరబ్రహ్మమందు సతతము విహరించుచుండును. అదియుంగాక సర్వదా నిది ధ్యాసనాపరుడై యితరచింత లేక, స్వాత్మ స్వరూపమును సాక్షాత్కరించుచు సమాధిని శీలించు మహాయోగియగు బ్రహ్మజ్ఞానికి పరబ్రహ్మజ్ఞానము తప్పక సిద్ధించుచున్నది.

శ్లో॥ నిదిధ్యాసా దృతేప్రాప్తిం ర్నాతపేత్సచ్చిదాత్మనః ।
తసాద్బ్రహ్మనిదిధ్యాసే, జిజ్ఞాస్యః శ్రేయసేచిరమ్ ॥

టీ॥ స్వాత్మచింతనరూప నిదిధ్యాసము లేకపోయిన సచ్చిదానంద ప్రాప్తిగలుగదు. అందుచే బ్రహ్మజిజ్ఞాసి ముక్తికొరకు నిరంతరము చాలాకాలము వరకు స్వాత్మరూపమును సాక్షాత్కరించవలయును.

స్వస్వరూప నిష్ఠాసమాధిని శీలించవలయును. పరబ్రహ్మమందు నిదిధ్యాసనాబలిమిచే పరిపూర్ణ జ్ఞానమును సమాధిశీలుడు పొందుచున్నాడు. సకల వృత్త్యుపసమనము గలిగి దృశ్యాతీతుడై సకలకర్మరహితుడై సర్వదా పరబ్రహ్మస్వరూపియై యున్నాడు. ఇట్టి జీవన్ముక్తునకు గూడ ప్రారబ్ధ కర్మశేషముండుటచే సుఖదుఃఖాది హేతుకమైన ఫలముగలుగుచున్నదని శ్రుతియభిప్రాయమని తెలియవలయును. అందులో ప్రారబ్ధకర్మ జీవన్ముక్తులకుగూడ సంభవించుచున్నదనియు దానివిచారమున్ను చేయవలయును. యెటులనగా ప్రారబ్ధకర్మయనగా పూర్వజన్మకృతమై ఫలోన్ముఖమై అనివార్యకార్యమని గ్రహించవలయును. తనప్రయత్నము లేకనే సంకల్పము లేకనే వచ్చిపడునది ప్రారబ్ధమని తెలియవలయును. ప్రారబ్ధకర్మయటులున్నదను వ్యవహారము నిర్దోషులైన బ్రహ్మజ్ఞానులకే అన్వయించుచున్నది. తదితరజీవులకు కర్మత్రయము తోడ గూడినవారగుటచే ప్రారబ్ధ కర్మమేయని వచింపసాధ్యముగాదు. జ్ఞానహీనులకుగూడ ప్రారబ్ధకర్మయని వ్యవహరించిన బ్రహ్మజ్ఞానుల విషయమై పేర్కొన్న శ్రుతివాక్యమనర్థమగుచున్నది. కాబట్టి జీవన్ముక్తులగువారికిగూడ దేహోపాధియున్నంతవరకు ప్రారబ్ధకర్మ ఫలానుభవము యుండియేయున్నది.

శరీరముప్రారబ్ధకర్మచేతనే ఫలితముఁగూడ దానిననుసరించియే యున్నది. అయినను ప్రారబ్ధకర్మ ఫలితము సుఖరూపమైనను హర్షించడు దుఃఖరూపమైనను శోకింపడు. తానుమాత్రము నిర్వికార కూటస్థాత్మరై యుంటున్నాడు. ఈ దృశ్యమంతయు స్వప్నమయముగా తలంచుటచే కర్మఫలితముఁగూడ స్వప్నమునుగానే స్మరించుచున్నాడు. దానితో అధ్యాత్మసుఖముగాడు తానుయానందాత్మ (లో) సముద్రములో వోలలాడు వాడగుటచే చిన్నబుడగవలె సంభవించు ప్రారబ్ధకర్మఫలితమును లెక్కగొనడు. ఇకను విచారించిన మహాత్ములగు జీవన్ముక్తుల ప్రారబ్ధము నిర్దోషమై అను ద్వేగజనకమై సర్వప్రాణి సుఖకరమై యుంటున్నది. జీవన్ముక్తులయ్యు ప్రపంచముతో నవసరము లేకపోయినను ప్రాణులకు హితకరములగు సత్కార్య కర్మకలాపములలో ప్రవర్తించుచుందురు. భగవంతుని సంకల్పమటులయుండవచ్చును. అటులగాకపోయినను యీ జన్మములో సంకల్ప రహితులైనను పూర్వజన్మమందు బాగా ధ్యానింపబడిన మహోత్తమ సంకల్పసిద్ధులు ఫలోన్ముఖములై యుండవచ్చును. లేనిచో వారు ప్రపంచములో యుండుటకు కారణము లేకపోవచ్చును. పై చెప్పినకారణద్వయము చేతనే జీవన్ముక్తులు ప్రపంచమున విహరించుచు వ్యవహరించుచున్నారు. దృశ్యమంతయు పరబ్రహ్మమయముగనుక దానితో ప్రతిబంధకము ఆ మహానుభావులకులేదు. మఱియు సూక్ష్మజ్ఞానదృష్టితో విచారించిన ప్రారబ్ధకర్మగూడ బ్రహ్మజ్ఞానులకులేదు. దృశ్యమే మిథ్యగనుక దృశ్యజనిత ప్రారబ్ధకర్మయు అసత్యమేయగుచున్నది. వ్యవహారమునకై ప్రారబ్ధకర్మ కల్పితమయినది ఇందులకు ప్రమాణము

శ్లో॥ ఉత్పన్నేఽప్యాత్మ విజ్ఞానే, ప్రారబ్ధంనైవ ముఞ్చతి ।
ఇతియచ్ఛ్రూయతె శాస్త్రే, తన్నిరాక్రియతేఽధునా ॥

తా॥ వేదాంతశాస్త్రమున యాత్మజ్ఞానము గలిగినను ప్రారబ్ధకర్మ క్షయము గాదని తెలియబడుచున్నది. దానిని యిప్పుడు చక్కగా విచారించవలయును.

శ్లో॥ తత్త్వజ్ఞానోదయా దూర్ధ్వం, ప్రారబ్ధంనైవ విద్యతే ।
దేహాదీనా మసత్యత్వా, ద్యథాస్వప్నో విబోధతః ॥

తా॥ మేలుకొనినవానికి స్వప్నమేలాగున దేహాదులసత్యములగుటచే తత్త్వజ్ఞానము పరిపూర్ణముగా గలిగిన తరువాత ప్రారబ్ధమనునది లేనేలేదు.

శ్లో॥ కర్మ జన్మాంతరకృతం, ప్రారబ్ధమితికీర్తితం।
తత్తుజన్మాంత రాభావాత్, పుంసోనై వాస్తి కర్హిచిత్ ॥

తా॥ పూర్వజన్మకృతకర్మ ప్రారబ్ధమని చెప్పబడినది. ఇకజన్మయే లేనందుచే బ్రహ్మజ్ఞానికి యప్రారబ్ధకర్మ యొకప్పుడును సంభవించదు.

శ్లో॥ దేహస్యాపి ప్రపంచత్వా. ప్ప్రారబ్ధావస్థితిఃకుతః।
అజ్ఞాని జనబోధార్థం, ప్రారబ్ధం వ్యక్తి వై శ్రుతిః ॥

తా॥ దేహముగూడ ప్రపంచమగుటచే దానికి సంబంధించిన ప్రారబ్ధముగూడ యసత్యమేయగును. అజ్ఞానులగు జనుల బోధకొరకై ప్రారబ్ధవ్యవహారము ప్రవర్తింపజేయబడినదని శ్రుతులు వచించుచున్నవి.

శ్లో॥ ఉచ్యతేఽజ్ఞైర్బలాచ్చైతత్, తదానర్థ ద్వయాగమః।
వేదాంతమతహానంచ, యతోజ్ఞాన మితిశ్రుతిః ॥

తా॥ ప్రారబ్ధకర్మ యజ్ఞులచే బలత్కారముగా చెప్పబడుచున్నది. అటు దాని నంగీకరించినచో అనర్థమగు భయంకరమైన ద్వైతమునంగీకరించునటులయగును అంతియేగాక మోక్షముగూడ లేకపోవలసి వచ్చును. ఈ రెండు అనర్థములేగాక "ఏకమేవాద్వితీయం బ్రహ్మ। నేహనానాస్తికించనః" యున్నది బ్రహ్మమొకటియే. అను వేదాన్త సిద్ధాంత జ్ఞానమునకుగూడ హాని కలుగుచున్నది. కావున ప్రారబ్ధకర్మ జ్ఞానికిలేదనియే సిద్ధాంతము ఈ ప్రకారము సకలశ్రుతులయొక్క అభిప్రాయము. గనుక ప్రారబ్ధకర్మ కల్పితమని తెలియవలెను. మఱియు ప్రారబ్ధకర్మ ప్రతీయమానమగుచున్నదను అభిప్రాయమునకు కారణమేమనగా "యత్ర యత్ర శరీరం విద్యతే, తత్ర తత్ర సుఖదుఃఖాద్యనుభవ వర్తతే. యత్ర యత్ర ధూమః వర్తతే, తత్ర తత్ర వహ్నిర్విద్యతే ఇతివత్"

తా॥ ఎచ్చటెచ్చట పొగయుంటున్నదో అచ్చటచ్చట అగ్నియుంటున్నది. అటువలె శరీరమున్నచోటెల్ల యుపాధియున్నంతవరకు సుఖదుఃఖాదుల యనుభవముండియేయున్నది. అను శాస్త్రములందు ప్రతిపాదింపబడిన వ్యాప్తినను సరించి సుఖదుఃఖాదులు పారబ్ధరూప శరీరమున్నంతవరకును భూతములగుచున్నవి. కారణములేక కార్యము గలుగదు. అగ్నిలేకదూమముండదు. వహ్ని లేక పాకముగాదు. జలము లేక దాహముతీరదు. మేఘము లేక వర్షము కురియదు. శాంతి లేక ప్రసన్నత గలుగదు. కట్టెలు లేక అగ్ని యుద్దీప్తముగాదు

ఈలాగున కారణముండియే కార్యము గలుగుచున్నది. కావున కర్మయుండి యున్నందుచేతనే సుఖదుఃఖాదులు గలుగుచున్నవి. కాబట్టి యెవరికైనను యత్కించిత్ సుఖదుఃఖాదులుండిన దానికి కారణమగు ప్రారబ్ధకర్మను అవశ్య మంగీకరించవలయును. అందుచే సుఖదుఃఖాదులనుభవించుచుండగా "ప్రారబ్ధం భోగతోనశ్యేత్" అన్నట్లు బ్రహ్మజ్ఞానియొక్క ప్రారబ్ధకర్మ నశించుచున్నదని శాస్త్ర సిద్ధాంతము ఇది జీవన్ముక్త స్థితిపొందిన విద్వాంసునియొక్క ప్రారబ్ధ కర్మ యని తెలియవలెను. వారికి సుఖదుఃఖాద్యనుభవముచే ప్రారబ్ధకర్మ ప్రతీయమానమైనను అది స్వప్నమువంటిదనియు ఆప్రారబ్ధకర్మ తనయాత్మా నుభవమునకు అడ్డురాదనియు తెలియవలెను. జీవన్ముక్తులయొక్కయు విదేహ ముక్తులయొక్కయు యత్కించిత్తుగాయున్న స్వరూపభేదము విశదమగు చున్నది. జీవన్ముక్తులుగాని విదేహముక్తులుగాని జీవించియున్నప్పుడే జీవన్ముక్త్యవస్థనుగాని విదేహముక్త్యవస్థనుగాని పొందవలయును. జీవన్ముక్తులనగా తాము యాపరిపూర్ణ బ్రహ్మస్వరూపులై యఖండవిజ్ఞానమును సంపాదించిన వారైనను ఆ మనుభావులకు ప్రారబ్ధవశత శరీరోపాధి యున్నంతవరకు సుఖదుఃఖాదులు దృశ్యమును ప్రతీయమానములై యుండును. అయిన వాన ర్వము స్వప్నమువలె మిథ్యగా భాసించును. ఇదియే తురీయస్థితియగును. ఈ తురీయస్థితిలోనున్నవారు జీవన్ముక్తులగుదురు. విదేహముక్తులనగ దేహముం డినను దేహధర్మములంటక ఈ ప్రారబ్ధకర్మకు కూడ దూరులయినందుచే సుఖదుఃఖాదులుగూడ ప్రతీయమానములుగానివారై సకలదృశ్యాతీతులై గాఢ సుషుప్తియందున్న వారెటుల జగత్తును మరచియుందురో ఆలాగున సమస్త మును తనశరీరమునుగూడ మరచినవారై ప్రపంచస్మృతిలేనివారై, అచ్యుతులై, ప్రపంచాతీతులై, పరబ్రహ్మమందే నిరంతరముండువారు ఇదియే తురీయాతీత స్థితియగును. ఇట్టి తురీయాతీతస్థితిలోనున్నవారే విదేహముక్తులగుదురు. తురీ యములోనున్నవారు జీవన్ముక్తులనియు తురీయాతీతస్థితిలోనున్నవారు విదేహ ముక్తులనియు సకలవేదాంత శ్రుతులు తెలుపుచున్నవి. ఇందులకు ప్రమాణము

శ్లో॥ చిదాందేహవ్యథాంత్యక్త్వా. బాలః క్రీడతి వస్తుని।
తథైవ విద్వాన్రమతే. నిర్మలో నిరహంసుఖీ॥

టీ॥ బాలుడు ఆతలిదప్పులను మాని క్రీడించు విధమున విదేహముక్తుడు సకలబాధలుమాని శరీరమునుగూడమరచి దేహమున్నను, దేహములేనిస్థితిలో

యున్నవారై సర్వదా పరబ్రహ్మమందు రమించుచున్నారట. నిర్మలులై నిరహంకారులై యున్నారు. విదేహముక్తుని లక్షణములు. యుపనిషత్తుల యిటుల వచించు చున్నవి.

శ్లో॥ బ్రహ్మ భూతః ప్రశాంతాత్మా, బ్రహ్మానందమయస్సుఖీ,
స్వచ్ఛరూపో మహామౌనీ. వైదేహముక్త ఏవసః॥

తా॥ బ్రహ్మస్వరూపుడును. ప్రశాంతుడును. బ్రహ్మానందరూపియు. మఱియు స్వచ్ఛమైన వాడును. మహామౌని యగువాడును విదేహ ముక్తుడనబడును.

శ్లో॥ చిత్తవృత్తి మతీతోయః, శ్చిత్తవృత్త్యేవ భాసకః,
చిత్త వృత్తి విహీనాత్మా. వైదేహముక్త ఏవసః॥

తా॥ చిత్త వృత్తుల నతిక్రమించిన పరబ్రహ్మమందున్నవారై, చిత్తవృత్తుల ప్రకాశింపజేయుచు చిత్తవృత్తులు లేక యున్న మహానుభావుడు విదేహము క్తుడనబడు చున్నాడు.

శ్లో॥ సర్వమాత్మా హమాత్మాస్మి, పరమాత్మా పరాత్మకః,
నిత్యానంద స్వరూపాత్మా, వైదేహిముక్త ఏవసః॥

తా॥ నేను సర్వాత్మను, పరమాత్మను, పరాత్పరుడగు పరబ్రహ్మను. నిత్యా నంద స్వరూపుడను అనుస్థితిలో యున్నవాడు పరబ్రహ్మము విదేహముక్తు డని తెలియవలయును.

శ్లో॥ స్వమాత్మని స్వయంతృప్తః, స్వమాత్మనం స్వయచర
ఆత్మానమే వమోదస్వ, వైదేహిముక్తి కోభవేత్ ॥

తా॥ తనయొక్క స్వరూపమందు తానే తృప్తుడగుచు తనస్వరూప పరబ్రహ్మ మందు స్వేచ్ఛగా విహరించుచు, తనయందే సంతోషించుచు కర్మశేష బీజము వ్నంతవరకు సుఖదుఃఖాది ఛాయామాత్ర ప్రతీతియుండును గనుక దానిని గూడనతిక్రమించి విదేహ కైవల్యమందు విహరించువాడు విదేహ ముక్తుడన బడుచున్నాడు.

ఇంతవరకు ప్రారబ్ధ కర్మ విషయమును తెలియబడెను. ఇక సంచితకర్మ విష యము విచారింపవలయును. సంచితకర్మయనగా అనేక జన్మలనుండి జగత్తున ఎన్ని రూపములున్నవో వాటినన్నిటిని ధరించి శతకోటి ముఖములుగా ఆర్జింప బడిన మలిన ధననమూహము అదెన్నటికిని యనుభవముచే తరుగునది కాదు. ఒక మహావిశాలమైన అపరిమితమైన కంథ కారణ్యము గొడ్డలిచే, కత్తులచే

ఛేదింప సాధ్యముగాదు. అట్టి కఠినతర మహారణ్యమును అగ్ని ప్రయోగించి దహింతురు. లేక అటంబాంబునైన ప్రయోగింతురు ఆలాగున సంచితకర్మము శాస్త్రవిచారణచే కించిద్ధ్యానముచే కొంతశ్రవణ-మనన-నిదిధ్యాసములచే నశించునదిగాదు. అగాధనిష్ఠలోనికి అఖండములగు శ్రవణ మనన నిదిధ్యాస సాక్షాత్కారములలోనికి ప్రవేశించి అజ్ఞానాంధకారమును అనాత్మవాసనలను దరిచేరనీయక "అహం బ్రహ్మాస్మి" నేను అఖండ పరిపూర్ణబ్రహ్మను అను బ్రహ్మాస్త్రమును ప్రయోగించిన ప్రళయకాలాదిత్యోదయమైన సమస్తము దహించుకొని పోవునటుల సకలసంచితకర్మ భస్మమగుచున్నది. అనాదిగా చిలుము బట్టిన బంగారమును అగ్నిలో తప్తముజేసిన సకలమాలిన్యము నశించి శుద్ధమగునటుల జీవుడు మలినాత్ముడయినను "అహంబ్రహ్మాస్మి" యను విజ్ఞానముచే మాలిన్య నిర్ముక్తుడై శుద్ధతనుగాంచుచున్నాడు. సకల సంచితకర్మమునుంచి విముక్తుడగుచున్నాడు. అనగా ఒకానొకడు మాటిమాటికి అప్పుజేసి ఋణపడి తీవ్రబాధను యనుభవించుచున్నాడు. ఆలాగున బహువిధములగు కర్మలుజేసి జేసి ఋణపడి యమబాధనొందుచున్నాడు. ఈలాగున కోటీశ్వరుడగువాడు దయామయుడగు ప్రభువు శరణముపొందుటచేత ఆధనమునంతయునిచ్చి ఋణవిముక్తునిజేయుచున్నాడు. అతీరున జీవుడు భగవంతుని శరణుపొందిన "అహం బ్రహ్మాస్మి" యను విజ్ఞానధనముచే కర్మరాశిని నశింపజేసి ఆ బద్ధజీవుని సంచిత బంధవిముక్తునిగా భగవంతుడు జేయుచున్నాడు. అనంతముగో దూదిరాసులుండిన ఒకేక్షణకాలమున వహ్నిజ్వాలలచే దగ్ధమగునటుల విజ్ఞానముచే కర్మ సంచితమంతయు దగ్ధమగుచున్నది. స్వప్నములో యెన్నియో వ్యవహారములుజేయుచున్నాడు. అనంతముగా ఆనందించుచున్నాడు. అటులనే దురవగాహ దుఃఖములననుభవించుచున్నాడు. మేలుకొనిన తరువాత దానినంతయు అసత్యముగా తలంచి శాంతినొందువిధమున నేను బ్రహ్మమను స్వయంప్రబోధచే మేల్కాంచిన అనుభవవిజ్ఞాని సకల సంచితకర్మక్షయమును పొందుచున్నాడు అనగా స్వయంప్రబోధచే సకలకర్మలు నశించుచున్నవి. ఋణవిముక్తునివలె రాహుముక్త చంద్రునివలెను ప్రకాశానందమును పొందుచున్నాడు. మేలుకొనినవాడు సమస్తమును యెఱుంగువిధమున ప్రబోధముగలవాడు సమస్తమును బ్రహ్మముగా జూచువాడగుటచే సకలకర్మ నిర్ముక్తుడై పరబ్రహ్మము తానగుచు అట్టి పరబ్రహ్మ విజ్ఞానమునొందుచున్నాడు.

"అహం బ్రహ్మాస్మి జ్ఞానమహిమను ఉపనిషత్తులందీలాగున చెప్పబడి యున్నది."

శ్రు॥ అహం బ్రహ్మాస్మి. మంత్రోయం. బుద్ధివ్యాధి వినాశయేత్.
అహం బ్రహ్మాస్మి. మంత్రోయం. చిత్తబంధం వినాశయేత్।
అహం బ్రహ్మాస్మి. మంత్రోయం. సంల్పాదీన్వినాశయేత్।
అహం బ్రహ్మాస్మి. మంత్రోయం. కోటిదోషం వినాశయేత్।
అహం బ్రహ్మాస్మి. మంత్రోయం. కామాదీన్నాశయేత్ క్షణాత్॥

తా॥ అహం బ్రహ్మాస్మి (నేను పరబ్రహ్మమ) అను విజ్ఞానము బుద్ధి వ్యాధిని చిత్తబంధమును చిత్తవృత్తిని. సంకల్పములను నశింపజేయు చున్నది. మనస్సునకు వ్యాధిరూపమైన. బంధరూపమైన. ఆవరణరూపమయిన. వృత్తిరూపమయిన మూలాజ్ఞానమును విశేషముగా నాశమొనరించుచున్నది. మఱియు ఆవిజ్ఞానము అజ్ఞానజన్య కోటిదోషములను. కామాదులను నిర్మూలముగా నశింపజేయు చున్నదని తాత్పర్యము.

శ్రు॥ కేవలం తుర్యరూపోఽస్మి. తుర్యాతీతోఽస్మి కేవలః।
సదాచైతన్య రూపోఽస్మి. చిదానందమయోఽస్మ్యహమ్॥

తా॥ ఆ అహం బ్రహ్మాస్మి జ్ఞానముచే, నేను కేవల తుర్యరూపుడను తురీయాతీత కేవల పరబ్రహ్మమును సర్వదా చైతన్యరూపుడను. చిదానందమయుడను అగుచున్నాను.

శ్రు॥ నిర్వికల్ప స్వరూపోఽస్మి. నిరీహోఽస్మి నిరామయః॥
సదాఽసంగరూపోఽస్మి. నిర్వికారోఽహమవ్యయః॥

తా॥ నేను నిర్వికల్పుడను. నిరీహుడను. నిరామయుడను. అసంగుడను. నిర్వికారుడను. అవ్యయుడను అగుచున్నాను

శ్రు॥ సదైకరస రూపోఽస్మి. సదాచిన్మాత్ర విగ్రహః।
అపరిచ్ఛిన్న రూపోఽస్మి. హ్యఖండానందరూపవాన్॥

తా॥ సర్వదా ఏకరూపుడను చిన్మాత్రాకారుడను, అపరిచ్ఛిన్నుడను, ఆనంద రూపుడను, అగుచున్నాను. యనుఅనుభవమును గలుగజేయుచున్నది. ఇదియే జీవన్ముక్తి స్థితియగును.

మఱియు బ్రహ్మజ్ఞానికి ఇదివరకు చేసియున్న పుణ్యపాపకర్మలు జ్ఞాన ప్రతిబింబములు గావనియు జ్ఞానాకార దశయందలి సత్యములు గావనియు

యెఱుంగవలయును. అనగా స్వప్నములోతాను అనంత పుణ్యము నాచరించి అనంత సుఖమునను భవించుచున్నాడు. లేక అపరిమిత పాపములనాచరించి అత్యధికదుఃఖమును అనుభవించుచున్నాడు. తనస్వప్నమున తానుపడినకష్టములకుగాని లేక సుఖములకుగాని అంతులేక కష్టములచే పరితపించుచు ఏడ్చుచున్నాడు. సుఖములచే హర్షించుచు ప్రమదానందమున విహరించుచున్నాడు. ఇదంతయు తాను మేల్కాంచినప్పుడు జాగ్రద్దశయందు తనకు మిథ్యయని స్పష్టముగా తెలియుచున్నది. ఆ సమయమున తాను సుఖదుఃఖముల పొందుటలేదు. ఏమిదియాశ్చర్యము మానసికశక్తి ఏమనవచ్చును. నేఁడిన దుఃఖ సంచయముగాని లేక సుఖపరంపరగాని యెటులోయినవో అనితలంచుచున్నారు ఆలాగున అజ్ఞానదశయందున్నప్పుడనేక పుణ్యపాపములజేయుచున్నారు. నా పుణ్యపాపములచే అనంతసుఖదుఃఖముల యనుభవించుచున్నారు. ఈ ప్రపంచమంతయు సత్యముగానే అవివేకికితోచును. ఆ యజ్ఞానియు తమస్సునుండి విడివడి జ్ఞానియై ప్రబోధదశకు వచ్చిన తరువాత ఆ విజ్ఞానావస్థయందు తాను పుణ్యపాపాది ద్వంద్వాతీతుడైన పరమాత్మనని స్పష్టముగా తెలియుటచే పుణ్యపాప మిశ్రప్రపంచ సర్వస్వమసత్యమని చక్కగా తెలియుచున్నాడు. తనచే యిదివరకు చేయఁబడిన పుణ్యపాపములను తత్కృత ఫలములనుగూర్చి విచారించడు. ఆ పుణ్యపాపములగూడ తనకు భాసించవు. స్వప్నమందు జేయఁబడిన పుణ్యపాపములు అసత్యములగుటచే స్వర్గనరములు కలుగజేయనటుల జ్ఞానివిషయమున అజ్ఞానదశయందుచేయఁబడిన పుణ్యపాప సముదాయము ఫలవంతము గానేరదు. నిష్కామ పుణ్యకర్మానుష్ఠానముచే సకల పాపకర్మలునశించి యంతఃకరణ శుద్ధిగలిగి జ్ఞానోదయమగునప్పుడు పుణ్యకర్మలుగూడ పరిసమాప్తములగు చున్నవి. తరువాత అయాపుణ్యకర్మలచే కార్యకారిత్వము సిద్ధించదు. వానిఫలమంతఃకరణ శుద్ధియనియే తెలియవలెను. మరియు స్వప్నమసత్యమయినను దానికి కారణము పూర్వసంస్కారవిశిష్ట రజోగుణాత్మక మానసిక శక్తియేయగుచున్నది. అట్టి మలిన మనస్సుచేతనే పుణ్యపాప మిశ్ర సుఖదుఃఖాద్యనుభవము గలుగుచున్నది. ఆలాగున జ్ఞాన శూన్య దశయందవివేకముచే పుణ్యపాపములఁజేయుచు తత్ఫలముల జన్మాంతరములయందును యనుభవించుచున్నారు. దీనికంతటికిని మహా మూలజ్ఞానమే హేతువైయున్నది. ముందు చెప్పఁబడిన రజోగుణాత్మక చిత్తము. జాగ్రద్దశయందు సత్త్వగుణమును

పొందుచున్నది. నిర్మలమగుచున్నది. అందుచేతనే మేల్కాంచినప్పుడు తాము కలలో గన్నదంత యసత్యమేయని తలంచుచున్నాడు. ఆ తీరుగా అజ్ఞాన నిద్ర మండి మేలుకొని ప్రబోధ దశకువచ్చినప్పుడు సర్వప్రపంచము తద్గత పుణ్య పాప సముదాయములు లేవనియే తలంచుచున్నాడు. విచారించిన జాగ్రిదాది త్రివిధావస్థలు త్రిగుణకల్పితములు. కావున త్రిగుణాతీతుడైన తురీయావస్థ యందు జాగ్రద్దశ మిథ్యగానే యగుచున్నదని భావము. అజ్ఞానుల విషయ మీతీరుగా యున్నది. ఒకానొకడు సాన్ద్రతిమిర నిబిడ మహాగుహలోనే కూపస్థ మండూకంవలె యున్నాడు. ఒకప్పుడును బయటకురాడు. తానుండు గుహయే విశాలప్రదేశమనియు దట్టమగు చీకటియందు గుడ్లగూబవలె సంచారముసంత టిని గడుపుచున్నాడు. బాగా ప్రకాశించు సూర్యునియొక్క ఉదయాస్తమయ ముల తెలియదు. తనస్వరూపమే చీకటియనియు తలంచి దానినంతయు స్థిర మని నమ్మియున్నాడు. అలాగున అజ్ఞానియు అవిద్యాతమస్సుచే యావృతమ యిన బుద్ధిగుహయందు నివసించుచు మిథ్యాభూత ప్రపంచమే సత్యమని తలంచుచున్నాడు. జ్ఞానమనువెలుతురులో సంచరించక ప్యానిుతన నేత్రము తెరువక పరమాత్మ భాస్కరుని తెలియకయు జ్ఞానముయొక్క ఆవిర్భవమును గాని జ్ఞానము లేమిచే గలుగు ఫలమునుగాని తెలియక యుంటున్నాడు. చీకటి గుహలో సంచరించువానివలెను గుడ్లగూబవలెను కించిజ్ఞుడై. యసత్యమును సత్యముగా తలపెట్టుచున్నాడు. దివాంధము సూర్యునిచూడజాలక తన చీకటినే బహూకరించులాగున పరమాత్మ భాస్కరుని గాంచజాలక తనతెలివిలేమినే సమీచీనమని స్మరించుచున్నాడు. స్వప్నములోయున్నప్పుడు చూచినదంతయు సత్యమనులాగున దృగ్గోచరమగు ప్రపంచమంతటిని నిజమనినమ్ముచున్నాడు. కమలకుగనపడనిది సత్యమెటులగుననియు వాదించుచున్నారు. తనయొక్క అజ్ఞానమును తెలియజాలక యున్నాడు. నాస్తికులును నిజముతెలియజాలక బుద్ధి కతీతమగు పరమాత్మను గాంచక ప్రపంచము సత్యము ప్రకృతిసిద్ధము స్వభా వమని నుడువుచున్నారు. తనయొక్క స్థితి గుడ్లగూబయొక్కయు గుహలో నివసించు కించిజ్ఞుని యొక్కయు స్థితియని తెలియకున్నారు. అనంతమగు సర్వేశ్వరుని మహిమను అతనియొక్క మహాద్భుతమగు శక్తిని ఎవ్వరును తెలియనోపరు. కావున చాలా కాలమునుండి గుహలోనున్నవాడు మృగమువలె సంచరించువాడు బయటకువచ్చి నేత్రము తెరచి సూర్యునిగాంచి వెలుతురులో

సంచరించునప్పుడు విశాలమైన నదీనదములతోను సముద్ర పర్వతములతోను గూడిన విశ్వము దర్శించిన తనయజ్ఞానములకు వగచుచు నిజమును కనుగొను లాగున అజ్ఞానియు దైవనీయమములవలంభించి బుద్ధిని పరమాత్మోన్ముఖము జేసి బ్రహ్మభానుని స్వానుభవ నయనముతోగాంచి జ్ఞానాతపములో సంచరించు నప్పుడు తనయొక్క అనంత పరిపూర్ణాపరిచ్ఛిన్న విశ్వస్వరూపమును గాంచు చున్నాడు. చిరవధికానందమునొందుచున్నాడు. కావున జ్ఞానదశ ఇట్టిదని తెలియ వలయును. అట్టిమహానుభావునికి పుణ్యపాప ఫలములులేవు. నిస్సంగుడై నిర్వి చారుడై యుండును. కొందరు స్వప్నమునుండి మేల్కొనకనే స్వప్నమసత్య మనుట సంభవించునటుల జ్ఞానదశగలుగకనే పుణ్యపాపముల జేయుచునే మేము జ్ఞానులము గనుక మాకు పుణ్యపాపములంటవని తెలుపుచున్నారు. అయినను వారాపుణ్యపాప ఫలములను తప్పక అనుభవించుచున్నారు. అటులగాక నిజ మయిన ప్రబోధదశయందు తనకు విశ్వమే గోచరించనందుచే తాను భూతకాల పుణ్యపాప ఫలములనంటక సకల ద్వంద్వాతీతస్థితిలో యుంటున్నాడు. అట్టి ధీరుడగు విద్వాంసుండే జీవన్ముక్తుడగుచున్నాడు. నిరంతర స్వానుభవ జ్ఞాన ప్రజ్ఞయందు పుణ్యపాప మిశ్రదృశ్యమే స్ఫురింపనందున యవివేకముచే పూర్వము చేయబడిన పుణ్యపాపములంటవు.

మఱియు బ్రహ్మజ్ఞానికి ప్రారబ్ధ సంచిత కర్మలంటవని ఇంతవరకు సంగ్రహముగా తెలిసికొని యిక ఈజన్మమందు చేయబడుచున్న ఆగామి కర్మలుగూర బ్రహ్మజ్ఞానముగలిగిన మహానీయుని బంధింపవని విచారముజేసి తెలిసికొన వలయును. అనగా తాను గగనమువలె అసంగుడై నిర్లిప్తుడై సర్వ సాక్షియై, తటస్థుడై ఉదాసీనుడై

శ్లో॥ తత్త్వవిత్తు మహాబాహో, గుణకర్మ విభాగయోః ।
గుణాగుణేషువర్తన్త, ఇతిమత్వానసజ్జతే ॥

అను భగవద్గీతావాక్యానుసారముగా సర్వాతీతుడై యున్న పరమాత్మగా యున్నా డని తెలిసి యట్టి యుదాసీనస్థితిలోయున్న మహానుభావుడు ఆగామి కర్మలచే తను బద్ధుడుకాడు. సకలకర్మలను నాశముజేసినవాడగుచున్నాడు.

జ్ఞానాగ్ని సర్వకర్మాణి భస్మసాత్కురుతే తథాః

అను భగవంతుని వచనము మాదిరి సకల కర్మలను కట్టెలను జ్ఞానాగ్నిలో భస్మము చేయుచున్నాడని భావము.

ఆకాశము సర్వత్రవ్యాపించియు దేనివంటక నిర్మలమై. నిరూపమై
యున్నది. ఆ ప్రకారము సర్వవ్యాపక పరబ్రహ్మ స్వరూపమగు తానుగూడ
సర్వత్ర వ్యాపించియు దేనితోను సంబంధించియుండక అసంగుడై విశ్వములో
నున్నవాడైనను విశ్వాతీతుడై సకలకర్మలయందును నిరీహబుద్ధితో ప్రవర్తిం
చిన వాడగుటచే కర్మనిర్ముక్తు నిర్మలుడై. నిరూపుడై, సర్వసాక్షియై. సర్వ
మయుడై, అవ్యవహారుడై, యనిర్దేశ్యుడై యున్నాడు. అట్టి సర్వాత్మభావము
గల బ్రహ్మవిద్యరేణ్యునకు కర్మత్రయముగూడ తానసంగుడగుటచే నంటదని
తెలియవలయును. మఱియు శరీరాంతర్గతమై, విలక్షణమై భాసించుచున్న కూట
స్థాత్మయగు తాను పరబ్రహ్మమగుటక యే యుపాధిధర్మములు తనను యం
టవనియు శరీరమునకును ఆత్మస్వరూపుడగు తనకు నేలాటి సంబంధము ఘటా
కాశములకువలె లేదనియు బ్రహ్మజ్ఞాని ప్రారబ్ధాది కర్మలచేతను స్పృశింపబడ
డనియు సకల కర్మరహితుడై జ్ఞానస్వరూపియై యుండుననియు

శ్రు॥ ఘటసంవృతమాకాశం, నీయమానే ఘటేయథా।
ఘటోనీయేతనాకాశ, స్తద్వజ్జీవోనభోపమః॥

తా॥ ఘటములోని ఆకాశము ఘటము తీసుకొనిరాబడినను మఱియొకచోటికి
పోబడినను అందుండు నాకాశము యెచ్చోటికిపోవుటలేదు. వచ్చుటలేదు. ఘట
ము పగిలిపోయినను ఆకాశము నశించుటలేదు. అలాగున శరీరము చలించినను
చలింపకున్నను నాశమొందినను విశుద్ధమగు జీవాత్మ గగనమువలె సర్వవ్యా
ప్తియై. అచంచలమై, శాశ్వతమై యుంటున్నదని శ్రుతివాక్యము అవగా ఆకా
శము ముఖ్యముగా నాలుగువిధములై యున్నది. ఘటాకాశము, జలాకాశము.
మేఘాకాశము, మహాకాశము అనగా వరుసగా కూటస్థాత్మ జీవాత్మ ఈశ్వ
రుడు పరబ్రహ్మములు విగ్రహించవలయును. ఘటాకాశము ఘటములోని
ఆకాశము. అది ఘటమను యుపాధితో గూడుకొన్నను ఘటధర్మములగు
నీలత్వ వక్రత్వాది ధర్మములతో సంబంధింపదు. అటులనే కుండలో దుర్గంధ
యుతమగు మలిన పదార్థము పరిపూర్ణముగా యున్నను ఆ మలిన వాసనంచే
అందులోని ఆకాశము దూషితముగాదు. అవగా ఘటములో మలినపదార్థములు
న్నందుచే మాలిన్యముగాని శుద్ధపదార్థములున్నందుచే వానికి సంబంధించు పరి
శుద్ధతగాని ఆకాశమునకు సంభవించుటలేదు. ఆకాశము మాత్రము సర్వదా
అసంగమై విలక్షణమై యున్నది. అలాగున శరీరములోని ఆత్మవస్తువుగూడ

శరీరేంద్రియ ధర్మములను జనన మరణాదుల చేతను చలనాది క్రియలచేతను కొట్టబడుట లేదు. మఱియు అంతఃకరణము యొక్క మాలిన్యముచే ఆత్మ మలినమగుటయు, శుద్ధతచేత శుద్ధమగుటయు లేదు. ఆ పరమాత్మ వస్తువు సదా విశుద్ధగాను, నిర్లిప్తము, నిర్వికారి, నిశ్చలము సర్వవిలక్షణమై యున్నది. ఆకాశమునందున్న సూర్య చంద్రులకు క్రిందనున్న భూమి పర్వతాదులచే భంగము లేనటుల ఆత్మ కెన్నటికిని శరీరేంద్రియాదులచే భంగము లేదు. అయినను మేఘమండలము భూమి పర్వతాదుల కన్నను సూర్య చంద్రాదులకు దగ్గఱగా యున్నందుచే ప్రచ్ఛన్నత్వము (కప్పబడుట) ప్రకాశత్వము సూర్య చంద్రాదులందు తోచుచున్నవి. అంతమాత్రమేగాని దానిని విచారించిన సూర్య చంద్రులకు మేఘమండల ప్రతిబంధకముగూడ లేదు అప్రకారముగా శరీరేంద్రియాదులకన్నను అంతఃకరణమనునది యంతరాత్మకు కొంతదగ్గఱగా యున్నందుచే ఆత్మయందు అంతఃకరణ ధర్మములగు ప్రకాశాప్రకాశములు సుఖదుఃఖాదులు, పుణ్యపాపములు, ధర్మాధర్మములు, శీతోష్ణములు భాసించుచున్నవి. యథార్థముగా విచారించిన ఆత్మవస్తువు నిరావరణమై తేజరిల్లుచున్నది. కావున ఘటములోని గగనమునకు ఘటధర్మములుగాని మలినవాసనాలక్షణములు గాని సంబంధము లేక పోవుటచే యేదోషములను సంభవించనటుల నిస్సంగాత్మకు (జీవాత్మకు) శరీరేంద్రియాది ధర్మములుకాని అంతఃకరణము యొక్క మాలిన్య శుద్ధములుగాని యంటవు. జీవాత్మ సర్వదా శాశ్వతము. పరిశుద్ధము. పుణ్యపాప సుఖదుఃఖ శోక మోహ శీతోష్ణ ద్వంద్వరహితమై యున్నది.

శ్లో॥ క్షుత్పిపాసే శోకమోహే, రాగద్వేషౌ తథైవచ ।
కామక్రోధ ప్రభృతయః ద్వంద్వశబ్దే ప్రవర్తితా ॥

తా॥ ఆకలిదప్పులు, శోకమోహములు, రాగద్వేషములు, కామక్రోధములు మొదలైనవి ద్వంద్వములని తెలియవలయును. వీని కన్నింటికి విలక్షణ వస్తువు పరమాత్మ మఱియు కుండలోని మలిన పదార్థముచే ఘటము మలినత్వము పొందుచున్నది. దుర్గంధవాసనచే దూషితమగుచున్నది. తమోగుణము గల నీచ మానవులు మలినపదార్థమునపేక్షచే ఘటమును సేవింతురు. వరాహములు బురదను ఇచ్ఛయించునటులను కీటకములు మురికి నాశించునటులను ఆదుర్గంధయుత మలిన పదార్థములనే కడునానందముతో సేవింతురు. ఆమలిన పదార్థములచే ఘటోపాధి దూషితమై నింద్యమగుచున్నది. ఆ తీరున అంతః

కరణములోని మలినవాసనలున్నందుచే శరీరేంద్రియోపాధులు మలినములగుచున్నవి. మాలిన్యోపేతములగు దుర్వృత్తులచే అజ్ఞానమను వాసనచే అంతఃకరణము క్రూరమగుటయే గాక శరీరమంతయు క్రూరమగుచున్నది. ఇట్టి మలినాంతఃకరణము గలవారు విషయ వాంఛలను సంసార జనన మరణ పంకమునే గోరుదురు. ఆ సుఖములనే అమృతమునుగా సేవింతురు. దీనినంతయు మూఢజనులంగీకరింతురు. బహూకరింతురు. ఇకను ఘటమును శుద్ధజలముతో గాని తేనెతోగాని నిండియుండిన దానిని సజ్జనులందరు సేవింతురు. శుద్ధజలమందు తమ ప్రతిబింబములను స్పష్టముగా గాంచుచుందురు. ఆ విధమున శరీరములోని శుద్ధాంతఃకరణమునందు నైర్మల్య నిర్వాసనత్వరూప శుద్ధజలముండిన సర్వోపాధులు శుద్ధములగుచున్నవి. ఆ స్వచ్ఛాంతఃకరణమునందు పరమాత్మవస్తువు సూర్యుడులాగున ప్రతిఫలించుచున్నది. ఇట్టి సత్వగుణోపాధికులు క్రమముగా పరమాత్మరూపమగు తనను గాంచుచున్నారు. మలినమైన జిడ్డుతో గూడిన ముఱికి కుండయందు తనయొక్క ప్రతిబింబము గానుపించని విధమున మలినవాసనా యుక్తాంతఃకరణమందు ఆత్మవస్తువు గోచరముగాదు. కావున శుద్ధాంతఃకరణముద్వారా పరమాత్మను తెలియవలయును. ఘటమునకు అందులోని జలాదులకు శుద్ధాశుద్ధులు, పూజ్యాపూజ్యతలు శరీరమునకు అందులోని అంతఃకరణమునకు శుద్ధాశుద్ధములు పుణ్యపాపములు సేవ్యాసేవ్యములు ప్రకాశాప్రకాశములు గలుగుచున్నవి. ఆత్మవస్తువాకాశమువలె సకల ధర్మవర్జితము సర్వవ్యాపి ద్వంద్వాతీతము సర్వవిలక్షణము విశుద్ధచేతనా స్వభావకము నిత్యము, శాశ్వతము, నిరంజనము, సత్యము మఱియు ఈ యాత్మయొకప్పుడును పుట్టనేలేదు. దానికి మరణమేలేదు. అపరాపరవస్తువు నిష్క్రియం, నిర్వికారం నిశ్చలము ఇట్టి పరిపూర్ణ సత్యాతీత స్థితిలోయున్నట్టి మహాత్ములగువారికేదియు లేదు. వారిదృష్టిలో అంతయు పరబ్రహ్మమే. ప్రారబ్ధకర్మ వ్యవహారము గూడలేదు. ఆ ప్రారబ్ధకర్మప్రతీతి వచనమజ్ఞుల విశ్వాసమునకేయని తెలియవలెను. జ్ఞానము గలుగకముందుగానే ఆరంభింపబడిన కర్మ (ప్రారబ్ధకర్మ) జ్ఞానోదయమైనను నాశమొందదు. ప్రారబ్ధకర్మ పుణ్యపాప రూపమైనని యను భవముచే నాశమొందుచుండగా జ్ఞానమునకు ప్రతిబంధముగాదు. స్వప్రయత్న బలిమి దైవానుగ్రహమున్ను ప్రారబ్ధకర్మనుగూడ నెట్టివేయుచున్నది. అధ్యాత్మసాధన యందిట్టి బలముగలదు. ప్రారబ్ధమని మహాత్ములందురు. ఊరకే

యుదాసీనులై యుండలేదు. ప్రయత్నపజీవులై, దైవాలంబులై యున్నత మార్గమును పొందిరి. విశ్వామిత్రాది మహాఋషులు దీనికి తార్కాణము అయినను ప్రారబ్ధ మవశ్యమను భూతమగుచున్నది. తానుచేయరాని కర్మలుచేసి నేను బ్రహ్మమనిన మాత్రాన తాచేసిన కర్మలు నశించవు. పశ్చాత్తాపముచే నవియనుభూతములగుచున్నవి. తనబ్రహ్మజ్ఞానము పరిపూర్ణమగుకొలది అవి నాశములగుచునేయున్నవి. అటులయినను యుపాధియున్నంతవరకు ప్రారబ్ధ కర్మ యనుభవరీతిగా ప్రతిభాసించుచున్నది. బాణమువదలిన తరువాత దాని నుపసంహరింప తనచేతనే సాధ్యముగాదు. ప్రయోగింపబడిన శరము తన లక్ష్యమైన హంసనో, మహర్షినో, రాక్షసినో భేదించియే తీరును. దానిఫలమును సుఖదుఃఖాదిక మవశ్యమను భూతమగుచునేయున్నది. కావున వేయబడిన అంబు లక్ష్యమును ఛేదించి ఫలమును గలుగుజేయువిధమున తాచేసిన పూర్వకర్మయనబడు ప్రారబ్ధము సుఖదుఃఖాది ఫలమును గలుగజేయును. వేరుమార్గములేదు. ప్రారబ్ధకర్మయనగా ప్రయోగింపబడిన బాణము (అవశ్య ఫలగామి) ఆగామి కర్మయనగా చేతిలోనున్న శరము తనకిష్టముండిన దానినుపసంహరింపవచ్చును. ఇది జ్ఞానముచే నాశమగును. ఇక సంచితకర్మయనగా అంబుల పొదను (తూనీరము) దూరముగా పారవేయునటుల జ్ఞానమహిమచే దీనిని దూరీ దూరీకరింపవచ్చును. మిగిలినది ప్రారబ్ధకర్మ అదియుభోగముచే నాశమగును.

శ్లో॥ వినాప్రయత్నం లోకేయే, సుఖదుఃఖేచ యోగినాం ।
ప్రారబ్ధం తద్విజానీయాన్నతు, కర్మయుజాంఫలమ్ ॥

మహా యోగులకు ప్రయత్నములేకనే వచ్చెడు సుఖదుఃఖములు ప్రారబ్ధకర్మయని తెలియవలెను. అటుగాక కర్మపరులకు స్వప్రయత్న బలమువలన సిద్ధించు కర్మ ప్రారబ్ధముగాదు.

శ్లో॥ సుఖదుఃఖాదికంద్వంద్వం, యావత్కాలంభవేన్మనే ।
తావచ్ఛుభా శుభంకర్మ, బాధతే శ్రుతిశాసనాత్ ॥

తా॥ ఎంతవరకు తనదేహమునకు సంబంధించిన సుఖదుఃఖములు స్ఫురించుచుండునో అంతవరకు తానుజేయు శుభాశుభకర్మల ఫలమనుభవించియే తీరవలయునని వేదశ్రుతి చెప్పుచున్నది. ఎప్పుడు సుఖదుఃఖములు తనకంటవో అప్పుడు పుణ్యపాప కర్మలను అంటవు.

శ్లో॥ ప్రారబ్ధం భోగతోనశ్యే, తత్త్వజ్ఞానేన సంచితం ।
ఆగామి ద్వివిధం ప్రోక్తం, తద్వేషి ప్రియవాదినోః ॥

తా॥ ప్రారబ్ధకర్మ యనుభవముచే నాశమగుచున్నది. తత్త్వజ్ఞానము వలన సంచితకర్మక్షయమగుచున్నది. ప్రియవాదులకు పుణ్యకర్మ ద్వేషులకు పాప కర్మచేరుచున్నది. ఇటుల జ్ఞాని సర్వకర్మవిర్ముక్తుడుగుచున్నాడు. ప్రారబ్ధకర్మ జ్ఞానోదయమైన వెంటనే నాశమునొందదని భావం.

మఱియు ప్రారబ్ధకర్మ మవశ్యమనుభవింపదగినదియు భోగముచేతనే ప్రారబ్ధకర్మ నాశము సంభవించుననియు తెలియవలెను. అనగా ప్రయుక్త శరమువలె ప్రారబ్ధ (చేయబడిన పూర్వజన్మకర్మ) నివారింప శక్యముగాదు. ఒకానొకడు ధర్మవిష్ఠుడేమైయున్నను గోవునుజూచి కొంచెముచీకటి యున్నందుచే క్రూరమృగములు సంచరించు యరణ్యప్రదేశమగుటచే పెద్దపులియని భ్రమించి తీవ్రముగా శరమునాకర్షించి ప్రయోగించెను. శరము తగులకముందే బాణప్రయోగముతోబాటు గోవుయను తెలివిగలిగెను. అప్పుడాతడు ఏమిచేయ జాలకయున్నాడు. బాణముమాత్రము పోయి గోవును ఛేదించి హింసించు చున్నది. మొదట అవిచారముచే వ్యాఘ్రమను బుద్ధియు బాణము వేసిన పిమ్మట విచారముచే గోవు యను బుద్ధియు వెంటనే గలిగినది. యదార్థమగు గోవును జ్ఞానమప్పుడుపయోగకారిగాక పోయెను. అయినను ఆ యదార్థజ్ఞానమిక యెప్పటికిని యవిచార్యకార్యముల నిరాకరించుచున్నది. ఇదియే జ్ఞానము గలిగినదానికి గుర్తుగాయున్నది. అలాగున తాను నిజమును తెలియని వాడగుటచే కొంత యవివేకమున్నందుచే దుఃఖభూయిష్టమగు సంసారమును (దేహాద్యభిమాన జాతమును) సుఖకరమని భావించి స్వస్వరూప విజ్ఞానలక్ష్యమందు సుఖిత్వ దుఃఖిత్వాది ద్వంద్వ విశిష్ట వ్యాఘ్రబుద్ధిని (అజ్ఞానమతిని) స్వీకరించి నానావిధకర్మలను శరములు ప్రయోగించుచున్నాడు. శరము లక్ష్యము ఛేదించునటుల కర్మకలాపము స్వరూపాత్మ లక్ష్యమును నాశముచేయుచున్నది. అనగా అజ్ఞానమతిచే నానావిధ కర్మసంచయమును చేయుచున్నాడు స్వరూపాత్మ జ్ఞానమును నాశముచేయుచున్నాడు. వెంటనే ఈశ్వరానుగ్రహముచే మహానుభావుల బోధయు వారల సేవచే తన నిజస్వరూపాత్మను కర్మరహితమని గోచరమాయెను. అయినను కర్మలనివార్యములగుటచే ఫలవంతములగుచున్నవి. కాబట్టి తనచే పూర్వజన్మ కర్మలు పుణ్యములు గాని పాపములు గాని తెలిసి గాని

తెలిసి యుగాని చేయబడినవన్నియు ఫలమును గలుగజేయుచున్నవి. అగ్నిని తెలియకతాకినను. తెలిసి తాకినను కాల్చుచున్నది. చేదుగల ఫలమును తెలిసి భక్షించినను తెలియక భక్షించినను చేదునొసగుచున్నది. అలాగున జలము వివేకుల యవివేకుల విషయమునను చల్లగా యున్నది. మధురమగుఫలము తెలిసిగాని తెలియకగాని భక్షింపబడిన దాని ప్రయోజనము తియ్యగానే యున్నది. అలాగున పుణ్యపాపములను తెలియవలయును. సర్వేశ్వరుడు సకలకర్మలకు ఫలదాత గనుక జీవులకర్మానుసారము ఫలమునొసగుచున్నాడు. అయితే ఇట్టి భేదముగలదు ఒకడు తెలియక బుద్ధిమాంద్యముచే ఇతరుల వస్తువులపహరించుచున్నాడు. ఆ చోరుడు తన బుద్ధిని మార్చుకొని పశ్చాత్తాపపడి న్యాయాధిపతిని శరణు జొచ్చుచున్నాడు. దయాళుడైన న్యాయాధిపతి ధర్మిష్ఠుడగుటచే యాచోరుని యధార్థమును యెఱింగి శిక్షను విధించుచున్నాడు. ఆ శిక్షనుభవమును సంతోషముతో యనుభవించునటుల చేయుచున్నాడు. అనేక సదుపాయములంగూర్చుచున్నాడు. తెలిసి ఇతరుల వస్తువపహరించు వానిని కఠినముగా శిక్షించుచున్నాడు. అనేక విధముల దుఃఖభాజనునిగా జేయుచున్నాడు. అలాగున సర్వేశ్వరుడు పక్షపాతరహితుడగుటచే తెలియక ప్రమాదవశముచే కర్మలజేయు వానిని మన్నించి సులభముగా ఫలితమునన్నుభవించునటుల జేయుచున్నాడు. తెలిసిచేయు వానిని మన్నించక శిక్షించు చున్నాడు. గనుక కర్మవిషయము నిర్ణయింప ఎవరికిని సాధ్యముగాదు. "గహనా కర్మణోగతిః" అని శ్రీకృష్ణభగవంతుడే చెప్పియున్నాడు. ఫలితార్థమేమన ప్రారబ్ధకర్మ తప్పక ఫలమునొసగును. అది వివేకముచే చేయబడినను అవివేకముచే చేయబడినను అవశ్యము ఫలమునొసగుచున్నది సందియములేదు. దీనికి ప్రమాణము,

శ్లో॥ అవశ్యం భావిభోగానాం, ప్రతీకారో భవేద్యతి।
తదాదుఃఖై ర్నలిప్యేః, రన్నలరామ యుధిష్ఠిరాః ॥

తా॥ తాజేసిన కర్మలకు ప్రతీకారము లేనందుచే శ్రీరాములు, నలమహారాజు, ధర్మరాజు అనేక దుఃఖముల జెందినారు. ధర్మరాజు నలమహారాజున్ను అక్షక్రీడ యందాసక్తులై, తమరాజ్యములను పోగొట్టుకొనిరి. ఈ యపరాధము బుద్ధిపూర్వకముగా చేయబడినది. దశరథమహారాజు రాత్రియందు ఏనుగు జలపానమునకై వచ్చినదని తలంచి ఋషి కుమారునిపై బాణమును ప్రయోగించెను. ఈ పాపకర్మ తెలియక జేయబడినది. శ్రీరాములు చెట్టుమరుగునే మంది

వాలిని సంహరించుటచే శ్రీ కృష్ణావతారమున వ్యాధునిచే కొట్టబడి నిర్యాణ కాలమున దేహము విడిచెను అని పురాణములు చెప్పుచున్నవి. ఇదియు బుద్ధి పూర్వకకృత కర్మయేయని తెలియవలయును. పాండు మహారాజు యరణ్యమున మృగరూపులై, మునులు. విహరించుచుండ వారిని మృగములని బాణముచే కొట్టెను. అందువలన నామహర్షులచే శప్తుడాయెను. ఇదితెలియని యపరాధము ఈలాగున కర్మ బలిమిని తెలియవలయును. ఇకను మాండవ్య మహాముని, యమధర్మరాజు మొదలైన మహానుభావులుగూడ ఈకర్మ విషయమున దృష్టాంతభూతులై యున్నారు. కావున కర్మలన్నియు పుణ్యపాప మిశ్రములగుటచే సుఖదుఃఖములు వచ్చుచున్నవి. వానిని విడనాడి సర్వదా స్వస్వరూప స్థితియందు శుక సనకాదులవలె నిమిషమునైన ఆత్మప్రజ్ఞ మరువక యుండువారు సకలకర్మరహితులై యుందురని తెలియవలయును. అదియుంగాక ప్రారబ్ధకర్మ మతిబలవత్తరమనియే చక్కగా విచారించి తెలిసికొని ప్రజ్ఞానఘన స్వస్వరూప పరబ్రహ్మమందు విహరించువారికి త్రిగుణములు, త్రివిధకర్మలు లేవని గ్రహించవలయును.

శ్లో॥ అవశ్యమేవ భోక్తవ్యం, కృతం కర్మశుభాశుభం।
కృతకర్మక్షయోనాస్తి, కల్పకోటి శతైరపి ॥

తా॥ తాజేయబడినట్టి కర్మకు కోటికల్పములకైనను నాశములేదు. కావున యాప్రారబ్ధకర్మననుభవించియే తీరవలయును. అది పుణ్యమైనను, పాపమైనను సరియే. అనుపటుల ప్రారబ్ధకర్మ మహాబలిష్టమయినది అదియే మలినమగు జన్మకారణము. సకల దుఃఖనిదానము సంసార చక్రభ్రమణ హేతువు అయినను హుతవహుండు సమస్తము దగ్ధము చేయునటుల స్వాత్మానుభవ ప్రజ్ఞానరూపులు సమస్తకర్మలను దహింపజేయుచున్నారు.

"జ్ఞానాగ్ని దగ్ధకర్మాణం, తమాహుః పండితంబుధాః అని భగవద్గీతయందును చున్నది" శ్రు॥ తద్యథేషికా తూలమగ్నౌప్రోతం, ప్రదూయేతైవం, హాస్య సర్వేపాప్మానః ప్రదూయన్తే॥ అనగా అగ్నియందు పడవేయబడిన సూక్ష్మ దూదిరాశి యంతయు దగ్ధమగు చందమున ఆత్మజ్ఞానియొక్క పాపపుణ్య సమస్తకర్మలు నాశమునొందుచున్నవి. ఇట్టి యుపనిషద్వాక్యరీతిగా మహాజ్ఞానులయొక్క ప్రారబ్ధకర్మసంచయము యనుభవింపబడుచు దగ్ధమగుచున్నది ఆమహాత్ములకు యేకర్మయును మిగిలియుండదని తెలియవలెను. ఎవని

అంతఃకరణమందు బాగుగా జ్ఞానాగ్ని ప్రజ్వలించుచున్నదో ఆట్టి మహానుభావుని బ్రహ్మతేజోమయమగు నంతఃకరణమందు సమస్త కర్మకాష్ఠములు దహించు కొని పోవుచున్నవి. ఒకమహాభవనము వహ్నిచే దహింపబడుచుండగా అందు లోనుండు పాతసామానులు క్రొత్తసామానులన్నియు కాలిపోవుచున్నలాగున సంసారాంతఃకంణమను జ్ఞానవితిహోత్రుడు ఆహుతి చేయుచుండగా సంచిత కర్మలుగాని ఆగామికర్మలుగాని యుండవు. ప్రారబ్ధముగూడ దహించుకొనియే పోవుచున్నది నిర్వికల్ప ప్రపంచాతీత దృశ్యరహిత బ్రహ్మజ్ఞానులకు మూడు విధములగు కర్మలు లేవనియే తెలియవలెను. అనగా పరబ్రహ్మమే జీవుడ నియు తానే ప్రపంచాతీత పరబ్రహ్మమనియు బాగుగా తెలిసి విచారించి నిశ్చయము జేసికొనిన స్వాత్మస్వరూపజ్ఞానులు సర్వదా స్వస్వరూప పరబ్రహ్మమందు విహరించుచు కేవల పరబ్రహ్మమయులై యున్నారు. ని ర్గుణ స్వరూప తత్త్వవేత్తలకు యేవిధ కర్మలుగూడ యొకానొకప్పుడును కొం చముగూడ సంభవింపనేరవు. సర్వకాల సర్వావస్థలయందును యీ మహాపురు షులు ప్రకృతి నిర్ముక్తులే. నిర్గుణ పరబ్రహ్మ స్వరూపులే ఇది సత్యము.

శ్లో॥ జీవబ్రహ్మైక్యరూపేణ, చిన్మాత్రమవధార్యతాం ।
తదానీం పరిశిష్టోహి, స్వాత్మబ్రహ్మైవ కేవలమ్ ॥

అనగా ఒకదృష్టితో జూచిన ప్రారబ్ధమున్నదనియు మఱియొకరీతి విచారించిన ప్రారబ్ధకర్మ లేదనియు తెలియవలెను. ఆయిన ఇటుల వచించుట పరస్పర విరుద్ధముగా యున్నటుల అర్థమగుచున్నది. ఉపాధిప్రతీతి కలుగుచుండిన ప్రారబ్ధ ప్రతీతియున్నదనియు అట్టిశరీరప్రతీతి ఎప్పుడును కలుగకనేయుండిన ప్రారబ్ధకర్మ లేదనియే సిద్ధాంతము. దీనికి గాఢనిద్రయను సుషుప్త్యావస్థయే దృష్టాంతము. దీనిననుసరించి బ్రహ్మజ్ఞానుల తరతమభావము గుర్తెరుంగవల యును. యీ విషయమువంతయు జ్ఞానులగు వారివారి బుద్ధినైపుణ్యమునను సరించి విచారణపాటవ ప్రావమభవ మహత్త్వమును గుర్తించి తెలిసికొనవల యును అంతయు బ్రహ్మమే మఱియెద్దియులేదు. పరిపూర్ణము నిర్వికారము అఖండము ఆదియునుంగాక విదిగించు వానిని నిద్రావస్థలోయున్న వానినిగాని స్వాప్నికుని స్వప్నావస్థలో నున్నవానినిగాను అటులనే జాగరూకుని జాగ్రత్ దశలోనున్నవానినిగాను తెలియవలెను. ఒకయవస్థలోనున్నవానికి మఱియొక అవస్థయొక్క సంబంధము వచింపసాధ్యముగాదు. అటుల వచించుట పరస్పర

విరుద్ధమగును. ఏకకాలమందు ఒకే ప్రదేశమున తమః ప్రకాశములుండవు. సర్వేంద్రియములతోగూడుకొని జాగ్రద్దశయందు మహాజాగరూకుడై సకలమును వ్యవహరించుచుండగా అట్టివానికి స్వప్నావస్థయున్నదనిగాని లేక మఱియొక యున్మాదవస్థ యున్నదనిగాని చెప్పుట అజ్ఞానమగును. అలాగున దీర్ఘసంసార తమస్సును నిద్రించువాడు నిద్రావస్థను పొందియున్నాడు. కొంచెము కొంచెము జ్ఞానవిషయక ప్రీతియుండిన స్వప్నావస్థలోనున్న వాడగును. బాగుగా అజ్ఞాననిద్రనుండి మేలుకొన్నవాడు ప్రజ్ఞాజాగరూకుడై స్వయంబ్రహ్మ వ్యవహారమును నిపుణమతితో చేయుచున్నాడు. మఱియు జాగ్రస్స్వప్నము జాగ్రన్నిద్ర జాగ్రత్. జాగ్రిత, జాగ్రత్ తురీయము అనునీలాటి మిశ్రావస్థలు నాలుగవస్థలననుసరించి పదునారు భేదములున్నవని తలంచనవసరములేదు. అవన్నియు జ్ఞానముననుసరించి చెప్పబడినవి. వస్తుతః విచారించిన జాగ్రద్దశలోనున్న వాని జాగరూకత్వమే వచింపవలయును. అటుగాక నిద్రాప్రసంగమునుగాని స్వప్నప్రసక్తినిగాని వక్కాణించినచో అప్పుడావస్థయె చెప్పదగియున్నది. అది జాగ్రద్దశ కానేరదు. అలాగున పరిపూర్ణజ్ఞానికి ప్రారబ్ధప్రసంగమున్నదని తోచిన అతడింకను పరిపూర్ణావస్థను పొందలేదని నిశ్చయించవలయును. కాబట్టి ఈదేహమునాది ఈపరికరములునావి ఇవి నేనుఅను అధ్యాసచే గలిగిన భేదబుద్ధిని విడనాడి తానాబ్రహ్మమేయని స్వస్వరూప నిష్ఠతోయున్న మహానుభావునకి ప్రారబ్ధకర్మలేదు. అతడు సర్వము నతిక్రమించిన పరిపూర్ణ బ్రహ్మజ్ఞానియగుచున్నాడు. మూలాజ్ఞాన జన్యాధ్యాసబలిమిచే దేహోపాధి తాదాత్మ్యజ్ఞానము గలుగుచున్నది. అందుచే నతడు మోహితుడై యనాత్మ పదార్థములయందు భ్రాంతిని వదలడు. కావున స్వస్వరూప జ్ఞానముచే దేహేంద్రియాదులందు భ్రాంతి తొలగి సర్వకర్మ నిర్ముక్తుడగుచున్నాడు. కేవలబ్రహ్మత్వస్థితిలో యున్నవానికి పరబ్రహ్మముతప్ప మఱియొకటి యుండదు. అట్టి కేవల పరతత్త్వ జ్ఞానములో విహరించువారలకు ప్రారబ్ధకర్మలుండవు. కేవల సచ్చిదానందస్వరూపులై యుందురు. ఇందులకు ప్రమాణము.

శ్లో॥ సమ్యగ్దర్శన సంపన్నః, కర్మభిర్నని బధ్యతే ।
దర్శనేన విహీనస్తు, సంసారం ప్రతిపద్యతే ॥

తా॥ సాక్షాద పరోక్షజ్ఞానము లెస్సగా గలిగినవాడు పుణ్యపాప మిశ్ర కర్మలచే బద్ధుడుగాడు. అట్టి సాక్షాత్ జ్ఞానము గలుగనివాడు కర్మభూయిష్ఠమగు

సంసారమున పడుచున్నారు.

శ్లో॥ ప్రియేషు స్వేషుసుకృతం, మప్రియేషుచ దుష్కృతం।
విసృజ్య ధ్యానయోగేన, బ్రహ్మాభ్యేతి సనాతనమ్ ॥

తా॥ బ్రహ్మజ్ఞాని తనకు ప్రియము గలుగజేయు వారియెడ పుణ్యమును అప్రియములయెడ పాపమునువదలి స్వస్వరూపాత్మ ధ్యానమహిమచే పరబ్రహ్మత్వమును పొందుచున్నాడు. పరిపూర్ణుడు. నిర్గుణుడు నిష్కర్ముడగుచున్నాడు. ఈసమస్త ప్రపంచమును మిథ్యగా దలంచి నేను నాది ఏవిది అను త్రివిధములగు అధ్యాసములులేక సర్వదా తాను విజ్ఞానావస్థయగు స్వస్వరూప జ్ఞానమందే యుంటున్నాడు. ఇదియే జీవన్ముక్త లక్షణము. అదియుంగాక స్వప్నములో తాను గాంచిన దేహమునుగాని దేహమునకు సంబంధపడిన భోగ్య పదార్థములనుగాని మేల్కాంచిన తర్వాత సత్యములు గావని వాటిని తలంచుచున్నాడు. శరీరము దానికి సంబంధించిన భోగ్యరూప దృశ్యము మనః కల్పితమే. అజ్ఞానముచే తనే భాసించినది. సత్యముగా తోచెడివి వస్తుతః నిజముగాదు. అని తెలియుచున్నాడు. అట్టి జాగ్రదవస్థారూప వివేకముచే ప్రమత్తుడు గానందుచే నిజమును తెలిసినవాడగుటచే స్వప్నమనః కల్పిత శరీరభోగ్య పదార్థములయందును ఈ శరీరాదులు నేనని తలంచి అహంకారమతితో కర్తృత్వమును వహించిగాని ఇవన్నియు నావి అనుమమకారమును స్వీకరించిగాని ఇవి వానివి వీనివి అనుభేదము నావహిల్లిగాని మెలంగడు. జాగరూకుడు సదా స్వాప్నిక వస్తువులపై విరతిమానియై నిరహంకారియై కర్తృత్వ భోక్తృత్వాది భావములచే వర్జితుడై యున్నాడు. అలాగున అజ్ఞానబలిమిచే సత్యముగా తోచుచున్న విచారణ దశయందు మిథ్యాభూతములగు శరీరమువందును దానికుపయోగపడు భోగ్యరూప దృశ్య పదార్థముల యందును అజ్ఞానరహితుడగు నాత్మవివేకి సంసార దుఃఖ సమ్మిశ్రితమో మయావిద్యా సుషుప్తిమంది బాగుగా మేలుకొన్న వాడగుటచేతను జ్ఞాననిష్ఠయందు తొలంగని వాడగుటచేతను నిరావరణ బ్రహ్మమందు విహరించువాడగుటచేతను జాగ్రదవస్థయందునుగూడ దాటిన తురీయావస్థలోయున్నవాడగుటచేతను దృశ్యవస్తువులందు సత్యత్వబుద్ధినుంచుటలేదు. స్వప్నావస్థవలె జాగ్రదవస్థయున్న సంకల్పమాత్రమే. అంతఃకరణ విజృంభణమే మాయామోహమేయని తలంచుచున్నాడు. సర్వాతీత సర్వసంకల్పరహిత నిత్య నిర్మల జ్ఞానసమాధి యందుంటున్నాడు. కావున దృశ్యములను శరీర

మందుగాని తదుపయుక్తములగు భోగ్యపదార్థములందుగాని నేను వాని వాని సంబంధము నాకుగలదు వీనికి సంబంధించినది అను అజ్ఞాన కల్పితములయిన అహంకార మమకార సంబంధభావములను చేయను. ఈ దృశ్యము నేనుగాను నాకు సంబంధించినదిగాదు అది నాకులేదు. అను త్రివిధ అధ్యాసములకు దూరుడై నేను సర్వదృశ్య రహితమగు సచ్చిదానందామృతమయానందమయ ప్రజ్ఞానఘన పరబ్రహ్మను. నాస్వరూపము నిత్య శుద్ధ బుద్ధ ముక్తత్వము పరిపూర్ణత్వము నిర్వికల్పత్వము నిర్వికారత్వము అఖండత్వము నాకు సంబంధించియున్నది. నేను పరబ్రహ్మము అపరబ్రహ్మము నేనై యున్నందుచే నాకు భిన్నవస్తువులేదు. అను అఖండ తత్త్వములో యుంటున్నాడు. సర్వదా అజ్ఞాననిర్ముక్త తేజోరూప జాగ్రత్తతో స్వాత్మవివేకి యుంటున్నాడు. సర్వదా ఆ మహానుభావుడే కైవల్యపదవిహారి యగుచున్నాడు. సర్వాభిమాన వర్జితుడై విజ్ఞాని స్వస్వరూపముతో యుంటున్నాడు. ప్రమాణము.

శ్లో॥ నిరాలంబం సమాశ్రిత్య, సాలంబం విజహాతియః।
సనన్యాసీచ యోగీచ, కైవల్యం పదమశ్నుతే॥

తా॥ నిరాలంబమగు పరబ్రహ్మమునాశ్రయించి సాలంబమగు జాగ్రదాదియుక్త ప్రపంచభావము విడనాడిన యాత్మవేత్తయే సన్యాసియోగివరుడు కైవల్య పదము నధిష్ఠించినవాడు.

శ్లో॥ జోత్స్నాయం సుప్రభాయాంచ, భాస్వన్త్యాంనై వసంగతిః।
తమసస్తు తథాజ్ఞేయం, జ్ఞానమజ్ఞాన వర్జితం॥

తా॥ పూర్ణిమ పండువెన్నెలలోను బాగా ప్రకాశించుచున్న యెండలోను చీకటి యొక్క ప్రసంగములేని విధమున స్వస్వరూప కాంతియందును స్వప్రబోధ జ్ఞాన తేజస్సునందును అజ్ఞాన ప్రసక్తియేలేదు. జ్ఞానమనగా అజ్ఞానము లేనిది కావున జ్ఞాని మిథ్యావర్జితుడై సత్యాత్మయందుంటున్నాడు. అనగా దృశ్యమసత్యమని బాగుగాదెలిసి ఆత్మస్వరూపానుసంధానముచే సత్యపరబ్రహ్మ ప్రబోధముగల విజ్ఞాని సదా అమృతమును త్రాగుచున్నాడు. విషమును గోరునటుల సర్వదా పన్నీరుచే స్నానముచేయువాడు బురదనీరు గోరునటుల సదా అఖండ సామ్రాజ్యాభిషిక్తుడు భిక్షమెత్తుటకు గోరునటుల దేవలోకనివాసి నరక ప్రవేశము వాంఛించునటుల సర్వదా అంతరిక్షాకాశమున విమానములో సంచరించువాడు పాదములతో భూసంచారము గోరునటుల దివ్యప్రసాదమును విహరించు

వాడు కంటకావృతారణ్య గమనమును గోరునటుల మలినమయ అనృతమయ జడభూత దుఃఖ సమ్మిశ్రిత దృశ్యమందు వాంఛను ప్రమాదమునకైనా యుంచడు ఇటుండగా సదానిర్వికల్ప పరబ్రహ్మమందు విహరించువాడు అసత్య ప్రపంచ ప్రసంగమునుగూడ చేయడు. ఆమహానుభావునికి ద్వితీయవస్తు ప్రతీతియులేదు ఇటుండగా ప్రపంచమును సత్యమని యెటులసమర్థించును ఆత్మస్వరూపవిజ్ఞాని బురదయందువలె సంసార పంకిలయందు మనసు నిడునా. భోగ్యపదార్థముల స్వీకరించునా? కావున ఆత్మవివేకి దృశ్యమును పరిత్యజించి దృశ్యాతీతస్థితిలో యుంటున్నాడు. వాని స్వరూపము దృశ్యప్రపంచరాహిత్యమే యగుచున్నది. అటుగాక అసత్యప్రపంచమందు సంసారవాసనలయందు ప్రవర్తించుచుండిన అతడు వివేకిగాడు. నిద్రలోయున్నవాడు కలవరించు మాదిరి బాహ్యవివేకియై వేదాంత ప్రలాపములుజేయుచు అజ్ఞానము పూర్తిగా నాశముగానివాడగుచున్నాడు ఇంకను అజ్ఞాననిద్రియందున్నవాడగును. పరిపూర్ణజ్ఞానికాడు. భిక్ష వృత్తితో మలిన జీవనముతో నున్నవాడు రాజవృత్తితో అఖండసుఖముతో నున్నవాడని చెప్పవీలుగానియటుల మలిన వాసనలతో విషయ సుఖదుఃఖముల ననుభవించు వాడు భోగి యోగియు కానటుల రోగి ఆరోగ్యవంతుడు కానటుల ఆత్మసుఖా నుభవి యగుజ్ఞానికాడు. మరేమనిన విషయ సుఖముల విహరించుమలినవృత్తి దేయని వచింపవలయును. కావున ఆత్మవిజ్ఞాని నిద్రాప్రబుద్ధిని మాదిరి అజ్ఞాన ప్రబుద్ధుడై సమస్తమును పరిత్యజించి స్వాత్మపరబ్రహ్మమందు విహ రించును. ఆనందించును. ఈలాగున పై విచారముచే పరబ్రహ్మజ్ఞానులేలాటి విషయ వాసనలేని వారనియు అసంగులనియు, ప్రసన్నులనియు, అఖండ పరి పూర్ణులనియు తెలియవలయును. ఇట్టి అనుభవముగలవారే పరిపూర్ణజ్ఞానులగు చున్నారు. అటుగాక మాలిన్యమతులై కేవలపరబ్రహ్మమయులమనివచించుచు వేదాంతోక్తులాడువారు తమ అజ్ఞాన సంతతిని సృంఖలాబంధమును త్రెంపిన వారుగారు. వారు ఆత్మహింసకులనియు శాస్త్రములు నిరూపించుచున్నవి. ప్రమాదములో బడకుండుటకై ఇట్టి యుపదేశములు వేదములుచేయుచున్నవి. సూర్యునియందేలాటి మాలిన్యములేనటుల అగ్నియందు పావనత్వము వినా, అపవిత్రత లేనటుల చంద్రునియందుష్ణత్వముండనటుల జ్యోతియందు తమస్సు లేనటుల స్వచ్ఛజలమందు పంకిలత్వముండనటుల గంగానదియందు పాపము లేనటుల గగనమందు పరిచ్ఛిన్నత్వము సంభవించనటుల సర్వేశ్వరునియందు

పక్షపాతము పోవగనటుల ధర్మాత్ములయందధర్మము ప్రవేశించవటుల ప్రజ్ఞా వఘన విర్మలాత్ములగు పరిపూర్ణ జ్ఞానులయందు క్షణికవిషయ దోషములుం దనేయుండవు. అనాదిసిద్ధ తమోమాలిన్యములు ప్రవేశించవు. అటుగాక యుం డినవారు ప్రజ్ఞానఘన పరిపూర్ణస్థితిని పొందలేదనియే తెలియవలయును. కావున పరబ్రహ్మస్వరూపులు పరబ్రహ్మలక్షణోపేతులై యుందురు. ఇది ముఖ్యాభిప్రాయము. జ్ఞానులు అజ్ఞానులుగను, సుఖవంతులు దుఃఖితులుగను, పుణ్యము పాపముగను, శీతలముఉష్ణముగను, అగ్నిచల్లగను ప్రకాశము చీకటి గను తృప్తుడు బాధితుడుగను విముక్తుడు బద్ధుడుగను యెన్నటికిని సిద్ధింపదు. అట్టి వ్యవహారమే చేకూరదు. అలాగులనే అజ్ఞానావస్థలో యున్నవారిని చీకటి లోయున్నవారిని వెలుతురందున్నారనునదివలె సర్వదా యసంభవము. కావున స్వాత్మజ్ఞాన మహానుభావుల విషయమీలాగున తెలివయవలయును. ఆ మహా త్ములు సర్వదా అలిప్తులు, విర్దోషులు విరీహులై యున్నారు. సచ్చిత్సుఖస్వరూ పముతో వెలుగొందుచున్నారు. గనుక సూర్యునందుచీకటుండనటుల జ్ఞానినందు అజ్ఞానములేదు. మఱియు ఆరూఢుడగు బ్రహ్మజ్ఞాని విరంతరము పరబ్రహ్మ ప్రజ్ఞాదృష్టియందు యోలలాడుచుండును. స్వస్వరూపముతో యుండుచు ఆ యాత్మవేత్త పరబ్రహ్మమును వినా దృశ్య పదార్థమెద్దియును గాంచదు. పర మాత్మ భావనాధి రూఢుడై యనాత్మభావనలు మఱచినవాడై సర్వమును విడిచియుండును. భోజనాదుల యందును, పరుల గౌరవాగౌరవాదులయందును కాలకృత్యములు తీర్చుసమయమునను తనయొక్క స్వరూపాత్మ ప్రజ్ఞనుండి జారిపోక పరబ్రహ్మమందే యుంటున్నాడు. పరబ్రహ్మమువలె వ్యాపకత్వ భావముతో పరబ్రహ్మమే తానై యున్నాడు. బాలుడు ఆకలిబాధనుకూడ విడిచి క్రీడించువిధమున పరబ్రహ్మమందేవిహరించుచున్నాడు. తనకు జ్ఞాపకమునకు వచ్చినప్పుడు బాలుడెటులాహారముల సేవించుచున్నాడు. అలాగున తనకు స్మరణకు వచ్చినప్పుడు భోజనాదికార్యములందు ప్రవర్తించుచున్నాడు. అయి నను తనస్వరూప ప్రచ్యుతిలేకనేయున్నాడు. స్వప్నపదార్థముల నసత్యములని తలంచినను అవి స్మరణకు వచ్చులాగున భోజనాదులను దృశ్యములగుటచే తథ్యముగాక పోయినను యుపాధి యున్నందుచే స్మరణకు వచ్చినప్పుడు వానిని సేవించుచున్నాడు. తన స్వరూపమునమండియే సమస్తమును బ్రహ్మ ముగానే తలంచును. అనగా పరబ్రహ్మమందుండు జ్ఞాని విరంతరము బ్రహ్మ

తర వస్తువును తలంచినటుల భోజనాదులయందును ఆత్మభావనా రూఢుడై రుచి అరుచుల తెలియక సర్వాతీతుడై యున్నారు. పరమాత్మజ్ఞానికి ఏదానియందు నపేక్షగాని యుపేక్షగాని యుండదు. మఱియు దేహము కర్మచే నిర్మితమగుచున్నది. అంతఃకరణ పుణ్యపాపములచే సూక్ష్మదేహము గలుగుచున్నది. అనేక జన్మములలోను యనువర్తించుచున్నది. అకర్మఫలితానుభమునకై స్థూల దేహమువచ్చుచున్నది. ఆ రెండుదేహములకు అజ్ఞానకారణముండుటచే కారణ శరీర ముత్పన్నమగుచున్నది. కావున దేహము కర్మత్రయ నిర్మితము ప్రారబ్ధకర్మ స్థూలదేహమునాశ్రియించి సంచితాగమములు అంతఃకరణము నాశ్రియించి యున్నవి. కనుకనే అంతకరణ పారిశుద్ధ్యముచే జ్ఞానులకు సంచితాగాములు నశించుచున్నవి. శరీరముతోపాటు ప్రారబ్ధకర్మ నాశమగుచున్నది. ఇందుచే కర్మరచితమగు దేహమునకు ప్రారబ్ధకర్మ సంభవమగుచున్నది. శరీరమందున్న యాత్మకు జలములో ప్రతిబింబించిన ప్రతిబింబమునకు పంకిలము లేనటుల కర్మసంబంధములేదు. సర్వకర్మసాక్షియై అంతరాత్మయున్నది ఆత్మఆదిమధ్యాంతములు లేనిదగుటచే శాశ్వతము కనుక అనిత్యమగు ప్రారబ్ధకర్మ వ్యవహారము నిత్యాత్మకు సమంజసముగాదు. మఱియు ఆత్మకర్మనిర్మితముగాదు. సర్వకర్మ కలాపములకు సాక్షియై ఇంద్రియాతీతమై యున్నది. నిష్కర్మి నిష్క్రియము నిశ్చలమగు పరమాత్మ జీవునకు ఉపాధిగత ప్రారబ్ధకర్మగాని మరియే కర్మగాని లేవు. ఉన్నది నిరుపాధికము ఆత్మయొకటియే. ఏవస్తువు దేనిచే నిర్మితమో నిర్మాణ కారణభూతమయినదే కార్యమందుంటున్నది. దేహము కర్మనిర్మితముగనుక కర్మదేహగత ధర్మమగుచున్నది. యాశరీరమునకే యాకర్మయు సంభవించుచున్నది. ఆత్మ దేనిచేతను నిర్మితముగాదు. కావున దానికేకర్మయు లేదు. జనన మరణ రహితమాత్మవస్తువు. అజము. నిత్యము శాశ్వతము. అనాదిఅవ్యయము. అరూపము. అచలము. ఆత్మకర్మరహితమని నిరూపించినందుచే జ్ఞానులు ప్రారబ్ధాది కర్మరహితులు పరబ్రహ్మస్వరూపులని యెఱుంగవలయును.

మఱియు ప్రారబ్ధకర్మనే అజ్ఞుల సందేహనివృత్తికై విచారించి నిరాకరించవలెను. వేదవాణి ఆత్మవస్తువు జనన మరణరహితము నిత్యము. శాశ్వతమని యుద్ఘోషించుచున్నది. వేదము వ్యర్థప్రలాపము జేయునదిగాదు. వేదవాక్యము సత్యమునే తెలుపుచున్నది. అమోఘవాక్కు ప్రయోగించినందుచే

అట్టి పరమసత్యమును గ్రహించనివారు వ్యర్థప్రలాపులై సంసారగర్తమున నిరంతరము పడియుందురని భావము. కావున సత్యస్వరూప పరమాత్మ రూప ముతోనున్న జీవునకు జీవాత్మ పరమాత్మయేయని స్వస్వరూపస్థితిలో యున్న వానికి ప్రారబ్ధకల్పన సంభవించనే సంభవించదు. అటుల ప్రారబ్ధవాహోయుక్తి వేద విరుద్ధము శాస్త్రప్రతికూలము అనుభవసూన్యమైన వాక్కు యుక్తియుక్త ముగాదు. మఱియు నీతిదూరమైనది "అజోనిత్యశ్శాశ్వతః" ఈ వాక్యమునే ఉపనిషత్తు చెప్పుచున్నది. భగవద్గీతయు గ్రహించి ఆత్మనిత్యత్వమును ప్రతి పాదించుచున్నది. ఇందుచేతను ఆత్మ సకర్మాతీతమనియు తెలియవలయును. అట్టి మహాజ్ఞానులు సకలకర్మరహితులని భావము.

శ్లో॥ జనన మరణ శూన్యం, భావగమ్యం విశుద్ధం।
నిరుపమ మనవద్యం, నిష్క్రియంయే భజన్తే॥
సతతమ మరమూర్తిం, సాధుగమ్యం నిరీహం।
నిఖిలి నిగుణసాక్షిం, తత్స్వరూపం ప్రయాన్తి॥

తా॥ ఈలాగున కర్మరహితులు కర్మరహిత పరబ్రహ్మమునేపొంది విజ్ఞానులగు చున్నారు. పరపూర్ణచంద్రునియందు కళంకమున్నటులయు గగనమందు నీల రూపత్వమున్నటులయు విశుద్ధజ్ఞానులయందు ప్రారబ్ధమును కల్పించిచెప్పుదురు పరిపూర్ణచంద్రునియందలి కంళకము కళంకముగాదు. భూచ్ఛాయక్రిందనున్న వారికాలాగున భాసించుచున్నదని తత్వజ్ఞులు చెప్పునటులయు ఆకాశమందు శ్యామత్వమసిద్ధమగునట్లును సర్వదా బ్రహ్మాత్మజ్ఞానులకు ప్రారబ్ధమసిద్ధమయ్యే యున్నది. ఈ ప్రారబ్ధభావము కొందఱిని ఉన్నత దశనుంచి తొలగించు చున్నది. కావున

శ్లో॥ ప్రారబ్ధమపి సన్త్యాజ్యం, దృఢచిత్తోభవాత్మని।
తదేవకిలవిజ్ఞానం, తదన్యత్ మోహజంభవేత్॥ ఆర్యులు చెప్పినారియురు

తా॥ జ్ఞానులు యథార్థమును తెలిపి స్వప్రయత్న సోపానాధి రూఢులై మోక్ష ప్రసాదమున విహరించుచున్నారు. ఇట్లు చక్కగా విచారించి సర్వదా స్వతస్సి ద్ధమైన పరమాత్మయందున్న వారికి అసిద్ధమైన ప్రారబ్ధకర్మ సిద్ధముగాకనే పోవుచున్నది. అనిత్యమైనదియును ఇంద్రియాది జన్యమైనదియును అగు ప్రారబ్ధకర్మ దేహము నాశ్రయించియున్నది. ఆత్మకులేదు కనుక తత్పర మాత్మరూపులకును ప్రారబ్ధకర్మగూడ లేదని భావము.

శ్లో॥ శాస్త్రైర్జనశ్యేత్ పరమార్థదృష్టిః॥
కార్యక్షమం నశ్యతి చాఽపరోక్షాత్।
ప్రారబ్ధ నాశాత్ ప్రతిభాననాశ॥
ఏవం త్రిధానశ్యతి చాత్మమాయా॥

తా॥ జగత్తు సత్యమనునది శాస్త్ర విచారముచేతను అపరోక్షజ్ఞానముచే కార్య సమర్థమనస్సు ప్రారబ్ధనాశముచే దృదశ్యమును నాశమొందుచున్నవి. కనుక జ్ఞాన సంపన్నునకు ప్రారబ్ధకర్మ మాయ లేదని ఉపనిషత్తు చెప్పుచున్నది. సర్వానర్థమునకు దేహాత్మభావము మూలము. అనాత్మదేహముతో తాదాత్మ్యము నొందుటయే ప్రతిభానభూత ప్రారబ్ధకర్మ మూలకారణమని తెలియవలెను. ఆశ్రియమే లేకుండిన ఆశ్రయించువస్తువు నిరాధారమగును. కాన అనాత్మ భావనయే దేహమునుత్పత్తి చేయుచున్నది. అదియే సంసారకారణము. దేహాత్మభావన తోడనే జీవుడు కర్మిష్టియగుచున్నాడు. కర్మఫలానుభవమునకు కర్మలు శరీరమునాశ్రియించుచున్నవి. ఇట్టి అసత్యమగు సంసారహేతువగు దేహాత్మభావనవలన ప్రారబ్ధకర్మ సిద్ధించుచున్నది. తాను శుద్ధచైతన్యరూపుడు అనిత్యాశుభ మలమూత్ర పురీషమగు దేహము కానందుచే అట్టి దేహాత్మ భ్రమ సర్వశాస్త్రములంచే నిషేధింపబడియున్నది. దేహాత్మభావన మహర్షి జనసమ్మతముగాదు. యుక్త్యనుభవములచే సిద్ధమగునదికాదు. ఇంద్రియ గోచరమగు దానినే సత్యమని నమ్మువారు భ్రాంతులు చక్కగా విచారించి నిజము కనుగొనవలెను. దేహము నిత్యమైనచో ప్రారబ్ధకర్మగూడ సత్యమేయగును. శరీరమనిత్యము తదాశ్రిత ప్రారబ్ధము కలవంటిది. కావున దేహాత్మ భావప్రయుక్త ప్రారబ్ధకర్మను పరమాత్మభావనచే సిద్ధమైన స్వస్వరూప విజ్ఞానముచే ధ్వంసమొనర్చవలెను. ఇట్లు వేదమువచించుటచే స్వస్వరూప జ్ఞానసిద్ధులకు దేహాత్మభావము శూన్యమైనందున ప్రారబ్ధకర్మయే లేదని ఫలితార్థము. సర్వానర్థములకు దేహాత్మభావనయే మూలము. ఆత్మకు ప్రారబ్ధ కల్పన సంభవింపదు. దేహమునకు ప్రారబ్ధకర్మయున్నదని ఇంతవరకు అజ్ఞులదృష్టికని తెలియవలెను. దేహమస్థిరమగుటచే ప్రారబ్ధకర్మను దేహమునకుకల్పించుట భ్రాంతియే అజ్ఞానజన్యమగునది శరీరము. అజ్ఞానమే అభావము. కాన శరీరము సత్యము కానప్పుడు తదాశ్రిత ప్రారబ్ధకర్మయు అసత్యమే. ప్రారబ్ధవ్యవహారమంతయు భ్రాంతియే. అజ్ఞానమనియే తెలియవలెను. శరీరమసత్యము. తత్స్థప్రారబ్ధము

గూడ అస్థిరమని దృఢమైనది. శరీరమే మొట్టమొదట తనయందు అధ్యస్తమాయెను. మరల ఆదేహమందు ప్రారబ్ధకర్మ ఆరోపితమయ్యెను. ఆరోపింపవలసిన శరీరము నిజము కానప్పుడు మరల దానియందు కల్పింపబడిన ప్రారబ్ధకర్మ సత్యము కాజాలదు. అనగా త్రాటియందు పాము కల్పింపబడెను. తిరుగా ఆపాము కఱచెను. అను విషయము తథ్యమగునా? అటుల సంభవించునా? జగత్తునందు కుందేటికొమ్ము లేకపోగ శశవిషాణము యొక్క గంధము వ్రాణములను మూన్పెను. అనువిషయము తథ్యమగునా? అటుల మిథ్యాభూత శరీరమందు ప్రారబ్ధకర్మ కల్పితమాయెను. ఈ కల్పిత కర్మకు సృష్టి స్థితులు సంభవింపవు. అనగా ఈకర్మ దేనియందును నభూతోనభవిష్యతి. కనుక పరబ్రహ్మమొక్కటియేయున్నది. తదితర దృశ్యమేదియు లేనేలేదు. కావున ప్రారబ్ధకర్మయు లేనేలేదు. ఒకప్పుడుండి మరియొకప్పుడు లేనిదానికి త్రాటియందు పామువలె సృష్టిస్థితిలయములుండును. లేనేలేని ప్రారబ్ధకర్మకు సృష్టిలయములు లేవని పరమార్థ సిద్ధాంతము కాబట్టి ప్రారబ్ధకర్మయేలేదు. కావున తనకు బంధమోక్షములుకాని సుఖదుఃఖములుగాని లేవు. తాను సర్వదా పరబ్రహ్మస్వరూపుడై యున్నాడు. ఇదియే విజ్ఞానమని తెలియవలెను. మఱియు జ్ఞానమనునది సత్తవస్తువు. జనన మరణ రహితము తాను పరమాత్మయని తెలిసి తద్రూపుడగుటయే విజ్ఞానము దీనిచే అనాత్మభావన సకల దృశ్యప్రతీతి అజ్ఞానము తత్కార్యమగు సంసార దుఃఖమునశించుచున్నది. శేషము పరబ్రహ్మమే తాను పరబ్రహ్మముకాగా దేహమే పుట్టలేదు. లేనట్టి దేహమునకు ప్రారబ్ధకర్మ యెటుల సంభవించును. ఈ విజ్ఞానావస్థలో పర బ్రహ్మముతప్ప ఇతరమేదియు భాసింపదు కాన శరీరప్రారబ్ధ కర్మల సత్యములు కేవల పరబ్రహ్మమే సత్యవస్తువు.

వ్యవహారదశయందు దేహాదులవలె ప్రారబ్ధకర్మయున్నదను పక్షము నాశ్రయించి ప్రారబ్ధకర్మ అజ్ఞులసందేహ నివృత్తికై కల్పింపబడినదని వేదము చెప్పుచున్నదనియును అర్థవాదమనియును గ్రహింపవలయును. మహాజ్ఞానులకు సర్వకర్మ నివృత్తిని అనేకోపనిషత్తులు ప్రతిపాదించుచున్నను ప్రారబ్ధకర్మ శరీరోపాధియున్నంతవరకు భాసించుచున్నదను యొకపక్షము ఆ వేదములలోనే యున్నది. దాని తాత్పర్యము తెలియవలయును. తత్త్వవిచారణ జేసిన ప్రారబ్ధకర్మను పాతముగా దేహము వచ్చుచున్నది. కర్మయే లేకుండిన శరీర

స్థితియు మందదుగదా. పూర్వకృత సుకృత కర్మరాశిచే జ్ఞానార్జనయోగ్యమగు శరీరము వచ్చుచున్నది. "శరీరంమే విచర్షనం" అను వేదమంత్రము పై విషయమునే తెలియపరచుచున్నది. కావున ప్రారబ్ధ కర్మయే దృఢకాయమునకు హేతువు. గనుక ప్రారబ్ధకర్మ శేషమున్నందుచేతనే ఉపాధి నిలిచియున్నదని సమర్థించువారి విషయమై కర్మలేకపోయిన శరీరము నిలవదను సందేహించు వారి విషయమై ఉపాధియందు సుఖదుఃఖములున్నంతవరకు ప్రారబ్ధకర్మ యుండియే యున్నదని వేదముగూడ చెప్పుచున్నది శ్రుతివాక్యమును విచారించిన "అజో నిత్యశ్శాశ్వతః" ఇత్యాది మంత్రములు అద్వితీయ పరబ్రహ్మమును తెలుపుచు తత్స్వరూపులకు ప్రారబ్ధకర్మ భావము లేదనియే సిద్ధాంతీకరించుచున్నవి. కావున మందబుద్ధుల విషయమై యదార్థమును తెలియుట కశక్తుల విషయమున ఉపాధిభావమున్నంతవరకు ప్రారబ్ధమున్నదని వ్యవహారదృష్టితో శ్రుతితెలిపినది. యదార్థముగ విచారించిన ప్రారబ్ధకర్మయె లేదు. ఉపాధిచే భాసించినను ఆప్రారబ్ధకర్మ వారికి సుఖదుఃఖముల గలుగజేయదు. తనయొక్క పరమ శాంతికి జ్ఞానమునకు అటంకమురాదు. తనయొక్క అద్వితీయత్వమును మరువక తత్స్థితిలో యుంటున్నాడు. అఖండ విజ్ఞానుల సంశయ విషయమున ప్రమాణము

శ్లో॥ భేదాభేదౌ సపదిగళితౌ, పుణ్యపాపే విశీర్ణే ।
మాయామోహౌ క్షయముపగతౌ, నష్టసందేహవృత్తి ।
శబ్దాతీతం త్రిగుణరహితం, ప్రాప్యతత్త్వావబోధం ।
నిస్త్రైగుణ్యే పథివిచరతాం, కోవిధిః కోనిషేధః ॥

తా॥ భేదాభేదములు మాయామోహములు సకలసందేహములు నశించి శబ్దాతీత పరబ్రహ్మను పొందిన త్రిగుణ రహితులకు విధినిషేధములు అనగా సుఖ దుఃఖములు ప్రారబ్ధకర్మ విచారము సనిలేదు. వారు కేవల బ్రహ్మానుభవులయి యుందురు. గనుక అట్టి అద్వితీయ పరబ్రహ్మమెట్టిదనగా పరిపూర్ణ మంతట నిండియున్నది. అపారసముద్రము నియటను లోపలను జలపూరితమగువటుల బ్రహ్మము అమృతముచే పరిపూర్ణము చైతన్యముచే పరిపూర్ణము ఆనందముచే పరిపూర్ణమై సర్వవ్యాపకమై దేశకాలాది పరిచ్ఛిత్తి రహితమై అఖండమై యున్నది. అందువల్లనే పరబ్రహ్మము అమృతమయము, ఆనందమయము, చిన్మయము, పరిపూర్ణము, సర్వవ్యాపకము, అఖండము, అపరిచ్ఛిన్నము. అది

యుపనిషత్తులు పలుకు చున్నవి. అనాద్యంతము ఆది అంతములులేనిది. అనగా బ్రహ్మవస్తువునకు ఆది మధ్య అంతములు లేవు. బ్రహ్మమునకు ఇదిమొదలు ఇది మధ్య ఇది అంతము నని చెప్ప సాధ్యముగాదు ఆ పరవస్తువు సర్వకాలాతీతమై, సర్వదా అనిర్వాచ్యమైయున్నది. ఆదిమధ్యాంతములు మాయకుగలవు ఆ మాయ తెలియనప్పుడుంటున్నది. జ్ఞానోదయమైన వెంటనే మాయ మాయ మగుచున్నది.

శ్లో॥ అవ్యక్త్య దీనిభూతాని, వ్యక్తమధ్యాని భారత ।
అవక్తని ధనాన్యేవ. తత్రికా పరిదేవనా ॥

అని భగవద్గీత తేటపరచుచున్నది. కావున సర్వ బ్రహ్మవస్తువు మాయకు పర మయినది. "తమసః పరస్తాత్, తమసస్తు పారే" అని స్మృతి శ్రుతివాక్యములు రెండును సర్వ మాయాతీతము పరబ్రహ్మని ప్రతిపాదించుచున్నవి. అనంత పదమునకు నాశమనియు యర్థమున్నందుచే ఆ పరబ్రహ్మము అంతము లేనిది నాశములేనిది. శాశ్వతము నిత్యమని అర్థము.

అంతమనగా హద్దుయని అర్థమున్నది. గనుక ఆ పరవస్తువు అనంతము హద్దులేనిది పరబ్రహ్మము. అనంతమై నిరవధికమై యున్నది. అనిర్విషయ పరబ్రహ్మము అప్రమేయము దేనికిని ప్రమాణమునకుగూడా గోచరముగానిది లోకమున సిద్ధించని వస్తువుల ప్రత్యక్షాది ప్రమాణములచే సిద్ధింపజేయుచున్నారు. ప్రమాణములు ఇంద్రియగోచర వస్తువునే తెలుపుచున్నవి. కావున పరబ్రహ్మము సర్వసిద్ధమయ్యే యున్నది. ప్రమాణములకును గోచరముగానిది సమస్త వస్తువులను విషయముచేయుచున్నది. పరమాత్మదానిని విషయీకరించుచున్నది. గోచరింపజేయునది మరియొకటిలేదు. అందుచే ఆ పరబ్రహ్మము ప్రమాణాతీతమై సకలేంద్రియాతీతమై యున్నది.

మరియు చక్షువులమీద అంగుళిని యుంచినప్పుడు ఆ స్వల్పావరణచే నేత్రమచ్ఛాదితమగుచున్నది. అందుచే బ్రహ్మాండవర్తియగు సూర్య ప్రకాశమగపడదు. నేత్రములపైనున్న అంగుళిని దూరీకరించిన అనాయసముగా సూర్యప్రకాశమగపడుచున్నది. అట్లు సాక్షియగు యాత్మకుపాధియగు అంతఃకరణము ఆత్మనే యాచ్ఛాదించినందు చేతనే సర్వత్ర పరిపూర్ణమైయున్న పరబ్రహ్మము కనబడదు. అహంబ్రహ్మాస్మి అను వృత్తి జ్ఞానముచే అయావరణము(మరుపు)భంగమగునప్పుడు అనాయసముగా బ్రహ్మముగనపడుచున్నది

అప్పుడే గృహగత ఆకాశముయొక్క అసంగతా విజ్ఞానముచే మహాకాశము యొక్క అసంగతాది జ్ఞానన్యాయమున సర్వత్రమందు పరిపూర్ణ బ్రహ్మము నకు అంతఃకరణ స్థితమయిన ఆత్మతో అభేదము తెలియబడుచున్నది. గృహా కాశము గృహము పోగానే మహాకాశములో కలియునటుల అంతఃకరణోపాధి తొలగగానే అందున్న ఆత్మ పరబ్రహ్మముతో గలియుచున్నది. అప్పుడాత్మ వస్తువు తనయొక్క ప్రకాశమందు అన్యప్రకాశము యొక్క ఆపేక్షలేనిదై సర్వమునకు ప్రకాశమై స్వయంప్రకాశముగానున్నది. ఎచ్చట విషయముతో వృత్తికి సంబధముగునో అచ్చట ప్రత్యక్షజ్ఞానమని చెప్పబడుచున్నది. ఆ ప్రత్యక్ష జ్ఞానమునకు విషయవృత్తి సంబంధము కారణము. ఆలాగున అహం బ్రహ్మాస్మి యను విశుద్ధాంతఃకరణ వృత్తికి విషయమైన బ్రహ్మముతో సం బంధమున్నది. అట్టిబ్రహ్మసంబంధ బ్రహ్మాకారవృత్తిచే బ్రహ్మజ్ఞానము గలుగుచున్నది. ఇదియే అపరోక్షానుభూతియగు ప్రత్యక్ష జ్ఞానమగుచున్నది. కావున బ్రహ్మజ్ఞానము ప్రత్యక్షము అపరోక్షమును ఆయియున్నది. ఈ ప్రకా రము అహంబ్రహ్మాస్మియను వృత్తి ప్రత్యక్ష ప్రమాణమై యున్నది. ఇట్టి ప్రత్యక్ష ప్రమాణముచే అజ్ఞాతమైన బ్రహ్మ వస్తువు తెలియబడుచున్నది. విశుద్ధవృత్తి బ్రహ్మాచ్ఛాదకావరణమును. భంగము చేయుచున్నది. అప్పుడు బ్రహ్మము స్వయంప్రకాశమానమను విషయము స్పష్టమగుచున్నది బ్రహ్మ మెప్పుడును ఘటములోని దీపమువలె ప్రకాశించుచున్నది. ఘటము దండముచే పగిలిపోగా స్వయముగా దీపము ప్రకాశించువిధమున బ్రహ్మము అహంబ్ర హ్మాస్మి వృత్తిచే నావరణము తొలగగా స్వయంప్రకాశమానముగా యున్న దను విషయము గోచరమగుచున్నది. కాబట్టి బ్రహ్మము సమస్తమును ప్రకా శింపజేయుచు తామన్న ప్రకాశముగలదిగానున్నది. కావున ప్రమాణములన్ని యు ఆవరణ నివారకములేగాని బ్రహ్మమును పొందింపజాలవు. బ్రహ్మము దేనికిని విషయముగానిదై యున్నది. తనకుతానే విషయముగానున్నది. అంత యు తానై యున్నది. గంపక్రింద దీపమున్నది. అప్పుడు దీపము గనబడుట లేదు. గంపను తీసివేయగా దీపము ప్రకాశవంతమై యున్నదను విషయము స్పష్టము, గంపయున్నప్పుడు దీపము ప్రకాశించలేదు. గంపతీసిన తరువాత దీపము ప్రకాశించుచున్నది. అను వాక్యములు వ్యవహార కల్పితములు ఉప చార వాక్యములు ఆ విధమునవే అంతఃకరణవృత్తి యున్నప్పుడు ఆత్మజ్ఞాన

యగుచున్నది. ఈవాక్యములన్ను వ్యవహారకల్పితములు ఔపచారిక ప్రయోగములు యదార్థముగా విచారించిన బ్రహ్మము జ్ఞానరూపమై స్వయంప్రకాశమై ఆనందమై, సూర్యునివలె తేజోరూపమై నిర్లిప్తమై యున్నది. సత్యానత్యములు ప్రకాశా ప్రకాశములు జ్ఞానా జ్ఞానములు ఇవి మొదలుగా గలవి. సుఖదుఃఖాదులవలె అంతఃకరణ ధర్మములేయగుచున్నవి. సర్వావరణా తీతమై బ్రహ్మవస్తువున్నది. స్వయంప్రకాశము.

శ్లో॥ జీవోబ్రహ్మ భిన్నః చేతనత్వాత్. యత్రయత్ర చైతనత్వం।
తత్రతత్ర జీవబ్రహ్మభేదం. యథాబ్రహ్మణి ॥ ॥శ్రుతి॥

తా॥ అనగా జీవుడు బ్రహ్మముకంటె వేరుగాదు. చేతనమగుట వలన ఎక్కడెక్కడ చేతనత్వమో అక్కడక్కడ జీవ బ్రహ్మభేదముగలదు. ఎటులనగా బ్రహ్మమందువలె ఇందు జీవుడు పక్షము జీవబ్రహ్మ భేదము సాధ్యము. చేతనత్వము హేతువు బ్రహ్మదృష్టాంతము బ్రహ్మమందు చేతనత్వమున్నది. కనుక అచేతనత్వము, ఏకము, అభేదము జీవునియందును చేతనత్వముండుటచే బ్రహ్మభేదము నిర్ణయింపబడెను. ఈ లాగున జీవబ్రహ్మైక్యము స్వతసిద్ధమాయెను.

శ్రుతి॥ వ్యావహారిక ప్రపంచ, మిథ్యాభూతః।
జ్ఞాన నివర్త్యత్వాత్॥

అనగా జ్ఞానముచే అసత్యమయిన దంతయు నివర్తింపబడుచున్నది. అజ్ఞానము సత్యమును నివర్తింపజేయజాలదు. ఈ ప్రపంచమంతయు మిథ్యయే (అయం ప్రపంచో మిథ్యైవ బ్రహ్మసత్యం జగన్మిథ్య) ఇవి మొదలగు ఉపనిషద్వాక్యములు జగత్తుయొక్క మిథ్యాత్వమును తెలుపుచున్నవి. కాబట్టి జ్ఞానముచే ప్రపంచము నశించుచున్నది. గనుక ప్రపంచము నత్యమెన్నటికినిగాదు. సత్యము బ్రహ్మమొకటియే యగుచున్నది. ఆ బ్రహ్మజ్ఞాన ప్రాప్యము ఆ పరబ్రహ్మము అవిక్రియము ఏలాటి వికారములు లేవిది. వికారములు పరిణామములు ప్రకృతికి నైజములు పరబ్రహ్మము నిర్వికారమైనందుచే ప్రకృతికి విలక్షణమై బ్రహ్మవస్తువున్నది. "ఏతత్ క్షేత్రం సమాసేన సవికారముదాహృతం" మహాపంచ భూతాదులతోకూడిన శరీరాది దృశ్యజాతమంతయు వికారముతో గూడినది. అని భగవద్గీతయు చెప్పుచున్నది. గనుక నిర్వికారమైనది యాత్మవస్తువొక్కటియే యున్నది. ఇట్టి పరిపూర్ణ అఖండ అపరిచ్ఛిన్న

ఆద్యంతరహిత మప్రమేయ నిర్వికార పరబ్రహ్మము అద్వితీయమైయున్నది అనగా ఆ బ్రహ్మము రెండవ వస్తువులేనిది ద్వితీయరహితము అనుటచే రెండవ వస్తువు దృశ్యమగుచున్నది. ఆ దృశ్యము ద్వైతమనుచున్నారు. కాబట్టి అట్టి ద్వైతము లేనిది అద్వైతము అద్వితీయమని చెప్పబడుచున్నది. గనుక దృశ్యరహితము పరమాత్మయని తెలియవలయును.

శ్లో॥ దృశ్యం హ్యదృశ్యతాం నీత్వా, బ్రహ్మాకారేణ చింతయేత్ ।
మాయాకార్య మిదంభేద మస్త్వ చేత్, బ్రహ్మభావనమ్ ॥

తా॥ దృశ్యమును రహిత మొనర్చి బ్రహ్మమును చింతించవలయును. మాయా కార్యమయిన దృశ్యప్రతీతియుండిన పరబ్రహ్మభావన చేయవలయునని యుప నిషత్తుగూడ చెప్పుచున్నది. కావున ఆ పరబ్రహ్మము దృశ్యాతీతమై అద్వితీయమై యున్నది. అట్టి అద్వయ పరబ్రహ్మము (ఏకమేవాస) యొకటియే యున్నది. అనగా "మత్తః బరతరం నాన్యత్ కించిదస్తి ధనంజయ" అను శ్రీకృష్ణపరమాత్మ వచనరీతిగా ఆ పరబ్రహ్మము ఏకరసమై యున్నది. ఉం టున్నది. పరబ్రహ్మ మొకటియే అదియే సత్తు మఱియొకటిలేదు. అంతయు తానై యున్నది. "ఏకంసత్" అను ఉపనిషద్వాక్యముగూడ పరబ్రహ్మ మొకటి యేయని తెలుపుచున్నది. కాబట్టి ఇట్టి నిర్వికార నిరంజన నిర్విషయ పరిపూర్ణ పరబ్రహ్మమందు నానాత్వములేదు. నానావిధనామరూపాది విశిష్ట ప్రపంచ ప్రతీతియేలేదు. "నానాస్తి కించన" అనిచెప్పుటచే కొంచముగూడ మాయయను నది లేక దృశ్యమనునదిలేనేలేదు. పూర్తిగా భిన్నవస్తువొకించుకయు ప్రతీయ మానమగుట లేదు. "సర్వం ఖల్విదం బ్రహ్మ, ఏకమేవా ద్వితీయం బహ్మ, ఏకంసత్" ఇత్యాది వాక్యసిద్ధ విషయమైన పరబ్రహ్మ మొకటియే అను దానినే నేతి నేతియను మహావాక్యములుగూడ ద్వితీయవస్తువును నిషేదించి ప్రతిపాదించుచున్న వి. పరిపూర్ణాదిలక్షణ విశిష్టమైన పరబ్రహ్మ మొకటియే అద్వయమై ఏకమైయున్నది. మఱియొకటిలేదు.

మరియు పరబ్రహ్మము సద్ఘనము సత్తుయొక్క పిండము సత్తంతయు కేరి పరబ్రహ్మమయినది. అందులో సత్తుతప్ప మఱియొకటి లేదని అర్థము. అటులనే చిద్ఘనము జ్ఞానఘనము ప్రజ్ఞానఘనము చిత్ప్రచురము జ్ఞానప్రచురము స్వయంప్రకాశమే పరబ్రహ్మముగా యున్నందుచే ప్రభాఘనము ఆనంద ఘనము ఆనందము వినా మఱియొకటిలేదు. ఈ ప్రకారము బ్రహ్మమున్నది.

సద్ఘనమని చెప్పినందుచే సత్య వస్తువునందు అసత్తు కొంచెముగూడ లేదు యనియు చిద్ఘన ప్రయోగముచే జడత్వలేశము గూడ చైతన్యమందు సంభవించదనియు, ఆనందఘనమనుటచే దుఃఖమనునది భాసించుటగూడ ఆనందైక రససమందు లేదనియు అర్థము. ఈ లాగున పరబ్రహ్మ వస్తువు అనృత జడత దుఃఖాత్మక జగత్తుకన్న విలక్షణమై యున్నది. మఱియు నాపరవస్తువు శాశ్వతము, నిర్వికారము, నిశ్చలము, అక్రియము, నిర్వ్యాపారము, అచలమునై యున్నది. కావున ఏకము అద్వయమయిన పరబ్రహ్మమందు నానాత్వము లేదు. భిన్నత్వమొకించుకయు లేనందుచే పరబ్రహ్మమఖండము పరిపూర్ణము అటుల గాక పరిపూర్ణ నిర్దోష నిర్గుణ పరతత్త్వమందు కుత్సిత దృష్టిచే భిన్నత్వమును అజ్ఞాన స్వభావమును జూచువాడు "మృత్యోస్సమృత్యు మాప్నోతి య ఇహనానేవ పశ్యతి" అనగా నానాత్వమును గాంచువాడు దృశ్యమునకు వశుడై మృత్యువును బొందుచున్నాడు. అను ఉపనిషత్తు రీతిగా మృత్యురూప జనన మరణ రూప సంసారమునే పొందుచున్నాడు. కావున పరబ్రహ్మము సద్ఘనము. చిద్ఘన ఆనందఘనము అద్వయము. ఏకము దృశ్యరహితమునై యున్నది. ఇదియే సత్యము దీనికి శ్రుతివాక్యములు చూడుము.

శ్రు॥ అనిర్వాచ్యం బ్రహ్మ చైతన్యం బ్రహ్మ ఏకమేవా
ద్వయం బ్రహ్మ నేహనానాస్తి కించన॥

దీనిఅర్థం పై వ్రాసినదే.

మఱియు జీవాత్మతోనభేదమై యాపరబ్రహ్మమున్నది. జీవునికన్న పరమాత్మ వేరుగాలేదు. జీవుడే పరమాత్మమయి యున్నాడని అర్థము. అంతరాత్మగాను పరబ్రహ్మమున్నది. కేవలానందరూపమయి, అనంతమయి, పరిపూర్ణమయి, అంతటను వ్యాపించినదై, సమస్తమును తెలియునదియై ఒకటే అయినదై అద్వితీయమగు పరబ్రహ్మమున్నది. దానియందు భేదమేమాత్రముగూడలేదు అది సర్వాతీతమై యున్నది.

శ్లో॥ నమోస్త్వనంతాయ, సహస్రమూర్తయే,
సహస్ర పాదాక్షి, శిరోరుబాహవే
సహస్ర నామ్నే, పురుషాయ శాశ్వతే
సహస్ర కోటియుగ ధారిణేనమః॥

అనగా అనంతుడు అనేక మూర్తులు ధరించినవాడును. అనేక బాహ్వాద్యవయ

ములు గలవాడును, అనేక నామములుగలవాడును, శాశ్వత పురుషుడును అనేక యుగ కాలములను ధరించువాడునునైన పరమాత్మకు నమస్కారము. అను మంత్రము తెలుపుచున్నది. అంతయు ఆ పరిపూర్ణబ్రహ్మ మొకటియే ఆ పరవస్తువు దేనికిని గోచరముగానందుచే ఇంద్రియాతీతమగుటచే దేనిచేతను గ్రహింప సాధ్యముగాదు. అంతయు తానుగా యున్నందుచే త్యజింప శక్యము గాదు. అటులనే ఇతరుల కిచ్చుటకును సంభవించదు. వేరుగా యుండు పదార్థ మును తీసుకొనవచ్చును విడువవచ్చును, పరులకు దానము చేయవచ్చును. అంతయు పరిపూర్ణమయి యుండు సర్వాత్మ విషయమగు అభిన్న వస్తువు నెటుల గ్రహింపను, విడువను, వదింపను, దానముజేయను, సాధ్యమగును. కావున ఆ పరబ్రహ్మ వస్తువు పరిపూర్ణమై, అభిన్నమై, సర్వవ్యాపకమై, యున్నందుచే విడుచుటకును గ్రహించుటకును, ఇచ్చుటకును శక్యముగాక యున్నది. అందుచేతనే పరబ్రహ్మము నిర్విషయమని చెప్పబడుచున్నది. సకలేంద్రియాతీతమై యున్నది. మఱియు నిరాశ్రయముగా యున్నది. సకల వస్తువులకును ఆధారమై, ఆశ్రయమై, అధిష్ఠానమై యున్నది. ఆ పరబ్రహ్మ వస్తువే దానికొక ఆశ్రయములేదు. ఆ పరబ్రహ్మము నిరాలంబమైయున్నది. ఆ పరమాత్మ సమస్తమును గ్రహించుచున్నది. సమస్తమును తెలియుచున్నది ఆ యాత్మ వస్తువును గ్రహించునదిగాని తెలియునదిగాని మరియొకటి లేదు. గనుక సత్తారూపమై సర్వప్రకాశవస్తువులకు ప్రకాశమయి సర్వభావాతీతమయి విడువదగినదియు గ్రహింపదగినదియు గానిదై సామాన్య విశేష భావరహిత మయి ఆ పరబ్రహ్మమున్నది. మఱియు నా బ్రహ్మము త్రిగుణాతీతము. విభజింప సాధ్యముగానందుచే కళారహితము అఖండము కాలాతీతము మాయా శూన్యము. ఇట్టి సర్వాతీత పరవస్తువు అద్వయమయి, ఏకమయి, పరిపూర్ణ మయి భావపదార్థముగా యున్నది. నానాత్వము అభావరూపము, భావమనగా ఉత్పత్తి వినాశరహితము అట్టి పరబ్రహ్మమందు ఉత్పత్తి వినాశీల అభావ రూప జగత్తు తత్ప్రయుక్త భేదములేదు. సర్వాధిష్ఠాన సర్వవ్యాప్త సర్వపరి పూర్ణ పరబ్రహ్మము సర్వదా యున్నది. తదితరము లేనేలేదు. మఱియు నా పరబ్రహ్మము సర్వేంద్రియాతీత మయినదగుటచే యిట్టిదని నిర్ణయింప సాధ్యముగాని స్వరూపముగలదై సర్వవిలక్షణమయి మనస్సును దాని పరిణా మమును, తెలియుచున్నదగుటచే మననాతీతమయి సర్వ వాక్కులకు ప్రేరక

మగుటచేతను. సర్వవాక్కులచే వర్ణింప సాధ్యముగాని దగుటచేతను వాగవిష యమై పరబ్రహ్మమున్నది. ఆ సద్వస్తువొకటియే యున్నది. తదితర పదార్థ ప్రతీతిలేదు. అంతయు ఏక బ్రహ్మమే రూపము లేనిదగుటచే తలంచుటకును వాక్కుకు గూడ అందనిదగుటచే నయనముచే చూచుటకును మనస్సుకు గోచరముగానందుచే తలంచుటకును వాక్కుకుగూడ అందనిదగుటచే వచించుటకును శోధించుటకును విషయముగాక సాధ్యముగాక యున్నది. సర్వేంద్రియాతీత విశుద్ధ పరబ్రహ్మ సాక్షాత్కారాను భూతిచేతనే పొందతగి బ్రహ్మమున్నది. ఆపరబ్రహ్మము అరూపము. అవిషయము నానాత్వశూన్యమే ఏకమైయున్నది ఆ పరబ్రహ్మము సత్తైయున్నది. మూడు కాలముల యందును యున్నదై త్రికాలములకు అతీతమై యున్నది. త్రికాలకృత భేదము పరబ్రహ్మమందు లేదు. సర్వదా యొకేరీతిగానేకమైయున్నది. అలాగున పరబ్రహ్మము సమృద్ధ వస్తువు. సర్వదా బ్రహ్మము సర్వత్ర నిండియున్నది. దేశము కాలము వస్తు భేదములులేక యున్నది. సర్వమునందు వ్యాపించి సందులేక యున్నది. ఆ పరబ్రహ్మము యేయొక కొఱతలేక యున్నది. సదోదయమై యున్నది. అంతట నుండుచు తనకన్న వేఱు పదార్థములేనందుచే వ్యాప వ్యాపకత్వ భావమును గూడ నతిక్రమించి యున్నది. ఆ పరబ్రహ్మమందు ఇది వ్యాపకము. ఇది వ్యాప్యము అను భేద ప్రతీతిలేదు. ఇకను మాయాతీతమగు పరవస్తువు సర్వదా శుద్ధము. ఏలాటి మాయామాలిన్యముగానిలేదు. ఆ పరబ్రహ్మము త్రిగుణముల నతిక్రమించి యున్నందుచే ఇది శుద్ధము. ఇది యశుద్ధమను భావన కతీతమయి యున్నది. ఆ పరబ్రహ్మమందు శుద్ధాశుద్ధ భేదము లేదు. మఱియు సచ్చిదానంద మయమగు పరబ్రహ్మము కేవలం జ్ఞానరూపమయి యున్నది. జ్ఞానమనగా ఇదితెలియబడెను. అనునదిగాక ఆ పరవస్తువుచే సమస్తముతెలియబడుటచే సమస్తమును అతీతమయి తెలియుచున్నది. గాన అది జ్ఞాన రూపము ఇక ఆ పరబ్రహ్మము ఇది తెలిసి ఇదితెలిసిలేమి అను భావనకు దూరమైనందుచే జ్ఞానజ్ఞానకృత భేదము పరబ్రహ్మమందులేదు, అది ఇట్టి దని నిర్ణయింపనీలులేదు. సకలాతీతమైన పరబ్రహ్మమును పరిచ్ఛిన్నమతితో ఎవరునూ వూహింపజాలరు. ఇటులుండ వాక్కుతో నెటులచెప్పగలరు. నిజముగా విచారించిన సకలాతీతమయి యున్నది. శుద్ధమనినను. విశుద్ధమనినను సచ్చిదానందమనినను పరిపూర్ణమనినను పరబ్రహ్మ స్వరూపలక్షణములేవి

వో అనమ్నియును కట్టకడకు పరబ్రహ్మ మనునదియు బుద్ధికి సంబంధిం
నవియే. ఇట్టి బుద్ధినిగూడ పరబ్రహ్మ మతిక్రమించి యున్నది. అందుచేతనే
ది అవ్యవహారమని యుపనిషత్తులు నిరూపించు చున్నవి. కావున. ఆ దివ్య
ానస్థితిని పొందవలయు వాక్కుతో యుచ్ఛరించినను మనస్సుతో నూహించి
ను ఫలము లేదని యనుభవజ్ఞానులు తెలిపెడు రహస్యము. అయినను బుద్ధి
కృత భావనలన్నియు పరబ్రహ్మరూపములగుటచే మార్గదర్శకములుగానున్నవి.
మార్గములు వేరు. మార్గముచే చేరదగిన వస్తువు వేరుగానేయున్నది అలాగున
సకలోపనిషత్తులు సకల లక్షణములు పరబ్రహ్మ బోధకములేగాని అవియే
పరబ్రహ్మముగాదు. సచ్చిదానందాది స్వరూపములు గూడ పరబ్రహ్మప్రాప
కములు పరవస్తువో వేరుగానేయున్నది అజ్ఞాన నాశనమునకై ఆ లక్షణములు
బుద్ధి కృత భావనలని తెలియవలెను. శాస్త్రముల లోగోవత్వ లక్షణము.
లక్ష్యముగోవు ఆగోవత్వము గోవును వదలివేరుగాలేదు లక్షణములన్ని లక్ష్య
మును విడనాడిలేవు అందుచే లక్షణములను తెలిసిన లక్ష్యము ప్రయత్నము
లేకనే తెలియబడుచున్నది. అలాగున సచ్చిదానందలక్షణములు తెలిసిన పర
బ్రహ్మము స్వయముగా ప్రాప్తమగుచున్నదని వేదాంతోపనిషత్తులుతెలియప
రచు చున్నవి. అయినను లక్షణముకన్న లక్ష్యము వేరుగానే యున్నది.
నిత్య సంబంధ మున్నందుచే లక్ష్య లక్షణముల కభేదమును పెద్దలు తెలియ
పరచుచున్నారు. గుణములే గుణికానటులయు ధర్మములే ధర్మికానటులయు
లక్షణములే లక్ష్యములుగావు అవిరెండును ఒకటియె యన్న లక్ష్య లక్షణ వ్యవ
హారమే సిద్ధించదు. గావున స్వరూప లక్షణముల కన్నను. పరబ్రహ్మము
వేరుగానేయున్నది అందుచేతనే కేవల సచ్చిదానందస్వరూప భావనలచే పరి
పూర్ణత్వము పూర్ణమగుటలేదు. మరియేమనగా బుద్ధ్యతీత వస్తువు తానైన
ప్పుడు పూర్ణత్వము సిద్ధమగుచున్నది. ఇదంతయు అనుభవజ్ఞుల స్వానుభవ
మని తెలియవలయును. ఇట్టి స్థితిని పొందుటకే తాను పరబ్రహ్మచే పైతెరువ
పరబ్రహ్మ స్వరూపమును నిరూపింప బడెను. ఇకను ఆ పరబ్రహ్మము అద్వి
తీయము దానియందు జగత్కృత భేదప్రతీతి. (నీవు నేను అనెడు మొదలగు
వ్యవహారములు ఉపాధికృత దేశకాలవస్తు కృతభేదములు లేవు. ఆబ్రహ్మము
ఏకమైయున్నది. అభిన్నమై. అవిభక్తమై. ప్రధానమై. సర్వసమమై. కేవలమై
భేదాభేదకృత భావనాతీతమై యున్నది. అట్టి సర్వ సమత్వ. సర్వాతీత

పరబ్రహ్మ మందు. శ్రుతి ప్రమాణముల విచారించినను యుక్తులతో జూచినను అనుభవజ్ఞుల ప్రశ్నించినను యెటుల విచారించి చూచినను మాయామాలిన్యము ఈషత్తుగూడలేనేలేదు. లోకములో లేనివస్తువు లేదనియే యున్నవస్తువున్నద నియే పూర్ణవస్తువు పూర్ణమనియే. కొరత వస్తువు కొరతయనియే వ్యాపకము వ్యాపకమనియే. అవ్యాపకము అవ్యాపకనియే. భావముభావమనియే. అభావము అభావమనియే. ఎఱింగిన ధీరులు వ్యవహరించుదురు. అలాగున ఆపరబ్రహ్మ ము సత్తు పరిపూర్ణము. స్వత సిద్ధము శుద్ధము జ్ఞానము ఊహాతీతము ఉపమా నరహితము ఏకము అద్వితీయముగా యున్నందుచేతనే పరబ్రహ్మ మటులనే నిర్ణయింపబడి వ్యవహరించబడి. శాస్త్రములచే శోధింపబడి ప్రమాణములచే ప్రమాణీకరింపబడి అనుభవేత్తలచే అనుభవింపబడి భావుకులచే భావింపబడి యున్నది. మఱియునది స్వతసిద్ధముగామన్నది. సిద్ధమనగా సాధనలచే సిద్ధ మగునది. సాధ్యమనగా సాధనలచే సాధింపబడునదనియర్థము పరబ్రహ్మము ధనలచేతను సిద్ధమయినది గాదు సాధింపబడినదియు గాదు. కావున అది తనం తటతానే సర్వదా సిద్ధమై ఆ పరబ్రహ్మమున్నదిఇట్టి సర్వదా సిద్ధమయిన పర బ్రహ్మమయినప్పుడు వేరు సాధనలతో అభ్యాసముతో పనిలేదు. అంతయు సర్వదా స్వతసిద్ధ పరబ్రహ్మమే యున్నది. ఈలాగున పరబ్రహ్మ స్వరూపమును విపులముగా బ్రహ్మానుభవజ్ఞులు తెలియజేసిరి. ఇదంతయు సకల శ్రుతిసారము అనుభవేత్తల అనుభవామృతము. శాంతిరసయుతము. జ్ఞాననవనీతము. సర్వమధురము.

శ్లో॥ చిన్మాత్ర మమల మక్షయ. మద్వయ మానంద మను భవారూఢం
బ్రహ్మైవాస్మీత దవ్యన్యన్నకిమ. వ్యప్తీతి నిశ్చయో విదుషామ్॥

తా॥ చిద్రూపమైన. అచలమైన. అద్వయమైన. ఆనందమైన. అనుభవ సిద్ధ మైన బ్రహ్మమేనేను. దానికి వేరైనదిలేదు. అని విద్వాంసుల నిశ్చయము. అదియుంగాక ఆ బ్రహ్మము ఇదనియు ఇట్టిదనయు అట్టిదనియు ఇంతిమాత్ర మనియు అంతమాత్రమనియు చెప్పపీలు లేనిది. సర్వేంద్రియాతీతమయినది. బ్రహ్మమని నిశ్చయింపవలయును. అటుగాకుండిన దేనికినైనను గోచరమగు నని తలంతు మేని అది పరోక్ష జ్ఞానమగును. కావున దేనికిని విషయముగాక విలక్షణమైనది బ్రహ్మము అపరోక్షము బ్రాదువందుపాము లేనటుల ఏకమైన చైతన్యమే యుండుట వలన భేదకరమగు వస్తువు లేనే లేదు.

ఆ పరమాత్మ యందు నానావిధ జీవవ్యవహారము జగద్భావముదా భ్రాంతిచే కల్పితములవియె తెలియవలెను. ఉన్నది పరిపూర్ణ బ్రహ్మమే.

శ్లో॥ దోషోఽపివిహితఃశ్రుత్యా. మృత్యోర్మృత్యుం సగచ్ఛతి.
ఇహపశ్యతి నానాత్వం. మాయయా వంచితోనరః॥

తా॥ మాయచే వంచితుడై నిష్కళంక పరబ్రహ్మమందు. కళంకమగు నానాభేదమును కల్పించి గాంచువాడు మరణమునేపొందుచున్నాడు. సంసారసాగరమున మునుగుచున్నాడని వేదము నానా భేదజ్ఞానికి ఫలితమునుగూడ తెలుపుచున్నది. కావున సర్వమును నిషేధించియు వశిష్టమగు పరబ్రహ్మమును తెలియవలెను అదిసత్యము మఱియొకటి లేనేలేదు. బ్రహ్మము శివము. ఆనందము. అద్వైతము. పూర్ణము. ఇట్టి బ్రహ్మతత్వమును పొందినవారిని విశేషించి వేదములు కొనియాడుచున్నవి. అట్టి మహనీయులే పరమశాంతిని పొందుచున్నారు. కొంచెముగూడ దేహియందును ఆసక్తి లేనివారు ఆసక్తియను బీజముండినచో భోగ్యవస్తు సుఖాంకురములు పొడచూపును వాంఛయనెడు వాసనా బీజమును పూర్తిగా విడిచినవారు గనుకనే సకలసంకల్పములుడిగినవారును దేహియందును ప్రపంచ విషయమున ప్రవర్తించని వారును అందుచే సకలభోగ్యవస్తువులను విశేషముగా వదిలినవారును అగుచున్నారు. అట్టి వారు శరీరమును హేయముగా దలంచి సమస్త సుఖములను దూరీకరించుచున్నారు. మఱియు నట్టి విరక్తులు సకల బాహ్యాంతరేంద్రియములను నిగ్రహించి ఆయా ఇంద్రియ వృత్తులను నశింపజేయుచున్నారు. ఇదియే సర్వేంద్రియ నిగ్రహమగు దమమనబడును. తద్వారా దమనదక్షులు గనుకనే ప్రకృతి దమనులగుచున్నారు. ఇట్టి దాంతిచే దాంతులయిన తరువాత అంతరేంద్రియ నిగ్రహముచే అంతఃకరణ వృత్తులను కామక్రోధాదులను నశింపజేసి పరమ శాంతిని బొందుచున్నారు. కనుక వారు సర్వదా శాంతులై ప్రసన్నులై యుందురు. శమదమములంచే శీతోష్ణాది ద్వంద్వ సహనముగల వారగుచున్నారు. ఇకను జితేంద్రియులై సర్వదా దృశ్యనిరాకరణమందు ప్రయత్నవంతులై యుందురు. త్యాగ ధర్మములను బాగుగా నాచరించుచుందురు.

శ్లో॥ ధృతిశ్శమో దమోఽస్తేయం. శౌచమింద్రియ నిగ్రహః।
ధీర్విద్యా సత్యమక్రోధో. దశకం యతిలక్షణమ్॥

ఇవి యతిధర్మములు వీనిని చక్కగా శీలించువారునై యుందురు. ఇట్టిపురుష

శ్రేష్ఠులు ప్రకృతి సుఖములను దూరీకరించి ఆత్మ సుఖమును గోరుధీరులు ప్రకృతినుండి సర్వేంద్రియములను మరలించి ఆత్మోన్ముఖములుగా జేసిన యుత్తమ పురుషులు పరమోత్కృష్టమైన, అవిద్యానాశకమైన, ప్రత్యక్ష సిద్ధమైన, నిస్సంశయమైన, నిశ్చలమైన, నిత్యమైన, శాంతమై పరమసుఖమైన, అలౌకికమయిన, సుస్థిరమయిన బ్రహ్మతత్త్వమును గురు శాస్త్రములద్వారాను తాము బాగుగావిచారించి మననముజేసి నిస్సందిగ్ధముగా పూర్తిగాతెలుసుకొని స్వస్వరూపానుసంధాన బలిమిచే జీవబ్రహ్మైక్యతనే దృశ్యనాశముచే పరిపూర్ణ విజ్ఞానావస్థయందు అన్నిసాధనలు పూర్ణముగా సాధింపబడినప్పుడు అఖండ పరబ్రహ్మము తానగునప్పుడు శాశ్వతానందసుఖమును అప్రాకృత పరబ్రహ్మతత్త్వమును పొందుచున్నాడు. కావున శాంతులై, దాంతులై, జితేంద్రియులై సకలవాంఛలను, సకలవాసనలను నశింపజేసిన మహాపురుషులు నిరంతర మాత్మానుసంధానముచే తమ్ముతాము తెలిసికొని నిరతిశయసుఖమును పొందుచున్నారు. భోగత్యాగము సకల వాంఛారాహిత్యము, శమము దమము ప్రయత్నము యథార్థాన్వేషణ ఇవి సాధనలు ఈ షడ్విధసాధనలతో పాటు జీవాత్మ అనగా పరమాత్మయే అను భావనచే సదా స్వస్వరూపానుసంధానము జేయుచు స్వస్వరూప మందున్నవారు నిత్యనిరతిశయ సుఖరూప బ్రహ్మమగుచున్నారు. వారలే యతీశ్వరులు శ్రేష్ఠులు.

శ్లో॥ స్వస్వరూపం వినాముక్తిః, గ్రంధకోటి శతేనన ।
యథార్థాను భవాత్సిద్ధం, నాన్యత్సుఖతరం భవేత్ ॥

తా॥ స్వస్వరూపానుసంధాన బలిమిచే స్వరూపమును తెలిసికొనక పోయిన గ్రంథపఠనములచే ముక్తి లభింపదు. యథార్థానుభవములేక సుఖమొకించుకయు గలుగదు. మఱియు మహాయోగీశ్వరులు శమదమముల చేతను ప్రయత్నము చేతను నిర్వికల్ప సమాధిచేతను నిరుపమమయిన సమస్త పరిపూర్ణానందమును పొందుచున్నారు. సకల సాధన విశిష్ట ఆత్మసంయమ యోగులు జ్ఞానసిద్ధిని పొందిరి.

మఱియు మహానుభావులగు యతీశ్వరులు, మహాఋషులు పొందెడు అనంత సుఖప్రకారమును తెలిసి ఆప్రకారముగానే నీవుగూడ విజ్ఞానవంతుడవగుమని శిష్యునకు శ్రీగురుదేవులు యుపదేశము జేయుచున్నారు. శమదమాది సంపన్నులై, వీతరాగులై పరమాత్మ తత్త్వమును మహాత్ములుగనుగొనిరి.

శిష్యవరా అలాగున నీవున్ను శమదమములు గలిగి దృశ్య వాంఛారాహిత్య రూప విరక్తిని పొందినవాడవై యథార్థమైన శాశ్వతమయిన ఆనందమయ విజ్ఞానమయ నీ యొక్క పరతత్త్వ స్వరూపమును అనగా పరబ్రహ్మమగు తనయొక్క పరతత్త్వస్వరూపమును కేవలఆనందఘనమయిన దానినిగా సకల క్లేశనాశముచే. నిరావరణచే గలిగెడు నిరతిశయ సుఖస్వరూపునిగా సకలబంధ రహితమయిన దానినిగా ఆత్మవిచారణ చేతను శ్రుత్యుక్త గురూక్త రీతిగా పరిశోధించి మననముజేసి అలాగున సాక్షాత్కరించినచో సముద్రమందు వాయు చలనముచే అనంతముగా గలుగు వీచికా పరంపరలవలె అంతరాపార గంభీర స్వస్వరూపమందు మనోమారుతముచే కల్పింపబడు సంకల్పతతులు మనః గరిమచే జన్యములై మిథ్యాభూతములైన సమస్త దృశ్యములు దేహేంద్రి యాద్యనాత్మ పదార్థములయందు జన్మ పరంపరముగా సుస్థిరముగా యున్న భ్రాంతులు పూర్తిగా దొలంగి పోవుచున్నవి. ఇట్టి భ్రాంతిరహిత స్థితిచే నీవు అజ్ఞాన నిద్రనుండి మేలుకొని స్వయం ప్రబోధగల వాడగుచున్నావు. కావుననే సకల బంధములనుండి విముక్తుడవై. కేవలముక్త. పరబ్రహ్మ స్వరూపుడవై యేది సకలశాస్త్రములు ప్రయోజనముగా శ్రవణ మనన విధిధ్యాసములయొక్క పరమ నిరుపమ ఫలమునుగా యుపనిషత్తులు ప్రతిపాదించుచున్నదో అట్టి అఖండ పరిపూర్ణ విజ్ఞానమును పొందినవాడవై. చేయదగిన క్రియలన్నిటిని చేసినవాడవై దేనిని పొందిన సకలకర్మలు పరిసమాప్తమగుచున్నవో అద్దానిని పొందినవాడవై కృతార్థుడవుగను కృతకృత్యుడవుగను. ధన్యుడవుగను సకల పుణ్య సంచయ ఫలసిద్ధిని పొందినవాడగుము. సర్వసిద్ధి పూర్ణుడవుగను యగుమా. ప్రబుద్ధిని లక్షణము కృతార్థుడగుటయేయనియు సకలమోహముల నాశముచే స్వయంప్రబోధదశ సిద్ధించుచున్నదనియు తెలియవలయును. సారాం శము నిజమయిన శాశ్వతమయిన ఆనందమయిన పరబ్రహ్మమగు స్వస్వరూ పమును ఆనందఘనమునుగా తెలిసికొన్నవాడు. అనగా తాను సర్వదా పరత త్త్వస్వరూపుడై. సకలబంధరహితుడై. శాశ్వతుడై కేవలము పరబ్రహ్మమని యెఱింగిన పరిపూర్ణ విజ్ఞాని తాను ఆత్మవిచారణను శ్రవణ మనన నిదిధ్యాస ములను నిర్వికల్పసమాధిని శీలించిన వాడగుటచే మనః కల్పితములగు స్వప్న తుల్యమగు దృశ్య భ్రాంతిని వీడి స్వయం ప్రబోధ జ్ఞానసంపన్నుడై ముక్తుడై కృతకృత్యుడుగను. ధన్యుడుగను. జన్మసాఫల్యము పొందినవాడుగను అగు

చున్నారని ముఖ్యాభిప్రాయము "ఇదం పరతత్త్వ మాత్మవస్స్వరూప మానం దఘనం విచార్య" అనగా తానొకప్పుడును పుట్టలేదనియు ఘటపటాది దృశ్యము నాశోత్పత్తులతో గూడుకొన్న విధముగా గాక నాశరహితుడనియు మరణము లేనివాడనియు తాను ఆనందమును తప్ప మఱియొకటి గాదనియు గురూపదేశ రీతిగా యాత్మవిచారణచే తెలియుచున్నారు. "విదూయమోహం స్వమనః కల్పితం" అనగా మనస్సే కల్పితము. కల్పితమైన మిధ్యాభూతములయిన చిత్తముచే తిరుగా నేర్పడు సంకల్పములును యనంతములే. దూది యొక్క రాసులు పై పైగా యనంతముగా గొప్పదగు కాటియాకుల యింటిలో పేర్చబడి యున్నవి. గాలిచే యెక్కడనుంచియో యొక విస్ఫులింగము దానిపై బడెను. అందుచే యాఅగ్నికణము గాలిసహాయముచే యుద్దీప్తమై దూది రాసులను దహించుచున్నది. మఱియు నంతకంతకు గాలి వీచిన యంతతొందరలో అదం తయు దహించుచున్నది. అలాగున విరక్తుని మనస్సు సంకల్పములు కాటి యాకుల ఇల్లు వలెను దూదిరాశివలెనయున్నవి. ఈశ్వరుని దయ శ్రీ సద్గురుని కటాక్షము అనువాయువుచే జ్ఞానాగ్ని పడినచో ఈశ్వరగురుకృప వృద్ధి నొందుచుండగా ఆ సహాయము చేతనే సకల సంకల్పములతోపాటు మనస్సు గూడ దగ్ధమగుచున్నది. ఇదియేఅమనస్కస్థితియు సాధకుడు మొదటసంకల్ప ములను త్రోసి పుచ్చుచుండిన మనస్సు విరుద్ధమై ఆత్మలో కలియుచున్నది

శ్లో॥ విరస్తవిషయాసంగం, సంనిరుద్ధం మనోహృది।
యదాయత్యాత్మనోభావం, తదాతత్పరమం పదమ్ ॥

తా॥ ఎపుడు విషయములనంటదో మనసు హృదయముననే కావలియుసుమా। అప్పుడు ఉత్తమమయిన స్థానమది ఆత్మరూపమొందును విమమా " కనుక సకంల్ప క్షయముచే మనోనాశము దానిచే శాశ్వత మోక్షము గలుగుచున్నది. అట్టి జ్ఞానముచే స్వప్నమందలి పదార్థములను సుఖదుఃఖములను మిథ్యగా దలంచు విధమున సమస్తమున్ను సుఖదుఃఖములను అసత్యముగా తలంచు చున్నారు. కేవల ముక్తావస్థనుహొంది కృతార్థుడగుచున్నారు. నిశ్చలముగా మనస్సునుజేసి పరబ్రహ్మమందు లయింపజేయుటయను నిర్వికల్ప సమాధిచే తానుపరబ్రహ్మమేయని స్వస్వరూపనిష్ఠలో స్థిరముగా చలింపక యుండుట చేతను నేను పరబ్రహ్మమను స్వయం ప్రబోధ జ్ఞానముగలుచున్నది. అట్టి జ్ఞాననేత్రము చేతను స్వస్వరూపమగు పరబ్రహ్మ తత్త్వమును తాను

సతతాత్మయందు నిశ్చయమును జ్ఞప్తి గలుగును. ఇట్టి అను భవపూర్వక పరబ్రహ్మ సాక్షాత్కార దృష్టిచే లేక బ్రహ్మ దృష్టిచే తనరూపమును నిరంతరము గాంచు చుండు మహానుభావుడు పరబ్రహ్మ మగుచున్నాడు. అట్టి స్వానుభవ పరిపూర్ణ జ్ఞానమునందుచే ఇదివరకు గురుశాస్త్రముల ద్వారా శ్రవణము చేయబడిన తత్త్వం పదార్థ మహావాక్యార్థ లక్ష్యమగు పరబ్రహ్మ వస్తువు లేక కల్ప స్థితిని పొందదు. అనగా అట్టి బ్రహ్మజ్ఞాని స్వస్వరూప స్థితినుండి లేక విజ్ఞప్తినుండి చలించనందుచే పరబ్రహ్మ పరోక్షజ్ఞానము. దృఢముగా పొందుచున్నాడు. కనుక నీవును స్వస్వరూపమునందుండి జారని వాడవై తన్ను గాంచినచో సందేహములేని దృఢాపరోక్షజ్ఞానమును పొందుచున్నారు. సద్గురు ద్వారా చేయబడిన మహావాక్యము దృఢమై అనుభవమునకు వచ్చును. అనగా పరబ్రహ్మమే తానగుచున్నాడని భావము. ఇచ్చట స్వస్వరూప నిశ్చల నిర్వికల్ప సమాధి స్వయంప్రబోధ జ్ఞానము ఈ రెండును దృఢా పరోక్షజ్ఞానమునకు సాధనములుగా తెలియవలెను. మనస్సును నిశ్చలముగా జేసికొనవలయును. దృష్టిని లక్ష్యమందు కేంద్రీకరించనిచో ధనస్సునందు బాణమును సంధించి కొట్టు ధనుష్కుడు లక్ష్యమును భేదించజాలడు. లక్ష్యముగూడ చలించుచుండిన దానిని భేదించజాలడు. ఆ తీరున మనస్సును పరబ్రహ్మమందు కేంద్రీకరించవలయును. లక్ష్యమగు పరబ్రహ్మముగూడ సంశయ రహితముగా జేయవలయును. అప్పుడు నిశ్చల మనస్సుతో సంశయరహిత పరబ్రహ్మమును పొందుచున్నాడు. మనస్సు చలించక యుండునట్లు జేయుట సమాధియగును. ఆ మనస్సు పరబ్రహ్మమందు లయింపచేయుట నిర్వికల్ప సమాధియగును. సంశయ రహితముగా బ్రహ్మరూప స్వస్వరూపమును తెలిసికొనుటయే ప్రబోధ జ్ఞానమగుచున్నది. ఇట్టి నిర్వికల్ప సమాధి స్వస్వరూప సర్వవేక్షణరూప స్వయం ప్రబోధ ప్రజ్ఞయను నయనముచే అనగా బ్రహ్మదృష్టిచే నిరంతరము తన్నుగాంచవలయును. సర్వదృశ్య మప్పుడు త్రుటిలో నాశనమగుచున్నది. ఇట్టి దృఢా పరోక్షజ్ఞానముచే శ్రవణ మనన నిదిధ్యాసములకు ఫలీభూతమయిన పరబ్రహ్మము తానగుచున్నాడు. ఇదియే దృఢా పరోక్షజ్ఞానము సకల వికల్ప రహిత పరబ్రహ్మ సాక్షాత్కారమగుచున్నది. "నిస్సంశయం, సమ్యగవేక్షితా" అనగా సందేహము లేకుండగను. సతతాత్మను జ్ఞప్తి నేత్రముచే దర్శింప వలయును. మరియు పైజెప్పిన రీతిగా నిర్వికల్ప సమాధిని స్వస్వరూప స్థితిని

తానే బ్రహ్మమను అఖండభావమును శీలించిన ఆత్మజ్ఞాని అనాదిగా అనేక జన్మపరంపరలనుండి తనకు సంబంధించియే వచ్చుచున్న మోహరూపమయిన అజ్ఞాన బంధమునుండి విడువడుచున్నాడు. బంధమనగా పాశముచే కట్టబడుట లేక కారాగృహాదులలో లోపల ప్రవేశింపజేయుట ఇవి మొదలుగాగలవి. బంధ కారణములగును. కావున జీవుడు అజ్ఞానమను త్రాటిచేత కట్టబడి యున్నాడు. లేక అంధకార నిబిడమైన మహాసంసార గర్తమున త్రోయబడి యున్నాడు. అనేక విషయ వాసనలను ఇనుప కమ్ములచే కట్టబడిన ఏత్తైన మోహమను చెరసాలలో త్రోయబడి పాపజన్య దుఃఖమునే అనుభవించుచున్నాడు. సద్గురువు కృపావంతుడై జ్ఞానమను కత్తిచే అజ్ఞానమను పాశమును తెగవేయుచున్నాడు భగవంతుడు కృపామతితో అనన్య భక్తియను చేయూతనిచ్చి సంసారగర్తమునుండి జీవుని యుద్ధరించుచున్నాడు. బ్రహ్మనిష్ఠచే స్వస్వరూప ఐక్యజ్ఞానముచే బ్రహ్మానుభవము కలుగగా సమస్త పాపదోషములు నశించుటచే మోహమను చెఱసాలనుండి బయటకువచ్చి స్వాతంత్రముతో ఆమందానందమును పొందుచు జీవుడు విహరించుచున్నాడు. పై చెప్పిన రీతిగా బంధములోయున్నప్పుడు దుఃఖమునే అనుభవించెను. బంధవిముక్తిని బడసిన తరువాత ఆనంద సాగరమున ఆనందామృతమును పానముచేయుచు ప్రజ్ఞయందు వైరాగ్యముతో గూడుకొన్నవాడై, సర్వవ్యాపకుడై పరబ్రహ్మమై తానున్నాడు. అదియేఅఖండ జ్ఞానముచే సకల సంసార బంధములు తెగి మోక్షము లభించుచున్నది. అటు తరువాత తాను సత్య జ్ఞానానందరూప పరబ్రహ్మమగుచున్నాడు. ఇట్టి జ్ఞానము శాస్త్రాది ప్రమాణములు లేక శాస్త్రములో చెప్పినరీతిగా కలుగకున్న అది అప్రమాణమే యగును ప్రమాణమనగా సందేహములేక విషయమును దృఢ పరచుచున్నది. పై చెప్పబడిన జీవన్ముక్త సత్యజ్ఞానానంద పరబ్రహ్మప్రాప్తి యందు శాస్త్రము, యుక్తి, గురూపదేశము, విశుద్ధాంతఃకరణ పూర్వక స్వానుభవము ఇవి ప్రమాణములు జ్ఞానమునకు. ఈ నాలుగు ప్రమాణములతో నొప్పుచుండవలయును. లేనిచో దృఢపరోక్ష జ్ఞానముగలుగదు. అనుభవము లేక కేవలం శాస్త్రమునో, యుక్తినో గురుపదేశమునో దేనినోయొకదానిని ఆధారముచేసుకొని నేను విజ్ఞానిని తలంచినంత మాత్రమున తాను పరబ్రహ్మము కాజాలడు. అనంత సుఖమును పొందజాలడు. జన్మసాఫల్యమునొందడు. కనుక శాస్త్రప్రామాణయుక్త విజ్ఞానమే అనాద్యవిద్యాభంజకమై, అమోద్వంసకమై,

సంసారబంధవిచ్ఛేదకమై, సకలక్లేశ దుఃఖనాశకమై, సమస్తవాసనారణ్యదాహ
కమై, నిరతిశయానందప్రదమై, అమందానందదాయకమై, నిరవచ్ఛిన్నస్వాను
భూతి భూమామహిమమై, స్వయంప్రకాశమై, సర్వవ్యాపకమై, పరిపూర్ణమై
అఖండమై, అపరిచ్ఛిన్నమై, అమృతమై భాసించుచున్నది. కావున జ్ఞానులు
దైవకరుణ, గురుకరుణ, వేదకృప అంతఃకరణముయొక్క విశుద్ధి రూపకృప
ఈ నాలుగు కృపలున్నచో మాత్రమే విజ్ఞానోదయమగుచున్నదని తెలియు
చున్నారు. శాస్త్రమనగా శాస్తీతి శాస్త్రం, శాసించునది. ధర్మాత్ములగురాజు
ప్రజలను ధర్మమార్గమందు నడచునట్లు శాసించుచున్నాడు. అలాగున సకల
వేదాంత శాస్త్రములు జీవుని బంధవిముక్తికై శమదమాది సంపన్న సుగుణము
లుగల సుజ్ఞానమార్గమందు నడచుటకు శిక్షవిధానము చూపుచున్నవి. లేనిచో
అనాది దుఃఖమయసంసారమున పడిపోదురని తల్లివలె బోధించుచున్నవి. కాబట్టి
వేదాంత శాస్త్రములన్నియు దైవకృపా రూపములైయున్నవి. వానిని ప్రపం
చోద్ధరణకై భగవంతుడనుగ్రహించియున్నాడు. ఆశాస్త్రమప్రమేయమంతయు
లోకసంతరణము ఆనందప్రాప్తియేయగును. ఇక దేశికోక్తియనగా గురూపదే
శము గురువనగా ఉపనిషచ్ఛ్రుతిపాద్య బ్రహ్మవిజ్ఞాన సంపన్నుడగును. అట్టి
శ్రోత్రియ బ్రహ్మనిష్ఠాగరిష్ఠులగు పరమగురువులు పరమదయతో జీవబ్రహ్మ
భేదమును జీవేశ్వరోపాధులయొక్క మిథ్యాత్వమును సకల దృశ్యనాశమును
తెలియజేయునట్టి అఖండైక విజ్ఞానరూప మహావాక్యార్థమునే నిరంతరముపదే
శింతురు. సత్యస్వభావులు గనుక సత్యమునే బోధింతురు. కనుక తనకు కలిగిన
జ్ఞానము శాస్త్రసమ్మతముగను, గురూపదేశానుసారముగను యుండవలయునని
సిద్ధాంతము. మఱియు యుక్తియుతముగను యుండవలయును. యుక్తియనగా
దృష్టాంతోక్తులు ఘటపటాదులు మట్టికన్న కుండ వేరుగాదు. నూలుకన్న
వస్త్రము భిన్నముగాదు. ఇవి మొదలుగా దృష్టాంతములు కార్యకారణా భేద
మును తెలుపునవి కారణమగు బ్రహ్మముకన్న ప్రపంచము వేరుగాదు. ఇది
కార్యకారణ వాదము ఇక (ఆరంభవాదము) పాలుకన్న పెరుగుగాని వెన్న
గాని వేరుగాలేవు. ఇది పరిణామ వాదము ఈ దృష్టాంతముచేతను పరబ్రహ్మ
ముయొక్క పరిణామమగు జగత్తు బ్రహ్మముకన్న వేరుగాదు. రజ్జుసర్ప
శుక్తి రజతాదులు దృష్టాంతములగుచున్నవి. త్రాడుకన్న పాము శుక్తికన్న
రజతము వేరుగాలేవు. ఇది వివర్తవాదము ఈరీతిగాను బ్రహ్మమందు భాసించు

జగత్తుగూడ బ్రహ్మముకన్న వేరుగాదు. ఇవన్నియు యుక్తులవి శాస్త్రములచే నిర్ణయింపబడి యున్నవి.

శ్లో॥ జలమివ మృగతృష్ణాయాం, శుక్తౌ రజతం యథాహిరివరజ్జౌ ।
సత్యమివ సకలమేతత్కల్పిత, మాభాతిమయి పరానందే ॥

తా॥ ఎండమావులయందు జలమువలెను, ముత్తెపుచిప్పయందు వెండివలెను, త్రాటియందు సర్పమువలెను, పరానందరూపమగు నాయందు కల్పింపబడిన దృశ్యమంతయు యున్నదివలె భాసించుచున్నది. యథార్థముగా నాయందేమియు మరీచికాదులయందు జలాదులవలెలేదు యున్నది సత్యస్వరూప పరబ్రహ్మమే

శ్లో॥ తస్మిన్ బ్రహ్మణివిదితే, విశ్వమశేషం భవేదిదం విదితం ।
కారణమృది విదితాయాం, ఘటకరకాద్యాయదాఽవగమ్యన్తే ॥

తా॥ కారణమగు మట్టిని తెలిసిన తర్వాత కార్యములగు కుండ, బాన, ముంత మూకుడు మొదలైన పాత్రలన్నియు మట్టియే వేరుగావను జ్ఞానము గలుగు విధమున కారణబ్రహ్మము గుర్తెరింగినతరువాత కార్యమగు ప్రపంచమంతయు బ్రహ్మము వినా వేరుగావను విజ్ఞానముగలుగుచున్నది. యుక్తులను సందేహ నిరాకరణకములై బ్రహ్మ బోధకములై యున్నవి. స్వానుభవప్రమాణము అంతఃకరణము విశుద్ధతత్త్వముతోయున్నప్పుడు సూర్యకాంతమణి సూర్యకిరణములను గ్రహించి భానుమయమగుచున్నది. ఇదియే విజ్ఞానము జీవన్ముక్తానుభవము. నానావిధ పరిపక్వ పదార్థములను తయారుచేసి భుజింపకున్న ఆకలి తీరునా? సుఖముగలుగునా? అపరిమిత ధనము సంపాదించి యనుభవింపకున్న ప్రయోజనము గలదా? సౌఖ్యమున్నదా? నానా విధవేదవాక్కుల పఠించి వాని యర్థము తెలియకయున్న లాభమున్నదా? అలాగున యుక్తులు శాస్త్రములు గురువుయొక్క ఉపదేశమున్నను అనుభవములేకుండిన అవన్నియు నిష్ప్రయోజనములేయగును. అదంతయు వాచా వేదాంతమగును. ఆచరణ విరహితులను జనులువిశ్వసింపరు. తనకున్న సుఖములేదు. పెట్టెలో యాభరణులున్న ప్రయోజనములేనటుల బుద్ధిలో సకల శాస్త్రములున్నను ప్రయోజనముగానుపించదు కనుక స్వానుభవముండవలయును. అప్పుడే ప్రసన్నత. తృప్తి. ఆనందము గలుగును. అంతఃకరణమును విశుద్ధము జేసిబ్రహ్మమును కనుగొనవలయును. బ్రహ్మానుభవము పొందిన అనంత సుఖమబ్బును ప్రసన్నత-ప్రశాంతి బ్రహ్మానందముకలుగుచున్నవి. తాను బ్రహ్మమనుటకు బ్రహ్మమ

భవము ప్రత్యక్షమై యుండవలయును. బ్రహ్మయందున్న సచ్చిదానంద స్వరూపములు తనయందు సుస్థిరములై యుండును. శరీరము అన్నమయము గనుక అన్నములేకుండిన శరీరము నిలువజాలదు. కాబట్టి శరీరమందు అన్నమయత్వమున్నది. దేవాది శరీరములు అమృతమయములు. కావుననే వానికి నాశములులేవు. అమృతమయత్వము దేహశరీరమందు అనుభూతమగుచున్నది కావుననే "అన్నానురూపాం తనురూపబుద్ధిం, కార్యం నిదానాద్ధి, గుణానధీతే" అనగా కారణమునుండియే కార్యము గుణముల గ్రహించుచున్నది. కావున ఆహారానురూపముగా శరీరమేర్పడుచున్నది. మఱియు జనుల శరీరము అన్నముతో నిర్మితము గావున అన్నమయకోశము శరీరమని సిద్ధాంతమై యున్నది. అందుచే కార్యకారణములకు భేదములేదు. స్వర్ణకమలముల తిను హంసపక్షులు స్వర్ణమయములై యున్నవి. అట్లుగానివి మాంసాదిమయములై యున్నవి. ఆలాగున తాను బ్రహ్మానుభవమును పొందిన లక్షణమునకు తాను బ్రహ్మమై యుండవలయును. బ్రహ్మానుభవముచే బ్రహ్మత్వము సర్వదాసిద్ధమగును. కాబట్టి దేవాలయమును సకల విధముల ధనము వ్యయముచేసి సుందరముగా నిర్మించియు ప్రధానమైన సర్వేశ్వరుని ప్రతిమను నిర్మింపకున్న ప్రయోజనము లేనటుల ఆనందమబ్బనటుల అన్ని శాస్త్రాది ప్రమాణములున్నను స్వానుభవమగు అపరోక్ష జ్ఞానములేక పోయిన బ్రహ్మమెట్టిదో ఎవరికిని విదితముగాదు. చక్కెర మధురముగా యున్నది. అది తిన్నప్పుడే తెలియబడుచున్నది. బ్రహ్మానుభవము గలిగిననే పరిపూర్ణ తృప్తి గలుగుచున్నది, "ఆత్మన్యేవచ సంతుష్టస్తస్యకార్యం నవిద్యతే" అని భగవద్గీతయు చెప్పుచున్నది, కావున తనకు స్వానుభవము సిద్ధముగావలయు. ఆస్వానుభవ జ్ఞానము గురువు చెప్పినరీతిగాను శాస్త్రము గమ్యముగాను యుక్తియుక్తముగాను యుండవలయును. అప్పుడే పరిపూర్ణమగు విజ్ఞానము తనకుఁ గలిగెనని నిశ్చయించుకొనవలయును. దానికి చిహ్నము సకలేంద్రియాతీతజ్ఞానము పరమశాంతి సకలోపరతి సుఖానుభవమయియున్నది. కావున చతుర్విధ ప్రమాణసిద్ధ జ్ఞానమే సత్యమయినది. అదియే ఆనందకరమగును. మఱియు శాస్త్రాది త్రివిధ ప్రమాణములకన్నను తన అనుభవప్రమాణమే ప్రధానమని తెలియవలయును. ఇదియే ప్రసిద్ధ ప్రమాణము. శాస్త్రాది ప్రమాణములు బ్రహ్మమిట్టిదని పరోక్షముగా బోధించుచున్నవి. అనుభవ ప్రమాణము బ్రహ్మము

కానేయని అప్రకంప్యహేతువై అపరోక్షముగా ఉపదేశించుచున్నది. కావున శాస్త్రాది త్రివిధ ప్రమాణములు సంశయరహితముగా బ్రహ్మము యొక్క పరోక్షజ్ఞాన ప్రతిపాదకములుగాను కేవలానుభవ ప్రమాణము మాత్రము అపరోక్ష జ్ఞానజనకముగాను యున్నవి. కావున సకలోపనిషచ్ఛ్రుతిపాద్యమగుముఖ్య ప్రయోజనము అనర్థ నివృత్తి ఆనందప్రాప్తి యని తెలియవలయును.

అదియునుంగాక వేదములు సద్గురువులు బ్రహ్మస్వరూపమును తెలియజేయుటయందు సమర్థులనియు తానుమాత్రము ఈశ్వరానుగ్రహముచే గలిగిన స్వయం ప్రజ్ఞచేతనే విద్వాంసుడు సంసారసాగరమును దాటుచున్నాడు. ఇందులో జ్ఞానసంపన్నులగు గురువులు ఆప్తవాక్యములు వేదవాక్యములు మార్గదర్శముగాను "కైవర్తకః, కేశవః" భగవంతుడు నావికుడు అన్నట్లు దయామయుండగు సర్వేశ్వరుడు నావికుడుగాను ప్రజ్ఞయనునది యోడగాను, సంసారమనునది సముద్రముగాను తరించువాడు వివేకముగలవాడుగాను తెలియవలయును. వేదములును, గురువులును ఒకేవిధముగా తెలిపియున్నారు. శ్రుతులనగా ఈశ్వరునిద్వారా వినబడునవి సత్యమునే వచించునవి. భయంకరమగు అజ్ఞాన మృత్యువుయొక్క వాతబడకుండుటకై తీవ్రముగా జ్ఞానోపదేశమునకై శిక్షించుచున్నవి. అలాగున గురుమూర్తులును వేదములోనున్నదానిని స్పష్టముగా వ్యాఖ్యానించి పరమదయతో స్వానుభవపూర్వకముగా నిస్సంశయముగా బోధించుచున్నారు. వేదములును అవిద్యఫలితమును విద్యఫలితమును రెంటిని తెలుపుచు "శ్రేయశ్చ ప్రేయశ్చ" అను కఠశ్రుతి మంత్రములో మందుడు ప్రేయస్సును కోరును. ధీరుడు శ్రేయస్సును కోరును. అనువిధమున తటస్థముగా బోధించుచున్నవి. చెప్పవలసిన విషయములన్నిటిని స్పష్టముగా తెలుపుచున్నవి. అలాగున గురువులు దేహమస్థిరమనియు భోగములు శాశ్వతములు గావనియు ఆత్మనిత్యమనియు ఆత్మ సుఖమనంతమనియు శిష్యులకు బోధించుచు దీక్షపైనదానిని గైకొమనని కర్తృత్వ రహితులగుటచే తటస్థముగానే హితుగా తెలుపుదురు. వేదములకన్నను గురువాక్యములు ప్రత్యక్షసిద్ధములై మః భగోచరములై యున్నవి. "ఉపదేశక్రమోరాను, వ్యవస్థామాత్ర పాలనం" గురూపదేశము వ్యవస్థాపాలనమే అనునదియు "తటస్థా బోధయంతి గురవః" అనువాక్యమున్న సామాన్య వాక్యమేగాని విశేషవాక్యముగాదు. గురువులు మాతృదేవివలె దయాసంపన్నులై బిడ్డలగు శిష్యులను తరింపజేయుటకు అనేక

తరుణోపాయములు నిరంతరము బోధించుచు హృత్తాపహారకులై యున్నారు భగవంతుడును అనన్య భక్తులకు అన్యుడుగాక గోవును వెంబడించు వత్సము వలె భక్తసంరక్షణకై వెనువెంట తగిలియున్నాడు. అయినను ప్రజ్ఞాప్రయోజన మత్యంత అవసరము. ఎందుకన గగన వీధినుండి మేఘములు వర్షించినను పాత్రయనునది లేకుండిన జలముచే ప్రయోజనమును బడయజాలరు. దాహ శాంతియు గలుగదు అలాగున తాపత్రయముచే తపించుజనులు ధర్మానుష్ఠాన మేఘనమాధినొందిన బ్రహ్మజ్ఞానులగు గురువులద్వారా జ్ఞానవృష్టి అనంతంగా లభించినను. స్వానుభవరూప ప్రజ్ఞా విశేషమను జ్ఞానప్రకాశము లేకుండిన తాప శాంతిని పొందజాలరు. కావున ప్రజ్ఞ నేను బ్రహ్మమను అనుభవజ్ఞానము సంసారసాగరమును దాటించుచున్నది. గనుక జ్ఞానస్య కారణం, శుద్ధాశిష్య ప్రజ్ఞైవకేవల = అనగా ; జ్ఞానకారణము శిష్యుని ప్రజ్ఞయే.

సూర్యుడు చీకటిని నశింపజేయుటలో సమర్థుడగు విధమున నిరపేక్షమగు బ్రహ్మజ్ఞానము మోహమును పూర్తిగా ధ్వంసము చేయుచున్నది. కనుక ప్రజ్ఞయే సంతరణమున అనన్య హేతువై యున్నది. పైవిషయమును॥ఉపనిషద్వాక్యము॥ అనన్యప్రోక్తే గతి రత్రనాస్తి॥అనగా ఇతరులు వచించిన బ్రహ్మవిషయమున గతిలేదు. తనయొక్క అనుభవముచేతనే బ్రహ్మము ప్రాప్తమగుచున్నది. గురువుకన్న ఇతరులద్వారా బ్రహ్మప్రాప్తి గలుగుచున్నది. తరువాత ప్రజ్ఞతో గూడిన స్వస్వరూపము యొక్క యనుభవముచేతనే జ్ఞానము సిద్ధమగుచున్నది. అట్టి మహానుభావుడే పరబ్రహ్మమందు రమించుచు పరబ్రహ్మ స్వరూపముతో, పరబ్రహ్మమై, అనగా తన్నుతానే తనజ్ఞప్తియను ప్రజ్ఞచేతనే దెలసి తనయందు తానే తనరూపముతో ఆనందించుచు తానై యుంటున్నారు. అనగా పరబ్రహ్మ మగుతాను దేశకాలాదిభేదములు లేక దేనిచేతను పరిచ్ఛిన్నుడుగాక అఖండ పరిపూర్ణ విజ్ఞానమయ సత్తామయుడై యున్నాడు. బ్రహ్మస్వరూప లక్షణములగు సర్వధర్మములతో గూడుకొని ధర్మియగు పరమాత్మగాయున్నాడు తనయొక్క స్వరూప మిట్టిదని ఆత్మలో విచారించి విచారించి తనలో గలిగిన కేవల బ్రహ్మానుభవము చేతనే తెలియుచున్నారు. తదనంతరము తత్స్వరూపుడై సకలేంద్రియ వృత్తులు నాశమొందుటచే పరిశుద్ధుడై, సర్వ సంశయములు దీగినవాడై. తనచిత్త సవృత్తి అంతయు ఆత్మాభిముఖమై యుండుటచే నిర్వికల్ప స్వరూపముతో పరబ్రహ్మ మందుండుచు పరిపూర్ణ జ్ఞానసిద్ధిని బడసినవాడై

పరబ్రహ్మమైయున్నారు. అనంత శాశ్వతసుఖమును పొందుచున్నారు. కావున తనయొక్క స్వస్వరూప పరబ్రహ్మమును విస్పంశయముగను విశ్చలముగను అంఖడపరిపూర్ణముగను, దృఢముగా తెలిసి కేవల జ్ఞానమయ చిన్మయానంద మాయామృతమయ నిర్వికల్ప స్వానుభవముచే తెలిసి యాతీరున వున్నవారై సకల ప్రవృత్తుల నాత్మాభిముఖముగావించి తనలో తాను విహరించుచు, పరబ్రహ్మమై నిరంతరము తానుండవలయునని శిష్యునికి గురువుపదేశించుచు న్నారు. - సమ్మఖంతిష్ఠేత్ - సకలేంద్రియ ప్రవృత్తుల బహిర్ముఖములను గానీయక నిగ్రహించి కేవల మాత్మాభిముఖములనుగాజేసి పరబ్రహ్మమై యుండవలయును. అదియే పరిపూర్ణజ్ఞానసిద్ధియగును. ఈ విషయమునే "పరాంచిఖాని" అని ఉపనిషత్తు చెప్పుచున్నది. "అమృతచక్షుః, అమృతత్త్వ మిచ్ఛన్" అనురీతి అమృతపదవిని గోరువాడు సకలానాత్మ పదార్థములనుండి దృష్టిని మరలించవలయును. మఱియు స్వానుభవ మహిమచేతనే జ్ఞానసిద్ధిని బడసినవారై పరమాత్మాభిముఖియై స్వస్వరూప పరబ్రహ్మమగుచు నిరంతర బ్రహ్మానంద మగ్నుడై యున్నాడని భావము. స్వానుభవమే గొప్పది.

శ్లో॥ సర్వమనుభవసిద్ధం, నహినహి తత్సదృశమిహలోకే।
పరమాత్మని సన్తృప్తో, తత్స్వయం భజతి పరతత్త్వం॥

తా॥ అనగా సమస్తమనుభవసిద్ధముగావలయు ననుభవములో సమానమైనది లోకమునలేదు. గావున పరామాత్మానుభవముచే స్వయముగా పరతత్త్వమును పొందును.

శ్లో॥ నిఖిల నిగమగమ్యం, సర్వదాశాంతరూపం।
నిరుపమ నిఖిలార్థం, సచ్చిదానందరూపం ॥
ఇహభువి పరతత్త్వం నిర్గుణాఖండబోధం ।
భజతహృది మునీంద్రాః, స్వానుభవేన సిద్ధమ్ ॥

తా॥ అనగా నిరుపమ, నిర్గుణ, సర్వవేదవేద్య సచ్చిదానంద పరతత్త్వమును మౌనులారా స్వానుభవముచే సిద్ధమునుగా హృదయమునజేయుడు.

మఱియు ఏది సకలవేదాంతములకు ముకుటమో వేదశాస్త్రములకు పరమగమ్యమో వేదర్షుల బ్రహ్మఋషుల సిద్ధయోగుల బ్రహ్మజ్ఞానుల, అనుభవసిద్ధమై సకల సంశయచ్ఛేదకమై, నిరుపమానందరూపమై, ప్రకృతిరహితమై, సర్వాతీతమై, విజ్ఞానరూపమై యున్నదో అద్దానిని పరమసత్యమును తెలియ

ఫలమును. ఇదేవిషయమును భగవద్గీతయు చెప్పుచున్నది.

శ్లో॥ యదక్షరం వేదవిదో వదన్తి, విశన్తి యద్యతయో వీతరాగాః
యదిచ్ఛన్తో బ్రహ్మచర్యం చరన్తి, తత్తే పదం సంగ్రహేణ ప్రవక్ష్యే॥

పై విషయమునే యీ శ్లోకార్థము కావున తాను మానవుడై జన్మించి నందుకు బ్రహ్మవిచారము జేసి, తరించి బ్రహ్మము కాగావలయును. ఇదియే సత్యము మానవ జీవితలక్ష్యము ఇటులనే సకల శాస్త్రములు తెలియపరచుచున్నవి. అట్టి పరిపూర్ణ జ్ఞానమును పొందినప్పుడే మానవత్వము పూర్ణమగుచున్నది. అవి పరమపూజ్యులగు శ్రీ గురుదేవులు అట్టి మానవజన్మ సార్థక బ్రహ్మతత్త్వము నిట పరమదయతో చేతియందు అరటిపండువలెను చక్కెర కలిసిన నోటిలోని నవనీతమువలెను సులభముగా సారవంతముగా నుపదేశించుచున్నారు. వేదస్మృతుల విషయమును సాక్షాత్తుగాను పరంపరగాను పురాతనమునుంచి సర్వదాయున్న అద్యంతములులేని పరమాత్మను ప్రతిపాదించు పురాణములును తెలుపుచున్నవి. అట్టి పురాణములకన్నను మహాఋషులచే స్మరింపబడిన ధర్మజ్ఞానరూప స్మృతులును వేదార్థమునే వ్యాఖ్యానము చేయుచున్నది. అవి పురాణములకన్నను శ్రేష్ఠములు. జ్ఞాన ప్రతిపాదకములయిన త్రికాండాత్మక (కర్మ, ఉపాసన, జ్ఞాన) వేదములును సర్వేశ్వరానుగ్రహరూపములై నానా శాఖలతో నొప్పుచు వరిష్ఠములై, అలౌకికములై యున్నవి. ఆవేదములకును ఉపనిషత్తులనునవి పరబ్రహ్మము సాక్షాత్తుగా ప్రతిపాదించునవై, విజ్ఞానరూపములై, కేవలానుభవ గమ్యములై సారవంతములుగా అనంతవిషయములు తెలుపరచుచు వేదాంతములనబడుచు సిద్ధాంతరూపములుగా యున్నవి. ఆ యుపనిషత్తులకును నాలుగు మహావాక్యములు ముఖ్య సారాతిసారములై యున్నవి. అట్టి మహావాక్యముల సారార్థమే మహాత్ములు సిద్ధాంతీకరించి చెప్పుచున్నారు. ఆసిద్ధాంత వాక్యముల సంగ్రహార్థమేమనగా ఆరోపితము అధిష్ఠానముకన్న వేరుగాదు. చిత్రపటమందు చిత్రితములైన నానావిధ చిత్రములు విమర్శించిచూడగా పటరూపములై పటముకన్న వేరుగాక యున్నవి. అలాగున మనస్సను చిత్రపటమందు త్రిగుణములచే నానావిధ దృశ్యము నిర్మితమాయెను. అదంతయు మనసుకన్న వేరుగాదు కల్పితము. అట్టి మనస్సు జీవత్వము మొదలైనవన్నియు పరబ్రహ్మ మందజ్ఞాన బలిమిచే కల్పింపబడెను. ఈ విషయమును తెలిసికొనిన ఆరోపితమగు జగత్తుగూడ పర

బ్రహ్మముకన్న వేరుగాదు. ఏకమేవాద్వయం బ్రహ్మజీవో బ్రహ్మైవనాపరః ఇత్యాది శ్రుతులచే జీవుడు బ్రహ్మమేను వేరుగాదను విషయము స్పష్టమగుచున్నది. పై చెప్పబడిన రీతిగా శాస్త్రాది ప్రమాణములు అటులనే తెలియపరచుచున్నవి. కావున జీవుడు పరబ్రహ్మమే జగత్తున్ను పరబ్రహ్మమేయగుచున్నది. చక్కగా విచారించిన జగత్తు జీవుడనునది మఱియొక పదార్థములు లేవు. అంతయు పరబ్రహ్మమే మఱియొకటిలేదు. అట్టి నిర్వికల్ప నిశ్చలనిర్వికార నిరంతర పరబ్రహ్మమందుండుటయే మోక్షమగుచున్నది. సకలానర్థములు స్వరూప విజ్ఞానముచే తొలంగి పరమానందము లభించి తాను పరబ్రహ్మమగుచున్నాడు. ఇదియే కైవల్య పదవియగును. ఈలాగున పరిపూర్ణ పరబ్రహ్మమొకటియే యున్నది. అను బ్రహ్మైకత్వ విజ్ఞానమందు అనేకశ్రుతులుగలవు

శ్రు॥ ఏకోదేవస్సర్వ భూతేషుగూఢః సర్వవ్యాపీ సర్వభూతాంతరాత్మా ।
కర్మాధ్యక్షస్సర్వ భూతాధివాసః, సాక్షీచే తాకేవలో నిర్గుణశ్చ ॥

ఇత్యాది శ్రుతులనేకములు ప్రతిపాదించుచున్నవి. శ్రుతులకన్నను వేరుప్రమాణములులేవు. గనుక శ్రుతులను అందరు మహర్షులు పరమ ప్రమాణముగా గైకొందురు. వానికన్న విరుద్ధముగాతోచిన దానింకను అట్టిఅఖండస్థితి పొందలేదనియే తలంపవలయును. శ్రుతులయందప్రామాణ్యము కల్పింపనేరికిని సాధ్యముగాదు. సారాంశమేమన గురూపదేశము. స్వాత్మానుభవము, శ్రుతులు, యుక్తులు, ఇవన్నియు పై రీతిగనే తెలుపుచున్నవి. జీవుడు పరబ్రహ్మమేను జగత్తు పరమాత్మరూపమేను నిరంతర పరబ్రహ్మానుభవ అమృతమయ, నిరవధికానందమయ నిరావరణ పరిపూర్ణ విజ్ఞానాఖండ సత్తాస్థితియే కైవల్యము, బ్రహ్మైకత్వమే, విజ్ఞానము. ఇదియే సకల వేదాంత సిద్ధాంతము.

శ్రు॥ సత్యమాత్మా బ్రహ్మైవ, బ్రహ్మాత్మైవాత్రహ్యేవన విచికిత్స్యం ।
త్వం బ్రహ్మాసి, అహంబ్రహ్మాస్మి, అనయోరంతరం నవిద్యతే॥
త్వమేవాహ మహమేవత్వమ్॥

అనగా సత్యము బ్రహ్మమే అదియే ఆత్మ. నీవు బ్రహ్మము నేను బ్రహ్మము భేదములేదు. నీవు నేను అనునదియు బ్రహ్మమే. ఇదియే సద్గురూపదేశ రహస్యము.

మఱియు సాధన చతుష్టయ సంపత్తి గలిగి శ్రద్ధాభక్తి ప్రపత్తులతో గూడుకొని శ్రీ సద్గురుదేవుని వరమోపదేశము పొందిన ధన్యాత్ముడగు శిష్యుని

యొక్క పరమానందరూప పరతత్త్వ పరబ్రహ్మస్థితియగు అచల సనాతన స్వస్వరూప నిష్ఠాపాయ నిర్వికల్పసమాధిని అఖండవిజ్ఞానమును పరబ్రహ్మైక్యస్థితిని శాశ్వతానందపదవిని ఇటులుందునని గ్రహించవలయును. అనగా పరమ గురువుయొక్క యుపదేశ వేదాంత శ్రవణానంతరమే. జ్ఞానయోగ్యుడగు సచ్ఛిష్యవరుడు దీర్ఘకాలమునుంచి మహావ్యాధితో పీడితుడైనవాడు వాని పుణ్యవశమున సిద్ధయోగివలన ఔషధమును సేవించి పథ్యమున్నందున వెంటనే ఆరోగ్యవంతుడై ఆమదానందమొందు విధమునను తీవ్రక్షుదచే బాధితుడగువాడు షడ్రసోపేతాన్నమును భుజించి సంతృప్తుడగు విధమునను ఏటిలో మునిగి ప్రాణమునకై తపించువాడు వానిని యుద్ధరించువాని హస్తావలంబనమునుపొంది బయటపడి బ్రతుకువానివలెను అనాది సిద్ధమగు అజ్ఞానభవ రోగమును తత్త్వమసి మహావాక్య గురూపదేశ ఔషధమువలన నశింపజేసికొని శాశ్వతానందమును పొందినవాడై అలాగున శోకమోహద్వంద్వ బాధలగు తీవ్రక్షుదను పరబ్రహ్మస్థితియను ఉన్నత స్థానమునొంది అమృతపానముచేసి పోగొట్టుకొని పరమ సంతుష్టుడై సంసారమడుగులోబడి మునుగుచు సుఖమును ప్రాణమునకై ప్రాకులాడువాడు సద్గురుద్వారా యుద్ధరింపబడి ఆత్మసుఖమును పొందినవాడై అనగా ఆనందమునొందినవాడై సంతృప్తుడై పరమసుఖవంతుడై స్వానుభవజ్ఞాన మహిమచే యున్నారు.

పండినఆకు గాలిసోకగానే రాలిపోవునటుల పండినపండు తొటిమనుండి పడిపోవునటుల పరమ గురూపదేశనిమిత్తమున యోగ్యుడగు ముముక్షువు. సంసారమునుండి పండినఆకువలె పడిపోవుచున్నారు. అనగా ముక్తుడగుచున్నారు.

అలాగున అజ్ఞానమను తొడిమనుండి పండువలె దూరుడగుచున్నారు. అజ్ఞాననిర్ముక్తుడై కైవల్యమును పొందుచున్నారు. పరిపక్వావస్థపొందిన అరటిపండు లేక చింతపండు పొలతై వని చర్మముతో సంబంధములేక యుండువిధమున సద్గురూపదేశముచే పరిపూర్ణావస్థనుపొందిన సచ్ఛిష్యుడు అజ్ఞానమునందలి దేహేంద్రియాదులవలని మాయమునుండి జీవన్ముక్తుడై యుంటున్నారు. పరమ గురువగు యమధర్మరాజుయొక్క ఆత్మోపదేశమును శ్రవణముచేసిన వెంటనే నచికేతుడు స్వస్వరూపమును పొందెను. శ్రీ దక్షిణామూర్తి చిన్ముద్రప్రదర్శనచేతనే శివకైవల్యమును సనకాది యోగులుపొంది నిర్వాణపదమందిలో యుంటిరి.

విదేహముక్తుడగు శ్రీ జనకచక్రవర్తి మహామహానుభావుడై న వారి పరమోపదేశము చేతనే శ్రీశుకమహర్షియు సర్వదా విదేహస్థితిలో నుండుచు నిర్వికల్పసమాధి బొందెను. మహాపరమగురువగు అష్టావక్రమహాముని యొక్క ఆత్మోపదేశము చేతనే శ్రీ జనక చక్రవర్తియు ఆత్మారూఢుడయ్యు నిశ్చలత్వముపొంది తరువాత అమనస్క భావమును పొందెను. అలాగున సద్గురూపదేశమును శ్రవణానంతరమే శిష్యుడు తనయొక్క స్వస్వరూపస్థితిని అనగా నిర్వికల్ప సమాధిని పొంది నిశ్చలుడు కావలయును. ఓ ధన్యాత్ముడగు శిష్యవరా నీవు బ్రహ్మమయ్యేయున్నావు. జీవుడు బ్రహ్మమేగమక యేకాలమందును. బంధమోక్షములు నీకులేవు. అజుడవు. అవ్యయుడవు. శాశ్వతుడవు. ఆనందమయుడవు నీవుగా నున్నావు. అంతయు బ్రహ్మమే అనునట్టి మహావేక్యమగు తత్త్వమసి ఉపదేశమే యిదియని తెలియుము. దీనినే నిరంతరము మననము చేయుము. గురువచనమనునది సూర్యునిచే ఛేదింపతగినదని అజ్ఞాన తమస్సును ఛేదించుచున్నది. నానావిధ శ్రుతులతోగూడిన గురువాక్యము అజ్ఞానమునకు బ్రహ్మాస్త్రమగును. విస్మృత అజ్ఞానము పూర్తిగా నాశనమగుచున్నది. ప్రసన్నభావము గలుగుచున్నది. సర్వరాగములు నివృత్తములై. సర్వసంకల్పరహితుడై. ప్రజ్ఞానఘనుడై కేవలాత్మానుభవముపొంది అచలస్థితిని పొందుచున్నాడు. నిరంతరమాత్మాకార యోగములోనేయుండుచు నిర్వికల్పసమాధిస్థితి నొందుచున్నాడు. "ప్రశమితకరణః" అనగా సకలేంద్రియములు ఉపశమించుచున్నవి. సకలవృత్తులు నాశమొందుచున్నవి. అగ్నిచే దగ్ధమగునటుల సకల వికల్పములు గుణములు వాసనలు జ్ఞానాగ్నిచే దహించుచున్నవి. "సమాహితాత్మా" అనగా మనస్సు నిశ్చలమై పరబ్రహ్మమందు లయించుచున్నది. ఇదియే నిర్వికల్ప నిశ్చలయోగమగును. "అచలాకృతి" అనగా చలించని స్థితిని పొందుచున్నాడు. ఇదియే అచలమగు పరమాత్మస్థితియగును. "ఆత్మనిష్ఠతః" సదా స్వస్వరూపమందుండున్నాడు. ఇదియే పరిపూర్ణము. ఈలాగున శిష్యుడు స్వాత్మవివేకముచే గురూపదేశమహిమచే జ్ఞానసిద్ధినిందని నిర్వికల్పస్థితిలో లేక అచలస్థితిలో. స్వానుభవస్థితిలో. తనబ్రహ్మసాక్షాత్కారములో అనిర్వచనీయ సర్వేంద్రియాతీత పరిపూర్ణ పరబ్రహ్మమందుండి పోయినవాడాయెను. జీవుడు పరమాత్మతో గలిసెను. మనస్సు బ్రహ్మమందులయించెను. సకలదృశ్యము నాశమాయెను. అమృత స్వానుభవమాయెను. జ్ఞానస్వరూప

శివమయ మై సత్యమయమాయెను. నిర్వాణమయమాయెను. సర్వసంశయము లుడిగెను. సిద్ధించవలసినది సిద్ధించెను. తెలిసికొందగిన వినదగినది. చేయదగినది. పొందదగినది పూర్తియాయెను. అదియే నిర్వికల్పము. నిరంజనము. నిరాకారము శుద్ధ పరిపూర్ణానుభూతి. ఆనందమయ. విజ్ఞానమయ. నిరామయ. చిన్మయ. సన్మయ సర్వవ్యాపక సర్వదృశ్యరహిత శాశ్వతసుఖమయ. పరబ్రహ్మజ్ఞానసిద్ధిగలుచున్నది. ఇట్టి మహాజ్ఞానులగువారు ప్రపంచములో అందరిలో కలిసియున్నను ఆత్మకన్న వేరుగా మఱిదేనిని గాంచరు. అంతయు తానేయని నిశ్చయించుకొనియుందురు. ఈలాగున ఆత్మకన్న వేరులేదని వేదములు నిర్ణయించుచున్నవి.

శ్లో॥ జగదాకార తయాఽపి ప్రథతే,
గురుశిష్య విగ్రహతయాపి।
బ్రహ్మాకార తయాఽపి ప్రతిభాతీదం,
పరాత్పరం సర్వమ్ ॥

తా॥ పరమాత్మ స్వరూపమగు సమస్తము జగద్రూపముగను గురుశిష్యరూపముగను బ్రహ్మాకారముగను తోచుచున్నది. అనగా అంతయు పరబ్రహ్మమే. ఈలాగున శ్రీసద్గురువులవారి యుపదేశమువలనను. శ్రుతిప్రమాణమువలనను యుక్తులవలనను ఈశ్వరకరుణ చేతను జన్మాంతర పుణ్యముచేతను సాధన మహిమచేతను సర్వబంధవిముక్తుడై శాశ్వతానంద మోక్షమునుపొందుచున్నాడు కావున శిష్యుడు పై నిరూపింపబడిన గురుశాస్త్రాదులయందు కృతజ్ఞత గలిగి వానిని మరువక జ్ఞప్తియుంచవలయును.

శ్లో॥ అజీవితం త్రయస్సేవ్యా. వేదాంతో గురురీశ్వరః।
ఆదౌజ్ఞానాప్తయే పశ్చాత్. కృతఘ్నత్వ నివర్తయే॥

తా॥ శరీరపాత పర్యంతము. వేదాంతము గురువు ఈశ్వరులను ముందు జ్ఞానాకారకులగుటచే జ్ఞానము గలిగినతరువాతను విడువక సేవించవలయును. కావున అనుభవముగల శిష్యుడు సదా గురువును ఈశ్వరుని వేదాంతముల మరువక జ్ఞానముయుడై యుండవలయును. మఱియును శ్రీ గురువులవారు అత్యంత దయతో తత్త్వమసి మహావాక్యార్థమును సవిస్తరముగా బోధింపగా శిష్యుడు శ్రవణముచేసి "ప్రజ్ఞానం బ్రహ్మ" అను లక్షణ నిరూపక మహావాక్యానుసారముగా అనగా శ్రుతిప్రమాణానుసారముగా బ్రహ్మతత్త్వమును తెలిసికొని

"అహంబ్రహ్మాస్మి" అను యనుభవ వాక్యప్రతిపాద్యమగు స్వానుభవ ప్రమాణరీతిగా బ్రహ్మము తానగుచు "అయమాత్మాబ్రహ్మ" అను సాక్షాత్కారవాక్యమునను సరించి జీవుడు బ్రహ్మమేయగునను ఏకత్వవిజ్ఞానముతో పరబ్రహ్మమును సాక్షాత్కరించినవాడాయెను. సర్వభవ్యతను బడసెను. తరువాత కొంత వరకు నిశ్చలసమాధిలోనేయుండి కేవలాఖండ పరిపూర్ణ విజ్ఞానసంపన్నుడై పరబ్రహ్మమై తనకు గలిగిన నిరవధిక శాశ్వతానంద మనిర్వచనీయమైనను ఆస్థితిని పరమగురు కరుణను స్వానుభవరీతిగా కృతజ్ఞుడై వెలిబుచ్చుచున్నాడు అనుభవముగల మహానుభావులందరు తనస్థితి గురు కరుణయేయనియు శ్రుతి మాత్రప్రసాదమనియు వచింతురు. బ్రహ్మవస్తువును నిస్సంశయముగా తెలియజేతురు. స్వానుభవమునే యెక్కువగా విశ్వసించి తన్మూలాగమునుగొనవలయునని నొక్కి వక్కాణింతురు. అలాగున స్వానుభవమును పొందిన శిష్యుడును మహానందముతో నిర్భయుడై అనిర్వచనీయస్థితిలో యున్నవాడై యీలాగున చెప్పుకొనుచున్నాడు. అనగా అచరణ పరుడగు ధన్యాత్మునిస్థితి యీలాగున యుండును. ఇట్టి శిష్యుడు తన యనుభవ సిద్ధమయిన జ్ఞానమహిమను అనంత సుఖమును గురుకరుణను నొక్కి వక్కాణించుచున్నాడు.

"నష్టోమోహః స్మృతిర్లబ్ధా, త్వత్ప్రసాదాజ్జనార్దన"
స్థితోఽస్మిగత సందేహః॥ అను భగవద్గీత వాక్యానుసారముగా నా సందేహములన్నియు నశించినవి. మీ అనుగ్రహముచే సకలదుఃఖములు క్షయించినవి. స్వాత్మానుభవ జ్ఞానము కలిగెను. ఏది జీవత్వోపాదకమై అజ్ఞాన కారణమైయున్న బుద్ధ్యావరణము తొలగిపోయినది. అందుచే తత్కార్యములగు సంకల్ప వికల్పములు ఇంద్రియాది చేష్టలెల్లయుడిగిపోయినవి. పరమోపరతి పరమశాంతి లభించెను. నిశ్శోక నిరుపమానంద స్థితియు లభించెను. మాలిన్యబుద్ధి అనాత్మభావన తొలగిపోయెను. శుద్ధబుద్ధి పరిశుద్ధజ్ఞాన ముదయమాయెను. స్వస్వరూప స్థితితెలియబడెను. సచ్చిదానంద పరబ్రహ్మమయితిని అజ్ఞానము గళితమాయెను. బ్రహ్మము జీవుడు వేరుగాదు. జీవుడేబ్రహ్మము. బ్రహ్మమే జీవుడు. అనునట్టి బ్రహ్మైక్యజ్ఞానముచే పరోక్షమైనట్టియు అపరోక్షమైనట్టియు దృశ్యమును నేను తెలియుటలేదు. ఇది అది యను భేదభావము నశించినది. కేవలాఖండ సద్వస్తువు ఏకరసము పరిపూర్ణము పరబ్రహ్మమే యున్నది. అదియే నేను నేనే అదిగాయున్నాను. నన్ను వినా వేఱొటిలేదు.

కనుక ఇట్టి అఖండపరిపూర్ణ స్థితిచే భిన్నము తెలియుటలేదు. మరేమనిన సర్వేంద్రియ విలక్షణమగు, శాశ్వతమగు, సుస్థిరమగు, నిరవధికానందము నపారముగా ననుభవించుచున్నాను.

ఇంతమాత్రమేగాని యింత పరిమితిగలదిగాని ఇంతవరకుండునదిగాని చెప్పశాలను. ఊహింపశాలను. అస్వాత్మసుఖమనంతము. అఖండ అప్రాకృతము కేవలానుభవైక గమ్యము అదిభావపదార్థమేగాని అభావముగాదు. శూన్యముగాదు. పరిపూర్ణము. మోహరూప అజ్ఞానమున్నప్పుడు ఇదింతయు అదిఇది యను ప్రపంచముగా గాంచితిని. జ్ఞానబోధ సూర్యోదయము కాగానే ఆయజ్ఞానమేటులబోయెనో తెలియదు ఇదేమిచిత్రము.

ఓ మహానుభావా! స్వామిన్ దయామయా తమఅపారకరుణా మయామృతమయ ప్రశాంతప్రసన్నదృష్టిచే నాకుప్రాప్తమైన యఖండమైన యపరిచ్ఛిన్నమైన నిరవధికానందామృత ప్రవాహముచే నిండి నిబిడీకృతమైన పరబ్రహ్మ సాగరముయొక్క వైభవము వచింపసాధ్యముగాదు. అటుగాక మనస్సుతో నూహింపనూ శక్యముగాకున్నది. అపరబ్రహ్మానందమునే మనవచ్చును నిరతిశయము అవాఙ్మనసగోచరము పరబ్రహ్మమెటుల వాక్కులకు మనస్సుగూడ యందనిదో ఆయానందముగూడ నట్టిదియే. యగుచున్నది. వేరుజెప్పనేల ఆనందమే బ్రహ్మము. బ్రహ్మమే ఆనందము. శ్రు॥ ఆనందో బ్రహ్మేతి. వ్యజానాత్॥ అను శ్రుతియు నా విషయమునే తెలుపుచున్నది. ఇచ్చోట పరబ్రహ్మము ఆనందసాగరముగా వర్ణించుచున్నారు. సాగరమపారమైనది. దానివంతయు దెలియ సాధ్యముగాదు. చూచుకొలది పోవుకొలది జలమయమై అనంతకల్లోలతరంగులమై యుండును. అచ్చటచ్చట తెల్లదీవులుండును. అలాగున పరబ్రహ్మముయొక్క ఆనందోదధియు కేవలానందమనెడు స్వచ్ఛజలముతో గూడుకొని తలంచినను చూచినను ఆనందమయమై అనుభవించుకొలదియు తరుగనిదియునై అనంతమై యున్నది. పరబ్రహ్మసుఖమిట్టిదనియు యింతయనియు నిర్ణయింప శక్యముగాకయున్నది. ఆపరబ్రహ్మము శబ్దాతీతమగుటచే మనవాతీత మగుటచే వాగతీతమై మహోన్నతమైయున్నది. ఈపరబ్రహ్మార్ణవమందు కేవలామృతమయ మాధుర్య జ్ఞాన వీచికలు పుంఖాను పుంఖములుగా నున్నవి. ఉపనిషద్విహారములనెడు గొప్పదీవులు అతీంద్రియ జ్ఞానులగు బ్రహ్మజ్ఞానుల విహారయోగ్యములై యున్నవి. సముద్రమున మునింగవిణారు

మరణించుచున్నారు. తిరుగా పుట్టుచున్నారు. ఈ ఆనందామృత సాగరమున మునిగినవారు తిరుగా జన్మమునధరించరు. మరణించరు అమృతమయులై ఆనందశయ్యపై ఆనందమయులై విహరించుచున్నారు. ఆనందామృతమునే పానముచేయుచు నట్టి యఖండామృత జీవనమునే గడుపుచున్నారు. కాబట్టి ఈ పరబ్రహ్మానందామృతాబ్ధి యపారముగాయున్నది. సముద్రములో నదగండ్లుపడి యెచ్చోటనో లీనమగుచున్నవి. వానిస్వరూపమే తెలియబడదు. ఆ తీరున నాచపల చిత్తముగూడ నిశ్చలమై సూక్ష్మాతి సూక్ష్మమై ఆ యానంద విజ్ఞాన రత్నాకరమునచేరి లీనమైనది. కావున చిత్తము యొక్క స్వరూపము గూడ తెలియకున్నది. నదగండ్లు యనునవి జలమయముగాన జలమంతయు సముద్రమునుండియే వచ్చియున్నందునసే లయించుచున్నది. ఆలాగున మనస్సుగూడ ఆనందమయము ఆమనస్సును బ్రహ్మమునుండియే వచ్చినది. తిరుగా ఆబ్రహ్మములోనే చేరుకొన్నది. ఇకదృశ్యములేదు. అంతయు అమృతమయము. విజ్ఞానమయము. ఆనందమయము ఇందుచేతనే "మనోబ్రహ్మేత్యుపాసీత" అను శ్రుతియు వచించుచున్నది. నదులన్నియు తమగమనము నాపక సముద్రాభిముఖములై ప్రవహించుచు నందులోజేరి సముద్రరూపములగుచున్నవి. గాని నదులాసముద్రము యొక్క అంతమును తెలియుటలేదు. స్వరూపమును తెలియుటలేదు. ఆ స్వరూపమును మాత్రము ధరించుచున్నవి. ఆ న్యాయమునను సరించి జీవులుగూడ మనస్సనెడు ప్రవాహరూపమున పరబ్రహ్మానందసాగరమున కభిముఖులై పోవుచు నందులోకలియుచున్నారు. జీవుని చిత్తములాబ్రహ్మమును తెలియజాలవు. జీవుల చిత్తముల మాత్రము పరబ్రహ్మరూపములగుచున్నారు. లేక అగుచున్నవి. చిత్తము బ్రహ్మమును భావించి భావాతీత బ్రహ్మములో లయించినప్పుడు జీవుడును పరబ్రహ్మమగుచున్నాడు. నదుల సముద్రముకన్న వేరుగానట్లు యేదియు బ్రహ్మముకన్న వేరుగాదు ఇదియే యదార్థము. కాబట్టి శిష్యుడు నామనస్సు పరబ్రహ్మస్వరూపమందు లయించినదని తెలియబరుచుకొనుచున్నాడు. నామనస్సు సముద్రమందు నదగండ్లవలె అనంతమైన పరబ్రహ్మమందు యేదోయొక కొంచెములో కొంచెమగు దానియొక్క లవలేశమందు చెప్పవీలులేని అంశమున్న పూర్తిగా లీనమయినది. మనస్సనగా సంకల్పము. సంకల్పమునశించిన దృశ్యముండునందుచే తాను పరబ్రహ్మమేయగుచున్నాడు. "తార్కికులు అణుపరిమాణం మనః"

అని వచించియున్నారు. అణువుయొక్క స్వరూపము దృష్టికి గోచరముగాదు అట్టిమనస్సుగూడ కనబడునదిగాదు కేవలభావరూపమైయున్నది. ఇంతసూక్ష్మాతి సూక్ష్మమగు మనస్సు విశ్వమంతటిని సృజించి నానావిధరూప సంసారమును కల్పించి సుఖదుఃఖముల ననుభవింప జేయుచున్నది. చిత్తమే జగత్తుగా యున్నది. ఈవిషయమంతయు ఉపనిషత్తులలో ప్రతిపాదింప బడియున్నది. కావున చిత్తము లేకపోయిన నానావిధమగు జగత్తు లేదు కేవలము పరబ్రహ్మమేయున్నది. ఇంతసూక్ష్మమగు చిత్తము అనంతమగు విశ్వమును సృజించుట ఆశ్చర్యకరముగాయున్నది. అయినను స్థూలదృష్టిచే నటుల తోచునుగాని పరబ్రహ్మదృష్టితో జూచిన యీ చిత్తముగాని చిత్తకల్పితమగు దృశ్యముగాని కానుపించుటలేదు. ఆవిషయమునే వ్యవహారార్థముగా "ఏకాంశేనస్థితోజగత్" అనగా పరబ్రహ్మమందు ఈజగత్తు యేకాంశమునయున్నది. అని భగవద్గీత తెలుపుచున్నది. అందుచే అనంతమగు నీ పరబ్రహ్మమందు జ్ఞానులకు జగత్తుగా తోచుచిత్తము లయించి పోయినది. దానిస్వరూపముగూడ తెలియబడుట లేదు. కేవలానందము మాత్రము అనుభవింపబడుచున్నది. కావున నాచిత్తము అఖండ సుఖమునొందినది. అచ్చటనే విశ్రమించినది. చిత్తము పరబ్రహ్మమందు సర్వనాశనమునొందినది. సకల బంధములు నాశములాయెను. సకల దుఃఖములు నశించిపోయెను. అనంతసుఖమబ్బెను అంతయు ఆనందమే మఱియు శిష్యుడు నాకు దృశ్యరహితమను విషయమును మిగులాశ్చర్యముతో వచించుచున్నాడు. సామాన్యముగా తనకు లభ్యముగాని వస్తువులభించునప్పుడ బహుయాశ్చర్యపడుచున్నారు. తనదగ్గరయున్న వస్తువు గనపడక వెతకివెత వేసరినప్పుడు తిరుగా ఆవస్తువు వెంబడే లభించిన యెడల ఎంతో ఆశ్చర్య చకితులగుచున్నారు. ఆలాగున తనకావరవస్తువు లభ్యముగాదని తలంచియు దెను. ఇపుడది లబ్ధమాయెను. ఆ పరవస్తువు తానుగానేయుండి ఇంతదన తెలియనందుకు మిగుల ఆశ్చర్యమొందెను. ఓహో నాచేతయిప్పుడే ఈకః వంద్యే చూడబడినది. ఈదృశ్యం ఎచ్చటికిపోయెను. ఇటులవచించుటచే గు వదేశముకాగానే అనగా వెంబడే సూర్యోదయముగాగానే చీకటి పోయినట అజ్ఞానాంధకారము పరుగులిడెనని యర్థము. అయజ్ఞానమెచ్చట నుండివచ్చె ఇప్పుడెచ్చటికి పోయెడాగెను. ఏమియు తెలియకున్నది. ఇదెంతఆశ్చర్య మిప్పుడు కనబడినది. లేకపోవుటకు కారణమేమి? అనగా అజ్ఞానమున

మూడు కాలములందును లేనిదే యగుచున్నది. అజ్ఞానమొక పదార్థముగాదు. మరేమన తనను తాను తెలియక భ్రమపడుటయేకారణము తెలిసికొనిన ఆ పర బ్రహ్మమేయున్నది. ఈ తెలివిలేనితనము నన్ను పెనుభూతమువలె అనేక శరీరములు కల్పించి అనగా బహువిధ జన్మలమంది బాధించుచుండెను. దీని దుఃఖము చెప్పనశక్యముగాదు. ఎంతతరమునుగాదు. ఇంతయు విచారించిన అంతయు హాశక్కే. ఒక వస్తువుయుంటూ యుండిన అదొకప్పుడు లేకపోవచ్చును దానికి యే యాశ్చర్యములేదు. పూర్తిగా లేనిదొకప్పుడు భాసించుటయు బాధించుటయు విదియేకదా, కడునాశ్చర్యమైయున్నది. ఈలాగున తనకు గలిగిన ఆనందమును ఆశ్చర్యమును చెప్పను తలంపను తరముగాని దానినిగా తెలియజేసుకొనుచున్నారు. శ్రీ గురుదేవుడు అనాది మాయాశృంఖలములనుండి నొక తృటిలో తనను విముక్తుని జేసినందులకు ఆ యాపారమహిమను కొనియాడుచున్నారు.

శ్లో॥ ఆత్మానమంజసావేద్మి, క్వాప్యజ్ఞానం పలాయితం ।
కర్తృత్వమపిమేనష్టం. కర్తవ్యం నాపివిద్యతే ॥

తా॥ నేను ఆత్మను నిస్సంశయముగా నెఱుగుచున్నాను. నాయజ్ఞానము గంతులిడ పరుగిడిపోయెను. నాకర్తృత్వ భోక్తృత్వాది బుద్ధియు నశించినది. నాకు కర్తవ్యముగూడ లేదు. అనంతసుఖమబ్బెను.

శ్లో॥ ధన్యోఽహం ధన్యోఽహం, దుఃఖం సాంసారికం నవీక్షేఽద్య ।
ధన్యోఽహం ధన్యోఽహం, స్వస్యాజ్ఞానం పలాయితం క్వాపి ॥

తా॥ ఇప్పుడు నేను దుఃఖస్వరూపమగు సంసారమును గాంచువాడనుగాను అందుచేత నేను కృతార్థుడనైతిని. నాయొక్క అనేక జన్మకర్మ వాసనాసమూహముగల అజ్ఞానము ఎక్కడకోపారిపోయెను. అనగా నశించెను, కాబట్టి నేను ధన్యుడను ఈలాగున శిష్యుడు గురుదేవునిదగ్గర భక్తిశ్రద్ధలతో విన్నవించుకొనుచున్నారు. ఇదియే తత్త్వజ్ఞుడగు శిష్యుని లక్షణము. బ్రహ్మజ్ఞానమాశ్చర్యకరమైనదనియు దుర్లభమనియు "ఆశ్చర్యవత్పశ్యతి కశ్చిదేనం" అని భగవద్గీత చెప్పుచున్నది. "ఆశ్చర్యోవక్తా కుశలోఽస్యలబ్ధా" అను కఠోపనిషత్తు మంత్రమున్ను తెలుపుచున్నది. కావున శిష్యుడు గురుకృపచే దుర్లభమైన కడు నాశ్చర్యకరము గొలుపు సుస్థిర బ్రహ్మతత్త్వమును తెలిసి కడునానందమును, జ్ఞానసిద్ధిని బడసినవాడాయెను. జ్ఞానమందజ్ఞానమెన్నటికీ లేదని భావము.

మతియును శ్రీ సద్గురుదేవుని అపార అవ్యాజ కరుణామయ, విజ్ఞానమయానంద. మయామృతమయా పరిచ్ఛిన్న కటాక్షపాతరూప సర్వసంశయ విచ్ఛేదక మహావాక్యరూప బోధరూప అనుపమానుగ్రహంబులిమిచేతనే పరిపూర్ణస్థితినిపొందితిని నిజమును తనుగొంటిని యని శిష్యుడు నుడువుచున్నాడు. గురుకరుణలేనిదే జ్ఞానము గలుగదు యీవిషయమునే ఉపనిషత్తులు తదితర వేదాంత గ్రంథములుగూడ నొక్కి వక్కాణించుచున్నవి. గురుకరుణకై ప్రయత్నించినవారు సకలాధారమగు జ్ఞానమును సులభముగాపొందుచున్నారు. శిష్యుడీలాగున విజ్ఞాపనము జేసికొనుచున్నాడు. శ్రీ సద్గురుదేవుని యొక్క మహిమనేమని కొనియాడుదును అజ్ఞానమయమగు దేహాది ప్రపంచసాగరమున దుర్నివార దుస్పృహ సంసార దుఃఖమనాదిగాయుండ అనేక యోనుల జన్మకారణమైయుండెను. పేడపురుగువలె సంసారవిషయ సుఖములయందే పడిపొర్లాడుచుంటిని సంసార పంకిలములోబడి వరాహమువలె మలినాత్ముడనై యుంటిని. ఆ సద్గురుకరుణచే సంసారగ్రహమునుండి విడివడితిని "భవగ్రహాత్" సంసారమనగా అజ్ఞానము ఈ అజ్ఞానగ్రహము అనేకజన్మలనుండి వెనువెంట నేనను పట్టి వచ్చుచుండెను అట్టిది గురువుయొక్క అనుగ్రహముచే దొలంగిపోయెను. అజ్ఞానమనునది యొకానొక అనాది సిద్ధమయిన మహాగ్రహము వలెనున్నది. గ్రహావిష్టుడైన పురుషుడు పండితుడైనను తనయొక్క నామజాత్యాదులను గూడ వదలి పిశాచముయొక్క నామ జాత్యాదులను చెప్పుచున్నాడు. తనకున్న భాషనుగాక వేరుభాషతో మాట్లాడుచున్నాడు అంతయు పిశాచస్వభావము రీతిగా వ్యవహరించుచున్నాడు. తన పూర్వస్థితినంతయు మారిపోవుచున్నది, అలాగున అజ్ఞాన గ్రహపీడితుడును తనయొక్క సహజానందస్థితిని అమృతస్వరూపమును మఱచి సుఖిని దుఃఖిని యనిభావించును భ్రాంతుడై తెలియనివాడై ప్రకృతిస్వభావానుగుణ్యముగా ప్రవర్తించుచు అనంతదుఃఖములకు పాలగుచున్నాడు. గ్రహపీడితుని గ్రహము మహామాంత్రికునిచే దూరీకృతమగునటుల శ్రీ గురుదేవుడు శిష్యునియొక్క అనాదిసిద్ధ సకలదుఃఖాత్మక మాయామయస్వభావమును మహామంత్రమగు మహావాక్య ప్రభావముచే పోగొట్టుచున్నాడు. గ్రహరహితుడు తనపూర్వస్థితినిపొంది సహజావస్థతో విహరించునటుల అజ్ఞానరహితుడును తనయొక్క స్వస్వరూప పరబ్రహ్మత్వమునుపొంది సహజానందావస్థలో విహరించుచున్నాడు, అమందానందమును నొందుచున్నాడు ముందుతనకున్న పైశాచ గ్రహ

మున్నందుచే బాధితుడాయెను. ఇప్పుడాగ్రహములేనందుచే తానుమాత్రమున్నందుచే సుఖమునొందెను. అటులనె ముందుదృశ్యరూప అజ్ఞానముబాధించుచుండెను ఇప్పుడా రెండవదగు దృశ్యములేనందుచే తన్నుతానై యున్నాడు. అనేక జన్మకృత పుణ్యసంచయముచేతను జన్మాంతరములనుండి తాననుష్ఠించుచున్న సాధన విశేషములచేతను. ధ్యాన ధారణాదులచేతను, పొందదగిన పూర్ణస్థితిని సద్గురు కరుణా ప్రభావముచే సకృదుపదేశము శిష్యుడు సులభముగా పొందుచున్నాడు. ఇదంతయు అదయామయుడగు గురుదేవుని అవ్యాజానుగ్రహముచేతనే సిద్ధమగుచున్నది ఇందుకు ప్రమాణములు.

శ్లో॥ గ్రహావిష్టోద్విజః కశ్చిచ్ఛూద్రోఽహమితి మన్యతే।
గ్రహనాశాత్పున స్స్వీయం బ్రాహ్మణ్యం మన్యతే తథా॥

తా॥ వేదబ్రాహ్మణుడు శూద్రగ్రహమావరించినప్పుడు శూద్రుడని తలంచి ఎవరడిగినను శూద్రుడనియే చెప్పును. ఆగ్రహము తొలగినపిమ్మట తన నిజస్థితియగు బ్రాహ్మణ్యమును తెలిసికొని బ్రాహ్మణుడనియే చెప్పుచున్నాడు.

శ్రు॥ మాయాఽవిష్టతో జీవః దేహోఽయమితి మన్యతే।
మాయా నాశాత్పున స్స్వీయం రూపం బ్రహ్మాస్మి మన్యతే॥

తా॥ మాయ యనుగ్రహముచే నావేశింపబడినవాడు గనుకనే నేను దేహమనియు బద్ధుడనియు, దుఃఖియనియు తలంచుచున్నాడు. గురువను మహామాంత్రికునిచే నామాయాగ్రహము తొలగగా నిజరూపమగు బ్రహ్మస్వరూపము ప్రకాశించి తాను నిత్యముక్తుడనియు బ్రహ్మమేయనియు తెలియుచున్నాడు. అప్పుడఖండ బోధ కలుగుచున్నది. కాబట్టి నేను గురుకరుణచే మాయనుండి ముక్తుడనయితిని సకలదుఃఖములు నాశమొందినవి. స్వస్వరూప పరబ్రహ్మమును గనుగొని సత్యమెఱింగితిని నేను సదా ఆనందస్వరూపుడను. పరిపూర్ణుడను. అఖండ విజ్ఞానమయుడను అయితిని. నిస్సంశయము అందుచే నేను ధన్యాత్ముడను. నాపురాకృత పుణ్యసంచయము ఫలించెను. నాగీతోపనిషదాది సతత శ్రవణమననాదులు సకలసాధనలు సార్థకములాయెను; నాజన్మసార్థక్యతను వహించెను. నేను కృతార్థుడను చేయవలసినది చేయబడెను పొందగలిగిన దానిని పొందితిని ధన్యాత్ముడను. పరిపూర్ణుడను.

శ్రు॥ విదితో వేదరహస్యం విదితో దేహాది రయమనాత్మేతి।
విదితం పర ఇతిచాత్మా కిమతః పరమస్తి జన్మసాఫల్యమ్॥

కాః వేదరహస్యము విదితమాయెను. ఈ దేహాదులనాత్మయనియు, విదితములాయెను ఆత్మపరవస్తువనియు విదితమాయెను. ఇట్టి విజ్ఞానముకన్న వేరే జన్మ సాఫల్యమేమియున్నది. ఇంకను శిష్యుడు తన విడాముతన సిద్ధస్వరూపమును విశదముగా మనవి చేసుకొనుచున్నాడు. అహం అనగా నేను అద్వితీయ పరబ్రహ్మమగుటచేతను దేనితో సంగము నాకులేదు సర్వవిలక్షణుడను అసంగుడను. అనంగః నిర్మల బోధస్వరూపమగు నిర్గుణ నిర్వికార నిరుపమాన పరతత్త్వ స్వరూపుడగుటచే హస్తపాదాద్యుక్త శరీరము లేనివాడను అటులనే అంతఃకరణాద్యుక్త సూక్ష్మ శరీరశూన్యుడను మాయా మయకారణ శరీర రహితుడను ఇటుల శరీరత్రియ, అవస్థాత్రియ, జీవత్రియ, గుణత్రయ, కాలత్రయ మొదలగు త్రితయములు లేనివాడను "అలింగః" నాయందు మాయా లక్షణములు, లక్షితములు గావందుచే మాయా చిహ్నరహితుడను స్త్రీపురుషాది లింగ శూన్యుడను ఉపక్రమోపసంహారాది షడ్విధలింగములచేతను తెలియబడు వాడనుగాను. అప్రమేయుడను ధూమాదిలింగములచే లింగులగు అగ్న్యాదులు సిద్ధించునటుల దేనిచేతను నాకు లింగములు లేనందుచే సిద్ధించు వాడనుగాను. స్వతస్సిద్ధుడను అతరంగురహః అలలు వచ్చుచు పోవుచు నాశశీలములగు లాగున నేను జనన మరణములనొంది నశించు స్వభావము గలవాడనుగాను. శాశ్వతుడను నిస్తరంగ నీరరాశివలె సంకల్ప వికల్పరహితుడను. "ప్రశాంతః" సకల వృత్తులుపశమించినందుచే సకలేంద్రియా తీతమగు పరమ ప్రశాంతిని, ఉపరతిని, ప్రసన్నతను పొందినవాడను. "అనంతః" దేశకాలాది పరిచ్ఛిన్నములు లేనివాడను ఆదిమధ్యాంత రహితుడను. అఖండరూపుడను, పరిపూర్ణానంద స్వరూపుడను, నాశరహితుడను. "అమలః" ఏలాటి మాయా మాలిన్యములు లేనివాడనగుటచే మాలిన్యరహితుడను, అవిద్యారహితుడను, ప్రబోధ స్వరూపుడను, నిర్లిప్తుడను "చిరంతనః" ఆది దేవుడను, పురాణపురుషుడను "వాసుదేవస్సనాతనః" శ్రీ వ్యాసభగవానుని వాక్యానుసారముగా సనాతనుడను, "అచలోఽయం సనాతనః" భగవద్గీతానుసారముగా అచలుడను సనాతనుడను ప్రాచీన వేద వేద్యుడను అనాదికాలమునుంచి యుండువాడను సర్వకాలములందు మూలభూతుడను, సర్వదా త్రికాలాబాధితుడనై కాలత్రియాతీతుడనై శాశ్వత వస్తుమాత్రమైయున్నాను. సంగత్వ, అంగత్వ, లింగత్వ, తరంగత్వ, శాంతి రహితత్వ, అన్తత్వ, మలినత్వ, అపురాణత్వములగు మాయా సహజములగు

అజ్ఞానరూప జీవత్వ సంపాదకములగు ఎనిమిది లక్షణములు లేనివాడినై పర బ్రహ్మత్వ సంపాదకములగు అసంగత్వ అలింగత్వాది అష్టవిధ స్వరూప లక్షణములతో గూడుకొనిన వాడనై యున్నాను. అనగా సద్గురు కరుణచే జీవత్వముపోయి జీవుడు బ్రహ్మమేయను నిశ్చయ జ్ఞానముగలిగి శివత్వము నొంది శివి. పరబ్రహ్మమయిశివి. పరిపూర్ణుడను అఖండ సచ్చిదానంద రూపుడనై శివి సంశయములేదు. ॥ అశరీరం శరీరేషు ॥ మొదలగు ఉపనిషత్తులు అసంగత్వాదులు తెలుపుచున్నవి.

శ్లో ॥ యస్యాంతం నాదిమధ్యం, నహికరచరణం, నామగోత్రంనసూత్రం
నోజా తిర్నైవవర్ణో నభవతి పురుషో నోనపుంసో నచస్త్రీ.
నాకారం నోవికారం నహిజని మరణం నాస్తిపుణ్యం నపాపమ్
నోతత్త్వం తత్త్వమేకం సహజసమరసం సద్గురుం తన్నమామి॥

తా॥ ఆ పరబ్రహ్మము ఆదిమధ్యములు, కరచరణాద్య వయవములు, నామ గోత్ర సూత్రములు, జాతివర్ణములు, పురుష స్త్రీ నపుంసక భేదములు, ఆకార వికారములు, జనన మరణములు, పుణ్యపాపములు, పంచభూతాది తత్త్వములు లేనిది సర్వాతీతము, ఏకతత్వము, సహజానందము, సమరసము అదియేసద్గురు రూపము, అట్టి సద్గురురూప పరమాత్మను నమస్కరించుచున్నాను. అట్టి పర బ్రహ్మము నేనుగానే యున్నాను.

శ్లో॥ ఆదిమధ్యాంత రహితః నబద్ధోఽకదాచన।
అనంస్థత్వాన్నమేదుఃఖ మజ్ఞానాద్భాతి సత్యవత్ ॥

తా॥ అజ్ఞానవశముచే నిదంతయు నత్యముగా తోచుచున్నది, ఆ అజ్ఞానము నశించినందుచే నేను చిద్రూపుడను జడత్వమునాకులేదు. సత్స్వరూపుడను నాకు అనృతత్త్వములేదు నేనాందరూపుడను దుఃఖమొకించుకయులేదు మఱియు నేను కర్తనుగాను నాకు అహంకారమమకారములతో గూడుకొన్న కర్తృత్వ బుద్ధి (అన్నిటికిని నేను కర్తను నేను జేయుచున్నానను భావము) లేనివాడను నేనుభోక్తనుగాను నేను సమస్తము ననుభవించువాడను ఈ సకలభోగములు నాకు భోజ్యములను భావములేనివాడను కర్తయు భోక్తయుగాని అపరబ్రహ్మమే నేనై యున్నాను. క్షణ క్షణము మారునట్టి స్వభావములు లేనివాడను, అపరిణామిని కామక్రోధాది రాగద్వేషాది వికారములెవ్వియు లేనివాడను, ఏలాటి చలనము లేనివాడను నిర్వ్యాపారుడను వ్యాపృతములగు సకలేంద్రియ

ములు కతీతుడనై ప్రశాంతరూపుడనై యుండువాడను. పరబ్రహ్మము అవి కారి, అపరిణామి క్రియారహితము, అచలము. సర్వేంద్రియాతీతము. చైత న్యము అట్టి పరమాత్మను నేను. ఇక నేను కేవలుడను. అద్వితీయుడను. ముఖ్యుడను. ఏకాకిని. నిరాధారుడను. నిరాశ్రియుడను. కేవలచైతన్య స్వరూపు డను. పరిశుద్ధ విజ్ఞాన స్వరూపుడను. నిత్యశుద్ధ బుద్ధ ముక్త స్వరూపుడను. నేను సర్వదా మంగళ స్వరూపుడను పంచదైవములనబడు బ్రహ్మ విష్ణు మహేశ రుద్ర సదా శివులలో ఐదవదగు సదాశివుడను పరమతురీయమగు సహస్రార మున నున్నవాడను ముఖ్య తాత్పర్యము కర్తృత్వాది విశిష్టజీవత్వ రహితుడనై సచ్చిదానందమయమగు అకర్త్రాది విశేషణవిశిష్ట పరబ్రహ్మమునేను వేరుగాదు అపరిణామ అవికారి నిత్యనిర్మల విశుద్ధ బోధచైతన్య స్వరూపుడను ఇట్టి అఖండ పరిపూర్ణ విజ్ఞానమయ సానుభూతి శ్రీ సద్గురు కృపాదృష్టి చేతనే లభ్యమయినదని తాత్పర్యము. మఱియు

నేను చూచువానికంటెను, వినువానికంటెనుచె. ప్పువానికంటెను. కర్తకంటెను. భోక్తకంటెను. విలక్షణుడను ఆత్మ-ద్రష్టయు శ్రోతయు. వక్తయు-కర్తయు భోక్తయుగాదు అట్టి పరబ్రహ్మ స్వరూపాత్మను నేనుగాయున్నాను. ఆత్మ ద్రష్టయని చెప్పినచో ద్రష్ట ఆత్మ ప్రపంచము దృశ్యము వృత్తి చూచుట ఇటుల ద్రష్ట దర్శన దృశ్యములను త్రిపుటి సంభవించును. శ్రోత మొదలైన విశేషణములు ప్రయోగించినప్పుడును పైతీరున త్రిపుటి యుండయేయున్నది. గావున త్రిపుటి రహితమయినందుచే ద్రష్టగాదు. ఇటులనే శ్రావ్య శ్రవణ శ్రోతలు వాచ్యవచన వక్తలు, కార్య-కరణ-కర్తలు, భోజ్య-భోగ-భోక్తలు జ్ఞేయ-జ్ఞాన-జ్ఞాతృలు మొదలగు త్రిపుటలన్నియు ఆత్మయందు లేవని తెలియ వలెను. సర్వవిలక్షణమై యున్నది. ఆత్మసర్వసాక్షియనిన దృశమునకు సాక్షి యని యర్థమగుటచే యట్లేటను త్రిపుటియున్నది. ఆత్మసాక్షికిగూడ అతీత మైయున్నదని తెలియంగవలయును. ఆయాత్మ కేవల అహంప్రత్యయ సిద్ధమై యున్నది.

అహం నేను యని అర్థము. సర్వదృశ్యమును తొలగింపగా నేను (ఆత్మ) యనునది మిగులుచున్నది. కావున సర్వదృశ్యరహితము కర్తృత్వ భోక్తృత్వాది రహిత మాత్మయని సిద్ధమాయెను. మఱియు నేను (ఆత్మ) సర్వకాల సర్వావస్థలయందున పరిణామిమై మూడు కాలముల యందును

బాధింపబడక ఏకరూపముగాయున్నాను. సందులేనివాడనై సర్వత్ర వ్యాపించి యున్నాను. ఏలాటి క్రియలు, గుణములు, వృత్తులులేవు. అచలుడను నాకవ ధియేలేదు. నిరవధికుడను, అనంతుడను, అసంగుడను మాయను యంటక యున్నను. సర్వాతీతుడను, పరిపూర్ణుడను, ఇంద్రియ తాదాత్మ్యధ్యాసలు లేనందుచే అఖండ బోధరూపుడనై యున్నాను. కేవల విజ్ఞానమయామృతమ యానంద రూపుడనై యున్నాను. జీవుడు ద్రష్టత్వ శ్రోతృత్వాది ధర్మవిశిష్టుడై, యభిమానియై యుండిన బద్ధుడగుచున్నాడు. అద్రష్టృత్వాదులు తనకు లేవని తెలిసికొనిన నిత్యనిరంతరాది లక్షణోపేతుడైన బంధవిముక్తుడై పరిపూర్ణ బోధరూపుడగుచున్నాడు. అనగా జీవుడు బ్రహ్మమగుచున్నాడు. తాను స్వస్వరూప పరమాత్మ యగుచున్నాడని సారాంశము. జీవుడు కర్తృత్వాది సాంసారిక ధర్మముల పొందిన విధము తన్నివృత్తియు ఎటులనగా బ్రహ్మము సర్వపరిపూర్ణమయ్యును. వ్యష్టియందు ఉపాధి పరిగ్రహమువలన ప్రత్యగాత్మ లేక కూటస్థాత్మయనబడును. ఈ కూటస్థాత్మ బుద్ధియందు ప్రతిఫలించగా నా ప్రతిబింబము చిదాభాసుడు లేక జీవుడు అనబడి కర్తృత్వాది సాంసారిక ధర్మములతో సంచరించును. అనగా (శరీరము నుండి శరీరము ప్రవేశించును.) నీటి యొక్క చలనమువలన నీటియందు ప్రతిఫలించిన చంద్రబింబము యొక్క చలనము గగనస్థ చంద్రునిదేయని యనుకొనునటుల చిదాభాస విశిష్ట బుద్ధిధర్మములు కూటస్థాత్మయందు అజ్ఞానముచే గల్పింపబడినను కూటస్థాత్మ నిస్సంగుడు, నిర్మలుడు నిష్క్రియుడు ఇదియే సత్యము. మఱియు నీటియందున్న చలనాదులను ప్రతిబింబ చంద్రునియందు కల్పించులాగున అజ్ఞాన మహిమచే మనస్సునందు సంభవించుచున్న కర్తృత్వాది ధర్మములను నిర్మల కూటస్థాత్మయందు నూహించుచున్నారు. బింబమునుగాంచిన సందేహముడుగునటుల పరబ్రహ్మమును సందర్శించిన సకలసందేహములు దూరములై యాత్మబోధగలుగుచున్నది. గనుక శిష్యుడు గురుబోధచే యదార్థము తెలిసి నిత్యనిర్మల శాశ్వత నిరవధికానంద పరబ్రహ్మ స్వరూపుడాయెను.

అనగా నేను దృశ్యమానమగు నీ ప్రపంచముగాను అటులనే ఈ దేహేంద్రియాదులుగాను ఆంతరికమయిన సూక్ష్మమయిన మనోరూప ప్రపంచము నేనుగాను. అవి నాకులేవు అవి నేనుగాను, మఱేమనగా బాహ్యమయిన ఆంతరికమయిన సకలప్రపంచము జడమగుటచే విలక్షణుడై సూర్యభగవానుని

వలె సమస్తము ప్రకాశింప జేయువాడను స్వయంప్రకాశుడను పరమశుద్ధుడనై యుండువాడను. సూర్యభగవంతుడు గగన వీధిని సర్వవిలక్షణుడై తేజరిల్లు మాడ్కి నేను సర్వదృశ్య విలక్షణుడనై పరబ్రహ్మనై వేదాంత శిఖరమున విహరించువాడను. సర్వదా శుద్ధుడను. బుద్ధుడను మఱియు బాహ్యమనియు అంతర్యమనియు విభజనలేక సర్వత్రవ్యాపించి వెలుగొందుచును నిండియున్న పరిపూర్ణాద్వితీయ పరబ్రహ్మనే నేనై యున్నాను. ఈలాగున అహంబ్రహ్మాస్మి మహావాక్య అనుభవసిద్ధ విజ్ఞానమును శిష్యుడు శ్రీ గురుదేవుని దగ్గర తెలుసుకొనుచున్నాడు. కావున సర్వావభాసకమయిన పరబ్రహ్మమే తానుగా యున్నాడు.

మఱియు సమస్త దృశ్యరహితమయినదియు సర్వదా తనలో విశ్వం రూపమైనదియు నిర్మలమై ప్రకాశించుచున్నదియు స్వస్వరూప స్థితిచే నానంద రూపమైనదియు నగు పరబ్రహ్మమును నేనని తెలిసి సర్వదా తనలో భావింప వలయును. ఇదియే అఖండస్థితి విజ్ఞానానందరూప పరబ్రహ్మము తానై వెలుగొందు చున్నారు. అనగా సోఽహము ముందుగా బాహ్యప్రపంచము నేను గాదని విచారముచే తెలిసి తరువాత జడమనోబుద్ధ్యాది ప్రపంచమును గూడా విచార బలిమిచే విరనాడిన అవశిష్టమయినది పరశుద్ధాత్మయే యగుచున్నది. అది కేవల భానమానరూపము తదనంతరము అసద్వస్తు పాకటియే యఖండమై పరిపూర్ణమై యున్నందుచే బాహ్యాభ్యంతరములు లేవు. అంతయు అద్వితీయ పరబ్రహ్మమే యున్నది. ఈలాగున దృశ్యమును యింద్రియములను వరుసగా దాటి సర్వాధిష్ఠానమైన చైతన్యము తానుగావలయును. "ఇంద్రియేభ్యః పరాహ్యర్థాః" అని యుపనిషత్తును "ఇంద్రియాణి పరాణ్యాహుః" అని భగవద్గీతయు క్రమము దృశ్యమువంతటి నతిక్రమించి ఆత్మను తెలియవలయుననియే బోధించుచున్నవి. అప్పుడు ఇది. అది. నేను. వానిది. వీనిది. నాది. అను నీలాటి భావములులేక సర్వము బ్రహ్మమయమై తేజోరూపమై యుంటున్నది.

శ్లో॥ దృశ్యం దేహంచ, వాగాది శ్రోత్రాదీంద్రియ పంచకం ।
ప్రాణాది పంచకం, చైవ తథాంతఃకరణ మేవచ ॥
ముక్తిసౌధస్య సోపానా, అష్టాదశ ఇతిస్మృతాః ।
ఏతాన్ క్రమేణ చారుహ్య, బ్రహ్మభూయాయ కల్పతే ॥

తా॥ ముక్తియనెడు మహాసౌధము నారోహించుటకై దృశ్యము-కర్మేంద్రియ

పంచకము - జ్ఞానేంద్రియ పంచకము ప్రాణపంచకము మనోబుద్ధులు అను పదునెనిమిది మెట్లను దాటవలయును. విచారణాశక్తిచే సమస్త దృశ్యమును దాటినవారు బ్రహ్మస్వరూపుడగుచున్నారు. కావున దేహేంద్రియాది సమస్త దృశ్యము నతిక్రమించినపుడే బ్రహ్మమగును.

ఇంకను శిష్యుడు ఆ యద్వితీయ పరబ్రహ్మమే నేనయితిని అనుభవ సిద్ధమయిన విషయమును శ్రీ గురుదేవుని పాదములనర్పించిని మనవి చేసు కొనుచున్నాడు. ఆ పరబ్రహ్మము నిరుపమము రెండవ వస్తువు లేనందుచే అంతయు దానగుటచే సాటియగు వస్తువు లేనిదియు తాను తనకు సాటియై యున్నదనియు తనకన్న యాది వస్తువుగానమిచే నా పరబ్రహ్మమొకటియే యాదియైనదియు శాశ్వత పురాణ, పురాతన, సనాతన, ప్రాచీనాది శబ్దవాచ్య మయినదియు నీవు నేను సమీపమున నున్నందుచే (ఇది పదార్థ జాలము) ఇది ఇతను తనను వదలి యుండకపోవుటచే శరీరేంద్రియాదులు వాని సంఘా తము అది (దూరమున నున్న వస్తునిచయము) ఈతాగున దృశ్యజనిత నానా విధ భేదములకు దూరమయినదియు భేదరహితమైనదియు నిత్యమయినదియు కేవలానందరసమైనదియు సత్యమయినదియు నయిన యా అఖండాద్వితీయా నంద పరతత్త్వ పరబ్రహ్మము నేనగుచున్నాను. ఆ బ్రహ్మము వినా మఱి యొకటి లేదు. అదియే నేను నేనే అదియునై యున్నాను. అంతయు బ్రహ్మ నిరుపమత్వానాదిత్వాది సల్లక్షణయుతము. బ్రహ్మమనియు తద్విరుద్ధ ధర్మము లగు సదృశత్వాదులతో సహితము జీవత్వాపాదకా జ్ఞానమనియు దెలియ వల యును. కావున శిష్యుడు జీవత్వము దొలగి బ్రహ్మత్వమొందెనని భావము. మఱియు తనయొక్క చైతన్యత్వమును, అఖండత్వమును, సకల దేవతాస్వ రూప పరబ్రహ్మత్వమును శిష్యుడు నివేదించుకొనుచున్నాడు. నేను శుద్ధచేతనా స్వరూపుడనగుటచే నారాయణుడను సర్వవ్యాపకుడగు విష్ణుమూర్తిని విష్ణుమూ ర్తియు ఉపాధిని దూరీకరించి విచారించిన కేవల శుద్ధచైతన్య రూపుడై యుం టున్నాడు. విష్ణుమూర్తియు పరబ్రహ్మమే వేరుగాదు. నారాయణోపనిషత్తు నందు నారాయణుడనగా పరబ్రహ్మమనియే ప్రతిపాదించుచున్నది. పర బ్రహ్మచైతన్యమే నారాయణ మూర్తియై యున్నదని భావము. సమస్త చలనములు వశించి శుద్ధాత్ముడనగుటచే లేక అజ్ఞాన రహితుడనగుటచే నరకా సుర సంహారియగు కృష్ణమూర్తిగా యున్నాను. పరబ్రహ్మచైతన్యమే లోక

కళ్యాణమునకై కృష్ణమూర్తి రూపమాయెను. కృష్ణుడనగా పరమాత్మయే శక్తి లక్షణకై యుపాధియందు భాసించుచున్నాడు. నరకాసురునివంటి ప్రబలాజ్ఞానమును ధ్వంసము జేయుచున్నాడు. ఇట్టి శ్రీకృష్ణ చైతన్య పరబ్రహ్మము నేనుగాయున్నాను. త్రిపురములనగా స్థూలసూక్ష్మ కారణ శరీరములు వీటినతిక్రమించి నిరుపాధికుడైన నేను త్రిపురముల దహించిన మహేశ్వరుడనుగా యున్నాను. ఆపరబ్రహ్మచే తనాస్వరూపమే ఈశ్వరస్వరూపము ధరించినదై త్రిపుర సంహారము జేసి సృష్టిస్థితిలయములు చేయుచున్నదిగాన త్రిశరీరముల తన జ్ఞానస్వరూపముచే దహించిన అతీతమైన యాఈశ్వర చైతన్యమునేను ఈలాగున వాచ్యార్థముగా విచారించినను లక్ష్యార్థమురీతిగా పర్యాలోచించినను పరబ్రహ్మము సర్వదేవతా స్వరూపముగా యున్నది. కేవలము సద్వస్తువు తప్ప మఱియొక భిన్నవస్తువు గానమిచే నేనా పరబ్రహ్మమైయున్నానని భావము. శ్రీ కృష్ణనారాయణేశ్వరులును నేనేయని వచించుటచే సర్వాధిష్ఠాన చైతన్యము నేనే ఇటుల నామరూపమఖండము. సర్వాంతర్యామి అద్వితీయము సర్వవ్యాపకము త్రిగుణాతీతము, శుద్ధము, బుద్ధము, పరిపూర్ణము. ఆనందము యని భావము. నారాయణ శబ్దార్థము "నారాయణః పరోవ్యక్తాత్" అను శృతి వాక్యానుసారముగా నారాయణుడనగా అవ్యక్తమనబడు మాయకన్న పరుడైన పరమాత్మయని అర్థము. "నయతీతి (నరతీతి) నరః ప్రోక్తః పరమాత్మా సనాతనః" అని వ్యాసనారదులరీతిగా అందరిని తనలో పొందించువాడు సకల భూతములయందు సంచరించు వాడుకనుక నరుడనగా సనాతనమగు పరమాత్మ యని అర్థము. ఆపరమాత్మనుండి పుట్టినవి. నారములనబడును. నారములనగా ఆకాశాది తత్త్వములు "నారాణివ్యాప్నోతీతి ఆయనం అస్యనారాయణః" ఆకాశాదితత్త్వములను కారణరూపముతో వ్యాపించి స్థానమైనవాడు నారాయణ పరబ్రహ్మము జగత్తు కొంచముగానో గొప్పగనో చూడబడుచున్నదో వినబడుచున్నదో దాని యొక్క బయటను లోపలను వ్యాపించి యున్నవాడు నారాయణ పరబ్రహ్మమగును. లేక నరునినుండి అనగా పరమాత్మనుండి గలిగిన ఆకాశాదితత్త్వములకు స్థానముయినవాడు నారాయణుడు "నారాణాం" పరమాత్మకు సంబంధించిన జీవులకు "ఆయనత్వాత్ ప్రళయః నారాయణః" అనగా స్థానమగుటవలన ప్రళయకాలమున జీవులు ప్రవేశించుట వలన నారాయణుడనబడు చున్నాడు. "యత్ప్రయన్త్యభిసంవిశన్తి" ఏ పర

మాత్మలో ప్రవేశించుచున్నావో అని శ్రుతివాక్యము మఱియు తనయొక్క సర్వా త్మకత్వమును అఖండత్వ విజ్ఞానమును స్వానుభవసిద్ధముగా శిష్యుడు విన్నప మొనర్చుచున్నాడు. పరమాత్మ స్వరూపుడగునేను సకల చరాచరములయందు ఉన్నాను. మఱియు సకల ప్రాణులయందును జ్ఞాన స్వరూపుడనై యున్నాను. నా స్వరూపము బయటను వెలుపలను యెటుజూచినను జ్ఞానమయమైయున్నది అఖండ పరిపూర్ణ విజ్ఞాన స్వరూపుడను సకల భూతములు నాయందున్నవి. అనగా సకల జగత్తునకు అధిష్ఠాన చేతనమై వెలయుచున్నాను.

శ్లో॥ సర్వభూతేషు చాత్మానం, సర్వభూతాని చాత్మని ।
సమం పశ్యన్నాత్మయాజీ, స్వారాజ్యమధిగచ్ఛతి ॥

తా॥ సకల భూతములయందు తనను తనయందు సకలభూతములను గాంచు వాడు స్వారాజ్యమగు మోక్షము నధిష్ఠించుచున్నాడు. అను యుపనిషద్వాచ ముస విశదపరచుచున్నాడు. భోక్త భోజ్యము కర్త కార్యము ఇత్యాదిభేద జాత మంతయు జ్ఞానము లేకపోవుటచే నానావిధములుగా గానుపించెను. ఒకే వస్తువును తెలియజాలనైతిని ఇప్పుడా పరమగురుకృపాకటాక్షవీక్షణచే నేనఖండ స్థితిని పొందితిని. నాకుభిన్నముగా నేదియు గానుపించుటలేదు. ఇది వరకు చూడబడిన దంతయు బ్రహ్మమే వేరుగాదు. గనుక నేనొకడనే పరిపూర్ణ బ్రహ్మమై సర్వాత్మభావముతో యున్నాను. గనుక విజము కనుగొనిన యం తయు పరబ్రహ్మమే వేరుగాదు. భ్రాంతితొలగవలయును. అప్పుడు స్వబోధ సిద్ధముగుచున్నది. నిరావరణ నిర్గుణ తత్త్వము గోచరించుచున్నది. మఱియు తాను కేవలానందమయుడనియు మాయాబలిమిచే దృశ్యము పుట్టుచుండును. తిరుగా నశించుచుండుననియు సముద్రముకన్న అలలు వేరుగానట్లు సమస్త దృశ్యము పరబ్రహ్మముకన్న వేరుగాక యందులోనే లయించుచున్నదనియు కేవల మఖండరూపమే తాననియు తెలుసుకొనుచున్నాడు. తాను పరబ్రహ్మము కేవలానందమయుడై యమృతమయుడై సుఖమయుడై యున్నాడు. పరబ్ర హ్మస్వరూపుడగు తాను ఆనందమహోదధియై యున్నాడు. ఏటుజూచినను సుఖముతప్ప మఱేమియులేదు. "విజ్ఞానమానందబ్రహ్మ" అను శ్రుతి వ్రకా శము అంతయు విజ్ఞానము ఆనందము బ్రహ్మము సాగరమున వాయువు సంచరించుకొలది తరంగములు లేచుచున్నవి. వెంటనే అణగి పోవుచున్నవి. అటుల వాయుసంబంధమున్నంతవరకు అలల యొక్క ఉత్పత్తి వినాశములు

గలుగుచుండును. విచారించిచూచిన యాతరంగకల్లోలములుగూడా సముద్రము కన్న వేరుగాకనేయున్నవి. అలాగున మాయయగు ప్రిథంవాయు సంచార బలముచే దృశ్యవిస్ఫురణములు బయలుదేరును. నాశములుగూడ యగు చున్నవి. మాయయున్నంతవరకు దృశ్యము తప్పినదిగాదు. విచారించిన పృథ్వీరేణువులు భూతత్త్వముకన్న వేరుగావి యటులను మిణుగురు అగ్ని కన్న భిన్నముగావి యటులను సమస్తము పరబ్రహ్మముకన్న వేరుగాదు. సముద్రమందు అలలుత్పన్నమై నాశవంతములగుచుండును. సముద్రము మాత్రము చంచలరహితమై యుండును. అలాగున సకల దృశ్యములను యుత్పత్తి నాశములగుచుండును. వానికన్నిటికిని ఆధారమగువట్టి పరబ్రహ్మము అచలము సనాతనము శాశ్వతము ఇట్టిస్థితి హొందిన అనగా జ్ఞానము గలిగిన ప్రికృతివశించి ముక్తావస్థనుహొంది అఖండాత్మయగు చున్నారు.

మఱియు అఖండ విజ్ఞాన పరబ్రహ్మ స్వరూపినగు నాయందిస్థూల సూక్ష్మకారణ ప్రపంచము భ్రాంతిచే కల్పితమై భాసించుచున్నది. నిర్మలగగనమందు గంధర్వ నగరాదుల మాదిర్కి పరబ్రిహ్మమందు ప్రపంచము ప్రతీయమానమగుచున్నది. నిజమెరింగిన భ్రాంతినశించి యధార్థసత్యము బోధితమగుచున్నది. యను విషయమును దృష్టాంతముగా శిష్యులు నిరూపించుచున్నారు. అనగా భ్రాంతి అజ్ఞానము మాయవిద్య మోహము అధ్యాసము ఆరోపము ఇవి మొదలగునవి సమానార్థకములై యున్నవి. భ్రాంతియొక్క రూపమేమనగా జ్ఞానము లేనప్పుడు మహావిస్తృతమై అప్రకంప్యమై యుంటున్నది. సూర్యుడు రాకముందు మంచువర్షమువలె కురియుచునేయుండును. చీకటియు వ్యాపించియే యుండును. అతీరున అజ్ఞానరాత్రియందు జడత్వమను మంచువర్షము యెడతెంపులేక యుంటున్నది. స్వస్వరూపవివేకము ప్రబలమై యుండును. భానుడుదయించగానే మంచంతయు నశించిశీతలత్వముపోయి యుష్ణత్వము వ్యాపించునటుల జ్ఞానదశయందు జడత్వము నశించి మహాతేజస్సు యుత్పన్నమగుచున్నది. మహారణ్యమున భ్రాంతుడు దిక్కుతెలియక పరితపించుచున్నాడు. అజ్ఞానియు సంసారారణ్యమున ప్రవేశించి జ్ఞానమార్గము తెలియక యున్నాడు. భ్రాంతుడున్మత్తునివలె ప్రిలాపములను చేయుచూనేయుండును. మూర్ఛితునిమాదిర్కి భ్రాంతుడేమి తెలియక పడియుండును.

ఒకానొక అరణ్యమున యేమియు తెలియక నిద్రించు మృగమును

మహా వ్యాఘ్రము మంటముగా ఏత్తుకొనిపోవు విధమున సంసారాటవిలో ఏమియు తెలియక భ్రాంతుడై యుండువానిని మృత్యువు గ్రహించుచున్నది. భ్రాంతిమయ జీవనము వ్యామోహ జీవితమగును చీకటిలో గుడ్డిగూబ మొద లయినవి సంచరించువిధమున భ్రాంతి దశయందు మూఢులు విహరించుచు న్నారు. సంసారమును సుఖకరముగా దలంచి అనేక విధయూహలను పన్ను చున్నారు. అంత్యమున యవన్నియు నీటిబుడగలవలె యగుచున్నవి. కావున భ్రాంతి సర్వానర్థములకు మూలము భ్రాంతి శత్యముగాదు. ఆ భ్రాంతితొలగిన నిత్యనిరతిశయ సుఖమునొందుచున్నారు. గనుక భ్రాంతివలననే సమస్తంతోచు చున్నదని విశదీకరించుచున్నారు. పరబ్రహ్మ మఖండ మద్వితీయము నిరతి శయానందము సర్వదాబుద్ధముక్త స్వరూపము. ఇట్లుండగానేల జన్మపరంపరలు వచ్చినవి ఏరికి సుఖదుఃఖములు అజ్ఞానమెచ్చోటనుంచి వచ్చినది ఇవిమొదలగు సందేహప్రశ్నలుదయించినప్పుడు భ్రాంతిచేయని సమాధానమొసంగుట శాస్త్రప రిపాటియై యున్నది. అవిషయమిచ్చోట విచారితమగుచున్నది. "కాలఃకలయ తామహం" శ్లోకిప్కూలలో కాలము నేను అని భగవద్గీతానుసారముగా కాలము భగవత్స్వరూపమై విభూతియైయున్నది. "దిక్కాలాత్మ సమైనయస్యవిభుతాః" ఏ భగవంతుని విభుత్వము దిక్కాలాత్మలకు సమమైయున్నదో అనువాక్యము రీతిగాను కాలము భగవంతుని విభూతియైయున్నది. కాలము అఖండము. అది భాజ్యమునై యున్నది. ఇట్టి అఖండవ్యాపక విభుత్వరూపకాలమందు బ్రహ్మాది కల్పములు ప్రిభవాది సంవత్సరములు, ఉత్తరాయణము దక్షిణాయనములు. వసంతాది షడృతువులు, మాసములు, పక్షములు, వారములు, దినములు యివి మొదలగునవి కల్పితములగుచున్నవి. ఇదంతయు భమమాత్రమేను.

మఱియు సంవత్సరాది విభాగములన్నియు కాలముకన్న భిన్నములుగావు. ఆ కాలము భగవత్స్వరూపమై యున్నది. అలాగున అవిభక్తమయిన నిరంశమ యిన అఖండాద్వితీయమైన, సర్వవికల్పరహితమైన, నిర్వికార సర్వవ్యాపక పరబ్రహ్మమందు భ్రమచే స్థూలప్రపంచము (సముద్రవనగాదులు శరీరములు) విభజింపబడిన పంచమహాభూతములు సూక్ష్మప్రపంచము (అంతరేంద్రియంలు జ్ఞానేంద్రియములు) విభజింపబడని పంచభూతములు తన్మాత్రలు కారణప్రపం చము మాయావిద్యలు యీలాగున బాహ్యాభ్యంతర దృశ్యమంతయు కల్పితం, ఒకే వస్తువు ఆయాయుపాధుల ననుసరించి భిన్నములుగాగాన వచ్చు విధమున

ఒకే సద్వస్తువునైన పరబ్రహ్మ మాయాయుపాధులనుబట్టి నానావిధములుగా తోచుచున్నది. కావున యంతయు పరబ్రహ్మ చైతన్యమే భ్రాంతిలేనప్పుడు త్రాడు త్రాడుగానేయున్నది. సర్పభ్రాంతి సమయమునను రజ్జువు రజ్జువయ్యే యున్నది. భ్రాంతిపోయినప్పుడు పగ్గము పగ్గముగానే యున్నది. మూడుకాలములలోను రజ్జువొకే తీరుగా యుండువిధమున పరబ్రహ్మమొకేరీతిగా యున్నది అయితే భ్రాంతి యనునది యున్నది. అదియే అంతఃకరణము. అవిద్య జీవత్వము దానియొక్క మహిమయే సమస్త దృశ్యము సంసార సుఖదుఃఖములని గానే యున్నది. ఆ మహాభ్రాంతి దురవగాహ వికుంజము ప్రజ్ఞాకుఠారముచే మొదలంట ఛేదింపబడిన అవశిష్టము. పరబ్రహ్మము, ఏకరసము, ఆనందము, పరిపూర్ణము. సత్యము అదియుంగాక కల్పిత వస్తువు సత్యముగానందుచే తథ్యమగు వస్తువును మరుగు పరుపజాలదు. చెరుపను జాలదని తెలియవలెను సత్యవస్తువనగా త్రికాలములయందుండునది అదియకల్పితము సహజముగా స్వతస్సిద్ధమై యుండునది ఆరోపితవస్తువు. భ్రాంతికాలమున మాత్రము మహాటోపముగా మహత్తు గానదియే నిజముగా తోచును. తెలివిలేని వారందరిని భ్రమింపజేయుచున్నది. దారిలోనున్న త్రాడును గాంచి సర్పమని భ్రమపడుచున్నారు. కాని సర్పకార్యమగు కరచుట యనునది జరుగుటలేదు. ఎవరైనను భూమిలో విత్తనము వేయకనే పంటలభించునని తలంచునా? అలాగున యారోపిత కార్యములు ప్రయోజనములని తెలియవలయును. స్వప్నములో ననేకవిధ మహాసుందర పదార్థములను గాంచుచున్నారు. నానావిధ సుఖములననుభవించుచున్నారు. వానినే నిజముగా తలంచి స్వప్నములోని భోజ్యపదార్థములు భుజించినందుచే జాగ్రదవస్థ కలిగిన పిమ్మట బయటనున్న పదార్థములను భుజింపక యుందురా? వానికాకలిబాధలేక యుందురా? ఈలాగున యారోపిత కార్యములు సత్యమైనంగవలయును. అనగా అసత్యములని అర్థములేనిదోషము నారోపించుట కుతంత్రుల స్వభావమైయున్నది. అదెన్నటికైనా తథ్యమగునా? ఒకానొక సాత్త్విక సిద్ధమహాపురుషునిమీద నొకదోషమారోపించిన యా ఆరోపిత దోషమునచే నా మహాపురుషుడు దోషయుక్తుడుగాడు. ఆయనయందు దోషము నారోపించిన కుతంత్రము మాత్రము బయటపడుచున్నది. కనుక ఆరోపితమెన్నటికిని యథార్థముగాదు. ఆరోపరహిత సత్యస్వభావము జ్ఞానులగు నాప్తపురుషులకనుబడుచున్నది. వారివాక్యములు పరమ ప్రమాణములు. వారెన్నటికిని

ఉన్నదానిని వేరుచేసి వదలవలె. ఉన్నదానిమున్నట్లనే తెలుపుదురు. కావున కల్పనా రహితవస్తువే నిజముగా యున్నది. సత్యవస్తువెన్నటికి దేనిచేతను చెడదు. ఒకేతీరున యుండును త్రాడు సర్వదా ఏకరీతిగానే యున్నది. అదెన్నటికిని సర్పముగానేరదు. భ్రమకాలములోను త్రాడు వికారము నొందియుండుట లేదు. తీగగ్రస్తుల సంభావనలే యనంతములుగా యున్నవి. త్రాడు సర్పమని భ్రమనొందినను కల్పితకాకోదరము విషముగలదియై యెవరిని కరచుటలేదు. కావున సర్పభ్రాంతి కల్పనారూపము. రజ్జువు సత్యమైయున్నది. అలాగున బ్రహ్మము సత్యముగాయున్నది. కల్పితదృశ్యముయొక్క కార్యమగుదుఃఖము అవివేకము జడత్వము బ్రహ్మమందులేవు అజ్ఞానులయొక్క యనంతములగు యూహాపోహలే విజృంభితములగుచున్నవి. ఆరోపితమయిన దృశ్యప్రపంచముచే పరమాత్మ కేలాటి విరుద్ధధర్మములు సంభవించుటలేదు. సర్వదా పరబ్రహ్మము నెప్పుడును యారోపిత జ్ఞానము కప్పియుండలేదు. భ్రాంతికాలమునను ఒకే స్వరూపముతో నఖండముతో నానంద రూపముతో బ్రహ్మమున్నది ఈ ప్రకారము జ్ఞానులు నిజమును తెలియుదురు. అజ్ఞానులగువారలు కల్పిత వస్తువునే బహూకరించి నిజమని భ్రమపడుదురు. వారు భ్రాంతియొక్క యనంతార్థములు నొందుచున్నారు. కాని నిజము విచారించిన ఈ ఆరోపితవస్తువు యొక్క ముఖ్యకార్యము గానవించుటలేదు. శుక్తి రజితమని తలంచి అది యాభరణములకుపయోగపడుటలేదు. కల్పితదారు గజముచే గజకార్యములగు ఆరోహణోత్సవాదులు సిద్ధించుటలేదు. ఆరోపితవస్తువు సత్యముగానందుచే దాని కార్యము సిద్ధించుటలేదనియే తెలియవలెను. చవిటి నేలయందు యెండ యొక్క మెరుపుచే నానావిధ వీచితరంగములతోడి జలప్రవాహము అనంతములుగా తోచుచుండును. ఆయెండమావుల జలముచే నెవరికి దాహనివృత్తి రూప ప్రయోజనము గలుగుటలేదు. ఆచవిటినేలయు యాజలముచే తడిసిపోవుటలేదు అకల్పిత జలముచే మరుదేశ మార్ద్రీకృతమై శీతలత్వమును పొందుటలేదు. అలాగున ఈ సంసారమోహమను మాయయందు దేహేంద్రియాదులను తన వని కల్పించుకొనువారు నిత్యసుఖమును పొందుటలేదు. మరేమనిన విపరీతముగా అనంత దుఃఖమునే పొందుచున్నారు. [illegible] సుఖరూప కార్యప్రయోజనమును పొందుటలేదు. ఇట్టిదృశ్యభ్రాంతిచే [illegible] సచ్చిదానందమై నిరావరణమై స్వయముగా ప్రకాశించుచున్న [illegible]

యగు కూటస్థాత్మ కేలాటి చెఱుపునులేదు. అంత విద్యాకార్యమైనదంతయు అత్మబద్ధమయినది మిథ్యయైనది. ఇలాటి వ్యవహారములన్నియు కల్పితములే నిజములెన్నటికిని కావు. నిర్వికార నిష్కళంక పరబ్రహ్మమందు సకలజగత్తు యెండమావులవలె జలముచే తడియుట యనునప్రయోజనము గలగనటుల పరబ్రహ్మమునకేలాటి యవిద్యాలక్షణములు గానిపించుటలేదు. మరేమనిన భ్రాంతియొక్క విస్ఫురణమే యిటుల తోపింపజేయుచున్నది. భ్రాంతకాలములోను అధిష్ఠానమగు పరబ్రహ్మ యొక్కరూపము మార్పునొందక యానందమయమై విజ్ఞానమయమై సత్తై యున్నది. అదియే సత్యము. మూఢమతుల కల్పనంచే వేరుగాదు. సర్వదా స్వయంప్రకాశమై తేజరిల్లుచున్నది.

మఱియు శిష్యుడు తాను యసంగుడనియు, స్వయంప్రకాశుడనియు, అచలుడనియు, అనంతుడనియు సదృష్టాంతముగా గురుదేవునకు విశదపరచుకొనుచున్నాడు. అనగానేను (ఆత్మ) అసంగత్వాది లక్షణలక్షితుడగు పరబ్రహ్మమని అర్థము. నేను ఆకాశమువలె నిర్లిప్తుడను గగనమంతటను వ్యాపించియున్నను. యేయుపాధితోను సంబంధములేనిదై యుపాధుల నంటినను తాను నంటకను శాశ్వతమై యసంగమై యుండులాగున సర్వదా యవిద్యారహితుడనగు నేనుసర్వత్రవ్యాపించి యుండువాడను. అయినను సకలదృశ్యముయొక్క సంబంధములేనివాడను. అందుచే నేను సర్వదా నిర్లిప్తుడను. కాబట్టి యేదేహోత్పాదుల నాశమయినను నేమనాశమొందువాడనుగాను. శాశ్వత పరబ్రహ్మనై యున్నాను. కనుక నేను గగనోపమ గలవాడను. మరియు సూర్యునివలె సమస్తమును ప్రకాశింపజేయుచు విలక్షణుడై వుంటున్నాను. భాస్కరుడు సకల ప్రపంచమును ప్రకాశింపజేయుచున్నాడు. ఆ భానుడు లేకుండిన సకల ప్రపంచము అంధకారమై యుండున్నది. ఆ యాదిత్యుడు సమస్త లోకములకు భిన్నుడై వెలుగొందుచున్నాడు. ఆ తీరున నేను జడములైన దృశ్యములైన సకల పదార్థములకు శరీరేంద్రియాదులకును విలక్షణుడై స్వయం ప్రకాశమానుడనై యున్నాను. పరబ్రహ్మస్వరూపమగు నాచైతన్య ప్రకాశము లేకుండిన సమస్తేంద్రియములు జడములై మాయాంధకారములో మునిగియుండును. కావున పరమాత్మయగు నాచేతనే సమస్తము ప్రకాశవంతమగుచున్నది. నాటినెన్నటికి ప్రకాశకుడనై విలక్షణుడై దృశ్యైక తేజరిల్లుచున్నాను. కాబట్టి స్వయంప్రకాశమానమగు సూర్యదృష్టాంతము చితమై

భాసిల్లుచున్నది. ఇకను సుఖదుఃఖములు సాక్షిచే భాసించుచున్నవి. గనుక నవి సాక్ష్య భాస్యములని చెప్పబడుచున్నవి. అట్టి సాక్ష్య భాస్యములయిన సుఖదుః ఖాదులకన్నను వ్యతిరిక్తుడనై యున్నాను. ద్వంద్వాతీతుడనని యర్థము. అంతి యేగాదు స్వస్వరూపమందు చలనములేక స్థిరచిత్తుడనై యున్ననేను యే విక్షేపములు లేనందుచే పర్వతమువలె నిశ్చలుడనై యున్నాను. అద్రి మహా ఝంఝూమారుతముచేతను కదలునదిగాదు. ప్రకృతి విక్షేపములకు కదలువాడను గాను. ధీరుడను అవన్నియు అజ్ఞాన స్వభావములని జ్ఞానినై కదలకయుందును అనగా నిశ్చలసమాధి నిష్ఠచే చలించక యున్నాను. సర్వదా స్థాణువువలె అచ లుడను అందుచే నాకు పర్వతోపమానము సరిపోయినది.

మఱియు అనంతుడనగునేను జలభరితమయిన సముద్రమువలె పారము లేనివాడనై యుంటున్నాను. సాగరమెటుజూసినను దరి గానరానిదై జలమయ మై యుండును, ఆ విధమున కేవల విజ్ఞానమయుడగునేను జ్ఞానపరిపూర్ణుడనై దేశకాల వస్తువులచే అంతములేనివాడనై, అపరిచ్ఛిన్నుడనై, అఖండ పరబ్ర హ్మమునై యున్నాను. అంతయు నాస్వరూపమే యున్నందుచే మఱియొకటి లేనందుచే అద్వితీయుడనై యున్నాను. ఇందుచే క్రమముగా నాకాశాది దృష్టాం తములచే పరబ్రహ్మస్వరూపమగు యాత్మవస్తువు అసంగము స్వయంప్రకాశ మానము అచలము అనంతము అని నాలుగు లక్షణములతోగూడి యున్నదని తెలియవలెను. ఆత్మ అసంగము అందుచేతనే సర్వవిలక్షణమై. యజడమై ప్రకాశించుచున్నది. అలాగున అసంగమై స్వయంప్రకాశమానమై యున్నందు చేతనే విక్షేపరహితమై అచలమై యుంటున్నది. అట్టి అచలత్వము గలది గను కనే అనన్తమై దేశముచే కాలముచే పరిచ్ఛిన్నము గాక యున్నది. ఈలాగున సంగాది లక్షణములు పరస్పరము సంబంధించియే యున్నవి. పరిపూర్ణము నిర్వికారము మొదలయినవి నూహింప తగియున్నవి. కాబట్టి పరబ్రహ్మ స్వరూపమున అదియే తానను విషయమున్ను స్పష్టము చేయబడినది. "అసం గం సర్వభృచ్చైవ" దేనికిని సంబంధింపక సర్వభర్తగాయున్నదని భగవద్గీత చెప్పుచున్నది. "అసంగో నహిసజ్జతే" దేనిని సంబంధింపక యున్నందుచే అసం గమని ఉపనిషత్తు చెప్పుచున్నది.

శ్లో॥ యథాసర్వగతం సౌక్ష్మ్యా, దాకాశం నోపలిప్యతే।
సర్వత్రావస్థితో దేహే, తథాఽఽత్మా నోపలిప్యతే ॥గీత॥

తా॥ అంతటను సూక్ష్మరూపముతో వ్యాపించిన యాకాశమువలె పరమాత్మ యంతట యుండిన దేహాది సంబంధరహితమై అసంగమై యుంటున్నది. స్వయం ప్రకాశమానము "జ్యోతిషామపితజ్జ్యోతిః తమసః పరముచ్యతే" అంధకారమునకంటెను సూర్యాది తేజస్సుల కంటెను పరమైయున్నదని శృతివాక్యము "ఇందుచే ఆకాశసూర్యాదుపమానములు బోధకై చెప్పబడినవే కాని వస్తుతః ఆత్మనిరుపమానము ఆత్మ వినా, సమస్తము జడమనియు సమస్త తేజస్సులను నొసంగునది పరమాత్మయనియు భావము.

ఆద్యంతములు లేక సమస్తమును ప్రకాశింపజేయుచు నిత్యమై కూటస్థమైనది పరమాత్మ అనంతము "అనాద్యవంతం మహాతః పరం" మహత్తుకన్న పరమై ఆది అంతములు లేనిదియే ఆత్మయని తెలియవలెను.

మఱియు నేను కేవల ప్రత్యగానంద స్వరూపుడను. అసంగుడను నిరుపాధికుడను. కావున శరీరోపాధి ధర్మములు నాకు సంభవింపవనియు మాయారహితుడనియు సద్గురువునకు తన అఖండానుభవమును స్పష్టముగా తెలియజేయుచున్నారు. ఆకాశము నిరుపాధికమైనది. దేనితోను సంబంధించి యుండునదికాదు. అసంగము అట్టి గగనమునకు ఏలాటి సంబంధములేదు. ఆకాశమంతటను యుండుచు రూపములేనిదై దానికిన్నరూపమగు మేఘముయొక్క సంపర్కము కల్పింప సాధ్యముగాదు. ఆలాగున పరమాత్మ ఉపాధిరహితమైనది. దేహేంద్రియాదుల వంటక యుంటున్నది.

అసంగము అట్టి పరమాత్మ నేనై యున్నాను. గనుకనే సంతటను వ్యాపించి యున్నాను. నేను నిరూపుడను. ఇట్టి రూపరహితుడనగు నాకును రూపవత్తైన శరీరమునకును సంబధమొకించుకయు లేదు. నిస్సంగ పరబ్రహ్మము నేనై యున్నాను. పామరజనులు గగనము నీలముగా యుంటున్నదై పైనవ్యాపించి మహత్తై యొకానొక రూపవత్పదార్థమై యున్నదనియు అచ్చోట మేఘములు గలవనియును ఊహించి పలింతురు. విచారించి చూచిన ఆ విషయమంతయు యదార్థముగాదు. ఆ తీరున అఖండరూప పరమాత్మకును శరీరోపాధిని కల్పించుచున్నారు. ఆ పరమాత్మనే జీవుడని వ్యవహరించుచున్నారు. శరీరమునకు సంబంధించి సుఖదుఃఖాది గుణములతో గూడుకొని ప్రాణరూపుడై యున్నాడు ఆ ప్రాణమునాధారముగా చేసికొనియే శరీరమున్నదనియు తెలుపుచున్నారు. ఇదంతయు భ్రమమాత్రమేను ఆకాశము సర్వవ్యాపకమై నిర్గుణమై రూపము

లేనిదై అసంగమై యుండులాగున పరమాత్మయు అఖండమై సర్వవ్యాపకమై జీవత్వోపాదక సుఖదుఃఖాది రహితమై నిర్గుణమై శరీరోపాధిరహితమై నిష్ప్రంగమై యుంటున్నది. అట్టి పరమాత్మను నేను కావున శరీరోపాధియే లేని నాకు శరీరధర్మములగు జాగ్రదావ్యవస్థలు సుతారం సంభవింపవు. శరీరము త్రిగుణాత్మకము అవస్థాత్రియ విశిష్టము నేను గుణత్రియాతీతుడను అవస్థాత్రయ రహితుడను. కేవల పరమాత్మనై యున్నాను. నేను నిరుపాధికుడగు పరబ్రిమని భావము. మఱియు జీవునకు బుద్ధీంద్రియాదులు శరీరము ఉపాధులగుచున్నవి. అచేతనారూప జీవశక్తి ప్రసరణముచేతనే ఇంద్రియములన్నియు చలనాత్మక వ్యాపారముల జేయుచున్నవి. చేతనారూప జీవాత్మలేకుండిన అన్నియింద్రియములు జడములగును. జీవాత్మయనగా ఆత్మయని యర్థము. ఆ యాత్మ శరేంద్రియాదులు చలనశీలములయినను జలోపాధి చలించుచుండనను సూర్యబింబము చలనరహితమై యున్నటుల గమనాగమన రహితమైయున్నది ఆత్మయే మఱియు జీవుడనగా అవిద్యోపాధియనియు వేదాంత శాస్త్రములు చెప్పుచున్నవి. అవిద్యాకల్పిత బుద్ధ్యుపాధికుడగు జీవుడు శరీరేంద్రియాదులందు అభిమానముతో గూడినవాడై అహంకారమమకారములతోను సంయుక్తుడై కర్తృత్వబుద్ధితో సకలేంద్రియ వ్యాపారములకు కారణుడై సకల కార్యములను జేయుచున్నాడు. భోక్తృత్వబుద్ధితో సకల దుఃఖములననుభవించు చున్నాడు. ఇకను అంత్య కాలమాసన్నమగునప్పుడు శరీరోపాధియే మృతినొందుచున్నది. అనగా దేహము పడిపోయి మట్టిలో కలిసిపోవుచున్నది. జీవాత్మ మాత్రము శరీరమును విడిచిపోవుచున్నది. దానికి మరణములేదు. జీవాత్మ సనాతనము గనుక ఉపాధియే గమనా గమన రూపకార్యములను సకల కర్మలను జేయుచున్నదనియు సుఖదుఃఖములననుభవించుచునదని కట్టకడకు మరణించుచున్నదనియు మహాత్ములు తెలిపిరి. ఉపాధియనగా శరీరేంద్రియాదులనియు లేక ఉపాధియనగా అవిద్యోపాదీక్షదనియు లేక స్థూలశరీరమనియు నిరూపించిరి. అనగా బుద్ధ్యాదీంద్రియములకును శరీరమునకును దానియందభిమానము గలిగి చిదాభాసుడనియు ప్రతిబింబమనియు వచింపబడు జీవునకును సాక్షియైన బింబపదార్థమైన ఆత్మ సర్వవిలక్షణముగా నున్నదని భావము. అట్టి నిరుపాధికుడగు సుఖదుఃఖాది ద్వంద్వములకును అతీతుడవగు కర్తృత్వ భోక్తృత్వాద్యభిమానరహితుడవగు పరమాత్మ స్వరూపుడగు నేను (అహం

(ప్రత్యయ బోధితమగు పరబ్రహ్మము) సర్వకాల సర్వావస్థల యందును మహా
పర్వతమువలె నిశ్చలమై స్థిరమై యుండువాడను. ప్రళయ కాలమున మహా
పర్వతములు గూడ చలించి కూలిపోవు చున్నవి. కుల పర్వతము భూమికి అవ
ధిగా యుండునది. దానిని అవధి పర్వతమని లోకాలోకా పర్వతమనియు చక్ర
వాళ పర్వతమనియు అనుచుందురు. ఈపర్వతము ప్రళయ కాలమును చలిం
చునది గాదని చెప్పుదురు. సుస్థిరమై యుండును. ఆ లాగున పరమాత్మయగు
నేను సృష్టి స్థితి లయములు సంభవించినను చలించని వాడనుగాను అచ్యుతు
డను. స్వస్వరూప పరబ్రహ్మమై యుండువాడను. ఈలాగున సర్వదాస్థిరుడనై
పరమాత్మనై యుండువాడనని భావము. మఱియు పరమాత్మ స్వరూపుడగు
నేను ప్రవృత్తి నివృత్తి ధర్మరహితుడనియు గగనసదృశుడనియు గ్రాహ్య
గ్రాహ్యములు ప్రియాప్రియములు మొదలగు పదార్థములు లేనివాడననియు
తెలియజేయు చున్నాడు. నిత్యపరిపూర్ణ నిరంతరానందమయ పరబ్రహ్మమగు
నేను సర్వదా పరిణామ రహితుడను ఒకే రూపముతో నిర్వికారుడనై యుండు
వాడను. దేశతః, కాలతః, వస్తుతః విభాగము లేనివాడను. అపరిచ్ఛిన్నుడను.
నాకంటే ప్రియతమైన పదార్థముగాని భిన్న పదార్థముగాని లేకున్నందుచే దేని
యందును ప్రవర్తించు వాడనుగాను. అలాగున ప్రియమయిన వేరొందు లేకు
న్నందుచేతను గ్రాహ్య గ్రాహ్య ప్రియా ప్రియాదులు లేనివాడ నగుటచేతను
దృశ్యరహితుడ నగుటచేతను, దేనినుండియు నివర్తించు వాడనుగాను. నాకు
నివర్తింపదగిన వస్తువేలేదు. అనగా రాగద్వేషాదులు సుఖదుఃఖాదులు ఇట్టి
ద్వంద్వ జాతము నతిక్రమించి యుండువాడను ఏపరమాత్మ గగనమువలె
సర్వవ్యాపకుడై ఏకస్వరూపుడై సర్వవికార రహితుడై పరిపూర్ణుడై యున్నాడో
ఆపరమాత్మ ఏలాగున వ్యాపారముల జేయును. చలించును అనగా పరమాత్మ
నిర్వ్యాపారుడై అచలుడై యున్నాడని అర్థము. ఆకాశము దేనినంటక అంత
టను వ్యాపించినదై పరిపూర్ణమై అఖండమై అపరిచ్ఛిన్నమై యుండులాగున
పరబ్రహ్మమగు నేనును సందులేక సర్వమును వ్యాపించిన వాడనై. అనంతు
డనై. పరిపూర్ణుడనై. అపరిచ్ఛిన్నుడనై. అవిభాజ్యుడనై. నిష్క్రియుడనై
నిశ్చలుడనై. నిస్సంగుడనై ప్రవృత్తి నివృత్తి రహితుడనై. అపేక్షానపేక్షా
వివర్జితుడనై. అపరిణామినై. ఏకాత్ముడనై యున్నాను. ॥ సర్వం ఖల్విదం
బ్రహ్మ ॥ అనుశ్రుతిరీతిని బ్రహ్మముతప్ప మఱియొకటి లేదని భావము.

అదియుంగాక సకల కర్మేంద్రియ జ్ఞానేంద్రియములకును అతీతమైనదియు మనస్సునకు అందనిదియు సర్వవ్యాపారరహితమయినదియు, నిర్వికారమయినదియు, ఆకారరహితమయినదియు, నామరూప గుణాది శూన్యమయినదియు నగు పరబ్రహ్మము నేనై యున్నాను. నేను పరిపూర్ణ సుఖమునే అనుభవించుచున్నాను. నేనుయింద్రియముల నతిక్రమించి యున్నాను. మనస్సును గూడ దాటి యున్నాను. సంకల్పములు వ్యాపారములు వృత్తులు కర్మలున్ను యింద్రియములకు సంబంధించినవై యున్నవి. కావున మనస్సుచే నూహింపబడినవి. బుద్ధిచే నిశ్చయింపబడినవి. అవన్నియును కర్మపద వాచ్యములగుచున్నవి. ఇంద్రియములు చలనాత్మకములు వాని వ్యాపారములు తత్తదను గుణ కార్యములు మొదలయిన వన్నియు కర్మలేయగును. మానసికముగాగాని వాచకముగాగాని, కయికముగా నిర్వర్తింపబడు వ్యాపారములు సద్రూపములయినచో సత్కర్మలనియు అసద్రూపములయినచో పాపకర్మలనియు చెప్పబడుచున్నవి. వానిచే పుణ్యము పాపము గలుగుచున్నవి. వాని ఫలము సుఖదుఃఖములై యున్నవి. ఇంతకు సిద్ధించినదేమనగా బాహ్యేంద్రియముల చేతను అంతరేంద్రియముల చేతను పుణ్యపాప కర్మములచేతగాని పుణ్యపాప సంకల్పములుగాని నిర్వర్తింపదగినవి. అవన్నియు క్రియారూపములు చలనరూపములు గావున నిష్క్రియమైన నిశ్చలమైన పరమాత్మ స్వరూపుడయిన నాకు పుణ్యపాపములు సంభవింపవు. తత్ఫలములుగాని గలుగవు. మానసమున సంస్కార బీజములుండిన పుణ్యపాపములు తదనుగుణ జనన మరణములు గలుగును. మనోతీతమగు పరబ్రహ్మము నేనై యున్నాను. కేవల పరబ్రహ్మ సుఖానుభవముతో నేను యున్నాను. నా స్వరూపము నిరవధికానందము యనంతము కాబట్టి స్వానుభవ జ్ఞానముచే మహాగ్నియందు కాష్ఠములు దగ్ధమగు విధమున మానసమగు గుండమున సకల సంస్కార బీజములు విశ్శేషముగా దహింపబడినవానికి పుణ్యపాపములులేవు. అట్టి విజ్ఞాని పుణ్యమునుగోరి పుణ్యకార్యముల జేయడు. తదధికమైన అనేక జన్మ సుకృతఫల లభ్యమైన పుణ్యాతీత జీవన్ముక్త స్థితిలో యుంటున్నాడు. తనకన్న వేరుపదార్థము లేనందుచేతను తనకు లభ్యమగు పదార్థము లేకపోవుట చేతను కృతకృత్యుడై ధన్యాత్ముడై యుంటున్నాడు. ఒకవేళ తాను శుభప్రదమగు కార్యములుజేసినను ఫలత్యాగము జేసినవాడగుట చేతను మానసము విజ్ఞానమయమగుట చేతను తత్సంస్కారము

లుండవు. అవియును జ్ఞానరూపమును దాల్చుచున్నవి. నిష్కర్మియగు తాను పుణ్యకర్మలయందు ప్రవర్తించుచున్నాడనియు సందేహింప యుక్తముగాదు. ఏలాగున ఒకేఒక చక్రము త్రిప్పబడినచో ఆ చక్రముయొక్క వేగమున్నంత వరకు చక్రము తిరుగుచూనేయుండి దాని వేగము తగ్గిపోయినచో చక్రమాగి పోవుచున్నదో అలాగున జ్ఞానియును తనసంస్కారమత్యుత్తమ మగుటచే తద నుగుణముగానే ఈలోకమున ప్రవర్తించు చుండును. వాని సంస్కారముల న్నియు పునర్జన్మ హేతుకములుగావు ఇటులనే వేదాంతశాస్త్రములు ఘోషించు చున్నవి. అట్టి మహానుభావుని విషయమున పాపకార్యములు గాని పాపసంక ల్పములుగాని ప్రయుక్తములుగావు. కావున పరమాత్మస్థితినొందిన వానికి పుణ్యపాపకర్మలు లేవని తెలియవలెను.

మఱియు నాత్మస్వరూపుడగునేను మనోబుద్ధులకును యతీతుడను. వాని వ్యాపారములను వానినంటక తెలియువాడను నిర్వికారుడను నిరాకారుడను నామ రూపగుణ వర్జితుడను కేవలపరబ్రహ్మ సుఖస్వరూపమే నా రూపమైయున్నది నేనట్టి పరబ్రహ్మమైయున్నాను. కావున పుణ్యపాపములు గాని సుఖదుఃఖము లుగాని ఈలాటి ద్వంద్వములన్నియు నాస్వరూపమందులేవు. సర్వాతీత చిత్సు ఖరూపుడను సందేహములేదు. మఱియు సర్వసాక్షియగు ఆత్మకు యాత్మచే సాక్షాత్కరింపబడుచున్న విషయమగుచున్న, చూడబడుచున్న, దృశ్యప్రపంచం యొక్క శరీరేంద్రియాదులయొక్క ధర్మములంటవని వెలుంగుచున్న దీపదృ ష్టాంతపూర్వకముగా చెప్పుకొనుచున్నారు. అనగా దీపము గృహమధ్యమున వెలుగుచున్నదిగాని గృహధర్మములేవియు నాదీపమును వెగిలింపజేయజాలవు. గృహధర్మములు గృహముగాని గృహములోని పదార్థములుగాని జడములు గృహముదారు మయముగను మృత్తునాది విశిష్టముగను యున్నది. శ్వేత పీతాది వర్ణములతో గూడియున్నది. అందులో గృహకృత్యములు వ్యవహార ములు జరుగుచుండును. దీర్ఘహ్రస్వాద్యాకార యుతముగను గృహమందును పదార్థములు స్వల్ప మహదాది పరిణామయుతములై యుండును. అయినను నాగృహధర్మములన్నియు ప్రజ్వలించుచున్న దీపమునుప్రకాశింపజేయజాలవు ఆధర్మములలోనేమియును దీపమందు సంబంధించి యుండవు. ఆదీపమును ఆ పదార్థములు జడములయినందున తెలియజాలవు. కావున గృహధర్మములన్ని యును జడములు ప్రకాశరహితములు. వానిచే దీపమునకేలాటి ప్రయోజనము

గూడ సిద్ధించదు. అలాగున ఈ భౌతిక శరీరమను గృహమధ్యమున ఆత్మజ్యోతియగు జ్ఞానమను దీపజ్యోతి ప్రకాశించుచున్నది. ఇంటిలోని దీపము స్వయముగా ప్రకాశించుచు, ఇతరపదార్థములను ప్రకాశింపజేయుచు గృహధర్మముల నంటక గృహమునున్న సకల పదార్థ జ్ఞానహేతువై తటస్థమై యుండులాగున స్వయం ప్రకాశమాన పరమాత్మ జ్యోతియు సర్వదేదీప్యమానమై, మాయాంధకార రహితమై, చైతన్యవంతమై జడములగు సకలేంద్రియములను శరీరములను ప్రకాశింపజేయుచు శరీరేంద్రియ ధర్మములగు అనృతజడ దుఃఖములనంటక యుండుచు సమస్తమును తత్సంబంధములేకనే తెలియుచు, సర్వజ్ఞానహేతువై, సర్వసాక్షియై యుంటున్నది. శరీరేంద్రియ ధర్మములు సుఖదుఃఖాదులు పుణ్యపాపములు తాపత్రయాదులు ఇవి సత్వరజస్తమోగుణజన్యములై యుంటున్నవి. ఈ ఇంద్రియాదులు హ్రస్వదీర్ఘాద్యాకార యుతములు స్వల్పమహదాది పరిణామ యుతములై యుంటున్నవి. అలాగున ఆత్మయుండుటలేదు. గుణత్రయ రహితమై హ్రస్వదీర్ఘాద్యాకార రహితమై, మహదాది పరిణామ రహితమై, సుఖదుఃఖ పుణ్యపాపాది శరీరధర్మశూన్యమై, అజడమై సత్యమై, ఆనందమయమై పరమాత్మయున్నది. కావున గృహధర్మములు దీపమందు ప్రసక్తస్థమై అసంగముగా నుండయే చూచుచున్నది. కావున సాక్షి యనిచెప్పబడెను. ప్రపంచము చూడబడుచున్నందుచే దృశ్యమాయెను. ఆత్మ దృక్కాయెను. తెలియబడు చున్నందుచే ప్రపంచము దేహేంద్రియాదులు జ్ఞేయములాయెను. ఆత్మజ్ఞాతమాయెను. ఈలాగున భోక్త యనగా ఆత్మయగును. భోజ్యమనగా దృశ్యమగును, భావుకమనగా ఆత్మభావ్యమనగా ప్రపంచము మొదలగు వ్యవహారములని తెలియవలెను. అన్నివిధములుగా విచారించినను ఆత్మయనునది దృశ్యములయిన అనాత్మపదార్థములనబడు యహంకారాదులకన్నను వేరుగానున్నందుచే ఆత్మయందు అనాత్మ శరీరేంద్రియాది ధర్మములు (సుఖదుఃఖాదులు, పుణ్యపాపములు, అనృతజడాదులు) ప్రసక్తములు గావు. ఈలాటి విచారముచే దీపమువలె ఆత్మస్వయం ప్రకాశమానము అవికారి, ఉదాసీనము, సర్వసాక్షి తటస్థము, చైతన్యాత్మకము, అసంగము మొదలైన స్వరూపలక్షణములు సిద్ధమాయెను. మఱియు గృహమధ్యమున దీపస్తంభమునందు మహా దీపమువలె శరీరాంతరాళమున పరమాత్మ ప్రకాశించుచున్నది. శరీరమే గృహము హృదయస్థానమే దీపస్తంభము అంతఃకరణమే

ప్రమిద దానిలో ఆత్మవిచారణ స్వస్వరూప ధ్యానమునను తైలము పరిపూర్ణముగా యున్నది. అనాత్మ పదార్థములయందు విరక్తియనుగాలి లేకుండుట యనునదియు సహాయముగా యున్నది. పరమాత్మయందు పరమ ప్రేమయగు అనన్యభక్తియే వత్తిగా యున్నది. అది వాసనలను జలముతో తడియక యుంటున్నది. వీనిసహాయముచే ఆత్మజ్యోతియగు జ్ఞానజ్యోతియనెడు దీపము వెలుగుచున్నది. ఆ దీపము కేవలము జ్యోతిరూపమైయున్నది. ఆ దీపజ్యోతి యందు జడములైన దీపస్తంభము ప్రమిద వత్తి తైలము వీనియొక్క ధర్మమయిన ఆ ప్రకాశత వ్యాప్తముగాలేదు. సంబంధములేదు. అలాగున ఆత్మ జ్యోతియందు అంతఃకరణాది ధర్మములగు విరక్తి భక్త్యాదుల సంక్రమించవని ఇక పుణ్యపాపములు సంభవించవనియు అనాత్మ ధర్మములన్నియు ప్రయుక్తములుగావనియు విశేషించి వచింపనవసరములేదు. కాబట్టి దీపజ్యోతి సర్వవిలక్షణమై యున్నటుల ఆత్మజ్యోతి సర్వదృశ్య విలక్షణమై స్వయం ప్రకాశమానమై, సర్వవ్యాపకమై, చైతన్యాత్మకమై, ఆనందమయమై యున్నదని భావము.

మఱియు దేహేంద్రియ మానసిక ధర్మములు విస్పంగ సర్వవిలక్షణాత్మను స్పృశింపవు. ఈ విషయము స్పష్టముగా యుండగా తెలియకుండుట ఆశ్చర్యము. ఆకాశము సర్వవ్యాపకమై యుండినను ఆయాయుపాధి ధర్మములు యంటనటుల పరమాత్మయు సర్వత్ర వ్యాపించి యున్నను శరీరేంద్రియ ధర్మములనంటక సర్వదా భాసించుచున్నదని తెలియవలెను. అట్టి పరమాత్మ స్వరూపుడగునేను సకలేంద్రియాతీతుడనగుటచే సర్వధర్మ వివర్జితుడను సర్వాతీత పరంజ్యోతినై యున్నాను. మఱిగాను కూటస్థాత్మ స్వరూపమును తెలియజేయుచున్నారు. అనగా సూర్య భగవానుడు గగనమధ్యమున సర్వదా ప్రకాశించు చున్నాడు. ఆయనకు కర్మసాక్షిత్వము ప్రసిద్ధమైయున్నది. కర్మసాక్షియగు భాస్కరుడు సర్వప్రాణి కోట్లయొక్క సకలకర్మలను తెలియుచు పుణ్యపాప కర్మలనంటక సాక్షిగా తేజరిల్లు చున్నాడు. పంచభూతములు, దేవతలును సకల కర్మలకు సాక్షులై యున్నారని శాస్త్రములు వచించుచున్నవి. అలాగున కూటస్థ పరబ్రహ్మము హృదయాకాశమధ్యమున స్వయంప్రకాశమై సూర్యునివలె సమస్తేంద్రియములను ప్రకాశింపజేయుచు ఆయా ఇంద్రియవ్యాపారములను తెలియుచు పుణ్యపాపములకు విలక్షణమై దేనినంటక సర్వసాక్షియై

యున్నది. ఆకూటస్థ పరబ్రహ్మమనబడు సర్వేశ్వరుడును సకల జగదుపాధికుడై సకల జగద్వ్యాపారములకును సాక్షియై యున్నాడు. తనయంతరాత్మకు తెలియకనే యే యింద్రియములును నేపనిగూడ చేయజాలవు. విషయములందు ప్రవర్తింపను జాలవు. ఆతీరున సర్వేశ్వరునికి తెలియక చరాచర ప్రపంచమంతయు నేమాత్రమును ప్రవర్తించలేదు. ఈతత్త్వము నెఱింగిన మహానుభావులు సమస్తమును దైవార్పితముగా చేయుదురు. సిద్ధార్థమేమనగా పరమాత్మవస్తువు స్వయంప్రకాశమానమై సర్వమును ప్రకాశింప జేయున్నదై సర్వదృశ్యమునకతీతమై సర్వసాక్షియై సకలకర్మ నిర్ముక్తమై యసంగమై భాస్కరునివలె యున్నదని భావము.

మఱియు అగ్నిహోత్రుడు సమస్తమును దహించు స్వభావమును గలవాడు అలాగున ప్రజ్వాలన స్వభావముగల తేజోరూపియగు పరమాత్మ సమస్తకర్మవాసనా సంచయమును భస్మము జేయుచున్నాడు. వహ్నివలె మహాపవిత్రుడై యున్నాడు. ఆపరమాత్మయను అగ్నిని నేదోషములుగాని చీకటిగాని యంటనటుల సర్వదోషములు అజ్ఞానము మొదలయినవి యంటవు అంతమాత్రమేగాదు. అగ్ని కట్టెలను దహించుచు ప్రకాశవంతుడై తేజస్సు నొసగునటుల పరమాత్మయు కట్టెలవంటి సమస్త కర్మలను దహించుచు జ్ఞానరూప తేజస్సునొసగుచున్నాడు. జడములగు నింద్రియాదులను చైతన్యవంతములనుగా జేయుచున్నాడు. కాష్ఠములయందు వహ్నిగూఢమై యున్నది. తరచునప్పుడది ప్రజ్వలించి కాల్చుచున్నది. అలాగున నాత్మవస్తువు కర్మసంచయమందావృతమైయున్నది. విచారణయను మథనము సంభవించగా కర్మల దహించుచు నిరావృతమై తేజరిల్లుచు జ్ఞానప్రకాశముతో గూడిన దగుచున్నది. కావున అగ్నికి దాహకత్వమున్నటుల పరమాత్మకు సర్వకర్మ దాహకత్వము ప్రకాశమాన సర్వప్రకాశకత్వము చైతన్యాత్మక సర్వచేతనా కరణత్వము మున్నగునవి స్వభావసిద్ధములై యున్నవి. చీకటిలో త్రాటిని జూచి పామను కొనుట సామాన్యముగా నందరికిని సహజముగానున్నది. అవిధముగా అజ్ఞానాక్రాంతులై విచారణా జ్ఞానసూర్యులందరు తనలో నిస్సంగమై ప్రకాశించు కూటస్థాత్మను శరీరేంద్రియాదులకును సంబంధమున్నటుల దలంతురు. యదార్థముగా రజ్జువు మాత్రము సత్పదార్థమై యున్నది. అవశిష్టమై సర్పముగాని సర్ప జ్ఞానముగాని యదార్థములుగావు. సర్వము భ్రమమూలకమై యున్నది.

విచారించిన పరమాత్మ వస్తువొకటియే సర్వదా సత్తై చిత్తై ఆనందమయమై యుంటున్నది. తదితర దృశ్యపదార్థమంతయు సత్యముగాదు. మాయాకల్పితము అసత్తగు పరమాత్మ కూటస్థమైయున్నది. కూటమనగా సకలేంద్రియముల కాధారమై యుండుటయని అర్థము. అలాగున పరమాత్మయున్నను, సకలేంద్రియ ధర్మముల గ్రహించక అచలమై తాను మాత్రము యున్నది. ఏ ఉపాధితోను కూడుకొనక సాక్షియై యున్నది. ఇదియే కూటస్థాత్మ స్వరూపము అట్టికూటస్థుడగును చైతన్యాత్మకుడుగను నున్న పరమాత్మయగు నాకు భానువకువలె సర్వసాక్షిత్వము పుణ్యపాప విలక్షణత్వము అగ్నికివలె సర్వకాష్ఠకర్మదాహకత్వము చైతన్యాత్మకత్వము త్రాడునకువలె సర్వకల్పితవస్తు సంసర్గాభావత్వము, నిస్సంగత్వము, కూటస్థము, ప్రకాశత్వము మొదలైనవి, స్వభావ సిద్ధములై యున్నవి. "అసంగోహ్య మనాశ్రితః" అను శ్రుతిరీతిగా పరబ్రహ్మమగునేను సకలేంద్రియములకును తద్వృత్తులకును సకల కర్మంబులను సర్వగుణములకును సుఖదుఃఖాదిపుణ్యపాపములకును సాక్షియై దేనినంటక సర్వమును తెలియుచు సమస్తమును చైతన్యవంతముగా జేయుచు విజ్ఞానతేజోరూపుడనై ప్రపంచరహితుడనై కూటస్థచిదాత్మనై స్వయం ప్రకాశమానుడనై యానందమయుడనై అచలుడనై తేజరిల్లుచున్నాననిభావము.

మఱియు శిష్యుడు తిరుగ పదేపదే తనయొక్క స్వరూపమునే అనగా అనుభవమునే తేటపరచుకొనుచున్నాడు. ఏ కార్యమాచరింపవలసియున్నను కరణములు(ఇంద్రియములు)అపేక్షితములుగానున్నవి. వానితోపాటు మనస్సు ప్రధానముగానున్నది. ఈ మనస్సే జ్ఞానేంద్రియములతో గూడుకొని నేను జేయుచున్నానను భావముతో కర్తృత్వమునుదాల్చి కర్తయగుచున్నది. కర్త లేనిదే యేపనియు సిద్ధించదు. పరబ్రహ్మము అట్టి మనస్సునకు కరణములకును అహంకారభావమునకును అతీతమై యున్నది. కర్తృత్వ ధర్మమంతఃకరణములదై యున్నది. కావున మనోతీత పరబ్రహ్మమగు నేను దేనిని ఆచరించువాడనుగాను, చేయించువాడనుగాను, అనగా కర్తనుగాను కారకుడను (ప్రేరకుడను) గాను, అటులనే యేవస్తువుల అనుభవమునకును సుఖదుఃఖములకును పరికరములు (ఇంద్రియములు) అవసరములై యున్నవి. వానితో గూడ బుద్ధి ముఖ్యసాధనముగా నున్నది. ఈ బుద్ధియే జ్ఞానేంద్రియములతో జేరికొని నేను సకలమునమభవించుచున్నాను. నాకు సకల భోగములును

విషములై యున్నవను వృత్తితో భోక్తృత్వమును వహించి భోక్తగానగు చున్నది. ఇట్టి బుద్ధిలేనిదే వస్తువుయొక్క అనుభవము గలుగనేరదు. నిత్య శుద్ధ బుద్ధ ముక్తమైన యాపరవస్తువు బుద్ధికిని సంబంధించినదిగా నున్నది. కాబట్టి బుద్ధ్యతీత పరవస్తువగు నేను దేనిని అనుభవించు వాడనుగాను. అనగా భోక్తనుగాను. భోజయితయుగాను. మఱియు జీవాత్మ మనస్సుతోను నేత్రేంద్రియముతో గూడి సకలమును జూచుచున్నది. కావున యింద్రియములతోను సంబంధించిన జీవాత్మకన్నను సాక్షియగు కూటస్థాత్ముడగు నేను దేనినిజూచు వాడను గాను. చూపించువాడనుగాను. చూచుట చూపించుట మొదలైనవి. అంతఃకరణ విశిష్ట జీవాత్మ ధర్మములై యున్నవి. నేను సర్వవిలక్షణుడుగా నున్నాను. అందుచే ద్రష్టగాను దర్శయితయుగాను కర్తృత్వ కారయితృత్వత్వాది ద్వంద్వధర్మ రహితమైన సర్వవిలక్షణమైన పరబ్రహ్మము నేనని భావము. మఱియు ఇట్టిదని నిర్దేశింప సాధ్యముగానందుచే సకలేంద్రియ తీతమైన వాక్కునకును మనో బుద్ధులకును గోచరముగాని కేవల శుద్ధచైతన్యాత్మక స్వయంప్రకాశమాన పరబ్రహ్మజ్యోతియే నేనుగానున్నానని భావము.

ఇంకను శిష్యుడు తన అనుభవమును గుర్తెరుంగుచు వేదాంత శాస్త్రము ననుసరించి శరీరమును ఒక ఘటమునుగా వివరించుచున్నాడు. అనగా దేహమే యొక ఘటము. దానలో చలనాత్మకమగు నంతఃకరణమే జలము అఘటోపాధిలోనున్న యాకాశమును ఘటాకాశమందురు. జలము నాశ్రయించి యున్న ఆకాశమును జలాకాశమందురు. ఘటాకాశమువలె శరీరమునందు తద్ధర్మముల నంటకనున్న ఆత్మయే కూటస్థుడని చెప్పబడుచున్నాడు. జలాకాశమువలె నంతఃకరణమునందు ప్రతిఫలించిన కూటస్థాత్మ అనగా జీవుడుంటున్నాడు. జలము చలించునప్పుడు దానిలో ప్రతిఫలించు సూర్యబింబము చలించునటుల తోచు చున్నది. జలధర్మమగు చలనత్వము ఆ సూర్యప్రతిబింబమునందు సంబంధమైభాసిల్లును. అందుచే జలము కదలుచుండిన సూర్యబింబముగూడా చలించు నటుల గన్పట్టు చున్నది. ఆలాగున అంతఃకరణోపాధి అజ్ఞాన సంస్కార బలిమిచే వ్యాపారాత్మకమై కర్తృత్వ భోక్తృత్వాది తజ్జన్య సుఖదుఃఖాది ధర్మోపహతములాగా ఆ యంతఃకరణమునందు ప్రతిఫలించిన కూటస్థా పరబ్రహ్మమందు కర్తృత్వ భోక్తృత్వాది ధర్మములు తోచుచున్నవి. అందుచే అంతఃకరణము ఆయా ప్రకృతి ధర్మములతో కూడి యున్నప్పుడు కూటస్థ ప్రతిబింబి

తురగు జీవుడును సుఖదుఃఖాది ధర్మములతో గూడినవానివలె గానబడుచున్నాడు. యథార్థముగా విచారించిన జలము గాలి ప్రసారముచే కదలుచున్నది. దానిలోనున్న భానుని ప్రతిబింబము కదలుటలేదు. అది బింబమగు సూర్యునికన్న వేరుగాదు. అలాగున నానావిధ మలిన సంస్కార విశిష్టాజ్ఞాన స్వభావముచే నంతఃకరణము కర్తృత్వ భోక్తృత్వాది సుఖదుఃఖ ధర్మ విశిష్టమగుచున్నది. కాని దానిలో ప్రతిఫలించిన కూటస్థ పరబ్రహ్మము అనగా జీవుడు సుఖదుఃఖాది ధర్మవిరహితుడయే యున్నాడు. కేవల చైతన్యాత్మ పరబ్రహ్మముకన్న ప్రతిబింబ భూతజీవుడు వేరుగాకనే యున్నాడు. దాసాని పుష్పముయొక్క కాంతి స్ఫటికమణి మీదపడునప్పుడా స్ఫటికమణి లోహితవర్ణము గలదివలె భాసిల్లుచున్నది. అలాగున అంతఃకరణ ధర్మములు జీవుని యందారోపింప బడినందుచే జీవుడును మానసిక ధర్మోపేతుడుగా గానవచ్చుచున్నాడు. అందుచేతనే నేను సుఖిని, నేను దుఃఖిని, నేను కర్తను, నేను భోక్తను అని యంతఃకరణము నందలి జీవునికి గలిగిన తాదాత్మ్య ధ్యానము దృఢమైనందుచే మూఢజనులు సుఖదుఃఖములకు లోనగుచున్నారు.

యథార్థముగా మహాకాశమునందున్న భాస్కరుడు తత్ప్రతిబింబముగాని ఘటజలోపాధుల ధర్మములచే కొట్టబడుటలేదు అలాగున కూటస్థపరబ్రహ్మము తత్ప్రతిబింబ జీవుడును శరీరేంద్రియోపాధి ధర్మములచే నంటబడుటలేదు. బింబముకన్న ప్రతిబింబము వేరుగాదు. ప్రతిబింబము నిజమున్నగాదు. అలాగున జీవత్వము యథార్థముగాదు. యున్నది బింబమగు కూటస్థ పరబ్రహ్మమే అది సూర్యునివలె వ్వికారము నిష్క్రియము అచలము సర్వదా తేజరిల్లుచున్నది. మఱియు = అనంగోహ్య. మనాశ్మృత్రిః = అనంగము మనోతీతము శుభ్రము అయినది యాత్మ. అను శ్రుతి వాక్యార్థమును వివరించుచు పంచభూతాత్మక దేహము చేతను దాని ధర్మములచేతను అంతరాత్మ అంటబడదను విషయమును గగన దృష్టాంతము ద్వారా స్పష్టపరచుచున్నాడు. ఈ దేహము ప్రత్యక్షముగా నశించునదై యున్నది. చైతన్యమేలేక యున్నది. జడమైయున్నది దేనిని తెలియుటలేదు. ఆత్మకన్న వేరై యున్నది. ఆత్మయన చైతన్యాత్మకము అజరము శాశ్వతము శుద్ధము బుద్ధము ముక్తమునై యున్నది. దేహము దహింపబడునది. అందుచే నది దేహమాయెను. సర్వదా పరిణామశీలమై శిథిలమగునది గనుక శరీరమాయెను. ఇట్టి దేహము జలమందు

మునిగినను మునుగుగాక భూమియందు ధూళిలో పొర్లాడినను పొర్లాడుగాక గాలిచే నెండిన నెండుగాక అగ్నిచే దగ్ధమయినను అగుగాక ఆకాశము శూన్యమని కొందఱి అభిప్రాయము. దానిననుసరించి ఆకాశము శూన్యమార్కి శూన్యమైనను అగుగాక అందులో సర్వదా వెలుంగుచున్న స్వయం ప్రకాశమాన జ్యోతిర్మయ విజ్ఞాన మానందమయ చిన్మయమగు పరమాత్మ శరీరము వలెగాక విలక్షణమై యున్నది. శరీరధర్మములు క్షుత్పిపాసలు శీతోష్ణములు సుఖదుఃఖములు, జనన మరణములు మొదలయినవి నిస్సంగమైన గగనము ఘటమునకు వేరై ఘటధర్మములగు వర్తులత్వ వక్రత్వాదుల చేతను నీలపీతాది గుణములచేతను కంబుగ్రీవాద్యాకారము సంబంధముగాని చొప్పున అసంగమగు ప్రత్యగాత్మయు శరీరముకన్న భిన్నమై శరీర ధర్మములగు క్షుత్పిపాసాది షడూర్మి జననమరణాది షడ్భావ వికారరహితమైనది అట్టి పరమాత్మను నేనై యున్నాను. ఇదే అర్థము వేదాంతమున అహంశబ్దవిచారణచే సిద్ధమగు చున్నది. నేనుయనగా పరమాతయని అర్థము. దీనినే ఆత్మఅహం ప్రత్యయి సిద్ధము అహంప్రత్యయ బోధితము అహం శబ్ద లక్ష్యార్థమని వేదాంతులు వచించుచున్నారు. పరమాత్మ శరీర విలక్షణమై పంచభూత ధర్మముల చేతను దేహధర్మముల చేతను నంటబడకయున్నదని సిద్ధమాయెను.

మఱియు "బుద్ధేరాత్మ = మహాన్పరః = బుద్ధికన్న ఆత్మమహత్తైనది శ్రేష్ఠమని యుపనిషత్తున్ను యోబుద్ధేః పరతస్తునః = బుద్ధికన్న పరమై ఏది యున్నదో అదియే ఆత్మ" అని భగవద్గీతయున్ను ప్రతిపాదించిన రీతిగా బుద్ధ్యతీతమై నిరుపాధికమై పరబ్రహ్మమున్నదనియు బుద్ధియనగా మహత్తు అవ్యక్తమనియు చెప్పబడుచున్నది. బుద్ధి (మాయ) వ్యక్తమగునప్పుడు మహత్తు అనియు సూక్ష్మముగా నున్నచో అవ్యక్తమనియు శాస్త్రజ్ఞులు తెలిపిరి కావున బుద్ధి మాయ వక్త అవ్యక్త మొదలయిన పదములచే వచింపబడు ఉపాధికన్నను విలక్షణమై పరమాత్మయున్నది. ఈ విషయమును వివరించుచున్నారు. అనగా నేనుకర్తను నేను భోక్తను అను అహంభావము దుష్టభావము ఎంతెవరిని లెక్కింపక మదోన్మత్తుడై యుండుట యేమియు తెలియక మందుడై నేను మఱియని సంతోష చిత్తుడై యుండుట అంతలోనే కష్టమాపన్నమయిన దుఃఖియని తలచుటయు నీలాగున సుఖదుఃఖాది ద్వంద్వములకు బద్ధుడై యుండుట నాకేలాటి సంబంధములేదు. సంసార దుఃఖము దొలగి ముక్తుడనయితినని

తలంచుట మొదలయినవన్నియు విచారించిన బుద్ధి ధర్మములయినవన్నియు సిద్ధమగుచున్నది. ఉన్నది పరబ్రహ్మమొక్కటియే భాసిల్లుచున్నది. ఆ పర బ్రహ్మము కేవలము అద్వితీయము పరబ్రహ్మము అట్టి పరబ్రహ్మమయిన తనయందు బుద్ధిధర్మములగు కర్తృత్వ భోక్తృత్వాదులెవ్వియు యథార్థముగా లేకనే యున్నవి. కావున నేను సుఖిని దుఃఖిని కర్తను భోక్తను అని భావించుట మాయా మహిమమైయున్నది. అంత మాత్రమేగాని తాను సర్వదా నిరుపాధికమైన అద్వయమైన కేవలమైన సచ్చిదానంద పరబ్రహ్మమని భావము. వివేకముతో గనుగొనక పరబ్రహ్మముకన్న వేరుగా తలంచుటగాని వ్యవహరించుటగాని అదంతయుద్వైతమగుచున్నది. కట్టకడకు నేనుముక్తుడననునదియు కల్పితమగును కావున సర్వవ్యవహార రహిత నిష్ప్రపంచపరబ్రహ్మమేతాను వేరొక పదార్థములేదు. అటుల వేరుగా తోచిన పూర్తిగా అజ్ఞానము నశించలేదనియు తలంచి సర్వదా పరిపూర్ణ స్వరూపస్థితి యందుండుటకు ప్రయత్నించవలయును. ఫలితార్థమేమనగా నిరుపాధిక పరబ్రహ్మమే స్వయం ప్రకాశమానమై సత్తారూపమై యున్నది. దీనినే ఉపనిషత్తు తెలుపుచున్నది = నవిరోధో నచోత్పత్తిః, నబద్ధోనచ సాధకః. నముముక్షుర్నవై ముక్త ఇత్యేషా పరమార్థతా = అనగా జననమరణములు బంధమోక్షములు ముముక్షువులు సాధకులు ముక్తులు ఆరూఢులు మొదలైన భావములు లేవు. ఉన్నది పరబ్రహ్మమొకటియే నిరుపాధికము. నిర్ద్వంద్వము నిర్వికారము అద్వితీయము కేవలము పరిపూర్ణము. ఇదియే సత్యము.

ఇక నిర్వికారస్థితినొందు నుపాయమును దెలుపుచు తాను నిర్వికార పరబ్రహ్మమని దృఢీకరించు చున్నారు. ప్రకృతి యనగా మాయ అంతఃకరణము తరంగములుగల సాగరమువలె చలనశీలమై యున్నది. సముద్రమున అలలు వచ్చుచు పోవుచుండువిధమున ప్రకృతికి వికారములు గుణములు సంకల్పము నామరూపాదులు సహజములుగా నున్నవి. ఆ మాయయొక్క మహిమయే సమస్త దృశ్యమైయున్నది. మనస్సుయొక్క చలనమే సంసారమైయున్నది. సముద్రము దాటదలంచినవాడు తెప్పనెక్కి సాగరమునంటక పోవువిధమున ప్రకృతిని దాట తలంపెట్టుకొని జ్ఞానమను తెప్పనెక్కి ప్రకృతినంటక పోవుచున్నాడు. ఆవిషయమునే తేటపరచుచున్నారు. ప్రకృవికారములు నానావిధములుగా నుండుగాక గగనమున విమానము నధిరోహించి పైనవిహరించు వానికి

భూమిచేతను వృక్షములచేతను పెద్ద పెద్ద కొండలచేతను యేలాటి బాధ నవిం
పని విధమున ప్రకృతియను భూమిని తద్వికారములగు వృక్ష పర్వతాదులను
అంటక చిదాకాశమున జ్ఞానమను విమానా రూఢుడై యున్న ఆత్మజ్ఞాన యోగికి
ప్రకృతి వికారములచే బాధలేదు. తాను ప్రకృతి స్వరూపుడుగాడు. కేవలా
సంగ చిన్మయుడు స్వస్వరూప ధ్యానముజేయువారు కొందఱు ప్రపంచమును
నెట్టివేసి వీతరాగులై కొండగుహలలో నివసింపదలంతురు. అచ్చోటనున్న
సంకల్పములు వెంబడించనే వెంబడించుచున్నవి. ధ్యానించు సమయమున
అనేక వాసనలు వృత్తులు సంకల్పములు ఎంత నిరోధించినను సహజముగా
గలుగుచునే యుండును. వానిని రహితముచేయజాలకున్నారు. అటులగాక నీ
వికారములు సంకల్పములు ప్రకృతికి సంబంధించినవి. నావికావు యథార్థముగా
ప్రకృతియనునది మఱియొకటి లేదు. అని నిశ్చయముగా భావించిన తాను సం
ల్పాతీత చిదాకాశమున అసంగుడను విజ్ఞానమను విమానమున నధిరోహించి
పరబ్రహ్మమై విహరించుచున్నాడు. "అసంగ శస్త్రేణ దృఢేన ఛిత్వా" అని
భగవద్గీతయు పై విషయమునే తెలుపు చున్నది. కావున అసంగ చిద్రూపుడగు
నన్ను ప్రకృతి వికారము లేమియు చేయజాలవు. మేఘములు గగనమును
స్పృశించనటుల మాయా కల్పితములు మాయారహిత పరబ్రహ్మమగునన్ను
ఎప్పుడైనను స్పృశింపజాలవు. అనగా మాయాతీత దృశ్యరహిత అద్వితీయా
సంగ పరబ్రహ్మమే తానని భావము. మఱియు పైనున్న మేఘమండలమే
యాకాశమును తాకజాలకయున్నది. ఇక పర్వతాదులు అంటనటుల సగ్వాతీత
చిద్రూపుడగు తనను సమీపమునమన్న బుద్ధ్యుపాధియే సంక్రమించక పోయిన
శరీరేంద్రియాదులు స్పృశించకనే యుంటున్నవి. ఈలాగున పరబ్రహ్మ
స్వరూపుడగు తానుసర్వసంగ రహితుడనియు నిర్వికారుడనియు కేవలచైతన్య
పరబ్రహ్మమనియు తెలియుచున్నాడు.

మఱియు "అహం బ్రహ్మాస్మి" అను వాక్యార్థమునిట శిష్యుడు సద్గురు
వునకు వివరించుచున్నాడు. స్వామీ! కేవల చైతన్య స్వరూపుడగు నేను అ
యద్వితీయ పరబ్రహ్మమై యున్నాను. ఏది వ్యక్తముగానిదై మూలప్రకృ
తియై అట్టి అవ్యక్తమునుండి "అవ్యక్తాన్మహతః మహతోఽహంకారః" అను శ్రుతి
వాక్యము చొప్పున అవ్యక్తమునుండి మహత్తు, మహత్తునుండి అహంకారము
ఈలాగున ఉత్పన్నమై ఆ పంచీకృత భూతోత్థ సూక్ష్మరూపమై పంచీకృత

భూతోక్తమహాస్థూలమై అనగా పరమాణువుకన్నను సూక్ష్మమయిన అవ్యక్త మనుమంది స్థూలమగు మహాపర్వతాదులుగనునై మహా పరిమాణమగు నాకాశ రూపముగ నున్నదో అట్టి సూక్ష్మాత్మక స్థూలాత్మక కారణాత్మకమైన ప్రత్య క్షముగా గన్పడి సత్యముగా దోచుచున్న సకలదృశ్యాత్మక ప్రపంచమంతయు ఆయఖండ పరిపూర్ణ సర్వవ్యాపక సద్బ్రహ్మమందున్నట్టుగా భాసమానమగు చున్నది. అందుచేతనే శ్రుతులు స్మృతులును ఆ యఖండ పరమాత్మయందు విశ్వమంతయు మహాసూక్ష్మముగా నున్నదని వచించుచున్నవి. దానిభావమేమ నగా విచారించిన నీషత్తుగా దోచుచున్న ప్రపంచముగూడ మిథ్యాభూతమయ్యే యున్నదని సిద్ధాంతము కావున నిర్వికార నిరుపమాద్వితీయ పరబ్రహ్మమందు విశ్వము కల్పనా మాత్రమైయున్నది. మాయా బలమువలన దృశ్య ప్రపంచ మంతయు సూర్యుడు లేనప్పుడు చీకటి దట్టముగా గొప్పభయంకరముగా దోచు విధమున దోచుచున్నది. విజ్ఞాన సూర్యోదయము కాగానే మాయా తమముదొగి కేవలాఖండాద్వితీయ పరబ్రహ్మ మహాజ్యోతి సర్వదా ప్రకాశమైయున్నది. మఱియు నాబ్రహ్మము గగనమువలె సర్వవ్యాపకమై రూపరహితమై మహా సూక్ష్మమై గొప్పసూక్ష్మమగు నవ్యక్తమునకును మూలకారణమై ఆది మధ్యాం తములు అను విభాగములేనిదై పరిణామియై అప్రమేయమై కేవలాద్వైతమై తనకన్న అన్యపదార్థము లేనందుచే నఖండమై యపరిచ్ఛిన్నమై పరిపూర్ణమై సచ్చిదానందమై యున్నది. అట్టియలౌకిక సర్వలక్షణ విశిష్ట సర్వవిలక్షణ పర బ్రహ్మమై యున్నాను. ఇంతయేల పరబ్రహ్మమేనేను నేనే పరబ్రహ్మము ఇందేమాత్రము సందేహములేదు. ఇకను విచారించిన అహం అస్మి రెండు పద ములు లేదకై కల్పితములు అంతిమ స్థితి యేది అనగా బ్రహ్మపరిపూర్ణము అఖండము కేవల చైతన్యము ఆనందము.

అదియుమంగాక నిర్వికల్ప సన్మాత్ర సచ్చిదానందమయ పరబ్రహ్మ మయొక్క స్వరూపమును విశేషముగా చెప్పుచున్నారు. ఆ పరబ్రహ్మము సర్వాధారము అబ్రహ్మము సర్వదృశ్యమునకు నాధారమై యున్నది. దానినే యధిష్ఠానమందురు. అధిష్ఠానమనగా సకల కల్పిత పదార్థములకు నాశ్రయమై ఆ కల్పిత వస్తువులకు వేరై యుండుట యగుమః, అలాగునే పరబ్రహ్మము సకలదృశ్య ప్రపంచమునకు నాశ్రయమై భిన్నమయ్యే యున్నది. ఈశరీరమున ఆత్మయున్నది. ఆయాత్మ తేజోరూపమై చైతన్యరూపమై దేహమునకు

విలక్షణమై యున్నది. ఆయాత్మ లేకుండిన నీ శరీరము మండజాలదు. ఈ తనువు మాయాకల్పితము. అటులనే ఈ దేహమందాత్మయును కల్పితము. కావున విచారించి చూచిన సకలాధిష్ఠాన స్వాత్మ స్వరూప పరబ్రహ్మము తానుగా నున్నాడు. సర్వవస్తు ప్రకాశము = ప్రదీపించు దీప న్యాయముగా నాపరబ్రహ్మము సర్వప్రకాశమై యున్నది. దీపమెటుల సర్వ వస్తువులకు ప్రకాశము నొసగుచు నదియు స్వయముగా ప్రకాశించుచున్నది. అలాగున ఆత్మయు సర్వ భూతములయందు తేజోరూపమై వెలుగుచు శరీరేంద్రియాదు లకు ప్రకాశము నొసగుచు వానినెల్ల చైతన్యవంతముగా జేయుచు విజ్ఞాన మయమై సర్వ విలక్షణమై నిస్సంగమై యున్నది. అనగా బ్రహ్మము దృశ్య భిన్నముగా భాసించు చున్నదని యర్థము. సర్వాకారము ఆ పరబ్రహ్మము తనకన్న వేరు వస్తువు లేనందుచే, "సర్వం ఖల్విదం బ్రహ్మ" అను శ్రుతివాక్యను సారముగా సర్వదృశ్యాకారమై సర్వాత్మ భావముతోనున్నది. అనగా సర్వ దృశ్యమును బ్రహ్మాకారముగా భావించిన అవశిష్టమగునది సత్తామాత్ర పర బ్రహ్మమే యున్నది. లేని దృశ్యము లేనిదిగానే యున్నది. సర్వగము = సమస్తమును వ్యాపించి బ్రహ్మమున్నది "తిలేషు తైలం" శ్రుతిరీతిగా నువ్వుల యందు నూనెవలెను పాల యందు నవనీతమువలెను కట్టెల యందు అగ్నివలెను పరబ్రహ్మము సర్వదృశ్యము నందును వ్యాపించియున్నది. ఆయా సాధన విశేషములచే తైలాదులను గ్రహించు విధముగా తనలో విచా రబలముచే సకల దృశ్యమును గ్రహించి సారమగు పరబ్రహ్మము కావనితెలి యవలెను. కావున తైలాదులు సారములేని పిండి మొదలైన వానికన్న భిన్న ముగానుండు విధమున పరబ్రహ్మము సకలదృశ్యమునకు వేరుగానేయున్నది సర్వశూన్యము = పరమాత్మ యేలాటి ప్రకృతి సంబంధము లేక యున్నది. భానుని తేజము నందు చీకటి లేనటుల పరబ్రహ్మమునందు మాయ లేకనే యున్నది. కావున పరమాత్మ సకల మాయా సంగవర్జితమై యున్నది. నిత్య స్వరూపము = మూడుకాలముల యందున బాధితమై అపరిణామియై సర్వదా కేవల స్వరూపమై యున్నది. శుద్ధము = త్రిగుణములు లేనిదై యున్నది. గనుకనే మాయామాలిన్యము లేక సూర్యునివలె విశుద్ధమై సదాయున్నది. నిశ్చలము = ఏలాటి చలనాది క్రియలులేక నిష్క్రియమై యున్నది. నిర్వి కల్పము = సంకల్పములుగాని వికల్పములుగాని సంశయ విపర్యయములుగాని

లేని నిశ్చయాత్మకమై యథార్థమై పరబ్రహ్మమున్నది. ఇకనుపరబ్రహ్మము అద్వయమై యున్నది. అట్టిపరబ్రహ్మము నేనై యున్నాను. సర్వాధార సర్వ వస్తు ప్రకాశ సర్వాకార సర్వగసర్వ శూన్యాత్మకమై నిత్యశుద్ధ నిశ్చల నిశ్చల నిర్వికల్పమై యేయద్వితీయ పరబ్రహ్మము సర్వకాల సర్వావస్థలయందు తేజరిల్లు చున్నదో ఆ పరబ్రహ్మమే నేను అద్వితీయుడను నిశ్చయ నిర్మలాత్మకుడను పరిపూర్ణుడను.

మఱియు నిట్టి సత్తారూపమగునదియే నేను. నేను అదియేనని నుడువు చున్నారు. "అస్థూలమనణు మహ్రస్వం" స్థూలముగానిది అణువుగానిది హ్రస్వము గానిది బ్రహ్మము. నేతి నేతి (ఇది నేనుకాను ఇది నేనుకాను) ఇత్యాది శ్రుతివాక్యములు మాయా కల్పిత సకలదృశ్యమును బ్రహమందు లేదని నిషేధించుచున్నవి. కావున పరబ్రహ్మము మాయచే నే యేభేదము కల్పితమాయెనో ఆసకల భేదముచే మాయారహితమయినందువలన శూన్యముగానున్నది. సకలదృశ్య రహితమై సకలాతీతమై ఏకమై అద్వయమై పరబ్రహ్మమున్నవదని భావము. అపరబ్రహ్మము అంతరాత్మయై సకలమును దెలియుచుకూటస్థభేదమై అనగా బింబభూత పరమాత్మయై స్వయం ప్రకాశమానమై యున్నది. ఏ ఇంద్రియ జ్ఞానమునకు గోచరముగానిది సకలేంద్రియతీతమై అతీంద్రియ జ్ఞానమగు కేవల ప్రజ్ఞారూపమై (జ్ఞప్తి) యున్నది. అప్రాకృతము అలౌకికము మాయారహితము. సత్యము = సర్వదా యుండునది = జ్ఞానము కేవలానుభవ జ్ఞానమయమై విజ్ఞాన జ్యోతిరూపమై యున్నది. = అనంతము అంతములేనిది లేక నాశములేనిది శాశ్వతము అవధిలేనిది నిరవధికము దేశ కాలవస్తు పరిచ్ఛిత్తి రహితము అపరిచ్ఛిన్నము ఆదిమధ్య అంతములు లేక అఖండ పరిపూర్ణమై కేవలానందరూపమై ఏకమై అద్వితీయమై యున్నది. కేవలసచ్చిత్సుఖ రూపము దానియందు దృశ్యముగాని దృశ్యప్రయుక్త దుఃఖముగాని లేనిది సర్వతేజోమయము సర్వామృతమయము సర్వమధుర రసము అఖండానందము పరిపూర్ణసుఖము పరమప్రశాంతము అట్టు కేవలచైతన్యాత్మక పరబ్రహ్మము శుద్ధచైతన్యము నేనై యున్నాను. చక్కగా విచారించిన చైతన్యమే సకలమునందు యవశిష్టమగుచున్నది. అన్నిటను అన్నిటి యందును చైతన్యపరబ్రహ్మమే యున్నది. ఇందులకు శ్రుతి "సర్వమద్వితీయంబ్రహ్మ" విజ్ఞాన మానందబ్రహ్మ" ఏకమేవాద్వితీయం నేహ నానాస్తి కించన అను

వాక్యములు ప్రమాణములు.

మఱియు ఆ బ్రహ్మము, నిష్క్రియము, నిర్వ్యాపారము. అచలము నిర్వికారము. సదాఏకరీతిగానుండుచు నపరిణామియై యుండునది. విభాగములు అవయవములు లేనిది. నిరవయవము. నిరంశము. అవిభాజ్యము. అఖండము. నిరాకారము నామరూపగుణరహితము దృశ్యాతీతము యేవిధమగు వికల్పములు సంకల్పములు సంశయములేనిది నిశ్చయాత్మకము త్రికాలబాధితము సర్వదా శాశ్వతము. నిరాధారము అనగా బ్రహ్మము మాత్రము సర్వాధారమైయున్నది దానికి మాత్రమే యాధారము లేదు. అద్వయము ఏకము అభిన్నము అట్టి పర బ్రహ్మము నేనుగనుక నిష్క్రియుడను. నిర్వికారుడను. నిష్కళుడను. నిరాకారుడను. నిర్వికల్పుడను. నిశ్చయాత్మకుడను. నిత్యుడను. సర్వాధారుడను. అద్వయుడనై యున్నాను ముఖ్య విశేషమేమనగా క్రియలు. వ్యాపారములు. గుణములు. వాసనలు. వృత్తులు. వికారములు. పరిణామములు. అవయవములు. విభాగములు. ఖండాఖండములు. పరిచ్ఛేదములు. నామరూపగుణములు సంకల్ప వికల్పములు. విపర్యయములు. సంశయములు అసంభావనలు. ఉత్పత్తినాశములు. ఆధారధేయభావములు కార్యకారణ భావములు మొదలైనవి ప్రకృతి ధర్మములు "కార్యకారణ కర్తృత్వే, ప్రకృతిర్హేతు రుచ్యతే" గీతా వాక్యమురీతి కేవల చైతన్యాత్ముడనగు నాకవి సుతారంలేవు. కనుక నేను బ్రహ్మము బ్రహ్మమునేను సందేహములేదు. సర్వదా అద్వితీయ బ్రహ్మమే యున్నది.

మఱల శిష్యుడు అహంబ్రహ్మాస్మి తత్త్వమును వివరించుచు తాను కేవల పరిపూర్ణ సర్వదృశ్యరహిత చరాచరాత్మక పరబ్రహ్మమని తేటపరచుచున్నాడు గురుదేవ నేనంతటను వ్యాపించి యుండువాడను. నా స్వరూపమే లేక యేదియు లేదు. నా స్వరూపముచేతనే సమస్తము చైతన్యవంతమగుచున్నది. గనుక సకలము నాస్వరూపమై యున్నది. సర్వాత్మభావముతోనుండువాడను. నాకన్న వేరులేదు గనుక అంతయు నేనై యున్నాను. పరిపూర్ణ పర బ్రహ్మమై యున్నాను. సకలదృశ్యరహితుడను ఏకాత్ముడను కేవలము అఖండమయ. విజ్ఞానమయ. ఆనందమయ. అమృతమయ. నిరతిశయ. సుఖమయ స్వరూపుడను సర్వదా యుండువాడను. అద్వితీయ పరబ్రహ్మము నేనే బ్రహ్మము సర్వపదార్థరూపము సర్వపరిపూర్ణము సర్వాత్మకము సర్వప్రకృతి

విలక్షణము అద్వయము కేవలాఖండ స్వయంప్రబోధరూపము ప్రజ్ఞానఘనము అఖండ పరిపూర్ణానందము ఏకము సర్వదా యుండునది శాశ్వతము అట్టి పరబ్రహ్మమే నేను. నేను పరబ్రహ్మమని ముఖ్యభావము. ఈలాగున శిష్యుడు ॥ అహంబ్రహ్మాస్మి ॥ నేనుపరబ్రహ్మను అను మహావాక్యార్థజన్య స్వయంబోధమును స్వానుభవ పూర్వకముగా శ్రీ గురుదేవుని కర స్పష్టపరచుకొనెను అనగా శిష్యుడు అఖండ జ్ఞానానుభవము గలవాడాయెనని భావము. గురుశిష్యులైక్య భావమును గురువనగా బ్రహ్మము. శిష్యుడనగా జీవుడు జీవత్వము నశించి శివత్వమునొంది జీవబ్రహ్మైక్యతనొందెనని యర్థము.

ఇక శ్రీ గురుదేవుని యపార కరుణామహిమచే సంప్రాప్తమైన స్వానుభవానంద విజ్ఞానాతిశయముగల శిష్యుడు శ్రీగురుదేవుని సన్నిధానమున సాదర వినయోక్తులతో కృతజ్ఞతాభివందనములర్పించు చున్నాడు. ఓ దయామయమగు శ్రీ సద్గురు మూర్తి అవ్యాజ స్వభావ మధురమగు ప్రేమ మాయా విజ్ఞానతేజ పుంజస్వరూపా శాశ్వత నిరతిశయానంద స్వరూపా కరుణాఘనావలోకనా తమయొక్క అప్రాకృత నిర్లిప్త అకారణ సర్వవిలక్షణ సహజసిద్ధ అఖండ కృపారస వీక్షణ మహిమాతిశయ సర్వదోషనిర్మూలన సమర్థవిజ్ఞానజనకమగు ననుగ్రహము వలననే నేను ఇదివరకు దారి తెలియక అనాదిసిద్ధ సంసార కూపమునబడి తాపత్రయాది దుఃఖపీడితుడనై యును ప్రాకృతజనునివలె నుంటిని. ఇప్పుడు నిర్ముక్తుడనై పరమామృతమైన కేవల స్వయం ప్రబోధరూపమయిన విజ్ఞానఘనమయిన శాశ్వత నిరతిశయానంద ఘనమైన కేవలానుభవ సిద్ధమైన నీమోక్ష సామ్రాజ్యమందు పట్టాభిషిక్తుడనయితిని. రాజు ఎటుల సకల శత్రువుల జయించి పట్టాభిషిక్తుడై ఏకచ్ఛత్రాధిపతియై నిష్కంటకముగ మహారాజ్యమునేలుచు ఆనందభరితుడై యుంటున్నాడు. అలాగున శ్రీ గురుదేవుని కరుణచే ఆత్మజ్ఞాని సకల ప్రకృతి వర్గశత్రువులను జయించి జ్ఞానతీర్థముంచే బ్రహ్మసింహాసనమున నభిషిక్తుడై స్వయం ప్రకాశమానుడై స్వప్రబోధరూప స్వారాజ్యముతో గూడుకొని స్వస్వరూప పరమానంద భరితుడై నిర్భయుడై అద్వితీయుడై పరబ్రహ్మమైయున్నాడు. అలాగున నేనును స్వారాజ్య సామ్రాజ్య విభూతి గరిమతో నొప్పుచున్నవాడను ఇదంతయు సర్వవిలక్షణ నిర్లిప్త, నిర్వికార, నిశ్చల, నిరామయ, బ్రహ్మానందామృత స్థితి అసాధారణమగు భవదీయ కృపాకటాక్షమే వేరుగాదు. ఓ గురురాయా!

మహానుభావా మహాత్మా. సాక్షాత్పరబ్రహ్మమూర్తి జ్ఞానమయా మీ కొరకు నమస్కారము. నమస్కారము. నమస్కారము ఇంతకన్న నేనేమి చేయగా లను. ఇదిగో ఈదీనుని నమస్కారము. దీనుని నమస్కారము దీనుని నమస్కారము అని మూడుసార్లు నుడువుచు సాష్టాంగదండ ప్రణామము లర్పించెను. మొదటి నమస్కారముచే బాహ్యదృష్యము నంతటిని సమర్పించెను. రెండవ నమస్కారముచే అంతరంగిక దృశ్యము నంతటిని అర్పించెను. మూడవ ప్రణామముచే గురుదేవుని కరుణ యనిర్వర్ణనీయమనియు పరబ్రహ్మమే తానైతిననియు దెలియ జేసెను. ఈలాగున ధన, తను, మనముల సమర్పించెననియు త్రికాలములయందును, పరబ్రహ్మ గురుదేవుని మరువనట్టి స్థితిని (జ్ఞప్తి) పొందెననియు భావము.

మఱియును శిష్యుడు తన యను భావమును తెలియజేసి కొనుచున్నాడు ఓగురుదేవా! సాక్షాత్సిద్ధమూర్తి అంతయు తమ అపారకరుణయే వేరుగాదు. ఇందునా ప్రయత్న మినుమంతయులేదు. ఇదివరకు నేనున్న స్థితియు ఇప్పుడు నేనున్న స్థితియు నెంతోభేదము కలిగియున్నది. నాకు జెప్పుటకు సాధ్యము కాదు. విషము భుజించిన వాని కమృతత్త్వము లభించిన స్థితివలెను. పాప పంకిల హృదయమునుండి పొరలు వానికి శుద్ధమైన సుకృతమగు పన్నీట స్నానమువలెను కడుదరిద్రునకు మహారాజ్యపదవి వలెను మహావ్యాధిపీడితునకు మహాఆరోగ్యస్థితివలెను సంసారబద్ధుడైన నాకు నిర్ముక్తస్థితి అజ్ఞానియగు నాకువిజ్ఞానస్థితి దుఃఖజీవియైన నాకు ఆనందస్థితిలబ్ధియై యుంటున్నది. ఒకానొకడు ఋణబాధచే తపించుచున్నాడు. అట్టివానికి నొక పరమదయాళుడు ఋణ బాధనంతయు పూర్తిగాతీర్చి విముక్తునిగా జేసి కావలసిన ధనమును వానికి నొసగెను. వాడేలాగున సకలఋణ బాధల దొలగి మహాద్రవ్యవంతుడై కడు నానందముతో జీవనము గడుపుచున్నాడో ఆలాగున నేను సకల కర్మబాధలచే సంతప్తుడనయియుంటిని. శ్రీ గురుదేవుడు వానినెల్ల నశింపజేసి జ్ఞాన ధనము నొసంగెను. కనుక నాకు గలిగిన యానందమునకు మేరలేదు. ఒకానొకడు మహాకూపమునబడి గుటకలు మ్రింగుచుండెను. కృపావంతుడగు బాటసారి వానిని త్రాడు ద్వారా తీరమును జేర్చి ప్రాణమును రక్షించెను. అవిధముగానే మహాసంసార కూపమునబడ సుఖదుఃఖములను గుటకలు త్రాగుచున్న దీన జీవుడగునన్ను శ్రీ గురుదేవుడు కృపకరించి జ్ఞానమను రజ్జువు నొసగి జీవ

త్రిపుటైక్యమను మహాత్రాణము నొసగెను. అందుచే నాచే వర్ణింపబడు చున్న అతనిస్థితికి హద్దులేదు. మఱియు ఒకానొకడు క్షుత్పిపాసలచే బాధ బాధనొందు చుండెను. అట్టివానిని అన్నదాత అన్నపానములనొసగి సంతృప్తి పరచెను. ఆవిధముగా జనన మరణములచే తీవ్రబాధనొందుచున్న నన్ను శ్రీ గురుదేవుడు జననమరణ రహితమగు ముక్తస్థితిని గలుగజేసి సకలదుఃఖ ములబాపి జ్ఞానసంతృప్తిని జేసెను. నాసంతృప్తికి పర్యవసానమే లేదు. అనగా అనిర్వర్ణనీయ శాశ్వతానంద స్థితినొందితినని యర్థము. ఈలాగునవేకదృష్టాం తములచే నాయలౌకికానందమును పోల్చి చెప్పుకొనుచున్నారు. ఇదంతయు దృఢమగు బోధకొఱకేయని తెలియవలెను. యథార్థముగా నాబ్రహ్మానందస్థితి నిరుపమాన మయినదని చెప్పుచున్నారు. ఓగురుదేవా! కరుణామయా! నా విన్నపము నాలింపుమా భయంకరమగు నీ సంసారము అంతులేనిదై మహారణ్య మువలెనున్నది. అడవి మహాక్రూరమృగములతో మహాకంటక వృక్షములతో నానావిధ బృహత్పాషాణములతో పెద్దపెద్ద పొదలతో గూడుకొని ప్రవేశింప సాధ్యముగాక నిరవగాహమయినటుల నీసంసార కాననముగూడ కామక్రోధాది క్రూరమృగములతోను దుఃఖాత్మకములగు కంటక వృక్షములతోను విషయ సుఖములను గొప్పగొప్ప రాళ్ళతోను తమోగుణ వికారములగు పొదరిండ్లతోను గూడుకొని మహాభయంకరమై యున్నది. విషయాశక్తి యనెడు గొప్ప గొప్ప గుహలుగలవు ఈ సంసార కాననమును దహింప జ్ఞానమను దావాగ్నియవసర మైయున్నది. మఱియు నీ అవిద్యాదశ మహాస్వప్నమనగా స్వప్నములో ననేక ములగు సుస్వప్నములనుజేసి కొంతకాలముండుట మహాస్వప్నముగానున్నది ఆలాగున అవిద్యా కల్పితమగు నీ ప్రపంచము జాగ్రత్స్వప్న జాగ్రత్స్వప్న సుషుప్తులను దశత్రయంతో గూడియున్నది. ఈ జాగ్రద్దశయే స్వప్నమువలె మిథ్యగానున్నది. స్వప్నసుషుప్తులను కడుమిథ్యగా నున్నవి. స్వప్నములో మఱికొన్ని స్వప్నములుండులాగున నొకే జాగ్రద్దశలోనే జాగ్రదాది మూడవ స్థలను సూచింపుచున్నవి. ఈలాగున మూడవస్థలను నానావిధములతో నున్నవి. కావున మాయా సంజనితములగు నివియన్నియు విచారించిన మనః కల్పితమగు మిథ్యారూప ప్రపంచమే యీ సర్వదృశ్యము తలంచుటదే ఇట్టి భ్రాంతిమయ జననమరణ బాధలచే నానిదుఃఖములచే దురవగాహమగు సంసారము మహాస్వప్నమువలె. అనంతమై స్వప్నములో కన్నొకడు తను

వటులను దహించి వటులను తానువేరై చూచుచున్నాడు. అయిన నావిషయ
మును నీవుదెఱుంగుట లేదు. కేవలము రజోగుణమయమై చలనాత్మకమై
యావస్థ యుంటున్నది. అలాగున అవిద్యామయమై, అసత్యమై కాలుపెట్టిన
కోసుకొనిపోవు రాళ్లు ముండ్లు వృక్షములు మహాగుంతలు పెద్దగుట్టలు వీనితో
గూడుకొని చొచ్చుటకు సాధ్యముగాని మహారణ్యమువలె భయంకరముగ
నున్నది. ఇట్టి దురవగాహ నానాదుఃఖమయ సారహీన సంసారమునుండి దొర
లుచుంటిని చెప్ప సాధ్యముగాని మహాక్రూర సర్పవిషమువలె దుస్సహమగు
సవంత దుఃఖములతో బాధింపబడుచుంటిని. మఱియు గానమున పెద్ద పెద్ద
బెబ్బులి నిర్భయముగా సంచరించుచు దుర్బలములగు మృగములనెల్ల మ్రింగు
చుండును. అలాగున కేవలభిమాన ప్రయుక్త మహాహంకారమను మహావ్యా
ఘ్రము మలిన సంస్కార యుక్తాంతః కరణమగు నోరుతెఱచి విషయ వాసన
లను కోరలతో భయంకరమైన సత్సంకల్పములగు పుణ్యములను మృగము
లను మ్రింగుచు జీవత్వ దశలోనున్న నన్ను వ్యథపెట్టు చుండెను. అట్టిడు
దీనుడయిన మృత్యువాతబడుచున్న నన్ను నాయొక్క సంసారారణ్యమును
జ్ఞానమను అగ్నినొసంగి దహించి సంసార కననమునుండి పరిబోధ దశయగు
విశాలప్రదేశమున నుంచి స్వస్వరూప ప్రకాశ మార్గమును అజ్ఞానమను మహా
నిద్రనుండి విజ్ఞానముచే మేలుకొల్పి ఓ దయామయా! ఓ దీనదయాళో అపార
కరుణాదృష్టితో రక్షించితిరి. దారితెలియని నాకు దారిచూపితిరి మీదయా మహి
మను నిరుపమానము అరణ్యములో దారి తెలియనివానికి మార్గమును జూపి
రక్షించినటుల నన్ను రక్షించితిరి. నాజీవత్వబుద్ధి నశించెను. నేను పరబ్రహ్మ
మను దృఢమతి సర్వదా సిద్ధమాయెను. ఈ లాగున శిష్యుడు పరిపూర్ణ జ్ఞాన
సంపన్నుడై శ్రీ గురుదేవుని కృపాతిశయము చేతనే తనకఖండస్థితి కలిగెనని
తెలుపుచు శ్రీగురుదేవుని బహుధా అనంతముగా స్తుతించెను. ఇచ్చోట శ్రీ
గురుదేవుని అపార కరుణావృష్టి చేతనే విజ్ఞానము గలుగునని సిద్ధమాయెను.
కావున శ్రీగురుదేవుని యనుగ్రహము చేతనే సకల దుఃఖములు తొలగి ఆనం
దప్రాప్తిగలిగి బ్రహ్మస్వరూపుడగు చున్నాడు. మహాత్ము లెల్లరు శ్రీగురుదే
వునిమహిమ అనంతముగాపొగడుచున్నారు. గురువేబ్రహ్మము పరబ్రహ్మమే
శ్రీగురుదేవుడు. ఇట్టి ధీమంతుడగు శిష్యునిజూచి శ్రీ గురుదేవుడు తిరుగాను
శిష్యుని సనుగ్రహింపదలచి వానికిగలిగినఅపరోక్షానుభూతిని, నిరతిశయానంద

ప్రాప్తి వినిర్ధూతత్వము చేసి గాఢముగా కట్టబడిన స్వానుభవముచే బ్రహ్మ జ్ఞానులచే సిద్ధమగు యథార్థమయిన శాశ్వతమయిన విజ్ఞాన ఘనానందమయిన పరతత్త్వమృతము అంతరముగా మిగుల గ్రాహ్యముగా వర్ణించుచున్నారు ఓయీ! శిష్యసత్తమా! సత్యానందము ఆనందము ఏలు విచారించినను కారణ మునకన్న కార్యము వేరుగాదు. కారణభూతసర్వేశ్వరుని కన్న జీవుడు వేరుగాదు అగ్నికన్నను మిణుగురులు వేరుగావు. మట్టికన్నను ఘటము వేరుగాదు. దూది కన్నను వస్త్రము వేరుగాదు. పాలకన్నను వెన్నె వేరుగాదు. మఱియు నువ్వు లకన్నను నూనె వేరుకాదు, చెఱకురసము కన్నను బెల్లము వేరుగాదు. ఇనుము కన్నను ఖడ్గాదులు వేరుగావు. బంగారముకన్నను ఆభరణాదులు వేరుగావు. తేనెకన్నను మధురము వేరుగానటుల అంతయు బ్రహ్మముగానే యున్నది. ఇదివిశ్వయము. ప్రపంచమంతయు నామరూపాత్మకమయినది. ఎంతవిచారించి నను నామరూపములే జగత్తుగానుపించుచున్నవి. కావున నామరూపములకన్న జగత్తు వేరుగాలేదు. అలాగున నామరూపములచే నుపలక్షితమగుచున్న స్థూల సూక్ష్మాత్మక ప్రపంచ సర్వస్వము బ్రహ్మమయ్యే యున్నది. బ్రహ్మమును వదలి జగత్తను సత్తాపదార్థము వేరుగాలేదు. త్రికాలములయందును భ్రాంతికా ధారములగు రజ్జ్వాదులుండియే యున్నవి. భ్రాంతి కాలమున మాత్రము అర జ్జ్వాదులు వేరుగా తోచుచున్నవి. అతోచుట రజ్జ్వాది ధర్మముగాదు. మనోధ ర్మమయ్యేయున్నది. ఆ భ్రాంతికాలములోను వేరుగా భాసించినది. రజ్జ్వాదికమే కావున వధిష్ఠానముకన్న నారోపిత వస్తువెన్నడును వెరుగాలేదు. అలాగున త్రికాలముల యందును సన్మయము చిన్మయము పరమాత్మయుండియే యున్నది. ఆపరబ్రహ్మమును. వదలి జగత్తు వెరుగాలేదు. భ్రాంతిచే నామరూపాత్మక ముగా దోచునదియు బ్రహ్మమయ్యే యున్నది. అందుచేతను ఈదృశ్యప్రపం చమంతయు బ్రహ్మజ్ఞాన సంతానమైయున్నది. పరబ్రహ్మముయొక్క యఖం డ విజ్ఞాన మహిమయై విభూతియై యున్నది. జ్ఞానాంతమై యున్నది. రేణు వులు పృథివి యంశములై నటుల మిణుగురులు అగ్నియంశములై నటుల పరి పూర్ణజ్ఞాన విస్ఫురణమై జగత్తున్నది. అనగా జగత్తు బ్రహ్మమేను ఎటుజూచి నను నేటట జూచినను వేవేగాంచినను సంతత సదాత్మక పరబ్రహ్మమే స్వయం ప్రకాశమానమై యున్నది. అదియే త్రికాల సత్తారూపమై యున్నది.

"సర్వం ఖల్విదం బ్రహ్మ" ఏకమేవాఽద్వితీయం బ్రహ్మ ఆత్మైక

వేదం సర్వం॥ నేహనానాఽస్తి కించన॥ యేనసర్వమిదంతతం॥ ఆత్మవోఽస్య జగన్నాస్తి॥ బ్రహ్మైవేదం సర్వం॥ ఇత్యాది శ్రుతివాక్యములన్నియు కేవల సత్తారూప పరబ్రహ్మమునే ప్రతిపాదించుచున్నవి. కావున విజ్ఞాన తత్త్వజ్ఞ బ్రహ్మరూప సకలవృత్తులను సర్వసంకల్పములను మనసు మిడిగించవలెను నిర్వికార నిరామయ ప్రశాంత చిత్తముతో సర్వకాలములయందును జాగ్రదాద్యవస్థల యందును (ఆయవస్థలు బ్రహ్మముకన్న వేరుగావని శ్రుతి ప్రతిపాదించు చున్నది. అనుభవమును గూడనటులనే యుండుచున్నది.) గావున బ్రహ్మ ముకన్న వేరు లేనందుచేతను అంతయు పరబ్రహ్మమేయని సునిశ్చితమగు నాత్మ దృష్టితో నంతయు విలోకింపుచూ అటులయిన బ్రహ్మమే గోచరించును వేరు గోచరింపదు. అంధులకుగాక నేత్రములు గల వారందరికిని ప్రపంచమం తయు రూపవత్తై యున్నది. గనుకను నయనములకు రూపమే గోచరించుచు న్నది. గనుకను నెంతగ విచారించినను నెచ్చోట నెటు జూచినను రూపము వినా మరియొకటి గానుపించదు. జగత్తు రూపమయ్యేయున్నది. అటులనే సం తయు బ్రహ్మమయమని స్వాత్మమయమని సర్వాత్మభావముతో యథార్థ స్వానుభూత బ్రహ్మమయ దృష్టితో సర్వమును గాంచుచు బ్రహ్మమయిన బ్రహ్మవేత్తగు పరబ్రహ్మమునే సర్వదా గాంచుచుండును. వేరొకదానిని విలోకించదు. బ్రహ్మముకన్న మరియొక పదార్థము గూడలేదు. లేనిది లేనిది గానే యగుచున్నది. ఉన్నది ఉండియే భాసిల్లుచున్నది. కావున సిద్ధార్థమేమనగా అంతయు బ్రహ్మమే వేరుగాదు. కావున చూడబడునదంతయు బ్రహ్మమేయని తెలియవలయు నీలాగున స్వానుభవ విజ్ఞానముతో నిర్వికార నిరంజన నిరతి శయానంద పరబ్రహ్మమందు దీమతిని సర్వదా యుంచుచూ అదియే బ్రహ్మ రూపునకు విశ్రాంతి స్థానము పరమపదము ఇతరభావనలను వదలుచూ స్వస్వ రూపస్థితియందే యెల్లయెడల నుండుచూ అచ్యుతుడవుగమ్ము అని ముఖ్య భావము. "బుద్ధేర్విలయాస్పదం" అని యుండుటచే బుద్ధియొక్క విలయస్థానం బ్రహ్మమైయున్నది. బుద్ధి యెచ్చోటనేలయించి విశ్రాంతి సుఖము నొందు చున్నది. అనగా బ్రహ్మరూపమగుచున్నది. కాబట్టి "యత్రయత్ర మనో యాతి. తత్ర తత్ర సమాధయః" మనస్సు లయించుచోటల్లె సమాధులగు చున్నవని చెప్పిరి అప్పుడు సమస్త ప్రకృతి లయించినదై అజ్ఞానరహితమై అఖండ విజ్ఞానము గలుగుచున్నది. సర్వమునకు కీలకము బుద్ధి గనుక బుద్ధి

పరబ్రహ్మముతో చేయునప్పుడు తదితరములగు బాహ్యప్రపంచము ఇంద్రియాదులును క్రమముగా బుద్ధిలోలయించి తద్ద్వారా పరబ్రహ్మ రూపములగుచున్నవి. ఇదియే సమస్త జగత్తు బ్రహ్మమగుట ఎఱుక వహించవలయునను దానికి విధియే. మాయామాలిన్యము నశించి బుద్ధి బ్రహ్మరూపము గావలయును. అప్పుడు సర్వేంద్రియములు ప్రసన్నములై బ్రహ్మరూపములగును. ఉన్నది పరబ్రహ్మమే ఇదియే పరమ సత్యము.

అటువంటిగాక యథార్థస్వాత్మ సుఖానుభవముగల బ్రహ్మజ్ఞాని దృశ్యమునందపేక్ష యుంచక సర్వదా స్వాత్మారాముడై పరబ్రహ్మమందు విహరించుచు ప్రసన్నుడై ప్రశాంతితోగూడినవాడై తేజోమయుడై నిరంతర మానంద భరితుడై స్వస్వరూపమై యుంటున్నాడు. ఇతర దృశ్యముల నేమాత్రము గోరడని యెఱుగుము. అటులగాక తానుమాత్రము నానావేదాంతము నభ్యసించి పరబ్రహ్మమయితినని వాపోవుచూ నిస్సంగివలె సంచరించుచు ఇంద్రియములకును ఆత్మకును సంబంధములేదు. సూర్యునికి మలినమంటునా యని బోధించుచు కేవల విషయ లంపటుడై విషయేంద్రియములందు విహరించువాడు తానెన్నటికిని జ్ఞానికాజాలడు. వానిని అజ్ఞానిఅనియే తెలియవలయును. కీటకము మలినపదార్థములనే గోరుచు నందుననేపడి మరణించుచున్నది. అలాగున విషయాక్రాంత చిత్తముగల మూఢాత్ములగువారు విషయములనే గోరుచు నందులోనే చిక్కి మృతినొందుచున్నారు. కొందఱు పరిపూర్ణ స్వానుభవ జ్ఞాని కేలాటి ప్రతిబంధములులేవు. విధినిషేధములు లేవు అని వచించుచు ననేకవిధ స్వకపోల కల్పిత శాస్త్రప్రమాణముల జూపించుచు జిహ్వోపస్థలను జయింపలేక నానావిధ బహురమణీయ తత్త్వజ్ఞానప్రదములగు నుపదేశముల జేయుచుందురు. అట్టివారు తాము మూఢులగుటయేగాక పరవంచకులై మహాపాపులగుచున్నారు. సూర్యుడు మలినమునంటడు. మలినమును గోరడు తాను గగనమందు విహరించుచున్నాడు. అలాగున సర్వేంద్రియాతీత ప్రకృతి రహిత విజ్ఞానమును బడసిన అనుభవజ్ఞులు దేనిని గోరక దేనినంటక అతీంద్రియ జ్ఞానవిధులై వీతరాగులై విగతస్పృహులై యప్రతిహత విజ్ఞానవీధులందు విహరించువారై అమృతమయులై యుందురు. అట్టి ధీమంతులెన్నడును తుచ్ఛములును వినశ్వరములైన నీచములయిన దుఃఖబహుళములయిన అంధకారావిద్యా విశిష్టములయిన క్షణమాత్ర సుఖాభాసకములయిన విషయ సుఖ

ములను మలినమగు పురుగు వలెగోరరు. అమలినము నందున విహరించరు. అందుచే మలిన విషయ సుఖములందుండినవారు జ్ఞానులుగారు దుఃఖజీవులగు నజ్ఞానులనియే తెలియవలయును. వరికాశము చీకటిగా నెన్నడైన మారునా, దానిదగ్గరనైనను అంధకారము నిలుచునా అలాగున జ్ఞాన ప్రకాశము మలిన విషయాంధకారమగునా? జ్ఞానప్రకాశము దగ్గరనైన నివసించగలుగునా? జ్యోతిస్వరూపముగానె యున్నదిగాని తమోమయముగాదు. అమృతము విష మగునా? మధురము చేదగునా? అలాగున జ్ఞానామృతము జ్ఞానామృతమయే యున్నది. విజ్ఞాన మధురము మధురముగానే యుండును. అటుగాక చేదుండిన యెడల పరిపూర్ణజ్ఞాని కాదనియే నిర్ధారణ చేయవలయును.

అమందానందామృతమును గ్రోలినవాడు జనన మరణాది దుఃఖముల నొందరు. అమృతపానము చేయువాడు విషపానము చేయడు ఒకానొక మహా రాజు తాను సకల సామ్రాజ్యాభిషిక్తుడై వీధులందు భిక్షమునకై యాచనా వృత్తికై ఆకలిచే తప్తుడై తిరుగుచున్నాడనిన నమ్మువాడు గలడా, అలాగున అమితానందమునొంది యాత్మసామ్రాజ్యాభిషిక్తుడై యున్న బ్రహ్మజ్ఞాని చక్రవర్తి విషయ సుఖములు గోరువాడుకాడు. అట్టిమహానుభావుడుకలలోనైన విషయవాంఛ నిదరని భావము,

నిజమయిన అపరోక్షానుభూతిని బడసిన మహాత్ములెన్నడును దృశ్యములోనికి జారిపోరు. ఇదిసర్వదా సత్యము. అని శ్రీ గురుదేవులు బోధించుచున్నారు. నిత్యనిరతిశయానంద సుఖమునుపొందిన సంతృప్తుడగు బ్రహ్మజ్ఞాని విషయ సుఖముల గోరడను విషయము దృఢముగా చెప్పుచున్నారు. సకల వేదాంత శాస్త్రప్రమాణములచే సిద్ధమయినదియును శ్రీ గురుదేవులచేతను స్వానుభవ జ్ఞులగు బ్రహ్మవేత్తల చేతను "వాసుదేవ సనాతనః" వాసుదేవుడనబడు కేవల బ్రహ్మవస్తువే యథార్థమయినది. నిరతిశయానందమయినది. తదితర దృశ్య ములు క్షణికములయి యుంటున్నవి. కావున జనులారా! స్వాత్మానందమును గోరి పరబ్రహ్మమందే విహరించరు. అను శ్రీ వ్యాసభగవానుని వాక్యము రీతిగా సర్వదా బోధింపబడునదియు స్వానుభవ గోచరమైనదియు ప్రత్యక్షమై యపలాపింప సాధ్యముగానిదై యుంటున్నదనియు ప్రసిద్ధమైన నిరవధికానంద శాశ్వతజ్ఞానామృత స్వాత్మస్వరూప బ్రహ్మసుఖమును అనుభవించు విద్వాం సుడు కేవలవిషయప్రాయములయిన దుస్సహ దుఃఖ కంటక బహుళములయిన

కేవల క్షణకాలమాత్ర, రమ్యములయిన, అశాశ్వతములయిన, తుచ్ఛములయిన
వినశ్వరములయిన విషయసుఖముల యందెన్నటికిని రమింపరు. విషయసుఖ
ములను తుచ్ఛములని తలంచి స్వాత్మోన్ముఖులై దవాదె తొలఁగుదురు, జ్ఞానియ
నగుచున్నారు. అటులంగానివారు మూత్రపురుషములపై పొర్లాడు నీచమగు
పురుగువలె నున్నవారగును కేవల మూఢులని భావము పరమదయతో నుపని
షత్తులు సద్గురువు వాక్యములు ఓనాయనా! విషములో బడబోకుమా అధోగతి
పాలగుదువని బహువిధంబుల ఘోషించి చెప్పుచుండగా ఆమాటలు తృణీక
రించి యందులో ప్రవేశించినవారగు చున్నారు. అట్టివారి విషయమై శాస్త్ర
చర్చలు హితబోధలు నిరర్థకములు గావున కదారించి సత్తునే చేపట్టవలయును.
వారేదన్యాత్ములు కాబట్టి స్వాత్మస్వరూప పరబ్రహ్మమును తెలియక తదనంత
సుఖమునుగాంచక ప్రకృతి వ్యామోహిత మూఢమానసులు త్రిగుణములచే
కల్పితమై నానావిధ చిత్రములుగా గానుపించుచున్న యసత్య జగత్తును జూచి
యామోహించుచున్నారు. యథార్థమును దెలిసిన విజ్ఞాని సర్వదృశ్యమును విడ
నాడి స్వాత్మయందే విహరించుచు పరమ సుఖమును, పరమశాంతిని, బొందు
చున్నారు. దృశ్యమునెన్నడును గోరడని ముఖ్యతాత్పర్యము.

ఆనందమయుడై సర్వాతీతుడై పరిపూర్ణ పరబ్రహ్మమై యుండున్నా
డని యర్థము.

మఱియు అఖండ బ్రహ్మానందామృతపాయిగాక మఱి ఎవరును దేని
చేతను అనంత సుఖంబులీని నొందలేరని చెప్పుచున్నారు. సారభూత పరబ్ర
హ్మానుభవము చేతనే సంతృప్తిని బడయుచున్నాడు. సంసార దుఃఖ తాపశాం
తిని పొందుచున్నారు. అసత్తగు వర్తమానకాలమునందును కించిత్తుగాభాసించు
అనాత్మ స్వరూపములయిన దృశ్యపదార్థములచేతను తత్సంబంధ విషయసుఖ
లేశముల చేతను మనుజుడెన్నటికిని తృప్తినొందడు. అనాత్మవిషయములచే
నేలాటి ప్రయోజనము సిద్ధించదు. లవమాత్రమయిన తృప్తిని బడయజాలరు
తననుగలుగు దుఃఖముయొక్క యింద్రియముల దీర్ఘతర తాపము యొక్క
శాంతియు గలుగదు. అనాత్మ పదార్థములచే భోగేచ్ఛయు నధికరించి దుఃఖము
ద్విగుణీకృత మగుచునేయుండును. వహ్నిలో కాష్ఠములు వేయుచుండిన యు
ద్దీపమగుచుండు విషయాగ్ని అనుభవముచే ప్రవర్ధమానమగుచునే యుండునుగా
కనుమింపదు. ఘృతధారవలన అగ్నిజ్వాలలు వృద్ధినొందువిధమున విషయేచ్ఛ

భోగము విషయాసక్తిని తగ్గించక పెంచుచునే యుండును కావున విషయము లచే యత్కించిత్ప్రయోజనముగాని, ఆనందప్రాప్తిగాని, దుఃఖనాశముగాని సం భవించుటలేదు అసత్పదార్థములవగా కల్పిత పదార్థములు. శుక్తి రజతము, ఎండమావులు మొదలయినవి. ముత్యపుచిప్పను జూచి వెండియని భ్రమించి నంతమాత్రమున వెండినాణ్యములగునా? అలాగున అనాత్మరూప, అవిద్యా జన్య, విషయవస్తువుల నాధారముగాజేసుకొని సుఖముజెందజాలరు. ఆకలి గొన్నవాడు అన్నపదార్థములు భక్షించిన మాత్రమునవే క్షుద్బాధ నివర్తించు చున్నది. జలముచే పిపాసవృత్తి నివృత్తిగలుగుచున్నది. చిత్తరువునందు చిత్రింపబడిన చిత్రరూప వివిధాన్న పదార్థములచేతను ఆకలి తీరదు. చిత్రగత జలముచేత దప్పిపోదు. సినిమాయందు పుంఖాను పుంఖములుగా నమృతముద్భ వించి పొంగిపొరలుచుండును. దానిచే ప్రయోజనముగలదా? సత్యమయిన అన్న పదార్థము జలముకొంచెము లభించెనేని ఆకలిదప్పులు తీరుచున్నవి. యథార్థ ముగా అమృతమునే త్రావిన మరల జనన మరణముల నొందరు. ఆవిధముగా సంసార దుఃఖనివృత్తి బ్రహ్మప్రాప్తి చేతనే పొందబడుచున్నది. భావపదార్థ మగు ఆనందముచేతనే సుస్థిరసుఖము చేకూరుచున్నది. శాశ్వత సత్యభూత బ్రహ్మనందామృతము నొకసారి త్రావినచో తిరుగా నెప్పుడును జననమరణ ములనొందరు. శాశ్వతపదవినే పొందుచున్నారు. వస్తూపలబ్ధిచేతనే ఆనందము నొందుచున్నారు. కేవల సంకల్పముచేతగాదు. తలంచినంత మాత్రమున బ్రహ్మపురమును సృష్టించుచున్నారు. అందులో విహరించునటులను భావించు చున్నారు. అట్టి కల్పిత పదార్థములచే ప్రయోజనములేదు. సంకల్పించినను ప్రాప్తములైన వస్తువులచే అధికానందమును బడయుచునేయున్నారు. కావున కేవల బ్రహ్మమును తలంచినంతమాత్రమునచాలదు. బ్రహ్మప్రాప్తి గలిగి నప్పుడే అత్యధికానందము నొందుచున్నారు. సందేహములేదు. సంకల్పసిద్ధి గలవారుగూడా తామునంకల్పించిన వస్తువులను పొందియే సుఖము నొందు చున్నారు. కావున పరబ్రహ్మమును భావించుచు పరబ్రహ్మమును పొందవల యును. అప్పుడే సుఖమబ్బుచున్నది. అట్టి కేవల ద్వయామృతమయ బ్రహ్మా నందమునుభవించుచు దానికన్న శాశ్వతమయిన తృప్తిని కలుగు జేయునది మఱియొకటి లేదు. కనుక నిత్యతృప్తుడవై ఇంద్రియాది విషయ దుఃఖములు లేనివాడవై సర్వదా సుస్థిర స్వస్వరూపస్థితిలో అనగా నిర్వికల్పసమాధిలో

జ్ఞానజ్యోతిలో బ్రహ్మానందామృతము గ్రోలుచు సర్వాత్మ భావముతో అనగా పరిపూర్ణ భావముతో స్వస్వరూప సత్తామాత్ర బ్రహ్మమై అవ్యయుడవై అద్వయుడవై యుండుమా! అదియుంగాక బాలుడు మృణ్మయ గజతురగాదులతో క్రీడించునంతమాత్రమున అవి గజతురగాదులుగావు. ఆక్రీడనము యథార్థము గాదు. అలాగున అజ్ఞాన జీవులు కల్పిత మాయాప్రపంచముతో వ్యవహరించుచున్నారు. అనేకదుఃఖములను పొందుచున్నారు. అంతమాత్రముచే మాయాజగత్తు యథార్థముగాదు. తద్వ్యవహారముగూడ కల్పితమేయగుచున్నది. కావున అనాత్మభూత దృశ్యవిషయములు యథార్థములుగానందుచే నేలాటి ప్రయోజనము సిద్ధమగుటలేదు. దుఃఖమే యవశిష్ట మగుచున్నది. ఈ రహస్యము నెఱింగి జ్ఞానతత్పరుడగు ధీమంతుడు నిరంతరము స్వాత్మరూపమందే రమించుచు నిత్యానందమునొందుచున్నాడు. కావున శిష్యోత్తమా! నీవును అలాగున స్వస్వరూప సుఖానుభూతిని నిరంతరము పొందియుండుమా! యని శ్రీగురుదేవుని యుపదేశము.

మఱియు జ్ఞానము గలిగిన తరువాత అవశిష్టమగు కాలమును గడుపు విధమును శ్రీ గురుదేవుడు దెలుపుచున్నాడు. ఓ పర్యా! నీవు తన యొక్క స్వరూపమేదియో అద్దానిని తనలోనె నిరంతరము బ్రహ్మప్రజ్ఞతో మఱవక గాంచుచుండుమా అస్థిరములుగాను తనయొక్క అద్వితీయ తత్త్వమును కేవలమునునైన స్వరూప పరబ్రహ్మను సత్యము భావించుచు స్వాత్మయందే క్రీడించుచు స్వాత్మరాముడవై అఖండపరతిశయ నిరవధిక పరిపూర్ణ స్వాత్మానందమును యనుభవించుచు కాలముగడుపుమా! అట్టివాడే జ్ఞానవంతుడని చెప్పబడుచున్నాడు. స్వాత్మక్రీడుడై స్వాత్మానంద జ్ఞానములతో కాలయాపనము జేయుటయే బుద్ధిమంతుని లక్షణమైయున్నది. జ్ఞానము కలిగినను కాలమును వృథాపోనీయక సమస్తమును బ్రహ్మమయముగా జేయుచు నానందమయుడవై యుండుమని బోధించుటచే అఖండ పరిపూర్ణ జ్ఞానవంతుడయ్యు శరీరమున్నంతవరకు ప్రకృతి వికారములు జొరనీయకుండుటకునై సర్వదా స్వరూపానుభూతిని విడువకుండవలయుననియు అదియే పరిపూర్ణ జ్ఞానలక్షణమనియు జ్ఞానము గలిగినదిగదాయని ఇంద్రియములతో విహరింపగూడదనియు సర్వదా పరబ్రహ్మమయ్యే యుండవలయుననియు, పరమోపదేశము సిద్ధమాయెను. ఈలాగున శిష్యుని జ్ఞానరక్షణకై శ్రీగురుదేవులుపదేశించుచున్నారు. జ్ఞానము

గలిగిన తరువాత ఆ జ్ఞానము దేనిచేతను ఆచ్ఛాదనము గాకుండుటకై, సుస్థిరముగానిలుచుటకై బోధించు విషయమును తదాచరణమును జ్ఞానరక్షయందురు. శిష్యుడు పరిపూర్ణస్థితిని పొందిన తరువాత శ్రీ గురుదేవునిచే వచింపబడునదంతయు జ్ఞానరక్షయని తెలియవలెను.

మఱియును పరబ్రహ్మము కేవలాద్వితీయ స్వరూపమయినదియు సంశయ రహితమైనదియు దృశ్యశూన్యమయినదియునై యున్నదని నిరూపణము చేయుచు సదా స్వస్వరూప పరబ్రహ్మస్థితిలో నుండుచు పరమశాంతిని పొంది మౌనముతోనుండుమాయని శ్రీ సద్గురుదేవుడు శిష్యునకు దృఢముగా బోధించుచున్నారు. అనగా ఆపరబ్రహ్మము పరిపూర్ణ విజ్ఞాన స్వరూపము. స్వయం ప్రబోధరూపము. దృశ్యకల్పనారహితము. సందేహ శూన్యమై నిశ్చయాత్మకముగను యున్నది. అట్టి అఖండ పరిపూర్ణబ్రహ్మమునందు దృశ్యములను సంశయములను కల్పించుట రూపములేని గగనమునందు నగరకల్పనమువలె నున్నది. ఆకాశమే రూపరహితమై యున్నది. దానియందు భవనముల నిర్మాణము సాధ్యమగునా? కావున గగనమందు గ్రామ నిర్మాణముల సత్యములై యసంభవములై యున్నవి అలాగున రూపరహిత నిర్గుణ పరబ్రహ్మమందు దృశ్యకల్పన యసత్యము విచారించిన అసంభవముగానున్నది అయినను మేఘవికారములచే గన్పడు గంధర్వనగరములు చూచుచునే నశించునవియై యసత్యములై యున్నవి. ఆనగరములకును మేఘమండలమునకును ఆకాశమునకును సంసర్గమేమియులేదు. ఆదేవిధముగా పరమాత్మకును మాయకును తత్కల్పిత దృశ్యమునకున్ను సంబంధమేమియులేదు. దృశ్యము గంధర్వనగరమువలె చూచుచునే నశించు స్వభావము గలదియై తథ్యముగాకయున్నది కావున కేవలాఖండ ద్వితీయ పరబ్రహ్మమందు దృశ్యముగాని. సంశయముగానిలేదు. అట్టి అద్వితీయానందమయ పరబ్రహ్మ స్వరూపముతో కేవల స్వస్వరూప భావముతో పరిపూర్ణుడవై అంతయు తనయొక్క చైతన్య స్వరూపమే వ్యాపించియున్నదని తెలియుచు సర్వదా సకల చిత్తవృత్తి నిరోధముచే గలిగిన సకలనివృత్త్యుపశమాత్మక పరమశాంతినిపొంది దృశ్యప్రపంచ స్ఫురణను దూరీకరించి కేవల సత్తామాత్ర పరబ్రహ్మమై మౌనమునే సకలేంద్రియాతీతస్థితినే పొందుమా "మౌనం భజస్వ" మౌనమనగా సకలేంద్రియ వ్యాపారోపరమణమునుపొంది కేవల చిన్మయానందమయాఖండ పరిపూర్ణ పరబ్రహ్మ

స్వరూపమందున్న స్వరూపస్థితితో నిరంతరముండుటయగును. త్రివిధమగు పరిచ్ఛేద శూన్యత్వం అఖండత్వం దేశకాలావస్తు పరిచ్ఛేదరహితమే అఖండత్వము మౌనలక్షణము.

శ్రు॥ యస్మాద్వాచో నివర్తంతే. అప్రాప్య మనసా సహ।
యన్మౌనం యోగిభిర్గమ్యం, తద్భవేత్సర్వదా బుధః॥

తా॥ దేనినుండి మనస్సుతోగూడ వాక్కులు నివర్తించు చున్నవో మనోవాచా మగోచరమై యున్నదో మహాయోగులచే నెరుగ నశక్యమైయున్నదో అట్టి సకలేంద్రియ నివృత్తి రూప పరబ్రహ్మత్వమును మౌనమును సదా ధరింపుమా।

మఱియు యీపరబ్రహ్మము వాక్కులకందని దగుటచే నభివర్ణింప శక్యముగాక యున్నది.

బ్రహ్మవిషయమును చెప్పవలసియున్న వాక్కులతో నభినయ సంజ్ఞతో చూపింతురు. అనగా సర్వదా బ్రహ్మమందే రమించు చుందురు. ప్రపంచము దబ్బరయని తలంచి యతీతస్థితిలోనే యుందురు. ఇట్టి పరమోత్కృష్టమగు మౌనము సజ్జనులకు సహజ సిద్ధమైయున్నది. వాఙ్మనము మాత్రము అజ్ఞానజనులగు నజ్ఞానులకు విధింపబడినదని బ్రహ్మవాదులు వచింతురు. మౌనమనగా సకలాతీత పరబ్రహ్మ స్వరూపమని యర్థము. నిజతత్త్వమును ఎరింగినవారు పరబ్రహ్మ స్వరూప లక్షణమగు నత్యుత్తమ మౌనములో సదా యుండుచు పరమశాంతిని పరమానందమును నొందుదురని భావము.

"మౌనం నామ స్వాతంత్ర్యరమణం. పరికీర్తితమ్ పరబ్రహ్మస్థితిః" అని శ్రుతి వాక్యము.

ఇంకను మౌనము యొక్క యథార్థస్థితిని శ్రీ గురుదేవులు దెలుపుచున్నారు. మౌనమనగా నిరతిశయానంద పరబ్రహ్మ స్వరూప స్థితియందు బుద్ధివృత్తులను విలయమొనరించి బుద్ధిని పరబ్రహ్మమునందువశమొందిన దానిగా అనగా విశ్రమించిన దానిగా లేక పరబ్రహ్మమయమునుగాజేసి యుండుటయే సకల దృశ్యమును దూరీకరించి యుదాసీన భావముతో నుండతగును. కేవల నిర్వికార పరబ్రహ్మము నిరవధికానందైకరసమగు చున్నది. అట్టి ఆనందమయ విజ్ఞానమయ సద్రూప పరబ్రహ్మమందు స్వస్వరూప పరబ్రహ్మమగు సర్వాత్మభావములో బ్రహ్మవేత్త సదా యుండుచున్నారు. అతడే ప్రకృతిని గెలిచిన మహాపురుషుడు. ఆ మహాత్ములు సకలేంద్రియ వృత్తుల విలయమై

సర్వదృశ్యము నపేక్షింపని యుదాసీనస్థితి పరబ్రహ్మమునందు లభించుటయు నానావిధకల్పనలకు, అనాత్మభావనలకు సందేహవిపర్యయ-భ్రాంతులకు హేతుభూతమగు బుద్ధియొక్క యుపశాంతియు నిశ్చలమగు విశ్రాంతియు, సిద్ధించుచున్నవి. సకలమూలకారణమైన బుద్ధి ప్రకృతిమాలిన్యరహితమై కేవల ప్రజ్ఞామయమై భాసించుచున్నది. ఎంతవరకు బుద్ధి విచేష్టితమగుచున్నదో అంతవరకు సకల దృశ్యము నానారూపమై ప్రతీయమానమగు చుండును. ఆబుద్ధి సొది తొలగింప నవశిష్టమైనది. పరబ్రహ్మస్వరూపమే విజ్ఞానమయము పరమశాంతి తేజోమయము కేవలానంద పరిపూర్ణానందము ఈ స్థితియే నిర్వికల్పమౌనమగును. కావున శిష్యసత్తమా నీవుసకలదృశ్యమును దూరీకరించి సర్వాత్మభావముతో పరమశాంతి వహించి నివృత్తి స్థితితో కేవలానందమయముతో స్వరూపము నందేయుండుము. ఇదియే యుదాసీన భావము పరిపూర్ణజ్ఞానము కలిగిన తరువాత కర్తవ్యమిదియే. తత్త్వజ్ఞులగు మహానుభావులను నీ పరమ మౌనముతోనే విహరించిరి. శాశ్వత పదవి నొందినవారు విచారింపదగినది. తేనందుచే ఆత్మనిర్వికారమగుటచే నిష్క్రియ విరామయస్థితిలోనే యుందురు. ఇదియే మౌనము.

గాక స్వాత్మతత్త్వమును గుర్తెరింగిన బ్రహ్మవేత్తయగు మహాత్మునకు మౌనముకన్న మతియొకటి యాశ్రయనీయము లేదనియు నిర్వాసనత్వమే మహామౌనముగాని మాటలాడుకుండుటగాదని తెలియచేయుచున్నారు. అంతఃకరణమున నేలాటి సంకల్పములను పొడసూపనీయక సకలసంస్కారములను జ్ఞానాగ్నియందు గాల్చివేసి సమస్తమును తేజోమయముగను. చైతన్యమయముగను జేసికొనుటయే సకలదృశ్యమందు నుదాసీన భావమేమౌనము. ఇదియే మౌనులకు యథార్థ స్వభావము. కావున తనయొక్క నిజస్వరూపమును దెలిసి స్వాత్మయందు క్రీడించు యోగిపుంగవులు సర్వదా నిరతిశయానందమునే యనుభవించు చుందురు. వారు పరబ్రహ్మ సాక్షాత్కారమును బడసిన మహానుభావులు అట్టిమహావిజ్ఞానవంతులు సర్వేంద్రియములను వశపరచుకొని సకల సంస్కారములను దహింపజేసుకొని యుండుటయే యథార్థమౌనమని తలంచి దానికన్నను మంకరమైన ఉత్తమస్థితి మరియొకటి లేదని తెలిసి సర్వదా యుదాసీన భావముతో యుందురు. వీరినే యుదాసీన సాధువులని యుందురు. ప్రజ్ఞావంతులు ప్రపంచమంతయు మాయాకల్పితమని తలంచి సర్వవ్యవహారోప

శమాత్మక పరబ్రహ్మమందు సర్వదా యుందురు. ఇట్టిపరమ మౌనస్థితి బ్రహ్మజ్ఞానమంతు సహజసిద్ధమై యున్నది. అందుచే శిష్యోత్తమా! మౌనివై సంస్కారముల రహితమొనరించుకొని సదాస్వాత్మానంద రసపానము చేయుచు యుండుమా! అని శ్రీ గురుదేవులు జ్ఞానము సిద్ధించిన తరువాత కర్తవ్యాంశమును శిష్యునకు బోధించిరి. ఇదియే మునియగు మౌనలక్షణము.

చక్కగా విచారించిన స్వాత్మవిచారణా ప్రాబల్యముచే సర్వవ్యాపకమగు శుద్ధచైతన్య పరబ్రహ్మమే యున్నది. అదితానుగా నున్నదని యనుభవము గలుగుటయే యథార్థజ్ఞానమగును. పరబ్రహ్మ సాక్షాత్కారము స్వస్వరూపస్థితి నిర్వికల్పజ్ఞాన సమాధియు నిదియే. కావున ఆత్మనిష్క్రియము అచలము మాయారహితము దృశ్యాతీతము నిరంజనము నిర్వికారమునై యున్నది. మఱియునది యఖండము పరిపూర్ణము సర్వవ్యాపి ఈస్థితిలోనుండువారు సర్వదా పరిపూర్ణులు. ప్రకృతిరహితులు బాహ్యాభ్యంతరములందును ప్రజ్ఞామయులై స్వాత్మస్వరూపులై యుందురు. వీరలు సకల కార్యములను లోకులవారి క్రియలవలెనే సంకల్ప రహితులై, కర్తృత్వ భోక్తృత్వ రహితులై లాభాలాభాది ద్వంద్వ వర్జితులై చేయుచుందురు. వీరు పరమతత్త్వము నెరింగినవారు గనుక వారుచేయుకార్యములన్నియు పరబ్రహ్మమయములై యుండును. వేరుగానుండవు. ఇకను విచారించిన పరబ్రహ్మము క్రియారహితము అచలము గనుక ఆత్మకన్న వేరులేనందుచే సమస్త దృశ్యమును తత్సంబంధక్రియలను పరబ్రహ్మస్వరూపములనియే తలంతురు. తాము కర్తృత్వాది వివర్జితులై తటస్థులై యుదాసీనులై యుందురు. నిజమైన బ్రహ్మజ్ఞాని లోకసహజ కార్యములయందు ప్రవర్తించుచుండినను స్వాత్మరూప స్థితి మరువకనే యుండునవియు సుఖదుఃఖాది ద్వంద్వములచే సహహతులుగాక సర్వదా యానందరూపులై యుందురు. శరీరధర్మయుత కార్యములు చేసినను చేయనివాడే యగుచున్నాడు. అటువంటి మహాత్ములు ఆత్మస్వరూపులుగనున్నవారు గనుకనే ప్రకృతిచే బద్ధులుగారు. ఎందుకనగా ఆయాత్మ క్రియారహితము దృశ్యాతీతమునై తటస్థమై సర్వసాక్షియై ప్రకాశవంతమగు దీపమువలె కూటస్థాత్మ పరంజ్యోతియై యున్నది. అయినను సమస్త వ్యవహారములు నాత్మచైతన్య శక్తిచేతనే జరుగుచున్నవి. శిలాగ్నిన నాయాత్మ నిష్క్రియ అచలాది లక్షణయుతమై యున్నది. ఇట్టి ఆత్మస్థితిని పొందినవారు శారీరక కార్యములు చేయువారై సను

అటువంటి అచ్యుత స్థితిలో నున్న వారగుటచే నిష్క్రియులుగనే యున్నారు. శరీరోపాధి యున్నంతవరకు పరమేశ్వరుని సంకల్ప మెలాగున నున్నదని తలంచి తదనుసారముగా జీవితము గడుపుచు కర్తృత్వ భోక్తృత్వాలు లేనందుచే నర్వసములై యుందురు. వారుచేయు కార్యములు నిష్కామమై పరబ్రహ్మప్రాప్తి సాధనములై, నిరపేక్షములై, ఫలవర్జితములై యుండును. వారి దైనందిన క్రియలవలె నితర పరోపకారాది కార్యములుగూడ కోరికలేకనే చేయుదురు ప్రతిబంధకములు గావని తలంచి ధీరులై యున్నారు. వారి మహాత్మ్యమును అట్టిమహాత్ములే యెఱుంగుదురు. అట్టి ఆరూఢులును మహావిజ్ఞానవంతులైన విశ్వకర్మ యోగీశ్వరులైన విజ్ఞాని పోవుచు నిలుచుచు కూర్చుండుచు నిదురించుచు అలాగున భుజించుచు మాటలాడుచు నీలాటి కార్యములు జేయువారైనను పరబ్రహ్మ స్వరూపస్థితియగు మౌనమును వదలనివారై నిరంతర మాత్మారాముడై అనంగుడై అప్రతిహతుడై "సర్వం బ్రహ్మమయం" అని దృఢముగా నమ్ముచు సర్వదా నిరతిశయానందామృతమును పానము చేయుచు స్వతంత్రుడై వర్తించును. కావున శిష్యసత్తమా! నీవు చేయవలసిన కార్యములను శరీరముచే నిర్వర్తించవలసిన వానిని గూడ చేయుచుండినను స్వస్వరూపస్థితినుండి జారక విజ్ఞానస్వరూపుడవై, స్వాత్మారాముడవై యుండుస్థితినే అవలంబింపవలయును ఇదియే అచలస్థితి పరిపూర్ణము అని శ్రీ సద్గురుమూర్తి బోధించిన ముఖ్యతాత్పర్యము.

మఱియు యోగసాధనలు జ్ఞానసాధనలు లెవ్వగాసాధితములై యోగసిద్ధి జ్ఞానగలిగిన పిమ్మట నట్టి పరిపూర్ణ జ్ఞానికి విజ్ఞానానుభవము గలిగిన ధీరునకు సాధనలతో నవసరము లేదనియు స్వయముగానే సాధనలు ఆగిపోవుననియు తెలుపుచున్నారు. ఒకానొకడు మహాసౌధము యొక్క పైభాగము నధిరోహించి విహరించుచున్నప్పుడు వానికి క్రిందనున్న సోపానములతో ప్రయోజనములేదు. అలాగున సర్వదృగ్వ్యాతీత పరిపూర్ణ నిశ్చల సమాధిలో స్వస్వరూప విజ్ఞానానుభవములోనున్న మహానుభావునకు యమనియమాదుల శ్రవణ మననాదులును అపేక్షితములుగావు. ఒకానొక మహాపండితుడు సకలార్థముల నెఱింగినవాడై యుండుచే అట్టిపండితోత్తమునకు నిఘంటుద్వారా పదార్థపర్యాలోచనము గాని, అక్షరాభ్యాసముగాని యవసరములుగావు. అటులనే ఆత్మసంసిద్ధ యోగియగు స్వాత్మతత్త్వజ్ఞుడగు నారూఢునికి పూర్వమువలె సాధనలు సాధింప

వవసములేదు. అయినను సౌధము నధిరోహించినవాడు సోపానముల ద్వారానే మొదట సౌధము నధిరోహించెను. మఱియొకనికి త్రోవజూపవలయునని తన కును సోపానముల నవశ్యములయ్యే యున్నవి. వారలనెక్కింప వలసి వచ్చి నచో వారిని చేయిపట్టుకొని సోపానముల ద్వారానే తీసుకొని పోవలయును. ఆరీతిగా తాను పరిపూర్ణజ్ఞానియయ్యు నితరులను జ్ఞానులుగా జేయవలసిన సమ యమున తనమార్గమున బోధింపవలయును. తానాసాధనలన్నిటిని జేసిజూపిం చవలయును అలాగునన్ను మహాపండితునున్న నితరుల విద్యాభ్యాసమునకై యక్షర విన్యాసమును చూపించవలెను. ప్రతిపదార్థమును దెలుప వలయును. అలాగున జ్ఞానారూఢుడు తనకావశ్యములు గాకపోయినను యితరుల కొరకు యాసాధనలను విడనాడడు. తాను పూర్తిగా భోజనము చేసి తృప్తుడైనను ఇతరుల క్షున్నివృత్తికై భోజనమిడవలయును. అలాగున మహనీయు లైనవారు సకల సాధనలనుష్ఠించి చూపించు చుండవలయును ఆరూఢజ్ఞాను లయ్యు నియమానుష్ఠాన తత్పరులై యున్నచో వారు తరింపజేయువారని తెలియక శుష్కవేదాంతులు సాధనలో యున్నారనియే తలంతురు. పడవలో జనులను తీసుకొని పోవువాడు పడవలోనే యుంటున్నాడు. అందరిని నదిని దాటించుచున్నాడు. ఇష్టములేనప్పుడు నదీతీరముననుంటున్నాడు. అలాగున దయాతత్పరులగు విజ్ఞానులు సకల సాధనలను భగవద్భక్తులకు బోధించుచుం దురు తామాచరించినగాని ఇతరులు చేయరను అభిప్రాయముతో నియమాను ష్ఠానములను విడిచియుండరు. వారుసర్వదా సదనుష్ఠానపరులై యుండుట వారి స్వభావమై యున్నది. వారికదే మిగుల నానందకరము మఱియు అట్టి మహా త్ములు స్వస్వరూపాత్మ విచారణయందు తన్నుతాను దెలిసి నిరంతరమాత్మాను సంధానపరుడై బ్రహ్మాకారస్థితిలో పరిపూర్ణాత్మ తత్త్వములో తాను పరబ్ర హ్మమే యనుచు వేరుగాదని జీవ బ్రహ్మైక్యస్థితిలో నుండుటయే ముఖ్యమై సహజమై యున్నది. మహాతేజోవంతుడగు భాస్కరుడుదయించగానే దీపము లతో అవసరములేని విధమున స్వస్వరూప స్థితియందు అఖండ పరిపూర్ణ పరబ్రహ్మము తానేయను అఖండ విజ్ఞాన సూర్యోదయముకాగా దీపములవలె మున్న యమనియమాదులతో అవసరము లేదుగాని అనివార్యములై యుం టున్నవి. సూర్యుడులేని సమయమున దీపము తత్సాధనలవసరమగు చందమున అఖండ సామరస్య సిద్ధ విజ్ఞానము జనించనప్పుడు ఆతని విచారణయను దీపము

ఏకాగ్రవిష్టయను ప్రమిద వత్తి తైలము మొదలగుశవివలెనున్న శక్తి వైరాగ్య యోగాదులు ముఖ్యములై యున్నవి.

కావున అభ్యాస జనులకు గంగాతీరాది యేకాంత స్థలములు, బ్రహ్మ ముహూర్తము, సాయంకాలము, వసంతఋతువు మొదలగు కాలములు కృష్ణా జనాది సిద్ధాద్యాసనములు, తూర్పు ఉత్తరము మొదలయిన దిక్కులకళిములు ముఖ్యముగా గుర్తింపవలయును. యమనియమాదులు భ్రూమధ్య నహాసాగ్రాది లక్ష్యములు భూచరీషణ్ముఖీ మొదలగు ముద్రలు ఇతర యోగసాధనలు శ్రవణ మనన విదిధ్యాసములగు జ్ఞానసాధనలును మిగుల యావశ్యకములై యున్నవి. పండు మనకవసరమయిన మొదట చెట్టును పోషింపవలయును. అలాగున పరిపూర్ణజ్ఞానసిద్ధికై మొదట నానావిధ సాధనలను, పవిత్ర భావన లను ఆచరింపవలయునని భావార్థము, అయినను ఎప్పుడు సాధనలనే పరమా ర్థములని తలంచి పరమార్థలక్ష్యమును పొందకుండిన ఏఫలితార్థమును పొందక సర్వదా వంధ్యా వృక్షమును పోషించు మాదిరి ఉత్త సాధనల వలన ప్రయో జనము పొందజాలదుగదా!

వృక్షము వృద్ధియైన తదుపరి పోషణ లేకనే స్వయముగానే యనంత ఫలములనొసగు విధమున స్వస్వరూపస్థితి సిద్ధించిన తరువాత సాధనలు లేకనే పరిపూర్ణజ్ఞానమనంతముగా సిద్ధించును. ఆస్థితియందు సాధనలు ప్రయో జనకారులు గావు. జ్యోతిమాత్రము స్వయం ప్రకాశమానమై తదితరములను ప్రకాశింప జేయునటుల విజ్ఞానము మాత్రము స్వయంప్రకాశ మానమై స్వస్వ రూపమును దెలుపుచున్నది. సమస్తము బ్రహ్మమయ మనియు దెలియ బరచు చున్నది. స్వస్వరూప ప్రకాశమందు ఘటాదులవలె యమనియ మాది సాధనలు ప్రకాశజనకములు స్వస్వరూపావ గమకములుగావు అందుచే వియ మాద్యపేక్ష ఆత్మసిద్ధి గలుగునంతవరకే యని తెలియవలెను.

అదియుంగాక ఏమహానుభావుడు తనయంతః కరణములోని సమస్త వృత్తులను నిరోధించి బాగుగా సిద్ధించియున్న బ్రహ్మతత్త్వమును పొంది పరిపూర్ణజ్ఞానియై పరబ్రహ్మ మయుడై యుంటున్నాడో అట్టి యథార్థమైన తత్త్వజ్ఞానికి తాను సాధనలద్వారా పొందదగిన బ్రహ్మజ్ఞానమును పొందినం దుచేనిక యమనియమాది సాధనలు దేశకాలాది నియమములు నవసరములు గావు. సూర్యోదయమయిన తరువాత దివిటీ దీపములచే ప్రయోజనము

లేపటుల పై సాధనంచే ప్రయోజనము అఖండాత్మ జ్ఞానానుభవము నొందిన వాని అవసరము గలుగదు. యమనియమాదుల ప్రయోజన ఫలము వ్యావృత్తి రాహిత్యమే యగుచున్నది. నావృత్తి రహితము సిద్ధమాయెను. గనుక సర్వదా స్వస్వరూపమందు విహరించుచు ప్రజ్ఞానఘన చిన్మయానందమయ పరబ్రహ్మ స్వరూపుడు స్వయంప్రకాశమానుడై దేజరిల్లగా వెలుగు నీయమాదు లవసరము లేదని భావము. కావున శిష్యవరేణ్యా! నీవు సాధింపవలసిన సాధనలను సాధించియున్నావు కృతార్థుడైతివి. బ్రహ్మతత్త్వము సిద్ధమాయెను. ఇక నిరంతరము స్వస్వరూపస్థితి యందే యుండుచు పరబ్రహ్మ స్వరూపుడవై యుండుమా!

దేశ కాలాదులనగా ప్రమాణము చూడుము.

శ్రు॥ ఆదావన్తే చ. మధ్యే చ. జనో యస్మిన్న విద్యతే.
యేనేదం సతతం, వ్యాప్తం, సదేశో విజనః స్మృతః॥

తా॥ దేనియందు ఆదిమధ్యాంతములందు జనసంఘములేదో దేనిచే సమస్తము వ్యాప్తమైయున్నదో అట్టి పరబ్రహ్మ స్థానమే విజనప్రదేశము మఱియు బ్రహ్మ మొదలుకొని సమస్త చరాచర జీవకోటులకు కారణమైన అఖండానందాద్వయ పరబ్రహ్మమే కాలశబ్దముచే చెప్పబడెను. ఆసనమనగా దేనియందు పరబ్రహ్మ చింతన సుఖముగా సిద్ధించునో అదియే సుఖాసనము కావున అఖండ పరిపూర్ణ జ్ఞానానుభవము గలవాడు నిరంతరము స్వాత్మరూపమందే దేనిని గోరక విహరించునని తెలియవలెను.

ఇక సచ్చిదానందమయ పరబ్రహ్మస్వరూప సాక్షాత్కారము నిరంతరము స్వతస్సిద్ధమైయుండగా అచంచలమగు నాత్మానుభవము సుస్థిరమై నిస్సంగమై స్ఫుటతరమై యుండగా స్వయంసిద్ధమైన స్వరూప సాక్షాత్కారముకన్న వేఱగు ప్రమాణమును అపేక్షించుటలేదు. తాను స్వయముగా ననుభవించువిషయంలో సందేహమేమి యున్నది. ప్రమాణముతో అవసరమేమి. దానినపలాపింప శక్యమగునే. "విజ్ఞానానందం బ్రహ్మ" "బ్రహ్మవిజ్ఞానానంద స్వరూపము" అహం బ్రహ్మాఽస్మి నీవట్టి బ్రహ్మమయుడివి ఇత్యాది శ్రుతివాక్యముల చేతను శ్రీసద్గురుదేవుని పరమోపదేశము చేతను అఖండ విజ్ఞానానందమయ బ్రహ్మానుభవము సిద్ధమగు చున్నది. అట్టియనుభవముకన్న మఱియొక బలవత్తరమగు ప్రమాణము లోకమునలేదు. తన అనుభవమే తెలియజేయుచున్నది.

అనగా ప్రత్యక్షముగా ఘటమెదురుగనే యుండగా ఇది ఘటమను జ్ఞానము
ప్రత్యక్ష సిద్ధమయ్యేయున్నది. అప్పుడు ఘటమను శబ్దముగాని ఘటశబ్దము
యొక్క అర్థము ఘటమనిగాని దానికి నిత్యసంబంధమున్నదనిగాని యీలాటి
నియమములు అవసరములుగావు ఘటము స్వయముగా ననుభవగోచరమై
యుండగా ఘటజ్ఞానమున సందేహమున్నదా? ఏ ఇతర ప్రమాణములావశ్యక
ములుగావు. అలాగున స్వరూప సాక్షాత్కారము ప్రత్యక్షానుభవ సిద్ధమై యుం
డగా సందేహ మిసుమంతయు లేదు. శబ్దాది ప్రమాణములును అవసరములు
గావు. శ్రీసద్గురుదేవుని వాక్యానుసారముగా స్వస్వరూపస్థితిద్వారా పరబ్రహ్మ
మనునెట్టిదో సాక్షాత్కరింపబడెను. తానెవరో స్పష్టమాయెను. ఇదివరకు తన
స్వరూపమును తెలియక యుండెను. జ్ఞానమహిమచే తనను తెలిసినవాడాయెను
సందేహరహితుడాయెను. ఇక తానే యన్నిటిని ప్రకాశింపజేయుస్థితిని పొందెను
ఇటుండగా స్వస్వరూప జ్ఞానమునకేలాటి ఇతర ప్రమాణములు అవశ్యకములు
గావుగదా! తానుతనయొక్క స్వరూప సుఖమనుభవించుచుండగా ననుభవమును
వేరుజేయ సాధ్యమగునా? అట్టి యనుభవము ప్రమాణాపేక్షించునా? కావున
ఘట ప్రత్యక్షమందు ప్రమాణాపేక్షత లేనియటుల స్వస్వరూప పరబ్రహ్మ
సాక్షాత్కారమందనుభవము తప్ప వేరేప్రమాణములు సాధనలు నపేక్షితములు
కావు. అయినను ప్రత్యక్షమందు నేత్రమువలె స్వస్వరూపస్థితి యావశ్యకమై
యున్నది. గనుక విజ్ఞానమయానందమయ పరబ్రహ్మానుభవము సిద్ధమయ్యే
యుండగా సంశయ విపర్యయములుండజాలవు ఉపనిషదాది ప్రమాణములు
గూడ నవసరములేదు అంతయుబ్రహ్మమే మరియు నిచ్చోట యిట్టివిచారము
చేయదగియున్నది. ఘటజ్ఞానము నేత్రేంద్రియము ద్వారా గలిగి మనస్సుకు
గోచరమగుచున్నది. అందుచే నాప్రత్యక్షజ్ఞానము ఇంద్రియ గోచరమగు
చున్నది. అలాగున పరబ్రహ్మ విషయిక జ్ఞానము ఇంద్రియాతీతమగుటచే
నింద్రియములకు గోచరించనందుచే ప్రత్యక్షముగాక యున్నది. ఈ స్వాత్మ
జ్ఞానము దృశ్యరహితమై లోకాతీతమై అప్రాకృతమై యున్నదని తెలియవలెను
అయినను ప్రత్యక్షమనగా నింద్రియములకు గోచరమగుట యథార్థముగాదు.
వృత్తికిగోచరమగునదియు తెలియవలెను. కావున బ్రహ్మమునేను. బ్రహ్మ
మను దృశ్యరహిత వృత్తికి గోచరమగుచున్నది. అవృత్తి బ్రహ్మమయము
గను. విజ్ఞానరూపముగను బ్రహ్మముకన్న వేరుగాకయున్నది. అందుచే బ్రహ్మ

జ్ఞానముకూడ ప్రత్యక్షసిద్ధమయ్యే యున్నది. బాహ్యేంద్రియములకు మాత్రము గోచరము గాదని యర్థము. గురూపదేశము ద్వారా తత్త్వమసి వాక్యమును శ్రవణము చేయుచున్నారు. ఇచ్చోట బ్రహ్మజ్ఞానము పరోక్షముగాను బాహ్యేంద్రియమగు శ్రవణ ప్రత్యక్షముగానున్నది. తరువాత దానినే మననము మననము చేసి వాక్యార్థ బ్రహ్మమును గనుగొనుచున్నారు. ఇది మానసిక ప్రత్యక్షమగును. ఇచ్చోట "అహం బ్రహ్మాస్మి" అను వృత్తి యుంటున్నది. నేను బ్రహ్మమను వృత్తి నిరంతరము ప్రవాహరీతిగా తైలధారవలె నిరవిచ్ఛిన్నముగా గలిగి నిలుచుచున్నది. ఈ వృత్తి యందు మనస్సు బ్రహ్మమయ మగుటచే మానసిక ప్రత్యక్షయము గూడ విడిపోయినది ఇట్టి బ్రహ్మాకారవృత్తి సర్వదా జ్ఞానులకుంటున్నది ఇదిలేకపోయిన సకల శాస్త్రోపదేశములు గురు పరంపరయు వ్యర్థములే యగును ఇట్టి ఘనమగు వృత్తిలో నుండియే జ్ఞానులు వేదాంత సాంప్రదాయమును ప్రవర్తింపజేయుచున్నారు. అయిన నీవృత్తి సకలఅనాత్మ పదార్థముల నివర్తించుచున్నదై పరబ్రహ్మ జ్ఞానోపాయమైనను. బ్రహ్మ రూపముదాల్చి యున్నను వృత్తి బ్రహ్మముగాదు. ఆ బ్రహ్మమను వృత్తి గూడ బ్రహ్మమే ప్రకాశింపజేయుచు తెలియుచున్నది. కావున వృత్త్యతీత మయినది బ్రహ్మము. వేరేదృశ్యములేదు. ఇదియే స్వరూపస్థితి భావాతీతము నిరావరణము. నిరాకారము. నిర్గుణము ఇదిమాత్రము అనుభవైక వేద్యము ఇచ్చోట యేవ్యవహారములులేవు ఇదియే మనోవాచామగోచరము. ఇక వ్యవరింపవలసినప్పుడు ఇట్టి మహనీయులకు బ్రహ్మాకారవృత్తి సహజ సిద్ధమయ్యే యున్నది. ఈ స్థితిలో అనుభవమే ప్రమాణమని వచింతురు. కావున స్వరూప పరబ్రహ్మానుభవసిద్ధ సాక్షాత్కారమందు ప్రమాణములు లేవు. అందుచేతనే బ్రహ్మమప్రమేయమని వచించిరి. ఈ విషయమునే యోగసూత్రమందు చెప్పబడినది. ॥సూత్రం॥ తస్యాపినిరోధే. సర్వనిరోధాన్నిర్బీజస్సమాధిః॥ అనగా ప్రజ్ఞారూప సంస్కారమున్ను నిషేధింపబడగా నిర్బీజసమాధి గలుగును. అనగా బ్రహ్మాకారవృత్తి ద్వారాను అవృత్తి కతీతమై బ్రహ్మమున్నది. అదియే నిజతత్త్వము అవ్యవహార్యము తానే తానై యున్నాడు. అనుభవము మఱియు స్వతస్సిద్ధము అనుభవరూపమునైన ఆనందమయ పరబ్రహ్మము సర్వదా యేకరూపమై నిత్యసిద్ధమయ్యే యున్నదనియు ప్రమాణ సాపేక్ష్యముగాదనియు శబ్దప్రమాణైక గమ్యమనియు అనగా స్వయం ప్రకాశమానమై పరబ్రహ్మము

నిత్యముసిద్ధమై సమస్తమును ప్రమాణవంతములనుగా జేయుచు తానున్నందుచేతనే సకల పదార్థములు సత్తారూపములై చైతన్యవంతములవలె గన్పట్టుచున్నందుచే సర్వాధిష్ఠాన రూపమై తనకు తానే ప్రమాణమై యితర ప్రమాణములు లేనిదై యున్నది ఆపరమాత్మ మాత్రము సర్వసంగ విముక్తమై యున్నది. అయినను ఘటములోని దీపము ఘటావరణమున్నంతవరకు లోపల ప్రకాశించుచున్నను బయట ప్రకాశింపనట్లు ఘటము పగిలిపోయిన తరువాత ఆ దీపము స్వయముగా బాహ్యాభ్యంతరములయందు ప్రకాశించు విధమున ఆత్మవస్తువుగూడ అవిద్యోపాధి యున్నంతవరకు సర్వదా ప్రకాశమానమైనను తెలియబడుటలేదు. "తత్త్వమసి ॥ అహం బ్రహ్మాస్మి" అను మహావాక్యములయొక్క విచారణా బలముచే వాక్యార్థమగు పరబ్రహ్మము బోధితమై అవిద్యావరణము తొలంగినదై నిరంతరము స్వయంప్రకాశమానమగుచున్నది. సర్వత్ర బాహ్యాంతరములందును పరిపూర్ణముగా జ్యోతిరూపమై యున్నది. అట్టి పరిపూర్ణ పరబ్రహ్మము తానేయని తెలియబడుచున్నది. అనగా బ్రహ్మతత్త్వము ప్రత్యక్షాది ప్రమాణములచే తెలియబడక కేవల శబ్దప్రమాణమగు నుపనిషత్తుచేతనే వేద్యమైనది. ఉపనిషత్తులయందు ముఖ్యముగానున్న మహావాక్యముల అఖండవాక్యార్థముచే తనే స్వయం ప్రబోధగలిగి పరబ్రహ్మము విశ్వయాత్మకమై యనుభవసిద్ధమగుచున్నది. మహావాక్యముల ప్రయోజనమేమన అవిద్యావరణము తొలంగుటయే. తరువాత బాహ్యాభ్యంతరములందు సర్వదా స్వయంజ్యోతి రూపమయిన స్వస్వరూప పరబ్రహ్మము ప్రకాశించుచునే యున్నది. ఈ ఉపనిషద్వేద్యమయిన స్వస్వరూపస్థితి గమ్యమయిన పరబ్రహ్మతత్త్వము పరబ్రహ్మ విజ్ఞానము బ్రహ్మానందానుభవము పుణ్యప్రదేశములనుగాని. ఉత్తరాయణ దక్షిణాయనాది కాలములనుగాని. శరీరశుద్ధినిగాని. యపేక్షించుటలేదు. ఆ పరవస్తువు దేశకాలవస్తు నియామాదులనపేక్షింపక సర్వాతీతమయి, సమస్తమును పరిశుద్ధముగా జేయుచు నిత్యశుద్ధమై. బుద్ధమై ముక్తమై. సర్వదా స్వయంప్రకాశమానమై. నిరావరణమై. స్వయం విజ్ఞానరూపమై. కేవలానందమయమై. మహావాక్యోపాయ సిద్ధమై. సర్వప్రకాశమై. పరమై. యవ్యయమై.సత్తారూపమై శబ్దప్రమాణముండగా నాత్మవస్తువు ప్రకాశించుచున్నది. వేదాంతమున సకల ప్రమాణములకన్న ముఖ్యమైయున్నది. బ్రహ్మమతీంద్రియమగుటచే ప్రత్యక్షముచే సిద్ధముగాదు. అలింగమగుటచే

నిర్హేతుకమగుటచే అనుమానమునయోగికాదు. నిరుపమగుటచే ఉపమితిప్రమాణలక్ష్యముకాదు. అవశిష్టప్రమాణము శబ్దమైయున్నది. ఇదియేస్వస్వరూపపర బ్రహ్మ సాక్షాత్కారమందంతరంగ సాధనమై యున్నది. నేత్రేంద్రియముచే గ్రాహ్యముగాని వస్తువు ప్రత్యక్ష సిద్ధమయిన హేతువుచే ధూమముచే వహ్ని వలె సాధింతురు. అలాగున ప్రత్యక్షపరోక్షములేదు. సర్వదా స్వతస్సిద్ధమై నిత్యమై యున్నది. శ్రీ గురువులవారు తత్త్వమసి వాక్యమును లక్షణావృత్తి ద్వారా యుపదేశించుచున్నారు. బాగుగా శిష్యుడు శ్రవణముచేసి వాక్యార్థమును తెలిసి మననము చేయుచున్నాడు. తరువాత నానదవస్తువును భావించి భావించి మనస్సు లీనమగునప్పుడు మిగిలినది పరబ్రహ్మమే. అదియే రావను జ్ఞానము ధృఢమగుచున్నది. ఇదియే మహావాక్యార్థ జన్యబోధయగును.

॥శ్లో॥ బ్రహ్మాత్మైక్య విజ్ఞానం, స్వతస్సిద్ధం విభాతివై।
తథాప్యుపాధివిగమే, శబ్దోపాయః ప్రకీర్తితః॥

తా॥ బ్రహ్మతత్త్వమేకమై స్వతస్సిద్ధముగా భాసిల్లుచున్నను ఉపాధిలయము నందు ఆగమ ప్రమాణోపాయము జెప్పబడినది. కావున శిష్యవర్యా నీవు సతతము మహావాక్యార్థ తత్త్వమగు నేను బ్రహ్మమను స్వరూపమున సదా నిశ్చలముగా నుండుమూయని గురూపదేశము॥

ఓం శాంతిః శాంతిః శాంతిః

ఓం - తత్ - సత్

